

విషయసూచిక

క్రమ సంఖ్య	పాఠం పేరు	ఇతివృత్తం	ప్రక్రియ	మాసం	పుట
1.	వెన్నెల	ప్రకృతి వర్ణన	పద్యం (ప్రాచీనం)	జూన్	–
✿ 2.	ధన్యుడు	విలువలు	కథ	జూలై	–
3.	మాతృభావన	స్త్రీలపట్ల గౌరవం	పద్యం (ఆధునికం)	జూలై	–
✿ 4.	జానపదుని జాబు	శ్రమపట్ల గౌరవం	లేఖ	ఆగష్టు	–
5.	శతకమధురిమ	నైతికవిలువలు	పద్యం	ఆగష్టు	–
6.	నేనెరిగిన బూర్గుల	స్ఫూర్తి	అభినందన వ్యాసం	సెప్టెంబర్	–
7.	నగరగీతం	మానవసంబంధాలు	వచనకవిత	సెప్టెంబర్	–
8.	నాడు – నేడు	విమర్శ	వ్యాసం	అక్టోబర్	–
9.	బసవ పరిణయం	సంస్కృతి	ద్విపద	నవంబర్	–
10.	మా ప్రయత్నం	స్త్రీ సాధికారత	పీఠిక	నవంబర్	–
✿ 11.	మాణిక్యవీణ	సామాజికస్పృహ	వచనకవిత	డిసెంబర్	–
12.	గోరంతదీపాలు	మానవసంబంధాలు సామాజికసేవ	కథానిక	డిసెంబర్	–
✿ 13.	భిక్ష	మానవస్వభావం	పద్యం (ప్రబంధం)	జనవరి	–
14.	చిత్రగ్రీవం	శాస్త్రీయస్వభావం	అనువాదకథ	ఫిబ్రవరి	–

మన ఇతిహాసాలు

ఉపవాచకాలు

1. శ్రీమద్రామాయణం
2. మహాభారతం

పదవిజ్ఞానం --

✿ సంస్కృతం కాంపోజిట్ కోర్సుగా చదివేవారు 'భిక్ష, మాణిక్యవీణ, జానపదునిజాబు, ధన్యుడు' పాఠాలను చదువవలసిన అవసరంలేదు.



1. వెన్నెల

– ఎఱ్ఱన

ఉన్ముఖీకరణ

ఈ కవిత చదవండి

కొండకోనల్లో
నవ్వుతూ, తుళ్ళుతూ పరుగెడుతున్న
సెలయేరు
కాలుజారిలోయలో పడిపోయింది.
అదిచూసి
ఆకులు చాటువేసుకొని,
మొగ్గలు బుగ్గలు నొక్కుకున్నాయి.
ఇదంతా చూస్తున్న సూరీడు
పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతూ
పడమటి కొండల వెనక్కి
పడిపోయాడు.

ప్రశ్నలు:

1. ఈ కవిత దేన్ని వర్ణిస్తున్నది?
2. సూరీడు పడమటి కొండల వెనక్కి పడిపోవడమంటే ఏమిటి?
3. సెలయేరు కొండకోనల మీద నవ్వుతూ తుళ్ళుతూ పరుగెత్తడం మీకేమని అర్థమయ్యింది?
4. వర్ణనాత్మకమైన కవిత్వం చదవడంవల్ల కలిగే ప్రయోజనాలేవి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ఎఱ్ఱన వర్ణనలకు ఆద్యుడు. అతని కావ్యాలలోని వర్ణనల ననుసరించే సాహితీలోకం 'ప్రబంధపరమేశ్వరు'డని గౌరవించింది. హిరణ్యకశిపుడు వనవిహారం చేయడం, ఆ సందర్భంగా వసంత రుతువును, సాయం సమయాన్ని, చంద్రోదయాన్ని, వెన్నెలను, ప్రాతఃకాలాన్నీ వర్ణించాడు కవి. రోజంతా తీవ్రమైన ఎండను ప్రసరింపజేసిన సూర్యుడు, ఇంకా ఉష్ణతాపాన్ని పెంచితే అసురనాయకుడైన హిరణ్యకశిపుడు సహింపడేమో అన్నట్లు నెమ్మదిగా పక్కకు తొలగి పోయాడు. తదనంతరం ప్రకృతిలో వచ్చిన మార్పులను రమణీయంగా వర్ణించాడు కవి. ఆ వర్ణనలే ఈ పాఠ్యభాగం.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యం కావ్య ప్రక్రియకు చెందింది. కావ్యం వర్ణన ప్రధానంగా సాగుతుంది. ప్రస్తుత పాఠ్యాంశం ఎఱ్ఱన నృసింహపురాణం తృతీయాశ్వాసం లోనిది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకు కింద గీతగీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.

కవి పరిచయం



8, 9 తరగతులలో నన్నయ, తిక్కన గురించి తెలుసుకున్నారు కదా! కవిత్రయంలో మూడవ వాడైన ఎఱ్ఱన గురించి ఇప్పుడు తెలుసుకుందాం. 14వ శతాబ్దపు ప్రథమార్ధంలో జీవించిన ఎఱ్ఱన తల్లిదండ్రులు పోతమాంబికా, సూరనార్యులు. అరణ్యపర్వశేషము, నృసింహపురాణము, రామాయణము, హరివంశము మొ॥ గ్రంథాలను ఎఱ్ఱన రచించాడు. వీటిలో రామాయణం అలభ్యం. రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో ఉండేవాడు. తన రామాయణ, హరివంశాలను వేమారెడ్డికి అంకితం చేసిన ఎఱ్ఱన భారతాన్ని రాజరాజనరేంద్రునికి, నృసింహపురాణాన్ని అహోబిల నృసింహస్వామికి అంకితమివ్వడం గమనార్హం. ఎఱ్ఱన రచనలో వర్ణనలు అధికంగా ఉంటాయి. తదనంతర కాలంలో వర్ణనాత్మకమైన కావ్యాలు రావడానికి ఎఱ్ఱన వర్ణనలే ప్రేరణ. ప్రబంధాల్లోని అష్టాదశ వర్ణనల్లో కొంచెమించుమించుగా అన్ని వర్ణనలూ నృసింహపురాణంలోనూ కనిపిస్తాయి. అందుకే ఎఱ్ఱనను 'ప్రబంధ పరమేశ్వరు' డన్నారు. ఇతడు శివభక్తి ప్రతీతిననుసరించి 'శంభుదాసు'డని పేరు గాంచాడు. 'శంకరస్వామి సంయమీశ్వర చరణోరు హాధ్యానంద సౌందర్యభర్యుడ'నని స్వయంగా ప్రకటించుకున్న ఈ కవి గురువు శంకరస్వామి అని తెలుస్తున్నది. ఎఱ్ఱన నృసింహపురాణం ప్రభావం పోతన మీద విశేషంగా ఉన్నదని, పోతన భాగవతం సప్తమ స్కంధంలోని ప్రహ్లాద చరిత్రలో అక్కడక్కడా ఇది కనిపిస్తుందని విమర్శకులు తమ పరిశోధనల ద్వారా నిరూపించారు.



ఆబాలగోపాలానికి ఆత్మీయ బంధువు చందమామ. చందమామ అందించే అమృతం వెన్నెల. అందమైన చందమామను చూపిస్తూ 'చందమామ రావే! జాబిల్లి రావే!' అంటూ కమ్మని పాటను వినిపిస్తూ అమ్మ గోరు ముద్దలు తినిపిస్తుంది.

చిన్న పిల్లలకు వెన్నెల అంటే ఎంతో ఇష్టం. శ్రీరామచంద్రుని అంతటివాడే చందమామ కావాలని పోరుపెట్టాడంటే, అదెంత అపురూపమైందో తెలుస్తున్నది. అటువంటి చందమామ వెలుగు – వెన్నెలను మనకవులు కావ్యాల్లో ఎంతో అద్భుతంగా వర్ణించారు, ఇప్పటికీ వర్ణిస్తూనే ఉన్నారు. అమృత కిరణుడు ఆ అమూల్య సంపదను ఎంతో రమణీయంగా వర్ణించారు నృసింహ పురాణంలో ఎఱ్ఱన. అదేమిటో ఈ పాఠంలో గమనిద్దాం – ఆస్వాదిద్దాం.

I

చ. ఇను నసమానతేజు దివసేంద్రుఁ గనుంగొనుమాఁక్కి జూడఁగాఁ
జన దొరు నల్పతేజు నను చాడ్పునఁ జంచలభృంగతారకా
ఘనవనజాతలోచనము గ్రక్కున మీలన మొందఁ జేసెఁ బ
ద్మిని పతిభక్తి సత్త్వమునమేలిమికిం గుఱి దానపొమ్మనన్. ॥ 1 ॥

*చ. సురుచిరతారకాకుసుమశోభినభోంగణభూమిఁ గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటిముందటన్
సరసముగా నటింపఁగ నిశాసతి కెత్తిన క్రొత్తతోఁపుఁబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్. ॥ 2 ॥

తే. పొదలి యొండొండ దివియును భువియు దిశలుఁ
బొదివికొనియుండు చీఁకటిప్రోవు వలన
మిక్కుటంబుగఁ గాటుక గ్రుక్కినట్టి
కరవటంబన జగదండఖండ మమరె. ॥ 3 ॥

ఆలోచించండి-చెప్పండి

- *సూర్యుడు, కమలాలకు మధ్య ఉన్న అనుబంధాన్ని భార్యాభర్తల బంధంతో పోల్చాడుకదా! ఇదే విధంగా ప్రకృతిలోని ఇంకా వేటిని ఈ విధంగా పోల్చవచ్చు?*
- *రెండవ పద్యంలో కవి దేనిని దేనితో పోల్చాడు? ఎందుకు?*
- *"పూర్వదశసతి" అని కవి ఎందుకు వాడాడు?*
- *ఆకాశాన్ని కవి ఏమని వర్ణించాడు? రాత్రి చుక్కలతో కూడిని ఆకాశాన్ని చూస్తే మీకెలా అన్పిస్తుంది?*



II

సీ. తిమిరభూతముసోకు తెరల జాగత్త్రయీ
లలనదాల్చినర క్తతిలక మనఁగ
సఖ్యంబునకు నిశాసతి యొసంగినఁ బ్రాచి
ప్రాపించు గురివిందబంతియనఁగఁ
దోయధి వెడఁగ్రుంకి తోఁచుపురందర
కుంభి సిందూరితకుంభమనఁగఁ
గులిశాయుధుని పెద్దకొలువుననె త్తిన
దీపించుమాణిక్యదీపమనఁగఁ

గీ. గుముదినీరాగరసబద్ధగుళికయనఁగఁ
గామినీరంజనౌషధకబళమనఁగఁ
బొడవు పెంపున బింబంబు పొలుపు మిగులఁ
జందుఁ డుదయించెఁ గాంతిని స్తుందుఁ డగుచు. ॥ 5 ॥

వ. ఇట్లుదయించి ॥ 6 ॥

*చ. దెసలను కొమ్మ లొయ్య నతిదీర్ఘములైన కరంబులన్ ప్రియం
బెసఁగఁగ నూఁదినిక్కి రజ నీశ్వరుఁడున్నతలీలఁ బేర్చు నా
కసమను పేరి భూరుహము కాంతనిరంతర తారకా లస
త్కుసుమ చయంబు గోయుట కొకోయనఁ బ్రాఁకె సముత్సుకాకృతిన్. ॥ 7 ॥

ఉ. వెన్నెల వెల్లిపాల్కడలి వ్రేఁకదనంబునఁ బేర్చి దిక్కులున్
మిన్నును ముంప రజనీకర బింబము కుండలీభవ
త్పున్నగతల్ప కల్పనముభంగిఁ దనర్చెఁ దదంతరంబునన్
వెన్నునిభంగిఁ జూడ్కులకు వేడ్కమొనర్చెఁ గలంకమత్తఱిన్. ॥ 8 ॥

ఆలోచించండి-చెప్పండి

- *"చంద్రోదయాన్ని" చూస్తున్నప్పుడు ఎలా అనిపిస్తుంది?*
- *చంద్రబింబాన్ని చూస్తుంటే మీలోకలిగే అనుభవాలు ఏమిటి?*
- *నిండు పున్నమినాడు చంద్రబింబాన్ని చూస్తే ఏమేమి ఉన్నట్లుగా అనుభూతిచెందుతాము?*
- *పౌర్ణమినాటి కలువలను చూస్తుంటే కలిగే ఆనందం ఎలా ఉంటుంది?*
- *'రజనీకర బింబం" అని కవి దేని గురించి అన్నాడు?*



III

*చ. వడిగొనిఱేకు లుప్పతిల వాలిక కేసరముల్ దలిర్పఁ బు
ప్పొడి దలమెక్కి తేనియలు పొంగి తరంగలుఁగాఁ జెలంగి పైఁ
బడునెల దేఁటి దాఁటులకుఁ బండువులై నవసౌరభంబు లు
గ్గడువుగ నుల్ల సిల్లె ఘనకైరవషండము నిండువెన్నెలన్. ॥ 9 ॥

సీ. కరఁగెడు నవచంద్రకాంతోపలంబుల
తఱచుసోనలఁ గడు దలముకొనుచుఁ
జటులచకోరసంచయముల యెఱకల
గర్వంపుదాఁటులఁ గడలుకొనుచు
విరియుకైరవముల విపుల రంధ్రములపైఁ
దీవ్రంబుగాఁ గ్రమ్మితిప్పుకొనుచుఁ
గామినీజనముల కమనీయవిభ్రమ
స్మితకాంతిలహరుల మెండుకొనుచుఁ

ఆ॥వె॥ బొదలిపొదలి చదలఁ బొంగారిపొంగారి
మించిమించి దిశలుముంచిముంచి
యభిను తేందు చంద్రికాంభోధియఖిలంబు
నీట నిట్టలముగ నిట్టవొడిచె. ॥ 10 ॥

వ. ఇట్లతిమనోహరగంభీరధీరంబైన సుధాకరకాంతిపూరంబు రాత్రి యను 2వ లైను తలంపు దోఁపనీక తమంబను నామంబును వినీక యవ్యక్తయను శంక 3వ లైను నంకురింపనీక లోచనంబులకు నమృతసేచనంబును, శరీరంబునకుఁ జందనా 4వ పాదం సారంబును, నంతరంగంబునకు నానందతరంగంబును నగుచు విజృంభించిన సమయంబున ॥ 11 ॥

భావాలు :

1) అసమానమైన కాంతితో ప్రకాశించే సూర్యుణ్ణి చూసినట్లు తక్కువ కాంతి గల ఇతరులను చూడడానికి ఇష్టపడనన్నట్లు మిణుకు మిణుకు మంటున్న చుక్కలను చూడక గబుక్కున కళ్ళుమూసుకున్నది పద్మము. (అంటే సూర్యాస్తమయం కాగానే పద్మము ముడుచుకున్నది అని అర్థం) పతిభక్తికి తానే ఆదర్శమన్నట్లున్నది ఈ క్రియ.

సూర్యుని కిరణాలతో పద్మాలు విచ్చుకుంటాయి. సూర్యుణ్ణి కమల ప్రియుడు, కమలబాంధవుడు అని అంటారు. కమలాలకు, సూర్యునికి మధ్య గల సంబంధాన్ని భార్యాభర్తల అనుబంధంగా ఎఱ్ఱన చిత్రించాడు.

2) ప్రకాశమానమైన / అందమైన చుక్కల పూలతో అలంకరింపబడిన ఆకాశమనే రంగస్థలం మీద, కాలమనే సూత్రధారి ప్రయత్నం వల్ల దిక్పాలక సమూహం ముందు, నిశాసతి (రాత్రి అనెడి స్త్రీ) సరసంగా నటిస్తూన్నది. ఆ సమయంలో పశ్చిమదిశా తీరంలోని కొత్తకాంతి ఆమెకు అడ్డుగా ఎత్తిన ఒక విధమైన ఎర్రని తెరలాగా అలరారుతున్నది. (పూర్వం నాటక ప్రదర్శనల్లో ముందు సూత్రధారి ప్రవేశించేవాడు. తర్వాత తెరచాటునుండి నటి ప్రవేశించేది. ఆ సంప్రదాయాన్ని కవి ఇక్కడ చక్కగా ఆవిష్కరించాడు.)



3) అధికమైన చీకటి కారణంగా దిక్కులు, ఆకాశము, భూమి ఒక దానిలో ఒకటి కలిసిపోయి, బాగా కాటుక నింపిన బరిణెలాగా విశ్వమంతా నల్లగా కనిపించింది.

4) అంతలో

*5) చీకటి అనే భూతం ఆవహించగా, ముజ్జగాల లలన ధరించిన నెత్తుటి బొట్టులాగా;

స్నేహం కోసం రాత్రి అనెడి స్త్రీ సమర్పించిన తూర్పు దిక్కున గురివింద బంతి లాగా;

సముద్రంలో నుండి వస్తున్న దేవతాస్త్రీ ఎర్రని కుంకుమ కుంభం లాగా;

ఇంద్రుని సభలో వెలిగే మాణిక్య దీపంలాగా; తెల్ల కలువల ప్రేమకు లోబడిన రసమణిలాగా, స్త్రీలకు ఆనందాన్నిచ్చే ఔషధపు ముద్దలాగా, కాంతిమయమైన చంద్రబింబం పెద్దగా మొలిచింది (ఆవిష్కృతం అయ్యింది) (కవి చంద్రోదయాన్ని రసమణితో, ఔషధపు ముద్దలతో పోల్చాడు.)

6) ఈ విధంగా ఉదయించి.....

7) దిక్కులనే కొమ్మలతో, వెలుగులీనే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులాగా కనిపిస్తున్నది ఆకాశం. తన పొడవైన చేతులతో ఆ పూవులను అందుకునేందు కొరకా అన్నట్లు చంద్రుడు విజృంభించాడు.

(చంద్రుని కాంతి ఆకాశమంతా వ్యాపించింది అని అర్థం.)

8) పాలకడలి గర్భం నుండి ఉద్భవించిన వెన్నెల ఉప్పెనలా విజృంభించి దిక్కులన్నీ ముంచెత్తింది. అప్పుడు చంద్రబింబం ఆదిశేషుని పానుపులాగా కనిపిస్తున్నది. అందులోని మచ్చ కన్నులకు విష్ణువులాగా కనిపిస్తూ అలరిస్తున్నది. (కవి భావనా విస్తృతి ఎంత గొప్పగా ఉన్నదో ఈ పద్యం తెలియజేస్తున్నది.)

9) ఆ నిండు వెన్నెలలో కలువపూల సమూహపు రేకులు వేగంగా విచ్చుకున్నాయి. వాడిపోయిన కేసరాలు చిగురించాయి. పుప్పొడి అధికమైంది, తేనెలు పొంగి తరంగాల్లా విజృంభించి, తమపైకి వస్తున్న తుమ్మెదల బృందానికి పండుగ చేశాయి. ఆ నిండు వెన్నెలలో కొత్త పరిమళాలతో పరిసరాలను సంతోషభరితం చేశాయి – కలువలు.

10) ప్రశంసమానుడైన చంద్రుడు తన వెన్నెల వర్షంతో మెత్తని చంద్రకాంత శిలలను కరిగిస్తూ; విహరిస్తున్న చకోర పక్షుల రెక్కలను స్పృశిస్తూ (దాటుతూ); విచ్చుకుంటున్న కలువపూల రంధ్రాలను నిండి, తనవైపు తిప్పుకుంటూ; అందమైన స్త్రీల అద్భుతమైన చిరునవ్వుల తెల్లని కాంతులను అధికం చేస్తూ; అంతకంతకూ అధికమై, పొంగి, పొంగి, దిశలన్నీ ముందచెత్తుతూ, సమస్తాన్నీ ఆ వెన్నెల నీటితో నింపుతూ నిండుగా ఆవిర్భవించాడు.

11) ఈ విధంగా చాలా అందంగా, గంభీరంగా, సమున్నతంగా విస్తరించింది వెన్నెల. అది రాత్రి అనే ఆలోచన రానీయక, చీకటి పేరును వినానీయక, కనిపించనిది (అప్పుడప్పుడు వెన్నెల ఉండదు) అనే అనుమానాన్ని తలెత్తనీయక, కళ్ళకు అమృతపు జల్లులా, శరీరానికి మంచిగంధంలా, మనసుకు ఆనంద తరంగంలా విజృంభించింది.

ఆలోచించండి-చెప్పండి

- *వెన్నెలను చూసిన కలువలు ఎలా ప్రతిస్పందించాయి?*
- *చంద్రుడు తన వెన్నెలతో ప్రపంచానికి ఆహ్లాదాన్ని ఎలా కలిగించాడు?*
- *"బాదలిపొదలి చదలఁ బొంగారి పొంగారి మించి మించి దిశలు ముంచి ముంచి" అనే పద్య పాదంలోని పద సౌందర్యం గురించి చెప్పండి.*
- *'మనోహరగంభీర ధీరంబైన సుధాకర కాంతి పూరంబు" దీని భావం ఏమిటి?*



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. పాఠంలో వెన్నెలను వర్ణించడం గమనించారు కదా! ప్రకృతిలోని వివిధ సందర్భాలను వర్ణించడం వల్ల మీకు కలిగే అనుభూతులను మిత్రులతో పంచుకోండి. తరగతిలో చర్చించండి.

2. మీకు నచ్చిన ఒక సందర్భాన్ని వర్ణించండి.

3. ఎఱ్ఱన రాసిన కింది పద్యం చదవండి...

సీ॥ కలఁడు మేదిని యందుఁ గలఁడుదకంబు లఁ
గలఁడు వాయువునందుఁ గలఁడు వహ్నిఁ
గలఁడు భానుని యందుఁ గలఁడు సోముని యందుఁ
గలఁడంబరంబునఁ గలఁడు దిశలఁ
గలఁడు చరంబులఁ గలఁ డచరంబులఁ
గలఁడు బాహ్యంబున గలఁడులోన
గలఁడు సారంబులఁ గలఁడు కాలంబులఁ
గలఁడు ధర్మంబులఁ గలడు క్రియలఁ

తే॥గీ॥ గలఁడు కలవాని యందును గలడు లేని
వాని యందును గలఁడెల్లవాని యందు
నింక వేయును నేల సర్వేశ్వరుండు
కలఁడు నీయందు నాయందుఁ గలఁడు కలఁడు

(నృసింహపురాణం – పంచమాశ్వాసం – 78)

అ) పై పద్యంలో చాలా సార్లు పునరుక్తమైన పదమేది?

ఆ) అది పలుకుతున్నప్పుడు, వింటున్నప్పుడు మీకు కల్గిన అనుభూతిని చెప్పండి.

ఇ) గీత గీచిన మాటల అర్థాలు తెలసుకోండి.

ఇప్పుడు పోతన రాసిన కింది పద్యం చదవండి...

మ॥ కల'డంబోధిఁ గలండు గాలిఁ గల'డాకాశంబునన్ కుంభనిన్
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలం బ్రద్యోత చంద్రాత్మలన్
గలఁడోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటన్
గలఁడీశుండు గలండు తండ్రి! వెదకంగా నేల నియ్యాయెడన్.

(శ్రీమదాంధ్ర మహాభాగవతం – సప్తమాశ్వాసం – 78)



అ) ఎఱ్ఱన పద్యంలో మీరు గుర్తించిన పదాలకు ఈ పద్యంలో ఉన్న సమానార్థకాలేవి?

ఆ) రెండు పద్యాలను పోల్చి చూడండి.

ఇ) ఎఱ్ఱనను పోతన కొన్ని చోట్ల అనుకరించాడనటాన్ని సమర్థిస్తారా? ఎందుకు?

4. పువ్వు గుర్తుగల పద్యాలను కంఠస్థం చేయండి. భావస్ఫోరకంగా పద్యాలు పాడండి. (చదవండి / ప్రకటించండి)

5. 2వ పద్యానికి ప్రతిపదార్థం ఈ కింద ఉన్నది. ఇదే విధంగా 8, 10 సంఖ్యగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.

సురుచిర	=	అందమైన
తారకా	=	చుక్కల
కుసుమ	=	పూల (చే)
శోభి	=	అలంకరింపబడిన
నభఃన్	=	ఆకాశమనెడి
అంగణభూమిన్	=	రంగస్థలం (వేదిక) పై
కాలము + అన్	=	కాలం అనే
గురువపు	=	శ్రేష్ఠుడైన
సూత్రధారి	=	సూత్రధారి (దర్శకుడు)
జతనంబున	=	ప్రయత్నపూర్వకంగా
దిక్పతికోటి	=	దిక్పాలకుల సమూహం
ముందటన్	=	ముందు (ఎదుట)
సరసముగా	=	చక్కగా (యుక్తంగా)
నటింపగ	=	నాట్యం చేయడానికి సిద్ధపడిన
నిశాసతికి	=	రాత్రి అనెడి స్త్రీకి (అడ్డంగా)
ఎత్తిన	=	నిలిపిన (పట్టిన)
కొత్త	=	కొత్తదైన
తోఁపున్	=	ఎర్రని
పెన్ + తెర	=	పెద్ద తెర
అనన్	=	అన్నట్లుగా
పశ్చిమ దిక్ + తటంబునన్	=	పడమటి తీరంలోని (పడమటి దిక్కున)
సాంధ్య	=	సంధ్య యొక్క
నవ దీధితి	=	కొత్త వెలుగు
ఒప్పెన్	=	ప్రకాశించింది



II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) "కాటుక గ్రుక్కినట్టి కరవటంబన జగదండఖండమమరె' ఈ మాటలు కవి ఏ సందర్భంలో పేర్కొన్నాడో వివరించండి.

ఆ) ఈ పాఠంలో కవి వెన్నెలను వర్ణించడానికి ఏయే అంశాల నెన్నుకున్నాడో తెల్పండి.

ఇ) పాఠం ఆధారంగా ఆకాశంలోని రంగులు ఏ ఏ సమయంలో ఎట్లా మార్పు చెందాయో తెల్పండి.

2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.

అ) పద్య భావాలను ఆధారంగా చేసుకొని పాఠ్యభాగ సారాంశాన్ని ఇరవై వాక్యాలకు కుదించి రాయండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) ఈ పాఠంలోని వర్ణనల్లాగే ఏ మీకు నచ్చిన ఒక ప్రకృతి దృశ్యాన్నిగాని, సన్నివేశాన్నిగాని, సమయాన్నిగానీ వర్ణిస్తూ రాయండి. ఉదా: సూర్యోదయం / సూర్యాస్తమయం.

ఆ) పాఠం ఆధారంగా ఎఱ్ఱన రచనాశైలి గురించి 10 వాక్యాలు రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది వాక్యాల్లో గీతగీచిన మాటల అర్థాన్ని గ్రహించి, వాటిని అర్థవంతంగా సొంతవాక్యాల్లో ఉపయోగించండి.

అ) చిత్రంలోని భరతమాత మందస్మితకాంతి అందరినీ ఆకట్టుకున్నది.

ఆ) దివి నుండి భువికి మేఘం రాల్చిన చినుకుపూలే ఈ వర్షం.

ఇ) కష్టాలు మిక్కుటమై రైతులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఈ) రజనీకరబింబం రాత్రిని పగలుగా మారుస్తున్నది.

2. నిఘంటువు సాయంతో కింది పదాలకు నానార్థాలు వెతికి రాయండి.

అ) కదురు : _____ _____ _____

ఆ) వెల్లి : _____ _____ _____

ఇ) కుండలి : _____ _____ _____

ఈ) నిట్టవొడుచు : _____ _____ _____

ఉ) గడ : _____ _____ _____

3. పర్యాయపదాలు రాయండి.

అ) చాడ్పు : _____ _____ _____

ఆ) వెల్లి : _____ _____ _____



ఇ) కైరవం : _____ _____ _____

ఈ) కౌముది : _____ _____ _____

ఉ) చంద్రుడు : _____ _____ _____

ఊ) తమస్సు / తమం : _____ _____ _____

భాషాంశాలు

4. ప్రకృతి పదాలకు వికృతి పదాలు రాయండి.

అ) సంధ్య : _____ _____ _____

ఆ) పశ్చిమం : _____ _____ _____

ఇ) దిశ : _____ _____ _____

ఈ) ధర్మము : _____ _____ _____

ఉ) రాత్రి : _____ _____ _____

ఊ) నిశా : _____ _____ _____

ఋ) బాధ : _____ _____ _____

5. వికృతి పదాలకు ప్రకృతి పదాలు రాయండి.

అ) గురువము : _____ _____ _____

ఆ) జతనము : _____ _____ _____

ఇ) దెస : _____ _____ _____

ఈ) తలము : _____ _____ _____

ఉ) చందురుడు : _____ _____ _____

IV. భాషా కార్యకలాపాలు

♦ నృసింహపురాణం అంటే 'నరసింహ స్వామి కథ'. ఈ నేపథ్యంతో వచ్చిన గ్రంథాలు, వివరాలను ఈ కింది పట్టికలో రాయండి.

క్ర.సం	గ్రంథం పేరు	ప్రక్రియ	కవి	కాలం



V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది సంధులకు సంబంధించిన పదాలు ఈ పాఠంలో ఏవి ఉన్నాయో గుర్తించి, వాటిని విడదీసి, లక్షణంతో సమన్వయం చేయండి.

అ) సవర్ణదీర్ఘ సంధి _____

ఆ) గుణ సంధి _____

ఇ) ఉత్వ సంధి _____

2. కింది పదాలు విడదీసి, సంధులను గుర్తించి సూత్రాలు రాయండి.

అ) అత్యంత _____

ఆ) వంటామిదము _____

ఇ) ఏమనిరి _____

ఈ) అవ్విధంబున _____

3. కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి. లక్షణాలు పోల్చిచూడండి.

అ) నలుదెసలు

ఆ) సూర్యచంద్రులు

4. కింది సందర్భాల్లోని అలంకారాలను గుర్తించండి. కారణాలు రాయండి.

అ) కుముదినీరాగ రసబద్ధ గుళికయనగఁ...
జంద్రుడుదయించెఁ గాంతి నిస్తంద్రుఁడగుచు.

ఆ) పదపడి పూర్వదిశాసతి
వదనంబునఁ దెల్పుమిగిలె వనజాహితు చూ
లుదరంబున ధరియించినఁ
గదిరిన పాండుర కపోత కాంతి విధమునన్.

5. పాఠంలోని తేటగీతి పద్యం లక్షణాలతో సమన్వయం చేసి చూడండి.

పరిచయం

తేటగీతి లక్షణాలు అర్థంచేసుకున్నారు గదా! ఇప్పుడు ఆటవెలది పద్యం గురించి తెలుసుకుందాం.

ఆటవెలదిలోనూ ప్రతిపాదానికి ఐదు గణాలుంటాయి. కాని,

1వ పాదంలో 5 గణాలు (3 సూర్య + 2 ఇంద్ర)
2వ పాదంలో 5 గణాలు (5 సూర్య) } వేర్వేరుగా ఉంటాయి.



	న	న	న	త	త
1.	I II	I II	III	UUI	U UI
	పొదలి	పొదలి	చదలఁ	బొంగారి	పొంగారి

	హ	హ	న	హ	హ
2.	U I	U I	III	U I	U I
	మించి	మించి	దిశలు	ముంచి	ముంచి

(* 'హ' గణాన్నే 'గలం' అనడం వాడుకలో ఉన్నది; 'వ' గణాన్ని 'లగం' అన్నట్లు.)

♦ మిగతా యతి, ప్రాస నియమాలు తేటగీతికి సంబంధించినవే దీనికి వర్తిస్తాయి. పరిశీలించండి.

1. ఇది ఉపజాతి పద్యం. దీనికి 4 పాదాలుంటాయి.
2. 1, 3 పాదాల్లో వరుసగా మూడు సూర్యగణాలు, రెండు ఇంద్రగణాల చొప్పున ఉంటాయి.
3. 2, 4 పాదాల్లో ఐదూ సూర్యగణాలే ఉంటాయి.
4. ప్రతిపాదంలో 4వ గణంలోని మొదటి అక్షరం యతి. యతిలేని చోటు ప్రాసయతి చెల్లుతుంది.
5. ప్రాస నియమం పాటించనవసరం లేదు.

* పై పద్యం మిగతా రెండు పాదాలు పరిశీలించి లక్షణ సమన్వయం చేయండి. (వేమన శతకంలోని పద్యాలన్నీ ఆటవెలదులు)





2. ధన్యుడు

– పరవస్తు చిన్నయసూరి

చదవండి – ఆలోచించి చెప్పండి.

లఘుపతనకుడు మంథరునితో ఇట్లనియె. చెలికాడ! ఈ మూషిక రాజును నీవు మిక్కిలి సమ్మానింపుము. ఇతడు పుణ్యకర్ములలోపల ధురీణుడు, గుణరత్నాకరుడు, హిరణ్యకుడనువాడు. ఈతని గుణములు శేషుడు సహితము వర్ణింపజాలడు. నే నేపాటివాడను – అని పలికి మొదటి నుండి హిరణ్యకుని వృత్తాంతము సర్వము వినిపించెను. అంతట మంథరుడు 'హిరణ్యకుని మిక్కిలి సమ్మానించి యిట్లనియె. "హిరణ్యకా! నీవు నిర్జన వనమునందు వాసము చేయుటకు నిమిత్తమేమి? చెప్పుము" అని యడిగెను.

హిరణ్యకుడిట్లనియె.

ప్రశ్నలు:

1. ఇలాంటి భాషతో ఉన్న పాఠాలను చదివారా? లేదా? (ఈ శైలితో ఉన్న మీకు తెలిసిన పుస్తకాల పేర్లు చెప్పండి.)
2. మంథరుడు ఎవరి వృత్తాంతాన్ని వినిపించాడు?
3. హిరణ్యకుని నివాసమెక్కడ?
4. హిరణ్యకుడు తన నివాసం గురించి ఏం చెప్పి ఉంటాడు?

ఉద్దేశం

మంచిమిత్రుల కలయిక మన జీవితాన్ని ఓ మలుపు తిప్పుతుంది. అందుకే ఎప్పుడూ సన్మిత్రులను పొందాలని పెద్దవాళ్ళు చెబుతుంటారు. మంచి మిత్రుల సాంగత్యం మనకు మేలు చేస్తుందని, సజ్జన సాంగత్యం ఎప్పటికీ మంచిదని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

ప్రస్తుతం పాఠ్యాంశం నీతి చంద్రికలోని 'మిత్రలాభం' నుండి స్వీకరించబడినది.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యాంశం వచన రచనకు సంబంధించి కథా ప్రక్రియకు చెందింది.

సంస్కృతంలోని విష్ణుశర్మ పంచతంత్రం ఆధారంగా చిన్నయసూరి నీతిచంద్రికను రచించాడు. ఇది గ్రాంథిక వచనంలో సాగుతుంది. పశుపక్ష్యాదులే పాత్రలుగా లోకరీతిని నీతిని ప్రబోధిస్తూ కథనాలు సాగుతాయి.

ప్రస్తుత పాఠ్యాంశం మిత్రలాభం లోనిది.

విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని అర్థంగాని పదాలను పదపట్టిక / నిఘంటువు ద్వారా తెలుసుకోండి.
- పాఠం ప్రారంభించడానికి ముందున్న పేరాను చదవండి. దాని ద్వారా పాఠంలో ఏముందో ఊహించండి.

కవి పరిచయం



పరవస్తు చిన్నయసూరి 1809లో తమిళనాడులోని చెంగల్‌పట్టు జిల్లాలోని పెరంబూరులో జన్మించారు. మద్రాసులోని పచ్చాయప్పకళాశాలలో తెలుగు పండితులుగా పనిచేసారు.

పద్యానికి నన్నయ, గద్యానికి చిన్నయ అని లోకోక్తి. 'సూరి' అనేది వీరి బిరుదు. సూరి అనగా పండితుడు అని అర్థము.

అక్షరగుచ్ఛము, ఆంధ్ర కాదంబరి, పద్యాంధ్ర వ్యాకరణం, బాలవ్యాకరణం, నీతిచంద్రిక మొదలైన గ్రంథాలు రాశారు. ఈయన రచనాశైలి పాఠకుడిని ఆకట్టుకొనేలా ఉంటుంది. ఈయన రాసిన బాలవ్యాకరణం నేటికీ ప్రామాణిక గ్రంథముగా ఉంది. నీతిచంద్రిక – బాలవ్యాకరణాలు లక్ష్య – లక్షణ గ్రంథాలుగా ప్రసిద్ధి పొందాయి. తెలుగు, తమిళం, సంస్కృతం, ఆంగ్లము భాషలలో సూరి మంచి పండితుడు.



మానవ జీవితంలో నీతి అనేది చాలా ముఖ్యమైన విషయం. ప్రతి మనిషికి సంపాదన ఎంత ముఖ్యమో పరోపకారం కూడా అంతే ముఖ్యం. లాభము అనేది ఉండకూడదు. లోభత్వం వల్ల తనకు కాని, ఇతరులకు కాని ప్రయోజనం ఉండదు. 'పిల్లికి బిచ్చం పెట్టనివాడు' అనే సామెత లోభిని దృష్టిలో వచ్చినదే. మనం మన మిత్రులకు సహాయం లాభం లేకుండా చేయాలి. దీనికి సంబంధించిన కథను చదువుదాం.

I. హిరణ్యకుని పూర్వ వృత్తాంతము

చంపకవతి యను పట్టణము గలదు. అందు సన్న్యాసులు పెక్కండ్రు వాసము చేయుచుండుదురు. అందుఁ జూడా కర్ణుండను పరివ్రాజకుడు గలడు. అతఁడు తానుభోజనము చేసి మిగిలిన వంటకము భిక్షాపాత్రలోఁబెట్టి చిలుక కొయ్య మీఁదనుంచి నిద్రపోవును. నేను సద్దుచేయక దానిమీదికెగిరి ప్రతిదినమావంటకము భక్షించి పోవుచుండుదును. ఒకనాఁడు చూడాకర్ణుడు తన స్నేహితుఁడు వీణాకర్ణుఁడను సన్న్యాసితో మాటలాడుచుండి మాటిమాటికి మీఁదివంక చూచి తన గిలుకకఱ్ఱతో నేలమీద గొట్టి నన్ను వెఱపించుచు వచ్చెను. అప్పుడు వీణాకర్ణుడు "చూడాకర్ణుఁడా! యేమది మీఁదు చూచి నేల కఱ్ఱతోఁ దట్టుచున్నాఁడ"వని యడుగఁగాఁ జూడాకర్ణుఁడిట్లనియె; "ఒక ఎలుక ప్రతిదినము చిలుకకొయ్య మీది పాత్రమునందున్నయన్నము భక్షించిపోవుచున్నది. నాకు దీని యుపద్రవము పెద్దదిగా నున్న"దియని చెప్పెను. ఆమాటలు వీణాకర్ణుఁడు విని "యెక్కడి యెలుకని యెక్కడి చిలుకకొయ్య? యింత యల్ప జంతువున కింత పొడవున కెగురు బలమెక్కడి నుండి వచ్చెను? దీని కేమయినను నిమిత్తము లేకమానదు."

ఆలోచించండి-చెప్పండి

- *ఎక్కడి ఎలుక? ఎక్కడి చిలుకకొయ్య? అనడంలో అంతరార్థం ఏమై ఉంటుంది?*

II. హిరణ్యకుని దీనస్థితి

అని వీణాకర్ణుఁడు చెప్పఁగా విని చూడాకర్ణుఁడు "తడవులఁబట్టి యీ యెలుక యిక్కడ నొక లాఁగ తావు చేసికొని విడువక వాసము చేయుచున్నది. ఇట్లు వసించుటకు నిమిత్తము తెలిసినది కాదు. త్రవ్వి చూచెదఁగాక" యని చెప్పి యొక గుద్దలితో నేను వసించు వివరము త్రవ్వి చిరకాలోపార్జితమైన నాధనము సర్వము గ్రహించెను. తర్వాత సత్త్వోత్సాహములు లేక నానాఁడాహారము సహితము సంపాదించుకొనఁజాలక దిగులుపడి కృశించి, మెల్ల మెల్లఁగ సంచరించుచుండఁగాఁ జూచి చూడాకర్ణుఁ డిట్లనియె : "ధనము గల వాఁడె బలవంతుడు. ధనముగలవాఁడె పండితుడు. ధనము సర్వ శ్రేయములకు నిదానము, ధనములేనివాని జీవనమేల? ఈ మూషికము తన ధనము కోలుపోయి కదా తొంటి జవసత్త్వములుడిగి స్వజాతి సామ్యమును బొందెను. అర్థపరిహీనునకు నిరంతరము ఖేదము సంభవించును. నిరంతర ఖేదము వలన బుద్ధిహీనత్వము ప్రాప్తించును. బుద్ధిహీనతవలన సమస్తకార్యములు నిదాఘనదీపూరములట్లు వినాశమునొందును, ధనవంతునకే పౌరుషమును, మేధాసంపత్తియు, బంధుమిత్రులును కలుగుదురు.

ఆలోచించండి-చెప్పండి

- *ధనము సర్వశ్రేయములకు నిదానము - ఎందుకు?*



పుత్రమిత్రవిరహితుని గృహమును, మూర్ఖుని చిత్తమును శూన్యములు, దారిద్ర్యము సర్వశూన్యము దారిద్ర్యము కంటె మరణము మేలు. మరణ మాపాతయాతనావహము. దారిద్ర్యము యావజ్జీవము తీవ్ర వేదనాకరము. ఇంద్రియముల నామమున బుద్ధిని వచోధోరణిని బురుషుఁడు తొంటివాఁడయ్యు ధనమును బాసిన క్షణముననే లాఁతివాఁడగును. ఇది మహాచిత్రము" అని యాపరివ్రాజకుఁడు చెప్పఁగావిని మిక్కిలి ఖిన్నుఁడనయి యిట్లు చింతించితిని.

ఇఁక నా కిక్కడ వసింపఁదగదు. ఇప్పుడు నా వృత్తాంతము పరులతోఁ జెప్పికోలును యుక్తముగాదు. అర్థనాశము, మనస్తాపము గృహమందలి దుశ్చరితము, వంచనము, పరాభవమును ప్రకాశింపఁ జేయఁదగదని పెద్దలు చెప్పుదురు. దైవానుకూల్యము లేక పౌరుషము చెడినప్పుడు మానవంతునికి వనవాసము కంటె సుఖము లేదు. కుసుమ స్తబకమువలె మానవంతుఁడు సర్వజనుల మూర్ధము మీఁదనయిన నుండవలె. లేదా వనమందు సమసిపోవలె. ఇక్కడనే వాసము చేసుకొని యాచనతో జీవించెదనంటినా దానికంటె గర్హితములేదు. ఒక ప్రుక్కడిని యాచించుకంటె నిప్పులోఁబడి శరీరము తొఱఁగుటమేలు. అనృతమాడుటకంటె మౌనముమేలు. పరధనాపహరణముకంటెఁ దిరియుట మంచిది. వివేకహీనుఁడయిన ప్రభువును సేవించుటకంటె వనవాసముత్తమము. యాచించుకొని బ్రతుకుటకంటె మరణము శ్రేయము, సేవావృత్తి మానమునువలె, యాచనావృత్తి సమస్త గౌరవమును హరించును. ఒకరి యిల్లుకాచి, వారిపెట్టువోఁతలకు దోసిలియొగ్గి యునికియు మిక్కిలి నింద్యము" అని నానావిధముల విచారించియు లోభముత్రిప్పులకు లోనయి మరల నర్థసంగ్రహము చేయవలె నని తలఁచి యచ్చోటనే నిలిచితిని. లోభము మోహమును బుట్టించును. మోహము దుఃఖము నుత్పాదించును, దుఃఖము జ్వలనమువలె స్వాశ్రయమునకు నాశము పుట్టించును కాఁబట్టి లోభమునకు బుద్ధిమంతుఁడు లోపడఁడు. తరువాత నేనక్కడ వదలకుంట చూచి చూడాకర్ణుఁడు నన్నుఁగట్టతో విసరివ్రేసెను. ఆ వ్రేటు దైవవశము వలనఁ దప్పిపోయినది, తగిలియుండెనా యింతకు యమలోకములో బాఁతకాఁపనయి యుండనా? అనంతర మిట్లు చింతించితిని, ఆహా! ధనలోభము సర్వాపదలకు మూలము గదా! తద్వర్జనముకంటె లోకమందు సుఖమేదియు లేదు. ఆశ దిగనాడినవాఁడే సత్పురుషుడు. వాఁడే సర్వశాస్త్రములు చదివినవాఁడు. వాఁడే సర్వధర్మము లాచరించినవాఁడు. ఉదరముకయి పరులగోఁజక ప్రాప్తలాభమునకు సంతోషించువాఁడొక్కడు లోకమందు ధన్యుఁడు. వాఁడే సుఖి. తత్తత్కర్మానురూపముగా దేహికి దుఃఖములట్లు సుఖములు కోరకయే ప్రాప్తించుచున్నవి. అందులకయి ప్రయాసపాటు నిరర్థకము.

ఈ త్రావు తాతముత్తాతలు సంపాదించిన కాణాచిగాదు. భూమండలములో నింకఁ ద్రావు దొరకదా! ఇక్కడ నుండనేల? ఈ చెడగరపుబోడ కట్టమోఁదులువడి ప్రాణములు కోలుపోనేల? ఇంక నెక్కడనైన నొక్క విజన ప్రదేశము చేరి కాలముపుచ్చుట మంచిది. శిలాంతరాళమందలి కప్పను భరించు దయామయుఁడయిన యీశ్వరుఁడు నన్నుఁ గాపాడకుండునా? అని చింతించి, మనసు గట్టిపఱచుకొని, యచ్చోటు విడిచి యానిర్జనవనము చేరితిని. వనములోఁ గాయగసురులు భక్షించి పడియనీరు త్రాగి, యొక చెట్టు నీడలో వసించి కాలము పుచ్చుట మంచిదిగాని, ధనహీనుఁడనయి నలుగురిలో నుండరాదు. అనంతరము నాపుణ్యము వలన నా కీమిత్రుఁడు లభించెను. నా మహాభాగ్యము వలననే యిపుడు నీయాశ్రయమను స్వర్గము దొరికినది. సత్సంగతికంటె లోకమందు మేలేదియులేదు. సంసార విష వృక్షమునకు రెండు ఫలము లమృత తుల్యములు; కావ్యామృతరసపాన మొక్కటి సజ్జనసంగతి యొకటి."

ఆలోచించండి-చెప్పండి

- *ఆశ దిగనాడినవాడే సత్పుర్షుడు. ఎట్లు?*
- *ధనహీనుడై నలుగురిలో నుండరాదు. ఎందుకు?*



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. చూడాకర్ణుని మాటలను బట్టి మీకర్థమైన విషయమేమి? దానిపై మీ అభిప్రాయమేమిటో చెప్పండి.

2. ఆహా! ధనలోభము సర్వాపదలకు మూలము కదా! ఈ విషయాన్ని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ చెప్పండి.

3. ఈ పాఠానికి ఉన్న శీర్షిక గురించి విశ్లేషిస్తూ చెప్పండి.

4. కింది వాక్యాలు ఎవరు, ఎవరితో అన్నారో గుర్తించి రాయండి.

అ) అనృతమాడుట కంటె మౌనము మేలు.

ఆ) దీనికేమైనను నిమిత్తము లేకమానదు.

ఇ) సత్సంగతి కంటె లోకమందు మేలేదియు లేదు.

5. కింది పద్యాన్ని చదివి సూచనల ఆధారంగా భావాన్ని రాయండి.

ఒక్కడె చాలు నిశ్చల బలోన్నతుడెంతటి కార్యమైన దాఁ
జక్కనొనర్చుఁ గౌరవు లసంఖ్యులు పట్టిన ధేనుకోటులం
జిక్కగ నీక తత్ప్రబలసేన ననేక శిలీముఖంబులన్
మొక్కవడంగ జేసి తుదముట్టడె యొక్క కిరీటి భాస్కరా!

సూచనలు

..... ఎంతటి పని ఐనా .....
..... ఆవులమందను ..... తన బాణాలతో
ఆ బలమైన ..... అర్జునుడే కదా!

6. చూడా కర్ణునికి వీణాకర్ణునికి మధ్య జరిగిన సంభాషణను రాయండి.

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. సంసార విషవృక్షమునకు రెండు ఫలము లమృతతుల్యములు; పాఠాన్ని ఆధారంగా చేసుకొని దీని గురించి వివరించండి.

2. అర్థనాశం, మనస్తాపం, గృహమందలి దుశ్చరితం వంచనం, పరాభవం – ఈ పదాల గురించి మీరేరకంగా అర్థం చేసుకున్నారో సోదాహరణంగా రాయండి.

3. వివేకహీనుడైన ప్రభువును సేవించుట కంటె వనవాసముత్తమం – దీని ఔచిత్యాన్ని గురించి చర్చించండి.



4. ఈ పాఠంలోని కథన విధానాన్ని, రచయిత రచనా విధానాన్ని ప్రశంసిస్తూ ఓ వ్యాసం రాయండి.

5. ఈ కథను ఓ చిన్న నాటికగా మలచండి.

III. భాషాంశాలు

1. కింది వాక్యములకర్థాన్ని మీ సొంత పదాల్లో రాయండి

అ) బుద్ధిహీనత వలన సమస్తకార్యములు నిదాఘనదీపూరములట్లు వినాశమునొందును.

ఆ) ధనమును బాసినక్షణముననే లాతివాడగును.

ఇ) పరధనాపహరణము కంటె దిరియుట మంచిది.

ఈ) ఉదరముకయి పరుల గోజక ప్రాప్త లాభమునకు సంతోషించు వాడొక్కడు లోకమందు ధన్యుడు.

2. కింది పదాలకు ప్రకృతి - వికృతులను పాఠం నుండి వెతికి ఆ వాక్యాలను రాయండి.

అ) బోసం	ఆ) శబ్దం	ఇ) కర్జం	ఈ) గీము
ఉ) గారవం	ఊ) చట్టం	ఋ) దమ్మము	ౠ) సంతసం

3. కింది వాక్యాలకు వాడే పదాలేవో తెల్పండి? వ్యుత్పత్యర్థాలకు తగిన పదాలు రాయండి.

అ) పున్నామ నరకము నుండి రక్షించువాడు. _____

ఆ) దేహాన్ని ధరించినవాడు. _____

ఇ) ఐశ్వర్యం కల్గినవాడు. _____

IV. భాషా కార్యకలాపాలు

- --

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది వాక్యాలు చదివి, వాటిలోని సంధి పదాలను గుర్తించి, వాటిని విడదీయండి. అవి ఏ సంధులో సూత్రయుక్తంగా తెల్పండి.

అ) అందుఁ జూడాకర్ణుడను పరివ్రాజకుడు గలడు.

ఆ) తడవులఁ బట్టి ఈ ఎలుక విడువక వాసము చేయుచున్నది.

పై వాక్యాలలల్లో సరళాదేశ, గసడదవాదేశ, ఉత్వ సంధులు, యడాగమము ఉండటాన్ని గమనించారు కదా! ఈ పాఠంలో సరళాదేశ, గసడదవాదేశ సంధిపదాలు ఇంకా ఏమేమున్నాయో గుర్తించి, లక్షణాలు సరిచూసుకోండి.



2. కింది పదాలకు విగ్రహవాక్యాలురాసి, సమాసాలను పేర్కొనండి.

అ) చంపకవతి పట్టణము

ఆ) మహాభాగ్యము

ఇ) సేవావృత్తి

ఈ) పదాబ్జములు

ఉ) కలువకన్నులు

ఊ) మామిడిగున్న

ఎ) మృదుమధురము

(ఉదా॥ అ) చంపకవతి పట్టణము – చంపకవతి అనే పేరు గల పట్టణం.
సంభావన పూర్వపద కర్మధారయ సమాసం.)

పరిచయం

1. 'పుంప్వాదేశసంధి'

* కింది పదాలు విడదీయండి. మార్పును గమనించండి.

ఉదా॥ అచ్చపు పూలతోట = అచ్చము × పూలతోట

అ) నీలపు గండ్లు =

ఆ) ముత్తెపు సరులు =

ఇ) సరసపుమాట =

* పైన పేర్కొన్న వాటిలో రెండు మార్పులను గమనించవచ్చు.

అ) మొదటిపదాల్లో 'ము' వర్ణం లోపించింది.

ఆ) ప్రతి సంధిలోనూ మొదటిపదం విశేషణాన్ని తెల్పుతుంది.

* మొదటిపదం విశేషణం అయితే ఆ సమాసాలను 'విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం' అంటారని మీకు తెలుసు. అంటే ఈ సంధి కర్మధారయ సమాసాల్లో ఏర్పడుతుందని తెలుస్తుంది. అంటే...

* కర్మధారయ సమాసాల్లో మువర్ణానికి బదులు పుంపులు వస్తే దాన్ని పుంప్వాదేశసంధి అంటారు. ('ము' వర్ణం స్థానాన్ని 'పు' వర్ణం ఆక్రమిస్తుంది. దీన్నే వ్యాకరణ దృష్టిలో 'ఆదేశం' అంటారు.)

♦ కింది పదాలను విడదీసి సంధిసూత్రాన్ని సరిచూడండి.

అ) సింగపుకొదమ

ఆ) ముత్యపుచిప్ప

ఇ) కొంచెపునరుడు

2. వచనంలో శైలీభేదం

* కింది వాక్యాలు చదవండి. భేదాలు గమనించండి.

అ) అని యా పరివ్రాజకుడు సెప్పగా విని మిక్కిలి ఖిన్నుడనయితిని.

ఆ) అని ఆ సన్యాసి చెప్పగా విని చాలా బాధపడ్డాను.

ఇ) అని ఆ సన్యాసి జెప్పింది యిని శానా దుక్కమొచ్చింది.

* మొదటి వాక్యం ప్రాచీన శైలిని తెలుపుతున్నది.

రెండవ వాక్యం శిష్టవ్యవహార శైలిని అనుసరించి ఉంది.

మూడవ వాక్యం మాండలిక పద్ధతికి లోబడి ఉన్నది.

* కాలాన్నుసరించి, ప్రాంతాన్నుసరించి, సందర్భాన్ని బట్టి భాషను ఉపయోగించే విధానంలో మార్పు జరుగుతుంది. ఇది భాషలో వైవిధ్యమేగాని, అధికము, అల్పము అనే సంకుచితదృష్టితో చూడకూడదు.

* కింది వాక్యాలను ఆధునిక వ్యవహారశైలిలోకి స్థానిక మాండలిక శైలిలోకి మార్చండి. (ఈ మార్పులు చేసేటప్పుడు 'ము' వర్ణాలు, బిందుపూర్వక 'బు' కారకాలు (ంబు), యడాగమాలు, క్రియారరూపాలు (చేయును, జరుగును, చూడుము... వంటివి) మారడాన్ని గమనించండి.

అ) వివేకహీనుడయిన ప్రభువును సేవించుటకంటె వనవాసముత్తమము.

ఆ) ఎలుక ప్రతిదినము చిలుకకొయ్య మీఁదికెగిరి పాత్రమునందున్న యన్నము భక్షించిపోవుచున్నది.

ఇ) బుద్ధిహీనతవలన సమస్తకార్యములు నిదాఘనదీపూరములట్లు వినాశమునొందును.





3. మాతృభావన

– విద్వాన్ గడియారము వేంకట శేష శాస్త్రి

ఉన్ముఖీకరణ

తే. సర్వతీర్థాంబువులకంటె సమధికంబు
పావనంబైన జనయిత్రి పాదజలము
వరతనూజున కఖిల దేవతల కంటె
జనని యెక్కుడు సన్ను తాచారనిరత

ప్రశ్నలు:

1. "పావనంబైన జనయిత్రి పాదజలము" అంటే ఏమిటి?
2. తల్లి పాదజలం దేనికంటే గొప్పదని తెలుసుకొన్నారు? ఎందుకు?
3. కుమారునికి అన్నింటికంటే ఏదిమిన్న? ఎందుకు?
4. ఈ పద్యం ద్వారా తల్లికిగల స్థానమేమిటని గ్రహించారు?
5. "ప్రతి స్త్రీమూర్తి మనకు తల్లితో సమానము" అని ఎందుకంటారు?

నేపథ్యం

మొదటి దండయాత్రలో 'కళ్యాణి' దుర్గం జయించిన తరువాత అప్పాజీసొందేవుడు, భోంసలేశుడు విజయోత్సాహంతో శివాజీ వద్దకు వస్తారు. అప్పుడు సోందేవుడు శివాజీతో "దేవా మీ ఆజ్ఞ ప్రకారం కళ్యాణిని జయించి దాని సర్దారులను పట్టి, బంధించి అతని సర్వస్వాన్నీ, రాణివాసాన్ని బంధీలుగా తెచ్చాను" అని మనవి చేస్తాడు. ఇది విన్న శివాజీ పరస్త్రీలు తల్లులతో సమానం అని చెప్పి, ఆమెకు అగౌరవం కల్గించినందుకు చింతిస్తూ, ఇలా చేయడం తగదని హితవు పలికిన సందర్భంలోనిదీ పాఠ్యాంశం.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం చారిత్రక కావ్యం ప్రక్రియకు చెందింది.
చరిత్ర ఆధారంగా రచించిన కావ్యం చారిత్రకకావ్యం.
ఈ పాఠం విద్వాన్ గడియారం వేంకటశేషశాస్త్రి రచించిన
'శ్రీ శివ భారతము' తృతీయాశ్వాసము లోనిది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెలుసుకోండి.

కవి పరిచయం



విద్వాన్ గడియారం వేంకట శేష శాస్త్రి (జననం 1897) (మరణం) :

కడప మండలం, ప్రొద్దుటూరు మునిసిపల్ హైస్కూలు పండితులు, శతావధాని. రాజశేఖర శతావధానితో కలసి కొన్ని కావ్యనాటకాలు రచించారు. గడియారం వారి పేరు చెప్పగానే "శ్రీ శివభారతము" కావ్యం గుర్తుకు వస్తుంది. పారతంత్ర్యాన్ని నిరసించి స్వాతంత్ర్య కాంక్షను అణువణువునా రగుల్కొల్పినమహాకావ్యం ఇది. 'శ్రీ శివభారతము' తోపాటు గడియారం వారు "మురారి", పుష్పబాణ విలాసము, వాస్తు జంత్రి (అముద్రితాలు), మల్లికామారుతము, శ్రీనాథ కవితా సామ్రాజ్యము, రఘునాథీయము" అనే కావ్యాలు రాసారు. కవితావతంస, కవిసింహ, అవధాని పంచానన అనేవి వీరి బిరుదులు.



జాతి జీవన విధానాన్ని ప్రతిబింబించేది సంస్కృతి. భారతీయ సంస్కృతి స్త్రీలకు గొప్ప స్థానాన్నిచ్చింది. పరస్త్రీలను తల్లులుగా, పరధనాన్ని గడ్డిపరకతో సమానంగా భావించుమని చెప్పింది. అటువంటి ఉదాత్తమైన భావనలను జీవనశైలిగా మలచుకొని పరిపాలన సాగించిన ధీరోదాత్త చక్రవర్తి ఛత్రపతి శివాజీ.

శివాజీ జీవితంలోని ఒక సంఘటన మాతృభావనకు అద్దం పడుతున్నది. దాన్ని గడియారం వేంకటశేషశాస్త్రి కవి తీర్చిదిద్దిన తీరు మరింత ప్రశంసనీయంగా ఉన్నది... సహృదయతకు, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఆ సన్నివేశాన్ని ఈ పాఠంలో చదువుకుందాం...

I

శా. "ఆ-యేమీ? యొక రాణివాసమును బణ్యావాసమున్ దెచ్చినా
వా? యేహైందవుఁడైన నీగతి నమర్యాదన్ బ్రవర్తించునే?
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవత్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ" ॥ 1 ॥

మ. అనుచున్ జేవుఱుమీఱు కన్నుఁగవతో నాస్పంద దోష్ఠంబుతో
ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో గర్జిల్లు నా భోన్‌సలే
శునిఁజూడన్ బుయిలోడెఁగొల్పు; శివుఁడీసున్ గుత్తుకన్ మ్రింగి, బో
రన నవ్వారల బంధమూడ్చి గొనితేరన్ బంచె సోన్‌దేవునిన్ ॥ 2 ॥

మ. త్వరితుండైయతఁ డట్టులేసలిపి "దేవా! నన్ను మన్నింపు; మీ
సరదారుల్ గొని తెచ్చుచో సరభసోత్సాహంబు కన్గప్పె; దు
శ్చరితాలోచన లేదు, లేదు భవదాజ్ఞోల్లంఘనోద్వృత్తి; మీ
చరణద్వంద్వములాన" యంచు వినిపించన్, సుంత శాంతించుచున్ ॥ 3 ॥

ఆలోచించండి-చెప్పండి

- *విజయం గర్వంతో నీవు చేసిన పని సరికాదని అన్న శివాజీ మాటల ద్వారా శివాజీ ఎలాంటివాడని భావిస్తున్నారు?*
- *స్త్రీలపట్ల మర్యాదగా ప్రవర్తించడం అంటే ఏమిటి?*
- *శివాజీ కోపానికి కారణమేమిటి? కోపంలో శివాజీ ఎలా ఉన్నాడు?*
- *"సరభసోత్సాహంబు కన్గప్పె" అంటే మీ కేమర్థమైంది?*



II

మ. శివరా జంతట మేల్ముసుంగుఁదెరలో – స్నిగ్ధాంబుద చ్ఛాయలో
నవ సౌదామినిఁబోలు నా యవనకాంతా రత్నమున్ భక్తి గౌ
రవముల్ వాఱఁగఁ జూచి పల్కె" వనితారత్నంబు లీ భవ్యహిం
దవభూ జంగమ పుణ్యదేవతలు; మాతా! తప్పు సైరింపుమీ! ॥ 4 ॥

సీ. హరి హర బ్రహ్మలఁ బురిటిబిడ్డలఁ జేసి
జోలఁబాడిన పురంధ్రీలలామ,
యమధర్మరాజుపాశముఁ ద్రుంచి యదలించి
పతిభిక్ష గొన్న పావన చరిత్ర,
ధగధగ ద్దగనమధ్యము పూలరాసిగా
విహరించియున్న సాధ్వీమతల్లి,
పతి నిమిత్తము సూర్యభగవానుదయంబు
నరికట్టి నిలుపు పుణ్యములపంట,

తే. అట్టి యెందఱో భరతాంబయాఁడుబిడ్డ
లమల పతిదేవతాత్వ భాగ్యములు వోసి
పుట్టినిలు మెట్టినిలుఁ బెంచు పుణ్యసతులు
గలరు, భారతావని భాగ్యకల్పలతలు ॥ 5 ॥

మ. అనలజ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులై డాయు భూ
జనులెల్లన్ నిజసంపదల్ దొఱఁగి యస్త ధ్వస్తులై పోరె? వి
త్తనమే నిల్చునె? ము న్నెఱుంగమె పులస్త్యబ్రహ్మసంతాన? మో
జననీ! హైందవ భూమి నీపగిది దుశ్చారిత్రముల్ సాగునే? ॥ 6 ॥

ఆలోచించండి-చెప్పండి

- *స్త్రీలను ఎవరితో పోల్చారు? ఎందుకు?*
- *స్త్రీల పట్ల సమాజంలో ఎలాంటి అభిప్రాయాలు ఉన్నవి? దీనిపై మీ అభిప్రాయాలు తెల్పండి.*
- *స్త్రీల వల్ల భారత కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయనడానికి ఉదాహరణలు తెల్పండి.*
- *"అనలజ్యోతుల..... సాగునే?" అనే పద్యం ద్వారా మీకేమర్థమైంది?*



III

తే. యవన పుణ్యాంగనామణి వగుదుగాక
హైందవులపూజ తల్లియట్లందరాదె?
నీదురూపము నాయందు లేదయైనఁ
గనని తల్లివిగా నిన్ను గారవింతు ॥ 7 ॥

శా. మా సర్దారుఁడు తొందరన్ బడి యసన్మార్గంబునన్ బోయె, నీ
దోసంబున్ గని నొచ్చుకోకు, నినుఁ జేర్తున్ నీగృహం బిప్పుడే,
నా సైన్యంబును దోడుగాఁ బనిచెదన్, నాతల్లిగాఁ దోడుగా
దోసిళ్లన్ నడిపింతు; నీ కనులయందున్ దాల్మి సారింపుమీ!" ॥ 8 ॥

మ. అని కొండాడి, పతివ్రతా హిత సపర్యాధుర్యుఁడాతండు యా
వన కాంతామణి కర్వసత్కృతు లొనర్పన్ జేసి, చేసేతఁ జి
క్కిన సర్దారుని గారవించి హితసూక్తిన్ బల్కి, బీజాపురం
బునకున్ బోవిడె – వారితోఁ దనబలంబుల్ గొన్ని తోడంపుచున్ ॥ 9 ॥

మ. శివరా జంతట సోనదేవుమొగమై "స్త్రీరత్నముల్ పూజ్య, లే
యవమానంబు ఘటింపరా, దిది మదీయాదర్శ మస్మచ్ఛమూ
ధవు లీయాజ్ఞ నవశ్య మోమవలె; నీతాత్పర్యమున్ జూచి, లో
కువ చేకూరమి నెంచి, నీయెడ దొసంగుల్లేమి భావించితిన్ ॥ 10 ॥

ఆలోచించండి-చెప్పండి

- *తల్లిగా గౌరవించడం అంటే ఏమిటి? ఆప్రవర్తన ఎలా ఉంటుంది?*
- *సన్మార్గంలో నడవడం అంటే ఏమిటి? విద్యార్థులుగా మీరు చేయాల్సిన కొన్ని పనులను తెల్పండి.*
- *"స్త్రీరత్నముల్ పూజ్య, లేయవమానంబు ఘటింపరా," అంటే ఏమిటి?*
- *"హితసూక్తిన్ బల్కి" అంటే ఏమిటి?*

సారాంశం :

1. ఆ..... ఏమిటి? పుణ్యానికి నిలయమైన ఒక రాణివాసాన్ని బంధీగా పట్టి తెచ్చావా? ఏ హైందవుడైనా ఈ విధంగా మర్యాద తప్పి ప్రవర్తిస్తాడా? నా ఆజ్ఞను నీవు గమనించలేదా? విజయం పొందిన గర్వం మత్తులో చెలరేగి నీ ప్రాణానికి నీవే ఆపద తెచ్చుకొంటావా? నీవు చేసిన ఈ పనిని నేను సహించను.

2. అంటూ ఎర్రబడిన కన్నులతో, అదిరిపడే పై పెదవితో, గొప్ప హుంకారముతో, కదలాడే కనుబొమ్మ ముడితో గర్జిస్తూ బోంసలేశుని చూడగా సభంతా నిశ్చేష్టితమైంది. శివాజీ తన కోపాన్నంతా దిగమ్రింగి "వెళ్ళి వారి బంధనాలు తొలగించి ఇక్కడకు తీసుకురండి" అని సోందేవుని పంపించాడు.

3. సోందేవుడు త్వరపడుతూ శివాజీ ఆజ్ఞాపించినట్టు చేసి "దేవా! నన్ను మన్నించండి. ఈ సర్దారులను పట్టి తెచ్చే ఉత్సాహ తీవ్రత నా కళ్ళను కప్పేసింది. అంతేగాని ఇందులో ఎటువంటి చెడు ఆలోచన నాకు లేదు. మీ ఆజ్ఞను మీరి ప్రవర్తించాలనే ఉద్దేశం కూడా లేదు. మీ పాదముల మీద ఒట్టు" అని మనవి చేయగా, శివాజీ కొంత శాంతిస్తూ



4. అంతలోనే మేలు ముసుగు తెరలో దట్టమైన నీలి మేఘం మాటున ఉన్న మెరుపు తీగ లాంటి యవన స్త్రీని భక్తి గౌరవములతో చూస్తూ ఇలా అన్నాడు "స్త్రీలు శుభప్రదమైన ఈ హైందవభూమిపై సంచరించే పుణ్య దేవతలు. అమ్మా ఈ తప్పును మన్నించు."

5. త్రిమూర్తులను (బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు) తన ప్రాతివత్యంతో చంటిబిడ్డలుగా చేసి వారికి జోలపాడిన మహనీయురాలు (అనసూయ). యమధర్మరాజు పాశాన్ని ఎదిరించి తన భర్త ప్రాణాన్ని రక్షించుకున్న పావన చరిత్ర (సావిత్రి). భగభగ మండే అగ్ని గుండంలో కూడా పూలరాసిలో తిరిగినట్టు తిరుగాడి బయటకొచ్చిన పతివ్రత (సీత). భర్తకోసం సూర్యభగవానుని ఉదయించకుండా నిలిపిన పుణ్యస్త్రీ (సుమతి). ఇలా ఎందరో భారతీయ స్త్రీలు తమ పాతివ్రత్యంతో పుట్టినింటికీ మెట్టినింటికీ కీర్తిని పెంచిన వారున్నారు. వీరు భారతదేశానికి అదృష్టకల్పలతలు వంటివారు.

6. ఓ తల్లీ! అగ్ని జ్వాలల వంటి పతివ్రతల పట్ల అపచారం చేసేవారు తమ సంపదలు కోల్పోయి నాశనమై పోరా? అసలు వంశం నిలుస్తుందా? పులస్త్య బ్రహ్మ సంతానమైన రావణాసురుని పతనం గురించి మనకు తెలియదా? భారత భూమిపై ఇటువంటి దుశ్చర్యలు సాగుతాయా? సాగవు.

7. నీవు యవన దేశ పుణ్యస్త్రీవి అయితే అగుదువుగాక! హైందవుల పూజను స్వీకరించు. నీ రూపం నాలో లేకపోయినా నన్ను కనని తల్లివి నీవు. నిన్ను నా తల్లిగానే గౌరవిస్తాను.

8. మా సర్దారు తొందర పాటు వల్ల జరిగిన ఈ దోషానికి బాధపడకు. నిన్ను ఇప్పుడే నీ ఇంటికి చేరుస్తాను. నా సైన్యాన్ని తోడుగా పంపిస్తాను. నా తల్లిగా భావించి నిన్ను పంపిస్తాను.

9. అని స్తుతించి పతివ్రతా స్త్రీల మంచిని కోరుకునే శివాజీ యవన స్త్రీకి తగిన సత్కార్యాలు జరిపించి, తన చేతికి చిక్కిన సర్దార్‌ను గౌరవించి వారితో మంచి మాటలు పలికి బీజాపురానికి పంపించాడు. వారికి తోడుగా తన బలగాలను కొన్నింటిని పంపించాడు.

10. తరువాత శివాజీ సోందేవుని వైపు తిరిగి "స్త్రీలు పూజింప తగినవారు. వారికి ఏ అవమానం చేయకూడదు. ఇది నా ఆదర్శం. నా సైన్యాధిపతులందరూ ఈ ఆజ్ఞను తప్పని సరిగా ఆచరించాలి. నీ ఉద్దేశం చూసి, లోకువ చేయకుండా నీ తప్పేమీ లేదని భావించాను.

ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. కింది అంశాల గురించి చర్చించండి.

అ) "ప్రస్తుతం స్త్రీలపై జరిగే దాడులకు కారణాలు – నివారణోపాయాలు"

ఆ) "కుటుంబం – సమాజం అభివృద్ధిలో స్త్రీల పాత్ర"



2. * గుర్తుగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి.

ఉదా॥ "ఆ-యేమీ? యొక రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా
వా? యే హైందవుఁ డైన నీగతినమర్యాదన్ బ్రవర్తించునే
మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ
యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ.

ప్రతిపదార్థాలు:

ఆ - యేమి	=	(ఆశ్చర్యం, కోపం కలిపి) ఆ ఏమిటి?
పుణ్య + ఆవాసమున్	=	పుణ్యమునకు నిలయమైన
ఒక	=	ఒక
రాణివాసమును	=	రాణీవాసాన్ని
తెచ్చినావా	=	బంధీగా తీసుకొచ్చావా?
ఏ హైందవుఁడు + ఐననూ	=	హైందవుడు ఎవడైనా
ఈ గతిన్	=	ఈ విధంగా
అమర్యాదన్	=	మర్యాద తప్పి (మర్యాద లేకుండా)
ప్రవర్తించును + ఏ	=	ప్రవర్తిస్తాడా?
మా + ఆజ్ఞన్	=	నా యొక్క ఆజ్ఞను
గమనింపవు + ఓ	=	గమనించలేదా? (పట్టించుకోలేదా?)
జయ	=	(యుద్ధంలో) విజయం పొందిన
మద + ఉన్మాదంబునన్	=	గర్వం మత్తులో
రేఁగి	=	అతిశయించి
నీ	=	నీయొక్క
ఆయుః + సూత్రములు	=	ప్రాణాలనే నూలుపోగులను
ఈవ	=	నీవే
త్రుంచుకొనెద + ఓ	=	త్రెంచుకుంటావా?
ఔద్ధత్యము	=	ఈ తెగింపును (ఏపు)
ఓర్వన్ + సుమీ	=	సహించను సుమా!

3. కింది కవితా భాగాలను చదవండి. ప్రతి కవితలో మీరు గమనించిన ముఖ్య భావనను ఒక వాక్యంలో రాయండి.

అ) ..... అసలు మా అమ్మే నడుస్తున్న వంట గదిలా ఉంటుంది.
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా, చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా మా నాన్న పేరే **- విమల**

ముఖ్య భావం : _____



ఆ) పెద్ద చదువు
పింగాణి కల
వంటింటి తాలింపు
వీడని వల – **యశశ్రీ రంగనాయకి**

ముఖ్య భావం : _____

ఇ) తల్లినైనప్పుడల్లా
పునర్జన్మించా
వాళ్ళెదిగాక
చాలామార్లు మరణించా – **డా.పి.జయప్రద**

ముఖ్య భావం : _____

ఈ) ఈ పాఠం కవి గురించి మీరు తెలుసుకున్న విషయాలేమిటి?

"శ్రీ శివభారతం" ప్రశస్తి ఎట్టిది?

4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) శివాజీ కొలువులోని వారంతా నిశ్చేష్టులవడానికి కారణం ఏమిటి?

ఆ) సోందేవుడు శివాజీని ఎలా శాంతపరిచాడు?

ఇ) భారతదేశ భాగ్య కల్పలతలని శివాజీ ఎవరిని ఎలా కీర్తించాడు?

ఈ) శివాజీ యవన కాంత పట్ల చూపిన ఆదరాభిమానాలు ఎటువంటివి?

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) సోందేవుని మనస్తత్వాన్ని గూర్చి పాఠం ఆధారంగా సొంతమాటల్లో రాయండి.

ఆ) శివాజీ రాజైయుండీ తన వద్దకు బంధీగా తేబడిన యవన కాంతతో
"మాతా! తప్పు సైరింపుమీ!" అన్నాడు దీనిపై మీ అభిప్రాయాలేమిటి?

ఇ) "శివాజీ ఆదర్శం" లోని గొప్పతనాన్ని సొంతమాటల్లో రాయండి.

ఈ) మీ తోటి బాలికలను మీరెలా గౌరవిస్తారు? ఏమేం చేస్తారు?

2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.

అ) మీ పాఠం ఆధారంగా శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

ఆ) "స్త్రీరత్నములు పూజ్యులు" అన్న శివాజీ మాటలను మీ సొంత అనుభవాల ఆధారంగా సమర్థించండి.



3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) పాఠ్యాంశాన్ని "ఏకాంకిక" రూపంలో రాసి ప్రదర్శించండి.

ఆ) ఈ పాఠం ఆధారంగా స్త్రీల పట్ల మనం ఎలా ప్రవర్తించాలో, మన బాధ్యతలు ఏమిటో తెలిపేలా నినాదాలు / సూక్తులు రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పర్యాయ పదాలకు సంబంధించిన పదాన్ని పాఠంలో గుర్తించి గడిలో రాయండి.


అ) ( ) – ఆదేశము, ఆన, ఉత్తరువు, నిర్దేశము.

ఆ) ( ) – అక్షి, చక్షువు, నేత్రము, నయనము.

ఇ) ( ) – అగ్ని, నిప్పు, వహ్ని, జ్వలనము.

ఈ) ( ) – మగువ, కొమ్మ, ఇంతి, పడతి.

2. కింది ఆధారాలను బట్టి గళ్ళను పూరించండి.



అడ్డం :

1. సీతకు అగ్నిగుండం కూడా ఇలా ఉంటుంది (4)
4. 'అంబుదం' దీన్నే ఇలా కూడా అంటారు (2)
5. సావిత్రి చరిత్రా విశేషణం (3)
6. పాపం కాదు పుణ్యానికి నిలయం (4)
9. కుడివైపు నుండి సీతకు మరో పేరు (3)
10. కుడివైపు నుండి శివాజీ కోపించిన సేనాని (4)
12. మన పాఠం కవి ఇంటి పేరు (4)
14. పాఠంలో శివాజీ తొలిపలుకు (1)

నిలువు :

2. సోందేవుడు దీనిని బంధించాడనే శివాజీ కోపించింది(4)
3. శివాజీ గౌరవించిన కాంత వంశం (3)
6. రావణుని తాత (4)
7. యవన కాంత స్వస్థలం (4)
8. సోందేవుని మదోన్మాదానికి కారణం (2)
11. శివాజీని సోందేవుడు పిలిచినట్టు మీరూ పిలవండి (2)
13. శీర్షాసనం చేసిన త్వరితం, వేగం (2)



3. కింది ప్రకృతులకు సరైన వికృతులను జతపరచండి.

ప్రకృతి			వికృతి
అ) రాజ్ఞీ	( )	1)	చాయ
ఆ) ఆజ్ఞ	( )	2)	రతనము
ఇ) ఛాయ	( )	3)	బత్తి
ఈ) రత్నము	( )	4)	గారవము
ఉ) భక్తి	( )	5)	పున్నెం
ఊ) గౌరవము	( )	6)	బమ్మ
ఋ) పుణ్యము	( )	7)	జోతి
ౠ) బ్రహ్మ	( )	8)	రాసి
ఎ) భాగ్యము	( )	9)	అంబ
ఏ) జ్యోతి	( )	10)	గీము
ఐ) దోషము	( )	11)	రాణి
ఒ) గృహము	( )	12)	ఆన
ఓ) రాశి	( )	13)	దోసం
ఔ) అమ్మ	( )	14)	బాగ్గెము

IV. భాషా కార్యకలాపాలు

- స్త్రీల అభ్యున్నతికి కృషి చేసిన సంస్కర్తల వివరాలు సేకరించి ప్రదర్శించండి.

(లేదా)

వివిధ రంగాలలో ప్రసిద్ధిగాంచిన స్త్రీల వివరాలను సేకరించి ప్రదర్శించండి.

విశేషాంశాలు

పులస్త్యబ్రహ్మ సంతానం : బ్రహ్మ మానసపుత్రుడు పులస్త్యుడు. పులస్త్యుని కుమారుడైన విశ్రవరునికి కైకసి అనే భార్యవల్ల రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణఖలు జన్మించారు.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది పదాలు పరిశీలించండి. వాటిలో సవర్ణదీర్ఘ, గుణ, వృద్ధి సంధులున్నాయి. విడదీసి గుర్తించి, లక్షణాలకు సమన్వయంచేస్తూ చర్చించండి.

అ) పుణ్యావాసము ఆ) మదోన్మాదము ఇ) స్నిగ్ధాంబుధ

ఈ) సరభసోత్సాహం ఉ) గుణౌద్ధత్యం ఊ) రసైక స్థితి



2. కింది పదాల్లో ఉత్వ, త్రిక, రుగాగమ, లులనల సంధులున్నాయి. పదాలు విడదీని, లక్షణాలు చర్చించండి.

అ) బంధమూడ్చి ఆ) అవ్వారల ఇ) భక్తురాలు

ఈ) బాలెంతరాలు ఉ) గుణవంతురాలు ఊ) దేశాలలో

ఋ) పుస్తకాలు ౠ) సమయాన

3. కింది పద్యపాదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణాలను సరిచూసుకోండి.

అ) అనుచున్ జేవుఱుమీఱు కన్నుఁగవతో, నాస్పందనోష్ఠంబుతో ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో, గర్జిల్లునా భోన్‌సరే శుఱన జూడన్ .....

4. కింది పద్యపాదాలకు గురులఘువులను గుర్తించి, గణవిభజనచేసి, అవి ఏ పద్యాలకు సంబంధించినవో నిర్ణయించండి. లక్షణాలను చర్చించండి.

అ) ఆ – యేమీ యొకరాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా

ఆ) అసలజ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులైడాయు భూ

పరిచయం

1. * కింది పదాలను విడదీయండి.

అ) వాఙ్మయం

ఆ) రాణ్మహేంద్రవరం

ఇ) జగన్నాథుడు

వాటి విసంధిరూపాలు కింద పేర్కొన్నట్లే ఉన్నాయా? సరిచూసుకోండి. సంధిజరిగిన తీరు గమనించండి.

అ) వాక్ + మయం = వాఙ్మయం = 'క్' స్థానంలో 'ఙ' వచ్చింది.

ఆ) రాట్ + మహేంద్రవరం = రాణ్మహేంద్రవరం = 'ట్' స్థానంలో 'ణ' వచ్చింది.

ఇ) జగత్ + నాథుడు = జగన్నాథుడు = 'త్' స్థానంలో 'న' వచ్చింది.

- పై మూడు సందర్భాల్లో పూర్వస్వరం స్థానంలో వరుసగా క, ట, త లున్నాయి.
- వాటికి 'మ' గాని, 'న' గాని పరమయినాయి – అంటే 'పరస్పరం'గా కలిశాయి.
- అప్పుడు పూర్వస్వరం స్థానంలోని 'క' కారం కవర్గ అనునాసికమైన 'ఙ' (క ఖ గ ఘ 'ఙ') గాను; 'ట' కారం దాని అనునాసికమైన 'ణ' (ట, ఠ, డ, ఢ, 'ణ')గాను; 'త'కారం దాని అనునాసికమైన 'న' (త థ ద ధ 'న') గాను మారాయి. దీన్ననుసరించి–
- వర్గప్రథమాక్షరాలకు (క, ట, త లకు) 'న' గాని, 'మ' గాని పరమైనప్పుడు అనునాసికాలు ఆదేశమవుతాయి. దీన్నే అనునాసిక సంధి అంటారు.

*** కింది పదాలను విడదీసి, అనునాసిక సంధి సూత్రంతో అన్వయించి చూడండి.**

అ) తన్మయము ఆ) రాణ్మణి

ఇ) వాఙ్మయము ఈ) మరున్మందనుడు



2. ఉపజాతిపద్యాల్లో తేటగీతి, ఆటవెలది పద్యాల లక్షణాలను తెలుసుకున్నారు కదా! ఇప్పుడు సీసపద్యలక్షణాలను పరిశీలిద్దాం.

- సీసపద్యంలో ప్రతిపాదం సుదీర్ఘమైంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. ప్రతిభాగంలో నాల్గసి గణాల చొప్పున ఒక్కొక్క పాదంలో ఎనిమిది గణాలుంటాయి. ఈ 8 గణాల్లో మొదటి ఆరు ఇంద్రగణాలు. చివరి రెండు సూర్యగణాలు. (పాఠం మొదటి భాగంలో 4 ఇంద్రగణాలు, 2వ భాగంలో వరుసగా రెండు ఇంద్రగణాలు, రెండు సూర్యగణాలుంటాయి.)

	నగ	భ	నగ	సల	
	I I I I	U I I	I I I U	I I U I	
ఉదా॥	హరిహర	బ్రహ్మలఁ	బురిటి బి	డ్డలఁజేసి –	మొదటిభాగం
	ఇంద్ర	ఇంద్ర	ఇంద్ర	ఇంద్ర	
	ర	నగ	హ	హ	
	U I U	I I I U	U I	U I	
	జోలఁ బా	డిన పురం	ధ్రీలు	లామ –	రెండవభాగం
	ఇంద్ర	ఇంద్ర	సూర్య	సూర్య	

} ఒక పాదం

- యతి ప్రతిభాగంలోనూ 3వగణం మొదటి అక్షరంతో సరిపోతుంది. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది. పై పాదంలో ప్రాసయతిని గమనించారు కదా! ఈ కింది పాదంలో యతులతో సహా గణ విభజన చేసి లక్ష్య సమన్వయం చేయండి.
  - ధగధగద్ధహన మధ్యము పూలరాసిగా
    విహరించియున్న సాధ్వీమతల్లి.
- సీసపద్యం నాల్గుపాదాల తర్వాత తేటగీతిగాని, ఆటవెలదిగాని తప్పనిసరిగా ఉంటుంది.
- మీ పాఠంలోని 5వ పద్యం సీసం. ఆ పద్యం లక్షణాలను సరిచూడండి.







4. జానపదుని జాబు

– డా॥ బోయి భీమన్న

చదవండి – ఆలోచించి చెప్పండి.

ప్రియసఖా!

నీ లేఖ అందింది. పట్నం జీవితం ఎలా ఉంటుందో అందులో వర్ణించావు. పల్లెటూరి జీవితాన్ని చిత్రిస్తూ ఉత్తరం రాయమన్నావు. నీది ఉత్తమమైన వాంఛ. ఒకచోట జీవిత విధానంతో మరొకచోటి జీవిత విధానాన్ని నిత్యమూ తెలిసికొంటూ ఉండాలి. మంచి చెడ్డలు, పెచ్చు తగ్గులు, ఏమైనా ఉంటే సరి చేసుకోవాలి. ఈ వాంఛ నాకు కల్గినందుకు అభినందిస్తున్నాను. నీ పట్న జీవితం – నాపల్లెటూరి జీవితంతో పోలిస్తే పరస్పర విరుద్ధంగా ఉంటుంది. నా జీవిత విధానాన్ని గురించి రాయడమంటే పల్లెటూళ్ళ జీవిత విధానాన్ని గురించి రాయడమన్నమాట. పల్లెటూళ్ళు, అక్కడి వాళ్ళ జీవితాలు ఎలా ఉంటాయో నీకు తెలుసా? విద్యుద్దీపాలు, పంఖాలు ఒప్పారుతూ ఉన్న మేడలలో హాయిగా సుఖించే నీకు ఏమి తెలుస్తుంది. నీకు మా గ్రామ జీవితం అర్థం కావాలంటే మా ఇంటికి ఒకసారి రా! ఈ పూరిగుడిసెలో ఒక్కరోజు ఉండు!

ఇట్లు
నీ మిత్రుడు

ప్రశ్నలు:

1. *ఉత్తరాన్ని ఎవరు, ఎవరికి రాసి ఉంటారు?*
2. *దేని గురించి రాసాడు?*
3. *పై లేఖను చదివారు కదా? మీరు ఏమి గ్రహించారు?*
4. *పల్లెటూళ్ళు, పట్టణాల జీవితాలు పరస్పర విరుద్ధంగా ఉంటాయని ఎందుకన్నారు?*
5. *పల్లెటూర్ల గురించి మీకు తెల్సింది చెప్పండి.*

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. భారతదేశం గ్రామాల్లో నివసిస్తోంది. "గ్రామంలోని ప్రతి ఇల్లు విద్యా గంధంతో గుభాళించి, అభివృద్ధి చెందితేనే మన దేశం సుసంపన్నంగా, సస్యశ్యామలంగా ఉంటుంది" అని మహాత్మాగాంధీ అన్నారు. ఐతే గ్రామాలు ఎలా ఉన్నాయి? వారి జీవితాలు ఎలా ఉంటాయి? అనే విషయాలను వివరిస్తూ, గ్రామాల్లోని దళితులు, పేదల జీవితాలను చిత్రిస్తూ "పల్లెటూరి లేఖలు" అనే పేరుతో 1932లో 'జనవాణి' పత్రికలోనూ, 1933లో 'జానపదుని జాబులు' అనే పేరుతో 'ప్రజామిత్ర'లోనూ ప్రచురించ బడ్డాయి. చదువుకొని, బీదతనంవల్ల చదువు కొనసాగించలేక తన స్వగ్రామం పోయి పల్లెటూరి పనుల్లో మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రమంతుడైన తన మిత్రునికి తన అవస్థలను, గ్రామాల్లోని పరిస్థితులను 'లేఖల' రూపంలో రాస్తాడు. వీటిని డా॥ బోయి భీమన్న గారు రాశారు.

ప్రక్రియ

ప్రస్తుత పాఠ్యాంశం లేఖా రూపంలో ఉంది. "జానపదుని జాబులు" పేరుతో డా॥ బోయి భీమన్న గారు రాసిన లేఖల సంపుటి నుండి పాఠాన్ని ఎంపికచేశారు. తూర్పుగోదావరి జిల్లా యాసలో ఈ లేఖా రచనలో సాగింది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.
- పాఠం మధ్యలో ఉన్న ప్రశ్నల గురించి ఆలోచించండి. మీ తరగతిలో రచ్చించండి.

కవి పరిచయం



"ప్రతిభను తలెత్తనివ్వరు పండితులు
పాండిత్యాన్ని తలెత్తనివ్వరు పామరులు

ఈనాడు సాహిత్యమంటే కులం, మతం, వర్గం, ముఠా" అని ధైర్యంగా తన మనస్సులోని మాటను కలం ద్వారా, గళం ద్వారా వెలిబుచ్చిన మహాకవి బోయి భీమన్న. ఒకవైపు జాషువా, మరోవైపు శ్రీశ్రీ సాహిత్య ప్రపంచంలో చక్రవర్తుల్లా వెలుగుతున్న కాలంలో తనదైన శైలితో, వివిధ రకాలైన సాహితీ ప్రక్రియలతో బడుగుల జీవితాల గురించి, దళితుల జీవితాల గురించి రచనలు చేపట్టిన చైతన్యశీలి బోయి భీమన్న.

బోయి భీమన్నగారు తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో 19 సెప్టెంబర్ 1911లో పేద దళిత కుటుంబంలో జన్మించారు. అస్పృశ్యత రాజ్యమేలుతున్న నాటి కాలంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి విద్యనభ్యసించాడు. మహాత్మాగాంధీ, డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ బోధనలతో ప్రభావితమై అస్పృశ్యతను తన కలం ద్వారా రూపుమాపాలని తలంచిన మేధావి బోయి భీమన్నగారు. స్వాతంత్రోద్యమ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాలుపంచుకొన్నారు. కొంతకాలం జర్నలిస్టుగా కూడా పనిచేసారు. 1940-45 మధ్యకాలంలో ఉపాధ్యాయవృత్తిని చేపట్టారు.

బోయిభీమన్నగారు గుడిసెలుకాలిపోతున్నాయ్, పాలేరు (నాటికి) ఉశారులు, జానపదుని జాబులు, రాగవైశాఖ, పిల్లిశతకం, ధర్మంకోసం పోరాటం మొదలగు రచనలు చేపట్టారు. ఈయన తన 11వ ఏట నుండే రచనలు చేశారు. ఈయన రాసిన 'పాలేరు' ఎంతో మంది పేదలు, దళిత కుటుంబాలలో వెలుగులు నింపినది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాలేరుతనం మాన్పించి పాఠశాలల్లో చేర్చారు. 'పాలేరు' నాటకం స్ఫూర్తితో విద్యనభ్యసించి ఉన్నత పదవులు అధిష్టించిన పేదలు, దళితులు ఎంతో మంది ఉన్నారు. వీరు సుమారు 70కి పైగా రచనలు చేపట్టారు.



బోయి భీమన్నగారు రాసిన "గుడిసెలు కాలిపోతున్నాయ్" రచనకు 1975లో సాహిత్య అకాడమి అవార్డు లభించింది. భారత ప్రభుత్వం వీరిని 1973లో పద్మశ్రీతోనూ 2001లో పద్మభూషణ్‌తోను సత్కరించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం బోయి భీమన్న గారిని కళాప్రూర్ణ అనే బిరుదుతో సత్కరించి గౌరవ డాక్టరేటును ప్రదానం చేసింది. వీరు 1978 నుండి 1984 వరకు రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా కూడా ఉన్నారు. 1991లో చెన్నైలోని ప్రముఖ సాహితీ సంస్థగా పేరొందిన రాజలక్ష్మి ఫౌండేషన్‌వారు డా॥ బోయి భీమన్న గారికి రాజలక్ష్మి అవార్డును బహుకరించారు. విద్యావేత్తగా, సాహితీవేత్తగా, జర్నలిస్టుగా వివిధ రంగాల్లో పనిచేసి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి సమాజ క్షేమం కోసం పాటుపడిన మహామనిషి డా॥ బోయి భీమన్నను అనారోగ్యంతో డిసెంబర్ 16వ తేదీ 2005 సం॥లో పరమపదించారు.

పంటను కైలుచేసి, ధాన్యం రాసులు పోసి, తమ కడుపులు కాలుతూవున్నా, కన్నీళ్ళు కారుతూ ఉన్నా, ఇనాందారులకు ఫలితం అంతా అప్పగించి వట్టిచేతులు నలుపుకొంటూ ఇండ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి ఎవరికి హృదయం కరిగించదు? ఈ మాటలు చెబుతున్నది ఎవరు? ఏ సందర్భంలో చెబుతున్నాడో తెల్సుకోవడానికి పాఠం చదవండి.

I

నెచ్చెలీ!

క్షమిస్తావనే అనుకొంటున్నాను. లేఖ ఆలస్యమైంది. ఆలస్యానికి కారణం లేకపోలేదు. మీ పట్నాల్లోలాగ కాలం కరకట్టుగా నడవదు మా పల్లెల్లో. ఈవేళ నిరుద్యోగం అయితే రేపు తీరిక లేని పని – మళ్ళీ ఆ మరునాడు పని మందం – ఈ విధంగా ఉంటుంది స్థితి. అందుచేత స్థిరంగా ఈ వేళ ఇది చేయాలి – ఆవేళ అది చేయాలి – అని కార్యక్రమం తయారు చేసికొనడానికి ఏమీ అవకాశం ఉండదు.

గ్రామాల్లో సాధారణంగా ఉండే ఈ అస్థిరభావమే నీకు లేఖ వ్రాయుట ఆలస్యం చేయించింది. కాలం చాలా విలువైంది. గ్రామాలు ఈ విలువ గ్రహించడానికి ఇట్టి అస్థిర స్వభావం తొలగాలి.

మొన్ననే నీకు లేఖ రాయాలని అనుకొన్నాను. కాని, ఆ వేళ అంతా పని. ఒక్క క్షణమైనా తీరుబడి అయింది కాదు. ఆ రాత్రి రాయాలని కలమూ, కాగితమూ పట్టుకొని దీపంబుడ్డి దగ్గిర కూర్చున్నాను.

'కిరసనాయిల పొగ కళ్ళలో పడుతోంది. కళ్ళు జబ్బు చేస్తాయి' అని మాయమ్మ అన్నది.

'ప్రొద్దస్తమానమూ పని చేశావు, పడుకోకూడదా!' అన్నాడు మామయ్య.

'అన్నోయ్! ఈ లెక్క చెప్పి పడుకో' అంటూ పలక తీసికొని వచ్చింది మా చెల్లి.



అది రూపాయిల గుణకారం లెక్క. లెక్క చెప్పుతున్నాను. 'రూపాయల్ని అణాలు చేయాలంటే ఏమి చేయాలి?' అన్నాను.

మా చెల్లి ఆలోచిస్తోంది.

'దుకాణం మీదికి తీసుకువెళ్ళి మార్చాలి' అన్నాడు మా తమ్ముడు.

'కాదు, పదహారు పెట్టి గుణించాలి' అన్నది మా చెల్లి.

మాయమ్మ మా తమ్ముడి పక్షం అయింది.

'అయితే ఈ రూపాయిని గుణించి అణాలు చేయి' అంటూ ఒక రూపాయిని దొర్లించింది మా చెల్లి దగ్గరికి.

నాకు ఆశ్చర్యం కలిగింది.

అచ్చట కలిగిన చమత్కారానికి కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. ఇటువంటి చమత్కారా లెన్నో నిత్యమూ చూస్తూ ఉంటాం గ్రామాల్లో.

మాయమ్మ మా తమ్ముడి పక్షం అవలంబించినందుకు కాదు నాకు ఆశ్చర్యం కలుగుత వినోదం కోసం, బిడ్డల సాన్నిధ్యాన్ని తల్లులు అనుభవించే ఆనందాన్ని అనుభవించడం కోసం, ఆవిడ ఒక పక్షం వహించి మాతో తర్కానికి దిగింది.

మాయమ్మకు ఆ రూపాయి ఎక్కడి నుంచి వచ్చింది అని కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. పదిరోజులు కష్టపడి పనిచేస్తే వచ్చిన కూలి ఆ రూపాయి.

రూపాయి కంటికి కనపడితే ఎంతో ఆనందం. అందుకనే చిల్లర తీసుకొనక మినపకుండుం వంటి రూపాయి తీసుకొన్నాడు మా అయ్య.

ఆ రూపాయిని అందరూ తలకొక కాస్తసేపూ దగ్గర పెట్టుకొని ఆడుకొన్నారు దానితో.

కాని నాకు ఆశ్చర్యం కలిగించింది వేరొక విషయం. మనం అభ్యసించే విద్యకూ, జీవితంలో చేయబోయే పనికి ఉన్న అంతరం హఠాత్తుగా నా మనస్సుకు తట్టింది.

మనం నేర్చుకొన్నది, నేర్చుకొంటున్నది, రూపాయిని పదహారుతో గుణించి అణాలు చేయడమే.

కాని చేయవలసిన పని రూపాయిని దుకాణం దగ్గిరకు తీసుకొని వెళ్ళి మ్రోగించి చూపి పదహారు అణాలనూ లెక్క పెట్టుకొని ఇంటికి రావడం. అంత ఉంది అంతరం!

'చూశావా? చదువులు చదువుతున్నాం. పట్నాల్లో ఒక రూపాయి ఒక దమ్మిడీలాగ ఖర్చు పెడతాం.'

చదువు పూర్తి అవగానే ఉద్యోగాలకు దేవుళ్ళాట మొదలు పెడతాం. అందరి కాళ్ళూ పట్టుకొంటాం.

సఖా! ఇన్ని త్రిప్పలూ ఎందుకు? బ్రతకడానికి! బ్రతికి ఎందుకు? మన స్వార్థాన్ని నింపుకోవడానికి! అంతేగా?

సంఘం ఏమైపోయినా సరే, మనతో వారు ఎన్ని కట్టళ్ళు కడుస్తున్నా సరే, దేశం అధోగతికి దించుకొని పోతున్నా సరే మనకు చీమ కుట్టిన చందం అయినా ఉండదు.

మన జిల్లా కాదు, మన తాలూకా కాదు, మన గ్రామం కాదు, మన ఇల్లు ఉండి, తక్కిన ప్రపంచం అంతా మునిగిపోతున్నా సరే, మనం లెక్కచేయం అంతే.



మిత్రమా! చదువుకొన్న వాళ్ళంతా తమ కష్ట ఫలాన్ని తింటూ పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూ, కులుకుతూ ఉండడం చూచి పల్లెటూళ్ళు కన్నీరు విడుస్తున్నవి.

గ్రామోద్ధరణం అంటూ పత్రికల్లో రాసుకొంటే పని కాదు. ఉపన్యాసాలిస్తే పని కాదు. రోడ్ల వెంట మోటారు కార్లలో నాలుగుసార్లు తిరిగి నాలుగు వందలు భత్యాలు కొడితే పని కాదు. అవన్నీ రూపాయిని పదహారు చేత గుణించినట్లే వ్యర్థాలు. కాగితం మీద కోట్లు కోట్లు సంఖ్యలు వేసుకొని 'ఇంత ధనం ఉంది నాకు' అని సంతోషించడం ఎట్లో, అవన్నీ అట్లే.

ఈ ఊహ ఆ క్షణంలో తట్టింది నాకు. ఆశ్చర్యం కలిగింది.

ప్రజాసముదాయం కోరే ప్రత్యక్షఫలం ఆడంబరం కాదు.

అంతట్లోకే 'వరికుప్పచేలో నీరుపడ్డది, నీవు రావాలి' అంటూ వచ్చాడు, ఒక రైతు కోటయ్య. ఒక వేళ నీకు లేఖ రాయడానికి వీలే చిక్కలేదు.

ఆలోచించండి-చెప్పండి

- *లేఖలు ఎప్పుడెప్పుడు రాస్తారు? ఎందుకు?*
- *'అస్థిరభావం' అంటే మీకేమి అర్థమైంది?*
- *మన చదువులు దైనందిన జీవితంలో ఉపయోగపడతాయని భావిస్తున్నారా? ఎలా?*
- *మీరు చదువు పూర్తయిన తర్వాత ఏం చేస్తారు? ఏం కావాలనుకొంటున్నారు?*
- *ఈ రోజుల్లో మనుషుల్లో స్వార్థం ఎందుకు పెరుగుతుంది?*

II

ఆ రాత్రి అంతా పొలాలలో జాగారం చేశాం.

కోతలు అయినవి. కొందరు కోతలు కోయగానే నూర్చి వేసుకొంటారు. కొందరు కుప్పలు వేసికొని వేసవి కాలం తలనూపగానే చైత్రారంభంలో నూర్చుకొంటారు.

కుప్పలు చేలలోనే వేస్తారు. కుప్పల చుట్టూ పైరులు చక్కగా పెరుగుతూ ఉంటాయి.

నీటి బోదెకు దగ్గరగా ఉన్న చేలో కోటయ్య కుప్ప వేశాడు.

కాలువ ఇంకా ఎండిపోలేదు. బోదె కన్నం తెగి కుప్పచేలో నీరు పడింది.

బోదె కన్నం కట్టివేసి చేలో పడ్డ నీరు పోయేలాగున పిల్లబోదెలు తీసి ఒక గట్టు మీద కూర్చున్నాం కోటయ్యా, నేనూ.

హాయిగా నక్షత్రాలు మెరుస్తున్నాయి. గుబురు గుబురుగా యెదుగుతూ, చల్లని గాలికి 'జోరు' మంటూ పైరుచేలు ఎంతో ఆనందాన్ని కూరుస్తున్నాయి.

'పల్లెటూరి జీవితం ఎంతో మనోహరమైంది!' అని అనుకున్నాను. కాని, 'పస్తులు పడాలి, కష్టాలకు ఓర్చుకోవాలి. ఈ రెండూ తప్పితే పల్లెటూరే ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిల్లు.'

'కుప్ప పల్లాన్ని పడ్డది. ఆ మెరక చేలో వేద్దాం అనుకొన్నాను' అన్నాడు కోటయ్య. 'అంతర్వేది వెళ్ళగానే మార్చేయాలి.'

'అంత తొందర ఏమి వచ్చింది? సంవత్సరాదికి నూర్చుకోవచ్చు' అన్నాను.

'అబ్బే, పన్నులు వచ్చి తల మీద తన్నుతాయి. ఇంట్లో ఒక పింగాణీచిప్ప అయినా లేదు అమ్మడానికి. అన్నీ మట్టిమూకుళ్ళే' అన్నాడు.



సఖా! కష్టం వొకళ్ళది, ఫలితం మరొకళ్ళది.

పేదల నోళ్ళు కొట్టి, కడుపులు మాడ్చి, ఉన్నదంతా ఊడ్చుకపోయి ఏమి చేస్తారో తెలుసా? బేంకులలోనూ, ఇనుప పెట్టెలలోనూ కుప్పలు పోసికొని కూర్చుని అనుభవిస్తారు సర్వభోగాలూను.

ఎప్పుడు తొలకరిస్తాది అని కళ్ళు విప్పి కని పెట్టుకొని ఉండి –

ఎప్పుడు కాలువకు నీరు వొస్తాది అని రాత్రింబవళ్ళు మననం చేసి –

మందున్ని విత్తనాలు చల్లి – నీటి కొరకూ – కూలి కొరకూ ఇతరులతో పోటీలు పడి –

ఆకుమళ్ళు పశువులు తొక్కితినివేయకుండా రాత్రింబవళ్ళు పొలాలలోనే, వట్టి నేలనే పండుకొని కాపలా కాచి –

కుట్టే జెర్రిలకూ, పొడిచే తేళ్ళకూ, కరిచే పాములకూ శరీరాన్ని అర్పిస్తూ –

విసుగూ విరామమూ లేకుండా పొలాలకు నీరు పెట్టి, దున్ని, ఊడ్చి –

వర్షం అనక, బాడిబందలు అనక – పైరుల్ని – నిత్యమూ చూస్తూ, కాస్తూ –

ఎరువులు వేసి, కలుపులు దీసి, పంట పండించి –

పంటను ఎలుకలు, చిలుకలు తినివేయకుండా జాగ్రత్త చేసి –

పంటను కైలు చేసి – ధాన్యం రాసులు పోసి – తమ కడుపులు కాలుతూవున్నా, కన్నీళ్ళు కారుతూ ఉన్నా –

మిత్రమా! ఇనాందారులకు ఫలితం అంతా అప్పగించి వట్టిచేతులు నలుపుకొంటూ ఇండ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి ఎవరికి హృదయం కరిగించదు?

చాలాకాలం గడిచిపోయింది నాకు ఈ ఊహ లోనే, కోటయ్య ఏమి ఆలోచిస్తున్నాడో నాకు తెలియదు. ఇద్దరమూ తెలివొంది చూచుకొనేసరికి మంచుచేత మా తలలు నానిపోయినై. పోదాం పద అని లేచాడు కోటయ్య.

రాత్రి అంతా నాకు నిద్దర పట్టలేదు. పైగా అమితమైన చలి కూడాను. చలిమంటలు వేసుకొంటూ కబుర్లు చెప్పుకొంటూ ఆ రాత్రి గడిపాం.

ఆ మర్నాడు నిద్దుర బద్ధకం చేత (ఏమీ పనిలేకపోవడమే బద్ధకానికి కారణం) నీకు లేఖ రాయలేకపోయాను. ఆ రాత్రి అన్నం తినకుండానే నిద్ర పోయానట, మాయమ్మ అన్నానికి ఎంత లేపినా లేచాను కానట.

రేపంతా పని ఉంది. మెట్టదుక్కులు వచ్చాయి. తోటల్లో అరకలు కట్టాలి. రేపు మూర్తిగారి ఇంటికి వెళ్ళాలి అనుకొంటున్నాను. ఎలా ఉంటుందో.

ఇంతవరకూ నా లేఖ ఎందుకు ఆలస్యమయిందో రాశాను. అసలు నీకు రాయాలి అనుకన్నో సంగతి రాయనే లేదు.

క్రిస్టమసు వస్తుంది. క్రిస్టమసుకూ, సంక్రాంతికీ కలిపి కాలేజీకి సెలవులు ఇస్తారు. నేను ఈ ఏడు చదువు సాగిస్తే నిన్ను మా ఊరు తీసుకొని రావాలి. అనుకొన్నాను. కాని పురిటిలోనే సంధి కొట్టింది నా చదువుకు.

డబ్బు లేని చదువు ఇబ్బందుల చేటు. వచ్చే ఏడైనా చదువుతానో చదవనో, కాలం జరిగిపోయే కొలదీ స్నేహాలు పాతబడిపోతూ ఉంటాయి. కొత్త పరిచయాలు కలిగే కొలదీ పాత పరిచయాలు అడుగున పడిపోతూ ఉంటాయి. ఇది ప్రపంచ స్వభావం.



కనుక ఈ సెలవులకు మా ఊరు వస్తావనే అనుకొంటున్నాను.

నీవంటి ఆర్ద్రహృదయుడు పల్లెటూళ్ళు వచ్చి ఇచ్చట ప్రజలు పడే కష్టాల్నీ – కష్టాలు తొలగిపోతే పల్లెటూళ్ళు మానవసంఘానికి ఈయగల ఆనందాన్నీ – చూస్తూ ఎప్పటికైనా మంచిది.

ఏ విషయమూ వెంటనే తెలపాలి. నారింజపళ్లూ, వెలగపళ్ళూ, కొబ్బరి కురిడీలూ జాగ్రత్తచేసి ఉంచుతాను. తప్పకుండా రావాలి. సెలవు.

ఆలోచించండి-చెప్పండి

- *రాత్రి చుక్కలనూ చంద్రుణ్ని చూస్తే మీలో కలిగే అనుభూతులు ఏమిటి?*
- *"పల్లెటూరి జీవితం ఎంతో మనోహరమైంది. దీనిపై మీ అభిప్రాయాలు తెల్పండి.*
- *"కష్టం వొకళ్ళది, ఫలితం మరొకళ్ళది" అంటే మీకేమి అర్థమైంది? దీన్ని ఏ ఏ సందర్భాలలో ఉపయోగిస్తారు?*
- *చలిమంటలు కొడుతూ, రైతులు కబుర్లు చెప్పుకొంటారు కదా! వారు ఏ ఏ విషయాల గురించి కబుర్లు చెప్పుకుంటారు. ఊహించండి.*
- *'పల్లెటూర్లకు వెళితే మనం ఏ ఏ విషయాలు తెలుసుకోవచ్చు?*

ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. మీరైతే దేన్ని సమర్థిస్తూ మాట్లాడతారు? ఎందుకు? పల్లె గొప్పదా? పట్నం గొప్పదా?

2. గతంతో పోలిస్తే నేడు వ్యవసాయం చేసేవారి సంఖ్య క్రమేణా తగ్గుతోంది. దీనికి కారణాలు ఏమై ఉంటాయి? తెల్సుకొని చర్చలో పాల్గొనండి.

3. కింది వాక్యాలు చదవండి. వీటిని ఏ సందర్భంలో ఎవరు అన్నారు?

అ) అన్నాయ్! ఈ లెక్క చెప్పి పడుకోకూడదా!

ఆ) "అయితే మీ రూపాయిని గుణించి అణాలు చేయి".

ఇ) "వరిచేలో నీరుపడ్డది, నీవు రావాలి".

4. (బోయి భీమన్న రాసిన ధర్మం కోసం పోరాటంలోని) కింది పేరా చదవండి. పేరాలోని ముఖ్యమైన / కీలకమైన ఐదు పదాలను గుర్తించండి.

పనిచేస్తూ ఉంటే అనుభవం కలుగుతూ ఉంటుంది. అనుభవాన్ని మళ్ళీ ఆచరణలో పెడితే, పని మరింత చక్కగా సాగుతుంది. అప్పుడు అనుభవానికి మరింత పదునూ, కాంతి లభిస్తుంది. వాస్తవ జ్ఞాన సముపార్జన పద్ధతి ఇది. వాస్తవ జ్ఞానమే సరియైన జ్ఞానం. వాస్తవ జ్ఞానం ఎడతెగని పని ద్వారా, పరిశీలన ద్వారా లభిస్తుంది.



వాస్తవ జ్ఞానం దేశకాల ప్రాంతానుగుణమై ఉంటుంది. దేశకాల ప్రాంతానుగుణంగా మారుతుంది. మన వస్త్రధారణ, వివాహాలు, పరిపాలన విధానాలు ఈ విధంగా విభిన్న విషయాన్ని తీసుకొని మనం పరిశీలించినా, ఈ సత్యం కనిపిస్తుంది. మంచి చెడ్డలు, ఆచార వ్యవహారాలు, విధి విధానాలు అన్ని దేశకాల ప్రాంతనుగుణంగా ఎలా మారిపోతున్నాయో స్పష్టమవుతుంది. మార్పుకు అతీతమైంది ఏదీ ఈ లోకంలో లేదు.

పై పేరా ఆధారంగా కింది వాక్యాలలో ఏవి సరైనవో (✓) ద్వారా గుర్తించండి.

అ) అనుభవం వల్ల మన పనితీరు మెరుగుపడుతుంది. ( )

ఆ) 'జ్ఞానం' అనేది చదివితే, వింటే లభించేది. ( )

ఇ) వాస్తవజ్ఞానం స్థిరంగా ఉండదు. అది కాలనుగుణంగా మారుతుంటుంది. ( )

ఈ) అనుభవం, పరిశీలన వల్ల వాస్తవ జ్ఞానం సిద్ధిస్తుంది. ( )

ఉ) మన ఆచారవ్యవహారాలు, విధివిధానాలు ఎప్పుడూ స్థిరంగా ఉంటాయి. ( )

5. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) జానపదుని లేఖలో కవి ఏ ఏ విషయాలను గురించి రాసాడు?

ఆ) వ్యవసాయదారుల కష్టాన్ని కవి ఏమని వివరించాడు?

ఇ) చదువుకొన్న వాళ్ళ గురించి, పట్టణవాసుల గురించి కవి ఏమని ప్రస్తావించాడు?

ఈ) జానపదుడు తన పట్టణం మిత్రుణ్ణి పల్లెటూరుకు ఎందుకు రమ్మని ఆహ్వానించాడు?

ఉ) బోయి భీమన్న గారి గురించి సొంతమాటల్లో రాయండి.

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి 4, 5, వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) "ఏమీపని లేకపోవడమే బద్ధకానికి కారణం" దీనిపై మీ అభిప్రాయం తెల్పండి.

ఆ) "కాలం చాలా విలువైంది" ఎందుకు?

ఇ) చదువుకున్న వాళ్ళంతా తమ కష్టఫలాన్ని తింటూ పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూన్నదన్న రచయిత అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?

ఈ) "కష్టం ఒకళ్ళది ఫలితం మరొకళ్ళది" అని అనడంలో రచయిత ఉద్దేశం ఏమై ఉంటుంది?

ఉ) "పల్లెటూళ్ళు మానవ సంఘానికి ఈయగల ఆనందాన్ని చూసే తెల్సుకోవాలి" అని ఎందుకన్నారు?

ఊ) "పల్లెటూళ్ళు కన్నీళ్ళు పెడుతున్నవి" దీన్ని వివరిస్తూ రాయండి.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) పల్లెటూళ్ళు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అలాంటి పల్లెటూళ్ళు రోజురోజుకూ తమ ఉనికిని, సంస్కృతిని, ఆత్మను కోల్పోతున్నాయి. ఇందుకుగల కారణాలు ఏమై ఉంటాయి? ఇవికలకలలాడాలంటే మనం ఏం చేయాలి?

ఆ) "పల్లెటూర్లు ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిళ్ళు" దీన్ని సమర్థిస్తూ సమాధానం రాయండి.



3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) మీరు చూసిన పల్లెటూరు / గ్రామంలోని మనుషుల మధ్య కూడా సంబంధాలు, అక్కడి ప్రకృతి దృశ్యాలను వర్ణిస్తూ మీ మిత్రుడికి / నేస్తానికి లేఖరాయండి.

ఆ) ఈ పాఠం ఆధారంగా కొన్ని నినాదాలు, సూక్తులు రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలు చూడండి. వీటిని సంబంధించిన పదాలతో కలపండి.

ఉదా॥ రైల్వేస్టేషను, _____, _____, చేరుకోవడం

రైల్వేస్టేషను, టిక్కెట్టు, ప్రయాణం, చేరుకోవడం.

అ) వర్షాకాలం, _____, _____, ధాన్యం.

ఆ) మడిదున్నడం, _____, _____, పంట.

ఇ) పాఠశాల, _____, _____, జీవితంలో స్థిరపడడం.

ఈ) లేఖ, _____, _____, చేరడం.

ఉ) పనిచేయడం, _____, _____, ఆనందంగా జీవించడం.

2. కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

అ) పొద్దస్తమానం

ఆ) చమత్కారం

ఇ) సాన్నిధ్యం

ఈ) కష్టఫలం

ఉ) కడుపులు మాడ్చుకొను

ఊ) అడుగునపడిపోవడం

3. కింది పదాలు / వాక్యాలను వివరించి రాయండి.

అ) పురిటిలోనే సంధి కొట్టడం _____

_____

ఆ) కలుపుదీయడం _____

_____

ఇ) గ్రామోద్ధరణం _____

_____



ఈ) ఉన్నదంతా ఊడ్చుకపోవడం _____

_____

IV. భాషా కార్యకలాపాలు

- మీ ఊహలలో అందమైన పల్లెటూరు ఎలా ఉంటుందో ఊహించండి. ప్రకృతి శోభలతో అలరారే అలాంటి గ్రామ సీమ చిత్రాన్ని సేకరించండి. దాన్ని వర్ణిస్తూ, వివరాలను రాసి ప్రదర్శించండి. మీ మిత్రులు కూడా ఇలాగే రాస్తారు కదా! వీటితో "అందమైన గ్రామ పౌరులు" అనే పుస్తక సంకలనాన్ని తయారుచేయండి. దానికి ముఖచిత్రం కూడా గీయండి. విషయసూచిక, ముందుమాట రాసి ప్రదర్శించండి.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది వాక్యాల్లోని సంధులను విడదీసి, సంధి సూత్రంతో సమన్వయం చేయండి.

అ) ఆహాహా! ఎంత వైపరీత్యము!

ఆ) జంతుప్రదర్శనశాలలో ఏమేమి చూశావు?

ఇ) అక్కడక్కడ కొన్ని సమస్యలు తలెత్తవచ్చు.

ఈ) వెన్నెల పట్టపగలును తలపిస్తున్నది.

2. కింది వాక్యాలను కలపండి.

అ) రాము పాఠం చదివాడు. రాము పాఠం అర్థం చేసుకున్నాడు.

ఆ) వైద్యుడు ప్రథమ చికిత్స చేస్తాడు. వైద్యుడు మందులు ఇస్తాడు.

ఇ) అక్క టీవీ చూస్తున్నది. అక్క నృత్యం చేస్తున్నది.

* పై సందర్భాల్లో సంశ్లిష్టవాక్యాలు ఏర్పడ్డాయని గ్రహించారు కదా!

3. కింది వాక్యాలను కలిపి, అవి సంయుక్తవాక్యాలు అవుతాయో లేదో సరిచూడండి.

అ) రామకృష్ణుడు గురువు. వివేకానందుడు శిష్యుడు.

ఆ) సీత సంగీతం నేర్చుకుంటున్నది. సీత నృత్యం నేర్చుకుంటున్నది.

ఇ) రంగారావుకు పాడటమంటే ఆసక్తి. రంగారావుకు వినడమంటే విరక్తి.

ఈ) శ్రీను బడికివచ్చాడు. జాన్‌రెడ్డి బడికి వచ్చాడు. హస్మత్ బడికి వచ్చాడు.

ఉ) ఆయనకవి. ఆయన గాయకుడు. ఆయన విద్వాంవేత్త.



పరిచయం

ప్రాతాధిసంధి

1. కింద గీతగీసిన పదాలను విడదీయండి. మార్పులు గమనించండి.

అ) పూరెమ్మ అందంగా ఉన్నది.

ఆ) గురుశిష్యులు పూదోటలో విహరిస్తున్నారు.

ఇ) కొలనులో కెందామరలు కొత్త శోభను వెదజల్లుతున్నాయి

ఈ) ఆ ముసలివానిలాగే అతని ప్రాయిల్లు జీర్ణమై ఉన్నది.

- మీరు చేసిన సంధివిచ్ఛేదనలు సరిచూసుకోండి–

అ) పూవు + రెమ్మ

ఆ) పూవు + తోట

ఇ) కెంపు + తామరలు

ఈ) ప్రాత + ఇల్లు

ఉ) మీదు + కడ

} ఐదు సందర్భాల్లోనూ మొదటి పదంలోని మొదటి అక్షరం తర్వాత ఉన్న వర్ణం లోపించడం తెలుస్తున్నది. పరుషాలు (త, క) సరళాలుగా మారడం అవగతమవుతున్నది.

దీన్ని బట్టి, ప్రాతాదిసంధి నియమాన్ని ఈ విధంగా అర్థంచేసుకోవచ్చు.

♦ సమాసాల్లో ప్రాతాదుల తొలి అచ్చు మీది వర్ణాలకు లోపం బహుళంగా వస్తుంది.

మిగిలిన అక్షరానికి పరుషాలు పరమైనప్పుడు ను(న్)గా గమం వస్తుంది. ('న్' అనేది అరసున్న రూపంలో, సున్నా రూపంలో రావచ్చు.)

(* ప్రాతాదులు అంటే ప్రాత మొదలుగాగల పదాలు. అవి – ప్రాత, లేత, క్రొత్త, క్రిందు, కెంపు, చెన్ను, లేత మొదలైనవి.)





5. శతక మధురిమ

చదవండి - ఆలోచించి చెప్పండి.

రాజేశ్ : *రవీ! బాగున్నావా!*

రవి: *బాగున్నాను రాజేశ్. రాజేశ్ నువ్వేంచేస్తున్నావు? మన చిన్ననాటి మిత్రులు ఎవరైనా కలుస్తున్నారా?*

రాజేశ్ : *ఆ! ఆ! అందరూ కలుస్తున్నారు. సంతోష్ లాయరైనాడు. భానుటీచరైనాడు. మధు వ్యాపారం చేస్తున్నాడు. సుభాష్ రాజకీయనేతగా ఎదిగాడు. ఇలా అందరూ ఒక్కోరంగంలో నీతి నిజాయితీలతో రాణిస్తున్నారు.*

రవి: *చిన్నప్పుడు మనం చదివిన చదువు, నేర్చుకున్న జ్ఞానం ఊరికేపోతుందా? ఆచదువుల ఫలితం, గురువుల దీవెనలు అన్నీ కలిస్తేనే మన అభివృద్ధి.*

రాజేశ్ : *ఔనౌను! శతక పద్యాల్లోని నీతులు మనవ్యక్తిత్వానికి బాటలు వేశాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపాయి కదూ!*

రవి: *బాగా చెప్పావు రాజేశ్! శతక పద్యాలు నేటికీ మార్గదర్శకాలు మీపిల్లలకు కూడా నేర్పించుబాగా!*

రాజేశ్ : *నేర్పుతున్నాను రవీ! సరే రవీ! బస్సు వచ్చింది. మళ్ళీ కలుద్దాం.*

ప్రశ్నలు:

1. సంభాషణను బట్టి వారు ఎవరని భావిస్తున్నారు?
2. వారి అభివృద్ధికి కారణాలేవి?
3. వ్యక్తిత్వాన్ని ఏవి తీర్చిదిద్దుతాయి?
4. ఏవి నేటితరానికి మార్గదర్శకాలని రవి చెప్పాడు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

శతకాలు నైతిక విలువలను పెంపొందింపజేస్తాయి. భావిజీవితాన్ని తీర్చిదిద్దుతాయి. పద్యాల్లో దాగిన నైతిక విలువలను తెల్పడమే ఈ పాఠం ఉద్దేశం.



ప్రక్రియ

విద్యార్థులకు సూచనలు

-
-
-

కవి పరిచయం

1. శ్రీ లొంక రామేశ్వర శతక కర్త నంబి శ్రీధరరావు (1934-2001) (కవిరాజు)
   నివాసం - భీంగర్, నిజామాబాదు జిల్లా.
   శ్రీమన్నింబాచల మహాత్మం, శ్రీమన్నింబగిరినరసిం, శారదాగణితం, శ్రీలాంక రామేశ్వరా శతకం. (సిరికొండ మం॥ లొంక రామేశ్వరాలయం.
2. నింబగిరి నరసింహ శతక కర్త - అందవేంకటరాజం. (1933 - 2006)
   నవోదయం, మణిమంజూష, కళాతపస్విని పద్యకావ్యాలు.
   భారతరాణి నాటికల సంపుటి
   నింబగిరి శతకం, ఈశ్వర శతకం - శతకాలు.
   వానమామలై వరదాచార్యుల కృతులు - అనుశీలనం - సిద్ధాంతగ్రంథం.
   మధురపూజ, కవిశిరోమణి అవధాన యువకేసరి, అవధాన చతురానన.
3. విశ్వనాథేశ్వరా శతక కర్త గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ (1934-2011)
   స్వస్థలం : మెదక్ జిల్లా పోతారెడ్డి పేట
   బిరుదులు : అవధానశశాంక, ఆశుకవిశేఖర
   రచనలు : కవితాకళ్యాణి, అవధాన సరస్వతి, వాగీశ్వరస్తుతి, ఆద్యమాతృక, పద్యోద్యానము, 300 అవధానాలు
4. ఉత్పలమాల శతక కర్త ఉత్పల సత్యనారాయణచార్య (పల్లెర్ల)



5. బాకవరాంజనేయ శతకకర్త ఆచార్య వేంకటరావు పంతులు (1937 – 1994)
స్వస్థలం : శంకర్‌పల్లి రంగారెడ్డి జిల్లా గీతాయజ్ఞాలు, రామనామ జపూయజ్ఞాలు, సత్సంగ కార్యక్రమాలు శ్రీశ్రీశ్రీ లక్ష్మీకాంత్‌రావు బాబా గారి సన్నిహితులు.
6. తరిగొండ నృసింహ శతక కర్త తరిగొండ వెంగమాంబ.
చిత్తూరు జిల్లా తరిగొండ గ్రామం. బాల్యం నుంచే భగవద్భక్తురాలు.
రచనలు : తరిగొండ నృసింహశతకం, శివనాటకం, నారసింహవిలాసకథ అనే యక్షగానాలు, రాజయోగామృతం ద్విపద కావ్యం, శ్రీవేంకటాచల మహాత్యం, అష్టాంగ యోగసారం, వాశిష్ఠ రామాయణం, పద్యకావ్యాలు.
7. చిత్తశతక కర్త శ్రీపతి భాస్కరకవి.
కాలం : 17వ శతాబ్ది
చాళుక్యయుగంలో వీరశైవమతాన్ని ఆచరించి ప్రచారం చేసిన శ్రీపతి పండితుని వంశీయుడని పరిశోధకుల భావన.
8. మల్లభూపాలీయం నీతిశతక కర్త ఎలకూచి బాలసరస్వతి.
క్రీ.శ.1600 ప్రాంతానికి చెందినవాడు. మహబూబ్‌నగర్ జిల్లా జటప్రోలు సంస్థానంలో సురభిమాధవరాయల వద్ద ఆస్థానకవిగా ఉన్నాడు. తెలుగులో తొలి త్యర్థికావ్యమైన 'రాఘవ యాదవ పాండవీయం' రచించినవాడు. ఆంధ్రశబ్దచింతామణి వ్యాఖ్యాత. దాదాపు పన్నెండు గ్రంథాలు రచించాడు. భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన వారిలో మొదటివాడు. పాండిత్య స్ఫోరకంగా, ధారాళమైన శైలితో ఈయన రచన సాగుతుంది.

పద్యం రసానుభూతిని కల్గిస్తుంది. అందుకు కారణాలు రెండు. ఒకటి భావం రెండోది అలంకారం. ఈ అలంకారం శబ్ద, అర్థ సంబంధమైనది.

ఏదైనా కావచ్చు. పద్యం ఛందస్సులో ఒదిగి పోయి, లయాత్మకంగా గానయోగ్యంగా ఉంటుంది. ధారణకు అనువుగా ఉంటుంది. అందుకే మన ప్రాచీన కవులు స్తుతులు, శాస్త్రవిషయాలు, నైతిక విషయాల్ని పద్యాల్లో చొప్పించి అందించారు. అటువంటి మేలిముత్యాల్లాంటి పద్యాలనుండి కొన్నింటిని ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం! పద్య రసానుభూతిని ఆస్వాదిస్తూ నైతిక విలువల్ని పెంపొందించుకుందాం....

I

శా ॥ ఇల్లాలింటికి దీపమౌనగ హహీయంచు మందుల్ మహా
భల్లూకాకృతి దోప నవ్వుదురు, దీవ్యద్ధ్యామగంగన్ జటా
పల్లిన్ నీవు ధరించటన్ వినరో, యెవ్వారైన మర్యాద వ
ర్ధిల్లిన్ కాంతల జూడకున్న హితమా? శ్రీలొంక రామేశ్వరా!



సీ ॥ గుణమింత కుదురక గుళ్ళు తిరుగటయేల?
సంస్కారమబ్బని చదువులేల?
చిత్తంబు నిలువని శివపూజలవియేల?
శాంతిగూర్చని యోగసాధనేల?
మంచిని పెంచని మలినమతము లేల?
హితబుద్ధి గలుగని వ్రతములేల?
అభ్యుదయము గాని ఆచారతతియేల?
తగురక్ష సేయని ధర్మమేల?

తే ॥ దమము శమము కూడని జపతముల లేల?
స్వామి! నీభక్తి కలుగని జన్మమేల?
వరశుభ విలాస! శ్రీనింబగిరివాస!
భవ్యగుణధామ! నరసింహ! దివ్యనామ!!

ఆలోచించండి-చెప్పండి

- ఇంటికి దీపం ఎవరు?
- శివుడు గంగను తలపైధరించడాన్ని నీవెలా భావిస్తున్నావు?
- నిజమైన చదువేది?
- ఎప్పుడు జన్మ సార్థకమౌతుంది?
- నింబగిరి నృసింహ శతక మకుటమేది?

II

శా ॥ఆరాధించుట వ్యక్తిపూజ అదికాదా ద్వేషమారెండు కా
వా? రాణించునుపాయమే దొరకదౌరా! రాగవిద్వేషపుం
బోరాటమ్ముల ఆరటాలెపుడు బోవున్? వచ్చునైక్యమ్మెటుల్?
రారాజత్కవిరాడ్వచోనిచయ సారా! విశ్వనాథేశ్వరా!

చ ॥అనయము దోషమే పరులయందు కనుంగొని పల్కునట్టి యా
జనుని కొగిన్ గుణగ్రహణశక్తి నశించును; మంచి మాత్రమే
జనములలోన చూడగల చక్కని చూపులు పల్కునాల్క నా
కెనయగనిమ్ము వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియ:పతీ!

ఆలోచించండి-చెప్పండి

- వ్యక్తిపూజ అంటే ఏమిటి?
- రాగద్వేషాలు మానవులకు ఎందుకుంటాయి?
- ఐక్యత ఎలా కల్గుతుంది?
- పరుల్లో ఏం చూడాలి?
- కవి ఏం కోరుకుంటున్నాడు?

III

చ ॥ఈ కులభేదముల్ తగనివెంతయు కీడొనరించునంచు, తా
మే కులసంఘముల్ నిలుపమేలగునా? ఇదియేమివింత? ఈ
లోకుల మోసగించు కథలొప్పునె నాయకులైన వారికిన్
బాకవరాంజనేయ! ఖలభంజన! సాధుజనానురంజనా!

ఉ॥ పట్టగ నీశ్వరుండు తన పాలిట నుండిపుడిచ్చినంతలోఁ
దిట్టక దీనదేహులను తేటగ లాలనజేసి, యున్నమున్
పెట్టు వివేకి మానసముఁ బెంపొనరించుచు నూరకుండినన్
గుట్టుగ లక్ష్మిఁబొందుఁ; దరిగొండనృసింహ! దయాపయోనిధీ!

ఆలోచించండి-చెప్పండి

- ఏవి కీడును కల్గిస్తున్నాయి?
- నాయకులు ఏంచేస్తున్నారు?
- 'ఖలభంజన' అంటే ఏంటి?
- ఎవరిని ఆదరించాలి?
- లక్ష్మి ఎప్పుడు వచ్చి చేరుతుంది?



IV

ఉ॥ బీదలకన్న వస్త్రములు పేర్మినొసంగుము తుచ్ఛసౌఖ్యసం
పాదనకై యబద్ధముల బల్కకు, వాదములాడబోకు, మ
ర్యాదనతిక్రమింపకు, పరస్పరమైత్రి మెలంగు, మిట్టివే
దములంచెరుంగుము, వివేకధనంబిది చిత్తమా!

మ॥ సిరిలేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్
గురుపాదానతి కేలనేనీగి చెవులందు న్నిక్కి వక్త్రంబునన్
స్థిరసత్యోక్తి భుజంబులన్విజయముజ్జిత్తం బునస్సన్మనో
హర సౌజన్యము గల్గిన న్సురభిమల్లా! నీతివాచస్పతీ!

ఆలోచించండి-చెప్పండి

- *బీదలకేమివ్వాలి?*
- *ఏవి మంచి లక్షణాలు?*
- *'మైత్రి' అనే పదానికి మరిన్ని అర్థాలు చెప్పండి.*
- *ఏవి నిజమైన ఆభరణాలు*
- *నోటికి మాటే ఆభరణం అన్నారు కదా! దీనిపై నీ అభిప్రాయమేమిటి?*

సారాంశం

1. ఓ రామేశ్వరా ! ఇల్లాలే ఇంటికి దీపం అనే మాట వింటే అల్పజ్ఞానులు విరగబడి నవ్వుతారు. కానీ పవిత్రమైన ఆకాశగంగను నీవు తలపై దాల్చిన విషయం వారికి తెలియదేమో! మర్యాదతో స్త్రీని గౌరవించడమే మంచిది కదా! స్త్రీని గౌరవించడమనే భావన ఈపద్యంలో ప్రస్ఫుటమవుతుంది. (సిరికొండకు 7 కి.మీ. దూరంలో అడవిలో గల లొంకలో వెలసిన ఈశ్వరుడే లొంకరామేశ్వరుడు)
2. నింబగిరిలో వెలసినదేవా! శ్రేష్ఠమైన శుభాలతో అలరారే వాడా! అత్యుత్తమ గుణాలు కలవాడా! నరసింహదేవా! మంచి స్వభావం లేకుండా ఎన్నికార్యాలు చేసినా ఏంలాభం? సత్ప్రవర్తన లేకుండా ఆలయాలు తిరగడం వృధా. సంస్కారం నేర్పని చదువు, చాంచల్య మనసుతో చేసేశివపూజ కూడా వ్యర్థమే! శాంతినివ్వని యోగసాధన, మంచినిపెంచని మతం, మేలుకోరని వ్రతం, చైతన్యం కల్గించని ఆచారాలు, లోకరక్షణచేయని ధర్మం వల్ల ప్రయోజనం శూన్యం. ఓ స్వామీ! ఇంద్రియనిగ్రహం, శాంతి కల్గించని జపతపాలు, నీమీద భక్తి లేని జన్మ వ్యర్థమే కదా! ఏపని చేసినా సత్ఫలితాన్నివ్వాలనే ఆకాంక్ష ఈ పద్యంలో ద్యోతకమవుతుంది.
3. కవిశ్రేష్ఠుల మాటల శక్తియై వెల్గొందే విశ్వనాథేశ్వరా! వ్యక్తిని ఆరాధించడమో, ద్వేషించడమో తప్ప వేరే మార్గమేలేదా? అనురాగం, విరోధం అనే పోరాటాల ఆరాటాలు తొలగిపోయే కాలమెప్పుడు వస్తుందో? ప్రజలమధ్య ఐకమత్యం ఎలా వస్తుందోగదా! సామాజిక సమైక్యతా భావన కవికాంక్షించాడు.
4. అఖిలాండనాయకా! లక్ష్మీవల్లభా! వేంకటపతీ! ఇతరుల్లో ఎల్లప్పుడూ తప్పులు వెతికేవానికి మంచిని గ్రహించేశక్తి సన్నగిల్లుతుంది. అందరిలోనూ మంచిని దర్శించే చూపులు, అందరితో మంచిగా మాట్లాడే నాలుక నాకివ్వుతండ్రీ! వ్యక్తిత్వ వికాససూత్రం ఇందులో దాగిఉంది. సకారాత్మక ఆలోచన, సమ్యక్‌దృష్టి అనే శ్రేష్ఠ భావన విద్యార్థులకు అత్యంతావశ్యకం.



5. బాకవరంలో వెలసిన ఆంజనేయా! దుర్మార్గుల్ని అంతమొందించేవాడా! శ్రేష్ఠజనావళికి ఆనందం కల్గించేవాడా! కులభేదాలు ప్రజలమధ్య విద్వేషాన్ని రగిలించి కీడు కల్గిస్తాయి. నాయకులు కులసంఘాలకు మద్ధతునిస్తూ ప్రజల్ని మోసగించడం మంచిదికాదు. మానవులంతా సమానమేననే విశ్వమానవసౌభ్రాతృత్వ దృక్పథాన్ని చాటుతుందీపద్యం.
6. దయాసముద్రుడా! తరిగొండ నృసింహదేవా! వివేకి అయినవాడు తనకు భగవంతుడు ప్రసాదించిన దానిలో –అనాధలకు నిరుపేదలకు కసరుకోక ఆప్యాయతతో లాలిస్తూ అన్నంపెడతాడు. అలాంటి సహృదయుణ్ణి సంపదలకు అధిదేవత అయిన లక్ష్మి గుట్టుచప్పుడు కాకుండా వచ్చి వరిస్తుంది. దీనులకు చేసే అన్నదానానికి ఇంతటి ప్రాశస్త్యం ఉందని తాత్పర్యం.
7. చిత్తమా! పేదవారికి అన్నదానం, వస్త్రదానం అధికంగా చేయు. నీచమైన సుఖాలకోసం అబద్ధాలాడకు. అనవసరంగా ఎవరితోనూ వాదనకు దిగకు. మర్యాద, హద్దుమీరి ప్రవర్తించకు. అందరితో సఖ్యతతో మెలగు. ఈ సూత్రాలనే వేదాలుగా భావించు. వివేకులకు ఈ లక్షణాలే సంపదగా భాసిల్లుతాయి. ఇందులో సామాజిక జీవన విధానం ఎలా ఉండాలో చెబుతూ వ్యక్తిత్వనిర్మాణం బోధించబడింది.
8. నీతివాచస్పతివైన సురభిమల్లా! సిరిసంపదలు లేకున్నా శ్రేష్ఠునికి ప్రత్యేక లక్షణాలే సహజాలంకారాలు. శిరస్సుకు గురువుల్ని నమస్కరించే గుణం, చెవులకు శ్రేష్ఠశ్రవణం, నోటికి సత్యవాక్కునుపలికే లక్షణం బాహువులకు ఎదురులేని పరాక్రమం కల్గి ఉండడమనే గుణం, మనస్సుకు ఆకట్టుకునే మంచిలక్షణం, ఉన్నవారు ఐశ్వర్యం లేకున్నా ప్రకాశిస్తారు. మంచి లక్షణాలే సజ్జనులకు ఆభరణాలుగా భాసిల్లుతాయి.



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. కింది అంశాల గూర్చి మాట్లాడండి.

అ) సంస్కారం

ఆ) పత్రాలు

ఇ) ఆచారాలు

ఈ) దానగుణం

2. పాఠంలోని పద్యాల ఆధారంగా కింది వాక్యాలకు తగిన పద్యపాదం గుర్తించండి.

అ) ఎల్లప్పుడు ఇతరుల దోషాలను చూడటం.

ఆ) పేదవారికి ఆహారం, బట్టలు దానం చేయడం.

ఇ) సంపద రహస్యంగా వచ్చి చేరుతుంది.

ఈ) మర్యాదతో స్త్రీలను గౌరవించకపోతే మేలుజరగదు.

3. కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించండి.

అ) ఇల్లాలింటికి ..... రామేశ్వరా!

ఆ) సిరిలేకైన ..... వాచస్పతీ!

4. కింది పద్యాలను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

సత్యసూక్తి ఘటించు, ధీజడిమ మాన్చు

గౌరవమొసంగు, జనులకుఁగలుషమడచు

కీర్తిప్రకటించు, చిత్త విస్ఫూర్తి జేయు

సాధుసంగంబు సకలార్థ సాధనుబు.

♦ **ప్రశ్నలు**

అ) సూక్తి అంటే ఏమిటి?

ఆ) కీర్తి ఎలా వస్తుంది?

ఇ) సాధుసంగంబు వల్ల ఏం జరుగుతుంది?

ఈ) ఈ పద్యానికి శీర్షిక సూచించండి.



II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) 'మంచి లక్షణాలే నిజమైన ఆభరణాలు' దీనిని సమర్థిస్తూ మీ సొంతమాటల్లో రాయండి.

ఆ) వివేకిలక్షణాలేవి?

ఇ) లక్ష్మి ఎవరి వద్దకు వచ్చి చేరుతుంది?

ఈ) రాగవిద్వేషాల ఆరాటపోరాటాలు పోవాలని కవి కాంక్షించాడు గదా! దీనిపై మీ అభిప్రాయమేమిటి?

ఉ) "పట్టుగనీశ్వరుడు..." అనే పద్యభావాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) సజ్జన లక్షణాలు పేర్కొనండి.

ఆ) నైతిక విలువలంటే ఏమిటి? మీరు కొంత మందిలో గమనించిన విలువల్ని పేర్కొనండి.

3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా రాయండి.

రాగద్వేషాల ఆరాటపోరాటాల్లో కొట్టుమిట్టాడే ప్రజల్లో ఐకమత్యం రావాలని కవికాంక్షించాడు కదా! ప్రజలందరినీ ఏకతాటిపైకి రమ్మని తెలుపుతూ ఒక కరపత్రం రాయండి.

(లేదా)

పాఠంలోని పద్యాల ఆధారంగా సూక్తులు / నీతివాక్యాలు / నినాదాలు రాయండి.

(లేదా)

పేదవారిని ఆప్యాయంగా లాలిస్తూ దానం చేయమన్నారు కదా! మీ పరిసరాల్లో ఎవరైనా దాతలుంటే వారిని ప్రశంసిస్తూ ఆభినందన పత్రం రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలకు అర్థాలు రాసి వాటితో సొంత వాక్యాలు రాయండి.

ఉదా॥ శమము = శాంతి

ప్రజలమధ్య శాంతి నెలకొన్నప్పుడే ఐకమత్యం పరిఢవిల్లుతుంది.

1) అనయము =

_____

2) బుధులు =

_____



3) మైత్రి =

_____

4) సౌజన్యం =

_____

ఆ) కింది పదాలకు పదపట్టిక ఆధారంగా వ్యుత్పత్తి అర్థాలు రాయండి.

1) దివ్యము 2) శివుడు 3) వాచస్పతి 4) శ్రియ:పతి

ఇ) కింది పదాలకు పర్యాయ పదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.

ఉదా ॥ గంగ – భాగీరథి, జాహ్నవి

భాగీరథి తీరంలో ఋషులు తపస్సు చేస్తున్నారు. పరమ పావనిగా జాహ్నవి పేరు గాంచింది.

1) శివుడు –

2) మైత్రి –

3) దయ –

4) గుడి –

ఈ) కింది వాక్యాలను గమనించండి. ఆయా వాక్యాల్లోని ప్రకృతి వికృతుల్ని గుర్తించి పట్టికగా కూర్చండి.

1) భారతీయ ధర్మం సర్వోత్కృష్టమైంది. బుద్ధుడు కూడా ధర్మాన్ని బోధించాడు.

2) ఓ సామి! కుడివైపుగా వెళ్తే స్వామి వారి గుడివస్తుందా?

3) సిరులు కురిపించే లక్ష్మీదేవి శ్రీమంతుల్ని చేస్తుంది.

4) ఆలోచనలు స్థిరంగా ఉండాలి. తిరమైన బుద్ధి వివేకుల లక్షణం.

IV. భాషా కార్యకలాపాలు

- ----------

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది సందర్భాలలో పునరుక్తమయిన హల్లులను పరిశీలించండి. అవి వృత్యనుప్రాస అలంకారాలవునో కాదో చర్చించండి.

అ) నీ కరుణ్యాకటాక్ష వీక్షణములకై నిరీక్షించుయున్నారము.

ఆ) అడిగెదనని కడువడిఁజను
నడిగినఁదను మగుడనుడుగడని నడయుడుగున్.

ఇ) మకరంద బిందు బృంద రసస్యందన మందరమగు మాతృభాషయే.



ఈ) చూరుకు, తేరుకు, యేరుకు, నారకు, దారువును వాడు నరవరులిలలోన్.

ఉ) బాకవరాంజనేయ! ఖలభంజన! సాధుజనానురంజనా!

పరిచయం

విసర్గసంధి

1. సంస్కృత పదాల మధ్య విసర్గ మీద తరచు సంధి జరుగుతూంటుంది. అది వేర్వేరు రూపాలుగా ఉండటం గమనిద్దాం. కింది ఉదాహరణలు విడదీసి చూడండి.

అ) నమోనమః

ఆ) మనోహరం

ఇ) పయోనిధి

ఈ) వచోనిచయం

- పై పదాలను విడదీస్తే – ఈ కింద విధమైన మార్పులు జరిగాయా?

అ) నమః + నమః

ఆ) మనః + హరం

ఇ) పయః + నిధి

ఈ) వచః + నిచయం

} అకారాంత పదాల మీదున్న విసర్గ లోపించి, అకారం 'ఓ'కారంగా మారింది.

2. కింది పదాలు కలిపి, మార్పును గమనించండి.

అ) మనః + శాంతి

ఆ) చతుః + షష్టి

ఇ) నభః + సుమం

- పదాలను కలుపగా వరుసగా మనశ్శాంతి, చతుష్షష్టి, నభస్సుమం అనే రూపాలు ఏర్పడ్డాయి కదా! (విసర్గమీద శ, ష, స లు ద్విత్వాలుగా మారడం గమనించండి.)

3. కింది పదాలను విడదీయండి.

అ) ప్రాతఃకాలము

ఆ) తపఃఫలము

- 'స' కారం (స్) విసర్గరూపంగా ప్రయోగింపబడుతుంది. అందుకే నమస్కారము, శ్రేయస్కరము, వనస్పతి మొదలగు సందర్భాల్లో సంధిలేదు.)

4. కింది పదాలను కలిపి, మార్పును గమనించండి.

ఉదా॥ అంతః + ఆత్మ = అంతరాత్మ

అ) దుః + అభిమానం = _____

ఆ) చతుః + దిశలు = _____

ఇ) ఆశీః + వాదము = _____

ఈ) పునః + ఆగమనం = _____

ఉ) అంతః + మధనం = _____

అంతః, దుః, చతుః, ఆశీః, పునః మొదలైన పదాల విసర్గ రేఫ (ర్) గా మారడం గమనించండి.

5. కింది పదాలు విడదీయండి.

ఉదా॥ ధనుష్కోటి = ధనుః + కోటి (ధనుస్ + కోటి)

అ) నిష్ఫలము = _____ ( )

ఆ) దుష్కరము = _____ ( )

ఇన్, (ఇః), ఉన్ (ఉః)ల విసర్గకు క, ఖ, ప, ఫ లు కలిసినప్పుడు విసర్గ (స్) 'ష' కారంగా మారుతుంది.

6. కింది పదాలు విడదీయండి.

ఉదా॥ నిస్తేజము = నిః + తేజము

అ) దుశ్చేష్టితము = _____ + _____

ఆ) ధనుష్టంకారము = _____ + _____

ఇ) మనస్తాపము = _____ + _____

విసర్గకు.... చ, ఛ లు పరమైతే 'శ'
ట, ఠ లు పరమైతే 'ష'
త, థ లు పరమైతే 'స' వస్తుంది.

- పై ఉదాహరణలన్నీ పరిశీలించిన మీదట విసర్గ సంధి ఆరు విధాలుగ ఏర్పడుతున్నదని తెలుస్తున్నది.

i) అకారాంత పదాల విసర్గకు వర్గ ప్రథమ ద్వితీయాక్షరాలు (క, చ, ట, త, ప; ఖ, ఛ, ఠ, థ, ప), శ, ష, స లు గాక మిగతా అక్షరాలు కలిసినప్పుడు విసర్గలోపించి 'అ'కారం 'ఓ' కారంగా మారుతుంది.

ii) విసర్గకు శ, ష, స లు కలిసినప్పుడు శ, ష, స లు ద్విత్వాలుగా మారుతాయి.

iii) విసర్గమీద క, ఖ, ప, ఫ లు వస్తే, మార్పురాదు (సంధి ఏర్పడదు).

iv) అంతః, దుః, చతుః, ఆశీః, పునః మొదలైన పదాల విసర్గ రేఫ (రఁ) గా మారుతుంది.

v) ఇస్, ఉస్‌ల విసర్గకు క, ఖ; ప, ఫ లు కలిస్తే విసర్గ 'ష' కారంగా మారుతుంది.

vi) విసర్గకు, చ, ఛ లు పరమైతే 'శ' కారం; ట, ఠ లు పరమైతే 'ష' కారం; త, థ లు పరమైతే 'స' కారం వస్తాయి.

సూక్తి



6. నేనెరిగిన బూర్గుల

– పి.వి.నరసింహారావు

చదవండి – ఆలోచించి చెప్పండి.

సహనము, సత్యము, శాంతగంభీరము,
ఆత్మవిశ్వాసము, నహరహరము
సాధన, దక్షత, సాధుభాషణమును,
సద్వివేచనమును, సద్గమనము,
దానము, ధైర్యము, త్యాగము, సునిశిత
బుద్ధి, మేల్గాంచుట, పుణ్యగుణము,
కరుణ, క్షమ, పరోపకారబుద్ధియనెడి
యాలోచనారీతి లమరియుండు
మనుజులెపుడును మాన్యులు, మంగళస్వ
రూపులు, మహోన్నతులు, విరాడ్రూపశోభి
తులు, సుకీర్తికాంతవరపతులు, సుమతులు,
జగతి గతివిరచితులు, సజ్జనులెవారు.

ప్రశ్నలు:

1. పై పద్యం దేని గురించి చెబుతున్నది?
2. ఈ పద్యం ద్వారా గుర్తించిన లక్షణాలేవి?
3. మంచి లక్షణాలు కల్గిన వారినేమంటారు?
4. అలాంటి వారి గురించి ఎందుకు తెలుసుకోవాలి? వారితో ఎందుకు సాంగత్యం చేయాలి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

సమాజంలో కొద్దిమందే ప్రభావశక్తి సంపన్నులు ఉంటారు. వీరి సాంగత్యంపొందినా, వీరిగురించి తెలుసుకున్నా, స్ఫూర్తి కలుగుతుంది. మంచి మార్గంలో నడవడానికి అవకాశం కలుగుతుంది. ఇలా స్ఫూర్తిదాయకమైన వారిలో ఒకరు కీ॥శే॥బూర్గుల రామకృష్ణారావుగారు. వీరు హైదరాబాదు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసి, రాజనీతిజ్ఞుడుగా, బహుభాషావేత్తగా, పరిపాలనాదక్షుడి, పేరెన్నికగన్నవారు. వీరి గురించి మరొక మహోన్నతవ్యక్తి, బహుముఖప్రజ్ఞాశాలి కీ॥శే॥ పి.వి.నరసింహారావుగారు బూర్గుల వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేలా వ్యాసాన్ని రాసాడు. దాన్ని చదవడం ద్వారా స్ఫూర్తి పొందడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

పాఠ్యభాగ వివరాలు

అభినందన వ్యాసం : గొప్పవారి జీవితాన్ని, వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తూ ప్రశంసిస్తూ రాసిన వ్యాసమే అభినందన వ్యాసం.

పాఠ్యపరిచయం : ఈ వ్యాసాన్ని 1972 డిసెంబర్‌నెల ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక నుండి స్వీకరించనైనది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీతగీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరున్న "పదాలు-అర్థాలు" పట్టికలో వెతకండి. లేదా నిఘంటువును చూసి తెల్సుకోండి.

కవి పరిచయం



భారత ప్రధానిగా, బహుభాషావేత్తగా, భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరొందిన పి.వి. గారి పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. 1921 జూన్ 28న వరంగల్లు జిల్లా నర్సంపేట మండలంలోని లక్నేపల్లి గ్రామంలో జన్మించారు. కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలోని రుక్మిణమ్మ రంగారావులకు దత్త పుత్రుడైనాడు. స్వామి రామనంద తీర్థగారు పి.వి.గారికి గురువు. బూర్గులవారు గురుతుల్యులు.

అపరచాణక్యుడు : ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా హైద్రాబాద్ విముక్తి పోరాటంలో పాల్గొని విశ్వవిద్యాలయం నుండి బహిష్కరణకు గురైనాడు. 1938లో హైద్రాబాద్ రాష్ట్రకాంగ్రెస్‌లో చేరి రాజకీయ జీవితాన్ని ఆరంభించారు. ఆ తర్వాత అఖిలభారతకాంగ్రెస్‌పార్టీకి సేవలందించారు. కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం నుండి వరుసగా నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైనాడు. అనేక శాఖలకు మంత్రిగాపనిచేసి 1971-73 వరకు రాష్ట్రముఖ్యమంత్రిగాను, 1991-96వరకు భారత ప్రధానిగాను తన సేవలనందించారు. తన రాజకీయ చతురతతో భారత రాజకీయయవనికపై ఒక వెలుగు వెలిగిన రాజనీతిజ్ఞుడు.

సాహితీసేవ : తెలుగు భాషతో సహా సదిహేడు భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన బహుభాషావేత్త. తెలుగులో 'కాకతీయ' అనే పత్రికను నడిపించారు. హిందీలో ఈయనరాసిన "సహస్రఫణ్" అనే నవలకు కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఈయన ఆత్మకథగా ప్రసిద్ధికెక్కిన 'ఇన్‌సైడర్' అనేక భాషల్లో అనువదించబడింది. పన్‌లక్షత్‌కొన్‌ఘుతో' అనే మరాఠి పుస్తకాన్ని తెలుగులో అబల జీవితంగా అనువదించారు.



భారత ఆర్థిక సంస్కరణాపితామహుడు :

ఈయన రాష్ట్రముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భూసంస్కరణల చట్టాన్ని పట్టణ భూగరిష్ట పరిమితి చట్టాన్ని తెచ్చి సంస్కరణ వాదిగా పేరొందాడు. ఆ తర్వాత భారత ప్రధానిగా సంక్లిష్టస్థితిలోనున్న భారత ఆర్థికవ్యవస్థను సంస్కరణలతో పటిష్ట స్థితిని చేకూర్చి తన సంస్కరణ వాదాన్ని నిలుపుకున్నాడు.

నిరాడంబరజీవితం, నిజాయితీ, దేశభక్తి కల్గిన పి. వి. నరసింహారావు గారు జీవిత పర్యంతం నిండుకుండలా ఉండి స్థితప్రజ్ఞుడిగా వెలిగాడు.

ప్రతీ మానవునిలోనూ సాధారణంగా ఉన్నదాని కంటే ఘనంగా తనను గురించి చిత్రించుకొనే స్వభావం ఉంటూవుంటుంది. ఇందుకు భిన్నంగా ప్రవర్తించేవారు బహు అరుదుగా ఉంటారు. రకరకాల ఒడిదుడుకులను ఎదుర్కొన్ననూ, విపత్కర పరిస్థితులు సేనావాహినిలా చుట్టుముట్టిననూ చలించకపోవడం, మనస్థైర్యాన్ని, సమచిత్తాన్ని విడనాడక పోవడం గొప్పవారికే సాధ్యమౌతుంది. జయాపజయాలను సమానంగా స్వీకరించడం, మిత్రులుసైతం ద్రోహం తలపెట్టినా, ప్రత్యక్షులు దూషించినా "సరే! ఇవన్నీ ఆటలో భాగమేగా!" అని స్థితప్రజ్ఞతను ప్రదర్శించడం అందరికీ సాధ్యమౌతుందా? మరి ఇటువంటి వ్యక్తిత్వం కల్గిన వారు ఎవరు? వారి గురించి మరో స్థితప్రజ్ఞుడు కీ.శే॥పి.వి.నరసింహారావుగారు ఏం చెప్పారో పాఠం చదివి తెల్సుకోండి.

I

స్వర్గీయ డా.బూర్గుల రామకృష్ణారావు గారి 5వ వర్ధంతి సందర్భంలో వారిని గురించి వ్యాసమేదైనా యివ్వవలసిందిగా మిత్రులు కొందరు నన్ను కోరారు. డా.రామకృష్ణారావు గారి పేరు వినగానే గత స్మృతులెన్నో ముప్పిరిగొని భావోద్రేకంతో నా మనస్సు ఉక్కిరిబిక్కిరైపోతూ ఉంటుంది. నా భావాలన్నింటిని యీ వ్యాసంలో వివరించడం ఎలాగ? అవన్నీ వ్రాస్తే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. అందుకని రేఖా మాత్రంగా నా భావాలను యిక్కడ పొందుపరుస్తాను.

కీ.శే.డా.రామకృష్ణారావుగారిని గురించి చరిత్రకారులు ఏమి వ్రాస్తారో మనం తేలికగానే ఊహించుకోవచ్చు. "డాక్టరు రామకృష్ణారావుగారు ఫలాన తేదీన ఫలాన గ్రామంలో పుట్టారు. పూనాలోని ఫోర్గూసన్ కాలేజి నుండి ఫెర్షియన్ భాష ఐచ్ఛిక విషయంగా తీసుకొని పట్టభద్రులయ్యారు. పర్షియన్ ట్యూటరుగ కొంతకాలం పనిచేశారు. తరువాత న్యాయవాద పట్టా పొంది ఫలానా సంవత్సరంలో న్యాయవాదిగా నమోదు అయ్యారు. ఇన్ని సంవత్సరాలు న్యాయవాదిగా పనిచేసారు. ఇన్ని ప్రజా ఉద్యమాలలో ఇన్నిసార్లు సత్యాగ్రహం జరిపి జైలుకు వెళ్ళారు. హైదరాబాదు స్టేటు కాంగ్రెసులో వారొక ప్రముఖ నాయకులు మంత్రిగాను, ముఖ్యమంత్రిగాను, రెండు రాష్ట్రాలకు గవర్నరుగాను పని చేశారు. కొంతకాలం



రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. అనేక కమిటీలకు, కమీషన్లకు అధ్యక్షులుగా ఉన్నారు. గుండెపోటు వలన 1967 సెప్టెంబరు 14వ తేదీన కన్నుమూశారు" మొదలయిన అంశాలు వ్రాస్తారు. చారిత్రికంగాను, కాలక్రమ ప్రకారంగాను అది అంతా నిజమే. కాని, అంతమాత్రం చేత డా.రామకృష్ణారావుగారి అసలు వ్యక్తిత్వం మనకు అవగతం కాదు.

ప్రతి మానవునిలోను సాధారణంగా ఉన్నదానికంటే ఘనంగా తనను గురించి చిత్రించుకొనే స్వభావం ఉంటూ ఉంటుంది. దానిని గురించి వాని అంతరాత్మ బోధిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ తాను చిత్రించుకొన్న ఆ కృత్రిమ ఘనతను ఇతరుల ముందు ప్రదర్శించి ఇతరులకంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంది. తత్ఫలితంగా ఒకరినొకరు కించపరుచుకొంటూ తమ శక్తి సామర్థ్యాలను, అమూల్య సమయాన్ని వ్యర్థపరుచుకొంటూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. కాని యిందుకు డా.రామకృష్ణారావుగారు మాత్రం అరుదుగా కనవచ్చే ఒక చక్కని మినహాయింపు అని చెప్పవచ్చు. వారెల్లప్పుడు అన్ని విషయాలు ఆఖరికి తమలోని లోపాలను కూడా ఉన్నవి ఉన్నట్లుగా చెపుతూ వుండేవారు. ఎంత ఉంటే అంతే. వీసం ఎత్తు ఎక్కువాలేదు, వీసం ఎత్తు తక్కువా లేదు.

ఆలోచించండి-చెప్పండి

- *భావోద్వేగంతో ఉక్కిరి బిక్కిరికవటమంటే ఏమిటి?*
- *వ్యక్తిత్వం అవగతం కావటమంటే ఏమిటి? మీ వ్యక్తిత్వం గురించి మాట్లాడండి.*
- *అంతరాత్మ బోధించడం అంటే ఏమిటి? మీకు ఎప్పుడైనా ఇలాంటి అనుభవం ఎదురైందా? ఎప్పుడు?*
- *ఇతరులకంటే తాను అధికుడనని-పించుకోవాలనే ఉబలాటం పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. ఈ వాక్యం ద్వారా మీరేమి గ్రహించారు?*
- *సత్యదూరమైన విషయం అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?*

వారి పొట్టితనం కొంతవరకు వారిని మరుగు పరుస్తూ ఉండేదని కొంతమంది అంటారు. కాని అంతకంటే సత్యదూరమైన విషయం మరొకటి లేదని నా భావన. నిజానికి ఒడ్డూ పొడుగూ ఉన్న చాలామందికంటే కూడ వారు అతి చక్కగా గుర్తింపబడుతూ ఉండేవారు. తమ వామన రూపాన్ని గురించి స్నేహపూరితమైన ఎన్నో పరిహాసాలను వారే స్వయంగా చక్కటి భావనిర్లిప్తతతో చెప్తూ ఉండేవారు. లోగడ మన దేశంలో అమెరికా రాయబారిగా పనిచేసిన ప్రొఫెసర్ గాల్‌బ్రైత్ అసాధారణ పొడగరితనం కంటె డా.రామకృష్ణారావు గారి పొట్టితనం వారిని ఏమాత్రం మరుగుపరచలేదు. పూర్వపు హైదరాబాదు సంస్థాన ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా.రామకృష్ణారావు గారు బేగంపేట విమానాశ్రయంలో అరేబియారాజు ఇబన్‌సౌఉద్‌ను పుష్పమాలాలంకృతునిగా చేసిన సందర్భంగా అతిథి ఆతిథేయులిర్వురు పరస్పర సౌజన్య సౌహార్ద్రాలతో ఎటువంటి ఫీటు చేయవలసి వచ్చిందో ఆ వినోదకర దృశ్యం యిప్పటికీ చాలా మందికి జ్ఞాపకముండే ఉంటుంది. అలాగే ఒక విందు సందర్భంలో ప్రొ.గాల్‌బ్రైత్, డా.రామకృష్ణారావు గార్ల ఫొటో తియ్యడం ఫొటోగ్రాఫర్ల కళానైపుణ్యానికొక గీటురాయి అయి ఆ సందర్భానికొక చక్కని వినోదాన్ని చేకూర్చింది.

II

అవసరమైతే విరాట్ రూపం....

వారు గుర్తించబడడానికి, గుర్తించబడకపోవడానికి వారి శరీరాకృతి కారణం కానేలేదు. అంతకన్న గహనమైన దేదో వారి వ్యక్తిత్వంలో వుండి ఉండాలి. ఏదో నిత్య నైమిత్తికంగా (**routine**) వారు గుర్తించబడడంకాని, గుర్తించబడకపోవడం గాని జరుగలేదు. అవసరం వచ్చినప్పుడు వారు అలనాటి వామనమూర్తివలె ఇంతింతై ముల్లోకాలు ఆక్రమించి తమ



విరాట్ రూపాన్ని ప్రదర్శించేవారు. పని పూర్తి అయిన వెంటనే తిరిగి తమ వామన రూపంలో ఇమిడిపోతూ ఉండేవారు, మరొక అవసరం వచ్చేవరకు. అందుచేత వారు కావాలని నిరాడంబరంగా తెరమరుగున ఉండడం జరుగలేదు. అసలు రహస్యం ఏమిటంటే చిన్న మూర్తిలో యిమిడి ఉన్న వారి బహుముఖ ప్రతిభాయుత మూర్తిమత్వం అవసరం వచ్చినప్పుడు తమ మహోన్నత రూపంలో ప్రదర్శితం కావడం, అవసరం తీరగానే తిరిగి స్వరూపంలో యిమిడిపోవడం అనేది వారి స్వభావంలోనే ఉంది. విచిత్రం ఏమిటంటే డా.రామకృష్ణారావుగారి వ్యక్తిత్వపు మహోన్నత శిఖరాలు దాని అగాధపు లోతులలోనే పరిలక్షితమౌతూ ఉండేవి.

న్యాయవాదిగా

న్యాయవాదిగా వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలుండేవి. వారి ప్రాక్టీసు **roaring practice** అని చెప్పడానికి వీలులేదు. అలా అని వారికి కేసుల కొరత ఎప్పుడూ ఉండేదికాదు. కాని వాటిలో ఎక్కువ కేసులు రాజకీయాలకు సంబంధించినట్టివి. ఫీజు లేనట్టివీను. ప్రజాహిత జీవితం కొందరు న్యాయవాదులకు ఫైలు పెరగడానికి, ధన సంపాదనకు ఉపకరిస్తే, డా.రామకృష్ణారావుగారి విషయంలో మాత్రం అది తారుమారైంది. వారి వద్దకు వచ్చే క్లయింట్లలో చాలామందికి ఒక రకమైన మిశ్రిత భావం ఉంటూ ఉండేది. డా.రామకృష్ణారావుగారి శక్తి సామర్థ్యాలు, ప్రజ్ఞా ప్రాభవాలలో సంపూర్ణ విశ్వాసానికి తోడు వారు రాజకీయ వ్యగ్రతవలన కేసులమీద ఎక్కువ ధ్యానముంచలేరేమో అన్న అనుమానంకూడా ఆ క్లయింట్ల మనస్సులలో ఉంటూ ఉండేది. నిజానికి రామకృష్ణారావుగారికి కేసును క్షుణ్ణంగా చదివి తయారవడానికి అవకాశమే ఉండేదికాదు. కేసు చేపట్టేటప్పుడే వారు విషయమంతా శ్రద్ధగా విని ఆ కేసు తాలూకు ఫైలు యొక్క వెనుక అస్పష్టమైన నోటులను కొన్నిరేఖామాత్రంగా వ్రాసిపెట్టుకొనే వారు అంతే. నిజానికి వాటిని కేసుకు తయారీ అనడానికి వీలు లేదు. కాని కోర్టులో ఆ రేఖామాత్రపు నోట్సే డా.రామకృష్ణారావుగారి జాజ్వల్యమానమైన ప్రతిభా విశేషతతో ఎదుటి న్యాయవాదుల వాదనా ఘాతములకు దుర్భేద్యమైన కంచు గోడలుగా నిలపడం నేను స్వయంగా చూచాను. నాయవాద వృత్తిలో నిష్ణాతమైన సునిశిత మేధా సంపత్తిని వారు ప్రదర్శిస్తున్నారా అన్నట్లుగా ఉండేది వారి అనన్యమైన వాదనా పటిమ.

ప్రోత్సాహం

సీనియర్ న్యాయవాదిగా వారిదొక ప్రత్యేక తరహా. నేను వారివద్ద అందరికంటె జూనియర్‌గా ఉండేవాడిని. కాని తల్లికి తన కడగొట్టు బిడ్డపై ఎటువంటి విశేషమమకారం ఉంటుందో అటువంటి మమకారమే డా.రామకృష్ణారావుగారికి నామీద ఉంటూ ఉండేది. చొరవతోను, నిరాఘాటంగాను, నేను వారి ఆఫీసును ఒక న్యాయవాద కాఫీ పానశాలగా పరిగణించి నాకు కావలసిన కేసులను – ముఖ్యంగా జూనియర్లకు కొరుకుడుపడని చిక్కు కేసులను – స్వయంగా ఏరుకొని చదువుతూ ఉండేవాడిని. నా యీ చొరవ వారి సీనియర్ గుమాస్తాకు కోపకారణమై ఆయన నామీద కారాలు మిరియాలు నూరుచూ ఉండేవాడు. ఒకసారి డా.రామకృష్ణారావుగారు దానిని గమనించి నా చేష్టపై తమ ఆమోద ముద్ర వెయ్యడం, అంతటితో కారాల మిరియాల ప్రకరణం ముగియడం జరిగింది. అప్పటినుండి మా యిరువురి మధ్య సీనియర్, జూనియర్ సంబంధంపోయి నిష్కాపట్యంతో కూడిన సమాన స్థాయి చర్చా సంబంధం ప్రారంభమైంది. నేను అంచనా వేసుకొన్న దానికంటే ఎక్కువగానే నాలో శక్తి సామర్థ్యాలున్నాయని, స్వయంగా గుర్తించగలిగేలా నన్ను రూపొందించిన డా.రామకృష్ణారావుగారి విశేష నైపుణ్యానికి నేను ఎల్లపుడూ జోహారులర్పిస్తూనే ఉంటాను. వారు నాలో పూరించిన ఆ ఆత్మవిశ్వాసమే నాకు శాసన సభలలోను, యితర చోట్లను కూడ శ్రీరామరక్షగా ఉంటూ వస్తూంది. ప్రాతఃస్మరణీయులైన నా సీనియర్ రామకృష్ణారావుగారి విశిష్ట వ్యక్తిత్వమట్టిది.



రాజకీయాలలో వారి సమ్యక్ దృష్టి కోణం సంకుచిత సైద్ధాంతిక అరలకు తావివ్వలేదు. వారు పుట్టింది జాగీర్‌దారీ కుటుంబంలో అయినప్పటికి వారు పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో తరతరాల నుండీ వస్తూఉన్న జాగీర్‌దారీ వ్యవస్థను రూపుమాపడానికి వెనుకాడలేదు. వారి స్నేహ కోటిలో పెద్ద పెద్ద భూస్వాములు చాలామంది ఉండేవారు. అయినప్పటికినీ వారు పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో దున్నేవానికి భూమి హక్కు నిచ్చే కౌలుదారీ చట్టాన్ని తయారుచేసి, దేశంలో సామ్యవాద వ్యవస్థకు మార్గదర్శకులైనారు. ఆ చట్టాన్ని అమలు పరచడానికి వారు ఎంపిక చేసిన జిల్లాల్లో ఎక్కువగా నష్టపోయిన భూఖామందులు వారి బంధువులూ, రాజకీయ సహచరులే.

ఆలోచించండి-చెప్పండి

- *ఎవరైనా గుర్తించబడడానికి శరీరాకృతి కారణం కాదని తెల్సుకొన్నారు కదా! దీన్ని మీరెలా సమర్థిస్తారు?*
- *అనన్యమైన వాదనా పటిమ అంటే ఏమిటి? ఇది ఎవరికి అవసరం? ఎందుకు?*
- *సునిశిత మేధాసంపత్తి అంటే ఏమిటి? దీనికి కొన్ని ఉదాహరణలు తెల్పండి.*
- *"కొరుకుడుపడకపోవడం" అంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?*
- *"దున్నేవారికేభూమి" అనే కౌలుదారీ చట్టాన్ని ఎవరికి మేలు జరగాలని రూపొందించి ఉంటారు? ఎందుకు?*

పూర్వపు హైదరాబాద్ సంస్థాన విచ్ఛిత్తి తన రాజకీయ ప్రాబల్యానికి స్వస్తివాచకం పలుకుతుందని వారికి ముందే తెలుసు. అయినప్పటికీ తనకు నష్టం ఇతరులకు మేలు చేకూర్చే నిర్ణయాలు తీసుకొంటూ తన రాజకీయ జీవితాన్నంతా ఆత్మ పరిత్యాగానికీ, చివరకు సక్రియ రాజకీయాలనుండి తన నిష్క్రమణకు దారితీసే పరిస్థితులకు వీరివలె అంకితం చేసుకొనే రాజనీతి విశారదులు బహు అరుదు. డా.రామకృష్ణారావుగారు ఏ నిర్ణయం తీసుకొన్నా దానిని అన్ని విధాలైన జాగ్రత్తలతోను, మంచి వ్యవహార దక్షతతోను తీసుకొనేవారు. ఒకసారి నిర్ణయం తీసుకొన్నారంటే ఆరునూరైనా దానిమీద స్థిరంగా నిల్చేవారు. ఇదీ డా.రామకృష్ణారావుగారి సంక్షిప్త రాజకీయ చరిత్ర.

III

సౌజన్యానికి మారుపేరు :

వారి విశిష్ట వ్యక్తిత్వానికి సంబంధించిన మరో ముఖ్యాంశం ఉంది. గత తరంలోని అన్ని సుగుణాల మూర్తిమత్వమే శ్రీరామ కృష్ణారావుగారు. శరాఫత్ అంటే సౌజన్యానికి మారుపేరే వారు మతదురాభిమానాన్ని పెంపొందిస్తూ రాజ్యమేలుతున్న నాటి నిజాంకు బద్ధ వ్యతిరేకి అయినప్పటికినీ రాష్ట్రంలోని ముసల్మానులందరికీ వారు పరమమిత్రులు, ఆప్తులూను! అతి నిరాడంబరముగా వారు మతాతీతస్థితిని పాటించేవారు. వారి డ్రాయింగు రూం ఒక సంస్కృతీ ప్రదర్శనశాలలా ఉండేది. నాటి హైదరాబాద్ ప్రభుత్వ పెద్దలు, కుచ్చుటోపీల మౌల్వీలు, గడ్డాల ముల్లాలు, తలపాగాల పండితులు, మహామహోపాధ్యాయులు, గాంధీ టోపీల వారు, ఖద్దరుధారులు, ఆధునాతన టెరిలిన్ యువకులు – ఒకరేమిటి, అన్ని రకాలవారు, వారిని ఆహ్వానించడానికి అక్కడ హాజరు అయేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే డా.రామకృష్ణారావుగారు మూడు విభిన్నతరాల చివరి వారధిలా కన్పించేవారు. ఇంతటి విశాల వ్యక్తిత్వంతో వారు ఆనాటి ప్రజాజీవితాన్ని తీర్చిదిద్దారు.

నాటి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో శాసనసభా నాయకులుగా వారు సునిశిత మేధ, పరిమార్జిత భాష, వ్యవహార దక్షతలను మేళవించి ఏర్పరచిన ఉన్నత ప్రమాణాలను, నేటికి – ముఖ్యంగా యీ రోజులలో – ఎంతో గౌరవంతో



చాలామంది స్మరించుకొంటూ ఉంటారు. అవసరమైనపుడు వారు ప్రత్యర్థులను చీల్చి చెండాడేవారు. కాని అలా చేయడంలో ప్రత్యర్థుల నుండి రక్తపు బొట్టుమాట అలా ఉంచి, ఒక్క కన్నీరు బొట్టు పడడంగాని, వారి హృదయాలకు రవ్వంత నొప్పి తగలడంగాని జరిగేదికాదు. పార్లమెంటేరియన్‌గా డా.రామకృష్ణారావుగారి అద్వితీయ కళాకౌశలమట్టిది.

బహుభాషావేత్త :

వారు చాలా ప్రతిభావంతులైన భాషావేత్తలనే విషయం అందరికీ తెలిసినదే. వారు చదువుకున్న చాలా భాషలు వాటియందలి అభిరుచులచే ప్రయివేటుగా చదువుకొన్నవే. ముఖ్యమంత్రిగా ఉంటున్న రోజులలో డా.రామకృష్ణారావుగారు ప్రతిరోజూ అర్ధరాత్రివరకు ఆఫీసుఫైళ్ళు చూచుకొని, ఆ తర్వాత నమ్మశక్యంగాని ఉత్సాహంతో సంస్కృత ప్రాచీన కావ్యాలు చదవడంలో ఎలా మునిగి పోయేవారో నాకిప్పటికీ స్పష్టంగా జ్ఞాపకం ఉంది. బహుముఖ ప్రతిభావంతులైనప్పటికీ, డా.రామకృష్ణారావుగారు ప్రధానంగా సాహితీ జగత్తుకు చెందినవారని నా నమ్మకం. ఇది చాలవింతగానే తోచవచ్చు. ఎందుకంటే వారి సాహిత్య వ్యాసంగం జరుగవలసినంత ఎక్కువగా జరుగలేదు.

బహుముఖ ప్రజ్ఞతో వచ్చిన చిక్కే ఇది. డా.రామకృష్ణారావుగారు ముట్టని, పెంపొందించని క్షేత్రం ఏదీ లేదంటే అందులో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. కాని ఏం లాభం? ఏ సాహిత్య క్షేత్రానికైతే వారి సునిశిత మేధాసంపత్తి ఎక్కువ అనుకూలంగా ఉండేదో, ఆ సాహిత్య క్షేత్రంలో చెప్పుకోదగ్గ రచనలు చేయడానికే వారికి అవకాశం కలుగలేదు. రాజకీయవేత్తగా కూడ వారు తమ కాలంనాటి అంటే దేశచరిత్రలో చాల ప్రధానమైన, ఉత్తేజకరమైన దశాబ్దాలకు సంబంధించిన స్మృతులను గ్రంథస్థం చేసి ఉండవలసింది. నాబోటి హితైషులెంత చెప్పినప్పటికీ వారా పనులు చేయలేకపోయారు. ఆవిధంగా వారు తమ జీవిత కాలంలో ఎంతో విలువైన పనులు చేసినప్పటికీ, చేయకుండా వదిలివేసింది కూడా అంతకన్న ఎక్కువ విలువైనదే అని నా అభిప్రాయం. ఎందుకంటే ఆ పనులు చేయడానికి ఇతరులెవరికంటె కూడ వారే మిక్కిలి సమర్థులు ఇందుకు నేనూ, నాలాగే ఇతరులు చాలామంది కూడా ఎప్పుడూ బాధపడుతూనే ఉన్నాం.

వారి ఔదార్యం, ఉపకారబుద్ధి ఎంతవరకు ఉండేదంటే, ఒక్కొక్కపుడది ఒక దోషంగా పరిణమించేది. అసాధ్యమైన కోరికలు కోరినప్పుడు కూడ వారు నెమ్మదిగా నచ్చచెప్తూ ఓపికగా చాలసేపు కూర్చొనేవారు. అప్పుడు వారి స్థానంలో మరొకరెవరైనా ఉండిఉంటే ఒక్క చీదరింపుతో దానిని వెంటనే పరిష్కరించి ఉండేవారు. కాని డా.రామకృష్ణారావుగారి ఔదార్యం అలా చేయనిచ్చేది కాదు. వారి ఉదార ప్రవృత్తి వల్ల న్యాయముగా ఎక్కువ ధ్యానముంచవలసిన పనులకంటే, శక్తిని, సమయాన్ని వ్యర్థపరిచే పనులకు అప్పుడప్పుడు వారు ప్రాధాన్యమివ్వడం జరుగుచుండేది. ఏమైతేనేమి? వారావిధంగా మలచబడ్డారు. అది అంతే.

ఉపకారశీలి

డా.రామకృష్ణారావుగారిది పెద్ద కుటుంబం. ఆ కుటుంబానికి వారిక ఆత్మీయులైన తండ్రి. ఆ కుటుంబానికే కాదు, ప్రతిచోటా ఆత్మీయుడైన తండ్రిగానే ఉంటూ ఉండేవారు. వారు ఎక్కడైనా బయలుదేరితే దారిలో వారిని ఎవరైనా ఎక్కడైనా ఆపి కష్టసుఖాలు చెప్పుకోవచ్చు. అందుచేత వారు ప్రతిదానికి ఆలస్యంగా రావడానికి పేరుబడ్డారు. అయినప్పటికీ మిత్రులు, సహచరులు, ప్రజలుకూడ ఎంతో ప్రేమతోను, ఓర్మితోను, గంటల తరబడి వేచిఉంటూ ఉండడం, వారు రాగానే "సోదర సోదరీమణులారా; నేను అలవాటు ప్రకారం నేడు కూడ ఆలస్యంగానే వచ్చాను" అంటూ ఉండడం పరిపాటి అయిపోయింది.



ఆలోచించండి-చెప్పండి

- ప్రత్యర్థులను చీల్చిచెండాడమంటే ఏమిటి? దీన్ని ఏఏ సందర్భాలలో వాడతారు?
- "పార్లమెంటేరియన్‌గా బూర్గులగారు అద్వితీయ కళాకౌశలం కల్గినవారూ" ఈ వాక్యంద్వారా మీకేమి అర్థమైంది?
- గొప్పవారు తమ జీవితానుభవాలను గ్రంథస్థంఎందుకు చేయాలి?
- 'మీరు వెచ్చించే సమయం దేనికి ఎక్కువగా ఉంటోంది? మీకుపయోగపడేవాటికా? లేక ఇతరపనులకా?
- 'రామకృష్ణారావుగారిని పి.వి.గారే ప్రాతఃస్మరణీయులు అని పేర్కొన్నారు కదా! నేటి రాజకీయ నాయకులు కూడా రామకృష్ణారావువలె గొప్ప పేరు సంపాదించుకోవాలంటే వీరు ఎలా ఉండాలి? ఏమేం చేయాలి?

వారి సామాజిక యాత్ర ఎప్పుడూ సాఫీగా జరుగలేదు. రకరకాలైన ఒడుదుడుకులను వారు ఎదుర్కొనవలసివచ్చేది. చాలా సందర్భాలలో విపత్కర పరిస్థితులు సేనావాహినిలా వచ్చి చుట్టుముట్టేవి. అయినప్పటికీ వారు చలించేవారుకాదు. మనస్థైర్యాన్ని సమచిత్తతను వారు ఎన్నడూ విడనాడేవారు కాదు. విజయాలు లభించినప్పుడు సంతోషంతో ఉప్పొంగనూ లేదు, కష్టాలు సంభవించినప్పుడు అధైర్యంతో క్రుంగిపోనూ లేదు. స్నేహితులు ద్రోహం తలపెట్టినప్పుడు కాని, ప్రత్యర్థులు దూషించినప్పుడుగాని వారనేదల్లా ఒకటే – "సరే – అవన్నీ ఆటలో ఉండేవేగా" అని.

డా.రామకృష్ణారావుగారిని గురించి ఎంతైనా వ్రాయవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు పూర్ణపురుషులు.



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. కింది అంశం గురించి మాట్లాడండి.

ఇతరుల కంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట ప్రతినిత్యం ఉంటూనే ఉంటుంది. దీని గురించి మీ అభిప్రాయాలను తెలపండి.

2. కింది విషయాలు పాఠంలో ఏయే పేరాల్లో ఉన్నాయి.

వాటికి సంబంధించిన అంశాలను పట్టికలో రాయండి.

వ్యక్తిత్వం	పేరా సంఖ్య	సంబంధించిన అంశాలు
మహోన్నత వ్యక్తిత్వం		
విశిష్ట వ్యక్తిత్వం		
విశాల వ్యక్తిత్వం		

3. పాఠం మొత్తాన్ని చదవండి పాఠంలో ఉన్న జాతీయాలను గుర్తించి రాయండి.

4. కింది గద్యాన్ని చదవండి.

క్లిష్ట పరిస్థితుల్లో రాజ్యాధికారం చేపట్టిన రుద్రమ నిరంతరం యుద్ధాల్లో నిమగ్నమైనా, పరిపాలనా నిర్వహణలో మంచి సమర్థురాలుగా పేరొందింది. స్త్రీలు రాజ్యాధికారం చేపట్టడం అరుదైన ఆ కాలంలో రుద్రమాంబ తన తండ్రి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయక వీరనారిగా చరిత్రలో నిలిచింది. స్త్రీ అయినప్పటికి పురుషవేషం, పురుషనామం ధరించి సమకాలీన రాజులందరికంటే మిన్నగా రాజ్యాన్ని పరిపాలించి సాహసవంతమైన జీవితాన్ని గడిపింది. గ్రామాలను దానం చేసి ఆ ఆదాయంతో పాఠశాలలు, విద్యార్థులకు ఉచిత వసతి గృహాలు నెలకొల్పింది. ఆరోగ్యశాలలు, ప్రసూతిశాలలు ఏర్పాటు చేసింది. ఒక విద్యాపీఠం స్థాపించి అందులో వేదాలను, సాహిత్యాన్ని, ఆగమవ్యాఖ్యానాలను బోధింపచేసేది. పాఠశాలల్లో ఉపాధ్యాయులను, గ్రామాల్లో కరణాలను నియమించి వారికి వస్తువాహనాలను, ధాన్యాన్ని సమకూర్చేది. మార్కోపోలో అనే విదేశీ యాత్రికుడు ఈమె పరిపాలనా దక్షత, సాహిత్యసేవ, శిల్పకళలు, మహదైశ్వర్యం గురించి ప్రశంసిస్తూ తన డైరీలో రాసుకున్నాడు. అదీ రుద్రమదేవి ఘనత.



♦. **కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) రుద్రమాంబపై ఆమె తండ్రి ఉంచిన నమ్మకమేమి?

ఆ) రుద్రమాంబ చేసిన సత్కార్యాలేవి?

ఇ) మార్కోపోలో ఏయే అంశాల్లో రుద్రమదేవిని పొగిడాడు?

ఈ) రుద్రమదేవి సమర్థత యేమి?

ఉ) ఈ గద్యం ద్వారా రుద్రమదేవి వ్యక్తిత్వాన్ని ఒక వాక్యంలో రాయండి.

5. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) బూర్గుల వారు మతాతీతవ్యక్తులు – అని ఎలా చెప్పగలరు?

ఆ) బూర్గుల వారి గురించి చరిత్రకారులు ఏయే విషయాలు పొందుపరచి ఉంటారని చెప్పారు?

ఇ) బూర్గులవారి వాదనాపటిమ గురించి తెల్పండి.

ఈ) పాఠ్యాంశరచయిత పి.వి.నరసింహారావు గారి గొప్పతనం గురించి తెలుపండి.

ఉ) రామకృష్ణారావు గారి విశిష్ట వ్యక్తిత్వం గురించి పి.వి.గారు ఏమని తెల్పారు?

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి 4, 5, వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) బూర్గుల – పి.వి.గార్ల సంబంధం గురుశిష్య సంబంధం లాంటిది. దీన్ని సమర్థిస్తూ రాయండి.

ఆ) 'సరే–అవన్నీ ఆటలో ఉండేవేగా' అని బూర్గులవారు అనేవారు కదా! ఏ సందర్భంలో ఎందుకనేవారో దానికిగల కారణాలను రాయండి.

ఇ) బూర్గులగారిని ప్రాత:స్మరణీయులని పి.వి.నరసింహారావుగారు పేర్కొనడాన్ని సమర్థిస్తూ రాయండి.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) బూర్గుల వ్యక్తిత్వాన్ని, మహోన్నతలక్షణాల గురించి సొంతమాటల్లో రాయండి.

ఆ) ఈ పాఠం ఆధారంగా "గొప్పవారి సాంగత్యం వల్ల కలిగేస్ఫూర్తి గొప్పగాఉంటుంది" అనే అంశం గురించి సమర్థిస్తూ రాయండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) పాఠంలోని పదజాలం, విశిష్టలక్షణాల ఆధారంగా ఒక కవిత రాయండి.

ఆ) ఈ పాఠం ఓ అభినందన పత్రంగా ఉంది కదూ! దీన్ని ఆధారంగా మీకు నచ్చిన ఉపాధ్యాయుడిని ప్రశంసిస్తూ సన్మాన పత్రాన్ని రాయండి. ప్రదర్శించండి.



III. భాషాంశాలు

పదజాలం

1. కింది జాతీయాలను మీ సొంత వాక్యాలలో ప్రయోగించండి.

అ) శ్రీరామరక్ష ఆ) గీటురాయి ఇ) రూపుమాపడం

ఈ) కారాలుమిరియాలునూరడం ఉ) స్వస్తివాచకం

2. కింది 'వికృతి' పదాలకు పాఠంలో ఉన్న 'ప్రకృతి' పదాలను వెతికి రాయండి.

అ) దవ్వు ఆ) గారవం ఇ) పగ్గె / పగ్గియ

ఈ) దోసం ఉ) రాతిరి ఊ) బాస

3. ప్రతి వృత్తికి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయని పాఠం ద్వారా తెలుసుకున్నారు కదా! మీకు తెలిసిన కొన్ని వృత్తులు, వాటికున్న ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన పదాలను పట్టిక రూపంలో రాయండి.

వృత్తి	వ్యక్తిత్వం / ప్రత్యేక లక్షణం
ఉదా : ఉపాధ్యాయ	నిరంతరం అధ్యయనం, విద్యార్థుల పరిశీలనం

IV. భాషా కార్యకలాపాలు

- విలువలు గల్గిన మహోన్నత వ్యక్తిత్వంతో పరిపాలనాదక్షతతో సేవచేసిన వారి వివరాలు సేకరించండి. ఒక సంకలనాన్ని రూపొందించండి. తరగతిలో ప్రదర్శించండి.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది వాక్యాల్లో గీతగీచిన పదాలను విడదీసి, సంధులను గుర్తించండి.

అ) పల్లెటూరి వాళ్ళ పట్ల ఆరదంగా ఉండాలి.

ఆ) ఆయన అతి నిరాడంబరంగా జీవించేవారు.

ఇ) అభిమానం మంచిదే. దురభిమానం కీడు కలిగిస్తుంది.

ఈ) పుప్పొడిని సేకరించేది తేనెటీగ.

ఉ) దుర్భేద్యమగు సింహగఢకోటను తానాజీ సాధించాడు.



ఊ) ఈనాటి మనుషులు నిశ్చింతగా జీవించలేకపోతున్నారు.

ఋ) విశ్వామిత్రుడు గొప్ప తపోధనుడు.

ఌ) ఆమె నిలువుటద్దం ముందునుంచి కదలదు.

పై వాక్యాల్లోని టుగాగమ, విసర్గసంధులను గుర్తించారు కదా!)

2. కింది సమాస పదాల్లోని తత్పురుష భేదాలను గుర్తించి, విగ్రహవాక్యాలు రాయండి. సమాస నిర్ణయం చేయండి.

ఉదా॥ సత్యదూరము – సత్యమునకు దూరము – షష్ఠీతత్పురుష సమాసం

అ) అమెరికా రాయబారి – _____

ఆ) వాదనాపటిమ – _____

ఇ) అసాధ్యం – _____

ఈ) నెలతాల్పు – _____

ఉ) గురుదక్షిణ – _____

ఊ) వయోవృద్ధుడు – _____

ఋ) దొంగభయము – _____

3. 'కర్త' ఆధారంగా రూపొందిన వాక్యాలు కర్తరీ వాక్యాలని, 'కర్మ' ప్రధానంగా రూపొందించిన వాక్యాలను కర్మణి వాక్యాలంటారని మీకు తెలుసు. కింది వాక్యాలలో ఏవి కర్తరి వాక్యాలో, కర్మణి వాక్యాలేవో గుర్తించండి. కారణాలతో సమన్వయించండి.

ఉదా॥ రామకృష్ణారావు గారు ఆమోదముద్రవేశారు. – కర్తరీవాక్యం.

రామకృష్ణారావుచే ఆమోదముద్ర వేయబడింది. – కర్మణివార్యం.

(ఆమోదముద్రవేయడం – కర్తకు సంబంధించిన క్రియ.

ఆమోదముద్ర వేయబడటం – కర్మకు సంబంధించిన క్రియ.)

అ) దున్నేవానికి భూమినిచ్చే హక్కు తయారయ్యింది.

ఆ) బూర్గుల మంచినిర్ణయాలు తీసుకున్నారు.

ఇ) వారి న్యాయవాదపటిమ ఇతరులను అబ్బురపరచింది.

ఈ) రేఖామాత్రంగా నాభావాలు ఇక్కడ పొందుపరచబడ్డాయి.

ఉ) పర్షియన్ ట్యూటర్‌గా ఆయన కొంతకాలం పనిచేశారు.

ఊ) ఆయన కన్నుమూసిన విషయం వ్రాశారు.



పరిచయం

నుగాగమసంధి

1. కింద పదాలను విడదీయండి. మార్పును గమనించండి.

అ) చేయునతడు.

ఆ) వచ్చునప్పుడు.

పై పదాలను విడదీస్తే –

అ) చేయు + అతడు

ఆ) వచ్చు + అప్పుడు

- చేయు, వచ్చు పదాలు ఇవి చివర 'ఉత్తు'ను కల్గిఉంటాయి. అందుకే ఉదంతాలు. ఇవి తద్ధర్మార్థక క్రియలు. అంటే ఏ కాలానికైనా వర్తించే క్రియాపదాలు. వీటికి అచ్చు కలిసింది. ('అ'తడు, 'అ'ప్పుడు). అప్పుడు రెండు పదాల్లోనూ లేని 'న్' అనే హల్లుకొత్తగా వచ్చి చేరి చేయు అతడు అనేది చేయు'న'తడు గాను, వచ్చు అప్పుడు వచ్చు 'న'ప్పుడు గానూ మారిపోయింది. ఈ సందర్భాల్లో 'న్' కొత్తగా వచ్చి చేరింది. 'న్' ఆగమం కాబట్టి ఇట్లా ఏర్పడటాన్ని 'నుగాగమ సంధి' అంటారు.

కింది ఉదాహరణలు విడదీసి, లక్షణాలు సరిచూడండి –

1) పోవునట్లు

2) కలుగునప్పుడు

2. పై సందర్భంలోనే గాక మరికొన్ని చోట్ల 'నుగాగమం' వస్తుంది. కింది పదాలు విడదీసి, పరిశీలించండి.

అ) తళుకుంగజ్జెలు

ఆ) సింగపుంగొదమ

విడదీస్తే –

అ) తళుకు + గజ్జెలు – తళుకుం గజ్జెలు (తళుకున్)

ఆ) సింగము + కొదమ – సింగపుం గొదమ (సింగపున్)

- పై సందర్భాల్లో ఉత్తు చివరకల్గిన పదాలు స్త్రీ సమమైనవి అంటే స్త్రీలింగవాచక పదాలకు అన్వయించే క్రియలు వీటికి అన్వయిస్తాయి. అటువంటి పదాలకు పరుషాలుగాని, సరళాలుగానీ కలిస్తే నుగాగమం వస్తుంది. కొన్ని చోట్ల పూర్ణ బిందువు కూడా వస్తుంది.

కింది ఉదాహరణలు పరిశీలించి లక్షణ సమన్వయం చేయండి.

1) చిగురుంగయిదువు –

2) సరసపుఁదనము –

3. ఇంకా కొన్ని సందర్భాల్లోనూ నుగాగమం వస్తుంది.

కింది పదాలను విడదీసి, పరిశీలించండి.

అ) విధాతృనానతి – (విధాత యొక్క ఆనతి) = విధాతృ + ఆనతి.

ఆ) రాజునాజ్ఞ – (రాజు యొక్క ఆజ్ఞ) = రాజు + ఆజ్ఞ.

♦ విగ్రహవాక్యాలననుసరించి పై సంధి పదాలు షష్ఠీతత్పురుషానికి సంబంధించినవని తెలుస్తున్నది.

- పూర్వస్వరం స్థానంలో 'ము'కారం, ఉత్తు ఉన్నాయి. వీటికి అచ్చుపరమైనప్పుడు నుగాగమం వచ్చింది.

అంటే– షష్ఠీతత్పురుషాల్లో ఉత్తుకు, ముత్వానికి అచ్చుపరమైనప్పుడు నుగాగమం వస్తుంది.









7. నగరగీతం

– అతిశెట్టి ప్రభాకర్

ఉన్ముఖీకరణ

చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్లు చెరుగుతున్నప్పుడు
సంసారం బరువెంతో సమీక్షించగలిగినవాణ్ణి
ఆకుపచ్చని చెట్టు, ఆహ్లాదభరితమైన వాతావరణమేమి లేకుండానే
పగలూరాత్రి యాస్ఫెన్టాస్ రేకులకిందపడి ఎంత వేడెక్కినా
మాడిపోకుండా ఉండగల్గిన మానవాతీతుణ్ణి
నరకప్రాయమైన నగర నాగరికతను నరనరానా
జీర్ణించుకున్నవాణ్ణి
రోజుకో రెండు కవితా వాక్యాల్ని రాయలేనా...
అది మనకు పెన్నుతో పెట్టిన విద్య... అఫ్‌కోర్సు...
కవిత్వం ఎంత నిత్యనూతనంగా వెలికి వచ్చినా
రాసిన ప్రతిది ఆణిముత్యం కాదని అందరికి తెలుసు

– అలిశెట్టి ప్రభాకర్

ప్రశ్నలు:

1. "చాటుమాటుగా అర్ధాంగి చేటలో కన్నీళ్ళు చెరుగుతున్నప్పుడు" వాక్యం ద్వారా మీరేమి గ్రహించారు?
2. రచయిత నివాసం ఎలా ఉంది?
3. నగర నాగరికతను నరకప్రాయమని రచయిత ఎందుకని ఉంటాడు? దానిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
4. పై కవితాత్మక వాక్యాలు చదివారు కదా! రచయిత గురించి మీ కేమి అర్థమైంది?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ఆధునిక కాలంలో మనుషులంతా నగరాల్లో జీవించాలని కోరుకుంటున్నారు. దీనికి అనేక కారణాలున్నాయి. ఉన్నత విద్య, ఉత్తమ ఉద్యోగవకాశాలు, కార్పోరేట్ వైద్యం, విభిన్న వ్యాపారాలు చేసుకునే సౌకర్యం, ఆధునిక వినోద, విలాస జీవనశైలుల కేంద్రం నగరం. పేద, మధ్యతరగతి, ధనికవర్గ ప్రజలు వారివారి స్థాయిలో బతకడానికి అనువైన పరిస్థితులు ప్రజలను నగరాలవైపు ఆకర్షితులను చేస్తుంది. మరోవైపు పల్లెలో ఉపాధి అవకాశాలు తగ్గడంతో బతుకుతెరువుకోసం నగరాలకు వలసలు పెరిగిపోయాయి. నగరంలోని అనుకూలాంశాలన్నింటిని వినియోగించుకోవాలనే కోరికతో మనుషులు నగరంలో ఉండడానికి తాపత్రయపడిపోతున్నారు. దీనితో అనేక నగరాలు అత్యధిక జనాభాతో కిక్కిరిసిపోతున్నాయి. పలు సమస్యలు పెరిగిపోయాయి. నీటి ఎద్దడి, అధిక ధరలు, కాలుష్యాలు, కొత్త అనారోగ్యాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లు, విదేశీ సంస్కృతి వెర్రిపోకడలు, ఉగ్రవాదం, శాంతి భద్రతలు నగరపాలనా వ్యవస్థకు సవాళ్ళు విసురుతున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో నగరం శరవేగంగా తన రూపం మార్చుకుంటుంది. సామాన్యుడికి అందనంత దూరంగా కదిలిపోతుంది నగరం. మధ్యతరగతికి అంతుచిక్కని ప్రాంతంగా మారిపోయింది నగరం. మనిషి యాంత్రిక స్థితిలోకి మారిపోతున్నాడు. తనకుతానే పరాయీకరణకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో నగరజీవితంలోని యథార్థదృశ్యాల్ని మన కళ్ళ ముందు నిలుపుతూ, నగరపు మరో పార్శ్వాన్ని చూపుతూ, వాస్తవాల్ని కఠినంగా నిర్వచిస్తున్నాడు కవి.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం మినీ కవిత ప్రక్రియకు చెందింది. ఏదైనా ఒక అంశాన్ని కొసమెరుపుతోనో, వ్యగ్యంతోనో, చురకతోనో తక్కువ పంక్తుల్లో చెప్పడమే మినీ కవిత 'అలిశెట్టి ప్రభాకర్ కవిత' అనే గ్రంథంలోని 'సిటీలైఫ్' మినీ కవితలను 'నగరగీతం' కవితగా కూర్పు చేయడమైంది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.

కవి పరిచయం



కరీంనగర్ జిల్లా జగిత్యాల జన్మస్థలం. 12-01-1954లో జన్మించాడు. మొదట ఆర్టిస్ట్‌గా ఎదిగాడు. ప్రారంభంలో పత్రికలకు పండగలు, ప్రకృతి, సినీనటుల బొమ్మలు వేసేవాడు. తరువాత జగిత్యాలలో సాహితీ మిత్రదీప్తి సంస్థ పరిచయంతో కవిత్వరంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వారపత్రికలో వచ్చిన 'పరిష్కారం' అచ్చయిన మొదటి కవిత. జగిత్యాలలో 'స్టూడియో పూర్ణిమ' (1976), కరీంనగర్‌లో 'స్టూడియో శిల్పి' (1979) హైదరాబాద్‌లో 'స్టూడియో చిత్రలేఖ' (1983) ఏర్పాటు చేసుకొని జీవిక కోసం ఫోటోగ్రాఫర్‌గా, జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. ఏనాడూ సంపాదన కోసం ఆరాటపడలేదు. తన కళ ప్రజల కోసమే అని చివరకంటా నమ్మాడు. ఎర్ర పావురాలు (1978) మొదటి కవితా సంకలనం. మంటల జెండాలు, చురకలు (1979), రక్తరేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభగీతం (1990), సిటీలైఫ్ (1992) అచ్చయిన కవిత్వ సంకలనాలు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరేళ్ళపాటు సీరియల్‌గా "సిటీలైఫ్" పేరుతో హైదరాబాదు నగరంపై రాసిన సినీ కవితలతో ప్రఖ్యాతిపొందాడు. కవిత్వాన్ని ఆయుధంగా మలచుకొని పాఠకుల్లో ప్రగతిని, ఆలోచనాదృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించినకవి అలిశెట్టి ప్రభాకర్. శ్రీశ్రీ తర్వాత అంత ఎక్కువగా కోట్ అయిన కవిత్వం వీరిదే!

తండ్రి స్వర్గీయ అలిశెట్టి చినరాజం, తల్లి లక్ష్మి. సహచరిభాగ్య. కుమారులు సంగ్రామ్, సంకేత్‌లతో హైదరాబాద్‌లో నివాసం. అనారోగ్యంతో 12-01-1993 నాడు మరణించాడు.



దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది.

కొందరిని కొన్ని సన్నివేశాలు విశేషంగా ఆకర్షిస్తాయి.

సహృదయుడు ప్రతి కదలిక నుండీ ప్రేరణ పొందుతాడు.

అతనికి భాష ఆయుధమైతే, భావం కవితగా రూపం సంతరించుకుంటుంది.

నగరంలోని మూలలను, మూలాలనూ ఓ కవి హృదయం ఎట్లా దర్శించిందో – 'అలిశెట్టి' మినీ కవిత(లు) మన కళ్ళకు గడుతుంది. మనసు కిటికీ తెరిచి చూస్తే అక్షరాల వెనుక అనంత దృశ్యాలు కనిపిస్తాయి...

I

నగారా మోగిందా
నయాగరా దుమికిందా
నాలుగురోడ్ల కూడలిలో ఏమది?
అదే, నగరారణ్యహోరు
నరుడి జీవనఘోష

తల్లి ఒడివంటి
పల్లెసీమల్నొదిలి
తరలివచ్చిన పేదరైతులూ
ఇనప్పెట్టెల్లాంటి
ఈ పట్టణాల్లో
ఊపిరాడని మీ బతుకులూ

నగరంలో ప్రతిమనిషి
పఠనీయ గ్రంథమే
మరి నీ బతుకు
పేజీలు తిరగేసేదెవరో!

ఉదయమే
బస్సుల్లో రిక్షాల్లో
పేవ్‌మెంట్లపై విరబూసిన
కాన్వెంటు పువ్వుల సందడి
రాలే చదువుల పుప్పొడి!

ఆలోచించండి-చెప్పండి

- *పల్లెసీమల్ని కవి తల్లిఒడితో ఎందుకు పోల్చాడు?*
- *పట్టణాలను ఇనప్పెట్టెలు అని అనడం కవి ఉద్దేశం ఏమై ఉంటుంది?*
- *"నగరంలో ప్రతి మనిషి పఠనీయ గ్రంథమే" అనే వాక్యం గురించి మీకేమి అర్థమైంది?*
- *"'పేవ్‌మెంట్ల పై విరబూసిన కాన్వెంటు పువ్వుల సందడి" అని కవి ఎవరి గురించి అన్నాడు? దీని గురించి మీ అభిప్రాయం తెల్పండి.*



II.

సిటీ అంటే అన్నీ
బ్యూటీ బిల్డింగ్‌లు కావు
అటు భవంతులూ ఇటు పూరిళ్ళూ
దారిద్ర్యం సౌభాగ్యం సమాంతర రేఖలు!
ఇది వెరైటీ సమస్యల మనుష్యుల
సమ్మేళన కోలాహలం!
ఎంతచేసినా ఎవరికీ
తీరిక దక్కదు కోరిక చిక్కదు
మెర్క్యూరీ నవ్వులు, పాదరసం నడకలు
కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడుకాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలుక్కాళ్ళు!
నగరంలో అన్నిపక్కలా
సారించాలి మన చూపులు
మహానగరాల రోడ్లకి
మరణం నాలుగువైపులు!
నగరం మహావృక్షంమ్మీద
ఎవరికి వారే ఏకాకి!
నగరం అర్థంకాని రసాయనశాల!
నగరం చిక్కువీడని పద్మవ్యూహం!!

ఆలోచించండి-చెప్పండి

- *"సిటీ అంటే అన్ని బ్యూటీ బిల్డింగ్‌లు కావు!" ఇది వాస్తవమేనా? ఎందుకు?*
- *రెండు కాళ్ళు, మూడు కాళ్ళు, నాలుగు కాళ్ళు అని కవి అనడంలో ఉద్దేశం ఏమిటి?*
- *"మహానగరాల రోడ్లకి మరణం నాలుగువైపులు" అంటే ఏమిటి?*
- *నగరాన్ని రసాయనశాల అనీ, పద్మవ్యూహం అని కవి అనడంలో ఉద్దేశం ఏమై ఉంటుంది?*

సారాంశం :

అనేక వాహనాల శబ్దాలు, మనుషుల మాటలు, చిరువ్యాపారుల అరుపులతో నగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో వినిపించే రణగొణ ధ్వనులు గుండెలదిరిపోయేలా మోగిస్తున్న ధంకానాదంలా, ఉధృతమైన వేగంతో రూకే నయాగారా జలపాతం హోరులా అనిపిస్తుంది. నిజానికది అరణ్యంలాంటి నగరం చేస్తున్న ధ్వనిలా, నగరజీవి బతుకుపోరాటంలోంచి వచ్చిన ఉఱుములాంటి శబ్దంలా ఉన్నాయని కవి వర్ణిస్తున్నాడు.



అమ్మ బడిలాంటి పుట్టిన ఊరిని వదిలి ఉపాధికోసం నగరం తరలివచ్చిన వారికి ఇంత పెద్ద పట్నంలో తలదాచుకోవడానికి కాసింత స్థలం కూడా దొరకదు. పేదరైతులు ఇనప్పెట్టెల్లాంటి ఇరుకిరుకు మురికి ప్రదేశంలో ఊపిరాడని స్థితిని అనుభవిస్తూ బతుకుతుంటారు.

నగరంలో ప్రతిమనిషి చదవవలసిన ఒక పుస్తకం లాంటివాడు. అయితే ఎవరూ అతని బతుకు పుస్తకములోని పేజీలు చదివేవారే ఉండరు. నగరంలోని మనిషివెనక అనేక ఆసక్తికరమైన ఆనంద, విషాదగాథలుంటాయి. ఒక్కరైనా అతని బాగోగులు పట్టించుకునేవారే ఉండరనే చేదునిజాన్ని చెపుతున్నాడు కవి.

నగరంలో ఉదయాన్నే సిటీబస్సులో, ఆటోల్లో, పేవ్‌మెంట్లపై విరబూసిన పువ్వుల్లాంటి స్కూల్‌పిల్లలు సందడిచేస్తుంటారు. వారి మాటల్లోంచి చదువుల పుప్పొడి రాలుతుంది.

నగరం నిండా అన్నివైపులా అందమైన ఎత్తైన భవనాలు ఉంటాయనుకోవద్దు. ఒకవైపు ఖరీదైన భవంతుల పక్కనే చిన్న చిన్న పూరిపాకలూ ఉంటాయి. ఇక్కడ ఐశ్వర్యం దారిద్ర్యం పక్కపక్కనే సమాంతర గీతలుగా కనిపిస్తాయి. నగరం వైవిధ్యమైన సమస్యలతో, విభిన్న మనస్తత్వాలతో కలసిపోయి కలకలంతో నిండి ఉంటుంది. ఎంత నిరంతరాయంగా పనిచేసినా నగరంలోని మనిషికి విశ్రాంతి తీసుకోవడానికి అనువైన సమయం దొరకదు. సంపాదించిన ధనంతో కోరికను తీర్చుకునే తీరిక దొరకదు. కృత్రిమమైన వెలుగుల్లాంటి అసహజ నవ్వులతో, స్థిరత్వంలేని హడావుడి నడకలతో వెళ్ళేవారు ఆటోరిక్షాల్లో తిరిగేవాళ్ళు, ధనవంతులు కార్లలో ప్రయాణిస్తూ ఉండేవారు ఉంటారు.

నగరంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నగరంలో అన్నివైపులా ప్రమాదాలు పొంచి ఉంటాయి. నగరంలో నాలుగుదిక్కుల్లోని రోడ్లలో మృత్యువు పొంచి ఉంటుందని కవి హెచ్చరిస్తున్నాడు.

వృక్షాల మీద ఉండే పక్షులు పరస్పరం కలిసిపోయి కలివిడిగా ఉంటాయి. నగరమనే మహావృక్షం మీద నివసించే ఈ మనుషులు సాటిమనిషితో ఎటువంటి ఆత్మీయ పలకరింపులు లేకుండా ఇరుగూపొరుగనే భావన లేకుండా ఎవరికి వారే ఏకాకిగా బతుకుతుంటారు. ఈ యాంత్రిక మానసిక స్థితిని నిరసిస్తున్నాడు కవి.

ప్రయోగశాలలో ఏవేవో రసాయన ద్రవాలు, ఆమ్లాలు ఉంటాయి. వాటి చర్యలు అందరికీ అర్థం కావు. నగరం అంతకంటే అర్థంకాని రసాయనశాలలా ఉంటుంది. నగరంలో బతుకుదామని వచ్చినవారు, ఉపాధి దొరకకపోయినా ఏదో ఒకరోజు దొరుకుతుందని ఆశగా వేచిచూస్తూంటారు. ఇక్కడి సౌకర్యాలు, విలాసాలు, వినోదాలు పైపై మెరుగులు బలంగా ఆకర్షిస్తాయి. మరోవైపు నిరుద్యోగం, జీవనవ్యయం భయపెడుతున్నా నగరం విడిచివెళ్ళబుద్ధికాదు. కాలుష్యం కలవరపెట్టినా, ట్రాఫిక్ జామ్‌లో జీవితం ఇరుక్కుపోయినా నగరం విడిచి ప్రశాంతంగా మన పల్లెలకు వెళ్ళనివ్వని, చిక్కువిడదీయలేని పద్మవ్యూహం లాంటిది నగరం.



ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాల గురించి చర్చించండి.

అ) మీరు ఇప్పటివరకు ఏఏ నగరాలను చూశారు? మీరు చూసిన నగరాల్లో మీకు నచ్చిన, నచ్చని అంశాలు ఏమిటి?

ఆ) మీ ఊరి నుండి ఎవరైనా నగరాలకు వలస వెళ్ళారా? ఎందుకు వెళ్ళవలసి వచ్చింది? వాళ్ళు అక్కడ ఏం చేస్తున్నారు?

2. పాఠం ఆధారంగా కింది కవితా పంక్తుల్లో దాగిన అంతరార్థాన్ని గుర్తించి రాయండి.

అ) నగరంలో ప్రతి మనిషి పఠనీయ గ్రంథమే.

ఆ) నగరం మహావృక్షంమ్మీద ఎవరికి వారే ఏకాకి.

ఇ) మహానగరాల రోడ్లకి మరణం నాలుగు వైపులు.

3. కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

కందుర్తి ఆంజనేయులు రచించిన వచన పద్య ఖండిక 'నగరంలో వాన' కవిత్వంలా మొదలై రాజకీయ శాసనంతో అంతం అవుతుంది. అందరూ వాస్తవికత నుంచి వ్యంగ్యాన్ని పుట్టిస్తే, ఇందులో కవి వ్యంగ్యం నుంచి వాస్తవికతను సృష్టిస్తాడు. ప్రబంధకవి అయ్యలరాజు రామభద్రుడు వర్షధార నుంచి కవితాధారను శ్లేషించాడు. అది కేవలం శబ్దగతమైన శ్లేషమాత్రమే. ఇందులో భావసంఘర్షణ నుంచి వెలువడిన వ్యంగ్యం ఘుమాళిస్తుంది. కవి భావుకత వ్యంగ్యధనువును ఎక్కుపెడితే, సంస్కారం వాస్తవికత భాగాన్ని గుండెలకు గురిపెట్టి కొడుతున్నది. ఆ దెబ్బ తప్పదు. అది ఎంత సున్నితంగా తాకుతుందో అంత గాఢంగా ముద్రవేస్తుంది. వచన పద్యం ఎంత సహజమైన ఛందస్సో, ఈ ఖండికలోని రచన కూడా అంత సహజంగా రూపు దిద్దుకొన్నది. కుందుర్తి వాన కురిసింది నగరంలోనే అయినా, ఆ వానలో తడిసింది మాత్రం సామాన్యుడి జీవనమే! ఇందులో వాన కేవలం కేన్వాసుమాత్రమే. దాని ఆధారం చేసుకుని కవి చిత్రించిన వాస్తవిక దృశ్యాలు మనల్ని నిలబెట్టి ఆలోచింపచేస్తాయి.

అ) కవులు సామాన్యంగా వ్యంగ్యాన్ని ఎలా సృష్టిస్తారు?

ఆ) అయ్యలరాజు రామభద్రుడి కవితాధారను విశ్లేషించండి.

ఇ) కుందుర్తి నగరంలో వాన కవితను ఏ ఛందస్సులో రాశారు?

ఇ) నగరంలో వాన కవితలోని ప్రధానాంశం ఏమిటి?

ఈ) కుందుర్తి వాస్తవికత ఎలాంటిది?



4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) అలిశెట్టి ప్రభాకర్ కవితాదృక్పథం ఏమిటి?

ఆ) 'నగరగీతం' రాయడానికి గల నేపథ్యాన్ని వివరించండి.

ఇ) నరుడి జీవనఘోష కవికి ఎలా వినిపించింది?

ఈ) నగరంలో దారిద్ర్యం, సౌభాగ్యం ఏ విధంగా కనిపిస్తాయి?

ఉ) అలిశెట్టి ప్రభాకర్ 'సిటీలైఫ్' కవితల ప్రత్యేకత ఏమిటి?

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) నగరం అంటే ఏమిటి? పల్లెకు – నగరానికి గల ప్రధాన వ్యత్యాసం తెలపండి.

ఆ) నగరజీవికి తీరిక దక్కదు కోరిక చిక్కదనే పంక్తుల్లోని వాస్తవాన్ని వివరించండి.

ఇ) ఈ పాఠం ఆధారంగా నగరం ఎలా ఉంటే కవికి నచ్చుతుందో తెలపండి.

ఈ) నగర జీవితంలోని ప్రతికూల అంశాల్ని ఇంత కఠినంగా వర్ణించడంలో కవి ఆంతర్యం ఏమిటి?

ఉ) నగరంలో మనిషి జీవన విధానాన్ని పాఠం ఆధారంగా వివరించండి.

ఊ) అందరూ నగరాల్లో జీవించాలని ఎందుకు అనుకుంటున్నారు?

2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.

అ) 'నగరగీతం' సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఆ) నేడు నగరజీవనం ఎందుకు సంక్లిష్టంగా మారిందో విశ్లేషించండి.

ఇ) నగరాన్ని రసాయనశాలగా, పద్మవ్యూహంగా వర్ణించడంలోని నిజానిజాల గురించి చర్చించండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) నగరగీతం కవితకు మరో పార్శ్వంగా నగర జీవనంలోని అనుకూల అంశాలపై ఒక వ్యాసం రాయండి.

ఆ) ప్రశాంతతకు, పచ్చదనానికి నిలయమైన పల్లెల గొప్పదనాన్ని వర్ణిస్తూ ఒక వచన కవితను రాయండి.

ఇ) ఈ పాఠం ఆధారంగా నీకు తెలిసిన ఒక నగరంతో పోల్చుతూ 'నగరగీతం'లోని వాస్తవికతతో సమన్వయపరుస్తూ పత్రికకు ఒక సాహిత్య విమర్శావ్యాసం రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదాలకు అర్థాలను 'పదవిజ్ఞానం'లో వెతికి ఆ అర్థంతో సొంతవాక్యాలు రాయండి.

ఉదా॥ కూడలి = నాలుగు రోడ్లు (దారులు) కలిసే చోటు.

నగర కూడలిలో రోడ్డు దాటునప్పుడు జాగ్రత్తగా ఉండాలి.



అ) నగారా ఆ) హోరు ఇ) ఘోష ఈ) పేమెంట్ ఉ) మెర్క్యూరీ

2. కింది పదాలకు పర్యాయపదాలు రాసి వాటితో వాక్యాలు రాయండి.

ఉదా॥ పల్లె – గ్రామం, ఊరు

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీ కలలు కన్నాడు. ఊరి సంక్షేమమే దేశ సౌభాగ్యంగా తలచారు.

అ) నరుడు ఆ) అరణ్యం ఇ) రైతు ఈ) పువ్వు ఉ) మరణం

ఊ) వాంఛ ఎ) వృక్షం

IV. భాషా కార్యకలాపాలు

- భారతదేశంలోని ప్రధాననగరాల వివరాలు వాటి ప్రత్యేకతలు, జీవన విధానాల వైవిధ్యాన్ని సేకరించి ఒక పట్టికగా రూపొందించి 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' నిరూపించేలా ప్రదర్శించండి.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. అనుప్రాస అలంకారాల్లో అంత్యానుప్రాస గురించి తెలుసుకున్నారు కదా!

కింది కవితా భాగాల్లో ఆ అలంకారాన్ని గుర్తించండి.

అ) నగారామోగిందా
నయాగరా దుమికిందా

ఆ) రంగదరాతిభంగ; ఖగరాజతురంగ; విపత్పరంపరో
త్తుంగ తమఃపతంగ; పరితోషితరంగ; దయాంతరంగ; స
త్సంగ; ధరాత్మజా హృదయ సారస భృంగ; నిశాచరాబ్జ మా
తంగ; శుభాంగ! .....

ఇ) కొందరికి రెండు కాళ్ళు
రిక్షావాళ్ళకి మూడు కాళ్ళు
ఉన్నవాళ్ళకి నాలు క్కాళ్ళు

పరిచయం

* **శబ్దాలంకారాల్లో వృత్యానుప్రాస, అంత్యానుప్రాస లాంటివే మరికొన్ని ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.**

1. ముక్తపదగ్రస్తము

కింది కవితా భాగాలు పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

అ) జనకుడుండెడి యనుష్ఠాన వేదిక జూచు;
చూచి క్రమ్మరబోయి జూడవచ్చు.



ఆ) అదిగదిగోమేడ;

మేడ పక్కన నీడ;

నీడలో ఉన్నది దూడ;

దూడ వేసింది పేడ.

* పై రెండు కవితల్లోని ప్రత్యేకతను గమినించారు కదా!

ఒక పద్యపాదంగాని, వాక్యంగానీ ఏ పదంతో పూర్తవుతుందో అదే పదంతో తర్వాత పాదం / వాక్యం మొదలవుతున్నది. దీన్నే ముక్తపదగ్రస్త అలంకారం అంటారు.

2. యమకము

కింది వాక్యాలు పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

అ) మన సైనికనికాయము కాయము మరచి పోరాడుతున్నది.

(నాకాయం = బృందం; కాయం = శరీరం)

ఆ) ఆతోరణం శత్రవులతోరణానికి కారణమైంది.

(తోరణం = ద్వారానికి కట్టే అలంకారం; రణం = యుద్ధం)

* పై రెండు సందర్భాలల్లోనూ ఒకే పదం అర్థభేదంతో ప్రయోగించడాన్ని యమకాలంకారం అంటారు.

3. లాటానుప్రాస

కింది కవితా భాగాలను / వాక్యాలను చదవండి. ప్రత్యేకతను గమనించండి.

అ) హరిభజియించు హస్తములు హస్తములు... (చేతులే, నిజమైనచేతులు)

ఆ) దీనమానవులకు జేయు సేవ సేవ. (సేవయే నిజమైన సేవ)

* పై రెండు సందర్భాల్లోనూ ఒకే పదం అర్థంలో తేడా లేకున్నా భావంలో తేడా ఉండేటట్లు ప్రయోగించారు. ఈ విధంగా ఒకే పదాన్ని, అర్థం ఒకటే అయినా తాత్పర్యంలో భేదంతో ప్రయోగించడాన్ని లాటానుప్రాసాలంకారం అంటారు.



8. ఆనాడు - ఈనాడు

– డా॥ భానుమతి రామక్రిష్ణ

చదవండి - ఆలోచించి చెప్పండి.

1931లో ప్రారంభమయిన తెలుగు చలనచిత్ర పరిశ్రమ నానాటికీ విస్తరిస్తోంది. ఆ సంవత్సరంలో తెలుగు ప్రేక్షకులకు రెండే రెండు చిత్రాలనందించిన మన పరిశ్రమ ఈనాడు సగటున సాలుకు 20 చిత్రాల్ని అందిస్తోంది. నిర్మాణ దృష్ట్యా అభివృద్ధి తృప్తికరంగానే కనిపిస్తోంది. కానీ మానవ ప్రపంచం మీద ప్రభలంగా పనిచేసే ఈ చలనచిత్రాల మీద రెండు రకాల వాదాలున్నాయి. మొదటిది చలనచిత్ర పరిశ్రమ 'కళ' అనీ, రెండోది 'వ్యాపారమనీ'. కళ అని వాదించే ప్రతివారు గమనించాల్సింది కళకు కూడా వ్యాపారం అవసరమేనని. విదేశాల మాట అటుంచి మన దేశంలో అందులో మన రాష్ట్రంలో చిత్రపరిశ్రమ నూటికి నూరుపాళ్ళు వ్యాపారదృష్ట్యానే సాగుతున్నదని చెప్పడం ఏమాత్రం సాహసం కాదు. బాక్సాఫీసు సూత్రాల్ని మనసులో ఉంచుకొని నిర్మాతలు చిత్ర నిర్మాణాన్ని సాగిస్తున్నారు. అందువల్ల చలన చిత్ర నిర్మాణంలో కళాదృష్టి లోపించింది. కళ ఒక సృజనాత్మకమైన శక్తి. దాన్ని వ్యాపారంతో రంగరించడంవల్ల మేలిమి బంగారానికి రాగి కలిపినట్లవుతుంది.

– చిత్తూరు వి. నాగయ్య.

ప్రశ్నలు:

1. పై పేరా దేని గురించి చెపుతున్నది? ఎవరి అభిప్రాయాలవి?
2. పై పేరా ద్వారా మీరు గ్రహించిందేమిటి?
3. చలన చిత్రాల గురించి చిత్తూరు నాగయ్య గారి అభిప్రాయాలెలా ఉన్నాయి?
4. చలన చిత్రాల గురించి మీరేమనుకుంటున్నారు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

ప్రసార మాధ్యమాలలో చలన చిత్రాలు కూడా ఒకటి. "ఏ ప్రచారానికైనా చలన చిత్రాలు ఉత్తమమైన ఆయుధమని" లెనిన్ అన్నాడు. చలనచిత్రాలు ప్రజలమీద ప్రభావం చూపిస్తాయని అనేవారున్నారు. అట్లే ఇవి కేవలం వినోదానికి, ఉల్లాసానికి మాత్రమే సంబంధించినవి అనేవారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్వర్గీయ డా॥ భానుమతి రామక్రిష్ణ ఆనాడు - ఈనాడు అనే పేరుతో చలన చిత్రాల గురించి, 1955 కంటె ముందు ఉన్న చలనచిత్రాల గురించి, 1960 దశకంలో ఉన్న చలనచిత్రాలను పోలుస్తూ విమర్శనాత్మక వ్యాసం రాసింది. ఈ పాఠం ద్వారా చలన చిత్రాల నిర్మాణంలో నిర్మాతల అభిరుచులు, ప్రేక్షకుల అభిరుచులు ఇతివృత్తాల్లో చోటుచేసుకున్న మార్పుల గురించి సునిశితంగా విమర్శించడాన్ని తెలుసుకోవచ్చు.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం విమర్శనాత్మక వ్యాసము. సమాజంలో చోటు చేసుకుంటున్న వివిధ అంశాల పట్ల ఆయా రంగాలకు చెందిన నిపుణులు, వాటిల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను మంచి, చెడులను, ఫలితాలను విమర్శిస్తూ వ్యాసాలు రాసి ప్రచురిస్తారు. చలనచిత్రాల గురించి భానుమతి రాసిన విమర్శనాత్మక వ్యాసమే ఈ పాఠ్యాంశం.

విద్యార్థులకు సూచనలు

- పాఠానికి ముందు పేరాలో రాసి ఉన్న అంశాన్ని చదవండి. ఏం గ్రహించారో చెప్పండి?
- పాఠానికి సంబంధించిన చిత్రాలను చూడండి. పాఠంలోని విషయాలను ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలను గుర్తించండి. వాటికి అర్థాలను పదాలు – అర్థాలు పట్టిక నుండి లేదా నిఘంటువు చూసి తెలుసుకోండి.

కవి పరిచయం



సినిమాలలో ఆడవాళ్ళు నటించడాన్ని అగౌరవంగా భావించే రోజుల్లో భానుమతి రామక్రిష్ణ గారు సినీరంగంలో ప్రవేశించారు. ఆమె తన అభినయంతో, గాత్రంతో లక్షలాది మంది ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయింది. ఆమె తండ్రి బొమ్మరాజు వెంటక సుబ్బయ్యగారు సంగీత ప్రియుడు. ఆయన తన కూతురును పాటలు పాడేలా ప్రోత్సహించి పదమూడవ యేటనే ప్రముఖ నిర్మాత, దర్శకుడూ అయిన సి.పుల్లయ్యగారి ద్వారా చలన చిత్ర రంగంలో ప్రవేశించేలా ప్రోత్సహించారు. ఆమె నటించిన మొదటి సినిమా 'వరవిక్రయం'. ఆమె సుమారు 100 సినిమాలకుపైగా భారతీయ భాషలకు చెందిన చలనచిత్రాల్లో నటించారు. ఆమె కేవలం నటనకే పరిమితం కాలేదు. తనగాత్రం, పాటలుపాడడం ద్వారా దక్షిణాది ప్రేక్షకులను అలరించారు. స్వర్గసీమ సినిమాలో ఆమె పాడిన 'ఒహో ఒహో పావురమా" అనే పాట నాటి నుండి నేటి వరకు చిరస్థాయిగా నిలిచిపోయింది. పాటలోని పదాలను భావాత్మకంగా పలకడంలో, అందుకనుగుణంగా భావాలను తన నటన ద్వారా ప్రదర్శించడంలో ఆమెకు ఆమెనేసాటి. ఆమె నటించిన మరో సినిమా 'మల్లీశ్వరి' చలనచిత్రసీమకే కలికితురాయి వంటింది.

భానుమతిగారు పాటలు పాడడం, నటనతోపాటు 'చండీరాణి' అనే సినిమాకు దర్శకత్వం కూడా వహించింది. తన భర్త పి.రామక్రిష్ణతో కలసి భరణి చిత్రనిర్మాణసంస్థ నెలకొల్పి చలనచిత్రాలు నిర్మించింది. ఈ సంస్థ నిర్మించిన భక్తధ్రువ మార్కేండేయ అనే బాలల చలన చిత్రం అందరి ప్రశంసలనందుకున్నది. భానుమతిగారు 1965 నుండి 1975 వరకు బాలల చలనచిత్ర సంస్థ సభ్యురాలిగా కూడా ఉన్నారు. ఆమె నటించిన రెండు తమిళ చిత్రాలకు, తెలుగులో నటించిన 'పల్నాటి యుద్ధం' సినిమా ద్వారా జాతీయ ఉత్తమ నటి అవార్డులను మూడుసార్లు పొందింది.



భానుమతిని తమిళ అభిమానులు అష్టావధానిగా పిలుచుకుంటారు. 1966వ సం॥లో ఈమెను భారతప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదుతోను, 2003లో "పద్మభూషన్"తోనూ గౌరవించింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్లు ప్రధానం చేసాయి.

భానుమతి గారు చలనచిత్రరంగంతో పాటు సాహిత్య రంగంలో కూడా ప్రముఖమైన స్థానాన్ని సంపాదించించారు. కథా రచయిత్రిగా భానుమతిని తెలుగు పాఠకులు అభిమానిస్తారు. రచయిత్రులలో హాస్యం రాసేవారు లేని కొరతను భానుమతిగారు తీర్చారు. ఆమె రాసిన "అత్తగారి కథలు", "భానుమతి కథలు" అన్నీ హాస్యరసంతో తొణికిసలాడేవే. ఆమె తన ఆత్మకథను "నాలో నేను" అనే పేరుతో రాసి ప్రచురించారు. చలనచిత్రరంగం గురించి రాసిన గ్రంథాలకిచ్చే జాతీయ అవార్డును "నాలోనేను" గెలుచుకుంది. అసాధారణ ప్రతిభావంతురాలిగా తెలుగువారు మరిచిపోలేని మనిషి భానుమతి. ఆమె సెప్టెంబరు 7-1925 ప్రకాశం జిల్లా దొడ్డవరం గ్రామంలో జన్మించింది. ఆమె డిసెంబరు 24-2005 సం॥లో మరణించింది.

సామాజికసేవ : భానుమతిగారు సామాజిక సేవాసంస్థలతో పాటు కలిసి పనిచేసేది. "రెడ్‌క్రాస్ సొసైటీ"లో జీవితకాల సభ్యత్వాన్ని పొంది సేవలందించింది. ఆమె తనపేరుమీద "సాలిగ్రామం" చెన్నైలో పాఠశాలను స్థాపించి పేద విద్యార్థులకు విద్యనందించింది.

ఆనాటి నుండి ఈనాటి దాకా వచ్చిన పౌరాణిక చిత్రాలలో లవకుశలాంటి చక్కని చిత్రమూ రాలేదని నా అభిప్రాయం. ఈనాడు లవకుశ కంటే సాంకేతికంగా ఎన్నో రెట్లు అందమైన చిత్రాలూ, గొప్ప చిత్రాలూ రావచ్చు. కాని అన్నీ ఉండి అల్లుని నోట్లో శని అన్నట్లుగా కథా, కమామిషూ అంటూ వచ్చేసరికి ఈ నాటి చిత్రాలు వెనుకటి చిత్రాల ముందు నిలువలేవనే చెప్పాలి. మరి ఈ మాటలు అంటున్నది ఎవరు? ఆమె సినిమాల గురించి తన అభిప్రాయాలను ఏమని చెప్పిందో, పాఠం చదివి తెలుసుకోండి.

I

ఆనాడు 'కృష్ణలీలలు' తెలుగు చిత్రం రాబోతోందని తొలిసారి విమానంలో నుంచి కరపత్రాలు విసిరేశారు. కట్టలు కట్టలుగా ప్రతివూళ్ళోనూ - నాకప్పటికి బాగా చిన్నతనం - పెద్దవాళ్ళు చెప్పుకుంటూంటే విన్న జ్ఞాపకంతోబాటు నాకూ కలలాగా గుర్తుంది. ఆడపిల్లల బడిలో. అప్పుడే 'అఆ'లు దిద్దడాన్ని ఆరంభించేసిన నేను ఆటవిడుపు సమయంలో, తక్కిన ఆడపిల్లలందరూ బడిచుట్టూ ఉన్న ఆవరణలో ఆడుకుంటూంటే చూచి ఆనందిస్తూ నిలబడ్డాను. గుర్రుమంటూ పెద్దమోతతో మా బడి మీదుగా పోతున్న విమానాన్ని పిల్లలందరం నోరు తెరచుకొని చూశాం. చాలా కిందుగా పోతున్న ఆ విమానంలో నుంచి తెల్లని కాగితాలు పావురాళ్ళలా ఎగుర్తూవచ్చి కొన్ని మా బడి ఆవరణలోనూ, కొన్ని చుట్టుప్రక్కల వీధుల్లోనూ పడ్డాయి. మొదట్లో ఆ కాగితాలేమిటో ఎవరికీ తెలీక ఖంగారుపడ్డారు. అమ్మలక్కల్లో అలజడి బయలుదేరింది.

"ప్లేగోస్తోందమ్మోయ్, జనాన్ని జాగర్తగా ఉండమని చీటీలురాసి దొరలు విమానంలో నుంచి విసిరేశారట్నే?" అన్నది ఒకావిడ.



"అదేం కాదంటమ్మోయ్... కలరా రాబోతోందని మిషనాసుపత్రి పెద్ద డాక్టరు ఉడ్డుదొరగారు మొన్న మా ఆయనతో అన్నాడంట. ఆ సంగతే కాగితాల్లో అచ్చేసి కిరీషిన్టువాళ్ళు. విమానంలోనుంచి విసిరేశారు" అన్నది మరొకావిడ.

"అదేం కాదర్రా అంటేనూ... మీరనుకునేదంతా ఒట్టిది. కాలజ్ఞానంలో పోతులూరివీరబ్రహ్మంగారు చెప్పనే చెప్పారుగా! ఆకాశంలో ఎగిరే యంత్రాలు వస్తాయనీ, అవి వచ్చినప్పట్నుంచీ, జననష్టం కలుగుతుందనీ – ఆయంత్రాలేమిటనుకున్నారూ! యీ విమానాలే. 'అసలు విమానం ఏ వూరు' మీదుగా వెళితే ఆ వూరుకు ఒక నష్టం కలగబోతోందన్నమాటే! మరో మాటే లేదు" అన్నది ఓ బామ్మగారు నిక్కచ్చిగా.

ఆలోచించండి-చెప్పండి

- *కరపత్రాలు గురించి తెలుసా? ఏ ఏ సందర్భాలలో కరపత్రాలు పంచుతారు? ఎందుకు?*
- *ఆకాశంలో విమానాన్ని చూసినప్పుడు హెలికాప్టర్‌ను మొదటిసారి చూసినప్పుడు మీకెలా అన్పించింది?*
- *విమానంలో విసిరేసిన కరపత్రాలను చూసి ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా ఎందుకు భావించారు?*
- *గతంలో కరపత్రాల ద్వారా సినిమా ప్రచారాన్ని చేపట్టే వారు కదా! మరి ఇప్పుడు ప్రచారాన్ని ఎలా చేస్తున్నారు?*
- *గతంలో సినిమాహాళ్ళతో పోలిస్తే ఇప్పటి సినిమాహాళ్ళు ఎలా ఉన్నాయి?*

విమానంలో నుండి పడ్డ "కృష్ణలీలలు" సినిమా కాగితాలన్నీ పిల్లలందరం, తలా ఒకటి ఏరుకుని "కృష్ణలీలలు సినిమా వస్తోందట" అంటూ సంతోషంతో గంతులు వేయడం చూసిన బామ్మగారు ఆశ్చర్యపడిపోతూ, "ఓరి మీయింట వానగురవ సిలీమా...! ఇంతకూ ఆ విమానంలోంచి వేసింది సిలీమా కాగితాలా! నిశిరాత్రి నీడలు మాట్లాడతాయని కాలజ్ఞానంలో చెప్పినట్లు, యీ సిలీమావాళ్ళు గుండెలు తీసినబంట్లు లాగున్నారే? ...ఏది పిల్లలూ... ఆ కాగితం ఓటిల్లా యివ్వండి" అని మా చేతిలోవున్న "కృష్ణలీలలు" సినిమా కాగితాన్ని అడిగి తీసుకుని తనచత్వారం కండ్లకుపని చెప్పింది బామ్మగారు...

ఆరోజు నుండి "కృష్ణలీలలు" సినిమా ఎప్పుడొస్తుందా అని వూరంతా ఎదురుచూశారు. అప్పట్లో మా వూర్లో ఎక్కువ రోజులాడిన మొదటి తెలుగు చిత్రం "కృష్ణలీలలే" అంటూండేవాళ్ళు. పల్లెటూళ్ళనుండి జనం గుంపులు గుంపులుగా బండ్లు కట్టుకువచ్చి ఒకే చిత్రాన్ని నాలుగయిదుసార్లు చూట్టానికి ఆరంభంచేసింది, ఆనాటి నుండేనని కూడా అంటూ తర్వాత అంతకంటే ఎక్కువ ప్రజాదరణ పొందింది, ఆబాలగోపాలాన్ని ఆకర్షించింది. 'లవకుశ' చిత్రం. ఇప్పటికీ మర్చిపోలేను 'లవకుశ' చిత్రాన్ని.

నాన్న ఇచ్చిన నాలుగణాలు భద్రంగా దాచుకుని నలుగురు స్నేహితురాండ్లం కలిసి నడిచి వెళ్ళేవాళ్ళం సినిమా డేరాదాకా. ఒక్కొక్కరు బడి నుండి రావడం ఆలశ్యమయితే ఆటమొదలెట్టేస్తారేమోనన్న ఆతృతకొద్దీ, పరికిణీలు పైకెట్టుకుని పరుగులంకించుకుండేవాళ్ళం. బెంచీటిక్కెట్టు కొని లోపలికెళితే, పల్లెటూరివాళ్ళు బెంచీలనిండా నిండిపోయి వుండేవాళ్ళు ములుకర్రలతో సహా. ఇంక వాళ్ళను లేపడం బ్రహ్మతరమా! మాట్లాడకుండా వెళ్ళి నేలమీదనే ఎట్లాగొట్లా సర్దుకునేవాళ్ళం.

తమలపాకుల తిమ్మలూ, సగం కాల్చేసిన చుట్టలూ, సినిమాలో సీతమ్మకష్టాలు చూళ్ళేక చీదేసిన బాపతూ అన్నీ మా పరికిణీలు శుభ్రం చేసేవి. అయితే ఏం! ఎక్కడ కూర్చున్నది మర్చిపోయి తన్మయులమయి చూసేవాళ్ళం. ఆనాడు లవకుశ చిత్రాన్ని చూడడం నాకిప్పటికీ జ్ఞాపకముంది, ఒకటికి పదిసార్లు చూసే బస్తిజనంతో బాటు పల్లెటూళ్ళ నుండి కూడా, లవకుశ చూట్టానికి జనం విపరీతంగా విరగబడుతూంటే – హాల్లో చోటు చాలక, తెరకు వెనకవైపునున్న ఖాళీస్థలంలో కూడా జనాన్ని కూర్చోబెట్టి, తెరకు రెండువైపులా లవకుశ చిత్రాన్ని చూపించారు. ఆనాడు అదొక వింతగా చూశాం. అజ్ఞానంలోనే సుఖం వుందన్నట్టు, ఆనాడు సినిమాలంటే ఏమిటో సినిమా 'టెక్నిక్' అంటే ఏమిటో ఎవరికీ తెలీదుగనుక,



సినిమా చూస్తున్నంత సేపూ యేదో పురాణం వింటున్నట్టూ, హరికథాకాలక్షేపం చేసినట్టూ ఎంతో శ్రద్ధాభక్తులతో చూసి ఆనందించేవారు ఆనాటి అమాయక ప్రజలు. అసలు ఆనాటి నుండి ఈనాటి దాకా వచ్చిన పౌరాణిక చిత్రాలలో లవకుశ లాంటి చక్కని చిత్రమూరాలేదనే నా అభిప్రాయం.

ఈనాడు లవకుశ కంటే టెక్నికల్‌గా ఎన్నో రెట్లు అందమయిన చిత్రాలూ, గొప్ప చిత్రాలూ రావచ్చు. కాని అన్నీ ఉండి అల్లునినోట్లో శని అన్నట్లుగా కథా, కమామిషూ అంటూ, వచ్చేసరికి ఈనాటి చిత్రాలు వెనకటి చిత్రాలముందు నిలువలేవనే చెప్పాలి.

ఒక్క చిత్రానికి ఒక్కటే కథా

ఆనాడు నిర్మాతలు కేవలం ప్రజలను మోసంచేసే ఉద్దేశ్యముతో చిత్రాలు నిర్మించలేదు. ఒక కథ తీసుకుని, దాన్ని ఏవిధమయిన అపభ్రంశం పట్టించకుండా ప్రజలకు సులభముగా అర్థమయ్యేటట్లు, అరటిపండు వల్చిచేతికందించినట్లు దిద్ది ఒక్కొక్క చిత్రాన్ని ప్రజలకందించారానాటి నిర్మాతలు. ఈనాడు యిరవై కథలు కలిపి ఒక మహాగాథగా తయారుచేస్తున్నారు. అసలు కథ ఏమిటో మానవ మాత్రుడికి అర్థం కాకుండా అందంగా లేని అడవి అధికంగా అలంకారం చేసుకున్నట్లు, కథలేని ఆ గాథను హంగుల హడావిడితో భారీయెత్తున చిత్రంగా నిర్మించి, 'శాటిలైట్'ను వదిలినట్లు తమ చిత్రాల్ని ప్రజలమీద వదలి, ప్రజలను గాభరాపెట్టి, హడలగొట్టి, బెదిరించి, మాయచేసి, మత్తుమందుచల్లి, డబ్బుగుంజుతున్నారా అనిపిస్తోంది. ఈనాడు తయారయ్యే కొన్ని అర్థం లేని చిత్రాలను చూస్తుంటే–

"అసలీ నాడు ఒక కథను చిత్రంగా నిర్మిస్తున్నారంటే కొందరు నవ్వుతున్నారు."

కీలకం

"ఒక కథ ఎవరి ముక్కుకు చాల్తుందండి అసలు యీనాడు ప్రజల్ని ఒక కథతో తృప్తిపరచగలమా... ఈ మధ్య ఫలానా ఫలానా చిత్రాలకు డబ్బొచ్చిందంటే ఒక కథతీస్తే వచ్చిందనుకొన్నారా అబ్బే – ఇరవై ముప్పయి కథల్లోని ఘాటైన సన్నివేశాలు తీసుకొని, నవరసాల్లోనూ నానేసి, మంచి హిందీట్యూన్స్ కొన్ని మిళాయించి, హాలీవుడ్, 'ఎఫెక్ట్స్'లో కొన్ని 'డ్రీమ్‌సీన్స్' జోడించితీస్తేనే ప్రజలు కాస్త ఖంగారుపడుతూ చూస్తారు. ఎకో నారాయణా అంటూ ఒక కథతీస్తే, దానిలోవుండే లోపాలు ప్రజలుయిట్టేకనిపెట్టేసి విమర్శిస్తున్నారు. అదే ఇరవై ముప్పయి కథలు కలిపి తీశారనుకోండి! ఏదని విమర్శిస్తారు! చచ్చినట్లు చూస్తారు. ఈ కాలంలో కథా కాకరకాయా ఎవరిక్కావాలండీ! ఈ నా ప్రజలకు కావలసింది 'ఎంటర్‌టెయిన్‌మెంట్' – అంతే... అంటూ, మొన్న ఎవరో ఒక మహానుభావుడు చెపుతున్నాడు.

ఈనాడు యిరవై ఐదువారాలు పోయిన చిత్రాన్ని ఇరవైసార్లు చూసిన పెద్దమనిషిని "ఏం చూశావు నాయనా!" అని అడిగితే "అదేనండీ ఆలోచిస్తున్నాను' అంటున్నాడు. "కథేమిటి" అంటే కథమాత్రం అడక్కండి అంటున్నాడు. ఆనాడు యిట్లా అనే వాళ్ళా! ఎలావుంది సినిమా! అని అడగనివాడు పాపాత్ముడు – చాలా బాగుందయ్యా అంటూ కథంతా చెప్పేవాళ్ళు. అసలీనాటి చిత్రాల్లో కథంటూ ఉంటేగదా చెప్పడానికి. కథ చెప్పడానికి బదులు కత్తియుద్ధాలు బాగున్నాయనీ, ఫలానావాళ్ళ డాన్సులు బాగున్నాయనీ చెప్తున్నారు. పూర్వం, ప్రజలు తెరమీద పాత్రలను చూసి ఆనందించేవారేగాని, పాత్రధారులెవరో ఎరుగరు. అసలు పాత్రధారులెవరో తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా ఆనాడు ప్రజల్లో ఎక్కువగా ఉండేదికాదు. వాళ్ళకు కావలసింది మంచికథ, తియ్యటి సంగీతం ఉండే చిత్రం. అలాంటి చిత్రాన్ని ఎన్నిసార్లయినా చూసేవాళ్ళు. ఎంత దూరాన్నుండైనా వచ్చేవాళ్ళు.



ఈనాడు ప్రజలు తెరమీద పాత్రల్ని చూట్టంలేదు. పాత్రధారుల్ని చూస్తున్నారు. తమ అభిమాన పాత్రధారుడు ఏ చిత్రంలో నటించినా, ఏ పాత్ర ధరించినా, ఆ పాత్రధారుడి పిలకపట్టుకుని బయటికిలాగి పాత్రనుంచి వేరుచేసి చూసి ఆనందిస్తున్నారు. అనాడు ప్రజలు రామున్ణి, లక్ష్మణున్ణి, చూట్టానికి పరుగెత్తితే, ఈనాడు హీరోలను చూట్టానికి పరుగెత్తుతున్నారు.

ఆనాడు ఒక చిత్రంలో ఇద్దరు ముగ్గురు నటీనటులుంటే, ఏది ఎవరిపేరో తెలీకుండానే ఒక్కొక్కళ్ళు ఆ చిత్రాన్ని, పది పదకొండుసార్లు చూసేవాళ్ళు– 'గృహలక్ష్మి'లో కన్నాంబ ఎవరో, కాంచనమాల ఎవరో నిన్న మొన్నటిదాకా చాలా మందికి తెలీదు. ఆనాడు పాత్రధారులెవరో, ఎట్లావుంటారో చూడాలన్న ఆసక్తి పసిపిల్లల్లోనే ఎక్కువగా ఉండేది.

II

స్టారు మావూరొచ్చింది

ఒకసారి మావూరుకు ఎవరో సినిమాస్టారు వచ్చిందని పుకారు పుట్టింది. కొందరు కాంచనమాలే వచ్చిందన్నారు. కాదు కాదు కన్నాంబ అన్నారు కొందరు. వీళిద్దరూ కాదు ఎవరో కొత్తస్టారట, అన్నారు మరికొందరు. అసలా సినిమా స్టారెట్లా ఉంటుందో చూడాలని మా స్కూల్లో కొంతమంది పిల్లలం తీర్మానించుకున్నాం. ఆవిడ ఎక్కడ దిగిందో మెల్లిగా కూపీతీశాం. వెతకబోయిన తీగే కాలికి తగిలినట్లు, ఆ సినిమా స్టారు ఎవరో కాదు మా స్కూల్లో చదివేపిల్ల అక్కయ్యేనన్నారు. యింకేం! రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు సంతోషించాం. స్కూలు వదిలేయగానే అందరం ఆ పిల్లచుట్టూ మూగాం. వాళ్ళక్కయ్యను చూపించమని ఎట్లా అడగాలో తెలీక కాసేపు తికమకపడి ఒకళ్ళ చెవులు ఒకళ్ళం కొరుకున్నాం. మా నవ్వులూ, గుసగుసలూ చూసి ఆ పిల్లకేదో సందేహం కలిగింది. చివరకు ధైర్యంచేసి "ఏమోయ్ – మరీ – మరీ – మీ అక్కయ్య – సినిమాలో" అని మేం పూర్తి చేయకముందే ఆ పిల్ల తారాజువ్వలా లేచింది మా మీదకి – "అవునూ – మా అక్కయ్య సినిమాస్టారే! అయితే మీకేం! మిమ్మల్నేం చేసిందీ! ... సినిమాలు చూడందే ... ఉండలేరుగాని, సినిమాలో వేషాలేసే వాళ్ళంటే ఎందుకమ్మా అంత ఎగతాళీ!" అంటూ ఆ పిల్ల కరవబోయింది మమ్మల్ని.

మేం తెల్లబోయాం – సినిమాల్లో వేషాలేసే వాళ్ళంటే నీచంగా చూసే ఆ కాలంలో, వాళ్ళక్కయ్య సినిమా స్టారని మేమంతా ఆ పిల్లను ఎద్దేవా చేస్తున్నామనుకుంది పాపం – అదేం కాదని, కేవలం వాళ్ళక్కయ్య ఎట్లా ఉంటుందో ఒక్కసారి చూస్తే మా జన్మ తరిస్తుందనీ, ఎంతో వినయవిధేయతలతో ప్రాధేయపడ్డాం. ఆ పిల్ల చాలాసేపు బిగువు చేసి, చివరకు ఎట్లాగయితేనేం వాళ్ళక్కయ్యను మాకు చూపించడానికి ఒప్పుకుంది – ఎప్పుడు వెళ్ళి వాళ్ళక్కయ్యను చూడవచ్చునో చెప్పింది. భక్తి శ్రద్ధలతో విన్నాం కాని ఇంట్లో అమ్మా నాన్నా వాళ్ళకు తెలిసినా, స్కూల్లో అయివారమ్మలకు తెలిసినా వీపు చితక్కొడతారు. అదంతా జాగ్రత్తగా ఆలోచించి, ఆ రోజు మధ్యాహ్నం స్కూలుకు నామం వేసి బయల్దేరాం. ఆ సినిమాస్టారు చెల్లెలివెంట – ఆ పిల్ల మమ్మల్ని బయటవాకిట్లోనే ఉంచి తనుమాత్రం లోపలికెళ్ళింది. మారుమూలవున్న వాళ్ళ ఇంటి ముందు కొన్ని గంటలు పడిగాపులు పడ్డాం పిల్లలందరం. చాలా సేపటికి ఆ పిల్ల బయటకొచ్చి మమ్మల్ని లోపలకు రమ్మని సౌంజ్ఞచేసింది. మేమంతా సంతోషంతో ఒక్కసారిగా లోపలికి పరుగెత్తాం. ఆ పిల్ల టక్కున మాకడ్డు నిలబడి 'ఉస్ మెల్లిగా శబ్దం చేస్తే అక్కయ్యకు తలనొప్పి' అన్నది. మేం హడలిపోయి అడుగులో అడుగువేసుకుంటూ లోపలికెళ్ళాం. దేవలోకంనుంచి దిగివచ్చిన రంభలాగా ఆ సినిమాస్టారు మాకు దర్శనం ఇవ్వబోతోందని ఆశించి వేయికండ్లతో ఎదురుచూశాం. ఆవిడ ఏవైపు నుంచి వస్తుందోనని దిక్కులు చూస్తూ నిలబడినాము.



"ఈవిడే మా అక్కయ్య" అంటూ మా ముందే నేలమీద దిండేసుకుని పడుకునివున్న నల్లటి దుక్కలాంటి ఒక ఆడమనిషిని చూపిందాపిల్ల. కండ్లు తిరిగి మైకం వచ్చినంతపనయింది మాకు... మా ఉత్సాహం అంతా ఒక్కసారిగా చల్లబడిపోయింది. సినిమాస్టారంటే ఎంతో అందంగా, తెల్లగా, సినిమాల్లో కనిపించినట్టే కనిపిస్తుందనుకున్నాం. మా కంటికి ఆవిడ పనిమనిషికంటే అన్యాయంగా కనిపించింది. ఒక్కక్షణం అక్కడ నిలబడలేకపోయాం. పిల్లలందరం బయటికొచ్చేస్తుంటే, ఆ సినిమాస్టార్ చెల్లెలు కూడా మా వెనకాలే వాకిటిదాకా వచ్చింది. అదిసరేగాని, ఏమేయ్ మరీ, సినిమాల్లో అందరి ముఖాలూ తెల్లగా కనిపిస్తాయే, అదేమిటీ మీ అక్కయ్య ముఖం అంత నల్లగా ఉంది. "పాతచింతపండులాగా!' అని అడిగిందా పిల్లను మాలో ఒక గడుసుపిల్ల. "సినిమాల్లో మేకప్ వేసుకుంటారట్నోయ్... ఆ మేకప్ వేస్తే నల్లటి వాళ్ళ ముఖాలు, తెల్లటివాళ్ళ ముఖాలూ అన్నీ ఒకటిగానే కనపిస్తాయట సినిమాల్లో." మా అక్కయ్య చెప్పింది. అన్నదాపిల్ల.

"అన్నట్టు మీ అక్కయ్యను మేం ఏ సినిమాల్లోనూ చూళ్ళేదే! ఏం వేషాలేసింది!" అంటూ ఓ చచ్చుప్రశ్న వేసింది మరోపిల్ల.

"మా అక్కయ్య పెద్ద పెద్ద ఎక్స్ట్రావేషాలేస్తుంది. మైరావణలో రాక్షసుడి భార్యగా వేసింది, మాలపిల్లలో ఒక మాలవాడి భార్యగా వేసింది, ఓయబ్బో... ఇంకా, చాలా వేషాలేసింది... అసలు మా అక్కయ్య లేని సినిమాలేదే!" అన్నదాపిల్ల.

అసలు ఎక్స్ట్రావేషాలంటే ఏమిటో ఆనాడు మాకేం తెలుసు. అవేవో చాలా పెద్దవేషాలేగాబోలనుకున్నాం. అదే యీనాటి పిల్లల్ని కదిలిస్తే! ఏది ఎలాంటి వేషమో చెప్పడమే కాకుండా, చాలా పెద్ద పెద్ద విషయాలు మాట్లాడతారు.

నాపసానిలాటి పాపలు

మొన్న ఆ మధ్య సినిమాల్లో చేరాలంటూ వచ్చిన ఒక పాపను చూశాను. ఆ పాపవెంట వాళ్ళ అవ్వగారు కూడా వచ్చింది. ఇంక ఆ పాప వయసుకుమించిన మాటలూ, చేష్టలూ చూస్తుంటే, ఆశ్చర్యంతో గుడ్లుతేలేశాను. ఆ పిల్లవయసెంతో తెలుసా అని అడిగింది నా పక్కనున్నావిడ. తెలీదనన్నాను. డెబ్భై ఏండ్ల ముసల్ది ఆ పాప. అన్నదావిడ. నాకు నవ్వొచ్చింది. నిజంగానే ఆ పిల్ల అన్ని విషయాలూ, కాచివడయకట్టిన నాపసానిలాగా చేతులు త్రిప్పుతూ చెబుతోంది కబురు. అదంతా ఈ రోజుచలాకీతనం కింద చలామణీ అయినా, రేపు ఆ పిల్ల భవిష్యత్తుకి ఆ చలాకీతనం హానికలగజేస్తుందనిపించింది.

ముద్దుక్కూడా హద్దుండాలి. పిల్లలు ఏ వయసుకు తగినట్టు ఆ వయసుకుంటేనే వాళ్ళ జీవితాల యొక్క పునాదులు చెక్కు చెదరకుండా ఉంటాయి. ఆనాడు పసిపిల్లల్లో తెలివితేటలుంటే చదువు సంధ్యల్లో ఉండేవి మిగతా విషయాల్లో వయస్సుకు తగినట్టే ఉండేవాళ్ళు ఆనాటి పిల్లలు – ఈనాడు పిల్లలు పుడుతూనే సకలశాస్త్రాలూ చదివి మరీ పుడుతున్నారు. ఇంక వాళ్ళకు సినిమాలకోసం చలాకీతనం అంటూ నేర్పిస్తే అగ్గికి గుగ్గలం తోడయినట్లే.

చలాకీతనం అంటే నాకు, కీ.శే. శ్రీ గూడవల్లి రామ బ్రహ్మంగారు జ్ఞాపకం వస్తారు.

ఒకరోజు కోర్టుపనిమీద చెన్నపట్నం బయలుదేరిన నాన్నవెంట నేనూ పట్నం చూస్తానంటూ బయలుదేరాను. పట్నం అంతా చూసినతర్వాత సినిమాలు తీసేచోటు చూపించమని నాన్నను వేధించడం మొదలుపెట్టాను. నాన్నకు మిత్రులు శ్రీ డా॥గోవిందరాజుల సుబ్బారావుగారు అప్పట్లో మాలపిల్లలో వేషం వేస్తున్నారు. ఆయనద్వారా నాన్న నాకు మాలపిల్ల, ఆమె చెల్లెలు, కథానాయకుడూ, ముగ్గురూ కలిసి పాడుతున్నారు పాట – నా అభిమానతార కాంచమాలను ఆ రోజు కళ్ళారా చూశాను... ఇంక నా సంతోషం చెప్పతరంగాదు. ఊరికి వెళుతూ సాధించిన ఘన విజయాన్ని గురించి నా స్నేహితురాండ్లందరితోనూ చెప్పదలచుకున్నాను. షూటింగ్ అయిపోయింది. నాన్ననూ, రామబ్రహ్మంగారికి పరిచయం చేస్తూ, ఈ పాప చాలా బాగా పాడుతుందండీ అన్నారు డా॥గోవింద రాజుల సుబ్బారావు గారు.



"అల్లాగా! ఏది ఒక పాట పాడమ్మా" అన్నారు రామబ్రహ్మం గారు.

పట్నం చూట్టానికి వచ్చిన నన్ను పాట పాడమంటారని నాకేం తెలుసు! పైగా నా అంతట నేను పాడితే వినాల్సిందేగాని, "ఏది ఓ పాట పాడమ్మా అంటే ఆనాటి నుండి ఈ నాటికి పాడలేని నేను ఆ రోజుకూడా రామబ్రహ్మంగారు పాడమనే సరికి భయంతోనూ, సిగ్గుతోనూ బిగుసుకుపోయాను తల భూమిలోకి దించుకుని హీనస్వరంతో ఏదో పాడాను:

'ఈ పాప మాలపిల్ల చెల్లెలు వేషానికి బాగుండేది కదండీ' అన్నాడు డా॥గోవింద రాజుల సుబ్బారావు గారు.

ఆలోచించండి-చెప్పండి

- *సినిమా నటులను చూసినప్పుడు మీకేమనిపిస్తుంది? వారితో ఏం మాట్లాడతారు?*
- *గతంలో సినిమాలలో నటించడానికి నామోషీగా భావించేవారు. నేడు దాన్ని గొప్పగా చూస్తున్నారు. ఈ మార్పు ఎందుకు చోటుచేసుకొంది?*
- *పాట పాడమంటే భానుమతి భయంతోనూ, సిగ్గుతోనూ బిగసుకు పోయింది కదా! మీకెప్పుడైనా ఇలాంటి అనుభవం ఎదురైందా? ఏ ఏ సందర్భాలలో ఎదురైంది?*
- *ముద్దుచేయడానికి కూడా హద్దుండాలని భానుమతి ఎందుకన్నది?*

'కాళింది' దొరికింది

'బాగుండేదికాని, ఈ పాపకు చలాకీతనం లేదు. ఇంత సిగ్గు భయాలుంటే యీ అమ్మాయి సినిమాలకు పనికిరాదు' అన్నాడు రామబ్రహ్మంగారు. బ్రతుకు జీవుడా అనుకున్నాను. చలాకీతనం లేకపోవడం వల్ల ఆ రోజు బ్రతికి బయటపడ్డాననుకున్నానేగాని, ఆ తర్వాత 'పరివిక్రయం' అనే కథలో కాళింది అనే పిల్ల నా కోసం కాచుకూర్చొనుందని నాకేం తెలుసు. కాళింది వేషం వేయడానికి ఒకమ్మాయి కావాలంటూ కాలికి బలపం కట్టుకుని వెతుకుతున్నారు శ్రీ సి.పుల్లయ్యగారు. ఆయన కంటికి నేనే కనిపించాలా. "ఏది ఓ పాటపాడు అమ్మడూ" అన్నారు పుల్లయ్యగారు. మళ్ళీ ఎప్పట్లాగే బిగుసుకుపోయాను. ఆయన ఎదురుగా పాడే, ధైర్యంలేక గోడవైపు తిరిగి, గొర్రెలా తలవంచుకుని యిష్టంలేకుండా ఏడుపుముఖంతో ఏదో పాడాను. పుల్లయ్యగారు కూడా "ఈ అమ్మాయి సినిమాలకు పనికిరాదు" అంటారని ఆశించాను. కాని కథ అడ్డం తిరిగింది.

పుల్లయ్యగారు నవ్వుతూ, "అసలీ అమ్మాయేనండీ మా కాళిందీ" అన్నారు నాన్నతో. నాన్నకూడా ఆశ్చర్యపోయాడు. నటించే అవసరంలేకుండా అన్ని విధాలా నన్ను పోలిన కాళిందిలాంటి ...నాకు తొలిచిత్రంలోనే గనక దొరక్కపోయినట్లయితే బహుశా నాలాంటి బెదురుగొడ్డుకు సినిమాల్లో అసలు స్థానం ఉండేది కాదు. దానికి తగినట్లు సినిమాలంటేనూ, సినిమాల్లో వేషాలేసే వాళ్ళంటేనూ నీచంగా భావించే ఆకాలంలో సినిమాల్లో నటించడం అంటే నాకు సుతారమూ ఇష్టం ఉండేదికాదు. సినిమాలు చూడటంవరకేగాని, అనుకరించడం తప్పుగా భావించేవాళ్ళానాడు ఏ యిల్లాలైనా పొరపాటున కాస్త ఎత్తుగా బర్మాముడి వేసుకుని పూలుచుట్టుకుంటే, వెంటనే 'సినిమా ఫ్యాషన్లు చేసుకుందర్రా" అంటూ ఆవిణ్ణి వెలేసినట్లు చూసేవారు.

ఒకసారి మా వీధిలోవున్న పోస్టుమాస్టరుగారి భార్య చుక్కమ్మ... గృహలక్ష్మిలో కన్నాంబగారు వేసుక్నుట్లు ఎత్తుగా బర్మా ముడి వేసుకుని పూలుచుట్టుకుని మా పక్కింటికి పేరంటానికి వచ్చింది. ఆవిడతో అంతకుముందు ఎంతో ఆప్యాయంగా మాట్లాడే అమ్మలక్కలందరూ ఆవిడ బర్మాముడి చూడగానే ఠక్కున మాట్లాడటం మానేశారు. పాపం ఆవిడ చిన్నబుచ్చుకుని



యింటికి వెళ్ళిపోయింది. ఆవిడటువెళ్తూనే, "ఏవమ్మో వదినా! ఇది విన్నావా! చుక్కమ్మ సినిమాల్లో చేరబోతోందట్నే! అంటూ ఆరంభం చేసిందో కలహకంఠి. మరీ తెలీడంలా! ఆ బర్మాముడి, ఆ వాలకం చూస్తుంటే సినిమాస్టారులాగా! అంటూ మూతి విరిచింది ఒకావిడ.

ఎన్ని మారినా

ఆనాటికానాడు ప్రజల్లో సినిమామోజు ఎక్కువయ్యేకొద్దీ, ఒకప్పుడు చుక్కమ్మ నన్నవాళ్ళే బర్మాముళ్ళు వేసుకోవడం దగ్గర్నుంచీ చేతుల్లేని జాకెట్లతోసహా వేసుకోవడం మొదలెట్టారు. అప్పట్నుంచీ ఒకళ్లను చూసి ఒకళ్ళు ఫాషన్లలో సినిమాలకంటే అడ్వాన్సుగా వెళ్ళడం మొదలెట్టారు. ఈనాడు సినిమా ఫ్యాషనంటూ ఏమీ మిగల్లేదు. ప్రజలు దగ్గర్నుంచే ఫాషన్లు నేర్చుకుంటున్నారు సినిమావాళ్ళు. రోజులు మారాయి. ఆనాడు ఫలానాపిల్ల సిగ్గులేకుండా సినిమాల్లో డాన్సు చేస్తోందట్నే అన్న అవ్వగార్లే యీనాడు మనవరాళ్ళ భరతనాట్యానికి స్వయంగా తాళం వేస్తున్నారు. పిల్లలు సినిమాలు చూసి చెడిపోతున్నారనీ, పిల్లల్ని సినిమాల్లో చేర్చడంకంటే ఉరిపోసుకుచావడం మేలనీ, ఉపన్యాసాలిచ్చిన పెద్దలే ఈనాడు తమ పిల్లల్ని వెంటబెట్టుకుని మా పెద్దమ్మాయి బాగా పాడుతుంది. మా చిన్నమ్మాయి బాగా డాన్సు చేస్తుంది అంటూ ముందుకొస్తున్నారు. కాలం మారింది. మనుషులు మారారు. సినిమా కథలు మాత్రం మారలేదు.

III

మూడడుగులు ముందుకువస్తే

"ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోట్నే" అన్న సామెతగా తయారవుతున్నాయి ఈ నాడు కొన్ని చిత్రాలు. ఆనాటి నుండి ఈనాటి దాకా పరమపద సోపానపటంలో నాలుగుమెట్లు పైకివెళ్ళడం, పాముకరిస్తే కిందికి జారడంలాగా ఉంది చలనచిత్రపరిశ్రమ పరిస్థితి. కొన్ని ఉత్తమచిత్రాలు పరిశ్రమను నాలుగుమెట్లు పైకి తీసుకువెళితే, కొన్ని చెత్త చిత్రాలు పరిశ్రమను పదిమెట్లు కిందికి లాగుతున్నాయి. ఆనాటి పరిశ్రమలో అడుగుపెట్టిన వ్యక్తులందరికీ ఏదో ఒక అడ్రసు ఉండేది. కొంత చదువూ సంస్కారమూ ఉండి, చలనచిత్ర నిర్మాణం ఒక కళగా భావించి, ఇంట్లోనుంచి డబ్బు తీసుకొచ్చి సినిమాల్లో పెట్టి చేతులు కాల్చుకున్నవాళ్ళేగాని యీనాడులాగా కేవలం తాడూ బొంగరంలేని వ్యక్తుల్లా ఆనాడు రాలేదు. ఒకప్పుడు ఒక చిత్రానికి కొంతయినా పెట్టుబడి పెడితేనే ప్రొడ్యూసరు కాస్తో కూస్తో 'టెక్నిక్' తెలిసి, అనుభవం వుంటే డైరెక్టర్ ఈనాడు యిట్లా చూసినవాండ్లు అట్లా ప్రొడ్యూసరూ, డైరెక్టరూ అయిపోతున్నారు. నలుగురైదుగుర్ని చంపందే డాక్టరు కాడన్న సామెతగా నాలుగయిదు చిత్రాలు తీసిందాకా షాటు ఎట్లా తీయాలో తెలీయకుండానే డైరెక్టరుగా చెలామణీ అవుతున్నారీనాడు కొందరు అదృష్టవంతులు డిస్ట్రిబ్యూటర్లూ, టెక్నీషియన్లు చల్లగా ఉన్నన్నాళ్ళూ యీనాడు ఎవరైనా ప్రొడ్యూసరు కావచ్చు. ఎవరైనా డైరెక్టరు కావచ్చు.

ఒకప్పుడు ఒకళ్ళు ఒక చక్కని చిత్రాన్ని నిర్మిస్తే, ఆ చిత్రానికన్నా మిన్నగా యింకో చిత్రాన్ని నిర్మించాలనే కళాభిమానంతోనూ, ఉత్సాహంతోనూ కృషిచేశారు. కొందరు ఈనాడు అర్థంలేని చిత్రానికి అనవసరంగా డబ్బొస్తే, డబ్బు రావడానికి ఆ చిత్రంలోగల ప్రత్యేక అవలక్షణాలేమిటో కనుక్కుని, అంతకు మించిన అవలక్షణాలతో మరొక చవకబారు చిత్రాన్ని తయారుచేసి ప్రజలకందిస్తున్నారు కొందరు.



ఒకళ్ళు 'సీతారామ యుద్ధం', అంటే మరొకళ్ళు 'హనుమంతుడి తోక' అంటూ ఆరంభిస్తున్నారు. అసలు సీతకూ, రాముడికి యుద్ధం ఏమిటర్రా మీ పిండాకూడా! అని అడిగే దిక్కులేదు. ఒకవేళ ఎవరికి తెలీకుండా సీత, రాముడితో యుద్ధం చేసింది కాబోలు... అనుకుని మతులుపోయి చూస్తున్నారీనాడు ప్రజలు కూడా. మరి సీతారామ యుద్ధం అంటూ వాళ్ళెవరో తీస్తున్నారు గదా మళ్ళీ హనుమంతుడి తోక అంటూ వేరే చిత్రం తయారుచేయడం ఎందుకు? అని అడిగితే అబ్బే వాళ్ళ హనుమంతుడు వేరు ఇది వేరు. మా కథలో హనుమంతుడి తోకే 'హీరో' అంటున్నారు. ఇంక కోతుల మేకప్ కోసం కొబ్బరిపీచుకు ఎక్కడలేని డిమాండు. ఆనాడు హనుమంతుడితోక నిజమైందా లేక పీచుదా అనే విషయాన్ని ప్రజలకు తెలీకుండా తీయడానికి ప్రయత్నించారు. యీ నాడు యిది ఒట్టి కొబ్బరిపీచుతోక అని నిరూపిస్తున్నారు.

ఇంతకంటే పూర్వం వచ్చిన పౌరాణిక చిత్రాలే వెయ్యి రెట్లునయం అనిపించేటట్లు తీస్తున్నా రీనాడు కొన్ని పౌరాణికాలు.

దక్షిణదేశంలో నేటి చలనచిత్ర పరిశ్రమ, టెక్నికల్‌గా ఎంతో ఉన్నతస్థాయికి వెళ్ళినా, యింకా అందుకోవలసిన శిఖరాలను అందుకోలేకపోతోందనే చెప్పాలి.

హాలీవుడ్ నిర్మాతలు పదిహేను సంవత్సరాల క్రితం టెక్నికలర్ చిత్రాలు తీయడం మొదలుపెట్టారు. మనం యింకా గేవా కలర్‌లోనే ఉన్నాం. వాళ్ళు సినిమా స్కోపులుదాటి పోతున్నారు. మనం యింకా బైస్కోపుల్లోనే వున్నాం. రోజు రోజుకూ తారాస్థాయినందుకుంటున్న హాలీవుడ్ వాళ్ళ చిత్రాలు చూస్తుంటే మనం ఎక్కడున్నామా అనిపిస్తుంది. ఆనాడు మన్నుతిన్న కృష్ణుడినోట్లో యశోదమ్మ ప్రపంచాన్నంతా చూసినట్లు, యీనాడు హాలీవుడ్ వాళ్ళు ప్రపంచాన్నంతా సినిమాస్కోపులో ఇమిడ్చి చూపిస్తున్నారు.

గంగిగోవుపాలు

మనం కూడా ఆ విధంగా సినిమాస్కోపు చిత్రాలను తీయగలిగిననాడు, భారతం, రామాయణం, లాంటి గొప్ప పౌరాణిక గాథలను ఖండ ఖండాలుగానూ, పిండ పిండాలుగానూ చేయకుండా యథాతథంగా తీసే అవకాశం ఉంటుంది. ఈనాడు సిసిల్ బిడిమిల్ 'టెన్ కమెండ్‌మెంట్స్' చిత్రం తీశాడంటే హడలిచచ్చేట్లు తీశాడు. కేవలం మానవసృష్టి, అనుకోడానికి వీల్లేనంత అంతస్తుకెళ్ళి తీశాడు. అలాంటి గొప్ప గాథను ఏ విధంగా తీస్తే బాగుంటుందో, ఆ విధంగానే తీయడానికి కృషిచేసి, అదే తన జీవిత లక్ష్యంగా భావించి తీశాడామహనీయుడు. అలాంటి గొప్ప చిత్రాలను నిర్మించాలంటే మనవాళ్ళు ఆర్థికంగా నిలవలేకపోవచ్చు. కాని ఒక మంచిచిత్రాన్ని నిర్మించడానికి నలుగురయిదుగురు నిర్మాతలు కలిసి సమిష్టిగా కృషిచేయవచ్చు. ముఖ్యంగా చిత్ర నిర్మాణం కేవలం సమిష్టి కృషి మీదనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఒక చిత్రం విజయవంతం కావాలంటే దానికి ఎంతో మంది పాటుపడాలి. అలాంటప్పుడు నలుగురు నాలుగు చెత్త చిత్రాలు తీసేబదులు, నలుగురూకలిసి ఒక మంచి చిత్రాన్ని నిర్మించగలిగిననాడు పరిశ్రమ ఎంతయినా బాగుపడుతుంది. 'గంగిగోవుపాలు గంటెడైనను చాలు' అన్నట్టు అలాంటి ఉత్తమ చిత్రాలు కొద్దిగా వచ్చినా చాలు.

ఈనాడు 'నామ్‌నీశానీ' లేని నలుగురు కలిసి కంపెనీ పెట్టి ఒక చిత్రాన్ని ఆరంభించడం ఆ చిత్రం పూర్తయ్యేలోగానే నలుగురూ విడిపోయి నాలుగు కంపెనీలు లేపడం, మళ్ళీ ఆ నాలుగు కంపెనీల్లోనూ ఒక్కొక్క కంపెనీకి నలుగురు భాగస్థులు చేరడం, తీసే చిత్రాలు పూర్తిగాకముందే మళ్ళీ ఆ నాలుగు కంపెనీలలోని భాగస్థులూ విడిపోయి, నాలుగు నాలుగు పదహారు కంపెనీలు లేవదీయడం జరుగుతోంది. ఈనాడు మదరాసులో ఏ వీధిలో చూసినా ఫిలిం కంపెనీలే! పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇలాంటి అర్ధాయుషు ఫిలిం కంపెనీలు తెలుగు చిత్రపరిశ్రమలో కంటే తమిళ చిత్రపరిశ్రమలోనే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేవలం వ్యాపారదృష్టితో బయలుదేరుతున్న ఇలాంటి కంపెనీలవల్లనే ఈనాడు పరిశ్రమ చెదలుపట్టింది.



భారతదేశంలో హిందీ చలనచిత్రపరిశ్రమ తర్వాత, చెప్పుకోదగ్గ ఉన్నతస్థాయిలో నడిచింది, తెలుగు చిత్రపరిశ్రమ ఒక్కటే. శాంతరాంలాంటి గొప్పవాళ్ళు కొందరు తీసే చిత్రాలు మినహాయించి, ఈమధ్య వచ్చే కొన్ని హిందీ చిత్రాలు చూస్తుంటే చవకబారు ఇంగ్లీషు చిత్రాలను డబ్‌చేశారా అనిపిస్తోంది. ఆ విషయంలో దక్షిణ దేశంలో తయారయ్యే చిత్రాలే ఎన్నోరెట్లు మెరుగనిపిస్తుంది.

మొన్న ఆమధ్య మద్రాసు ఆర్థికమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంగారు కూడా తెలుగు చిత్రాలను ఎక్కువగా ప్రశంసించారు. తెలుగు చిత్రాలు ఎంతో క్లీన్‌గానూ, నీట్‌గానూ ఉంటాయనీ, ఉత్తమ చిత్రాలు తీయడంలో తెలుగువారికే అగ్రతాంబూలం ఇవ్వాలనీ అన్నారు.

ఈ మధ్య తయారవుతున్న కొన్ని చవకబారు చిత్రాలు తప్పితే గత ఇరవై సంవత్సరాల్లోనూ తెలుగు చిత్రపరిశ్రమ చెప్పుకోదగ్గ ఉన్నతస్థాయి నందుకొన్నదనే చెప్పాలి. ఆ స్థాయిని నిలబెట్టుకోవాలంటే పరిశ్రమలో ఉండే కొందరు నిర్మాతలు ఉత్తమచిత్రాలే తీయడానికి కంకణం కట్టుకోవాలి. చక్కని చిత్రాలు తీస్తూ, పరిశ్రమకే గర్వకారణమైన కొన్ని సంస్థలు యీ నాడు డబ్బుకోసం కత్తియుద్ధాలు తీస్తున్నారంటే, కంచె చేను మేసే సామెతగా పరిశ్రమ ఎంత దిగజారిపోతోందో తెలుస్తోంది.

ఇంతటైనా పౌరాణికాలు, జానపదాలూ, మనక్కూడా సినిమాస్కోపులొచ్చేదాకా ఆపి, ప్రజల విజ్ఞాన వికాసాలకు తోడ్పడే ఉత్తమ సాంఘిక చిత్రాలు నిర్మించగలిగితే పరిశ్రమ మరింతగా ఔన్నత్యాన్ని అందుకోగలదని నా అభిప్రాయం.

ఆలోచించండి-చెప్పండి

- *సినీపరిశ్రమ ఉన్నత శిఖరాలు అందుకోవడం అంటే ఏమిటి? వివరించండి.*
- *"తాడూ - బొంగరం లేని వ్యక్తులని" ఎవరిని అంటారు. ఈ జాతీయాన్ని భానుమతిగారు ఎందుకు ఉపయోగించారు?*
- *"గతంలోని పౌరాణిక చిత్రాలే నేటి పౌరాణిక చిత్రాలకంటే మేలు" దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.*
- *గంగి గోవుపాలు గంటెడైనను చాలన్నట్లు మంచి చిత్రాలు కొద్దిగా వచ్చినా చాలు అని ఎందుకన్నది?*
- *చలనచిత్ర పరిశ్రమ దిగజారి పోవడం అంటే మీరేమను కుంటున్నారు?*

("ఆంధ్ర" వార పత్రిక స్వర్ణోత్సవ సంచిక, 14-1-1959)

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. సినిమాల గురించి మీ అభిప్రాయాలను సొంతమాటల్లో చెప్పండి.

2. మీకు ఎలాంటి సినిమాలంటే ఇష్టం? ఎందుకు? వివరించండి.

3. పాఠం చదవండి. పాఠంలోని జాతీయాలు, సామెతలను పట్టిక రూపంలో రాయండి.

4. కింది అంశాలకు సంబంధించిన సమాచారం పాఠంలో ఏ ఏ పేరాల్లో ఉందో గుర్తించండి.

అ) సినిమా ప్రచారం
ఆ) సినిమాహాళ్ళ పరిస్థితి
ఇ) సినిమా కథ
ఈ) చిత్ర నిర్మాణం



5. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జావాబులు రాయండి.

సినిమా ఉత్తమమైన కళా స్వరూపం. చలన చిత్రాల్లో వివిధ లలిత కళల సమ్మిళితాన్ని చవిచూపించవచ్చు. అనేక మంది కళాకారుల అహోరాత్రుల కృషిని, సృజనాత్మకతశక్తిని చలనచిత్రాల్లో చూస్తున్నాం. ఈ కళా ప్రవంతిని నిర్మాతలు వ్యాపార మైదానం వైపు మళ్ళించవలసి వచ్చినప్పుడు అందులో మాలిన్యం కొంత మిళితం కాక తప్పదు. దానివల్ల 'కళ'లోని పరిశుద్ధత కొంత విరిగిపోకా తప్పదు. అలా కాకుండా చూడాలంటే ఆర్థికరీత్యా దెబ్బతినవలసి వస్తుంది. కోట్ల డబ్బులు వెచ్చించే ఏ నిర్మాతా నష్టపడడానికి ఇష్టపడడు. ఐనప్పటికీ ప్రపంచశాంతిని ఆశించే మనం మన సంస్కృతిని, మన కళలను, మన విజ్ఞానాన్ని ప్రతిబింబించే చిత్రాల్ని నిర్మించాలి. మన సంస్కృతికి, విజ్ఞానానికి మూలపురుషులైన మహామహుల జీవిత చిత్రాల్ని తెరకెక్కించి మన పూర్వోన్నత్యాన్ని జ్ఞప్తికి తేవాలి. అపుడే మనం చలన చిత్రాల్ని సద్వినియోగం చేసుకొన్నట్లవుతుంది.

అ) సినిమాలకు, కళలకు గల సంబంధం ఏమిటి?

ఆ) సినిమాల ద్వారా ఏమి వెల్లడవుతుంది?

ఇ) సినిమాలలో కళా విలువలు లోపించడానికి కారణాలు ఏమిటి?

ఈ) ఎలాంటి సినిమాల నిర్మాణం జరగాలి?

ఉ) సినిమాలను మనం ఎలా సద్వినియోగం చేసుకోవాలి?

6. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు 4, 5 వాక్యాలలో జవాబులు రాయండి.

అ) 'కృష్ణలీలలు' కరపత్రాల పంపిణీ చూసి ఎవరెవరు ఏమనుకొన్నారు?

ఆ) నాటి ప్రేక్షకుల అభిరుచి ఎలా ఉండేది?

ఇ) చిత్రనిర్మాణం గురించి భానుమతిగారిచ్చిన సలహాలు, సూచనలు ఏమిటి?

ఈ) చిత్రనిర్మాణం గురించి భానుమతిగారు ఏమని విమర్శించారు?

ఉ) భానుమతిగారి గొప్పదనం గురించి రాయండి.

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి 4, 5, వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) కథా విషయానికి వస్తే నాటి సినిమాల ముందు నేటి సినిమాలు నిలువలేవని భానుమతిగారు ఎందుకన్నారు?

ఆ) "ముద్దుకు కూడా హద్దుండాలి" అని భానుమతిగారు ఏ సందర్భంలో అన్నారు? ఎందుకన్నారు?

ఇ) నాటి ప్రేక్షకులతో పోల్చితే, నేటి ప్రేక్షకుల అభిరుచి ఎలా మారింది?

ఈ) నేటి సినిమాల గురించి ప్రచారం చేయడం కోసం ఏమేం చేస్తున్నారు?

2. కింది ప్రశ్నలకు ఆలోచించి 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) భానుమతి గారు 1960 దశకంలోని సినిమాల పరిస్థితిని, ఆ తరువాత ఉన్న పరిస్థితితో పోల్చి వ్యాసం రాసారు కదా! నేటి సినిమాలు ఎలా ఉన్నాయో విమర్శనాత్మకంగా రాయండి.



ఆ) గతంతో పోలిస్తే నేడు పౌరాణిక చిత్రాల నిర్మాణం తగ్గిందికదా! ఇలా ఎందుకు జరిగి ఉండవచ్చు? కారణాలను వివరిస్తూ రాయండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) నేటి సినిమాల్లో హింస, అశ్లీలతలు అరికట్టబడేలా చర్యలు చేపట్టమని వార్తా పత్రికలకు ఒక లేఖ రాయండి.

ఆ) "చలన చిత్రాలు – ప్రయోజనాలు – నష్టాలు" అనే అంశం గురించి వ్యాసం రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది అంశాలను వేటితో పోల్చారో పాఠం ఆధారంగా రాయండి.

అ) కరపత్రాలు (తెల్లని కాగితాలు) : _____

ఆ) సినిమావాళ్ళు : _____

ఇ) కథాబెలం లేని సినిమా : _____

ఈ) సినీనటి ముఖం : _____

ఉ) ఈ నాటి సినిమాలు : _____

2. కింద తెల్పిన జాతీయాలనుపయోగించి సొంతవాక్యాలు రాయండి.

అ) తారా జువ్వలా లేవడం : _____

ఆ) గుడ్లు తేల వేయడం : _____

ఇ) చెవులు కొరుక్కోవడం : _____

ఈ) కాలికి బలపం కట్టుకోవడం: _____

ఉ) కథ అడ్డంతిరగడం : _____

3. కింది పదాలు చదవండి. పాఠం ఆధారంగా వీటికి వివరణలు రాయండి.

అ) తారా జువ్వలా లేచింది : _____

ఆ) ఆ పిల్ల కరవ బోయింది : _____

ఇ) స్కూలుకు నామంవేసి వెళ్ళాం : _____

ఈ) గంగి గోవుపాలు గంటెడైనను చాలు : _____

ఉ) అగ్ర తాంబూలం : _____



IV. భాషా కార్యకలాపాలు

1) ఈ మధ్యకాలంలో విడుదలైన ఏదైనా ఒక సినిమా గురించి రాసిన సమీక్ష వ్యాసాన్ని సేకరించండి. దాని గురించి సొంతమాటల్లో రాసి ప్రదర్శించండి.

2) మీరు చూసిన ఏదైనా ఒక సినిమా గురించి నివేదిక రాసి ప్రదర్శించండి (లేదా) ఈ మధ్యకాలంలో బాలల చలనచిత్రోత్సవ వేడుకలలో అవార్డుపొందిన సినిమా గురించిన వివరాలు సేకరించి నివేదికను రాసి ప్రదర్శించండి.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది వాక్యాల్లో ఉన్న 'అనునాసిక', 'పద్వాది' సంధుల పదాలను గుర్తించి విడదీయండి. సూత్రం రాయండి.

అ) ఎక్కడ కూర్చున్నది మరచిపోయి తన్మయులమై చూసేవాళ్ళం.

ఆ) నీవు సందేహపడనవసరం లేదు.

ఇ) పురాణ వాఙ్మయం చూసి భయపడకు. చదివి ఆనందపడు.

ఈ) సన్నుతి చేయుము.

ఉ) రాణ్మణి యుద్ధంలో భంగపడడు.

2. కింది వాక్యాలను ప్రత్యక్ష, పరోక్ష కథనంలోకి మార్చండి.

అ) నేను నేటి సినిమాలను చూడలేకపోతున్నాను అని అమ్మతో అన్నాను.

ఆ) నీకివ్వాల్సింది ఏమీలేదు అని నాతో అతడన్నాడు.

ఇ) సుందరకాండ చదవమని నాకు ఉపాధ్యాయుడు చెప్పాడు.

ఈ) వాళ్ళమ్మ చెప్పింది భానుప్రకాశ్ ఊరికెళ్ళాడని.

ఉ) చెన్నయ్య పద్యాలు బాగాపాడాడని అందరనుకుంటున్నారు.

పరిచయం

1. అర్థాలంకారాల్లోని మరొక అలంకారాన్ని తెలుసుకుందాం.

ఉదా॥ i) మా చెల్లెలు తాటి చెట్టంత పొడవుంది.

ii) దేవాలయ గోపురాలు ఆకాశానికంటుతున్నాయి.

పై వాక్యాల్లో చెల్లె ఎత్తును, గోపురాల ఎత్తులను ఉన్న ఎత్తు కంటె ఎక్కువచేసి చెప్పడం జరిగింది కదా! అంటే అతిశయంగా చెప్పడం అన్నమాట. ఇలా చెప్పటాన్ని అతిశయోక్తి అలంకారంతో చెప్పటం అని అంటారు.

లక్షణం : ఉన్న విషయాన్ని ఉన్నదానికంటె ఎక్కువచేసి చెప్పడం.

కింది లక్ష్యాలను పరిశీలించండి. అలంకారం గుర్తించండి.

i) కం. చుక్కలు తల పూవులుగా
అక్కజముగ మేనుపెంచి యంబర వీధిన్
వెక్కసమై చూపట్టిన
అక్కోమలి ముదము నొందె ఆత్మస్థితికిన్

ii) మా పొలంలో బంగారం పండింది.



"సినిమా ఉత్తమమైన కళాస్వరూపం. దీని ద్వారా ఒక దేశం యొక్క సంస్కృతి సంప్రదాయాలు ఇతరులకు తెలుస్తాయి."

– కాన్‌స్టెంటు లాంబర్టు





2. బసవపరిణయం

– పాల్కురికి సోమనాథుడు

చదవండి – ఆలోచించి చెప్పండి.

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండీ ॥2॥

సిరికల్యాణపు బొట్టును పెట్టి బొట్టును పెట్టి
మణి బాసికమును నుదుటను గట్టి – నుదుటను గట్టి
పారాణిని పాదాలకు పెట్టి... ఆ... అఅఆ... అఅఆఆ... ॥2॥

పెళ్ళి కూతురై వెలసిన సీతా... కల్యాణం చూతమురారండీ ॥శ్రీసీతా॥

సంపంగి నూనెను కురులను దువ్వి – కురులను దువ్వి –
సొంపుగ కస్తూరి నామము దీర్చి – నామము దీర్చి –
చంప జివ్వాది చుక్కనుబెట్టి – ఆ... అఅఆ... అఅఅఆ...॥2॥

పెళికొడుకై వెలసిన రాముని కల్యాణం చూతము రారండీ ॥శ్రీసీతా॥

ప్రశ్నలు:

1. మీరెప్పుడైనా ఈ పాట విన్నారా? ఏ సందర్భంగా విన్నారు?
2. సీతారాముల కల్యాణం ఇప్పటికీ మనరాష్ట్రంలో వైభవంగా ఎక్కడ జరుగుతుంది?
3. 'కల్యాణం'లో పాటించే సంప్రదాయాల గురించి మీకు తెలిసిన సంగతులు చెప్పండి.
4. 'కల్యాణానికి' – పర్యాయ పదాలు చెప్పండి.

*. బసవేశ్వరుని పరిణయం గురించి తెలుసుకుందాం.

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

పరమశివుణ్ణి ఆరాధించే వాళ్ళంతా ఒకటే మతమని, కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలకతీతమైన సమ సమాజ స్థాపనకు కృషిచేసిన మహాత్ముడు బసవేశ్వరుడు. 'కాయికమేకైలాస' (శ్రమ జీవనమే శ్రేష్ఠ) మని చాటిన చైతన్యమూర్తి. ఇతడు కర్ణాటకలోని హింగుళేశ్వర భాగవాటి అనే అగ్రహారంలో మాదాంబ, మాదిరాజు దంపతులకు 1140లో జన్మించాడు. మాదాంబ సోదరుడు బలదేవుడు కళ్యాణకటకరాజు బిజ్జలుని వద్ద కోశాధికారి, తన కూతురు గంగాంబను బసవేశ్వరునికిచ్చి వివాహం జరిపించాడు. ఆ వివాహ విశేషాలే ఈ పాఠానికి నేపథ్యం.

(ఇది బసవపురాణం – ప్రథమాశ్వాసంలోనిది.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం ద్విపద కావ్య ప్రక్రియకు చెందింది.
కావ్యాన్ని ద్విపద, ఛందస్సులో రాస్తే దాన్ని ద్విపద కావ్యం అంటారు. ఈ పాఠాన్ని బసవపురాణం ప్రథమాశ్వాసంలోనిది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ప్రారంభంలోని పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకు కింద గీతగీయండి.
- వాటి అర్థాలను 'పదాలు – అర్థాలు' పట్టికలోగాని లేదా నిఘంటువులో చూసిగాని తెల్సుకోండి.

కవి పరిచయం



లిఖిత సంప్రదాయానికి, మౌఖిక సంప్రదాయానికి వారధిలా వ్యావహారిక భాషను ఇతోధికంగా ఉపయోగించి రచన చేసిన మొట్టమొదటి కవి; బసవేశ్వరుని చరిత్రను పురాణంగా నిర్మించి, ద్విపదకు కావ్య, పురాణ గౌరవాన్ని కల్గించి, ప్రథమాంధ్ర స్వతంత్ర పురాణ కర్తగా చరిత్ర సృష్టించిన కవిశ్రేష్ఠుడు పాల్కురికి సోమనాథుడు. ఓరుగల్లుకు పన్నెండుక్రోసుల (సుమారు 18 కి.మీ.) దూరాన గల పాలకురితి (పాలకురికి / పాల్కురికి) సోమన జన్మస్థలం. తల్లి శ్రియాదేవి, తండ్రి విష్ణురామదేవుడు. చిన్నవయస్సులోనే వీరశైవమతం పట్ల గల అభిమానంతో, ఆ మతదీక్ష తీసుకొని, వీరమాహేశ్వరాచార్య వ్రతుడైనాడు. బసవేశ్వరుని మీద అచంచల భక్తి విశ్వాసాలను పెంచుకొని, ఆ మహాత్ముని జీవితం, బోధనలు ఆధారంగా అనేక రచనలు చేశాడు. బసవ పురాణము, అనుభవసారము, బసవోదాహరణము, వృషాధిప శతకము, చతుర్వేదసారము, చెన్నమల్లు నీసములు, పండితారాధ్య చరిత్రము, రగడలు, గద్యలు, పంచకములు, అష్టకములు, ఉదాహరణ కావ్యములు రచించి, తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన మహాకవి.

వృషాధిప శతకం 'శతక లక్షణాలన్నీ పరిపూర్ణంగా కలిగిన తొలిశతకం. ఇందులో సోమన అనేక ప్రయోగాలు చేసినాడు. అంత్యాను ప్రాసలు, ముక్త పదగ్రస్తాలు, అనుప్రాసాలంకారాలు వినియోగించడంలో ఈ కవి సిద్ధహస్తుడు. మణిప్రవాళ శైలితోపాటు, సంస్కృత, తమిళ, కన్నడ, మహారాష్ట్ర భాషాపదాలనుపయోగించి చంపక, ఉత్పలమాలల్లో అందంగా ఒదిగిన అద్భుత ప్రతిభా సంపన్నుడు. ఈతని కాలం క్రీ.శ. 1160-1240.



ప్రవేశిక :

భారతీయ సంప్రదాయంలో వివాహానికి విశేషమైన ప్రాధాన్యం ఉన్నది. అందుకే దాన్ని కల్యాణం అన్నారు. అంటే శుభకరమైంది అని అర్థం. ఇది మతాలను, కాలాలను, పాలకులను అనుసరించి వివిధ రూపాలను సంతరించుకున్నాయి. వివాహబంధం కేవలం ఇద్దరు మనుషులను కలిపేది కాదు, రెండు వంశాలను, మూడు తరాలనూ ప్రభావితం చేసే శక్తివంతమైన సంప్రదాయం.

ఒకప్పుడు రోజుల తరబడి జరుపుకునే పెళ్ళి వేడుక రోజు నుండి గంటల్లోకి, గంటల నుండి నిముషాలలోకి కుంచించుకు పోయింది. కారణాలేవైనా ఇది మానవ సంబంధాలను బలహీనపరుస్తున్నదన్న హెచ్చరికలు పంపుతున్నది.

పదమూడో శతాబ్దంలో, వీరశైవ మతం విశేష ప్రచారంలో ఉన్నప్పుడు కల్యాణ శోభ ఎట్లా ఉండేదో ఈ పాఠం ద్వారా గ్రహిద్దాం.

I

మరక తోరణములు మణి తోరణములు
ముకుర తోరణములు మునుగట్టఁ బనిచి

"కలయంగ వీధులఁగస్తూరి యలుకుఁ
దెలమి ముక్తాఫలంబుల ముగ్గు లిడుఁడు

రండు భక్తులఁ బిలువుండు మీ రెదురు
వొండు! వేగమ తోడి తెండు తెండనుచు

నిటవచ్చునయ్యల కెదురు వచ్చుచును
నటవచ్చునయ్యల కర్థి మ్రొక్కుచును

యవిరళ నవ్య పుష్పాంజలు లిచ్చి
ప్రవిమల ధూప దీపంబులొనర్చి

యమ్మహాత్ములకు సాష్టాంగుడై యక్ష
ణమ్మ విభూతి వీడ్యమ్ము లర్పించి

కోలాటమును బాత్ర గొండ్లి పేరిణియుఁ
గేళిక జోకయు లీల నటింపఁ

బాయక "చాండు! భళా" యను శబ్ద
మాయతి నాకసంబంది ఘూర్ణిల్ల



నలిరేగి వేణు వీణా వాద్య వితతు
లులియుచు లీలతో నొక్కట మ్రోయ

నానంద గీతంబు లగ్గించు వారు;
పూని శంకరగీతములు వాడు వారు;

జతి గీతముల మీదఁ జప్పట లిడుచు
నతిశయ శివభక్తి నాడెడు వారు;

నాది పురాతనాపాదిత స్తుతులు
వేదార్థములు గాఁగ వివరించు వారు;

నెఱి శివ మరులున గుఱిలేని వేడ్క
నఱి ముఱి మిన్నంది యాడెడు వారు;

మ్రొక్కి శివానందమునఁ దమ్ము మఱచి
నిక్కపు సుఖమున నిద్రించు వారు

ఆలోచించండి-చెప్పండి

- *ఈ ద్విపదను చదివారు కదా! దీంట్లో వినసొంపుగా ఉన్న పదాలు ఏవి?*
- *"విభూతివీడ్యమ్ములర్పించి" అని ఉందికదా! దీని భావం ఏమిటి?*
- *బసవేశ్వరుని పెండ్లికి ఏయే నృత్యాలు చేసారు? ఏయే సంగీత పరికరాలు ఉపయోగించారు? దీన్ని బట్టి నాటి వివాహాలలో సంగీత, నృత్యాలకు గల ప్రాధాన్యత గురించి మాట్లాడండి.*
- *నాటికాలంలో శైవుల వివాహాలు ఎలా జరిగేవని భావిస్తున్నారు?*

II.

నిఖాల మాహేశ్వర నికరంబునిట్లు
సుఖలీలఁ గొలువున్నచో బసవయ్య

యప్పొదజలముల నభిషిక్తుఁ డగుచు
నొప్పి దివ్యాంబర యుగ్మంబు సాతి

భసితంపు నెఱపూత పలుచగాఁ బూసి
నొసలఁ ద్రిపుండ్ర మొప్పెసఁగ ధరించి

మౌళిఁ బ్రసార సుమంబులు దుఱిమి
పోలఁగ రుద్రాక్ష భూషలు దాల్చి



సారమై లింగ పసాయితంబనెడు
పేరను గల్గు కఠారంబు గట్టి

యానంద బాష్పంబము లలుగులు వాఱ
మేను రోమాంచ సమ్మిళితమై తనర

భక్తి శృంగారమేర్పడఁ జూఱగొన్న
భక్తి కళార్ణపు బసవయ్యఁ జూచి

"యిట్టి ధన్యుఁడ నౌదునే యిప్పు" డనుచు
దట్టుఁడు బలదేవ దండనాయకుడు

తన కూఁతుఁ గామినీ జనతిలకంబు
ననుపమ శృంగారవనధి గంగాంబఁ

దోడ్తెచ్చియట్ల భక్తులకు మ్రొక్కించి
యేడ్తేర శుభచేష్ట లెదురుకొనంగ

శివభక్త వనితలు సేసలు సల్ల
శివ బలంబగ్గలించిన ముహూర్తమున

వేదోక్త శివధర్మ విధి బసవనికి
గాలిది సుతఁ బెండ్లి గావించె నంత...

ఆలోచించండి-చెప్పండి

- *బసవని వివాహానికి ఎలా అలంకరించారు? ఇలా ఎందుకు చేసి ఉంటారు?*
- *అలంకరణలకు సంస్కృతికి గల సంబంధం ఏమిటి?*
- *బలదేవుడు బసవణ్ణి చూసి తన జీవితం ధన్యమైందని ఎందుకు భావించి ఉంటాడు?*
- *సాధారణంగా వివాహం చేయడానికి వధువు తల్లిదండ్రులు వరుడు ఎలా ఉండాలని కోరుకొంటారు? ఎందుకు?*

(పాఠ్య) సారాంశం :

బసవేశ్వరుడు పెండ్లికి అంగీకరించగానే బలదేవ దండనాయకుడు పట్టణమంతా మకరతోరణాలు, మణితోరణాలు, అద్దాల తోరణాలు కట్టేందుకు ఆజ్ఞాపించాడు. "వీథులంతా కస్తూరితో అలికి ముగ్గులు పెట్టండి. భక్తులందరినీ పిలవండి. బసవేశ్వరుని తీసుకొని రండి" అని చెప్తూ, జంగమదేవరలందరినీ పుష్పాంజలులతో ధూపదీపాల ఆహ్వానించి, సాష్టాంగ నమస్కారాలు చేసి, విభూతి యుక్తమైన తాంబూలాలను సమర్పించాడు.

ఆ సందర్భంగా కోలాటం, బహురూపులు, గొండ్లి, పేరిణి, కేళిక మొదలైన నృత్యాలు చేస్తూ, 'ఛాంగుభళా!' అనే శబ్దాలు ఆకాశాన్నంటే విధంగా మార్మోగుతుండగా, వేణువు, వీణా వాద్య తంత్రులన్నీ మోగుతుండగా కొందరు ఆనంద



గీతులు పాడారు; శంకరుని స్తుతించారు మరికొందరు; ఆ జతులకు గీతాలకు అనుగుణంగా చప్పట్లు కొడ్తూ అతిశయించిన శివభక్తితో ఇంకొందరు నర్తిస్తున్నారు; ప్రాచీన కాలం నుండీ పరమేశ్వరుడ్ని స్తుతించే విధానాన్ని కొందరు వివరిస్తున్నారు; అపారమైన శివభక్తి పారవశ్యంతో మరి కొందరు ఉత్సాహంతో గంతులేస్తున్నారు; ఇంకా కొంతమంది శివానందంలో లీనమై సుఖనిద్రలో మునిగిపోయారు.

ఆ విధంగా జంగమయ్యలంతా సంతుష్టులైయుంగా వారి పాదజలంతో అభిషిక్తుడైన బసవేశ్వరుడు దివ్యమైన వస్త్రాలను ధరించి, భస్మాన్ని నిండుగా అలముకొని, నుదుట విభూతిరేఖలు ధరించి, వారి పూజా పుష్పాలను సిగలో తురుముకొని, రుద్రాక్షమాలలు వేసుకొని, లింగపసాయితమనే ఖడ్గాన్ని నడుముకు కట్టుకొని, ఆనంద భాష్పాలురాలగా, రోమాంచితమైన శరీరంతో, భక్తి సౌందర్యం ఉట్టిపడుతుండగా వచ్చాడు.

బసవేశ్వరుని చూసి బలదేవుడు తన జీవితం ధన్యమైంది అనుకున్నాడు. సౌందర్యవతి, శ్రేష్ఠురాలైన తన కూతురు గంగాంబను పిలిపించాడు. భక్తులందరికీ మొక్కించి, శివ భక్తురాండ్రంతా అక్షితలు చల్లుతూండగా శివభక్తులు నిర్ణయించిన ముహూర్తాన శివధర్మ వేదోక్తంగా ప్రియమైన తన కూతురును బసవేశ్వరుని కిచ్చి పెండ్లి గావించాడు.

విశేషాంశాలు

1) విభూతి వీడ్యము : వీడ్యము అంటె విడియము లేదా తాంబూలము. వీరశైవాచారంలో విభూతితో కలిపి తాంబూలం ఇచ్చి జంగమదేవరలను, గురువులను, పీఠాధిపతులను ఆహ్వానించేందుకు సమర్పించేది విభూతి వీడ్యం. తెల్లని వస్త్రంలో విభూతితోపాటు తమలపాకులు, వక్కలు, ఖర్జూరపండ్లు పెట్టి ఇస్తారు.

2) పేరిణి : యుద్ధ సన్నద్ధులను చేయడానికి, వీరభక్తిని ప్రకటించడానికి పురుషులు చేసే వీరనాట్యం.

3) గొండ్లి : ఇదీ కోలాటం వంటిదే. నర్తకులు వృత్తాకారంలో నిలబడి తాళలయకనుగుణంగా నర్తిస్తారు.

4) పాత్ర : రకరకాల వేషాలు ధరించి ప్రదర్శించే ఆట.

5) కేళిక : ఇదీ ఒక నాట్య విశేషం.

6) జతి : సంగీత నృత్యాల్లో లయానుగుణమైన స్వర విన్యాసం.

ఇవి చేయండి

I. అవగాహన - ప్రతిస్పందన

1. పెళ్ళివేడుకలో జరిగే సంప్రదాయాలు ఏమేం ఉంటాయి? తెల్పండి.
2. ఈ పాఠాన్ని రాగంతో, భావంతో చదవండి.



3. కింది పదాన్ని చదవండి. దాని కింద ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి...

చ. సురవర పూజ్య! పూజ్య గుణ శోభిత! శోభితరూప! రూపవి
స్ఫురతరశీల! శీలగణపుంగవ! పుంగవసత్వ! సత్వ సం
హర పరవాద! వాదభయవర్జిత పాప విచార చార! ఈ
శ్వర సమ నీవెదిక్కు – 'బసవా! బసవా! బసవా! వృషాధిపా!

ప్రశ్నలు :

అ) సోమనాథకవి రచించిన ఈ పద్యం 'మకుటా'న్ననుసరించి ఏ గ్రంథంలోనిది తెల్పండి.

ఆ) పద్యం ఛందస్సును గమనించి, ఇది ఏ వృత్తమో గుర్తించండి.

ఇ) పద్యంలోని అలంకారమేది? ఎలా చెప్పగలరు?

ఈ) ఈ పద్యం ద్వారా కవి ఎవరిని స్తుతిస్తున్నాడు?

4. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

అ) సోమనాథకవి కవిత్వం, రచనల గురించి రాయండి.

ఆ) "ఇట్టి ధన్యుడనౌదునే యిప్పు"డని ఎవరు, ఎవరితో, ఏ సందర్భంలో అన్నారో వ్యాఖ్యానించండి.

ఇ) బసవేశ్వరుని పెండ్లి సందర్భంగా ఏ ఏ ఆటలు ఆడి పాడారో పేర్కొనండి.

ఈ) పాఠం ఆధారంగా నాటి సంస్కృతి, సంప్రదాయాల గురించి ఏమేమి తెల్సుకొన్నారు?

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) పాఠం ఆధారంగా బసవేశ్వరుని స్వభావాన్ని గురించి రాయండి.

ఆ) సోమనాథుని రచనాశైలిని తెల్పండి.

ఇ) ఈ పాఠంలో మాహేశ్వరులని ఎవరిని అన్నారు? వాళ్ళనెట్లా గౌరవించారు?

ఇ) శివభక్తుల భక్తి పరాకాష్ఠను కవి ఎందుకు వర్ణించాడు?

2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.

అ) ఈ పాఠ్య సారాంశాన్ని మీ మాటల్లో రాయండి.

ఆ) ప్రాచీన కావ్యాలకు సంబంధించిన పాఠాలు చదవడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) ద్విపద రూపంలోని ఈ పాఠ్యభాగాన్ని గేయంగా గాని, వచన కవితగా గాని మలచండి.

ఆ) నాటితో పోలిస్తే, నేటి వివాహవేడుకల్లో వచ్చిన మార్పులు ఏమిటి? వీటి గురించి విమర్శనాత్మకంగా మీ స్నేహితునికి ఒక లేఖ రాయండి.



III. భాషాంశాలు

పదజాలం

1. కింది మాటలు సందర్భాన్ననుసరించి ఎలా ఉపయోగించారో గ్రహించి, ఇంకొక్క వాక్యం రాయండి.

అ) తోడ్తెచ్చు : రాధ తన స్నేహితురాలికెదురేగి తోడ్తెచ్చింది.

ఆ) అలుగురువారు : సీతను పోగొట్టుకున్న రాముడు కన్నీరు అలుగులు వారగా ఏడ్చాడు.

ఇ) రోమాంచ సమ్మిళితం : తానెంతగానో అభిమానించే గురువుగారు హఠాత్తుగా కనిపించగానే శివ మేను ఆనందంతో రోమాంచితమైంది.

ఈ) ధర్మవిధి : ధర్మవిధిననుసరించి కార్యాలు నిర్వహించడం భారతీయ సంస్కృతిలో భాగం.

2. నిఘంటువు సాయంతో కింది పదాలకు నానార్థాలు వెతికి రాయండి.

అ) అర్థి : _____ _____ _____

ఆ) ఘూర్ణిల్లు : _____ _____ _____

ఇ) ముకురము : _____ _____ _____

3. కింది పదాలకు సమానార్థాలనిచ్చే మరి రెండు పదాలను తెలిపి, వాటితో ఒక్కొక్క వాక్యం రాయండి.

అ) కఠారము : _____ _____ _____

ఆ) నిక్కము : _____ _____ _____

ఇ) సేసలు : _____ _____ _____

ఈ) వితతి : _____ _____ _____

4. కింది పదాలలో ప్రకృతులేవో, వికృతులేవో గుర్తించి, సంబంధిత పదాలను ఎదురెదురుగా రాయండి.

ముకురము	పుష్పము	బగితి	అయ్య
సింగారము	మొగ్గ	సుఖము	శృంగారము
ఆర్య	భక్తి	పువ్వు	సుకము

IV. భాషా కార్యకలాపాలు

ఛందస్సు : ద్విపద

ద్విపద జాతిపద్యం

- ఇందులో ప్రతి పద్యంలో రెండు పాదాలుంటాయి.
- ప్రతిపాదంలో వరుసగా మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి.
- మూడవ గణం మొదటి అక్షరం యతి. యతిలేని చోట ప్రాసయతి చెల్లుతుంది.



I I I U I I I I I I U I I I I

- ప్రాస నియమం పాటింపబడుతుంది.

ఉదా॥ మకరతో రణములు మణితోర ణములు

నగ నల సల న

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది ఖాళీలను పూరించండి.

	విసంధి	సంధిపదం	సంధిపేరు
అ)	ఆ + మహాత్ములు =	_____	_____
ఆ)	_____ + _____ =	పురాతనాపాదిత	_____
ఇ)	వేద + ఉక్త =	_____	_____
ఈ)	_____ =	పెండ్లిగావించె	_____
ఉ)	_____ + _____ =	పలుచగాఁబూసి	_____

2. మీ పాఠ్యాంశంలోని కింది సమాస పదాలను గుర్తించి విగ్రహవాక్యాలు రాయండి.

అ) ద్వంద్వ సమాసం ఆ) సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం

ఇ) సప్తమీ తత్పురుష సమాసం

3. కింది వాక్యాల్లోని అలంకారాన్ని గుర్తించండి.

అ) ఓ రాజాఁ నీ యశశ్చంద్రికలు దిగంతాలకు వ్యాపించాయి.

ఆ) అజ్ఞానాంధకారంలో కూర్చోకుండా విజ్ఞానవీథుల్లో విహరించాలి.

పరిచయం

-

నల	ర	భ	హ
I I II	UI U	U II	UI
య విరళ	నవ్య పు	ష్పాంజలు	లిచ్చి

నల	ర	భ	హ
II II	U I U	UI I	UI
ప్రవిమల	ధూప దీ	పంబు లొ	నర్చి



త	త	త	హ
U UI	U U I	U U I	U I
నా నంద	గీతంబు	లగ్గించు	వారు

ర	సల	సల	హ
U I U	II U I	I I U I	U I
పూని శం	కర గీత	ములు వాడు	వారు

పై పాదాలను గమనించండి.

ప్రతి పాదంలోను మొదట మూడు ఇంద్రగణాలు ఒక సూర్యగణం వచ్చాయి కదా!

ప్రతి పద్యంలో రెండు పాదాలున్నాయి కదా!

ఇలా రెండు పదాలుగల ఈ పద్యాన్నే ద్విపద అంటారు. ఇది జాతి పద్యం.

ద్విపద లక్షణం :

- ప్రతి పాదంలో వరుసనా మూడు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి.
- మూడవగణం మొదటి అక్షరం మతి.
- ప్రాసయతి చెల్లుతుంది.
- ప్రాస నియమం పాటింపబడుతుంది.
- ప్రతి పద్యంలో రెండు పాదాలుంటాయి.

* ప్రాసనియమం లేని ద్విపదను మంజరీద్విపద అంటారు.







10. మా ప్రయత్నం

– ఓల్గా , వసంత కన్న బిరాన్, కల్పనా కన్నబిరాన్

చదవండి – ఆలోచించి చెప్పండి.

ఈ శతాబ్ది నాదే అని సగర్వంగా ప్రకటించుకున్న మహాకవి శ్రీశ్రీ. వారి మహాప్రస్థానం ఆధునిక తెలుగు సాహిత్యంలో దీపస్తంభంగా నిలబడింది. అటువంటి ప్రసిద్ధ కవితా సంపుటికి ప్రఖ్యాత రచయిత చలం 'యోగ్యతాపత్రం' అనే పేరుతో గొప్ప ముందుమాట రాశాడు. ఆ పీఠికలోని ప్రతివాక్యం సాహితీ అభిమానుల నాలుకల మీద నాట్యం చేసింది. అందులోని కొన్ని వాక్యాలను చూడండి!

"తన కవిత్వానికి ముందుమాట రాయమని శ్రీశ్రీ అడిగితే,
కవిత్వాన్ని తూచేరాళ్ళు తన దగ్గర లేవన్నాడు చలం."

"నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి కొత్తటానిక్ తయారుచేశాడు
శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి"

ప్రశ్నలు:

1. పై పేరా ఏ విషయాన్ని గురించి తెలియజేస్తుంది?
2. ఎవరి పుస్తకానికి ఎవరు 'ముందుమాట' రాశారు?
3. ముందుమాట ఎందుకు రాస్తారు?
4. 'చలం' శ్రీశ్రీ గురించి రాసిన వాక్యాలు చదివారు కదా! దీన్ని బట్టి శ్రీశ్రీ కవిత్వం ఎలా ఉంటుందని భావిస్తున్నారు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

భాష అనేక వ్యవహార రూపాలను మార్చుకుంటూ జీవనదిగా ప్రవహిస్తుంటుంది. అందులో భాగమైన సాహిత్యం అనేక రూపాల్లో, ప్రక్రియల్లో వెలువడుతూ వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. ఇందుకు సరైన ఉదాహరణ 'మహిళావరణం' పుస్తకం. అయితే ఆ పుస్తకాన్ని చదవకముందే ఒక అవగాహన కల్గిస్తుంది అందులోని ముందుమాట. ఒక పుస్తకం తాత్వికతను, అంతస్సారాన్ని, ఆశయాల్ని, శ్రమను తెలియజేసేదే ముందుమాట. ముందుమాట వల్ల పుస్తకాన్ని చదవాలనే ఆసక్తి పెరుగుతుంది. మంచి పుస్తకాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలో దారి చూపుతుంది. అలాంటి 'ముందుమాట'ను పరిచయం చేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

మహిళల అభివృద్ధి, సాధికారికత కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలను తయారుచేసుకుంటున్నాయి. అందులో భాగంగా 'అస్మిత రిసోర్స్ సెంటర్

ఫర్ ఉమెన్' (సికింద్రాబాద్) అనే సంస్థ 2001లో 'మహిళావరణం' అనే పేరుతో చారిత్రాత్మక ప్రాధాన్యంగల గొప్ప పుస్తకాన్ని ప్రచురించింది. గడచిన నూటయాభై సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో విభిన్నరంగాలలో అనేక భావజాలాలకు చెందినవారు సామాజిక అభివృద్ధిలో భాగమై, సాంస్కృతిక చైతన్యంతో ప్రభావితం చేసిన నూట పద్దెనిమిది మంది స్త్రీల ఫోటోలు, జీవిత వివరాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. చరిత్రలో తమదైన ముద్రవేసి సమాజాన్ని నడిపించిన స్త్రీలకు నిజమైన గుర్తింపు దొరకలేదు. చరిత్రలో వారి త్యాగం, ప్రతిభ అనామకంగా మిగిలిపోయింది. ఆ లోటును తీరుస్తూ, వివక్షనూ ప్రశ్నిస్తూ ప్రముఖ స్త్రీవాద రచయిత్రులు, ఉద్యమకారులైన ఓల్గా, వసంతకన్నాభిరన్, కల్పనా కన్నాభిరన్‌లు మహిళావరణం పుస్తకాన్ని సంకలనం చేశారు. అందులోని 'మా ప్రయత్నం' అనే ముందుమాట ఆలోచనాత్మకమైన పలు విషయాలను ప్రస్తావిస్తూ గ్రంథ ఆవశ్యకతనూ వివరిస్తుంది.

పాఠ్యభాగ వివరాలు

ఒక గ్రంథాన్ని, ఆ గ్రంథ నేపథ్యాన్నీ, లక్ష్యాలను పరిచయం చేస్తూ ఆ గ్రంథ రచయితగాని, వేరే రచయిత, విమర్శకుడుగాని రాసే పరిశీలనాత్మక పరిచయ వాక్యాలను పీఠిక అంటారు. దీనికి ముందుమాట, ప్రస్తావన, తొలిపలుకు, మున్నుడి, ఆముఖం మొదలైన పేర్లెన్నో ఉన్నాయి.

విద్యార్థులకు సూచనలు

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీతగీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న "పదాలు – అర్థాలు" పట్టికలో వెతకండి. లేదా నిఘంటువు చూడండి.
- పాఠం ముందున్న పేరా చదవండి. పాఠంలో విషయం ఏముంటుందో ఊహించండి.

రచయిత్రుల పరిచయం



1. **ఓల్గా :** ప్రముఖ స్త్రీవాద రచయిత్రి. తన కథలు, కవితలు, నవలలతో తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమానికి బలమైన పునాదిని నిర్మించారు. వీరి 'స్వేచ్ఛ' నవలపై నిర్మాణాత్మకమైన చర్చలు జరిగి స్త్రీవాద ఉద్యమానికి ఉత్తేజాన్ని అందించింది. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం నిర్వహించిన వీరు పలు పురస్కారాలను, అవార్డులను అందుకున్నారు.
2. **వసంత కన్నభిరాన్ :** 1939లో హైదరాబాద్‌లో జన్మించిన వీరు ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేశారు. మానవ హక్కులు, స్త్రీ సమానత్వం కోసం కృషి చేస్తున్నారు. నేషనల్ ఎలయెన్స్ ఆఫ్ ఉమెన్, ఇండియన్ నేషనల్ సోషల్ యాక్షన్ ఫోరంలో పనిచేస్తున్నారు.
3. **కల్పనా కన్నభిరాన్ :** 'సెంటర్‌ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్' (హైద్రాబాద్) సంచాలకులుగా పనిచేస్తున్నారు. సామాజిక న్యాయం, సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జెండర్ స్టడీస్, క్రిమినల్ లాలో విస్తృత అధ్యయనం పరిశోధనలు చేసి విలువైన గ్రంథాలు రాశారు. ప్రముఖ న్యాయవాది కె.జి.కన్నాభిరాన్ రచయిత్రి వసంత కన్నాభిరాన్‌లు వీరి తల్లిదండ్రులు.



"వాళ్ళ అనుభవాలు వింటుంటే ఉద్వేగం కలిగేది. చరిత్రను మా కళ్ళ ముందు పరిచిన వారి జీవితాలను వినటం ఈ పనిలో మాకు అన్నిటికంటే ఆనందాన్నిచ్చిన విషయం... సంస్కరణోద్యమ రథ చక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు మా కళ్ళముందు మెదిలి కన్నీరు కార్చారు. స్త్రీలేమంటున్నారో వినకుండా, స్త్రీలేం కావాలనుకుంటున్నారో పట్టించుకోకుండా సాగిన ఎన్నో ఉద్యమాలు, వాటిలో ఘర్షణపడి నిగ్గుదేలి కొత్త చరిత్రను సృష్టించిన స్త్రీలూ–వీళ్ళందరి అనుభవాలతో చరిత్ర కొత్తగా పరిచయమయినట్లనిపించింది" ఈ వివరాల గురించి తెలుసుకోవడానికి పాఠం చదవండి.

I

కొత్త సహస్రాబ్దంలోకీ, శతాబ్దంలోకీ అడుగుపెడుతున్న సందర్భంలో గడిచిన కాలాన్ని పరామర్శించుకోవటం, ఆ అనుభవాలను స్మరించుకోవటం, భవిష్యత్తు మీద ఒక అంచనాతో ఆశను పెంచుకోవటం ఎవరైనా సామాన్యంగా చేయాలనుకునే పనే. ఆ పని చేస్తూ ఈ శతాబ్దపు సామాజికాభివృద్ధిలో, సామాజిక మార్పులలో స్త్రీల భాగస్వామ్యాన్ని గురించి ఆలోచించినప్పుడు ఎన్నో విషయాలు మా ముందుకు వచ్చాయి. గడిచిన శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా చెప్పవచ్చనిపించింది. గత శతాబ్దపు చరిత్ర నిర్మాతలుగా వారిది తిరుగులేని స్థానమనిపించింది. ఐతే దీనిని సాధికారంగా, సోదాహరణంగా నిరూపించటానికి ఎంతో అధ్యయనమూ, మరెంతో సమయమూ పడుతుంది. ఆ పని చేయాలనుకుంటూనే ముందుగా ఈ శతాబ్దంలో భిన్నరంగాలలో, కీలక స్థానాలలో, కీలక సమయాలలో పనిచేసి అక్కడ తమ ముద్రవేసిన వంద మంది స్త్రీల ఫోటోలతో, వారి గురించిన ముఖ్య వివరాలతో ఒక పుస్తకం తీసుకు రావాలనుకున్నాం. కొత్త శతాబ్దంలో స్త్రీలందరం కలిసి చేసుకునే ఉత్సవంగా ఈ పుస్తకాన్ని తీసుకురావాలనుకున్నాం. ఫోటోలు ప్రచురించాలనే నిర్ణయం చాలా ఆలోచించే తీసుకున్నాం. వ్యక్తులను చూస్తూ, వారి గురించి తెలుసుకోవటానికీ, ముఖమైనా తెలియని వ్యక్తుల గురించి చదవటానికీ ఈ తరంవారు చూపే ఆసక్తిలో తేడా ఉంటుంది. ఈ తరం యువతకు గత చరిత్రను పరిచయం చేసేటప్పుడు వారి మనసులపై ముద్ర వేయటానికి ఫోటోలు అవసరమనిపించింది. ఆ రకంగా వాళ్ళ జ్ఞాపకాలు మనలో ఎక్కువ కాలం ఉంటాయని మా ఉద్దేశం. వంద సంవత్సరాలుగా స్త్రీలు చేసిన పోరాటాలను గుర్తుచేసుకుంటూ జరుపుకునే విజయోత్సవంగా ఈ పుస్తకం నిలబడుతుందనుకున్నాం.

గడిచిన శతాబ్దంలో స్త్రీలు చేసిన పోరాటాలూ, భాగమైన ఉద్యమాలూ, రాణించిన రంగాలూ ఎన్నో ఉన్నాయి. మొదటిసారి చదువుకున్న సామాన్య స్త్రీలు, మొదటిగా వితంతు వివాహం చేసుకునే సాహసం చేసిన స్త్రీలు, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన స్త్రీలూ, ఉద్యమాలలో చేరి జైలుకి వెళ్ళేందుకు తెగించిన స్త్రీలు, నాటకం, సినిమా, రేడియో వంటి రంగాలలోకి మొదటిసారి అడుగిడిన స్త్రీలూ – మొదటి తరపు డాక్టర్లు, శాస్త్రవేత్తలూ, సంగీతకారులూ నృత్యకళాకారిణులు, విద్యాధికులు – తలుచుకోగానే ఒళ్ళు పులకరించే సాహసమూర్తులెందరో. వాళ్ళందరినీ ఒకచోట పెట్టటమనే ఆలోచనే ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఒకరి తర్వాత ఒకరు ఏ ఒక్క పుస్తకంలోనూ ఇమడనంతమంది మాకు తలపుకొచ్చారు. దాంతో చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన మరొకసారి బలంగా కలిగి ఎంతో గర్వమనిపించింది.



సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరకదు. సంప్రదాయ చరిత్రకారులు స్త్రీలను చరిత్రలో అక్కడక్కడా పౌడర్ అద్దినట్లు అద్దుతుంటారు. దానిని స్త్రీల ఉద్యమం ప్రశ్నిస్తూనే ఉంది. దేశంకోసం, తమకోసం ఒక సమూహంగా స్త్రీలు చేసిన పోరాటాలకూ, పడిన సంఘర్షణలకూ, సాధించిన విజయాలకూ గుర్తింపు దొరకదు. చరిత్ర అనే జగన్నాధ రథచక్రాల కింద వాళ్ళ సామూహిక ఉనికి తునాతునకలైపోతుంది. దానితో కొన్ని విజయాలు సాధించిన స్త్రీలను ఒక్కొక్కరుగా తల్చుకుని వాళ్ళ శక్తికి ఆశ్చర్యపడతారు. అట్లాంటి శక్తి వంతులు అరుదుగా ఉంటారని, వారిని అసామాన్య ఉదాహరణలుగా మాత్రమే గుర్తుంచుకుంటారు. మొత్తం సామాజికాభివృద్ధి క్రమంలో విడదీయలేని భాగంగా వారిని చూడకుండా వారి జీవితకథలను విడిగా చదువుతారు. ఇలాంటి స్త్రీలు కూడా వేళ్ళమీద లెక్కబెట్ట గలిగినంతమంది కూడా మన చరిత్ర పుస్తకాలలో కనిపించరు. ఇప్పటికి ముప్పయ్ సంవత్సరాలనుంచీ స్త్రీలకు చరిత్రలో స్థానం లేదనీ, ఉన్న చరిత్ర స్త్రీల ప్రాతినిధ్యాన్ని ప్రతిబింబించే చరిత్ర కాదనే విమర్శ స్త్రీల ఉద్యమం పెడుతున్నా, దానిని మేము ఎంత అర్థం చేసుకున్నా, ఇంతమంది స్త్రీలను ఒక వరసలో చూడటం వల్ల మాకు కలిగిన కనువిప్పు గొప్పది. మన రాష్ట్ర చరిత్రంతా కొత్తగా తెలిసినట్లనిపించింది. ఒక చైతన్య సమూహ ప్రవాహంగా స్త్రీలను మేము చూడగలిగాం. ఇంతకు ముందు విడిగా ఏ ఒక ఉద్యమంలోనో, రంగంలోనో పనిచేసిన స్త్రీల గురించి చదివినప్పుడు కలిగిన అనుభూతికీ, పలురంగాలలో పనిచేసిన వందలమంది స్త్రీలను, వారు సాధించిన విజయాలతో సహా చూడటంవల్ల కలిగిన అనుభూతికీ పోలికే లేదు. స్త్రీల చైతన్య ప్రవాహపు వేగం, జీవం, ఆ ప్రవాహక్రమంలోని మార్పులూ అన్నీ ఒక కొత్త విషయాన్ని మాకు చెబుతున్నట్లనిపించింది. సామూహికమైన ఉనికి, చైతన్యం యివే చరిత్రను రూపుదిద్దుతాయనే విషయం స్పష్టమైంది. ఇంత మంచి సాంఘిక, రాజకీయ సాంస్కృతిక వారసత్వం మనకుందని పొంగిపోయాం. ఈ స్త్రీలందరూ ఈ చరిత్రను నిర్మించేందుకు ఎంత మూల్యం చెల్లించారో తలుచుకుంటే మా గుండెలు బరువెక్కాయి. వాస్తవ జీవిత ప్రతికూల పరిస్థితులతో తలపడుతూ వారు కొత్త కలలు కనటానికీ, కొత్త జీవిత విధానాలను కనుగొనటానికీ ఎన్ని కఠిన పరీక్షలకు గురయ్యారో తల్చుకుంటే ఆ సామన్యుల సాహసం అసామాన్యమనిపించింది. సమాజంలో ప్రతిదాన్నీ మార్చటానికి సమాయత్తమైన స్త్రీల సమూహం మాకు గొప్ప ప్రేరణ నిచ్చింది.

ఆలోచించండి-చెప్పండి

- *కాలాన్ని పరామర్శించడం అంటే ఏమిటి?*
- *గడిచిన శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా ఎలా చెప్పుకోవచ్చు?*
- *చరిత్ర ఎలా రూపుదిద్దుకుంటుంది?*
- *మూల్యం చెల్లించడమంటే అర్థం ఏమిటి?*
- *"సామాన్యుల సాహసం అసామాన్యమనిపించింది" అని రచయిత్రులు అనడానికి కారణాలు ఏమిటి?*

ఆ ప్రేరణతో, ఉత్సాహంతో ఈ పని మొదలుపెట్టాం. ఊహలకూ, ఆలోచనలకూ లేని పరిమితులు పనిలో ఎన్నో ఉన్నాయి. ముందు స్థల కాలాలకూ సంఖ్యకూ ఎన్నో పరిధులూ, పరిమితులూ ఏర్పడి ఉన్నాయి. ఆంధ్రదేశానికి చెందిన స్త్రీలు అన్నప్పుడు ఆంధ్రదేశం గతంలో ఇప్పటి ఆంధ్రప్రదేశ్ వలే లేదు. భవిష్యత్తులో ఇట్లాగే ఉంటుందనీ లేదు. మద్రాసు ప్రెసిడెన్సి, నైజాం రాజ్యం, ప్రస్తుత కర్ణాటక, మహారాష్ట్రా, ఒరిస్సాలలో కొన్ని ప్రాంతాలు ఇవన్నీ ఆంధ్రుల సాంస్కృతిక రాజకీయ చరిత్రలో ఉన్నాయి. వాటిని కూడా మా పరిధిలోకి తీసుకున్నాం. తెలుగు అన్న పదాన్ని వాడకుండా ఆంధ్ర అన్న పదం వాడటానికి కారణం ఆంధ్రదేశం అన్న పదంతో ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీ లేకపోవటమే. అందువల్ల ఆంధ్ర చరిత్ర, ఆంధ్ర దేశ చరిత్ర అని అన్నప్పుడు పందొమ్మిదవ శతాబ్దంలో తెలుగు ప్రజల రాజకీయ సాంస్కృతిక జీవనానికి కేంద్రాలుగా ఉన్న ప్రాంతాలకూ, ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌నీ, రెండింటినీ దృష్టిలో పెట్టుకోవాలి.



II.

ఇక కాలానికి సంబంధించి ఆలోచించినప్పుడు సామాజికంగా స్త్రీలు తెచ్చిన పెద్ద మార్పులు ఈ శతాబ్దంలో ప్రముఖంగా ఉన్నాయి గాబట్టి ఈ శతాబ్దాన్నంతా తీసుకోవాలనుకున్నాం. వీలైనంత వరకూ అన్ని రంగాలనూ దృష్టిలోకి తీసుకురావాలనుకున్నాం. ఇక సంఖ్య విషయానికి వస్తే ఏదో ఒక సంఖ్యకు కట్టుబడక తప్పదు. పుస్తక ప్రచురణలో ఉండే ఆర్థిక పరిమితుల దృష్ట్యా వందమందిని ఈ పుస్తకంలో ఉంచాలనుకున్నాం. కానీ ఆ సంఖ్యతో ఏమీ తృప్తిలేదు. ఆర్థికంగా ఎంత కష్టమనిపించినా మరి కొంతమందిని చేర్చక తప్పలేదు. ఎంపిక చాలా కష్టమనటంలో సందేహం లేదు. ప్రతి రంగంలో తమ దంటూ ఒక ముద్ర వేసిన వారిని ఎంచుకోవాలి. అంటే ఆ రంగాలలో నిష్ణాతులైన ఇప్పటి వారిని సంప్రదించాలి. కాలధర్మం చెందిన వారి వివరాలు సేకరించాలి. వర్తమానంలో ఉన్న స్త్రీలను కలుసుకోవాలి, మాట్లాడాలి. వాళ్ళ గురించి ఎట్లా రాయాలనేదాన్ని గురించి ఎంతో ఆలోచించాం. ఇంటర్వ్యూలకు చేసి వారు మాట్లాడినది రాయటమంటే, ఇప్పుడు లేని వారిలో అది కుదరదు. అందరికీ ఒక పద్ధతి పాటించటమే బాగుంటుంది. పుస్తకంలో విపులమైన ఇంటర్వ్యూలకు చోటు చాలదు. ఇంటర్వ్యూలు తీసుకుని తుంచటమూ సరికాదు. అందువల్ల ఆ పద్ధతి ఒద్దనుకున్నాం. వారి జీవిత విశేషాలనూ, వాళ్ళు చేసిన పోరాటాలనూ, సాధించిన విజయాలనూ క్లుప్తంగా చెప్పటం తప్ప మరో మార్గం కనిపించలేదు. అది కొంత నిరాశ కల్గించినా ఒక సమూహంగా సాగివచ్చే స్త్రీ మూర్తులు మా ఉత్సాహాన్ని ఏమాత్రం నీరుకారనివ్వలేదు.

ఈ పనిలో ఎందరో స్త్రీలను కలిశాం. వాళ్ళతో మాట్లాడటమే పెద్ద ఉత్సాహంగా ఉండేది. వాళ్ళ అనుభవాలు వింటుంటే ఉద్వేగం కలిగేది. చరిత్రను మా కళ్ళముందు పరచిన వారి జీవితాలను వినటం ఈ పనిలో మాకు అన్నిటికంటే ఆనందాన్నిచ్చిన విషయం. సరిదె మాణిక్యాంబగారు "అప్పుడు మా కులం వారిని ఆడవద్దన్నారు. తర్వాత అన్ని కులాలవారినీ ఆడవచ్చన్నారు. మా వృత్తి, పొలాలు, జీవనం అన్నీ తీసేసుకున్నారు. ఇప్పుడు ఇదే జీవనోపాధిగా అన్ని కులాల వాళ్ళు బతుకున్నారు" అన్నప్పుడు సంస్కరణోద్యమ రథ చక్రాల కింద నలిగిన ఎందరో స్త్రీలు మా కళ్ళముందు మెదిలి కన్నీరు కార్చారు. స్త్రీలేమంటున్నారో వినకుండా, స్త్రీలేం కావాలనుకుంటున్నారో పట్టించుకోకుండా సాగిన ఎన్నో ఉద్యమాలు, వాటిలో ఘర్షణపడి నిగ్గుదేలి కొత్త చరిత్రను సృష్టించిన స్త్రీలూ – వీళ్ళందరి అనుభవాలతో చరిత్ర కొత్తగా పరిచయమయినట్లనిపించింది.

ప్రతివాళ్ళూ ప్రశ్నించారు చరిత్ర సాగిన క్రమాన్ని.

ప్రతివాళ్ళూ ప్రయత్నించారు చరిత్రను మార్చటానికి.

అప్పటి కందుకూరి రాజ్యలక్ష్మి నుంచి మేకప్ రంగంలో ఆడవాళ్ళకు ఎందుకు స్థానం లేదని పోరాడిన శోభాలత వరకూ ప్రతి ఒక్కరూ కొత్త మార్పేదో తీసుకురావాలనీ, తమ జీవితాలలో సామాజిక జీవన రంగంలో కొత్త అర్థాలనూ, వెలుగులనూ సృష్టించాలనీ తాపత్రయ పడినవారే.

"నాటకరంగంలోకి కుటుంబ స్త్రీలు రావాలంటారు – మేమంతా కుటుంబ స్త్రీలం కామా – ఆ మాట ఎవరు మాట్లాడినా నాకు కోపం వస్తుంది. ఏ స్త్రీయైనా కుటుంబంలోంచి రాకుండా ఎక్కడ నుండి వస్తుంది" అని పావలా శ్యామలగారు కోపంగా అడిగిన ప్రశ్నలతో, ఈ పితృస్వామ్య సమాజం స్త్రీలను శాశ్వతంగా విడదీసి, మర్యాద – అమర్యాద పరిధులలో వాళ్ళను కదలకుండా బంధించి, తనకనుకూలంగా మాత్రమే వాళ్ళ కదలికలను నియంత్రించే విధానమంతా కళ్ళకు కట్టింది.



షావుకారు జానకిగారు ఒక ఇంటర్వ్యూలో అంటారు. "శాల్యూట్లన్నీ హీరోలకే, హీరోయిన్లు ఆ తర్వాతే... ఇదీ మన సమాజ విధానం. చివరకు మిగిలేది హీరో గొప్పతనమే" అని. చరిత్రలో కూడా అంతే. ఆ సమాజ విధానాన్ని మార్చటం తేలిక కాదు గానీ ప్రయత్నాలు ప్రారంభించటానికీ, స్త్రీలను చరిత్ర నిర్మాతలుగా అర్థం చేసుకుంటూ చరిత్రను తిరిగి రాయటానికీ ఇది అనువైన సమయమనిపిస్తోంది.

మేం ఈ పుస్తకంలో నూట పద్దెనిమిది మందిని మాత్రమే ఎంచుకున్నది మా పరిమితుల రీత్యానే. మరింత ఆర్థిక వెసులుబాటు ఉంటే ఇంతే ప్రాముఖ్యతగల మరో రెండు మూడు వందల మంది ఈ పుస్తకంలో ఉండేవారు. ఇది మొదటి పుస్తకమే. తరువాతి పుస్తకాలలో వాళ్ళూ ఒక క్రమంలో పరిచయమవుతారు. వీరినే ఎందుకు ఎంచుకున్నారనే దానికి అది మా ఎంపిక అనటం కంటే సమాధానం ఏముంటుంది? ఆయా రంగాలలో వాళ్ళు చేసిన కృషి, వాళ్ళు వేసిన ముద్ర, మొట్టమొదటిగా ఒక ప్రత్యేక రంగంలో అడుగుపెట్టినప్పుడు వాళ్ళెదుర్కొన్న సంక్లిష్ట సందర్భాలు, ప్రజలలో వారికున్న స్థానం, వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్నాం. ఈ స్త్రీలను ఏ వరుసలో ఉంచాలనే ప్రశ్నకు కాలక్రమమే సరైందనిపించింది. ఒకే సమయంలో పలు రంగాలలో పనిచేసిన స్త్రీలను ఒక వరసలో ఉంచటం వల్ల ఒక సమగ్రత వస్తుందనిపించింది. ఒకే కాలంలో భిన్న రంగాలలో అంటే మొత్తం సమాజంలో జరిగిన మార్పులకు స్త్రీలు చేసిందేమిటి, వారి భాగస్వామ్యం ఏమిటి అనేది చూడాలనుకున్నప్పుడు కాలక్రమం పాటించటమే సరైందనుకున్నాం. ముందుమాట గురించి ఒక నిర్ణయం తీసుకున్నాం. తెలుగులో ఇటువంటి ప్రయత్నం మొదటిది కనుకా, ఈ పుస్తకం ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినది గాబట్టీ తెలుగులో వివరమైన ముందుమాట ఉండాలనుకున్నాం. ఇంగ్లీషులో దానిని సంక్షిప్తం చేశాం.

ఈ పుస్తకాలలో స్త్రీలను ఎంపిక చేయటానికి మాకు ఎందరో సహకరించారు. ఎందరినో సంప్రదించాం. వారందరికీ మా కృతజ్ఞతలు. ఫోటోలు తీయటానికి భరత్‌భూషణ్‌ని ఎంచుకున్నాం. ఆయన ఈ పని గురించి ఎంతో ఉత్సాహం చూపించారు. అనారోగ్యాన్ని పక్కన పెట్టి ఈ పనిచేశారు. ఈ పనిలో ఆయన పొందిన సంతోషం కూడా మాకు తృప్తి నిచ్చింది. ఇప్పుడు జీవించిలేనివారి ఫోటోలు సేకరించటంలో ఎందరో సహాయపడ్డారు. వారందరికీ మా కృతజ్ఞతలు.

మేమీ ప్రయత్నం తలపెడ్తున్నామని చెప్పిన మరుక్షణం నుంచి దానిని గురించి మాకంటే సీరియస్‌గా ఆలోచించి, మమ్మల్ని ప్రతి సందర్భంలోనూ తరచి తరచి ప్రశ్నించి, మేము ఎంచుకున్న వారిని గురించి ఎందుకు ఎంచుకున్నారనీ, ఎంచుకోని వారిని ఎందుకు వదిలారనీ, ప్రశ్నించి ఎంతో విలువైన సలహాలిచ్చిన వ్యక్తులు ఇద్దరు. ఒకరు ఎస్.ఆర్.శంకరన్, రెండవవారు అక్కినేని కుటుంబరావు. ఈ పుస్తకానికి 'గ్లోసరీ' తయారుచేసే బాధ్యత తీసుకుని, చేసి మాకు సహాయపడింది నాగార్జున. ఈపుస్తకానికి సంబంధించిన భాషా విషయంలో తమ అమూల్యమైన సలహాలిచ్చింది చేకూరి రామారావుగారు. ఇక ఈ పుస్తకం ఎలా ఉండాలి, లోపలి విషయానికి తగినట్లుగా ఎంత అందంగా, హుందాగా, గంభీరంగా అదే సమయంలో ఆకర్షణీయంగా ఎట్లా పుస్తకాన్ని తీర్చిదిద్దాలని తపనపడి, ఇంత చక్కని రూపంలో మా చేతుల కందించిన వ్యక్తి రాజ్‌మోహన్ తేళ్ళ. డిజైన్‌లో, ఆర్ట్ వర్క్‌లో ఒక పరిపూర్ణత సాధించటానికి ఆయన చాలా శ్రమపడ్డారు. పుస్తకం అనుకున్న సమయంలో రావటానికి మాకంటే ఎక్కువ కష్టపడింది రాజ్‌మోహన్.

ఆలోచించండి-చెప్పండి

- *ముద్ర వేయడం అంటే ఏమిటి?*
- *సంస్కరణోద్యమ రథ చక్రాల కింద నలగడమంటే ఏమిటి?*
- *"ప్రతివాళ్ళూ ప్రశ్నించారు చరిత్రను మార్చటానికి" అని స్త్రీల గురించి రచయిత్రులు ఎందుకన్నారు?*
- *సమాజంలో చెలామణిలోవున్న మర్యాద, అమర్యాద పరిధులు ఏవి?*
- *కొత్త అర్థాలు, వెలుగుల సృష్టి ఎలా సాధ్యమవుతుంది?*



అస్మితలో ప్రధానంగా ఈ బాధ్యత తీసుకుని పని చేసింది నీనాజాదవ్, కంచ రమాదేవి. భరత్‌భూషణ్‌తో పాటు వెళ్ళటం, జీవిత విశేషాలు సేకరించటం, అన్నింటినీ ఒక పద్ధతిలో భద్రపరచటం మొదలైన పనుల బాధ్యత వీరు తీసుకున్నారు. పద్మిని, సుజాత, సుబ్బలక్ష్మి ఇంగ్లీషులో పుస్తకాన్నంతా కంప్యూటర్ మీద కంపోజ్ చేశారు. సంవత్సరం పాటు జరిగిన ఈ పని చేయటానికి వీలుగా అస్మిత రోజువారీ పనుల నుండి మాకు సమయం కల్పించి, ఆ పనులు కూడా బీనా నిర్వహించటటంవల్ల మా పని కొంత తేలికయింది. ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన వారందరికీ మా కృతజ్ఞతలు.

ఓల్గా,
వసంత కన్నబిరాన్,
కల్పన కన్నబిరాన్



I. అవగాహన – ప్రతిస్పందన

1. పాఠం ఆధారంగా కింది అంశాలపై మాట్లాడండి.

అ) ఇరవయ్యో శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా గుర్తించవచ్చా? చర్చించండి.

ఆ) మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో కింది అంశాలపై వక్తృత్వపోటీలు నిర్వహించడమైనది.

1) బాలికా విద్య – ఆవశ్యకత
2) నీకు నచ్చిన మహిళ – గుణగణాలు
3) మహిళల సాధికారత – స్వావలంబన
4) పురుషులతో ధీటుగా మహిళల ప్రగతి నిజమేనా?

మీరైతే ఏ అంశంపై ఏమేమి మాట్లాడతారు?

2. కింది వాక్యాలు పాఠ్యాంశంలో ఎక్కడ వచ్చాయో గుర్తించి వాటి సందర్భాల్ని వివరించండి.

అ) సంప్రదాయ చరిత్రకారులు స్త్రీలను చరిత్రలో అక్కడక్కడా పౌడర్ అద్దినట్లు అద్దుతుంటారు.

ఆ) ఊహలకూ, ఆలోచనలకూ లేని పరిమితులు పనిలో ఉన్నాయి.

ఇ) శాల్యూట్లన్నీ హీరోలకే, హీరోయిన్లు ఆ తర్వాతే... ఇదీ మన సమాజ విధానం.

3. కింది గద్యం చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

50వ దశాబ్దపు రెండవభాగం నుంచీ డెబ్భైయవ దశాబ్దం వరకూ రచయిత్రులు ఒక వెల్లువలా తెలుగు సాహిత్యాన్ని ముంచెత్తారు. ఆచంట శారదాదేవి, ఇల్లిందల సరస్వతీదేవి, మాలతీ చందూర్, లత, శ్రీదేవి, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ, ద్వివేదుల విశాలాక్షి, యద్దనపూడి సులోచనారాణి, ఆనందారామం, డి.కామేశ్వరి, బీనాదేవి మొదలైన రచయిత్రుల పేర్లు ఇంటింటా వినిపించే పేర్లయ్యాయి. రచయిత్రుల నవలలతో నవలా సాహిత్యానికి తెలుగులో విస్తృతమైన మార్కెట్ ఏర్పడింది. రచయితలు ఆడవారి పేర్లతో తమ రచనలను



ప్రచురించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. 1980వ దశాబ్దం తెలుగు సాహిత్యంలో స్త్రీల దశాబ్దంగా చెప్పవచ్చు. నవలా సాహిత్యంలో అరవయ్యవ దశాబ్దంలో తిరుగులేని స్థానం సంపాదించుకున్న రచయిత్రులు 80వ దశాబ్దంలో కవిత్వంలో కథలలో తమ ముద్ర వేశారు. అంతవరకు కవిత్వం తమదనుకునే పురుషుల భ్రమలను బద్దలు కొట్టారు. కవిత్వం రాయడమేకాదు. అంతవరకు కవిత్వంలోకి రాని స్త్రీల అణచివేతలోని పలుకోణాలను తమ కవితావస్తువుగా స్వీకరించారు. లైంగికత్వం, పునరుత్పత్తి, మాతృత్వం వంటి విషయాలను స్త్రీవాద దృష్టితో సాహిత్యంలోకి తీసుకవచ్చారు. ఈ శతాబ్దంలో వచ్చిన రెండవ ఉత్తమ కవితా సంకలనంగా 'నీలిమేఘాలు' స్త్రీవాద కవితా సంకలనాన్ని ప్రచురించారు. ఓల్గా 'రాజకీయకథలు', 'స్వేచ్ఛ' నవల స్త్రీల శరీర రాజకీయాలనూ, కుటుంబ అణచివేతనూ కొత్త పద్ధతిలో పరిచయం చేశాయి. జయప్రభ, కొండేపూడి నిర్మల, పాటిబండ్ల రజని, పి.సత్యవతి, సి.సుజాత, మృణాళిని, కె.వరలక్ష్మి, కె.గీత, కుప్పిలి పద్మ, జానకీబాల, జయ వంటి స్త్రీవాద రచయిత్రులు తెలుగుసాహిత్యంలో స్త్రీవాదాన్ని స్థిరపరిచారు.

అ) తెలుగు సాహిత్యంలో రచయిత్రులు ఏ కాలంలో వెల్లువలా వచ్చారు?

_____

ఆ) 80వ దశాబ్దం స్త్రీల దశాబ్దమని ఎలా చెప్పగలవు?

_____

ఇ) స్త్రీవాద కవయిత్రులు సాధించిన విజయాలు ఏమిటి?

_____

ఈ) స్త్రీవాద సాహిత్యంలో ఏ వస్తువులు ప్రాధాన్యం వహించాయి?

_____

ఉ) పై పేరాకు అర్థవంతమైన శీర్షికను పెట్టండి.

_____

4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అ) సంపాదకులు మహిళావరణం పుస్తకాన్ని ఎందుకు తీసుకురావాలనుకున్నారు?

ఆ) మహిళావరణం రచయిత్రులు ఏ ఏ రంగాలకు చెందిన స్త్రీల వివరాలు సేకరించాలనుకున్నారు?

ఇ) మహోన్నతులైన స్త్రీల విశేషాలు సేకరిస్తున్న సందర్భంలో సంపాదకులు పొందిన అనుభూతులు ఏంటి?

ఈ) మహిళావరణం పుస్తకంలోకి ఎంతో మంది స్త్రీలను తీసుకోవాలని ఉన్నా కొద్దిమందిని మాత్రమే ఎంపిక చేసుకోవడానికి గల కారణాలు ఏమిటి?

ఉ) మహిళావరణం పుస్తక ప్రచురణలో సంపాదకులకు సహాయపడిన వారెవరు?

II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి 4, 5, వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) "సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరకదు" దీంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?



ఆ) రచయిత్రులు సంకలనం చేసిన పుస్తకానికి "మహిళావరణం" అనే పేరు సరిపోయిందని భావిస్తున్నారా? ఎందుకు?

ఇ) "ప్రతివాళ్ళూ ప్రశ్నించారు చరిత్ర సాగినక్రమాన్నీ!" అని స్త్రీల గురించి రచయిత్రులు ఎందుకు పేర్కొన్నారు?

2. కింది ప్రశ్నలకు ఆలోచించి 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన సంపాదకులకు కలగడానికి గల కారణాలను వివరించండి.

ఆ) "ఈ స్త్రీలందరు ఈ చరిత్రను నిర్మించేందుకు ఎంత మూల్యం చెల్లించారో తలచుకుంటే మా గుండెలు బరువెక్కాయి" అనడంలో ముందుమాట కర్తల అంతర్యం ఏమిటి?

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) ఒక ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మీ పాఠశాల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనుటకు వస్తున్నారు. వారిని మీరు ఏమి ప్రశ్నించదలచుకున్నారో ఆ ప్రశ్నల జాబితా రాయండి.

ఆ) మహిళల పట్ల చూపుతున్న వివక్షలను, వారి మీద జరుగుతున్న దాడులను ఖండిస్తూ, మహిళలందరూ ధైర్యంతో మెలగాలని తెలియజేసేలా ఒక కరపత్రం తయారుచేయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.

అ) సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరకదు. (_____, _____, _____)

ఆ) అందరికీ ఒక పద్ధతి పాటించడమే బాగుంటుంది. (_____, _____, _____)

ఇ) ఎన్నో అనుభవాలు స్మరణలోకి తెచ్చుకున్నాను. (_____, _____, _____)

2. మీ పాఠంలోని శబ్దాలంకార వాక్యాలను గుర్తించి రాయండి.

ఉదా: "అప్పుడు మా కులం వారిని ఆడవద్దన్నారు.
తర్వాత అన్ని కులాలవారిని ఆడవచ్చన్నారు." } అంత్యానుప్రాస.

3. పాఠం ఆధారంగా కింది జాతీయాలు ఏ సందర్భాలలో వాడతారో వివరించండి.

అ) గుండెలు బరువెక్కడం ఆ) నీరుకారిపోవడం ఇ) కనువిప్పు

ఈ) కాలధర్మ ఉ) తునాతునకలు

4. కింది పదాలను గురించి వివరించండి.

అ) సామాజిక మార్పు : _____

ఆ) విజయోత్సవం : _____



ఇ) సామాజికాభివృద్ధి : _____

ఈ) సాంస్కృతిక వారసత్వం : _____

ఉ) అగ్రతాంబూలం : _____

IV. భాషా కార్యకలాపాలు

- వివిధ రంగాలలో ప్రసిద్ధులైన మహిళల ఫోటోలను, జీవిత విశేషాలను సేకరించి ఒక మోడల్ మహిళావరణం పుస్తకాన్ని తయారుచేయండి. ప్రదర్శించండి.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది వాక్యాలు ఏరీతి వాక్యాలో గుర్తించి రాయండి.

అ) దయచేసి నన్ను కాపాడు.

ఆ) మీరు రావద్దు.

ఇ) వారందరికి ఏమైంది?

ఈ) నేను తప్పక వస్తాను.

ఉ) ఆహా! ఎంత బాగుందీ!

ఊ) వారు వెళ్ళవచ్చా?

ఉదా : మీరు రావద్దు – నిషేధార్థక వాక్యం.

2. కింది ఇచ్చిన సంధులు – పదాలు వేటికి ఏది వర్తిస్తుందో గుర్తించి ఆయా పదాలకు సంబంధించిన సంధి సూత్రాలను రాయండి.

ఇత్వసంధి,	గుణసంధి,	సవర్ణదీర్ఘసంధి,	ఉత్వసంధి,	విసర్గసంధి
సహస్రాబ్దం,	నిరాశ,	జీవనోపాధి,	మేమంత,	ఆనందాన్నిచ్చిన

3. కింద ఇచ్చిన సమాసాలు – పదాలు వేటికి ఏది వర్తిస్తుందో గుర్తించి ఆయా పదాలకు సంబంధించిన సమాసాలను గుర్తించి విగ్రహవాక్యాలు రాయండి.

తృతీయా తత్పురుష సమాసం,	సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం,	
షష్ఠీ తత్పురుష సమాసం,	ద్విగు సమాసం	ద్వంద్వ సమాసం.
వితంతు వివాహం,	విద్యాధికులు	
ముప్పయిసంవత్సరాలు	స్త్రీపురుషులు,	భారతదేశం

4. కింది ఉదాహరణలు ఏయే అలంకారలకు చెందినవో గుర్తించండి. సమన్వయం రాయండి.

అ) సుదతీ నూతన మదనా!
మదనాగతురుంగ పూర్ణమణిమయసదనా!



సదనామయ గజ రదనా!
రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!

ఆ) మానవా! నీ ప్రయత్నం మానవా?

ఇ) తండ్రి! హరి జేరుమని యెడి తండ్రి తండ్రి.

పరిచయం

1. కింది సమాస పదాలను వాటికి రాయబడిన విగ్రహ వాక్యాలను పరిశీలించండి.

అ)	ప్రతి దినము	దినము దినము
ఆ)	యథాశక్తి	శక్తి ఎంతో అంత (శక్తిననుసరించి)
ఇ)	ఆబాలగోపాలం	బాలుడి నుండి గోపాలుని వరకు
ఈ)	మధ్యాహ్నం	అహ్నం మధ్య భాగం
ఉ)	అనువర్షం	వర్షమునను సరించి

వీటన్నింటిలోను పూర్వపదాలు అవ్యయాలుగా ఉన్నాయి కదూ! అంటే ఈ సమాసాల్లో పూర్వపద ప్రాధాన్యం ఉంటుంది. పూర్వపదాలు లింగ, వచన, విభక్తి శూన్యంగా ఉంటాయి. ఈ లాంటి భావంతో ఉన్నా, సమాసాన్ని అవ్యయీభావసమాసం అని అంటాం.

2. కింది ఉదాహరణలకు విగ్రహవాక్యాలు రాయండి.

అ) అనుకూలం ఆ) యథామతి ఇ) ప్రతిమాసం



మాణిక్య వీణ

– విద్వాన్ విశ్వం

ఉన్ముఖీకరణ

"సౌందర్యం ఆరాధించేవాడా!
కవితలో, శిల్పంలో
పురుగులో, పుష్పంలో
మెరుపులో, మేఘంలో
సౌందర్యం ఆరాధించేవాడా!
జీవించేవాడా!
సుఖించేవాడా! దుఃఖించేవాడా!
విహ్వలుడా! వీరుడా!
ప్రేమించేవాడా!
వియోగీ! యోగీ! భోగీ! త్యాగీ!
ఆలోచనలు పోయేవాడా!
అనునిత్యం అన్వేషించేవాడా!
చెట్టూ, చెరువూ, గట్టూ, పుట్టా
ఆకసంలో సముద్రంలో
అన్వేషించేవాడా!"

– శ్రీశ్రీ

ప్రశ్నలు:

1. ఈ కవిత ఎవరి గూర్చి తెలుపుతుంది?
2. కవితలో పేర్కొన్న మానవుని ప్రత్యేక లక్షణాలేవి?
3. పై కవిత్వంలో మానవుణ్ణి ఎన్ని కోణాల్లో దర్శించవచ్చు?
4. మానవునికి వివిధ లక్షణాలు ఎలా సంక్రమించి ఉండవచ్చు?
5. నీ దృష్టిలో మానవుడెలాంటివాడు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

నేపథ్యం : ఆంధ్రప్రభ వారపత్రికలో విద్వాన్ విశ్వం "మాణిక్యవీణ" శీర్షికన వ్యాసాలు, కవితలు రచించారు. మాణిక్యవీణలో వీరు స్వీకరించని అంశం లేదు. మానవజీవన ప్రస్థానంతో కళ, కవిత్వం పెనవేసుకున్నాయని, మనిషి నిరంతర జ్ఞానాన్వేషి అని ఈ కవిత తెల్పుతుంది. మాణిక్యవీణను మీటి, మానవీయ రాగాల్ని పల్కించిన ఈ కవిత చారిత్రక ఘట్టాల్ని తరచి చూపి మనిషి శాశ్వతత్వాన్ని తెల్పుతుంది.

ఉద్దేశ్యం : సాంకేతిక రంగంలోని అభివృద్ధిని మాత్రమే అభివృద్ధి అనుకుంటూ కళలను సాహిత్యాన్ని త్యజిస్తోంది నేటితరం. మానవజీవితంతో ముడివేసుకున్న కళలు, సాహిత్యం అనాదిగా సంక్రమించిన ఆస్తి అని తెలుపుతూ, విజ్ఞాన మార్గంలో ప్రయాణించి సంస్కృతిని గౌరవిస్తేనే మనిషి శాశ్వతుడవుతాడని తెల్పడమే ఈ పాఠం ఉద్దేశ్యం.



పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం 'వచన కవిత' అనే ప్రక్రియ. పద్య, గేయాల్లో ఉండే ఛందస్సు మాత్రాగణాలతో సంబంధం లేకుండా, వ్యావహారిక భాషలో రాసే కవితను వచన కవిత అంటున్నాం. చిన్న చిన్న పదాలు, వాక్యాలతో ధ్వని గర్భితంగా ఉండే కవిత వచన కవిత. ఈ పాఠం విద్వాన్ విశ్వం రచనా సంపుటిలోనిది.

విద్యార్థులకు సూచనలు

- ----
- ---
- వాటి అర్థాలను పుస్తకం చివర ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికలో చూసి లేదా నిఘంటువులో చూసి తెల్సుకోండి.

కవి పరిచయం



ఇంత మంచి పెన్నతల్లి
ఎందుకిట్లు మారరెనో?
ఇంత మంది కన్నతల్లి
ఎందుకెండి పోయెనో?

అని ఆవేదనతో 'పెన్నేటిపాట'ను సృజించిన మానవీయ కవి విద్వాన్ విశ్వం. సాహితీవేత్తగా, రాజకీయ నాయకునిగా, పత్రికా సంపాదకునిగా బహుముఖీన దర్శనమిచ్చిన విశ్వం అసలు పేరు మీసరగండ విశ్వరూపాచారి. 1915 అక్టోబర్ 21న అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో లక్ష్మమ్మ, రామయ్య దంపతులకు జన్మించిన విశ్వం సంస్కృతాంధ్రంగ్ల భాషల్లో పండితులు, మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూనే సంస్కృత భాషలోని పలుగ్రంథాల్ని తెలుగులోకి అనువదించారు. పత్రికా సంపాదకునిగా 'అవి – ఇవి', 'తెలుపు – నలుపు', 'మాణిక్యవీణ' వంటి శీర్షికలను ప్రశంసాపాత్రంగా నిర్వహించారు. భాష, సాహిత్యం, సమాజం, నైతిక విలువలు తదితర అంశాలపై వారు వెల్వరించిన సంపాదకీయాలు ఆచంద్రతారార్కమే! 'ప్రేమించాను' అనే నవల, 'ఒకనాడు', పెన్నేటిపాట అనే కావ్యాలు విద్వాన్ విశ్వం కలం నుండి జాలువారిన రచనలు. వీరి సాహిత్య సేవకు వివిధ విశ్వవిద్యాలయాలు కళాప్రపూర్ణ, డిలిట్ డిగ్రీలనందించాయి.

విశ్వరూపి నాహృదయం
విశ్వజీవి నాహృదయం
విశ్వభావి నాహృదయం
విశ్వమేవ నాహృదయం అని తనకు తాను

ప్రకటించుకున్న విశ్వమాణిక్యవీణ 1987 అక్టోబరు 19న శాశ్వతంగా మూగబోయింది.



ఛందోబద్ధమైన పద్యం భావప్రకటనకు ప్రతిబంధకమనుకున్నప్పుడు వచనకవితను ఆశ్రయించారు కొందరు కవులు.

సరళమైన పదాలతో, సహజమైన వాడుక భాషలో, సూటిగా భావాన్ని వ్యక్తంచేస్తే వచన కవిత ద్వార ఎందరో కవులు లోతైన భావాలను కూడా తేలికగా అందించారు.

మానవ పరిణామంలోని సౌందర్యాన్ని, కృషిని, సాధన సంపత్తిని, తాత్వికతను విద్వాన్ విశ్వం ఎంత హృద్యంగా చెప్పారో... చూద్దామా!

I.

మంత్రాలతో చింతకాయలు
రాలనప్పుడు పద్య
సంత్రాసంతో చింతలు
పారిపోతాయా?

యంత్రాలతో జబ్బులు
నయం కానప్పుడు
తంత్రాలతో సమాజరుగ్మతలు
దారికి వస్తాయా?

అంటూ అనవచ్చు,
ఔనని కొందఱతో
అనిపించనూ వచ్చు.

పొట్టలోని పుట్టకురుపుతో సంఘం
కట్టెదుట కళవళపడి పోతుంటే
నిట్టనిలువున రోదసిలోనికి
కట్టలు కట్టుకొని దూసుకొనిపోయి
కట్టుకొని పోయేదేమిటని

అంటే అననూవచ్చు.
ఔనని కొందఱతో
అనిపించూవచ్చు.

ఆలోచించండి-చెప్పండి

- *ఈ కవితలో ప్రాస పదాలు ఏమున్నాయి?*
- *"అంటే అనవచ్చు, ఔనని కొందఱతో అనిపించనూవచ్చు" అనే వాక్యాల ద్వారా మీరేమిగ్రహించారు?*
- *సమాజ రుగ్మతలు అంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు చెప్పండి.*
- *"పొట్టలోని పుట్టకురుపుతో సంఘం కట్టెదుట కళకళలాడిపోవడం" అంటే ఏమిటి?*



II.

మనిషి కనువిచ్చినప్పుడే
వాని అందచందాలు చవిగొన్నాడు.

ఆనాడే ప్రకృతిని
అధీనం చేసుకోవడానికీ
అందలి రంగులనూ రవళినీ
అనుకరించడానికీ కూడా ఆయత్తమయినాడు.

గుహలలో నివసించే వాడే
గోడలపై గుర్రాలూ, జింకలూ గీసుకున్నాడు...

కాడువీచినప్పుడే
మోడులు చివురించేలా
పాడడం ఆరంభించినాడు
గులకఱాల ములుకుమీదే
గొబ్బున కాలికి గజ్జ కట్టినాడు.

దిక్కులు పిక్కటిల్లేలా
ఘీంకరించుటే కాదు
మొక్కలునిక్కిచూచేలా
చక్కని నొక్కులతో
చిక్కని పదాలు పాడుకొన్నాడు.

చక్రం కనుక్కున్న రోజెంత
చరిత్రలో ప్రముఖ దినమో
చరచరా నాలుగు గీతలతో ఓ ఆకారం
విరచించిన రోజు అంతే ప్రముఖం
నిప్పును కనుక్కున్న నాడెంత శుభదినమో

తప్పటడుగులు మాని
తాండవం చేసిన నాడు అంతే శుభదినం.

ఆలోచించండి-చెప్పండి

- *ప్రకృతికీ మనిషికి ఉండే సంబంధం ఏమిటి?*
- *ఈ కవితలో పదసౌందర్యంతో వినసొంపుగా ఉన్న పదాలు ఏవి?*
- *చక్రం కనుగొనడం, నిప్పును కనుగొనడం చరిత్రలో అతి ముఖ్యమైనవని ఎందుకంటారు?*
- *"తప్పటడుగులు మాని తాండవం చేసిననాడు శుభదినం" అంటే ఏమిటి?*



III.

కిలకిలలు మాని కలభాషలు నేర్చుకున్న రోజు
అలతి మాటలతో పదాలల్లుకున్న రోజు
కలమధాన్యం పండించుకున్న రోజు
కళలను పండిచుకున్న రోజు
అన్నీ గొప్ప రోజులే
మానవ చరిత్రలో
అన్నీ అసాధారణ పర్వదినాలే

అలా అలా కలగలిపి
పెనవేసుకొని
కళలూ కవితలూ
విజ్ఞానం ప్రజ్ఞానం
తళతళలతో తన్ను నడిపింపగా

మిన్నులు పడ్డ చోటునుండీ
తిన్నగా ఎదిగి మిన్నందుకుంటున్న

చిన్నవాడు మానవుడు
చిరంజీవి మానవుడు
చిరంతనుడు మానవుడు
అనాదిగా నడుస్తున్న ఈ
మహాప్రస్థానంలో
అతగానిని వదలని
జతలు కళా కవితా
జ్ఞానం విజ్ఞానం
వానితో నడిచేవీ
వానిని నడిపించేవీ అవే-
అవే కళాకవితా
జ్ఞానం విజ్ఞానం
ప్రజ్ఞానం.

ఆలోచించండి-చెప్పండి

- *కవి వేటిని గొప్ప రోజులన్నాడు? ఎందుకు?*
- *మీ దృష్టిలో ఏవి గొప్ప రోజులు? ఎందుకు?*
- *"కళలూ, కవితలూ పెనవేసుకోవడం" అనే వాక్యాలను సమర్థిస్తూ మాట్లాడండి.*
- *"మిన్నందుకుంటున్న చిన్నవాడు" అని ఎందుకన్నాడు కవి?*
- *'కళా, కవితా జ్ఞానం విజ్ఞానం' అంటే ఏమిటి?*



సారాంశం :

మంత్రాలతో చింతకాయలు రాలనట్టే పద్యధాటికి చింతలు దూరంకావు. యంత్రాలతో జబ్బులు నయంకానట్టే మాయ మాటలతో సామాజిక సమస్యలు తొలగిపోవు. ఈ మాటను కొందరు ఆమోదిస్తారు. కొందరు ఆమోదించినట్టు నటిస్తారు. వాస్తవమైన కార్యాచరణ, నిబద్ధత, అంకితభావంతోనే సామాజిక సమస్యలు పరిష్కారమౌతాయి.

ఓవైపు కడుపులోని భయంకరమైన వ్యాధి (వ్రణం)లా సామాజిక అసమానతలనే రోగాలు కళ్ళ ముందు కన్పిస్తూ కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతరిక్ష ప్రయాణాల్లో అభివృద్ధిని సాధించడంవల్ల ఒరిగిందేమని కొందరనవచ్చు. ఇంకొందరు బలవంతంగానైనా ప్రశ్నించవచ్చు. శాస్త్ర సాంకేతిక ప్రగతిలో సమానంగా సామాజిక జీవనశైలి ఎదగడంలేదని, సగటుజీవి జీవనం ఇంకా పాతాళంలోనే ఉందని కవిభావన.

మనిషి కళ్ళు తెరవగానే తనచుట్టూన్న ప్రకృతి అందాల్ని చూసి పరవశించాడు. అప్పటి నుండి ప్రకృతిని తన కనుసన్నల్లో ఉంచే ప్రయత్నం చేశాడు. ప్రకృతిలోని అన్ని రంగుల్నీ, రకరకాల ధ్వనుల్ని అనుకరించే ప్రయత్నం చేశాడు. పూర్తిగా ప్రకృతితో తాదాత్మ్యం చెందాడు. గుహల్లో జీవించిన ఆదిమానవుడే గుర్రాల్నీ జింకల్నీ గీస్తూ చిత్రలేఖన నైపుణ్యాన్ని మెరుగుపర్చుకున్నాడు. ఆటవిక జీవన దశలోనే తన గానమాధుర్యంతో ఎండిన మ్రోడుల్ని చిగురింపజేశాడు. పాటకు అనుగుణంగా కఠినమైన రాతినేలపై కాలికి గజ్జెకట్టి చిందులేశాడు. దశదిశలూ అదిరేలా గర్జించడం, స్వరాల సుకుమారపు నొక్కులతో హత్తుకునే పాటలు పాడాడు మనిషి కళ్ళు తెరిచిన నాటి నుండి ప్రకృతిని ఆరాధించడం నేర్చుకున్నాడు. ప్రకృతిని చూసి తనను తాను మైమరచి పాటలు పాడుతూ, నర్తిస్తూ, ఆనందడోలికల్లో తేలిపోయాడు. కళలను జీవితంలో అంతర్భాగం చేసుకున్నాడు. ప్రాక్తన మానవుడు ప్రకృతి ఒడిని పాఠశాలగా చేసుకుని కళాభినివేశాన్ని అలవర్చుకున్నాడు.

చక్రం కనుగొన్నరోజు చరిత్రలో ఎంత ప్రముఖమైనదో, చకచకా నాలుగు గీతలతో లిపిని కనుగొన్న రోజూ అంత కన్నా విశేషమైంది. చక్రం మానవ చలనానికి దోహదపడితే, లిపి భావసంచలనానికి వేదికై సృజనాత్మక ప్రపంచంలోకి దారిచూపింది. నిప్పును కనుగొన్న రోజెంత గొప్పదో తప్పటడుగుల చిందుల నుండి ఉన్నత నృత్యాలు చేసిన రోజూ అంతే గొప్పది. రాతయుగపు చీకటిని చీల్చుకుంటూ నవీన విజ్ఞానపు వెలుతురులోకి ప్రవేశించిన గొప్ప రోజులుగా కవి భావించాడు.

అరుపుల నుండి అర్థవంతమైన మాటలు నేర్చినరోజు, ఆ మాటలతో జానపదాలల్లిన రోజు, సారవంతమైన భూమి నుండి భుక్తిని పండించుకున్నరోజు, మానసికోల్లాసం కల్గించే కళ ఆవిష్కరణ జరిగిన రోజు... ఇలా ఒకటేమిటి అన్ని గొప్పరోజులే! మానవ జీవన పరిశ్రమ చరిత్రలో నిలిచిన అసాధారణ సంఘటనలు జరిగిన ప్రతిదినమూ శుభదినమే! ఇలా కవితలూ, కళలూ, విజ్ఞానం, ప్రజ్ఞానం కలగలిసిపోయి మానవజీవితంలో పెనవేసుకొన్నాయి. ఆదిమ దశ నుండి, ఆధునిక దశ వరకూ మనిషి చేసిన ప్రయాణంలో ప్రతి అంశమూ ఎంత అపురూపమైదోగదా అని కవి అచ్చెరువొందాడు. బ్రతుకుతో ముడి వేసుకున్న కళల, శాస్త్రాల గొప్పదనాన్ని స్మరించుకున్నాడు.

కళలు, విజ్ఞాన కాంతులతో జీవన ప్రయాణంలో నేల నుండి నింగికెరిగిన చిన్న మానవుడే శాశ్వతుడయ్యాడు. అనంతమైన కాలం దారిలో అలుపెరుగక సాగుతున్న జీవన ప్రస్థానంలో మానవుణ్ణి వదలనివి కళలు, కవితలు, జ్ఞానవిజ్ఞానాలు. తన జీవన యానంలో ఎదురయ్యే అలసటను, యాంత్రికతను దూరం చేయడానికి కళల్ని కవితల్ని ఆలంబనగా చేసుకున్నాడు. విజ్ఞాన మార్గం ప్రయాణించాడు. వీటితోనే నడిచాడు. వీటినే నడిపించాడుకూడా. మనిషి కాలగర్భంలో కలిసినా అతని మేధస్సులోంచి ఆవిష్కృతమైన కళ, కవిత్వం, విజ్ఞానం సకలమానవాళికీ దిశానిర్దేశం చేస్తాయి. మానవుణ్ణి శాశ్వతుణ్ణి చేస్తున్నాయి.



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. మాణిక్యవీణ శీర్షికన ఉన్న కవిత విన్నతర్వాత మీకు ఎలాంటి అనుభూతి కల్గిందో చెప్పండి.

2. 'మాణిక్యవీణ' వచన కవితను రాగంతో పాడండి. దీని భావాన్ని సొంతమాటల్లో చెప్పండి.

3. పొట్లపల్లి రామారావు రాసిన కింది కవితను చదివి ప్రశ్నలకు జవాబులివ్వండి.

ఎన్ని దినములు నీవు
ఇల గడిపినను ఏమి?
ఎన్ని జన్మాలింక
ఎదిరి చూచిన ఏమి?
ఎన్నాళ్లకైన నీ
ఔన్నత్యమును నీవె
సాధించ వలెనోయి
శోధించ వలెనోయి!
నీలోన వెలుగొందు
నీస్వశక్తిని మరచి
పరుల పంచల జూడ
ఫలమేమి కలదోయి!

అ) పై కవితకు పేరు పెట్టండి.

ఆ) ఔన్నత్యం పొందడానికి కవి ఏం చేయాలని చెప్తున్నాడు?

ఇ) స్వశక్తికి, ఇతరులపై ఆధారపడడానికి గల తేడా ఏమిటి?

ఇ) "పరులపంచ" అనే పదంతో సొంతవాక్యాన్ని రాయండి.

4. ఈ పాఠంలోని అంత్యప్రాస పదాలు వెతకండి. అలాంటివే మరికొన్ని పదాలను రాయండి.

5. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

అ) "మంత్రాలతో చింతకాయలు..." ను కవి వేటితో పోల్చాడు?

ఆ) కవి వేటిని శుభదినాలని వర్ణించాడు?

ఇ) మానవుణ్ణి శాశ్వతంగా నిల్పేవి ఏవి?

ఈ) విద్వాన్ విశ్వం గురించి, ఆయన కవితాశైలి గురించి ఐదు వాక్యాలు రాయండి.



II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) చరిత్రలో మైలురాళ్ళుగా నిల్చిన అంశాలేవి? ఇవి దేనికి ప్రతీకగా భావిస్తున్నావు?

ఆ) "మిన్నులు పడ్డ చోటి నుండి... తిన్నగా ఎదిగి మిన్నందుకుంటున్న చిన్నవాడు మానవుడు" అని కవి వర్ణించాడు. ఈ వాక్యలపై నీ అభిప్రాయమేమి?

ఇ) మానవ చరిత్రలో అన్నీ అసాధారణ పర్వదినాలే అనడంలో ఆంతర్యం ఏమై ఉంటుంది?

2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.

అ) మానవ ప్రస్థానంలో కళ, కవితావిజ్ఞానం తోడున్నాయని కవి వర్ణించాడు గదా! దీనినెలా సమర్థిస్తావు?

ఆ) మాణిక్యవీణ కవిత్వ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) నీ చుట్టూన్న పరిసరాల్లో, మానవ జీవితంలో కల్గిన మార్పులను, అభివృద్ధిని వర్ణిస్తూ 10 పంక్తులకు తక్కువ కాకుండా ఒక కవితను రాయండి.

ఆ) విద్వాన్ విశ్వం కవితా శిల్పాన్ని ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. కింది వాక్యాలు చదివి గీత గీసిన పదాలకు అర్థం రాసి సొంతవాక్యం రాయండి.

అ) రోదసిలోకి దూసుకెళ్ళిన మరో ఉపగ్రహం.

ఆ) విద్యార్థులంతా పరీక్షలకు ఆయత్తమవుతున్నారు.

ఇ) రుగ్మత కల్గిన ఈ సమాజానికి మానవీయ విలువల చికిత్స అవసరం.

ఈ) కళవళ మెందుకు? నిదానంగా జవాబు చెప్పు.

ఒకరిని చూసి మరొకరు చేయడం	
పనిచేయుటకు సిద్ధమవడం	
అద్భుతం నాట్యమాడడం	
పనిని మొదలు పెట్టడం	

2. పాఠం ఆధారంగా కింది వాక్యాలకు సమానమైన పదాల్ని వెతికి రాయండి.

3. కింది పదబంధాలను ఏయే సందర్భాల్లో ప్రయోగిస్తామో తెలిపి సొంతవాక్యం రాయండి.

అ) మంత్రాలకు చింతకాయలు రాయడం _____

ఆ) మిన్నందుకోవడం _____

ఇ) గజ్జెకట్టడం _____

ఈ) విరచించడం _____

4. కింది పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలు రాయండి.

అ) మిన్ను	:	ఆకాశం,	నింగి,	గగనం,	నభము
ఆ) తాండవం	:	_____	_____	_____	_____
ఇ) రుగ్మత	:	_____	_____	_____	_____
ఈ) జ్ఞానం	:	_____	_____	_____	_____

5. కింది వాక్యాలు చదివి గీతగీసిన వికృతిపదాలకు పాఠం ఆధారంగా ప్రకృతి పదాలు చేర్చి తిరిగి వాక్యాలు రాయండి.

అ) అమ్మ బాసలోనే నేను మాట్లాడతాను.

ఆ) మన కవులు రచించిన కైతలు భారతి మెడలో అలంకరించిన హారాలు.

ఇ) విన్నాణము పెంచుకోకపోతే భవిష్యత్తు అంధకారమవుతుంది.

ఈ) సింహాలు గొబలో నిద్రిస్తున్నాయి.

IV. భాషా కార్యకలాపాలు

- దిన, వార పత్రికల ఆధారంగా మీకు నచ్చిన రెండు వచన కవితల్ని సేకరించి, అంశాల ఆధారంగా కింది పట్టికను పూరించండి.

క్ర.సం.	కవితాశీర్షిక	పత్రిక తేది	కవితలో మీరు గుర్తించిన ప్రత్యేక అంశాలు	కవితలో నీకు బాగా నచ్చిన పంక్తులు

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది పదాల్లో నుగాగమ సంధి పదాలను గుర్తించి విడదీసి సూత్రం రాయండి.

నిట్టనిలువు, తెల్లందనము, పోయేదేమి, తళుకుంగజ్జెలు,

మహోపకారం, సరసపుఁదనము, రాజునాజ్ఞ



2. కింది వాటిని జతపరచండి.

సమాసపదం		విగ్రహవాక్యం		సమాసం
1. ప్రముఖదినం	( )	a) మానవుల యొక్క చరిత్ర	( )	e) నఞ్ తత్పురుష సమాసం
2. నాలుగుగీతలు	( )	b) సాధారణము కానిది	( )	f) విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
3. అసాధారణం	( )	c) నాలుగు సంఖ్యగల గీతలు	( )	g) షష్ఠీతత్పురు సమాసం
4. మానవచరిత్ర	( )	d) ప్రముఖమైన దీనం	( )	g) ద్విగు సమాసం

పరిచయం

1. కింది లక్ష్యాలను పరిశీలించండి.

అ) మిమ్ము మాధవుడు రక్షించుగాక!

అర్థం 1. మిమ్ములను విష్ణువు (మాధవుడు) రక్షించుగాక!

2. మిమ్ము శివుడు (ఉమాధవుడు) రక్షించుగాక!

ఆ) మానవ జీవనం సుకుమారం.

అర్థం 1. మా ఆధునిక జీవితం సుకుమారమైనది.

2. మానవ జీవితం సుకుమారమైనది.

పై అర్థాలను గమనించారు కదా! ఒకే శబ్దం రెండు వేర్వేరు అర్థాలనందిస్తున్నాయి. అంటే విభిన్న అర్థ ఆశ్రయాలై ఉన్నాయి. ఇలా ఉంటే వాటిని శ్లేషాలంకారము అని అంటారు.

లక్షణం : నానార్థములను కలిగిఉండే అలంకారం శ్లేష కింది లక్ష్యాలలో ఉన్న అలంకారాన్ని గుర్తించి సమన్వయం చేయండి.

1. రాజు కువలయానందకరుడు.

2. నీవేల వచ్చెదవు.







గోరంత దీపాలు

– పులికంటి కృష్ణారెడ్డి

చదవండి – ఆలోచించి చెప్పండి.

బిడ్డ ఆకలి అమ్మకి తెలుస్తుంది. ఈ తల్లులకు తమ ఆకలేకాదు, అనాథల క్షుద్బాధా తెలుసు. ఇంత తెలిసిన వీరంతా గొప్ప స్థితిమంతులేం కాదు. అలాంటప్పుడు లేనివారికి గుప్పెడు మెతుకులు పంచేదెలా? ఆలోచించగా ఆలోచించగా దారి దొరికింది. రోజూ పిడికెడు గింజలు దాచాలన్న ఊహ కలిగింది. పిడికిలి బిగిస్తే ఉద్యమం అవుతుంది. ఆ ఊళ్లో జనం పిడికిలి తెరిచారు. తమ దగ్గరున్న గింజల నుంచి ప్రతిరోజూ పిడికెడు పంచడం నేర్చారు. ఇవ్వడం సాయం. పంచడం మానవత్వం. సాటి మనుషుల ఆకలి తీర్చడం దైవత్వం.

ప్రశ్నలు:

1. పై పేరాద్వారా మీరేం తెలుసుకున్నారు?
2. మానవత్వంతో చేసే పనులు ఏవి?
3. సహాయపడే గుణం, మానవత్వం కల్గిన వారి వల్ల సమాజానికి కలిగే మేలు ఏమిటి?
4. మీరు ఇతరులకు ఎప్పుడైనా సాయం చేసారా? ఎప్పుడు? ఎందుకు?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

సమాజంలో ఎంతోమంది అనాథ పిల్లలను మనం చూస్తూ ఉంటాం. ఇటువంటి పిల్లలు కనీస అవసరాలైన తిండి, బట్ట, చదువు మొదలైన వాటికి నోచుకోకుండా ఉంటూ ఉంటారు. అనాథబాలలను చేరదీసి వారి ఆకలి తీర్చి విద్యాబుద్ధులు చెప్పిస్తే వీరు కూడా మట్టిలో మాణిక్యాల్లాగ వెలుగొందుతారు. సమాజానికి సేవచేసే గొప్ప మనసున్న వ్యక్తులు, తమ ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా అనాథ పిల్లలను చేరదీసి చదివించేవారు కూడా ఎంతో మంది ఉన్నారు. అటువంటి ఒక వ్యక్తి చేసిన పనే ఈ కథ.

రైలు ప్రయాణంలో తటస్థపడిన ఓ బాలుణ్ణి చేరదీసి విద్యా బుద్ధులు చెప్పిస్తే, ఎదిగిన ఆ వ్యక్తి చూపే కృతజ్ఞతా భావం, వారి మధ్య ఉండే మానవసంబంధాలను వివరిస్తుంది ఈ పాఠం.



పాఠ్యభాగ వివరాలు

మానవ సంబంధాలు, సామాజిక సేవ ఇతివృత్తంతో కళ్ళకు కట్టినట్లుగా మనోభావాలను పలికించే 'కథానిక' ఈ పాఠ్యభాగం. ఈ పాఠం పులికంటి వారి కథా వాహిని లనిది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న పేరా చదవండి, పాఠంలోని అంశాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- వాటి అర్థాలను 'పదాలు – అర్థాలు' పట్టికలను లేదా నిఘంటువును చూసి తెలుసుకోండి.

కవి పరిచయం



జన జీవనాన్ని కళ్ళకు కట్టినట్టు రచనలు చేస్తున్న సీమ ప్రాంతానికి చెందిన కథానికారచయిత, నటుడు, జానపద కళాకారుడు, కవి, నాటక రచయిత, బుర్రకథకుడు శ్రీపులికంటి కృష్ణారెడ్డి.

వ్యవసాయమే ప్రధాన వృత్తిగా కలిగిన ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. బెల్లంకొండ రామదాసు రచించిన "పునర్జన్మ" నాటకంలో వృద్ధుని పాత్ర ధరించడంతో ఆయన నటజీవితం ప్రారంభమైంది. దుర్యోధనుడు, పఠాన్‌రుస్తుం, కర్ణుడు, కీచకుడు లాంటి ఏకపాత్రాభినయాలతో పలు బహుమతులనందుకున్నారు.

పులికంటి ఒక ప్రక్క నటునిగా ప్రశంసలందుకుంటూనే రచనా వ్యాసంగం పట్ల మొగ్గుచూపి – ముఖ్యంగా కథా సాహిత్యం వైపుకు దృష్టి సారించారు. 1960లో ఆంధ్రపత్రికలో ప్రచురితమైన "గూడుకోసం గువ్వలు' ఆయన మొదటి కథ ఆయన సుమారు 150 కథలు రాశారు. 14 కథలకు ప్రథమ బహుమతులందుకున్నారు.

పులికంటి బుర్రకథకునిగా కుంటుంబ సంక్షేమం, వాతావరణ కాలుష్యం – పొదుపు తదితర అంశాలపై సుమారు వంద బుర్రకథలను రూపొందించి తానే ప్రదర్శనలిచ్చారు.

పులికంటి కథా సాహిత్య రంగాలలో చేసిన సేవలకుగాను ఎన్నో పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. 2001 సంవత్సరానికి కథా ప్రక్రియలో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాన్నీ, 2003 సం॥లో ప్రతిష్ఠాత్మక గోపిచంద్ అవార్డునూ, 2005 సం॥లో నేదురుమల్లి జనార్థన రెడ్డి పురస్కారాన్నీ, ఎస్వీ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఇంకా 2000 సం॥లో ఆయన ప్రారంభించిన "పులికంటి సాహితీ సత్కృతి" ఇప్పటి వరకు వివిధ రంగాలకు చెందిన 18 మంది నిష్ణాతులను సత్కరించింది.

ఆంధ్రప్రభ (దినపత్రిక)లో 67 వారాల పాటు ధారావాహికంగా పులికంటి నిర్వహించిన 'నాలుగ్గాళ్ళ మండపం' శీర్షిక పూర్తిగా రాయలసీమ మాండలికంలో కొనసాగి గ్రామీణ జీవితాన్ని, బడుగు రైతుల గుండె చప్పుళ్ళనీ ప్రతిబింబింప జేసింది. 30-7-1931న చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం జక్కదన్న గ్రామంలో పులికంటి గోవిందరెడ్డి, పాపమ్మదంపతులకు జన్మించిన కృష్ణారెడ్డి జీవితకాలం చివరి వరకూ నిర్విరామంగా సాహిత్య సేద్యాన్ని గావించారు. పులికంటి కృష్ణారెడ్డిగారు 18-11-2007 న అనారోగ్యంతో తిరుపతిలో స్వర్గస్థులయ్యారు.



ప్రయత్నించి ఫలితాన్ని సాధించడంలో కొందరికి ఆనందం. అసలు ప్రయత్నాల ప్రమేయమేలేకుండా జీవితాల్ని కొనసాగించాలన్నది కొందరి కోరిక. నాజీవితమంతా అలాంటి ప్రయత్నాలతోనే కొనసాగుతుంది. అందుకే ఆ కుర్రవాడి బతుకుమీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను. అంటూ కాసేపు ఆగారు. ఆ కుర్రవాణ్ణి పరీక్షించడానికి నా ప్రయత్నంగా నేను జారవిడిచిన కాగితమది. ఇంతకూ ఆకుర్రవాడు ఎవరు? ఆయన ఎవరు? ఆయన చేసిన ప్రయత్నమేమిటి? "గోరంతదీపాలు" కథానిక పాఠం చదివి తెల్సుకోండి.

I.

వేపచెట్టు!

తల్లి ప్రేమలాంటి చల్లని నీడనిచ్చే వేపచెట్టు!!-

దరిద్రుడి గుండెల్లోనుండి పుట్టిన అంతులేని ఆశల్లా ఆచెట్టుబోదె నుండి పుట్టిన కొమ్మలు నాలుగు దిక్కులా వ్యాపించగలిగినంత మేర వ్యాపించాయి. కలిగిన వాడికి బాగా కండపట్టినట్లు ఆ కొమ్మలు పూతా పిందెల్తో నిండుగా ఉన్నాయి.

ఆ చెట్టు కొమ్మకు వేలాడదీసిన నాలుగు ఇనుప గొలుసులు... ఆ ఇనుప గొలుసులకు తగిలించిన ఓ పెద్ద పీట... అది ఉయ్యాల పీట!

ఆ పీటమీద అతడు కూర్చున్నాడు!

గతాన్ని నెమరేస్తూ వర్తమానాన్ని తలపోస్తూ భవిష్యత్తును ఊహిస్తున్నట్లున్న అతడు ఓ మహాయోగిలా కనిపిస్తున్నాడు.

అతనిముందు ఓ కుర్రవాడు నిలబడి ఉన్నాడు.

ఆ కుర్రవాడు నిలబడి ఉండడంలో వినయం ఉట్టిపడుతూ ఉంది. వేషంలో సంస్కారం ఉంది. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతూ ఉంది.

ఆయన నిమీలిత నేత్రుడై చేయెత్తి ఆశీర్వదిస్తున్నాడు. ఇద్దరి కనుకొలకుల్లో నిలిచిన నీళ్ళు సంజవెలుగులో ముత్యాల్లా మెరుస్తున్నాయి. అనిర్వచనీయమైన కృతజ్ఞతా భావం ఆ ఇద్దరి మొగాల్లో దోబూచులాడుతూ ఉంది. అనుభూతిలో తడుస్తూ వాళ్ళు మూగబోయారు.

ఆ మధుర సన్నివేశాన్ని మైలపరచడం నాకు ఇష్టంలేకపోయింది. అలాగని ఆ నాలుగు బారల దూరంలో అలానే ఆగిపోవడానికి మనస్కరించలేదు, ఈ తటస్థస్థితిలో అడుగు ముందుకు పడలేదు.

తనివిదీరనట్లు మళ్ళీ ఒకసారి ఆ కుర్రవాడు అతని పాదాల్ని ఒడిసి పట్టుకొన్నాడు. పాదాల మీద తలను ఆనించాడు. కన్నీటితోనే అతని పాదాల్ని కడుగుతున్నాడేమో మరి!-



ఆయన ఎటో చూస్తున్నాడు. ఆశీర్వదించడానికి ఎత్తిన చేయి ఎత్తినట్లుగానే ఉంది. చేరడేసి చెంపలమీద నుండి జాలువారుతున్న కన్నీళ్ళు ఆ కుర్రవాడి తలమీద పడుతున్నాయి. ముత్యాల్లా!

కన్నీటి ముత్యాలతో ఆశీర్వాదం అందుకొంటున్న ఆ కుర్రవాడు ఎంత ధన్యుడో?!

ఎవరీ కుర్రవాడు?... ఏమిటో వీళ్ళిద్దరి మధ్య సంబంధం?... మహా మేరువులాంటి ఆ మనిషిని కదిలించిన ఆ కుర్రవాడెంతటి అదృష్టవంతుడు? అని ఆలోచిస్తూ నిలబడ్డాను.

దాదాపు రెండుమూడు చదరపు మైళ్ళ విస్తీర్ణం కలిగిన ఆ ఆవరణలో ఈ వేపచెట్టు కంటే పెద్దవైన రాగిచెట్లున్నాయి. మర్రి మానులున్నాయి. జువ్విచెట్లున్నాయి. రకరకాల పూల పాదులున్నాయి. కూరల తోటలున్నాయి. బంగారు కరిగించి పోసినట్లున్న ఆ సంజ వెలుగుతో తడిసిముద్దవుతున్నాయి అక్కడి చెట్లూ చేమలు! పోటీపడ్డట్టుగా వాళ్ళిద్దరు అనుభూతితో తడిసి ముద్దవుతున్నారు. ఈ అనుభూతిని ఆకళింపు చేసుకొన్నట్లుగా చెట్లమీది పాల పిట్టలు పరవశంతో పాడుతున్నాయి.

కొన్ని నిముషాలు మాత్రమే కొనసాగిందీ పరిస్థితి!

ఆ కుర్రవాడు పైకి లేచాడు. కన్నీటితో నిండిన కండ్లను జేబురుమాలుతో వత్తుకున్నాడు. మళ్ళీ ఒకసారి రెండు చేతులు జోడించాడు. జోడించిన చేతులు జోడించినట్లే ఉంచుకొని అలానే నాలుగడుగులు వెనక్కు వేశాడు. అక్కడ నిలబడి మళ్ళీ ఒకసారి శిరస్సు వంచి నమస్కరించాడు. గిరక్కున వెనక్కుతిరిగి హుందాగా ముందుకు సాగి పోతున్నాడు.

ఆ ఉయ్యాలపీట మీద హుందాగా కూర్చున్న ఆ మహామనీషి కూర్చున్నట్లుగానే ఉండిపోయాడు – వెళ్ళిపోతున్న ఆ కుర్రవాడివైపు తదేకంగా చూస్తూ!

ఆ ఆవరణలో బాలబాలికలకు వసతి గృహాలున్నాయి. అతిథులకు ప్రత్యేక సదుపాయాలతో గదులున్నాయి. వయోవృద్ధులకు వసతులున్నాయి. చదువుకోవడానికి గ్రంథాలయం ఉంది. సాయంసమయాల్లో పూజకు ప్రార్థనాలయం ఉంది.

అది విద్యానగరం!

ఆ నగరంలో అతడు మకుటంలేని మహారాజు! ప్రతిరోజు అదే సమయానికి ఆయన అక్కడికి వస్తారు. ఆ పీటమీద కూర్చుంటారు. ఆయన అక్కడ ఉన్నంతసేపు అసలే ప్రశాంతతకు మారుపేరయిన ఆ ప్రదేశం మరింత ప్రశాంతంగా ఉంటుంది. ఎవరి పనుల్లో వాళ్ళుంటారు. ముఖ్యంగా బాలబాలికలు చదువుకొంటూనో రాసుకొంటూనో తమతమ పనుల్లో తాము లీనమయి ఉంటారు. తమ పనుల్ని తాము నిర్వర్తించుకొంటున్న మనుషుల్ని... శ్రద్ధగా చదువుకొంటున్న పిల్లల్ని చూస్తూ... ఆ గోరంత దీపాల్లో కొండంత వెలుగుల్ని ఆశిస్తూ... ఆయన ఆనందానుభూతిలో తేలిపోతుంటారు!

రాత్రి ఏడుగంటల ప్రాంతంలో గంట కొడతారు. గంట శబ్దం చెవిని పడడంతో పిల్లలందరు బిలబిలా వచ్చి గుమిగూడుతారు. ఒక్కొక్కడి చేతిలో ఓ కంచం, మంచినీళ్ళకు లోటా ఉంటుంది. అందరు అక్కడ చేరేసరికి ఆయన ఉయ్యాలపీటమీద నుండి లేచి నిలబడతారు. ఆయన నిలబడ్తే పిల్లలందరు వరసగా నిలబడతారు. అందరు కలిసి గొంతెత్తి పాడుకొంటూ ముందుకు కదులుతారు. ఒక్కొక్కరుగా ముందుకు నడుస్తూంటే ఓ చోట కంచంలో అన్నం వేస్తారు. మరోచోట పులుసు పోస్తారు. ఇంకొక చోట మజ్జిగ అన్నం వడ్డిస్తారు. చెవుల కింపుగా పాడుకొంటూ ఆ పిల్లలందరు అన్నం వడ్డించుకొనే దృశ్యం – కనుల పండువుగా ఉంటుంది.

తెగిన గాలిపటాల్ని తాడు విడిచిన బొంగరాల్ని ఓ చోట చేర్చి గోరంత దీపాలకు కొండంత వెలుగు చేకూర్చాలని కృషి చేస్తున్న ఆ మహామనీషిని చూస్తే చేతులెత్తి నమస్కరించాలనిపిస్తుంది. అందుకే అప్పుడప్పుడు ఆయనతో కాలక్షేపం చేయడానికి అలవాటుపడ్డాను.



ఆయన మాట్లాడతాడు. అవి మాటలుగావు. జీవితానుభవం నుండి వెలువడిన అక్షరసత్యాలు.

ఆయన అప్పుడప్పుడు గతస్మృతులతో నవ్వుతాడు. అది నవ్వుగాదు. జీవితానుభవమనే వడదెబ్బకు నలిగిన పువ్వు! – అయినా వాడిపోలేదు.

ఆయన కష్టాల్ని భరించాడు. కాకుల అరుపుల్ని విని లోకమే కాకులనుకొన్నాడు. ఆయన ఓర్పు వహించాడు. తన ధ్యేయాన్ని అందుకోవడంలో నేర్పు చూపించాడు. ఆ ఫలితంగా ఎప్పుడో అటుబారెడు ఇటుబారెడు మించని గుడిసెలో బుడ్డీదీపం గుడ్డివెలుగులో ఓ కుర్రవాడు ఓనమాలు దిద్దుకున్నాడు.

బుడ్డీదీపం అందించే గోరంత వెలుగులో ఆ కుర్రవాడి భవిష్యజ్జీవితంలో కొండంత వెలుగుకోసం ఆయన ప్రయత్నించాడు.

ఇది ముప్పై ఏళ్ళనాటి మాట!

మరి ఇప్పుడు?

ఇప్పుడా? అలాంటి కుర్రవాళ్ళు ఒక్కరా? ఇద్దరా? వేలాదిమంది. ఈ వేలాది గోరంత దీపాలకు కొండంత వెలుగు ఇవ్వాలని అహరహం కృషిచేస్తున్న ఉపాధ్యాయులు వందలమంది. అందరు ఆయన చేతిచలువతో బతుకుతున్నవాళ్ళే!

ఎప్పుడయినా–

"ఏంవండీ! 'ఆయనేముంది? అంటరానివాళ్ళను అడ్డంపెట్టుకొని బతుకుతున్న మనిషి. పరహితార్థంపేరుతో స్వార్థం పెంచుకొంటున్న మనిషి. నోరులేని పిల్లవాళ్ళను అర్ధ కడుపులతో నోళ్ళు గొడుతున్న మనిషి' – అని రకరకాలుగా ఈ లోకం ఆడిపోసుకొనింది గదా? మరి అలాంటి మాటల్ని మీరెలా భరించగలిగారు?" అని అడిగితే –

"బాబూ! ఉప్పునో కారంపొడినో ఓ మనిషిమీద చల్లిచూడు. అతని ఒంటిమీద పుండ్లుంటేనే మంటబెడుతుంది. లేకుంటే రాలి పోతుంది. అంతే బాబూ! మనిషిలోకూడా తప్పులుంటేనే అనినమాట తగులుతుంది. లేకుంటే గాలిలో కలిసిపోతుంది. ఈ మాత్రం అవగాహన శక్తి లేకుండా ధ్యేయాన్ని వదిలిపెడితే అది పిచ్చితనం బాబూ! కాకుంటే చేత గానితనం!!" అని నవ్వేవారు.

జీవితాన్ని కాచి వడపోసిన పరమసత్యం!

అందుకే అప్పుడప్పుడు ఆయన వద్దకు వెళ్ళేవాడిని. ఆ ఉయ్యాల పీటమీద ఆయనకు ఎదురుగా కూర్చుంటే – ఇద్దరి బరువుతో ఆ చెట్టుకొమ్మ వంగుతూ లేస్తూ గాలివాటంగా కదులుతూ ఉంటే – అదొక చిత్రమైన అనుభూతి. ఆయన జీవితానుభవాల్ని వింటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆశించడంలో ఆనందం! ఆ ఉయ్యాల పీటమీద ఆయన ఎదురుగానే కాదు – ఆయన గుండెల్లో కూడా కాస్త చోటు సంపాదించుకొన్నాను. అందుకే ఆయన ఆప్యాయంగా దగ్గర చేర్చారు.

ఆలోచించండి-చెప్పండి

- *తల్లి ప్రేమ ఎలా ఉంటుంది? వివరించండి.*
- *వినయంతో నిలబడడం, వేషంలో సంస్కారం అంటే మీకేమర్థమైంది?*
- *అనిర్వచనీయమైన కృతజ్ఞతాభావాన్ని ఎవరిపట్ల, ఎందుకు ప్రదర్శిస్తారు?*
- *మీ బడి, మీ ఇల్లు ప్రశాంతతకు మారుపేరుగా ఉండాలంటే ఏం చేయాలి? ఏం చేయకూడదు?*
- *'ఆనందానుభూతిలో తేలియాడడమంటే ఏమిటి? దీన్ని ఏయే సందర్భాలలో వాడతారు?*
- *విద్యాలయంఆవరణ కనుల పండువుగా ఉందికదా? మీ కంటికి కనుల పండువుగా ఏమేమి గోచరిస్తాయి?*
- *పెద్దల మాటలు, జీవితానుభవాలు, అక్షరసత్యాలు ఎందుకో వివరించండి.*



ఆ రోజు కూడా వెళ్ళాను. నేను కనపించగానే ఆప్యాయంగా 'రా బాబూ! రా!' అని నవ్వుతూ ఆహ్వానించే మనిషి ఆ రోజు నా రాకను గమనించే స్థితిలో లేరు.

అతని ఎదురుగా నిలబడ్డాను!

ఆ ఆనందానుభూతి నుండి ఆయన తేరుకోలేదు. ఆ అనుభూతిని చెరిపేయడానికి నేను సాహసించలేదు. అలానే మరో నాలుగయిదు నిముషాలు దొర్లిపోయాయి. నాకు తెలియకనే నాలో ఓర్పు నశించిందనడానికి నిదర్శనంగా ఓ పొడిదగ్గు గొంతును మెల్లగా పరామర్శించింది.

ఆయన ఏకాగ్రతకు భంగం కలిగింది. అప్పుడు అరమోడ్పు కన్నులతో నన్ను చూస్తూ 'ఎప్పుడొచ్చావు బాబూ!' అని అడిగారు.

"ఆప్యాయత ఎలా ఉంటుంది?" అని అడిగితే అది ఆయన పిలుపులా ఉంటుందని చెప్పచ్చు.

"అదృష్టవంతుడికి కన్నీటితో అభిషేకం జరుగుతున్నప్పుడు!"

II.

నా మాట చెవిని పడడంతో ఆయన పెదవులు అందమయిన వంపుల్ని సంతరించుకొన్నాయి. ఆ వంపుల సందుల్లో చిరునవ్వు చిత్రంగా ఇరుక్కొనింది.

"అవును బాబూ! నిజంగా అతడు అదృష్టవంతుడే!

అనుభూతికి పరాకాష్ఠ తృప్తి. ఆ మాటంటుంటే అతని మొగం తృప్తితో వెలిగిపోతూ ఉంది. కుతూహలంతో అతన్ని చూస్తూ నిలబడ్డాను.

"కూర్చో బాబూ! కూర్చో. ఆ అదృష్టవంతుడి కథ చెప్పాలని ఎన్నోసార్లు అనుకొన్నానే కానీ ఎందుకో ఎప్పటికప్పుడు వాయిదాపడుతూ వచ్చింది – దేనికయినా సమయం సందర్భం కలిసి రావాలి. వచ్చింది గదా? వినుబాబూ!"

గతాన్ని నెమరేస్తూ భవిష్యత్ సందర్శనంతో అనుభూతిని పొందుతూ ఓ మహామౌని పుంగవుడిలా ఓ భంగిమలో కూర్చున్న ఆయన మళ్ళీ మామూలు స్థితికి వచ్చాడు. కథ చెప్పడానికి తలపండిన తాతయ్యను తలపింపచేస్తున్నారు.

పడమటి కొండ కొనకొమ్ము మీద బంతిలా వెలిగిపోతున్నాడు సూర్యుడు. మరి కాసేపటిలో కాలపురుషుడి కాలితన్నుతో కొండకావల పడి లోకాన్ని నిండు చీకటితో నింపేవాడు – చావుతెలివి అన్నట్లుగా మబ్బుతునకలకు చుట్టూ జరీఅంచు చుట్టాడు. ముగ్ధమనోహరంగా ఉంది పడమటిదిశ. అప్పుడప్పుడే అక్కడి చెట్లమీద చేరుతున్న పక్షులు అరుస్తున్నాయి. ప్రార్థనాలయంలోనేమో తంబుర శ్రుతి సవరింపు సన్నగా వినిపిస్తూ ఉంది. ఆయన చెబుతున్నాడు. నేను వింటున్నాను.

"బాబూ! ఇరవైయేండ్ల కిందటిమాట. ఎక్కడి నుండి వస్తున్నానో అక్కడికి ఎందుకు వెళ్ళానో ఇప్పుడయితే మతికి రావటం లేదుకానీ ఇంటికి వస్తున్నాను రైల్లో. దాదాపు రెండు రోజుల ప్రయాణం. ఎన్ని వసతులుండినా రైల్లో రెండు రోజుల ప్రయాణమంటే పొద్దుపోవడం కాస్త కష్టమే! పక్కనున్న ప్రయాణీకులు కలుపుగోలుతనం కలవాళ్ళయితే ఫరవాలేదు కానీ మూతిబిగించి కూర్చునే రకాలైతే మరీ ఇబ్బంది. ఇలాంటి ఇబ్బందుల్లో నుండి బయటపడాలంటే అలాంటి సమయాల్లో పుస్తకాలే మన నేస్తాలు. ఏమంటావ్?"



ఇందులో అనడానికేముంది? – ఆయన చెప్తున్నది అక్షరసత్యం. అందుకే అనడమెందుకని వినడానికే సిద్ధపడి బాగా సర్దుకొని కూర్చున్నాను.

ఆయన మతికేమి వచ్చిందో ఏమో తెలియదు. ఉన్నట్లుండి ఓ పిచ్చివాడిలా నవ్వుతున్నారు. నేను ఆశ్చర్యపడ్డాను! అనడం కంటే అదిరిపడ్డాననడం సమంజసం. ఆ స్థితి నుండి నేను తేరుకొనకముందే ఆయనమళ్ళీ గంభీరంగా మారిపోయారు. ఈ మార్పుకు తీర్పుకుదరక నేను నివ్వెరపడి చూస్తూ ఉండిపోయాను.

"నాకు తెలుసుబాబూ? నువ్వు ఆశ్చర్యపడుతున్నావని. కారణం ఏమీలేదు. మన తెలుగువాళ్ళు మనసులో మెదిలారు. అంతే!"

తెలుగువాళ్ళు మనసులో మెదలడానికి ఆయన నవ్వుకు ముడిపెట్టుకోలేక నా కనుబొమ ముడిపడింది. ఆయన గ్రహించారు.

"తెలుగువాళ్ళకు తెలుగంటే బోలెడంత అభిమానం బాబూ!" అంటూ మళ్ళీ కాసేపు విరగబడి నవ్వారు.

ఆయన నవ్వు ఆపుకొనే వరకు నేను నోరు తెరవకుండా ఆయన్నే చూస్తూ ఉండిపోయాను. ఆయన నవ్వు ఆపగానే–

ఎవరిభాషమీద వాళ్ళకు అభిమానం ఉంటుంది గదండీ! అందులో తప్పుకూడా లేదు.

"అదే బాబూ అదే? నేననేదీ అదే!!– ఆ తెలుగుమీది అభిమానం ఉంది చూశావూ? పక్కనున్న వాడి చేతిలో తెలుగు పుస్తకం కానీ లేదా ఓ వార్తపత్రిక కానీ కంటపడితే చాలు!– దాని దుంపదెగ! – ఆ అభిమానం మరీ ఎక్కువైపోతుంది."

తెలుగువాడిని నిర్దాక్షిణ్యంగా కొట్టిన దెబ్బ నాకూ తగిలింది. దెబ్బ తగులుతున్నా ముక్కీమూలగరాని దెబ్బ అది. అందుకే ఆయనతో కలిసి నేనూ కాసేపు హాయిగా నవ్వుకొన్నాను – ఏడవలేక నవ్వినట్లు!

"నేను కూడ తెలుగువాడినే కదా బాబూ! పక్కనున్న ప్రయాణీకుడి చేతిలో ఓ పత్రిక కంటపడేసరికి మొదట వంగి వంగి చూశాను – అది తెలుగు పత్రిక అవునో? కాదో? తెలుసుకొందామని! ఓ తెలుగు వారపత్రిక అని తెలిసేసరికి అతడు చదువుతున్న పేజీల్లోకి నిక్కినిక్కి చూశాను. నా అవస్థను గమనించిన ఆ పెద్దమనిషి అదోరకమయిన చూపును విసిరేసరికి పరధ్యానంగా ఎటో చూస్తున్నట్లు నటించాను. ఎంతసేపు? కాసేపు. అంతలోనే మళ్ళీ మొదటికే వచ్చింది పరిస్థితి. నాకు తెలియకనే నా చూపులు ఆ పత్రిక వైపు మళ్ళాయి. ఇదంతా గమనించిన ఆ పెద్దమనిషి – పాపం! మంచి మనిషిలా ఉన్నాడు. ఆ వారపత్రికను నా చేతికందించి అంతకంటే మంచిపని అప్పటికి లేనట్లు తన పడకమీద ముసుగుతన్ని పడుకొన్నాడు. నేను ఆ పత్రికను ఆప్యాయంగా అందుకొన్నాను – ఎంతయినా తెలుగువాణ్ణి కదా బాబూ!" అని చెట్టుమీద చేరిన పిట్టలు ఎగిరిపోయేటంత గట్టిగా నవ్వు అందుకొన్నారు.

అంతలో ఓ నడివయస్సు మనిషి అక్కడికి రావడంతో కథాగమనం కుంటుపడింది. ఓ లావుపాటి పుస్తకాన్ని రెండు చేతులతో పొదివి పట్టుకొని నిలబడి ఉన్నాడతడు. బహుశా అదేదయినా ఓ చిట్టాపుస్తకం కావచ్చు. ఆ వ్యక్తిని చూస్తూనే – 'రావయ్యా! రా? అంటూ పిలిచారాయన. అతడు చూపిన చోటంతా సంతకాలు పెడుతూ "పెట్టమన్న చోటంతా కండ్లు మూసుకొని సంతకాలు పెడుతున్నాను. అనాధలయిన పిల్లలు, వాళ్ళ అధోగతికి దారితీస్తే పుట్టగతులుండవు. ఇది మాత్రం మనసులో పెట్టుకోండి!" అని అంటూ పుస్తకాన్ని అతని చేతి కందించారు. ఆ చెవులకు ఈ మాటలకు బాగా పొంతనాలు కుదిరినట్లుంది. అతడు నోరు కదపలేదు కానీ వంగి నమస్కరించి వెళ్ళిపోయాడు.



"నా తెలుగుతనాన్ని గురించి చెబుతూ ఆగిపోయానుకద బాబూ! దేశంకాని దేశంలో వేళకానివేళ ఓ తెలుగు వారపత్రిక చేతికందడంతో గడిచిన ప్రయాణంకంటే గడవాల్సిన ప్రయాణం కాస్త హాయిగా ఉంటుందన్న నమ్మకం కుదిరింది. పేజీలు తిప్పుతూ ఓచోట ఆగిపోయాను!"

ఆ మాటంటూ ఆయన ఆగిపోయారు!

అలా చూసేసరికి నాలుగయిదు బారల దూరంలో నలుగురయిదుగురు పిల్లలు. గోళ్ళు గిల్లుకొంటూ నిలబడ్డారు. ఆయనవైపు దీనంగా చూస్తూన్నారు. ఆయన దృష్టి వాళ్ళమీద పడేసరికి అప్రయత్నంగా వాళ్ళ తలలు వాలిపోతున్నాయి. ఆ పిల్లవాళ్ళ భావన అర్థమయిందన్నట్లుగా ఆయన లేచి వాళ్ళదగ్గరికి వెళ్ళారు. వాళ్ళేదో చెప్పారు. ఆయన కూడా వాళ్ళకేదో చెబుతూ ఒకడి భుజంతట్టి మరొకడి బుగ్గలు గిల్లి ఇంకొకడి తలనిమిరాడు. అంతే! పరుగో పరుగు. ఆ పిల్లలు ఆనందానికే కాళ్ళు వచ్చినట్లుగా పరుగందుకొన్నారు. అలా వెడుతున్న ఆ పిల్లల్ని అలానే చూస్తూ నిలబడ్డారు కాసేపు. ఆ తరువాత తనలో తాను నవ్వుకొంటూ వచ్చి ఉయ్యాలపీట మీద కూర్చున్నారు.

"బాబూ! ఒకప్పటితో పోల్చిచూస్తే తెలుగులో చాలా పత్రికలు వస్తున్నాయి. ఇప్పుడు చాలా చాలా కథల్ని కూడా ప్రచురిస్తున్నాయి. ప్రచురించిన ప్రతికథకు ఓ బొమ్మను కూడా వేయిస్తున్నారు. అయితే బొమ్మను చూసి కథను చదవాలన్న కోరిక కలిగే తీరులో బొమ్మలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయి. ఏమంటావ్?"

తీరని పనుల్లో తల మునకలవుతున్న ఆ మనిషికి ఇంత పరీక్షచేసే తీరిక ఎలా దొరికింది? – అని ఆశ్చర్యపడుతూ 'నిజమేనండీ!' అన్నాను.

ఆలోచించండి-చెప్పండి

- *సమయం, సందర్భం కలిసిరావడమంటే ఏమిటి? కొన్ని ఉదాహరణలు తెల్పండి.*
- *"తెలుగువారికి తెలుగంటే బోలెడంత అభిమానం" దీని గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.*
- *'పిల్లలు ఎందుకోసం వచ్చి ఉంటారు? ఆయన వారితో ఏం మాట్లాడి ఉంటారు? ఊహించండి.*
- *కథల పుస్తకాలు లేదా ఇతర పుస్తకాల్లో బొమ్మలు ఎందుకు వేస్తారు?*
- *వృద్ధుడిని ఆకట్టుకొన్న బొమ్మ ఏమిటి? ఆ బొమ్మను చూసి ఎలాంటి అనుభూతిని పొందాడు?*
- *వారపత్రికలోని వృద్ధుడు చదివిన కథ ఏమై ఉంటుంది?*

"ఇంతకు మునుపే అన్నాను గద బాబూ! ఆ వార్తపత్రిక పేజీలు తిప్పుతూ ఓచోట ఆగిపోయానని! ఆ పత్రికలో అలాంటి బొమ్మ కంటపడింది. అందుకే ఆగిపోయాను" ఆ బొమ్మ కలిగించిన అనుభూతి మరలా మనసులో మెదిలిందేమో? ఆయన కాసేపు అరమోడ్పు కన్నులతో అలానే ఉండిపోయారు.

"అది ఓ రైలుపెట్టె. ఆ పెట్టెలో ఓ కుర్రవాడు అదుక్కొంటూన్నాడు. వాడు చేయి చాపి నిలబడిన తీరు... వాడిచూపుల్లో కొట్టొచ్చినట్లున్న జోరు... నన్ను ఆకట్టుకొన్నాయి. అందుకే ఆ కథను ఆసక్తిగా చదివాను."

ఆయన చూపుల్ని ఆకట్టుకొన్న ఆ బొమ్మ... ఆ బొమ్మ వెనక కథను విందామన్న కుతూహలాన్ని ఆయన పసిగట్టాడు.



III.

"నువ్వు చూస్తూనే ఉంటావు బాబూ రైళ్ళల్లో ప్రయాణం చేసేటప్పుడు పట్టుమని పదేండ్లు నిండని కుర్రవాళ్ళు. ఆ పెట్టెను ఈ కడనుండి ఆ కడదాకా తుడుస్తారు. ఆ తరువాత ఆ పెట్టెలోని ఒక్కొక్కరి ముందు నిలబడి చేయిచాస్తారు. తోచిన వాడు తోచినంత ఇస్తే దాంతో పూట గడుపుకొంటారు. ఆ పిల్లవాడు కూడా అలాంటి కోవకు చెందిన వాడే!" ఆ మాటంటుంటే ఆయన గొంతు తడబడింది – బహుశా ఈ దేశంలో ఇలాంటి నికృష్ట జీవితాలకు ఎందరు బలి అవుతున్నారో అని.

"ఆ పదేండ్ల బుడతడు ఆపెట్టెను ఈ చివరి నుండి ఆ చివరిదాకా తుడుస్తాడు. ఆపై ఒక్కొక్కరి ముందు చేయి చాస్తూ... ఇచ్చినవాడికి ఓ నమస్కారం పడేస్తూ... లేదన్న వాళ్ళవైపు దీనంగా చూస్తూ... ఓ వ్యక్తి ముందు నిలబడతాడు. నిలబడి మామూలుగా చేయిచాస్తాడు. ఆ వ్యక్తి వాణ్ణి దగ్గరికి పిలుస్తాడు. ఆ పిలుపులోని ఆప్యాయత ఎంతో ఆశను రేకెత్తిస్తుంది. కుర్రవాడు ఆ వ్యక్తి దగ్గరికి వెళతాడు. 'నీ పేరేమిటి బాబూ!' అని ఆరంభిస్తాడు. పైసలిచ్చే ప్రయత్నం చేయకుండా! ఆ కుర్రవాడు ఏమనుకొన్నాడో ఏమో? ఓ నిర్లక్ష్యమైన చూపు విసిరేసి 'నాపేరు దొరైరాజ్!" అని అంటూ చేతిలోని పైసల్ని అలా ఎగరేసుకొంటూ దర్జాగా వెళ్ళిపోతాడు. అలా వెళ్ళిపోతున్న కుర్రవాడి ధోరణికి మొదట ఆశ్చర్యపడి ఆ తరువాత ఆలోచనలో పడతాడా వ్యక్తి! ఇదీ కథ!!" అని తాను చదివిన కథను క్లుప్తంగా చెప్పి–

"బాబూ! నేనూ కూడా ఆలోచనలో పడ్డాను. నిజమేగదా? ఎందరో వాడి ఈడు పిల్లలు జేబులు కొడుతున్నారు. ప్రయాణాల్లో ఏమరుపాటుగా ఉంటే చేతికందిన సామాన్లు పట్టుకొని ఉడాయిస్తున్నారు. మరికొంతమంది నికృష్టులు కలవాళ్ళ చేతుల్లో తోలుబొమ్మలవుతున్నారు. ఇంకొంతమంది ఇండ్లముందు నిలబడి కడుపుమంటల్ని కంటిచూపుల్లో నిలుపుతున్నారు. అలాంటప్పుడు అంతో ఇంతో పనిచేసి పొట్ట గడుపుకోవాలనుకోవడం గొప్ప సంగతేకద బాబూ?– నిజంగా వాడు దొరైరాజే!"

బాబూ! నా ఆలోచనల్లో నేనుంటే సరిగ్గా ఇలాంటి సంఘటనే నా కంటపడింది. ఆ రైలుపెట్టెలో!!

ఈ కథ మీద కథను వినాలన్న కుతూహలం పెరిగింది నాలో!

"బాబూ! గిజిగాడిగూడు ఉంటుంది చూశావు గదూ? దాన్ని పీచుగా పీకి తలమీద అతికించినట్లుంది – బూడిదరంగు తిరిగిన వెంట్రుకల్ని చూస్తుంటే! నల్లని నూనెలో తడిసీ తడవక ముందే పిండి తొడుక్కొన్నట్లున్నాయి – అందీ అందని నిక్కరు చొక్కా! అసలు ఒంటిరంగు మంచిదయినా దుమ్ము మరకలుకట్టి నలుపు తెలుపు కలిసిన బూడిదరంగు తేలింది ఒళ్ళంతా పొడలు పొడలుగా! అయినా కళ్ళల్లో ఆశ చావలేదు. చేస్తున్న పనిలో శ్రద్ధ తగ్గలేదు. పట్టుమని పదేళ్ళయినా నిండని వాడివైపు చూశాను. ఆ తరువాత చూపు మరల్చుకొన్నాను. అయినా వాడు కళ్ళల్లోనే మెదులుతున్నాడు. చదివిన కథ మనస్సును తొలుస్తూ ఉంది. నాలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఆలోచనను ఆచరణలో పెట్టాలన్న తలంపుతో అలాగే పడుకొన్నాను. పడక మీద! కళ్ళు మూసుకొన్నట్లున్నానే కానీ చూడగలుగుతున్నాను. విప్పిన పత్రిక ఎదమీద విస్తరించి పడుకొని గుండె చప్పుడు వింటూ ఉంది!"

అంతలో 'టప్' మన్న శబ్దం వినిపించింది. మా ఇద్దరి చూపు అటు మళ్ళింది. ఓ పిట్ట రెట్టవిడిచింది. అది ఆ ఉయ్యాల పీటమీద ఇద్దరి మధ్యగా పడింది. పక్కన పడి ఉన్న ఓ పాత కాగితాన్ని అందుకొని నేనా రెట్టను తుడుస్తుంటే – అదోరకంగా నవ్వారాయన.



"బాబూ! పిట్ట రెట్టవేసింది కదా? ఎందుకు వెయ్యాలి? అంటే ఏమని చెప్పగలం? అది దాని స్వభావం. అంతే! మనుషుల స్వభావాలు కూడ అలానే ఉంటాయి. ప్రయత్నించి ఫలితాన్ని సాధించడంలో కొందరికి ఆనందం. అసలు ప్రయత్నాల ప్రమేయమే లేకుండా జీవితాన్ని కొనసాగించాలన్నది కొందరి కోరిక. నా జీవితమంతా ఇలాంటి ప్రయత్నాలతోనే కొనసాగుతూ ఉంది. అందుకే ఆ కుర్రవాడి బతుకు మీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను" – అంటూ కాసేపు ఆగారు.

ఆ తరువాత –

"ఆఁ! రైలు పెట్టెలో కుర్రవాడిని గురించి చెప్తూ, వచ్చాను కదూ! అవును. మరో నాలుగయిదు నిముషాల్లో నేను పడుకొని ఉన్న చోటువరకు ఊడ్చుకొంటూ వచ్చాడు. అక్కడ కాసేపు ఆగాడు. ఆగి నిద్రపోతున్నట్లున్న నన్ను – ఆ కాగితాన్ని మార్చి మార్చి చూశాడు. ఆ తరువాత నన్ను లేపడానికి మెల్లగా తట్టాడు.

నేనేమో అప్పటికి మహానిద్రపోతున్నట్లుగా ఆవిలిస్తూ లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకొన్నట్లుగా నటించి – ఆ తరువాత కండ్లు తెరచి చూశాను ఆ కుర్రవాణ్ణి. ఒదిగి నిలబడి వినయంగా వాడు నా చేతికందించాడా కాగితాన్ని! అది కాగితమే! కానీ – లోకం దృష్టిలో దాని విలువ అయిదు రూపాయలు!!

ఆ కుర్రవాణ్ణి పరీక్షించడానికి నా ప్రయత్నంగా నేను జార విడిచిన కాగితమది!

మారు మాట్లాడకుండా వాడి చేతిలో ఓపావలా కాసు పెట్టాను. మాటల్లోకి దింపితే కథలో కుర్రవాడి మాదిరి మాట్లాడకుండా వెళ్లిపోతాడేమో? అని సందేహం. ఆ కుర్రవాడు పావలా డబ్బులందుకొని రెండు చేతులు జోడించి నమస్కరించాడు. ఆ తరువాత తన పనిలో తాను లీనమయ్యాడు.

"బాబూ!" అప్యాయంగా పిలిచాను.

మాట చెవిని పడడంతో ఆ కుర్రవాడు లేచి నా ఎదురుగా నిలబడ్డాడు.

"నువ్విప్పుడు చిన్న పిల్లవాడివి. ఈ పని చేసి బతగ్గలుగుతావు. బాగానే ఉంది. అయితే ఇంకొన్నాళ్ళకు పెద్దవాడివవుతావు. అప్పుడీ పని చేయలేవు. చేసినా అందరూ నిన్ను తప్పుపడతారు. అప్పుడెలా బతుకుతావు బాబూ?"

నా మాటలు వాడికి అయోమయంగా వినిపించినట్లుంది. అమాయకంగా చూస్తూ నిలబడ్డాడు.

"అందుకే బాబూ! ఈ వయసులో చదువుకొంటే – ఆ వయసులో సంపాదించుకోవచ్చు."

"తటాలున రైలు పట్టాలు తప్పినా అంత ఆశ్చర్యపడేవాడు కాదేమో ఆ కుర్రవాడు, అంతకు మించిన ఆశ్చర్యాన్ని పులుముకొన్నాడు మొగంలో 'నన్నెవ్వరీలోకంలో చదివించే వాళ్ళనట్టుగా. అది గ్రహించాను. అందుకే."

"నాతో వచ్చేస్తావా బాబూ"

తల వంచాడు!

"ఆ కుర్రవాడే ఈ కుర్రవాడు బాబూ!"

అర్ధ గంటకు మునుపు ఆయన పాదాలకు నమస్కరించిన కుర్రవాడు కనుల ముందు కదిలి ఇద్దరిమధ్య సంబంధం మనస్సులోమెదిలి – అటూ ఇటూ కదలలేకుండా కూర్చున్నాను.



"ఏముంది బాబూ? పదిమందిలో వాడూ ఒక్కడయ్యాడు. అయితే పట్టుదలతో చదువుకొన్నాడు. కృషికి తగిన ఫలితం. మంచి ఉద్యోగమే వచ్చింది. ఆ తరువాత ఓ ఇంటివాడిని చేశాను. ఉద్యోగంతో ఊరువదిలిపోతూ "బాబయ్యా! నేనెప్పుడు పుట్టానో నాకు తెలియదు. ఎవరికి పుట్టానో కూడా ఎరగను. ఎందుకు పుట్టానో ఆలోచించవలసిన అవసరం లేకపోయింది. అయితే – నేను పుట్టిన రోజు మాత్రం ఈ విద్యానగరంలో అడుగుపెట్టిన రోజు. ఆ రోజు నేనీ జీవితంలో మరవలేను. అందుకే ఆ రోజున మీ రెక్కడున్నా నే నెక్కడున్నా తమ పాదాలకు ప్రణమిల్లే అవకాశాన్ని మన అదృష్టంగా భావిస్తాను. ఈ జీవిత కాలమంతా అలాంటి అదృష్టం లభించే లాగున ఆశీర్వదించండి." అంటూ పాదాలమీద పడ్డాడు.

ఆయన గొంతు గాద్గదికమై పోయింది. మాటలు పూడుకపోతున్నాయి. గుండెల్లోని ఆనందం కళ్ళల్లో కరిగి ముత్యాలుగా మారి రాలుతున్నాయి!

"సరిగ్గా ఈ రోజేబాబూ! – బాబు విద్యానగరంలో అడుగుపెట్టిన రోజు. అదే బాబు పుట్టిన రోజు!"

ఆ కనుకొలకుల్లో కన్నీళ్ళు నిలిచాయి. ఎదుకని అడిగితే ఏమని చెప్పేది?

"బాబూ! ఇది వేపచెట్టు. సహజంగా 'వేపచెట్టు' అని చెవినిపడడంతో 'చేదు' అన్నభావన మనసులో మెదులుతుంది. అయితే ఆ వేప చెట్టును ఆశ్రయిస్తే – నీడనిస్తుంది. దినమూ ఓ కాయ నమిలి మింగగలిగితే దీర్ఘవ్యాధుల్నే నయం చేస్తుంది. పంటిపుల్లగా నోటిజబ్బుల్ని పోగొడుతుంది. అలాగే బాబూ! 'అడక్క తినేవాళ్ళు అని' పట్టించుకోకుంటే ఆ బతుక్కే అంకితమైపోయేది. అనామకులైపోతారు. ఒక విధంగా చెప్పాలంటే వాళ్ళు కొడిగట్టిన దీపాలు. కాసంత సానుభూతి, ఓపికను రంగరించి కొడినలా తట్టేసి తగినంత చమురుపోసి వత్తిని ఎగదోస్తే – అవి గోరంత దీపాలే కావచ్చు. ఏనాటికో ఒకనాటికి అవి కొండంత వెలుగునిస్తాయి!"

ఒకే ఒకవ్యక్తి ఆలోచన ఆచరణగా మారితే ఒక మహాసంస్థ ఎన్నికొడిగట్టిన దీపాలకు ఆశ్రయమిచ్చింది? – ఒకవ్యక్తి బాధ్యతల్ని స్వీకరించే స్థితికి సమాజం ఎదిగేది ఎప్పుడో? సమాధానం దొరకని ప్రశ్న నన్ను సతమతం చేస్తుంటే – చేదు నిజాన్ని తియ్యగా పలికిస్తుంటే ఆ మహామనీషికి మనస్సుకు చేతులొస్తే నమస్కరించింది!

ఆలోచించండి-చెప్పండి

- *రైలు పెట్టెలో తుడుస్తున్న బాలుడిని చూసి, ఇలాంటి నిక్కృష్ట జీవితాలకు ఎంతమంది బలి అవుతున్నారని వృద్ధుడు భావించడం సరైందేనా? ఎందుకు?*
- *"ప్రయత్నం చేసి ఫలితాలు సాధిస్తే ఆనందం కల్గుతుంది" దీంతో మీరు ఏకీభవిస్తారా?*
- *అందరు పిల్లలూ తప్పనిసరిగా బడికి వెళ్ళి చదువుకోవాలి కదా! మరిఅలా ఎందుకు జరగడంలేదు?*
- *గుండెల్లోని ఆనందం కరిగి ముత్యాల్లా కన్నీటి రూపంలో రావడం" అంటే మీకేమి అర్థమైంది? ఇది ఏ ఏ సందర్భాలలో జరుగుతుంది? మీ అనుభవాలు తెల్పండి.*
- *"ఒక వ్యక్తి బాధ్యతల్ని స్వీకరించే స్థితికి సమాజం ఎప్పుడు చేరుతుందో?" అనే ఆవేదన సరైందేనా? ఎందుకు?*



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. "గోరంత దీపాలు" అనే శీర్షిక ఈ పాఠానికి తగిన విధంగా ఉందా? ఎందుకు? సకారణంగా చర్చించండి.

2. పాఠం చదవండి. 'వేపచెట్టు' గురించి వివరించిన, వర్ణించిన వాక్యాలు ఏమేమి ఉన్నాయి? వాటిని గుర్తించి చదవండి.

3. పాఠంలోని కింది పేరాలు చదవండి. ఆ పేరాలలో వేటి గురించి వివరించారో తెల్పండి, ఆ పేరాల్లోని వివరణ / వర్ణనకు సంబంధించిన కీలక పదాలను రాయండి.

పేరా	దేని గురించి వివరణ / వర్ణన ఉంది	వివరణ / వర్ణనకు చెందిన కీలక పదాలు
ఆయన నిమీలిత .... మూగబోయారు. దాదాపు రెండు మూడు ..... పరవశంతో పాడుతున్నారు. ఆ నగరంలో అతడు ..... తేలిపోతుంటారు. రాత్రి ఏడు గంటల ..... కమల పండువుగా ఉంటుంది. పడమటి కొండ కోన కొమ్మ .... వింటున్నాను.		

4. కింది వాక్యాలు చదవండి. ఎవరు, ఎవరితో, ఏ సందర్భంలో అన్నారు?

అ) అవును బాబూ! నిజంగా అతడు అదృష్టవంతుడే!

ఆ) "పెట్టమన్నచోటంతా కండ్లు మూసుకొని సంతకాలు పెడుతున్నాను. అనాథలయిన పిల్లలు, వాళ్ళ అధోగతికి దారితీస్తే పుట్టగతులుండవు" ఇది మాత్రం మనసులో పెట్టుకోండి!"

ఇ) "అదృష్టవంతుడికి కన్నీటితో అభిషేకం జరుగుతున్నప్పుడు!"

ఈ) మీరెక్కడున్నా, నేనక్కడున్నా తమ పాదాలకు ప్రణమిల్లే అవకాశాన్ని మహా అదృష్టంగా భావిస్తాను.

ఉ) అవి గోరంత దీపాలేకావచ్చు. ఏనాటికీ ఒక నాటికి అవి కొండంత వెలుగునిస్తాయి.



5. పేరా చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.

బతకడానికి ఉద్యోగం వెతుక్కుంటారు కొందరు. జీవితానికి అర్థం వెతుక్కుంటారు మరికొందరు .... లక్ష్మీకాంతం రెండో కోవకు చెందుతారు. ఒక బిడ్డ కన్నీరు తుడవడమే భాగ్యం. ఒక బిడ్డకు తల్లి కావడం ఇంకా భాగ్యం. అలాంటిది లక్ష్మీకాంతం అరవై ఎనిమిది మంది అనాథలకు అమ్మలా మారారు. వారికి కంటి పాప అయ్యారు. పైపైన చేస్తే ఉద్యోగం అవుతుంది. హృదయం నుంచి చేస్తే మానవత్వం అవుతుంది. లక్ష్మీకాంతం మానవీయ మూర్తి. వీధి బాలలుగా ముద్రపడిన అనాథలకు విశాఖ వాకిట నేడొక అమృతహస్తం దొరికింది. కన్నతల్లి ఒడి దక్కినట్టయింది. వీరి జీవితాలకు అండగా నేనుంటానంటూ పోడూరి లక్ష్మీకాంతం ముందుకు వచ్చింది. మాటలు కాదు – గత పదేళ్ళుగా ఆప్యాయతానురాగాలను చేతల్లో చూపుతోంది. అరవై ఎనిమిది మంది స్ట్రీట్ చిల్డ్రన్‌కు అమ్మగా అవతరించింది. కన్న బిడ్డల కంటే వీధిబాలలనే ఎక్కువగా చూసుకుంది.

ప్రశ్నలు

అ) పై పేరా యొక్క 'ఉద్దేశం' రాయండి.

ఆ) పై పేరా దేని గురించి తెలియజేస్తుంది?

ఇ) పై పేరాలోని కీలక పదాలను ఏరి రాయండి.

ఈ) 'అమృత హస్తం' అనే పదానికి అర్థమేమిటి?

ఉ) 'స్ట్రీట్ చిల్డ్రన్' అంటే ఎవరు?

6. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) రచయిత ఈ కథానిక ప్రారంభంలో వేటి గురించి, ఏమని వర్ణించాడు?

ఆ) వృద్ధుడి వద్దకు వచ్చిన 'కుర్రాడు ప్రవర్తించిన తీరు ఎలా ఉంది? రచయిత అతడి ప్రవర్తనను ఏ ఏ వాక్యాలతో వివరించాడు?

ఇ) విద్యానగరం ఒక విద్యాలయం కదా! దాని ఆవరణ, వాతావరణం ఎలా ఉంది?

ఈ) వృద్ధుడు చేస్తున్న సేవా కార్యక్రమం గురించి లోకం ఏమనుకునేది? దానికి వృద్ధుడి ప్రతిస్పందన ఎలా ఉంది?

ఉ) వృద్ధుడు వారపత్రికలో చదివిన కథ ఏమిటి?

ఉ) రైలు పెట్టెలో ఊడుస్తున్న బాలుడి గురించి వృద్ధుడు ఏం చేశాడు?

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి 4, 5, వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) "గోరంత దీపం" కథానిక ద్వారా మీరు గ్రహించిన ముఖ్యమైన ఐదు విషయాలు రాయండి.

ఆ) "ఆ కుర్రవాడి బతుకుమీద కూడా ఓ ప్రయత్నం చేయాలని సంకల్పించాను." అన్న వృద్ధుడు ఏం ప్రయత్నం చేశాడు? దాని ఫలితం ఎలా ఉంది?



ఇ) "బాబూ! ఈ వయస్సులో చదువుకొంటే, ఆ వయస్సులో సంపాదించుకోవచ్చు" ఈ వాక్యం గురించి మీ అభిప్రాయాల్ని రాయండి.

ఈ) ఒంటరిగా ఉన్నప్పుడు పుస్తకాలే మన నేస్తాలు" అనే వాక్యంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?

2. కింది ప్రశ్నలకు ఆలోచించి 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) కథానికలోని వృద్ధుని పాత్ర స్వభావాన్ని, గొప్పదనాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) వృద్ధుడు, ప్రయోజకుడైన యువకుని మధ్య ఉన్న సంబంధం ఎలాంటిది? వారి మధ్య ఉన్న సంబంధాన్ని, అనురాగాన్ని మీ సొంత మాటల్లో వివరించండి.

3. కింది అంశాల గురించి సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) 'విద్యాలయం' ఆవరణ ఎలా ఉందో పాఠంలో వర్ణించినా విధానం చదివారు కదా! దీని ఆధారంగా మీరు మీ పాఠశాల గురించి లేదా ఒక మంచి క్షేత్రం గురించి వర్ణించి రాయండి.

ఆ) పాఠంలో దాదాపు రెండు మూడు ..... పరవశంతో పాడుతున్నారు. పేరా చదవండి. దీనికి సంబంధించిన చిత్రం గీయండి. రంగులు వేయండి. కవిత రాయండి.

ఆ) వృద్ధుడి రైలు ప్రయాణంలోని వార పత్రిక పఠనం విషయం ఆధారంగా వృద్ధుడు, పెద్దమనిషి మధ్య హాస్య సంభాషణలు రాయండి.

III. భాషాంశాలు

పదజాలం

1. ఈ కింద ఇచ్చిన రెండేసి పదాలు కలిపి సొంత వాక్యాలు తయారుచేయండి.

అ) వినయం – విధేయత

ఆ) రాజు – మకుటం

ఇ) ప్రదేశం – ప్రశాంతత

ఈ) గుడిసె – దీపం

ఉ) ప్రయాణం – సౌకర్యం

2. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.

ఉదా॥ సంజవెలుగు లో తటాకంలోని నీరు కొత్తదనం సంతరించుకుంది.

సంజవెలుగు = సంధ్యా సమయంలో వెలువడే కాంతి.

అ) నా పుట్టిన రోజున మా నాన్నగారి ఆశీర్వాదం తీసుకున్నాను.

ఆ) రాజు ప్రకృతి అందాల్ని తదేకంగా చూస్తూ నిలబడ్డాడు.

ఇ) శివ పుస్తకాలతో కాలక్షేపం చేస్తూ ఉంటాడు.



ఈ) రాణి ముఖం నిండా పౌడరు పులుము కుంది.

ఉ) లత పాఠాన్ని చక్కగా ఆకళింపు చేసుకుంది.

3. ఈ కింది వాటిని చదవండి. వాటికి సంబంధించిన పదాన్ని రాయండి.

అ) హాస్య సంఘటన చూసినప్పుడు _____ వస్తుంది.

ఆ) చదువు వల్ల _____ వస్తుంది.

ఇ) బాధ వల్ల _____ వస్తుంది.

ఈ) శ్రమ వల్ల _____ వస్తుంది.

ఉ) వ్యాయామం వల్ల _____ వస్తుంది.

4. అనాథలను చేరదీసే సంస్థలను అనాథ శరణాలయాలు అంటారు కదా! ఇలాంటివే మరికొన్ని ఉన్నాయి. కింద ఇచ్చిన సమాచారం ఆధారంగా వాటిని రాయండి.

అ) పక్షులను రక్షించే సంస్థ : _____

ఆ) జంతువులను రక్షించే సంస్థ : _____

ఇ) వృద్ధులను చేరదీసే సంస్థ : _____

ఈ) వితంతువులను ఆదరించే సంస్థ : _____

ఉ) మనోవైకల్యం గల వారికి చేయూతనిచ్చే సంస్థ : _____

ఊ) కుష్ఠురోగుల పునరావాసకేంద్రం : _____

IV. భాషా కార్యకలాపాలు

- మీ పాఠశాల గ్రంథాలయంలోని ఏదైనా కథల పుస్తకం నుండి గాని లేదా ఏదైనా మ్యాగజైను నుండి గాని సామాజిక సేవ, మానవసంబంధాలు, గురుశిష్యసంబంధం మొదలగు విషయాలకు సంబంధించిన మంచి కథను చదివి ఎంపిక చేయండి. దాన్ని రాసి ప్రదర్శించండి. అది మీకు ఎందుకు నచ్చిందో, దాంట్లోని గొప్పతనమేమిటో నివేదిక రాయండి.

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది పదాల్లోని పుంప్వాదేశ సంధి, టుగాగమ సంధి, అత్వ సంధి, ద్విరుక్తటకార సంధుల పదాలను గుర్తించి విడదీసి సూత్రాలను రాయండి.

సరసంపుమాట, కట్టెదుట, చింతాకు, తూగుటుయ్యేల, నట్టనడవి,
ముద్దుటుంగరము, మధురంపుకావ్యం, పల్లెటూరు, రామయ్య



పరిచయం

1. కింది ఉదాహరణలను పరిశీలించండి.

అ) తపః + శక్తి → తపస్ + శక్తి → తపశ్శక్తి

నిః + శంక → నిస్ + శంక → నిశ్శంక

మనః + శాంతి → మనస్ + శాంతి → మనశ్శాంతి

పై ఉదాహరణలలో పూర్వపదాలలో చివర ఉన్న "విసర్గ" సంధి కార్యంలో 'స'గా తీసుకుంటున్నాం. (విసర్గను 'స' కార రూపంగా తీసుకోవచ్చు) అలా తీసుకున్న 'స' కారానికి 'శ' పరమైతున్నది. ఇలా పరమైనప్పుడు 'శ' కారమే వస్తుంది. అంటే ద్విత్వంగా మారుతుంది.

ఆ) నిస్ + చింత → నిశ్చింత

సత్ + ఛాత్రుడు → సచ్ఛాత్రుడు

శరత్ + చంద్రికలు → శరచ్చంద్రికలు

జగత్ + జనని → జగజ్జనని

శార్ఙ్గ + జయః → శారిఙ్గ + యః

పై పదాల్లో 'స' కార 'త' వర్గాలు పూర్వపదాంతంగా ఉన్నాయి. 'శ' కార, 'చ' వర్గలు (త, న) పరమైనాయి. అలా ఐనప్పుడు 'శ' కార 'చ' వర్గాలు వచ్చాయి.

అంటే – స్ + చి → శ్చి; త్ + శా → చ్ఛా; త్ + చ → చ్చ;

త్ + జ → జ్జ; న్ + జ → ఞ్జ

ఇలా 'స' కార 'త' వర్గా (త థ ద ధ న) లకు 'శ' కార, 'చ' వర్గ (చ ఛ జ ఝ ఞ)లు వస్తే అది శ్చుత్వ సంధి అవుతుంది.

సూత్రం: 'స' కార 'త' వర్గాలకు 'శ' కార 'చ' వర్గాలు పరమైతే 'శ' కార 'చ' వర్గాలు వస్తాయి.



మానవసేవే మాధవసేవ!

చెప్పే పెదవులకన్నా,

చేసే చేతులు మిన్న





13. భిక్ష

– శ్రీనాథుడు



గ్రంథం – భాగం : కాశీఖండం

సప్తమాశ్వాసము నుండి (వ్యాసుడు కాశిమీద కోపించుట)

(134, 137, 142, 143, 154, 155, 158, 159, 162, 164, 166, 182, 183, 184, 185)

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

పరమ పవిత్రము, పరమేశ్వరునికి ప్రీపాత్రము అయిన కాశిలో వేదవ్యాసుడు తన పదివేల మంది శిష్యులతో నివసిస్తున్నాడు. వేదవిభజన చేసినవాడు, పంచమవేదంగా పేరుగొన్న మహాభారతాన్ని రచించినవాడు, బ్రహ్మజ్ఞానియైన వ్యాసుడు పరమ శివభక్తుడు, బ్రహ్మజ్ఞానసంపన్నుడు. శివధర్మాన్ని పాటిస్తూ బ్రాహ్మీముహూర్తంలోనే నిద్రలేచి, ప్రాతర్విధులన్నీ పూర్తిగావించుకొని, మధ్యాహ్నముదాకా శివపురాణ పఠనం చేసి, శిష్యులతోకూడా కాశీనగరంలో భిక్షాటనం చేస్తాడు. శిష్యులు, తాను వేర్వేరుగా భిక్షకు వెళ్ళి, తెచ్చిన ఆహారాన్ని రాశిపోసి, తెచ్చినదానిలో సగం అతిథి అభ్యాగతులకు సమర్పించి, మిగిలినది వాళ్ళుభుజిస్తూంటారు. ఒకరోజు కాశీ విశ్వనాథుడికి వ్యాసుని పరీక్షించాలన్న సంకల్పం కలిగింది.....



ప్రక్రియ

అభినందన వ్యాసం :

పాఠ్యపరిచయం : భిక్ష అనే పాఠ్యాంశం శ్రీనాథుని 'కాశీఖండము' నుండి సేకరించడమైనది.

విద్యార్థులకు సూచనలు

- పాఠం ముందున్న పేరా చదవండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాలకింద గీతగీయండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరున్న "పదాలు-అర్థాలు" పట్టికలో వెతకండి. లేదా నిఘంటువు చూసి తెల్సుకోండి.

కవి పరిచయం



ఆంధ్రవాఙ్మయంలో కవిత్రయం తర్వాత అంతటి ప్రతిభావంతుడు అనిపించుకున్న కవి శ్రీనాథుడు. మారయ, భీమాంబ వీరి తల్లిదండ్రులు. సుమారు 1380-1470 మధ్యకాలానికి చెందినవాడు. రెడ్డిరాజుల కొలువులో ఆస్థానకవిగా ఉన్నాడు. పెదకోమటి వేమారెడ్డి కాలంలో విద్యాధికారిగా పనిచేశాడు. రెడ్డిరాజుల కొలువులో దాదాపు ఇరవై సంవత్సరాలు రాజాశ్రయం పొందాడు. ప్రౌఢదేవరాయల ఆస్థానంలో 'డిండిముడు' అనే గొప్ప పండితునితో వాగ్వాదానికిదిగి, అతణ్ణి ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించాడు. కనకాభిషేకం చేయించుకున్నాడు. 'కవిసార్వభౌమ' అనేది శ్రీనాథుని బిరుదు.

మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్ర, శృంగారనైషధం, భీమఖండం, కాశీఖండం, హరవిలాసం, ధనంజయవిజయం, క్రీడాభిరామం, శివరాత్రిమహాత్మ్యం, పల్నాటి వీరచరిత్ర, నందనందన చరిత్రలు శ్రీనాథుని రచనలు. శ్రీనాథుని చమత్కారానికి, లోకానుశీలనకి, రసికతకి జీవితవిధానానికి అద్దం పట్టే చాటువులు చాలా ఉన్నాయి.

ఉద్ధండ లీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచితబంధం, సూక్తి వైచిత్రి శ్రీనాథుని కవితాలక్షణాలు, శ్రీనాథుని కవితావైశిష్ట్యానికి అతని సీసపద్య రచనా వైభవం ఒక నిదర్శనం. శ్రీనాథుని సీసపద్యాలు మార్గదర్శకాలై గొప్ప అనుభూతిని కలిగిస్తాయి.



శ్రీనాథుడు అవసానదశలో నిరాశ్రయుడై పన్నులు చెల్లించలేక శిక్షలు అనుభవించినప్పుడు కూడా 'బేలతనం' లేదు. సహజమైన రాజసం దుఃఖంలో కూడా తగ్గలేదు.

"దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ

నరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి" అని అనగల

ఆత్మస్థైర్యం కలవాడు. రసికుడు, శివభక్తుడు, లోకజ్ఞుడు అయిన శ్రీనాథమహాకవి తెలుగు కవుల్లో ఉన్నతపీఠం అలంకరించి ప్రస్తుతింపబడినాడు.

ఈనాడు 'భిక్షం' అనే మాట కేవలం 'అడుక్కుతినడం' అనే నీచార్థానికి పరిమితమైంది కాని, ఒకప్పుడు 'భిక్ష' అనేది పరమపవిత్రమైన వ్రతం. శివుడు భిక్షేశ్వరుడుగా ప్రసిద్ధి, గురువులు శిష్యులకు, 'జ్ఞానభిక్ష' పెట్టేవాళ్ళు బుద్ధుడు భిక్షావృత్తితోనే జీవనం సాగించేవాడు; బౌద్ధులందరికీ అదే జీవన సూత్రంగా మారింది. గురుకులంలో చదువుకునే రాజకుమారులైనా భిక్షాటనంతో విద్యార్థిజీవనం గడిపేవారు. భిక్ష పెట్టేవాళ్ళుకూడా అది మహాపుణ్యకార్యంగా భావించి, తమ ఇంటికి వచ్చిన వాళ్ళకు 'అతిథిదేవోభవ!' అని నమస్కరించి, పూజించి, భిక్షసమర్పించేవారు. అటువంటి భిక్షావ్రతంతో జీవించిన వేదవ్యాసమహర్షి కాశీనగరంలో పొందిన ఒక అనుభవమే ఈ 'భిక్ష' పాఠం.

I

తే॥గీ॥ నెట్టుకొని కాయ బీఱెండ పట్టపగలు
తాను శిష్యులు నిల్లిల్లు దప్పకుండఁ
గాశికా విప్రగృహ వాటికల నొనర్చు
నఖిల విద్యాగురుండు భిక్షాటనంబు. 1

తే॥గీ॥ వండుచున్నారమను నొక్క వనజనేత్ర
తిరిగి రమ్మను నొక్క లేఁదీఁగె బోఁడి
విదేవకార్యంబు నేఁడనుఁ దెఱవయొర్తు
ద్వాఃకవాటంబుఁ దెఱవదు వనిత యొకతె 2



సీ॥ ముంగిట గోమయంబున గోముఖము దీర్చి
కడలు నాల్గుగ మ్రుగ్గుకఱ్ఱవెట్టి,
యతిథినచ్చోనిల్పి యర్ఘ్య పాద్యములిచ్చి
పుష్పగంధంబులఁ బూజసేసి,
ప్రక్షాళితంబైన పసిఁడి చట్టువమున
నన్నంబుమీఁద నెయ్యభిఘరించి,
ఫలపాయసాపూప బహుపదార్థములతో
భక్తివిశ్వాస తాత్పర్యగరిమఁ

తే॥గీ॥ బెట్టుదురు మాధుకరభిక్ష భిక్షుకులకుఁ
గంకణంబులతో సూడిగములు రాయఁ
గమ్రకరముల బ్రాహ్మణాంగనలు కాశి
నన్నపూర్ణ భవాని కట్టనుఁగుఁ జెలులు 3

కం॥ ఆ పరమ పురంధ్రులయం
దే పుణ్యాంగనయు భిక్షయిడదయ్యెఁ గటా!
రేపాడి మేలుకని యే
నేపాపాత్ముని ముఖంబు నీక్షించితినో? 4

తే॥గీ॥ ఉపవసింతుముగాక నేఁడుడిగి మడిఁగి
యస్తమించుచు నున్నవాఁ డహిమ భానుఁ
డెల్లి పారణకైన లేదెట్లు మనకు?
మాధుకరభిక్ష బ్రాహ్మణ మందిరమల 5

వ॥ అని యారాత్రి గడపి మఱునాఁడు మధ్యాహ్నకాలంబున శిష్యులుందాను
వేఱువేఱ వేదవ్యాసుండు విప్రభవన వాటికల భిక్షాటనంబొనర్పంబోయి,
తొలునాఁటియట్ల ముక్కంటిమాయ నేమచ్చెకంటియు వంటకంబు
పెట్టకున్నఁ గటకటంబడి భిక్షాపాత్రంబు నట్టనడువీథింబగులవైచి కోపావేశంబున – 6

తే॥గీ॥ ధనములేకుండెదరు మూఁడు తరములందు
మూఁడు తరములఁ జెడుఁగాక మోక్షలక్ష్మి
విద్యయును మూఁడు తరముల వెడలవలయుఁ
బంచ జనులకుఁ గాశికాపట్టణమున 7

వ॥ అని పారాశర్యుండు క్షుత్పిపాసా పరవశుండై శపియింపం దలంచు
ననవరంబున నొక్క విప్రభవనంబు వాఁకిటం బార్వతి ప్రాకృత వేషంబున 8



శా॥	ఆకంఠంబుగ నిప్డు మాధుకర భిక్షాన్నంబు భక్షింపఁపగా	
	లేకున్నంగడు నంగలార్చెదవు మేలే? లెస్స! శాంతుండవే!	
	నీ కంటెన్ మతిహీనులే కటకటా! నీవార ముష్టింపచుల్	
	శాకాహారులుఁ గందభోజులు, శిలోంఛప్రక్రముల్ తాపసుల్!	9
తే॥గీ॥	ఓ మునీశ్వర! వినవయ్య యున్నయూరుఁ	
	గన్నతల్లియు నొక్క రూపన్న నీతి?	
	యటు విశేషించి శివుని యర్ధాంగలక్ష్మి	
	కాశి; యివ్వీటి మీఁద నాగ్రహము దగునె?	10
వ॥	ఇట్టికాశికానగరంబు మీద భిక్షలేకుండుట కారణంబుగా నీయంత	
	వాడు కటకటంబడి శపియింపందలంచునే? విశేషించి యాఁకొన్న	
	వాఁడవు గావున నీ యవసరంబున నిన్ను హెచ్చు గుందాడుట మము	
	వోఁటి గృహిణులకు మెచ్చుగాదు. మా యింటికిం గుడువరమ్ము! కుడిచి	
	కూర్చున్న పిమ్మటం గొన్నిమాటలు నీతో నాడఁగలవు. అనిన	
	నమ్మహాసాధ్వింగని, పారాశర్యుండిట్టులనియె –	11
తే॥గీ॥	అస్తమింపగఁ జేసినాఁ డహిమకరుడు	
	శిష్యులేఁగాక యయుతంబు చిగురుబోఁడి	
	వ్రతము తప్పి భుజింపంగ వలనుగాదు	
	నేఁడు నిన్నటి మఱునాఁడు నిక్కువంబు	12
చ॥	అనవుడు నల్లనవ్వి కమలాననయిట్లను, లెస్సగాక, యో	
	మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యనరమ్ము విశ్వనా	
	థునికృప పేర్మి నెందరతిథుల్ చనుదెంచినఁ గామధేనువుం	
	బని గొనునట్లు పెట్టుదు నపారములైన యభీప్సితాన్నముల్	13
వ॥	అనిననట్లకాక మహాప్రసాదంబని వేదవ్యాసుండు శిష్యులంగూర్చుకొని	
	భాగీరథకిం జని యుపస్పర్శంబాచరించి యేతెంచిన –	14
తే॥గీ॥	గొడుగు పాగల గిలకలు గులకరింప	
	నిందు బింబాస్య యెదురుగా నేగు దెంచి	
	ఛాత్ర సహితంబుగాఁ బరాశరతనూజు	
	బంతిసాగించె భుక్తిశాలాంతరమున	15



భావాలు :

1. విద్యాగురుడైన వ్యాసమహర్షి శిష్యులతో కూడి పట్టపగలు, పెరిగిన అధికమైన ఎండలో కాశీనగరంలోని బ్రాహ్మణవీధిలో భిక్షకోసం ఇల్లైనా తప్పకుండా (లేదా) ఇల్లునైనా తప్పించకుండా ఇల్లిల్లూ తిరుగసాగాడు.
2. ఒక ఇల్లాలు 'వండుతున్నాం' అంటున్నది; మరొక స్త్రీ 'మరల రండి' అంటున్నది; ఇంకొకావిడ ఈరోజు వ్రతం (దేవకార్యం) అని చెబుతున్నది; వేరొకావిడైతే అసలు తలుపులే తెరవడం లేదు.
3. కాశీనగరంలోని ఇల్లాండ్రు అన్నపూర్ణభవానికి ప్రియమైన చెలులుగా పేరుగాంచినవారు. వాళ్ళు భిక్షార్థమై వచ్చిన వాళ్ళను సాక్షాత్తు శివుడిగా భావించి, అపురూపంగా ఆదరిస్తారు. వాకిట్లో ఆవుపేడతో చక్కగా అలికి, నాలుగంచులూ కలిసేటట్లు ముగ్గుపెట్టి, దాని మధ్యలో వచ్చిన అతిథిని నిలబెట్టి, కాళ్ళకూ, చేతులకూ నీళ్ళిచ్చి, పూవులతో, గంధంతో వారిని అర్చించి, శుభ్రంగా కడిగిన బంగారుపళ్ళెంలో అన్నం మీద నెయ్యి చిలకరించి, పండ్లు, పరమాన్నం, పిండివంటలు చేర్చి, భక్తి విశ్వాసాలు ఉట్టిపడుతుండగా భిక్ష సమర్పిస్తారు. ('అతిథిదేవోభవ!' అనే భారతీయ సంప్రదాయాన్ని ఈ పద్యంలో వర్ణించాడు కవి)
4. 'అటువంటి పుణ్యస్త్రీలున్న ఈనేలలో ఒక్కరైనా భిక్ష సమర్పిండం లేదంటే ఆశ్చర్యంగా ఉన్నది. ఈరోజు ఉదయమే లేచి, ఏ పాపిష్టివాని ముఖం చూశానో' అనుకున్నాడు వ్యాసుడు (దుర్మార్గుల మొహం చూస్తే దుష్పరిణామాలు కల్గుతాయన్నది విశ్వాసం. అందుకే ఉదయం లేచినప్పుడు గానీ, పాడ్యమి చంద్రోదయాన్ని గమనించినప్పుడు గానీ ఇష్టమైన వాళ్ళ ముఖం చూడటం; కార్యార్థమై వెళ్తున్నప్పుడు కులస్త్రీలు ఎదురు రావడం అనే సంప్రదాయాలు ఏర్పడ్డాయి. కాలాంతరంలో ఇవి విశ్వసనీయతను కోల్పోతూండటం గమనార్హం)
5. సరే, ఇక భిక్షాటనం మాని ఈ రోజుకు ఉపవాసాన్నే చేద్దాం. వేడికిరణాల సూర్యుడు అస్తమిస్తున్నాడు. రేపైనా మనకు ఈ బ్రాహ్మణ వాటికలో ఉపవాసాంత భోజనానికి సరిపడ భిక్ష దొరకక పోదు.
6. అని వ్యాసుడు శిష్యులతో ఆ రాత్రి మఠంలో గడిపి, మరునాడు యథావిధిగా మధ్యాహ్న సమయానికి శిష్యులు, తాను వేరువేరుగా విప్రవాటికల్లో భిక్షాటనం చేయసాగారు. కాని మొదటి రోజులాగానే విశ్వనాథుని మాయవల్ల ఏ ఇల్లాలు భిక్షపెట్టలేదు. దాంతో బాధపడి కోపంతో భిక్షాపాత్రను నట్టనడి వీధిలో ముక్కలు ముక్కలయ్యేటట్లు విసిరి ఆవేశంతో–
7. 'ఈ కాశీ పట్టణంలో నివసించే మనుషులకు మూడు తరాల దాకా ధనం, విద్య, మోక్షం లేకుండుగాక!'
8. అని ఆకలిదప్పులచే బాధపడుతున్న వ్యాసుడు శపించబోయిన సమయంలో ఒక బ్రాహ్మణమందిరపు వాకిట పార్వతీదేవి సామాన్య స్త్రీ వేషంలో
9. ఇప్పుడు గొంతుదాకా తినడానికి భిక్షదొరకలేదని ఇంతగా చిందులువేస్తున్నావు కదా! ఇది నీకు మంచిదా? బాగున్నది. నిజంగా నీవు శాంత స్వభావుడవా? పిడికెడు వరిగింజలతో కాలం వెళ్ళబుచ్చేవారు, శాకాహారంతో, దుంపలతో సరిపెట్టుకునేవాళ్ళు, దుంపలుతిని బ్రతికేవాళ్ళు, రోళ్ళవద్ద బియ్యం ఏరుకొని జీవనం సాగించే మునులు నీకంటె తెలివితక్కువ వాళ్ళా?
10. 'ఉన్నఊరు కన్నతల్లితో సమానం' అనే నీతి నీకు తెలియదా? అంతకంటె విశేషించి శివుని అర్ధాంగలక్ష్మియైన ఈ కాశీనగరి మీద నీవింత కోపం చూపించడం తగునా? అని మందలించింది. పెద్దముత్తైదువ రూపంలో ఉన్న పార్వతీదేవి.



11. 'ఇటువంటి కాశీనగరం మీద కేవలం భిక్షదొరకలేదని నీలాంటి ఉత్తముడు బాధపడి శపించాలనుకోవడమా? చాలా ఆకలితోనున్నవాడవు కాబట్టి ఈ సమయంలో నిన్ను ఎక్కువగా బాధపెట్టడం మావంటి గృహిణులకు శ్రేష్ఠంకాదు. మాయింటికి భోజనానికిరా! తిని కూర్చున్న తర్వాత నీతో కొన్ని సంగతులు మాట్లాడవలసి ఉన్నది.' అనగా ఈ మహాసాధ్విని చూసి, వ్యాసుడిట్లా అన్నాడు –

12. తల్లీ! (పల్లవ గాత్రీ!) సూర్యుడస్తమిస్తున్నాడు. నేను గాక పదివేలమంది శిష్యులున్నారు. అందరితో కలిసి భుజించే నా వ్రతం విడిచిపెట్టి మీ ఇంట నేనొక్కడినే భుజించలేను. ఈరోజు నిన్నటికి మరునాడేకదా! (అంటే నిన్నటిలాగే ఈరోజు కూడా ఉపవాసం తప్పదని ధ్వని)

13. అని వేదవ్యాసుడు పల్కగా కొంచెం నవ్వి పద్మముఖియైన ఆ ఇల్లాలు 'సరేలే! మునీంద్రా! విశ్వనాథుని దయవల్ల ఎంతమంది అతిథులు వచ్చినా కామధేనువును కల్గియున్నట్లు కోరిన పదార్థాలన్నీ అనంతంగా ఏర్పాటు చేయగలను నేను. నీ శిష్యగణాన్ని తీసుకొని వెంటనే రా!' అన్నది.

14. అనగా, 'సరే! మహాప్రసాదం' అని, వేదవ్యాసుడు శిష్యులను తీసుకొని గంగానదికి వెళ్ళి, స్నాన ఆచమనాదులు పూర్తి గావించుకొని రాగా–

15. గొడుగు పావుకోళ్ళ గిలకలు మోగుతుండగా చంద్రముఖియైన ఆ ఇల్లాలు వారికి ఎదురేగి ఆహ్వానించింది. శిష్యుల సహితంగా వ్యాసుడు భోజనశాలలో కూర్చున్నాడు. అప్పుడామె పంక్తికి వడ్డన సాగించింది.



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. కింది పద్యం చదవండి. ఇది ఎవరిగురించి చెబుతోందో చెప్పండి. స్థూలార్థం రాయండి.

సీ॥ త్రిశరణ స్నానంబుఁ దీర్చు భాగీరథి
శివధర్ములు చెప్పు శిష్యతతికి
నుదరపోషణము చేయును మాధుకరవృత్తి
లింగార్చనంబుఁ గల్పించు నియతి
ముక్తిమంటప మధ్యమునఁ బురాణము సెప్పుఁ
బంచాక్షరంబు జపంబుసేయు
భూతి సర్వాంగీణముగ సముద్ధూళించు
ధరియించు రుద్రాక్షదామకములు

తే॥గీ॥ శ్రుతులు నాల్గు నేర్పఱిచిన సూక్ష్మబుద్ధి
బ్రహ్మ సంవేది యాదిపురాణకర్త,
భారతాఖ్యాన సంహిత ప్రథమసుకవి,
గంధవతిపట్టి ♦యానందకాననమున

(♦ కాశీ నగరంలోని వనానన్ని 'ఆనందకాననం' అంటారు)

2. పాఠంలో 'ఏపాపాత్ముని ముఖం చూశానో' అన్న లోకోక్తి ఉన్నది కదా! అది ఈ కాలానికి కూడా వర్తిస్తుందా? తరగతిలో చర్చించండి.

3. పాఠం చదివి, ముఖ్యాంశాలు రాయండి.

4. 'ఆకంఠంబుగ.....శిలోంఛప్రక్రముల్ తాపసుల్!' పద్యానికి ప్రతిపదార్థం రాయండి.

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. వ్యాసరూప సమాధానాలు రాయండి.

అ) పాఠంలోని కథను సంక్షిప్తంగా రాయండి.

ఆ) కోపం కారణంగా వ్యాసుడు కాశీనగరాన్నే శపించాలనుకున్నాడు కదా! 'కోపం – మనిషి విచక్షణను నశింపజేస్తుంది.' అనే అంశం మీద 20 వాక్యాలకుమించని వ్యాసం రాయండి.



2. లఘు సమాధానాలు రాయండి.

అ) వ్యాసుని పాత్ర స్వభావాన్ని వివరించండి.

ఆ) వ్యాసునితో సామాన్యస్త్రీరూపంలో ఉన్నపార్వతి అన్నమాటలేవి?

ఇ) శ్రీనాథకవిని గురించి వివరించండి.

ఈ) 'నేడు నిన్నటికి మఱునాఁడు నిక్కువంబు' ఈ మాటలు ఎవరు ఎవరితో ఏసందర్భంలో అన్నారు? వీటి అంతరార్థమేమిటి?

1. 'కోపం తగ్గించుకోవడం మంచిది!' అనే అంశాన్ని బోధిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

2. భిక్ష, రక్ష, పరీక్ష, సమీక్ష, వివక్ష..... వంటి పదాలతో ఒక చక్కని భావాన్ని ప్రకటించే కవిత రాయండి.

లేదా

పాఠంలోని వివరణ ఆధారంగా వ్యాసుని ఊహాచిత్రం గీయండి.

లేదా

మీకు నచ్చిన అంశం మీద ఒక చిన్న పద్యం రాయండి.

III. భాషాంశాలు

1. కింది వాక్యాల్లో గీతగీచిన పదాలకు పర్యాయపదాలు రాయండి.

అ) ద్వాఃకవాటంబు దెఱవదు <u>వనిత</u> యొకతె.

ఆ) ప్రక్షాళితంబైన <u>పసిఁడి</u> చట్టువము.

ఇ) <u>పారాశర్యుండు</u> క్షుత్పిపాసా పరవశుండై శపియింపఁదలంచెను.

ఈ) ఇవ్వీటిమీద <u>నాగ్రహము</u> తగునె?

ఈ) అస్తమింపగ జేసినాడు <u>అహిమకరుడు.</u>

2. కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

అ) ద్వాఃకవాటము	ఆ) వీక్షించు	ఇ) అంగన
ఈ) మచ్చికంటి	ఉ) కుందాడుట	ఊ) భుక్తిశాల

3. కింది వాక్యాలలోని నానార్థాలను గుర్తించి రాయండి.

అ) వీడు ఏవీడు వాడోగాని దుష్కార్యములను వీడుచున్నాడు.

ఆ) దేశభాషలందు తెలుగులెస్సయని రాయలు లెస్సగా బలికెను.

ఇ) గురుని మాటలు విన్న ఇంద్రుడు కర్దుని గురుడైన సూర్యుని గలిసి గురుయోజన చేయసాగినాడు.



4. కింది ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను ఎంపిక చేయండి.

అ) విద్య ( )

క) విదియ చ) విజ్జ ట) విద్దె త) విధ్య

ఆ) భిక్షము ( )

క) బత్తెము చ) బచ్చ ట) బిచ్చ త) బిచ్చము

ఇ) యాత్ర ( )

క) యతర చ) జాతర ట) జైత్ర త) యతనము

ఈ) మత్స్యము ( )

క) మచ్ఛి చ) మత్తియము ట) మచ్చెము త) మత్తము

ఉ) రత్నము ( )

క) రతనము చ) రచ్చ ట) రచ్చము త) రత్తము

ఊ) పంక్తి ( )

క) పంతులు చ) పత్తి ట) బంతి త) పంకు

IV. భాషా కార్యకలాపాలు

♦ ----------

V. వ్యాకరణాంశాలు

పునశ్చరణ

1. కింది పాదాల్లోని సంధులను గుర్తించి సంధి సూత్రాలను రాయండి.

అ) పుణ్యాంగనయు భిక్షయిడదయ్యెఁ గటా!

ఆ) కాశి; యివ్వీటి మీద నాగ్రహము దగునె.

ఇ) ఓ మునీశ్వర! వినవయ్య యున్నయూరు.

2. కింది లక్ష్యాల్లో ఏయే ఛందాలున్నాయో గుర్తించి సమన్వయం చేయండి.

అ) మునివర! నీవు శిష్యగణముంగొని చయ్యనరమ్ము.

ఆ) య్యాదిమ శక్తి : సంయమివరా! ఇటురమ్మని పిల్చె హస్త సం.

ఇ) ముక్కొత్తు చెక్కొత్తుము కన్నుబులుము.

పరిచయం

1. కింది లక్ష్యాలను చదవండి.

అ) శివాజి కళ్యాణి దుర్గాన్ని సాధించాడు.
వీరులకు సాధ్యము కానిది లేదు కదా!



ఆ) గొప్ప వారితో పాటు సామాన్యులు గౌరవింపబడుదురు.
పూవులతోపాటు దారాన్ని గూడా సిగనెక్కిస్తారు.

ఈ రెండు లక్ష్యాల్లో ఒక విషయాన్ని మరో విషయంతో సమర్థిస్తున్నాం కదూ!

మొదటి లక్ష్యంలో

శివాజి కళ్యాణి దుర్గాన్ని సాధించడం – విశేషవిషయం.

వీరులకు సాధ్యం కానిది లేదు కదా! – సామాన్య విషయం.

అంటే విశేష విషయాన్ని సామాన్య విషయంతో సమర్థన చేయటం జరిగింది.

ఇక రెండవ లక్ష్యంలో

గొప్పవారితోపాటు సామాన్యులు గౌరవించబడడం – సామాన్య విషయం.

పూవులతోపాటు దారం సిగనెక్కటం – విశేష విషయం.

అంటే దీంట్లో సామాన్య విషయాన్ని విశేష విషయంతో సమర్థన చేయటం జరిగింది.

ఇలా విశేష సామాన్య విషయాలను పరస్పరం సమర్థించి చెప్పినట్లైతే అట్టి అలంకారాన్ని అర్థాంతరన్యాసాలంకారం అంటారు.

లక్షణం: విశేష విషయాన్ని సామన్యా విషయంతోగాని సామన్యా విషయాన్ని విశేష విషయంతోగాని సమర్థించి చెప్పడం.

కింది లక్ష్యాలకు సమన్వయం రాయండి.

అ) హనుమంతుడు సముద్రమును లంఘించెను.
మహాత్ములకు సాధ్యం కానిది లేదు కదా!

ఆ) 'మేఘుడంబుదికి పోయి జలంబు" తెచ్చి ఇస్తాడు.
లోకోపకర్తులకిది సహజగుణము.

ప్రాజెక్టుపని

శ్రీనాథుడు సీసపద్యరచనకు ప్రసిద్ధి. శ్రీనాథుడు రచించిన ఏవైనా 5 పద్యాలు (వేర్వేరు గ్రంధాల నుండి) సేకరించండి. వాటిని రాయండి. తరగతిలో పాడి వినిపించండి. గోడ పత్రికలో ప్రదర్శించండి.









చిత్రగ్రీవం

– ధనగోపాల్ ముఖర్జీ

చదవండి – ఆలోచించి చెప్పండి.

రక్తాలు ఓడుతోన్న మా రాస్సెల్‌దార్ గబగబా ఏదోరాసి ఆ కాగితాన్ని నాకాలికి కట్టారు. కట్టి నన్ను పంజరంలోంచి వదలిపెట్టారు. అతని కళ్లల్లో కనిపించిన ఆందోళనను బట్టి వాళ్ళంతా తీవ్రమైన ఆపదలో ఉన్నారనీ, ముఖ్యస్థావరం నుంచి సత్వర సహాయం ఆశిస్తున్నారనీ అర్థమయింది. వెంటనే కాలికి కట్టిన సమాచార పత్రంతో సహా గాలిలోకి ఎగిరాను. ఎలాగైనాసరే ఫోండ్ వేచిఉండే ప్రధాన స్థావరం దగ్గరకు చేరుకొని తీరాలన్న తపన. 'చేరాలి', 'చేరి తీరాలి' అని మనసులో పదేపదే అనుకొన్నాను. పలికిన ప్రతీసారీ ఆ మాటలు దివ్యమంత్రాల్లా నామనసులో బాగా నాటుకొనిపోయి నాకు నూతన జవసత్వాలను అందించసాగాయి. అప్పటికే బాగాపైకి చేరుకొన్నాను కాబట్టి ఒక్కసారి నాలుగుదిక్కులా కలయజూసి పడమటదిశను గుర్తుపట్టి ఆ దిశగా ఎగరనారంభించాను. వంకర టింకర మార్గాల్లో పిచ్చిగా ఎగిరి చిట్టచివరకు గమ్యం చేరి ఫోండ్ చేతిమీద వాలాను. రస్సెల్‌దార్ అందించిన ఆ సమాచారాన్ని ఫోండ్ గబగబా చదివి సంతోషంతో దుక్కిటెద్దులా రంకె పెట్టారు. ప్రేమగా నా తల నిమిరారు.

ప్రశ్నలు:

1. పై పేరాలోని మాటలు ఎవరు చెబుతున్నారు?
2. సమాచారాన్ని ఎవరి వద్ద నుండి ఎవరికి చేర్చారు?
3. సమాచారాన్ని చేరవేయడానికి ఏ పక్షిని ఉపయోగించి ఉంటారు? ఎందుకు?
4. సమాచారాన్ని చేరవేసిన పక్షిలోని గొప్ప లక్షణాలు ఏవి?

పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

మన దేశంలో వృక్ష సంపద, పక్షి సంపద అపారం. ఐతే వీటి గురించి తెలియజేసే మంచి పుస్తకాలు అరుదుగా ఉన్నాయి. పూర్వకాలంలో సమాచారాన్ని చేరవేయడానికి పావురాలను ఉపయోగించేవారు. పావురాల పుట్టుక,వాటి జీవన వివరాలకు సంబంధించిన కథనాలతో కూడిన పుస్తకం చిత్రగ్రీవం. కలకత్తాలో ఓ పెంపుడు పావురం, దాన్ని పెంచే ఓ బాలుడూ, వాళ్ల కథను మనసుకు హత్తుకుపోయేలా చెప్పిన పుస్తకం చిత్రగ్రీవం. పావురాల జీవనానికి సంబంధించిన అతి సూక్ష్మ వివరాలు ఆ పుస్తకంలో ఉన్నాయి. చిత్రగ్రీవం పిల్లలకోసం రాసిన పుస్తకమే ఐనా దీనికి ప్రకృతి పరిశీలకులను కూడా అలరించే శక్తి ఉంది.

ప్రక్రియ

'చిత్రగ్రీవం' అనేది ఒక పెంపుడు పావురం పేరు. ప్రస్తుత పాఠ్యభాగం ధనగోపాల్ ముఖర్జీ రాసిన "చిత్రగ్రీవం" – ఓ పావురం కథ. అనే పుస్తకంలో నుండి స్వీకరించారు. దీన్ని నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా సంస్థ ప్రచురించింది. ఇది అనువాద కథ. పక్షులకు సంబంధించిన శాస్త్రీయ విజ్ఞానాన్ని అందిస్తుంది. దీన్ని తెలుగులోకి అనువదించినవారు దాసరి అమరేంద్ర.

విద్యార్థులకు సూచనలు

- పాఠానికి ముందు పేరాలో రాసి ఉన్న అంశాన్ని చదవండి ఏం గ్రహించారో చెప్పండి.
- పాఠానికి సంబంధించిన చిత్రాలను చూడండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.
- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- అర్థం కాని వాక్యాలకు అర్థాలను పాఠ్యపుస్తకం చివర ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికను లేదా నిఘంటువునుగాని చూసి తెల్సుకోండి.

కవి పరిచయం



విశిష్ట రచయిత ధనగోపాల్ ముఖర్జీ పేరు అతి కొద్ది మంది భారతీయులే విని ఉంటారు. ఆయన రాసిన విలక్షణ పుస్తకం 'చిత్రగ్రీవం'. ఈ పుస్తకం 1928లో 'న్యూ బెరీ మెడల్'ను గెలుచుకుంది. బాలసాహిత్యంలో విశేషకృషి చేసినవారికి 'అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్' వారు ఇచ్చే విశిష్ట పురస్కారం "న్యూబెరీమెడల్". ఈ బహుమతి గెల్చుకొన్ని ఏకైక భారతీయ రచయిత "ధనగోపాల్ ముఖర్జీ".

ధనగోపాల్ ముఖర్జీ 1890లో కలకత్తా దగ్గర పుట్టారు. వాళ్ల కుటుంబంవారు కలకత్తాకు దగ్గరలో ఉన్న ఓ మందిరంలో పూజారులుగా ఉండేవారు. భారతదేశంలో తన బాల్యం గడిపిన ధనగోపాల్ ముఖర్జీ పందొమ్మిదేళ్ల వయస్సులో అమెరికా వెళ్ళారు. కాలిఫోర్నియా, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల్లో చదువుకొన్నారు. అమెరికన్ యువతిని వివాహమాడి తనజీవితమంతా అక్కడే గడిపారు. రచనలు చేయడం, ఉపన్యాసాలు ఇవ్వడం ఇవే ఆయన ముఖ్య వ్యాపకాలు. జంతువులకు సంబంధించిన తొమ్మిది పిల్లల పుస్తకాలు రాసారు. వీటిలో 1922లో రాసిన "కరిదిఎలిఫెంట్", 1928లో రాసిన "ఫోండ్ ది హంటర్", '1929లో రాసిన "హరిది జంగిల్ బాక్" పుస్తకాలు చాలా ప్రాచుర్యం పొందాయి.

విదేశంలో ఉన్నా ఏనాడూ ఆయన భారతదేశాన్నీ, భారతీయమూలాలను మర్చిపోలేదు. భారతదేశం గురించి, ఇక్కడి కథల గురించి కూడా రచనలు చేపట్టారు.



పక్షి ప్రపంచంలో రెండు దృశ్యాలు అతిమనోహరమైనవి. గుడ్డుబద్దలు కొట్టి తల్లిపక్షి పిల్లపక్షిని ఈ ప్రపంచపు వెలుగు వెల్లువలోకి తీసుకొనిరావడం అందులో మొదటిది. అలా వచ్చిన పిల్లపక్షి నోటికి ఆహారం అందిస్తూ తల్లి పక్షి పెంపకం కొనసాగించడం రెండవది. చిత్రగ్రీవం పెంపకం ఎంతో అనురాగంతో సాగింది. ఇంతకూ 'చిత్రగ్రీవం' ఎవరు? దాని పెంపకం ఎలా సాగింది? అది ఎలా ఎగరడం నేర్చుకొంది? పాఠం చదివి తెలుసుకోండి.

I. పుట్టక



పది లక్షల జనాభా ఉందని మనం చెప్పుకునే కోల్‌కత్తా మహానగరంలో కనీసం ఇరవై లక్షల పావురాలు ఉంటాయి. ప్రతీ మూడో కుర్రాడి దగ్గర కనీసం ఒక డజను వార్తలు మోసే పావురాలు, గిరిక్‌ల పావురాలూ, పిగిలి పిట్టలూ, బంతి పావురాలూ ఉండటం కద్దు. పావురాలను మచ్చిక చెయ్యడం అన్న కళ వేలాది సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతోంది. ఆ కళ పుణ్యమా అని పక్షులను ప్రేమించే వారిని అలరించే పిగిలిపిట్ట, బంతి పావురం అన్న రెండు విశిష్టమైన పావురాల జాతులను భారతదేశం ప్రపంచానికి అందించింది. ఎన్నో శతాబ్దాలనుంచీ రాజులూ, యువరాజులూ, రాణులూ, యువరాణులూ తమతమ చలువరాతి మందిరాలలోనూ సామాన్యులూ, నిరుపేదలూ తమ తమ ఇళ్ళూ, పూరిళ్ళలోనూ–పావురాల మీద ప్రేమ, ఆప్యాయతలను కురిపిస్తూనే ఉన్నారు. శ్రద్ధా ఆసక్తులను చూపిస్తూనే ఉన్నారు. గొప్పవాళ్ళ పూదోటలూ, ఫౌంటెన్లూ గానివ్వండి, సామాన్యుల పూలమడులూ, పళ్ళ చెట్లూ గానివ్వండి – అవన్నీ రకరకాల రంగు రంగుల పావురాలతోనూ, నీలికళ్ళతో కువకువలాడే గువ్వలతోనూ నిండి ఉండడం కద్దు.

ఈ నాటికీ విదేశీయులెవరైనా మన మహానగరాలకు వచ్చినట్టయితే వాళ్ళకు ఉల్లాసకరమైన చల్లనిగాలిలో గిరికీలు కొట్టే పావురాల బృందాలు కనిపిస్తాయి. ఆ పెంపుడు పావురాలకు తమ తమ డాబా ఇళ్ళ మీద నిలబడి తెల్లజెండాలు ఊపుతూ సంకేతాలు అందించే అసంఖ్యాకమైన కుర్రాళ్ళు కనబడతారు. ఆ నీలాకాశంలో పావురాల గుంపులు పెను మేఘాలలాగా సాగిపోవడం కనిపిస్తుంది. మొదట అవి చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి తమ తమ యజమానుల ఇళ్ళ మీద ఓ ఇరవై నిమిషాలపాటు చెక్కర్లు కొడతాయి. ఆ తర్వాత అవి క్రమక్రమంగా పైపైకి సాగిపోతాయి. వివిధ ప్రాంతాల నుంచి వెలువడిన వేరు వేరు బృందాలన్నీ మెల్లగా కలగలిసిపోతాయి. ఒక బృహత్తర సమూహంగా రూపొందుతాయి. కనుచూపుకు అందనంత ఎత్తుకు ఎగిసిపోతాయి. అలా కలగలిసి, ఎగసి గంటల తరబడి ఎగిరాక తిరిగి అన్నీ విడివిడిగా తమ తమ యజమానుల ఇళ్ళకు చేరుకొంటాయి. నగరంలోని ఇళ్ళు గులాబీ, పసుపూ, తెలుపూ ఊదాల్లాంటి రకరకాల రంగులలో ఉన్నా, స్థూలంగా వాటి పైకప్పులు ఒకే పరిమాణంలో, ఒకే ఆకృతిలో ఉంటాయి. అయినా మరి ఆ వేలాది పావురాలు ఎన్నెన్నో దూరాలు కలిసిమెలిసి ఎగిరినాక, తిరిగి కచ్చితంగా తమ తమ ఇళ్ళకూ, గూళ్ళకూ ఎలా చేరుకోగలుగుతున్నాయీ అన్నది ఆశ్చర్యం కలిగించే విషయమే. నిజానికి పావురాలకు అద్భుతమైన దిశాపరిజ్ఞానం ఉంది. ఏనుగులూ, పావురాలకన్నా తమ తమ యజమానులపట్ల ఎక్కువ విశ్వాసం ప్రదర్శించే ప్రాణులను నేనింతవరకూ చూడలేదు. ఈ రెండిటితోనూ నాకు సన్నిహిత పరిచయం ఉంది. వనసీమలోని గజరాజులుగానివ్వండి. నగర సీమలలోని

పావురాలు గానివ్వండి, అవి తమ యజమానులంటే ప్రాణం పెడతాయి. రోజంతా ఎక్కడెక్కడ తిరిగినా, ఏ గగన సీమల్లో ఎగిరినా చివరకి అవి తమకున్న అద్భుతమైన అంతఃప్రేరణాబలంతో అవి తమ మిత్రుడూ, సహచరుడూ అయిన మానవుడి పంచకు చేరుకుంటాయి.

ఆలోచించండి-చెప్పండి

- *కలకత్తా నగరంలోని పిల్లలు పక్షుల ప్రేమికులని ఎలా చెప్పగలరు?*
- *మీ ప్రాంతంలో ఏ ఏ పక్షులు ఎక్కువగా ఉంటాయి? వాటి కోసం మీరేం చేస్తున్నారు?*
- *పావురాల గురించి ఆశ్చర్యం కల్గించే విషయాన్ని తెలుసుకున్నారుకదా! అట్లే మిగతా పక్షుల్లో ఆశ్చర్యం కలిగించే విషయాలు ఏమున్నాయి?*
- *విశ్వాసం ప్రదర్శించడం అంటే ఏమిటి?*
- *అంతఃప్రేరణాబలం అంటే ఏమిటి? దీనివల్ల మనం ఏం చేయగలం?*

నా పెంపెడు ఏనుగు పేరు 'కరి', నాకో పెంపుడు పావురం కూడా ఉంది. దాని పేరు 'చిత్రగ్రీవం' 'చిత్ర' అంటే ఉల్లాసభరితమైన రంగులతో నిండిన – అని అర్థం. 'గ్రీవం' అంటే కంఠం. నా పావురం మెడ చిత్ర విచిత్ర వర్ణభరితం అన్న మాట. అప్పుడప్పుడు అందుకే మా పావురాన్ని 'హరివిల్లు మెడగాడు' అని ముద్దుగా పిలుస్తూ ఉంటాను.

నిజానికి చిత్రగ్రీవం పుట్టుకతోనే హరివిల్లు మెడతో ఉట్టిపడలేదు. గుడ్డు లోంచి బయటపడ్డప్పుడు ఏ రంగులూ లేవు. మెల్లగా రోజులూ, వారాలూ గడిచేకొద్దీ దానికి ఈకలు పెరిగాయి. అయినా మూడోనెల వచ్చేదాకా దాని వన్నెచిన్నెల గురించిన ఆచూకీ యేమాకు తెలిసిరాలేదు. కానీ ఒకసారి నిండుగా ఈకలు పెరిగాక, ఆ ఈకలు అతిసుందరమైన రంగులతో నిండాక, – ఇహ అందంలో దానికి సాటిరాగల పావురం మా ఊళ్ళో లేదని స్పష్టమయింది. మా ఊళ్ళో దాదాపు నలభైవేల పెంపుడు పావురాలు ఉన్నాయన్న సంగతి మనం మర్చిపోకూడదు. అన్ని వేల పావురాలలోనూ అతి సుందరమైనదన్న మాట మా చిత్రగ్రీవం.

II



చిత్రగ్రీవం కథను నేను మొట్టమొదట్నించీ మొదలెడతాను. ముందు దాని తల్లిదండ్రుల గురించి చెప్పుకొందాం. దాని తండ్రిపక్షి ఓ గిరికీల మొనగాడు. తల్లిపక్షి ఓ వార్తల పావురం. ఆ రోజుల్లో అది అతి సుందరమైన పావురం. కులీన వంశానికి చెందిన పావురం. ఆ రెండు విశిష్టమైన పావురాలూ జతగట్టాయి. గుడ్లు పెట్టాయి. వాటికి పుట్టిన చిత్రగ్రీవం అందువల్లనే తర్వాతిరోజుల్లో యుద్ధరంగాల్లోనూ శాంతి సమయాల్లోనూ అమోఘంగా పనిచెయ్యగల వార్తాహరియైన పావురంగా రూపొందింది. తల్లి పక్షి నుండి తెలివితేటలు సంపాదించుకుంది. తండ్రిపక్షి నుండి వేగం, చురుకుదనం, సాహసం సంతరించుకుంది. అలా సమకూర్చుకున్న శక్తియుక్తుల పుణ్యమా అని అది ఎన్నో సార్లు శత్రువుల దాడి నుండి ఆఖరిక్షణంలో – ఆ దాడి చేస్తోన్న డేగల తలలమీద నుంచే గిరికీలు కొట్టి – తప్పించుకోగలిగింది. ఆ ముచ్చట్లు సమయమూ సందర్భమూ సరికూడినప్పుడు మరోసారి చెప్పుకొందాం.

ఇంకా గుడ్డులో ఉన్నప్పుడే చిత్రగ్రీవం ఓ ప్రమాదం లోంచి తృటిలో ఎలా తప్పించుకుందో ముందు చెపుతాను. ఆ రోజును నేను ఎప్పటికీ మరచిపోలేను. తల్లి పావురం పెట్టిన రెండుగుడ్లలో ఒకదాన్ని పొరపాటున జారవిడిచి పగలగొట్టిన రోజది. ఆ తెలివిమాలిన పనికి నేను ఈనాటికీ సిగ్గుపడుతూ ఉంటాను. బాధపడుతూ ఉంటాను. నేను పగలగొట్టిన ఆ రెండో గుడ్డులో ప్రపంచంలోకెల్లా అతి విశిష్టమైన పావురం ఉండేదేమో ఎవరికి తెలుసు! ఆ దుర్ఘటన ఇలా జరిగింది.



మాది నాలుగంతస్థుల మేడ. ఆ మేడ మీది పావురాల గూళ్ళు ఉండేవి. తల్లిపావురం గుడ్లను పొదుగుతోన్న గూటిని నేను ఓ రోజు శుభ్రం చేద్దామని వెళ్ళాను. తల్లిపిట్టను మృదువుగా లేపి తీసి ఓ పక్కన ఉంచాను. తర్వాత ఒక్కో గుడ్డునే జాగ్రత్తగా తీసి పక్కగూట్లో ఉంచాను. ఆ ప్రక్క గూటిలో గట్టిపాటి చెక్క తప్ప అడుగున పీచూ ఆకు అలముల్లాంటి మెత్తటి పదార్థాలు లేవు. గుడ్లను పక్కగూటిలో ఉంచాక మొదటిగూటిలోని చెత్తా చెదారాన్ని తీసిపారేసే పనిలో పడ్డాను. ఆ పని ముగిసాక ఒక గుడ్డును తీసుకొచ్చి దాని యథాస్థానంలో ఉంచాను. రెండో గుడ్డు మీద మెల్లగా ధృఢంగా నే చేతిని ఉంచిన క్షణంలో జరిగిందా ప్రమాదం. నేనా గుడ్ల మార్పిడిలో ఉన్నప్పుడు – ఇంటి పైకప్పును తుఫాను ఎగురగొట్టినట్టుగా నా మొహాన్ని ఏదో బలంగా తాకింది. తీరా చూస్తే అది తండ్రిపావురం. రెక్కలతో బలంగా నా మొహాన్ని మోదుతోంది. ఇంకా దారుణం ఏమంటే నా ముక్కు మీద తన గోళ్ళను కూడా దిగవేసిందది. ఆ నొప్పి ఆ గగుర్పాటూ – వాటి పుణ్యమా అని రెండో గుడ్డును నాకు తెలియకుండానే ఎప్పుడు వదిలేసానో వదిలేసాను. అతికష్టం మీద ఆ తండ్రిపక్షిని దూరంగా తరిమేయగలిగాను. ఈ లోపల జరగవలసిన ప్రమాదం జరగనే జరిగింది. రెండో గుడ్డు పగిలి ఛిన్నాభిన్నమై నా కాళ్ళ దగ్గర పడి ఉంది. నా మీదా, ఆ దిక్కుమాలిన తండ్రిపక్షి మీదా నాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చింది. నా మీద నాకెందుకు కోపం వచ్చిందీ అంటారా – తండ్రి పావురం నుంచి అలాంటి దాడి జరగవచ్చని నేను ఊహించి ఉండాలిగదా... జాగ్రత్తపడి ఉండాలిగదా. నేనేదో గుడ్లని సంగ్రహించడానికి వచ్చాననుకొందా తండ్రిపక్షి. ఆ అజ్ఞానంతో అది ప్రాణాలకు తెగించి మరీ నా మీద దాడి చేసింది. గుడ్లను ఎత్తుకు పోకుండా ఆపుదామనుకొంది. పొదుగుల కాలంలో గూళ్ళను శుభ్రపరచేటప్పుడు అన్ని రకాల సంఘటనలకూ, దాడులకూ మనం సిద్ధపడి ఉండాలి.

సరే – మళ్ళా మన కథ దగ్గరకు వద్దాం. గుడ్డు పై పెంకును ముక్కుతో పొడిచి పిల్లపక్షిని ఈ ప్రపంచంలోకి ఎప్పుడు తీసుకురావాలో తల్లిపక్షికి కచ్చితంగా తెలుసు. తండ్రిపక్షి కూడా అడపాదడపా గుడ్లమీద కూర్చొని పొదిగేమాట నిజమేగాని పొదగటం అన్న పనిని మూడింట రెండువంతులు నిర్వహించేది తల్లిపక్షే. ఆ మిగిలిన మూడోవంతు పొదిగేది తండ్రిపక్షే అయినా పిల్లపక్షుల్ని ప్రపంచంలోకి ఎప్పుడు తీసుకురావాలి అన్న విషయం దానికి తెలియదు. ఆ పరిజ్ఞానం తల్లిపక్షి సొత్తు. గుడ్డులోని పచ్చసొనా, తెల్ల సొనా కలగలసి ప్రాణం పోసుకొని పిల్లపక్షిగా రూపొంది ప్రపంచంలోకి అడుగుపెట్టటానికి సంసిద్ధమయ్యే శుభముహూర్తం వచ్చిందని తల్లిపక్షికి అంత కచ్చితంగా ఎలా తెలుస్తుందీ అన్నది మన ఊహకందని విషయం. అలాగే పైపెంకు మీద ఏ చోటున ఎంత బలంతో ముక్కుతో తాకాలో కూడా తల్లిపక్షికి క్షుణ్ణంగా తెలుసు. పిల్లపక్షికి ఏ గాయమూ తగలకుండా సరైన ప్రదేశంలో సరైన సమయంలో ముక్కుతో గుడ్డును బద్దలుగొట్టడం, పిల్లపక్షిని ప్రపంచంలోకి ఆహ్వానించడం – ఇవన్నీ నాకు అద్భుతమనిపిస్తాయి.

చిత్రగ్రీవం పుట్టటం కూడా సరిగ్గా నేను పైన వివరించినట్టుగానే జరిగింది. గుడ్లను పొదగటం మొదలెట్టిన ఇరవయ్యో రోజున తల్లిపక్షి గుడ్డు మీద కూర్చోవడం మానేసి పక్క పక్కన తారాడటం గమనించాను. తండ్రిపక్షి మేడమీది పిట్టగోడమించి దిగివచ్చి గుడ్డును పొదగడానికి ప్రయత్నించిన ప్రతిసారీ తల్లిపక్షి ఆ తండ్రిపక్షిని ముక్కుతో పొడిచి దూరంగా తరిమేసేది. "నన్నెందుకిలా తరిమేస్తున్నావ్?" అన్నట్టుగా ఆ తండ్రిపక్షి కువకువలాడేది. "వెళ్ళవయ్యా వెళ్ళు. ఎంతో ముఖ్యమైన పనిలో ఉన్నాను. ఇబ్బంది పెట్టకుండా పక్కకు వెళ్ళు" అన్నట్టుగా తల్లిపక్షి తండ్రిపక్షిని మరికాస్త దూరంగా నెట్టేసేది. చివరికి తండ్రిపక్షికి అక్కడ్నుంచి వెళ్ళక తప్పలేదు.

అదంతా చూసి నాకు కంగారు మొదలయింది. గుడ్లు పొదగడం పూర్తవ్వాలనీ, పిల్ల పక్షి ప్రాణం పోసుకొని గుడ్డులోంచి బయటపడితే చూడాలనీ నాకు మహా ఆత్రంగా ఉంది. మరి తల్లిపక్షి ప్రవర్తన చూస్తే విచిత్రంగా ఉందాయే! ఆందోళనతో, ఆసక్తితో, ఆత్రంగా గూటికేసి చూడసాగాను. ఓ గంట గడిచింది. పరిస్థితిలో మార్పు లేదు. మరో ముప్పావుగంట

గడిచాక తల్లిపక్షి మెడ అటూ ఇటూ తిప్పుతూ శ్రద్ధగా ఏదో వినసాగింది. బహుశా గుడ్డులోపల కదలికల శబ్దాలయి ఉండాలవి. మెల్లగా తల్లిపక్షి శరీరంలో స్పందన మొదలయింది. దాని శరీరమంతా ఏదో తీవ్ర ప్రకంపన పాకుతోందా అనిపించింది. తల్లిపక్షిలో ఏదో దివ్య సంకల్పం చోటుచేసుకున్నట్టు అనిపించింది. తల నిక్కించి గురిచూసింది. రెండే రెండు ముక్కుపొట్లతో గుడ్డును పగలగొట్టింది. పిల్లపక్షి బయటపడింది. ఒళ్లంతా ముక్కు.. చిన్న పాటి శరీరం. స్వల్పంగా కంపిస్తోన్న శరీరం. 'ఇన్నాళ్ళూ తాను శ్రమపడిందీ, ఎదురుచూస్తోన్నదీ ఇలాంటి బలహీనమైన నిస్సహాయమైన అర్భకమైన పిల్లపక్షి కోసమా?' అని తల్లిపక్షి ఆశ్చర్యపడినట్లు అనిపించింది. అయినా పిల్లపక్షి నిస్సహాయతను గమనించిన మరుక్షణం తల్లిపక్షి దానిని తన రొమ్ములోని నీలి ఈకలమాటున పొదవుకొంది.

ఆలోచించండి-చెప్పండి

- *మీరు ఎప్పటికీ మరచిపోలేని రోజు ఏది? ఎందుకు?*
- *తెలివిమాలిన పనులు అంటే ఏమిటి?*
- *మీ మీద మీకే ఎప్పుడైనా కోపం వచ్చిందా? ఎందుకు?*
- *పావురం గూడు ఎలా ఉందో తెల్సుకొన్నారు కదా! మీకు తెల్సిన పక్షి గూళ్ళు ఎలా ఉంటాయో చెప్పండి. పక్షి గూళ్ళన్నీ ఒకేలా ఉంటాయా?*
- *దివ్య సంకల్పం చోటు చేసుకోవడం అంటే ఏమిటి?*

III. చిత్రగ్రీవం చదువు



పక్షి ప్రపంచంలో రెండు దృశ్యాలు అతి మనోహరమైనవి. గుడ్డు బద్దలుగొట్టి తల్లిపక్షి పిల్లపక్షిని ఈ ప్రపంచపు వెలుగు వెల్లువలోకి తీసుకురావడం అందులో మొదటిది. అలా వచ్చిన పిల్లపక్షి నోటికి ఆహారం అందిస్తూ తల్లిపక్షి పెంపకం కొనసాగించడం రెండవది. చిత్రగ్రీవం పెంపకం ఎంతో అనురాగంతో సాగింది. మనం చిన్న పిల్లల్ని ఎత్తుకొని లాలిస్తే ఆ పిల్లలకు ఎలాంటి హాయీ సౌఖ్యమూ లభిస్తాయో చిత్రగ్రీవానికి తన తండ్రిపక్షి, తల్లిపక్షుల నుంచి అలాంటి వెచ్చదనం లభించింది.

చంటిపక్షులు ఎదిగి వచ్చే సమయంలో వాటి గూళ్ళలో మరీ ఎక్కువగా మెత్తటి దూదీ, పీచు లాంటి పదార్థాలను ఉంచగూడదు. వాటిని తగు మోతాదులోనే ఉంచాలి. లేకపోతే గూడు మరీ వెచ్చనైపోతుంది. అరకొర జ్ఞానపు పావురాల పెంపకందారులు పిల్లపక్షులు ఎదిగే సమయంలో తమ శరీరాల నుంచే చాలా మోతాదులో వెచ్చదనాన్ని విడుదల చేస్తాయన్న విషయం గ్రహించరు. ఈ సమయంలో పావురాల గూళ్ళను మరీ తరచుగా శుభ్రం చెయ్యటం కూడా మంచిదిగాదు. తల్లిపక్షి, తండ్రిపక్షి ఆచి తూచి గూటిలో ఉంచే ప్రతి వస్తువూ పిల్లపక్షి సుఖసౌకర్యాలకు దోహదం చేస్తాయి.

పుట్టిన రెండోనాటి నుంచే చిత్రగ్రీవం తన తల్లో తండ్రో గూటికి వచ్చిన ప్రతిసారీ తన ముక్కు తెరచి తన గులాబీరంగు ఒంటిని బంతిలా ఉబ్బించడం నాకు స్పష్టంగా గుర్తుంది. బార్లా తెరచిన పిల్లపక్షుల నోళ్ళల్లో పెద్ద పక్షులు తాము సంపాదించిన ధాన్యపుగింజల నుంచి ఉత్పత్తి చేసిన పాలను పోస్తాయి. అలా పోసిన ఆ పదార్థం ఎంతో మెత్తగా ఉంటుంది. పెద్దపక్షులు ముందస్తుగా తాము సంపాదించిన గింజల్నీ విత్తనాల్నీ తమ కంఠంలో కాసేపు నాననిచ్చి మెత్తబరుస్తాయి. ఆ తర్వాతే ఆ ఆహారాన్ని పిల్లలకు అందిస్తాయి. పిల్లపక్షులకు నెలరోజుల వయసు వచ్చినపుడు కూడా పెద్ద పక్షులు తిన్నగా గింజల్ని అందించవు. ముందు తమ కంఠంలో మెత్తబరిచాకే అందిస్తాయి.



మా చిత్రగ్రీవానికి ఆకలి ఎక్కువ. ఒక పెద్దపక్షి తన దగ్గరే ఉండి లాలిస్తూ తన బాగోగులు చూస్తూఉండగా, రెండో పక్షి తన కోసం ఆహారసేకరణలో నిమగ్నమై ఉండేలా చేసేది చిత్రగ్రీవం. తల్లితో సరి సమానంగా తండ్రి కూడా చిత్రగ్రీవం బాగోగులు సరిచూడడంలోనూ, ఆహారం అందించడంలోనూ పాలుపంచుకొందని నా అంచనా, తల్లిదండ్రుల శ్రమా, శ్రద్ధా పుణ్యమా అని చిత్రగ్రీవం మహా ఏపుగా ఎదిగింది. గులాబీరంగు మారి పసుపు కలిసిన తెలుపురంగు వచ్చింది. ఈకలు రానున్నాయనడానికి ఈ రంగు మార్పు మొదటి సూచన. తర్వాత చిన్న చిన్న బొడిపెల్లా ముళ్ల పంది ముళ్లలాంటి ఈకలు వచ్చాయి. దాని కళ్ళ దగ్గరా, నోటి దగ్గరా అప్పటిదాకా వేలాడుతూ ఉన్న పసుపుపచ్చని చర్మాలు రాలిపోయాయి. పొడవాటి, గట్టిపాటి, సూదిలాంటి ముక్కు రూపు దిద్దుకుంది. ఎంతబలమైన ముక్కో... ఓ సంఘటన చెపుతాను.

చిత్రగ్రీవానికి మూడువారాల వయసపుడు దాని గూటిలోకి ఒక చీమ పాకింది. గూటి అంచున కూర్చొనిఉన్న చిత్రగ్రీవం ఎవరి ఉపదేశమూ లేకుండానే ఆ చీమను టక్కున తన ముక్కుతో పొడిచింది. అప్పటిదాకా ఏకఖండంగా సాగిన ఆ చీమ ఒక్క దెబ్బతో రెండు ముక్కలైపోయింది. తన ముక్కుతో ఆ చీమ తునకలను కదిపి చూసి తాను చేసిన ఘనకార్యం ఏమిటో అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది చిత్రగ్రీవం. అది ఏదో తినే వస్తువు అనుకొని తమ పావురాల జాతికి మిత్రుడైన ఆ అమాయకపు నల్లచీమను చిత్రగ్రీవం పొడిచి చంపినదనడంలో సందేహం లేదు. తాను చేసిన పనిచూసి చిత్రగ్రీవం పశ్చాత్తాప పడిందనీ మనం అనుకోవచ్చు. ఏదేమైనా చిత్రగ్రీవం మళ్ళా ఎప్పుడూ తన జీవితంలో మరోసారి చీమను చంపలేదు.

పుట్టిన ఐదో వారానికల్లా చిత్రగ్రీవం తను పుట్టిన గూటినుంచి బైటకు గెంతి పావురాళ్ళ గూళ్ళ దగ్గర ఉంచిన మట్టి మూకుళ్ళలోంచి మంచినీళ్ళు తాగే స్థాయికి చేరుకుంది. రోజూ సొంతంగా ఆహారం సంపాదించుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చిత్రగ్రీవం స్థూలంగా తన ఆహారం కోసం తల్లిదండ్రుల మీదే ఆధారపడి ఉంది. నా ముంజేతి మీద కూర్చొని అరచేతిలో గింజల్ని ఒక్కొక్కటిగా పొడుచుకు తినేది. గారడీవాడు చమత్కారంగా బంతులను గాలిలోకి ఎగరేసి పట్టుకొనే విధంగా చిత్రగ్రీవం గింజలను తన గొంతులో పైకీ కిందకీ ఆడించి ఆ తర్వాత టక్కున మింగేది. అలా మింగిన ప్రతిసారీ నాకేసి చూసి 'భలే బాగా చేస్తున్నాను గదూ! మా అమ్మ నాన్న పై కప్పు మీద చలికాగుతున్నారు. గదా... వాళ్ళు దిగివచ్చాక నేనెంత చురుకైన దాన్నో వాళ్ళకు చెపుతావుగదూ!' అన్నట్టుగా నాకేసి చూసేది. కానీ ఏమాటకామాట చెప్పుకొందాం. శక్తియుక్తులు పెంపొందించుకోవడంలో నా దగ్గర ఉన్న పావురాలు అన్నిట్లోకి చిత్రగ్రీవమే మందకొడి.

ఆ రోజుల్లోనే నేనో విషయం కనిపెట్టాను. గాలి దుమారాల్లో, కళ్ళు మూసుకుపోయే దుమ్ము ఇసకల్లో పావురాలు నిరాటంకంగా ఎలా ఎగరగలుగుతాయో నాకు అప్పటిదాకా తెలియదు. రోజురోజుకీ పెరిగి పెద్దదవుతున్న చిత్రగ్రీవాన్ని దగ్గర నుండి గమనించే క్రమంలో ఓ రోజు దాని కళ్ళ మీదకు సన్నపాటి చర్మపు పొర సాగి రావడం గమనించాను. దాని కంటి చూపుగానీ పోవడంలేదుగదా అని భయపడి మరికాస్త పరీక్షగా చూడటం కోసం చిత్రగ్రీవాన్ని నా మొహం దగ్గరకు లాక్కున్నాను. అలా లాగగానే చిత్రగ్రీవం తన బంగారు రంగు కళ్ళువిప్పార్చి గూటిలో వెనక్కు వెనక్కు వెళ్ళిపోయింది. అయినా చెయ్యిజాచి పట్టుకొని మేడమీదకు తీసుకెళ్ళాను. ఆ మే నెల మండుటెండలో దాని కనురెప్పల్ని పరిశీలించాను. అప్పుడు కనిపించిందది: దాని కనురెప్పలకు అనుబంధంగా మరో పల్చని చర్మపుపొర ఉంది. నేను దాని మొహాన్ని సూర్యునికేసి తిప్పిన ప్రతిసారీ చిత్రగ్రీవం తన బంగారు కళ్ళమీదకు ఆ చర్మపు పొరను సాగలాగేది. అది కళ్ళకు రక్షణ కలిగించే చర్మపుపొర అనీ, దాని సాయంతో పావురాలు గాలిదుమారాల్లోగానీ, తిన్నగా సూర్యుని దిశగా గానీ ఏ ఇబ్బందీ లేకుండా ఎగరగలవనీ బోధపడింది.

మరో రెండు వారాలు గడిచేసరికల్లా చిత్రగ్రీవం ఎగరడం నేర్చుకుంది. పుట్టింది పక్షి పుట్టుకే అయినా ఆ ఎగరడం



ఆలోచించండి-చెప్పండి

- పిల్లపక్షిని దానితల్లి ఎలా పెంచిందో తెల్సుకున్నారు కదా! మరి మిమ్మల్ని ఎవరు, ఎలా వేరుగా పెంచారో చెప్పండి.
- "ఘనకార్యంచేయడం" అనే వాక్యం నుండి మీరేం గ్రహించారు? ఇలా దీన్ని ఇంకా ఏ ఏ సందర్భాలలో వాడతారు?
- "ఏ మాటకామాటే అని ఏ ఏ సందర్భాలలో ఉపయోగిస్తారు?
- 'పావురం' కంటిలోని ప్రత్యేకతను గుర్తించారుకదా! ఇంకా ఇతర జంతువుల / పక్షులకు సంబంధించిన ప్రత్యేకతలు ఏమున్నాయి?

అడ్డుకొనేంత ఎత్తు ఉన్న పిట్టగోడ అది.

నేర్వడం అన్నది అంత సులభంగా జరగలేదు. మన పిల్లగాళ్ళకు నీళ్ళంటే ఇష్టమేగావచ్చు. కానీ ఈత నేర్చుకోవాలంటే మునిగి తేలడమూ నీళ్ళు మింగడమూ తప్పవు గదా... అలాగే పిల్ల పావురాలు కూడా ఎంతో కష్టపడితేగానీ ఎగరడం నేర్చుకోలేవు. చిత్రగ్రీవానికి తన రెక్కలు విప్పడం విషయంలో ఏదో సంకోచం ఉన్నట్టుంది. గంటల తరబడి మేడ మీద బాగా గాలి వచ్చేచోట కూర్చున్నా రెక్కలు విప్పి ఎగరడం విషయంలో మాత్రం దాని ధోరణి నిమ్మకు నీరెత్తినట్టు ఉండేది. ఈ సంగతి స్పష్టం అవడంకోసం మీకు మా మేడ ఎలా ఉంటుందో చెపుతాను. మాది నాలుగంతస్థుల ఇల్లు. మేడమీద చుట్టూ పద్నాలుగేళ్ళ పిల్లాడంత ఎత్తైన బలిష్టమైన కాంక్రీటు పిట్టగోడ. వేసవికాలంలో రాత్రిపూట మేమంతా మేడమీదే పడుకునేవాళ్ళం. అలాంటి సమయాల్లో ఎవరైనా పొరపాటున నిద్రలో నడుచుకుంటూ వెళ్ళినా మేడమీంచి వాళ్ళు అమాంతంగా పడిపోకుండా

IV

చిత్రగ్రీవాన్ని రోజు తీసుకెళ్ళి ఆ పిట్టగోడ మీద వదిలే వాడిని. అక్కడ ఆ గాలుల్లో అది అలా గంటల తరబడి కూర్చొని ఉండేది. అంతే తప్ప ఎగరడం గిగరడం అన్న పనులేవీ పెట్టుకొనేది గాదు. ఇలా కాదని ఒకరోజు పిట్ట గోడ కింద కాసిని శెనగగింజలు పోసాను. కిందకి దిగివచ్చి ఆ గింజల్ని తిని పొమ్మని చిత్రగ్రీవాన్ని పిలిచాను. 'ఏవిటీ సంగతి?' అన్నట్టుగా కాసేపు చూసింది. నేను తీసుకువెళ్ళి తనకు ఆ గింజల్ని తినిపించబోవడంలేదని స్పష్టమయ్యాక అది పిట్టగోడమీదే అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టింది. అడపాదడపా మెడనిక్కించి నాలుగడుగులు కిందనున్న గింజల్ని చూడటం మాత్రం మానలేదు. అలా ఆ నిరాశా భరితమైన నాటకం ఓ పావుగంట దాకా కొనసాగింది. చిట్టచివరకు అది సంకోచాన్ని అధిగమించి పిట్టగోడమీంచి కిందకు దూకనే దూకింది. దాని కాళ్ళు నేలను తాకే సమయంలో అప్పటిదాకా ఏనాడూ తెరచుకొని ఉండని దాని రెక్కలు – అది గింజలమీద వాలి బాలెన్సు చేసుకునే ప్రక్రియలో అప్రయత్నంగా హఠాత్తుగా చక్కగా విప్పుకున్నాయి. ఎంతటి ఘన విజయం!

ఆ రోజుల్లోనే దాని ఈకల రంగు మారడం గమనించాను. అంతగా ఆకట్టుకోలేని బూడిదరంగు కలసిన నీలివర్ణపు ఈకలకు బదులుగా దాని ఒళ్లంతా సముద్రపు నీలిరంగు ఈకలతో ధగధగా మెరవసాగింది. దాని మెడ ప్రాంతం సూర్యకాంతిలో ఇంద్రధనస్సు వర్ణాల పూసల గొలుసులా శోభిల్లసాగింది.

ఎగరడం అన్న మహత్తరమైన ఘట్టానికి చేరుకుంది చిత్రగ్రీవం. దాని తల్లీ, తండ్రీ, చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పిస్తాయని ఎదురుచూసాను. ఈ 2లోపల నాకు చేతనయిన రీతిలో నా వంతు ప్రయత్నం చేసాను. రోజూ చిత్రగ్రీవాన్ని మణికట్టు మీద ఉంచుకొని కొద్ది నిమిషాలపాటు చేతిని పైకీ కిందకీ పదే పదే కదిపేవాడిని. అలా కదిపినప్పుడు చిత్రగ్రీవం బాలెన్సు నిలదొక్కుకోవడం కోసం రెక్కలు విప్పడం ముడవడం చేసేది. అలా దానికి రెక్కలు ముడవడం విప్పడం అలవాటయింది. కానీ ఎగరడం అంటే ఇంకా చాలా తతంగం ఉంది కదా... ఆ మిగిలిన పాఠాలు నేర్పడం నా పరిధిలో లేదు గదా...



అసలు ఎందుకీ ఆత్రం అని మీరు అనుకోవచ్చు. తోటి పావురాలతో పోలిస్తే చిత్రగ్రీవం ఎగరడం విషయంలో వెనకబడి ఉండటం దానికి ఒక కారణం. అదీ కాకుండా జూన్‌నెల వచ్చేసిందంటే వర్షాలు అందుకొంటాయి. వర్షాలు మొదలయ్యాయి అంటే పక్షులకు దూరాలు ఎగరడం అసాధ్యమవుతుంది. అంచేత వర్షాకాలం ముంచుకొచ్చేముందుగానే చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పేయాలి అనుకొన్నాను.

మే నెల ఇంకా కొద్ది రోజుల్లోనే ముగుస్తుంది అనగా తండ్రిపక్షి చిత్రగ్రీవానికి ఎగరడం నేర్పే పని చేపట్టింది. ఆ రోజు అప్పటిదాకా బలంగా వీచి ఊరును చల్లబరచిన ఉత్తరపు గాలి సన్నగిల్లి మంద్రంగా సాగుతోంది. ఆకాశం కడిగిన నీలిముత్యంలా నిర్మలంగా ఉంది. దుమ్ము ధూళీ లేకుండా వాతావరణం స్వచ్ఛంగా ఉంది. ఊళ్ళోని ఇళ్ళ పైకప్పులూ, దూరాన ఉన్న పంటపొలాలూ – అన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం మూడు గంటలవేళ. చిత్రగ్రీవం మేడ పిట్టగోడమీద కూర్చుని ఉంది. అప్పటిదాకా చుట్టుపక్కల గిరికీలు కొడుతున్న తండ్రి పక్షి వచ్చి ఎండకాగుతున్న చిత్రగ్రీవం పక్కన వాలింది. వాలి చిత్రగ్రీవం కేసి ఓ చూపు చూసింది. "ఏం వాయ్ బడుద్ధాయ్. మూడు నెలలు నిండాయి. ఇంకా ఎగిరే ప్రయత్నాలేం లేవా? భయమా? అసలు నువ్వు పావురానివా, వానపామువా?" అన్నట్టుగా చిత్రగ్రీవం కేసి చూసింది. చిత్రగ్రీవం ఉలుకూ పలుకూ లేకుండా గంభీరంగా ఉండిపోయింది. తండ్రి పక్షికి చిర్రెత్తు కొచ్చింది గాబోలు – పావురాల ఫక్కీలో కువకువా కూస్తూ చిత్రగ్రీవాన్ని గద్దించ సాగింది. ఆ గద్దింపుల జడివాన నుంచి తప్పించుకుందామని చిత్రగ్రీవం పక్కపక్కకు జరగసాగింది. తండ్రి పక్షి పట్టు విడవకుండా కూతలు పెడుతూ రెక్కలు టపటపలాడిస్తూ తనూ జరగసాగింది. చిత్రగ్రీవం ఇంకా ఇంకా జరిగింది. తండ్రి పక్షీ జరగటం కొనసాగించింది. చిట్టచివరికి చిత్రగ్రీవం పిట్టగోడ అంచుకు చేరింది. ఇంకాస్త జరిగితే కిందపడే స్థితికి చేరుకుంది. ఉన్నట్టుండి తండ్రి పక్షి తన భారాన్నంతా చిత్రగ్రీవం మీద మోసేసింది.



చిత్రగ్రీవం గోడమీద నుంచి జారనే జారింది. అలా ఒక అడుగు జారిందో లేదో స్వీయరక్షణ కోసం అసంకల్పితంగా రెక్కలు విప్పార్చి గాలిలో తేలింది. మా సంతోషానికి అవధులు లేవు. అప్పటిదాకా కింద అంతస్థులోని నీళ్ళ కుండీలలో జలకాలాడుతున్న తల్లి పక్షి మెట్లమీదుగా మేడమీదికి చేరుకుని తనూ చిత్రగ్రీవానికి సాయంగా ఎగరసాగింది. అలా అవి రెండూ ఎంతలేదన్నా పది నిమిషాలపాటు ఎగిరాయి. ఆకాశంలో గిరికీలు కొట్టి వచ్చి కిందకు వాలాయి. అలా వాలేటప్పుడు తల్లిపక్షి రెక్కలు ముడిచి యథాలాపంగా తాను వాలదలచిన ప్రదేశంలో శుభ్రంగా వాలింది. చిత్రగ్రీవం మాత్రం నానా పాట్లు పడింది. ఒకటే కంగారు. ఒళ్ళంతా ఒణుకు. వాలే క్షణంలో దాని కాళ్ళు నేలను రాసుకుంటూ పోయాయి. అలా నేలను రాసుకుంటూ వెళుతూ, రెక్కల్ని కంగారు కంగారుగా టపటపలాడిస్తూ, తనను తాను బాలెన్సు చేసుకుంటూ బాగా ముందుకు సాగి ఆగింది. అలా ఆగినప్పుడు దాని రొమ్ము గోడను తాకింది. గబుక్కున రెక్కలు ముడిచేసింది. ఎలాగైతేనేం క్షేమంగా వాలి ఆగింది కదా – చిత్రగ్రీవం ఉత్తేజంతో రొప్పసాగింది. తల్లిపక్షి దానిపక్కకు చేరి ముక్కుతో నిమిరింది. దాని రొమ్ముకు తన రొమ్ము తాకించింది. చిన్న పిల్లాడిని లాలించినట్టుగా లాలించింది. తాను చేపట్టిన కార్యం విజయవంతంగా ముగియటం గమనించిన తండ్రిపక్షి జలకాలాడటం కోసం కింది అంతస్థులోని

ఆలోచించండి-చెప్పండి

- *"నిమ్మకు నీరెత్తడం" అని ఏ ఏ సందర్భాలలో వాడతారు?*
- *'మహత్తర ఘట్టానికి చేరుకోవడం' అంటే ఏమిటి? దీనికి కొన్ని ఉదాహరణలు తెల్పండి.*
- *మే నెల చివరి రోజుల్లో వాతావరణం ఎలా ఉందో తెల్సుకొన్నారు కదా! చలికాలంలో వాతావరణం ఎలా ఉంటుందో మీ మాటల్లో వర్ణించండి.*
- *'చిత్రగ్రీవం ఎగరడానికి దాని తండ్రి పక్షి ఏం చేసింది? తల్లి పక్షి ఏం చేసింది? అట్లే చిన్న పిల్లలు నడక నేర్చుకోవడం ఎలా జరుగుతుందో చెప్పండి.*



ఇవి చేయండి

I. అవగాహన – ప్రతిస్పందన

1. మనుషుల్లాగే పక్షులకు జంతువులకు కూడా తమ పిల్లలను పెంచడం ఎలాగో తెల్సు" దీనిపై మీ అభిప్రాయాన్ని తెల్పండి. కారణాలను వివరిస్తూ మాట్లాడండి.

2. పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.

పేరా సంఖ్య	పేరాలో వివరించిన ముఖ్యమైన విషయాలు	పేరాకు తగిన శీర్షిక
1వ పేరా		
2వ పేరా		
10వ పేరా		
15వ పేరా		
16వ పేరా		

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) చిత్రగ్రీవం ఏ వయస్సులో ఏమేం చేయగల్గిందో పాఠం ఆధారంగా రాయండి.

ఆ) చిత్రగ్రీవానికి దాని తల్లిపక్షి, తండ్రిపక్షి నుండి ఏమేమి సంక్రమించాయి?

ఇ) చిత్రగ్రీవం గురించి వివరిస్తూ అది సుందరమైనదని, మందకొడిదని, ఏపుగా ఎదిగిందని రచయిత ఎందుకన్నాడు?

ఈ) చిత్రగ్రీవం గురించి మనకు వివరిస్తున్నది ఎవరు? తాను చేసిన పనికిమాలిన పని అని దేని గురించి చెప్పాడు?

ఉ) పిల్లపక్షి నిస్సహాయంగా ఉన్నప్పుడు, ఉత్తేజంతో గాభరాపడినప్పుడు తల్లి పక్షి ఏం చేసింది?

ఊ) 'ధనగోపాల్ ముఖర్జీ' గారు చేసిన సాహితీ సేవ ఏమిటి?

4. కింది పేరా చదవండి. సరైన వివరణతో ఖాళీలు పూరించండి.

చాతకపక్షుల ముక్కులు చాలా చిన్నవి. తాము ఎగురుతూనే గాలిలోని కీటకాలను పట్టుకోగలవు. నోరు బోర్లా తెరచి తమవైపుకు వచ్చే చాతక పక్షుల బారినుండి కీటకాలు తప్పించుకోవడం దాదాపు అసాధ్యం. చాతకపక్షులు పరిమాణంలో చాలా చిన్నవి. వాటికి బరువులెత్తే సామర్థ్యం కూడా తక్కువే! అందుకే అవి వాటి గూళ్ళ నిర్మాణంలో గడ్డిగాదం, పీచూపత్తి, సన్నపాటి చెట్టురెమ్మలు... వంటి తేలికపాటి వస్తువులనే వాడతాయి. వాటి కాళ్ళు పొట్టిగా ఉంటాయి. పొడవాటి కాళ్ళున్న పక్షుల్లో ఉండే చురుకుదనం వీటి కాళ్ళల్లో కనిపించదు. అందుకని ఇవి గెంతడం, దభీమని దూకడం వంటి పనులు చెయ్యలేవు. ఐతే వాటి కొక్కేల్లాంటి కాలివేళ్ళ



పుణ్యమాఅని అవి తమ గోళ్ళతో ఎలాంటి జారుడు ప్రదేశాల్లోనైనా అతుక్కుపోయి ఉండిపోగలవు. కాబట్టి అవి అనితరసాధ్యమైన నైపుణ్యంతో, కుశలతతో పాలరాతి వంటి నున్నటి గోడల్ని, ప్రదేశాలను పట్టుకొని వెళ్ళగలవు. చాతకపక్షులు తమ గూళ్ళను నిర్మించుకోవడానికి ఇళ్ళ చూరుల దిగువన గోడల్లోని తొర్రలను ఎన్నుకొంటాయి. చాతక పక్షులు రాలిన ఆకుల్నీ, గాలిలో ఎగరాడే గడ్డిపోచల్ని ముక్కున కరచుకొని గూట్లోకి చేరుస్తాయి. వాటిని తమ లాలాజలాన్ని జిగురులా వాడి గూటి ఉపరితలం మీద అతికిస్తాయి. వాటి లాలాజలం ఓ అద్భుత పదార్థం. అది ఎండి గట్టిపడిందంటే మామూలుగా వాడే ఏ జిగురూ దానికి సాటిరాదు. ఇదీ చాతకపక్షుల వాస్తుకళానైపుణ్యం.

అ) చాతకపక్షులు తేలికపాటి వస్తువులతో గూళ్ళను నిర్మించుకుంటాయి. ఎందుకనగా _____

ఆ) చాతకపక్షులు దభీమని దూకడం, గెంతడం చెయ్యలేవు. ఎందుకనగా _____

ఇ) నున్నటి గోడలు, ప్రదేశాల్లో కూడా జారకుండా ఉండడానికి కారణం _____

ఈ) చాతకపక్షుల లాలాజలం వాటి గూటి నిర్మాణంలో ఎంతో ముఖ్యమైంది. ఎందుకనగా _____

ఉ) వాస్తుకళా నైపుణ్యం అనగా _____

II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి 4, 5, వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) చిత్రగ్రీవం గురించి మీకు ఆశ్చర్యం కలిగించిన విషయాలు ఏవి?

ఆ) మానవులను పావులకు మిత్రులూ, సహచరులని రచయిత ఎందుకు అన్నాడు?

ఇ) చిత్రగ్రీవం తండ్రిపక్షి గురించి రాయండి.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి 10, 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) చిత్రగ్రీవం గురించి మీ సొంత మాటల్లో వర్ణించండి.

ఆ) చిత్రగ్రీవం పెంపకంతో పిల్లల పెంపకాన్ని పోల్చి రాయండి.

3. సృజనాత్మకంగా / ప్రశంసాత్మకంగా రాయండి.

అ) 'చిత్రగ్రీవం' అనే పావురం పిల్ల ఎలా పుట్టింది? ఎలా ఎగరడం నేర్చుకొన్నది తెలుసుకొన్నారు కదా! అట్లే మీకు తెల్సిన లేదా మీ పరిసరాల్లోని ఏదైనా పక్షి / జంతువు గురించి మీరు కూడా ఒక కథనాన్ని రాయండి. (ఈ పాఠంలాగా)

ఆ) ఈ మధ్యకాలంలో సెల్‌ఫోన్ టవర్ల నుండి వచ్చే వేడిమికి కొన్ని పక్షి జాతులు అంతరించి పోతున్నాయి. అట్లే ఎండాకాలంలో తీవ్రమైన వేడికి తాళలేక, తాగడానికి నీరు అందక మృత్యువాతపడుతున్నాయి. పక్షులు ఇందుకోసం తమను కాపాడడానికి తగిన చర్యలు చేపట్టమని తమ తోటకు వచ్చిన పిల్లలతో సంభాషించాయి. ఆ పిల్లలు, పక్షుల మధ్య సంభాషణను ఊహించి రాయండి.



III. భాషాంశాలు

పదజాలం

1. కింది పదబంధాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

అ) శ్రద్ధాసక్తులు ఆ) ప్రేమ, ఆప్యాయతలు ఇ) వర్ణభరితం

ఈ) వన్నెచిన్నెలు ఉ) సాటిరావడం ఊ) సమయం, సందర్భం

ఋ) దిక్కుమాలిన ఎ) నిస్సహాయత ఏ) హాయిసౌఖ్యం

2. కింది పదాలను వివరించి రాయండి.

అ) విజయవంతం కావడం అంటే _____

ఆ) ఉలుకూ పలుకూ లేకుండడం అంటే _____

3. కింద తెల్పిన వాటి గురించి పాఠంలో ఏ ఏ పదాలతో వర్ణించారు?

అ) గద్దింపులు : _____

ఆ) పావురాలు : _____

ఇ) గువ్వలు : _____

ఈ) పావురాల గుంపు : _____

ఉ) పావురం మెడ : _____

ఊ) పుట్టిన పిల్లపక్షి : _____

ఋ) చిత్రగ్రీవం ముక్కు : _____

ఎ) చిత్రగ్రీవం ఒళ్ళు : _____

ఏ) చిత్రగ్రీవం మెడ ప్రాంతం: _____

IV. భాషా కార్యకలాపాలు

1. "ధనగోపాల్ ముఖర్జీ" రాసిన "చిత్రగ్రీవం ఓ పావురం కథ" అనే పుస్తకాన్ని లేదా పక్షుల గురించి తెలిపే ఏదైనా ఒక పుస్తకాన్ని గ్రంథాలయం నుండి చదవండి. మీరు తెల్సుకొన్న వివారాలు రాసి ప్రదర్శించండి (లేదా) అంతర్జాలం ద్వారా ఏవైనా రెండు పక్షుల వివరాలు, వాటి చిత్రాలు సేకరించి రాసి ప్రదర్శించండి.

2. "చిత్రగ్రీవం" అనే పక్షి పేరు పంచతంత్ర కథల్లో కూడా ఉంది. పంచతంత్రం కథల పుస్తకం చదవండి. మీరు చదవిన కథ గురించి రాసి ప్రదర్శించండి.

V. వ్యాకరణాంశాలు

పునఃశ్చరణ



1. కింది అలంకారాల లక్షణాలు రాయండి.

అ) శ్లేష ఆ) అర్థాంతరన్యాస

2. కింది ఛందోరీతుల లక్షణాలు రాయండి.

అ) సీసం ఆ) ఆటవెలది ఇ) తేటగీతి

3. కింది లక్ష్యాల్లోని అలంకారాలను గుర్తించండి.

అ) నేను పద్యాల తోరణం చూస్తున్నాను.

ఆ) శ్రీమంత్ చొక్కా మల్లె పూవు వలె తెల్లగా ఉంది.

పరిచయము

1. కింది లక్ష్యాన్ని పరిశీలించండి.

భ	స	స
U I I	I I U	I I U
ఆ పర	మ పురం	ధ్రుల యం

గగ	భ	జ	స	స
U U	U I I	I U I	U I I	U I U
దే పు	ణ్యాంగన	ము భిక్ష	యిడద	య్యెఁ గటా!

గగ	జ	స
U U	I U I	I I U
రేపా	డి మేలు	కని యే

గగ	భ	జ	గగ	స
U U	U I I	I U I	U U	I I U
నే పా	పాత్ముని	ముఖంబు	నీక్షిం	చితినో?

దీంట్లో గగ, భ, జ, స అనే గణాలు వాడబడ్డాయి కదూ!

ఒకటవ పాదం, మూడవ పాదంలో గణాల సంఖ్య రెండవ, నాల్గవ పాదాల్లోని గణాల సంఖ్య ఒకే ఈ రకంగా ఉంది కదూ!

ఆరవ గణం 'జ'గణం మాత్రమే ఉంది కదూ!

రెండు నాలుగు పాదాల్లోని చివరి అక్షరం గురువే కదా!

ఇలాంటి లక్షణాలు కలిగి ఉండే పద్యం ఏంటో తెలుసా? అదే కంద పద్యం.

i) గగ (గా), భ, జ, స, నల అనే గణాలుంటాయి.

ii) మొదటి పాదం లఘువుతో మొదలైతే అన్నీ పాదాల్లో మొదటి అక్షరం లఘువుగాను, గురువుతో మొదలైతే అన్ని పాదాల్లో మొదటి అక్షరం గురువుగాను ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ

iii) రెండవ, నాలుగవ పాదాల్లోని చివరి అక్షరం గురువుగానే ఉంటుంది.

iv) 1, 2 పాదాల్లో (3 + 5) 8 గణాఉల, 3, 4 పాదాల్లో (3 + 5) 8 గణాలు ఉంటాయి. ఆరవ గణం "జ"గణం గాని "నల"ను గాని మాత్రమే వాడాలి.

v) నాలుగవ గణం మొదటి అక్షరానికి ఏడవ గణం తొలి అక్షరానికి యతి చెల్లుతుంది.

vi) ప్రాస నియమం ఉంటుంది.

vii) 'జ'గణం బేసి గణం కారాదు.

మీ 'వెన్నెల' పాఠంలోని నాల్గో పద్యం పదపడి పూర్వదిశాసతి.....అనే పద్యానికి సమన్వయం చేయండి.



ప్రతి ప్రాణిలోనూ అనంత శక్తి నివురుగప్పి ఉంది. జీవించే ప్రతి ప్రాణీ, శ్వాసించే ప్రతి జీవీ అనంత శక్తికి ఆలవాలం. జంతువులూ, పక్షులలోకూడా ఆధ్యాత్మిక భావాలు ఉంటాయి.





ఉపవాచకాలు

1. శ్రీమద్రామాయణం
2. మహాభారతం

ఉపవాచకం

శ్రీమద్రామాయణం

(వాల్మీకి రామాయణానికి సంక్షిప్త వచనరూపం)



ఎందుకీ రామాయణం?

మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. ఇది జరిగిన కథ. మానవ హృదయాల నుండి ఎప్పటికీ జరగని కథ. 'అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం – అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం – గురుభక్తి, శిష్యానురక్తి – స్నేహఫలం, ధర్మబలం – వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం – జీవకారుణ్యభావన, ప్రకృతిలాలన' – ఇలా జీవిత పార్శ్వాలనెన్నింటినో పట్టి చూపిస్తుంది రామాయణం. రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమే. రామాయణం పారాయణ గ్రంథంకాదు, ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నందిస్తుంది. రామునివంటి ఆదర్శమూర్తి, రామాయణం వంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి!' మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది.

ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి దీనిని రచించి 'ఆదికవి'గా కీర్తిపొందాడు. 'రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్' అనే మూడు పేర్లు దీనికున్నాయి. ఆరు కాండల (విభాగం) తో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, సంస్కృత భాషలో ఇది రచింపబడింది. తరువాతి కాలంలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది. వారి వారి ప్రతిభననుసరించి వాల్మీకి కథకు జోడింపులు చేసిన కవులూ ఉన్నారు. అవే నిజం అన్నంతగా ప్రచారం పొందాయి కొన్ని సంఘటనలు.

వాల్మీకి రామాయణ కథను సంక్షిప్తంగా అందించే ప్రయత్నం ఇది. సమున్నత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా చేసిన చిరుప్రయత్నమిది.



బాలకాండం



శ్రీమన్నారాయణుని నిరంతరం స్మరించే నారదమహర్షి ఒకనాడు మునిశ్రేష్ఠుడైన వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు. నారదుడు తపస్వి, గొప్ప మాటకారి. వాల్మీకి జిజ్ఞాసతో నారదుల వారినడిగాడు (జిజ్ఞాసయే విజ్ఞానానికి మూలం). 'ఓ మహర్షీ! అన్నీ మంచి గుణాలు కలవాడు, ఎట్టి ఆపదలు చుట్టుముట్టినా తొణకనివాడు, ధర్మం తెలిసినవాడు, ఆశ్రయించినవారిని ఆదుకునేవాడు, మాటతప్పనివాడు, సకల ప్రాణులకు మేలుచేసేవాడు, వీరుడు, ధీరుడు, అసూయలేనివాడు, అందమున్నవాడు... ఇలాంటి శుభలక్షణాలు కలవాడు ఎవరైనా ఈ లోకంలో ఉన్నారా?' అని ప్రశ్నించాడు. నారదుడు చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. 'మహామునీ! ఇన్ని లక్షణాలు ఒకే వ్యక్తిలో కుదురుకోవడం సాధారణంగా జరుగదు. కానీ, నీవు తెలిపిన విశిష్ట గుణాలన్నీ మూర్తీభవించినవాడు శ్రీరాముడ'ని తెలిపాడు. రామాయణగాథను సంక్షిప్తంగా వాల్మీకికి వినిపించాడు నారదుడు. అక్కడి నుండి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

రామకథ వాల్మీకి మనసులో నాటుకుపోయింది. నారదుని మాటలు ఇంకా చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతున్నాయి. గంగానదీ సమీపానగల తమసానదికి స్నానం చేయడానికి బయల్దేరాడు. భరద్వాజాది శిష్యులు వెంటనడుస్తున్నారు. తమసానది మంచివాని మనసువలే స్వచ్ఛంగా ఉంది.

స్నానానికై నదిలోకి దిగిన వాల్మీకి చుట్టూవున్న ప్రకృతి అందాలకు పరవశిస్తున్నాడు. సమీపంలో ఒక కొమ్మపైన క్రౌంచ పక్షుల జంటను చూశాడు. వాటి అనురాగం ముచ్చటగొలుపుతున్నది. వాటి మధురధ్వనులు వీనులవిందు చేస్తున్నాయి. ఇంతలో ఒక వేటగాడు క్రూరబాణంతో మగపక్షిని నేలకూల్చాడు. అది నెత్తురోడుతూ విలవిలలాడుతూ ప్రాణాలను విడచింది. ఆ ఎడబాటును తట్టుకోలేని ఆడపక్షి తల్లడిల్లిపోయింది. హృదయ విదారకమైన ఈ దృశ్యాన్ని చూశాడు వాల్మీకి. కరుణరసం జాలువారింది. ధర్మావేశం కట్టలు తెంచుకుంది. వెంటనే నోటి వెంట అప్రయత్నంగా...

మానిషాద ప్రతిష్ఠాంత్వ మగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునాదేకమ్ అవధీః కామమోహితమ్॥

(ఓ కిరాతుడా! క్రౌంచపక్షి జంటలో పరవశమైయున్న ఒక పక్షిని చంపిన నీవు శాశ్వతముగా అపకీర్తి పాలగుదువు) అన్న మాటలు వచ్చాయి.

అనునైతే అన్నాడు కానీ తరువాత అతనికే ఆశ్చర్యంవేసింది. ఈ మాటలు సమానాక్షరాలుగల నాలుగు పాదాలతో లయబద్ధంగా వచ్చాయి. ఇది ఛందోబద్ధమైన శ్లోకమేనని నిర్ధారించుకున్నాడు. శోకం నుండి శ్లోకం పుట్టింది. ఆశ్రమానికి తిరిగివచ్చారందరూ. కాని క్రౌంచపక్షి దారుణ దృశ్యం మాత్రం వాల్మీకి మనసు నుండి వెనుదిరగడం లేదు. అదే ఆలోచన. అదే ఆవేదన. ఇంతలో సృష్టికర్తయైన బ్రహ్మ వాల్మీకిని చూడడానికి ఆశ్రమానికివచ్చాడు. అతనికి శాస్త్రోక్త ఉపచారాలన్నీ చేశాడు వాల్మీకి. బ్రహ్మ వాల్మీకిని

కూర్చోమన్నాడు. బ్రహ్మ ఆసనంకన్నా కొంచెం తక్కువ ఎత్తుగల ఆసనంపై కూర్చున్నాడు వాల్మీకి. ఇది పెద్దలపట్ల ప్రవర్తించవలసిన తీరు. బ్రహ్మ ఎదురుగా ఉన్నా క్రౌంచపక్షి బాధ వాల్మీకిని వదలడం లేదు. మనసులో 'మానిషాద' శ్లోకమే మళ్ళీ ధ్వనించింది. అన్నీ తెలిసిన బ్రహ్మ చిరునవ్వును చిందిస్తూ 'ఓ ఋషీశ్వరా! నీవు పలికినది శ్లోకమే. అది నా సంకల్ప ప్రభావం. ఈ ఛందస్సు (అనుష్టుప్) లోనే శ్రీరామచరిత్రను రాయమని ఆదేశించాడు. నారదుడు స్పష్టంగా వివరింపని రామకథా రహస్యాలు కూడా స్ఫురిస్తాయని అనుగ్రహించాడు. ఈ భూమండలమున పర్వతాలు, నదులు ఉన్నంతకాలం రామాయణగాథ కీర్తింపబడుతుందని ఆశీర్వదించాడు. బ్రహ్మ ఆదేశానుసారం రామాయణరచనకు శ్రీకారం చుట్టాడు వాల్మీకి మహర్షి.

అయోధ్యా నగరం :

సరయూ నదీ తీరంలో 'కోసల' అను సుప్రసిద్ధ దేశముంది. అందులోనిదే 'అయోధ్యా' అనే మహానగరం. 'అయోధ్యా' అంటే యోధులకు జయింపశక్యంకానిది. మనువు దీనిని నిర్మించాడు. కోసల దేశాన్ని దశరథమహారాజు పరిపాలిస్తున్నాడు. అతడు సూర్యవంశం వాడు. మహావీరుడు. దేవతల పక్షాన రాక్షసులతో ఎన్నోమార్లు యుద్ధం చేసినవాడు. ధర్మపరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకునేవాడు. వశిష్ఠ, వామదేవులు అతని ప్రధానపురోహితులు. సుమంత్రుడు మొదలుగాగల ఎనిమిది మంది మంత్రులు. ఇతని పాలనలో కోసల దేశం భోగభాగ్యాలతో విలసిల్లింది. ప్రజలు ధర్మవర్తనులై సుఖసంతోషాలతోవున్నారు. 'యథారాజా తథా ప్రజాః' – రాజు ఎలా ఉంటే ప్రజలూ అలాగే ఉంటారు.

ఎన్ని ఉన్నా సంతానం లేదన్న చింత దశరథుణ్ణి కుంగదీసింది. సంతానప్రాప్తికై అశ్వమేధయాగం చేయాలన్న ఆలోచన కలిగింది. వెంటనే పురోహితులు, గురువులతో సమావేశమయ్యాడు. మనసులోని మాట చెప్పాడు. వారు తథాస్తు అన్నారు. సరయూనదికి ఉత్తర తీరంలో యజ్ఞవేదిక సిద్ధమైంది. మంత్రీ సారథియైన సుమంత్రుడు ఈ యాగానికి ఋష్యశృంగ మహర్షిని ఆహ్వానిస్తే ఫలవంతమౌతుందని సూచించాడు. ఋష్యశృంగుడు విభాండక మహర్షి కుమారుడు. నిష్ఠాగరిష్టుడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడ వానలు బాగా కురుస్తాయి. దశరథుని ఆజ్ఞమేరకు ఋష్యశృంగుని సగౌరవంగా తోడ్కొనివచ్చారు. మూడు రోజులపాటు అశ్వమేధయజ్ఞము శాస్త్రోక్తంగా నిర్వహింపబడింది.

తరువాత దశరథుడు ఋష్యశృంగునితో పుత్రప్రాప్తికై చేయవలసిన క్రతువును గురించి అడిగాడు. ఆ భారాన్ని ఋష్యశృంగునిపైనే ఉంచాడు. దశరథుని అభ్యర్థనను మన్నించిన ఋష్యశృంగుడు 'పుత్రకామేష్టి' అనే యాగాన్ని ప్రారంభించాడు. హవిస్సులందుకోవడానికి బ్రహ్మాదిదేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు యజ్ఞశాలలో ప్రత్యక్షమయ్యారు.

అదే సమయంలో దేవతలందరూ బ్రహ్మను చేరి తమగోడును వెళ్ళబోసుకున్నారు. రావణాసురుడు బ్రహ్మ వర ప్రభావంచే విర్రవీగుచు తమను చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు. ముల్లోకాలను బాధించడమేగాక ఇంద్రునిసైతం రాజ్యభ్రష్టుని చేయడానికి పూనుకొన్నాడని తెలిపారు. అతని దుండగాలకు అంతేలేదన్నారు. ఋషులు, యక్షగంధర్వుల మాట అటుంచి అతని భయంతో సూర్యుడు, సముద్రుడు, వాయువు కూడా తమ సహజస్థితిని ప్రకటించలేకపోతున్నారని వాపోయారు. అతని పీడ విరగడయ్యే ఆలోచనను బ్రహ్మనే చెప్పమన్నారు.

బ్రహ్మ దేవతలతో 'రావణుడు గంధర్వ, యక్ష, దేవ, దానవులచే మరణం లేకుండా నన్ను వరం కోరాడు. మానవుల పట్ల అతనికి చులకనభావం. అందుకే వారి గురించి ప్రస్తావించలేదు. కనుక మానవుని చేతిలోనే రావణునికి మరణం కలదని' అన్నాడు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు.

ఇంతలో శ్రీమహావిష్ణువు శంఖచక్రగదాధారియై వచ్చాడు. దేవతలు ఆ దేవదేవుని అనేక విధాలుగా స్తుతించారు. వరగర్వంచే కన్నుమిన్నుగానక ప్రవర్తిస్తున్న రావణుని సంహరించడానికి మానవుడిగా అవతరించమని అభ్యర్థించారు. దశరథ మహారాజు యొక్క ముగ్గురు భార్యలకు నాలుగు రూపాలలో పుత్రుడవు కమ్మని ప్రార్థేయపడ్డారు. అభయమిచ్చాడు ఆశ్రితవత్సలుడు. అందరి పూజలందుకొన్న పిమ్మట అంతర్ధానమయ్యాడు.

అప్పుడు యజ్ఞకుండం నుండి తేజస్సుతో కూడిన ఒక దివ్యపురుషుడు ఆవిర్భవించాడు. అతడు బ్రహ్మపంపగా వచ్చినాడు. చేతిలో బంగారుపాత్ర, వెండిమూతతో. అందులో దివ్యపాయసముంది. దానిని దశరథునకందించాడు. ఈ పాయసం సంపదలనిస్తుంది, ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నాడు. అన్నిటినీమించి సంతానాన్ని ప్రసాదిస్తుందన్నాడు. పేదవానికి పెన్నిధి దొరికినట్లైంది. దశరథుని మనస్సు ఆనందతాండవం చేసింది.

దివ్యపాయసాన్ని తన భార్యలైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు పంచాడు. సంవత్సరకాలం గడిచింది. చైత్రశుద్ధనవమినాడు కౌసల్యకు శ్రీరాముడు జన్మించాడు. దశమినాడు కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు జన్మించారు. ఈ వార్త విన్న అయోధ్య ఆనందసంద్రమైంది.

రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు శుక్లపక్ష చంద్రునివలే పెరుగుతున్నారు. వేదశాస్త్రాలనభ్యసించారు. ధనుర్విద్యలో నైపుణ్యం సంపాదించారు. విజ్ఞానఖనులయ్యారు. సద్గుణాలకు ఆటపట్టైనారు. ఉత్తమ విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలివి. రాముడు ఎప్పుడూ తల్లిదండ్రులసేవలో నిమగ్నమయ్యేవాడు. చిన్ననాటి నుండీ అన్నసేవయే మిన్నగా భావించేవాడు లక్ష్మణుడు. ఇతడు రామునికి బహిఃప్రాణం. భరత శత్రుఘ్నులు అన్యోన్య ప్రేమాభిమానాలు కలవారు.

కాలచక్రం తిరుగుతున్నది. ఒకనాడు దశరథుడు తన మంత్రులు పురోహితులు మొదలైన వారితో సమావేశమయ్యాడు. తన కుమారుల వివాహ ప్రస్తావన చేస్తున్నాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడ అడుగుపెట్టాడు మహాతేజశ్శాలియైన విశ్వామిత్ర మహర్షి. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడతడు. దశరథుడు ఎదురేగి సాదరంగా స్వాగతించాడు. అతిథిదేవోభవ – అతిథి దేవునితో సమానం. ఇది తెలిసిన దశరథుడు విశ్వామిత్రునకు సముచితరీతిన మర్యాదలు గావించాడు. ఊరకరారు మహాత్ములు. వినయపూర్వకంగా చేతులు జోడించి విశ్వామిత్రుని రాకకు కారణాన్ని అడిగాడు. తనపై కార్యభారం పెడితే నెరవేరుస్తానన్నాడు. దశరథుని వినయానికి మురిసిపోయాడు విశ్వామిత్రుడు. 'వశిష్ఠుని ఉపదేశాలను పొందిన వాడివి. నీవు ఇలాగే ప్రవర్తిస్తావ'ని మెచ్చుకొన్నాడు. మహాత్ముల మాటలు వింటే ఉత్తమ సంస్కారం అబ్బుతుంది.

విశ్వామిత్రుడు దశరథునితో తాను వచ్చిన పనిని తెలుపుతానన్నాడు. దానిని ఆచరించమన్నాడు. ఆడినమాట తప్పవద్దన్నాడు. అసలు విషయం చెప్పాడు. 'ఓ రాజా! నేనొక యజ్ఞాన్ని సంకల్పించాను. కాని మారీచ సుబాహులనే రాక్షసులు ఆ యజ్ఞానికి విఘ్నాలు కలిగిస్తున్నారు. వారిని కోపించడానికి, శపించడానికి శక్తివున్నా యజ్ఞదీక్షలో ఉన్నాను కాబట్టి అది నాకు తగనిపని (ఉచితానుచితాలు గ్రహించకుండా శక్తిని దుర్వినియోగపరచరాదు). అందుకై సత్యపరాక్రముడు, శూరుడు అయిన శ్రీరాముని పదిదినములపాటు నా వెంట పంపు. అతడే ఆ రాక్షసులను చంపగల సమర్థుడు. నా వెంట వచ్చి యాగ సంరక్షణ చేయడం వల్ల శ్రీరామునకు అనేకములయిన శ్రేయస్సులు కలుగుతాయి. శ్రీరాముని పరాక్రమమెట్టిదో నాకు బాగా తెలుసు. నాకే కాదు వశిష్ఠులవారికి, వామదేవాది మహర్షులకూ తెలుసు. వారంతా అంగీకరించిన తర్వాతే రాముని నాతో పంపమ'ని అన్నాడు.

ఈ మాటలు వింటుంటే దశరథుని గుండెలో రాయిపడ్డది. చేతులు జోడించి 'మహర్షీ! నా రాముడు పదహారేండ్లు కూడా నిండనివాడు. ధనుర్విద్య ఇంకా పూర్తికాలేదు. యుద్ధవిషయాలతో తగు పరిచయం లేనివాడు. కనుక దయచేసి నా రాముని కోరకండి. అంతగా కావాలంటే ధనుర్బాణపాణినై నేను మీ వెంటవస్తాను. మీ యాగాన్ని సంరక్షించే బాధ్యత నాది. ఇవన్నీ ఎట్లున్నా నా రాముని వదలి ఒక్క క్షణమైనా బ్రతుకలేను. మా నోముల పంట రాముడు. ఇంతకూ ఆ రాక్షసులు ఎవరి అండతో ఈ దుండగానికి ఒడిగట్టార'ని అడిగాడు.

విశ్వామిత్రుడు సమాధానమిస్తూ 'పౌలస్త్యవంశజుడైన విశ్రవసుడను ముని యొక్క కుమారుడు రావణాసురుడు. అతడు కుబేరుని సోదరుడు. అనేక రాక్షస బలాలు కలవాడు. బ్రహ్మఇచ్చిన అసాధారణ వరాలవల్ల అతని గర్వం ఇబ్బడిముబ్బడైంది. ముల్లోకాలను అల్లకల్లోలం చేస్తున్నాడు. అటువంటి వానికి యజ్ఞం భగ్నంచేయడమనేది అల్పంగా తోస్తున్నది. అందుకే ఇటువంటి

పనులలో పాల్గొనడు. మారీచసుబాహులు ఇతనిచే ప్రేరితులై యజ్ఞాలకు విఘ్నాలను కలిగిస్తున్నార'నగానే దశరథుడు మరింత భయపడ్డాడు. యుద్ధంలో యమునితో సమానులైన వారి నెదుర్కోవడానికి నా చిన్నిపాపని పంపను. నేను కూడా యుద్ధ విషయంలో అశక్తుడన'ని పలికాడు.

దశరథుని మాటలకు విశ్వామిత్రుడు అగ్గిమీద గుగ్గిలమైనాడు. 'ఇచ్చినమాట తప్పటం మీ ఇంటా వంటా లేదు. నీవందులకు సిద్ధపడితే రిక్తహస్తాలతో తిరిగి వెళతాను. మీరు సుఖంగా ఉండండి' అన్నాడు విశ్వామిత్రుడు. పరిస్థితి తీవ్రతను గమనించాడు వశిష్ఠమహర్షి. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని దశరథునికి హితవు పలికాడు. మాట నిలబెట్టుకోని వానికి ధర్మకార్యములాచరించిన ఫలం నశిస్తుందని హెచ్చరించాడు. వివిధాస్త్ర ప్రయోగ దక్షుడైన విశ్వామిత్రుని వెంట రాముని పంపడంలో సంశయానికి తావుండరాదన్నాడు. రాముని పంపితే మేలు జరుగుతుందని సుతిమెత్తగా సూచించాడు.

వశిష్ఠుని హితవచనాలకు దశరథుడు తలొగ్గాడు. రామలక్ష్మణులను పిలిపించాడు. కౌసల్యతో కలిసి ఆశీర్వదించాడు. ప్రశాంతమైన మనస్సుతో విశ్వామిత్రునకు అప్పగించాడు.

విశ్వామిత్రుని వెంట ధనుర్ధారియై రాముడు నడుస్తున్నాడు. లక్ష్మణుడు అనుసరిస్తున్నాడు. సరయూనదీ తీరం వెంబడి చాలా దూరం ప్రయాణించారు ముగ్గురూ. తరువాత రామలక్ష్మణులకు 'బల' 'అతిబల' విద్యలనుపదేశించాడు విశ్వామిత్ర మహర్షి. వీటి ప్రభావం వల్ల అలసట, ఆకలిదప్పులుండవు. రూపకాంతులు తగ్గవు. నిదురలో ఉన్నా, ఏమరుపాటుతో ఉన్నా రాక్షసులేమీ చేయలేరు. ముల్లోకాల్లో ఎదురొడ్డి నిలచేవారుండరు.

రాముడు గురుసేవలో నిమగ్నమయ్యాడు. విశ్వామిత్రుని పాదములొత్తాడు. ఇతర సేవలు చేశాడు. గురుసేవ విశేష ఫలితాన్నిస్తుంది. సరయూనదీ తీరంలోనే వారు ఆ రాత్రి నిద్రించారు.

తెల్లవారుతోంది. విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు మేల్కొలుపు పలికాడు.

కౌసల్యా సుప్రజారామ పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్.

'కౌసల్యాదేవి సత్సంతానమైన ఓ రామా! తూర్పున ఉషఃకాంతులు ప్రసరిస్తున్నాయి. నిదురలేచి నిత్యకర్మలను ఆచరించమ'న్నాడు. గురువాక్యం శిరసావహించాడు రాముడు లక్ష్మణునితో కలసి. మళ్ళీ ప్రయాణం కొనసాగింది. సరయూ గంగానదుల సంగమ ప్రదేశాన్ని చేరుకున్నారు. అక్కడి విశేషాలను గురుముఖతః తెలుసుకున్నారు. జ్ఞానాన్ని పొందడంలో నిరంతరం అప్రమత్తులై ఉండడం ఉత్తమ విద్యార్థుల లక్షణం.

ప్రయాణం సాగుతున్నది. 'మలద', 'కరూశ' అనే జనపదాలకు చేరుకున్నారు. ఇంద్రుని అనుగ్రహ విశేషంచేత ఈ ప్రాంతాలు ధనధాన్యాల సమృద్ధిని కలిగి ఉండేవి. కాని 'తాటక' అనే యక్షిణి ఈ ప్రాంతాలకు వచ్చి విధ్వంసాన్ని సృష్టించింది. పుట్టుకతోనే వేయి ఏనుగుల బలం కలిగిన ఈమెను ఎవరూ ఎదిరించలేకపోతున్నారు. 'అగ్నికి ఆజ్యంతోడైనట్లు' ఈమెతోబాటు ఈమె కుమారుడు 'మారీచుడు' విరుచుకపడుతూ ఈ జనపదాలను అతలాకుతలం చేస్తున్నాడు. దుష్టురాలైన తాటకను వధించమని రామునితో అన్నాడు విశ్వామిత్రుడు. ఒక్కక్షణం రాముడు మౌనముద్రదాల్చాడు. రాముని భావం గ్రహించాడు విశ్వామిత్రుడు. 'స్త్రీని ఎలా చంపాలనే సంశయం వద్దు. అధర్మపరాయణయైన తాటకను చంపితే దోషం రాద'ని కర్తవ్యముపదేశించాడు. వెంటనే రాముడు దృఢనిశ్చయుడై అంజలి ఘటించాడు. 'మీరు చెప్పినట్లుగానడచుకొమ్మని మానాన్నగారు నన్ను ఆదేశించారు. వారి ఆజ్ఞ నాకు శిరోధార్యమ'ని పితృవాక్య పరిపాలనాసక్తిని చాటాడు. అలాగే గురువు ఆజ్ఞను పాలించుట శిష్యునిగా తన కర్తవ్యమని భావించి తాటకవధకు ఉద్యుక్తుడైనాడు.

వికృతాకారంతో విరుచుకుపడుతున్న తాటక చేతులను తన నిశిత బాణాలచే ఖండించాడు రాముడు. అయినా ఆవేశంతో మీదికి వస్తున్న తాటక ముక్కు చెవులను కోసివేశాడు లక్ష్మణుడు. తాటక ఆవేశం రెండింతలైంది. తాను కనబడకుండా వాళ్ళపై రాళ్ళ వానకురిపిస్తున్నది. ఇదంతా గమనిస్తున్నాడు విశ్వామిత్రుడు. సంధ్యాకాలం సమీపిస్తున్నది. ఈలోపే తాటకను పరలోకానికి పంపమని పురమాయించాడు. సంధ్యాకాలంలో రాక్షసులు మహాబలాన్ని పొందుతారు. ఎదుర్కోవడం కష్టం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాముడు శబ్దవేధి విద్యను ప్రదర్శిస్తూ బాణ ప్రయోగం చేశాడు. క్షణకాలంలో తాటక నేలపైబడి ప్రాణాలను వదిలింది. తాటక వధతో దుష్ట సంహారానికి శ్రీకారం చుట్టాడు రాముడు. ఇంద్రాది దేవతలు రాముని స్తుతించారు. సంతుష్టుడైన విశ్వామిత్ర మహర్షి రామునకు ఎన్నో దివ్యాస్త్రాలను అనుగ్రహించాడు. గురువు అనుగ్రహిస్తే ఇవ్వలేనిదేమిటి? పొందలేనిదేమిటి?

రామలక్ష్మణ సహితంగా విశ్వామిత్రుడు 'సిద్ధాశ్రమం' చేరుకున్నాడు. అదే అతని యజ్ఞభూమి. రామలక్ష్మణులు వినయంగా చేతులు జోడించి గురువుగారిని యజ్ఞదీక్షను స్వీకరించమని ప్రార్థించారు. మన్నించాడు మహర్షి. యజ్ఞదీక్షితుడయ్యాడు. మరునాడే యజ్ఞం ప్రారంభమైంది. ఆరు రోజులపాటు సాగే ఈ యజ్ఞ విషయంలో అత్యంత జాగరూకులై ఉండమని రామలక్ష్మణులకు సూచించారు మునులు. ఐదురోజులైంది. కంటిమీద కునుకులేకుండా యజ్ఞాన్ని కాపాడుతున్నారు రామలక్ష్మణులు. కర్తవ్యాన్ని నెరవేర్చడంలో ఇంత నిష్ఠ ఉండాలి. చివరిరోజు ఉన్నట్టుండి ఒక్కసారిగా యజ్ఞకుండంనుండి జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఇది రాక్షసుల రాకకు సూచన.

మారీచ సుబాహులు అనుచరులతో వచ్చారు. యజ్ఞవేదిక పరిసరాలు రక్తవర్షంతో తడిసి ముద్దయ్యాయి. రాముడు 'శీతేషువు' అన్న మానవాస్త్రాన్ని మారీచునిపై ప్రయోగించాడు. దాని దెబ్బకు మారీచుడు నూరు యోజనాల దూరం ఎగిరి సముద్రంలో పడిపోయాడు. స్పృహకోల్పోయి గిరగిరా తిరుగుతూ కొట్టుకుపోతున్నాడు. మరు నిముషంలో ఆగ్నేయాస్త్రంతో సుబాహుని వక్షస్థలాన్ని ప్రక్కలు చేశాడు. వాయవ్యాస్త్రంతో మిగతా రాక్షసుల భరతంపట్టాడు. రాక్షసబాధతొలగింది. యజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. విశ్వామిత్రుడు సంతోషించాడు. సమర్థులైన శిష్యులను చూసి ఏ గురువు సంతోషించడు?

మరునాడు ఉదయాన్నే రామలక్ష్మణులు విశ్వామిత్రుని ఎదుట వినయంతో నిలిచారు. ఇంకా ఏమి చేయాలో ఆజ్ఞాపించమన్నారు. విశ్వామిత్రుడు 'ఓ రామా! మిథిలానగర ప్రభువు, పరమధార్మికుడైన జనక మహారాజు ఒక యజ్ఞాన్ని చేయ సంకల్పించాడు. మనం అక్కడకి వెళదాం. అక్కడ అద్భుతమైన ఒక మహాధనుస్సుంది. నీవు చూడవచ్చునన్నాడు. సంసిద్ధులయ్యారు రామలక్ష్మణులు. మునిననుసరిస్తూ మిథిలవైపుగా ముందుకు సాగుతున్నారు.

అడుగులతోపాటు మాటలూ సాగుతున్నాయి. రాముని కోరిక మేరకు తమ వంశ పుట్టు పూర్వోత్తరాలను వివరించాడు విశ్వామిత్రుడు. ఆ రాత్రి శోణానదీ తీరంలో విశ్రమించారు. మరునాడు పవిత్ర గంగానదిని దర్శించారు. స్నానాలాచరించి విద్యుక్త ధర్మాలను నెరవేర్చారు. గంగా వృత్తాంతాన్ని వినగోరుతున్నానని వినయంగా అడిగాడు రాముడు. వినిపించాడు విశ్వామిత్రుడు. జిజ్ఞాసులైన శిష్యులు, విజ్ఞానియైన గురువు – ఇక జ్ఞాన ప్రసారానికి అడ్డుంటుందా?

పాతాళంలో బూడిదకుప్పలై పడివున్న తన పితరులైన సగరులకు ఉత్తమగతులు కల్పించడానికి సంకల్పించాడు భగీరథుడు. అందుకు ఒకటే మార్గం గంగను వారి బూడిదకుప్పలపై ప్రవహింపజేయడం. కాని ఆకాశంలోని గంగను పాతాళానికి దింపడం ఒక పట్టాన జరిగేపనేనా? అయినా దృఢసంకల్పానికి అసాధ్యమైనది లేదు. భగీరథుడు తీవ్రమైన తపస్సుచేశాడు. బ్రహ్మను, శివుని మెప్పించాడు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సంకల్పం నుండి పక్కకు తప్పుకోలేదు. గంగను పాతాళందాకా తీసుకువెళ్ళడంలో సఫల మనోరథుడయ్యాడు. అందుకే పట్టుదల విషయంలో 'భగీరథ ప్రయత్నం' అన్న జాతీయం ఏర్పడింది. భగీరథుని వంశంలోని వాడే రాముడు.

గంగావతరణం గూర్చి విశ్వామిత్రుడు రామునకు చెప్పడంలో ఒక ఆంతర్యముంది. తన పూర్వీకులు ఎంతగొప్పవారో తెలుసుకుని దానికనుగుణంగా నడవడం. పితరులపట్ల ఎంత భక్తి ప్రపత్తులుండాలో తెలపడం. పట్టిన పని ఫలవంతమయ్యేవరకు

పట్టుదల ఎలావుండాలో చెప్పడం. అయితే ఇవన్నీ నేరుగా చెప్పలేదు విశ్వామిత్రుడు. అయినా ఆంతర్యాన్ని గ్రహించాడు రాముడు. ఇదే ఉత్తమ గురుశిష్యుల వ్యవహారం.

మిథిలానగర సమీపానికి చేరుకున్నారు విశ్వామిత్ర రామలక్ష్మణులు. అక్కడ ఒక ఆశ్రమాన్ని చూశాడు రాముడు. అది పాతదైనా అందంగా అగుపిస్తున్నది. కాని జన సంచారమే లేదు. ఏమిటీ చిత్రమని అడిగాడు రాముడు. అది గౌతమ మహర్షి ఆశ్రమమని, ఆ కథనంతా వివరించాడు విశ్వామిత్రుడు. 'మహాతపస్సంపన్నుడైన గౌతమ మహర్షి తన భార్యయైన అహల్యతో ఈ ఆశ్రమంలో ఉండేవాడు. ఒకొనొక సందర్భంలో అహల్య అపరాధం చేసినదని భావించి ఆగ్రహోదగ్రుడయ్యాడు గౌతముడు. వేల సంవత్సరాలు అన్నపానాదులు లేక వాయువునే ఆహారంగా తీసుకుంటూ ఈ ఆశ్రమంలోనే బూడిదలో పడివుండమని శపించాడు. ఎవ్వరికీ కనబడకుండా ఉంటావన్నాడు. రాముని రాకతో శాపవిముక్తి కలిగి నిజరూపాన్ని పొందుతావన్నాడు. కనుక రామా! గౌతమాశ్రమంలో కాలుమోపి అహల్యకు శాపవిముక్తి కలిగించుమ'ని విశ్వామిత్రుడు ఆజ్ఞాపించాడు.

కఠోరదీక్షలో ఉండి బూడిదచేకప్పబడిన అహల్య పొగచే కప్పబడిన అగ్ని తేజస్సువలె ఉంది. ఆ మహాత్మురాలిని రాముడు చూశాడు. రాముని దర్శనంతో ఆమెకు శాపవిముక్తి కలిగింది. అహల్యా గౌతములు రాముని యథావిధిగా గౌరవించారు. వారి సత్కారాలందుకొని రాముడు విశ్వామిత్రుని వెంట లక్ష్మణ సహితుడై మిథిలా నగరానికి బయలుదేరాడు.

మిథిలానగరంలో ప్రభువైన జనకమహారాజు వీరిని సముచితంగా సమాదరించాడు. మిథిలలో అహల్యా గౌతముల పెద్ద కుమారుడైన శతానందుడు రామదర్శనం చేసుకున్నాడు. తన తల్లినుద్ధరించినందులకు కృతజ్ఞతాంజలులు సమర్పించాడు. మహాతపశ్శాలియైన విశ్వామిత్రుని అనుగ్రహం పొందగలగడం చాలా విశేషమని రాముని మెచ్చుకున్నాడు. విశ్వామిత్ర మహర్షి అసాధాణ శక్తిసామర్థ్యాలను వివరించాడు శతానందుడు. కొన్ని సందర్భాలలో మనతోవున్నవారి గొప్పదనం మనకే తెలియదు.

మరునాడు ప్రాతఃకాలాన జనకుడు విశ్వామిత్ర రామలక్ష్మణులను ఆహ్వానించాడు. కర్తవ్యోపదేశం చేయవలసిందిగా విశ్వామిత్రుని ప్రార్థించాడు. అప్పుడు ప్రత్యుత్తరమిస్తూ విశ్వామిత్రుడు 'వీరు దశరథమహారాజు కుమారులు. జగత్ప్రసిద్ధులైన వీరులు. మీ వద్దనున్న ధనుస్సును చూడాలనుకుంటున్నారు. దానిని చూపించండి. శుభం జరుగుతుంది. వాళ్ళ ముచ్చటా తీరుతుందన్నాడు. అప్పుడు జనకుడు తనవద్దనున్న 'శివధనుస్సు' చరిత్రను వివరించాడు. యాగం కొరకు భూమిని దున్నుచుండగా అమ్మాయి దొరికిందని, నాగటిచాలున దొరికినందుకు 'సీత'గా ఆమె ప్రసిద్ధికెక్కిందని తెలిపాడు. ఈమెను పరాక్రమవంతునికివ్వాలన్న తన అభిమతాన్ని వెలిబుచ్చాడు. శివధనుస్సును ఎక్కుపెట్టగలవాడే సీతకు తగిన భర్త అన్నాడు. గతంలో ఎందరో రాజులు వచ్చి శివధనుస్సు ఎక్కుపెట్టడానికి విఫలప్రయత్నం చేశారని, ఎక్కుపెట్టడం మాట ఎలా ఉన్నా కనీసం కదలించలేకపోయారన్నాడు.

ఇదంతావిని శివధనుస్సును తెప్పించమన్నాడు విశ్వామిత్రుడు. సరేనన్నాడు జనకుడు. బలిష్ఠులు, దీర్ఘకాయులైన ఐదువేల మంది అతికష్టం మీద శివధనుస్సుతో కూడిన పేటికను తీసుకువచ్చారు. విశ్వామిత్ర మహర్షి అనుమతితో ధనుస్సు మధ్యభాగాన్ని అవలీలగా పట్టుకున్నాడు రాముడు. ధనుర్విద్యయందు ఆరితేరిన రాముని చేయి సోకినంతనే ఆ ధనుస్సు వంగింది. వింటినారిని సంధించాడు. వేలకొలది సదస్యులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. అల్లెతాడును ఆకర్ణాంతము లాగాడు రాముడు. పిడుగుపాటువలే భయంకరశబ్దాన్ని చేస్తూ విల్లు ఫెళ్ళున విరిగింది. విశ్వామిత్రుడు, జనకుడు, రామలక్ష్మణులుతప్ప మిగతావారంతా మూర్ఛపోయారు.

ఇచ్చినమాట ప్రకారం జనకుడు సీతారాముల వివాహం జరపడానికి సంసిద్ధుడయ్యాడు. దశరథమహారాజుకు వర్తమానం పంపాడు. అయోధ్య నుండి అందరూ తరలివచ్చారు. జనకుడు తన కుమార్తెలైన సీతను రామునకు, ఊర్మిళను లక్ష్మణునకు, తన తమ్ముడు కుశధ్వజుని కుమార్తెలైన మాండవిని భరతునకు, శ్రుతకీర్తిని శత్రుఘ్నునకు ఇచ్చి వివాహం జరిపించాడు. అంగరంగవైభవంగా కల్యాణం జరిగింది.

మరునాడు విశ్వామిత్ర మహర్షి కొత్త దంపతులను ఆశీర్వదించి, దశరథ జనకమహారాజులను వీడ్కొని హిమాలయపర్వతానికి వెళ్ళాడు. తరువాత బంధుమిత్ర సమేతంగా దశరథుడు అయోధ్యకు బయలుదేరాడు.

దారిలో వీరికి పరశురాముడు ఎదురుగా వచ్చాడు. అతడు ప్రళయకాల రుద్రునివలే ఉన్నాడు. గండ్రగొడ్డలిని, ధనుర్బాణములను ధరించాడు. ప్రజ్వరిల్లే అగ్నివలే భయంకరంగా ఉన్నాడు. క్షత్రియుడంటే ఇతనికి సరిపడదు. పూర్వం క్షత్రియుడైన కార్తవీర్యార్జునుడు ఇతని తండ్రియైన జమదగ్నిని చంపాడు. అప్పటి నుండి క్షత్రియ నిర్మూలనానికి కంకణం కట్టుకున్నాడు. ఇరవై ఒక్కసార్లు భూ ప్రదక్షిణం చేసి ఎంతో మంది క్షత్రియులను తన గండ్రగొడ్డలికి బలియిచ్చాడు.

పరశురాముడు శ్రీరామునితో తనవద్దనున్న వైష్ణవ ధనుస్సునెక్కుపెట్టమని సవాలు విసిరాడు. సరేనని రాఘవుడు అవలీలగా ఎక్కుపెట్టాడు. ఓటమినంగీకరించిన పరశురాముడు తత్క్షణమే మహేంద్రపర్వతానికి వెళ్ళిపోయాడు. ఆహా! అహంకారమెంత అనర్థదాయకం.

దశరథుడు సపరివారంగా అయోధ్యకు చేరుకున్నాడు. భరతుడు శత్రుఘ్నునితో మేనమామ వెంట తాతగారింటికి వెళ్ళాడు. రామలక్ష్మణులు తల్లిదండ్రుల సేవలో, గురువుల సేవలో తరిస్తున్నారు.



అయోధ్యా కాండం



దశరథునికి పుత్రులపై ఎనలేని ప్రేమ. తన శరీరం నుండి పుట్టిన నాలుగు చేతులవలే వీరిని భావించాడు. ఈ నలుగురు కుమారులలో భరత శత్రుఘ్నులు దేశాంతరమందు ఉండడంవల్ల బెంగపెట్టుకున్నాడు. వాళ్ళను మళ్ళీమళ్ళీ తలచుకుంటున్నాడు. దశరథునికి శ్రీరామునిపై మక్కువ ఎక్కువ. దానికి కారణం శ్రీరాముడు సద్గుణరాశి కావడమే. రూపంలోనూ గుణంలోనూ శ్రేష్ఠుడు. మహావీరుడు. మెత్తగా మాట్లాడుతాడు. శరణన్నవారిని కాపాడువాడు. కోపము, గర్వము లేనివాడు. సత్యం పలికేవాడు. పరుల సంపదను ఆశించనివాడు. దీనులను ఆదుకొనేవాడు. కాలాన్ని వృథాచేయకుండా జ్ఞానులతో సజ్జనులతో వివిధ విషయాలను చర్చించేవాడు. వినయశీలి. తల్లిదండ్రులు, గురువుల పట్ల నిశ్చలభక్తికలవాడు. సోమరితనం, ఏమరుపాటులేనివాడు. కళలలో ఆరితేరినవాడు. అసూయ, మాత్సర్యం లేనివాడు. ప్రజలపట్ల వాత్సల్యం కలవాడు... ఇన్ని మంచిగుణాలకు పాదైన శ్రీరాముడంటే తల్లిదండ్రులకే కాదు, ప్రజలందరికీ పరమ ప్రీతి.

సకల గుణాభిరాముడైన శ్రీరాముడు తమకు ప్రభువు కావాలని ప్రజలకోరిక – దీనికి తోడు 'నేను జీవించివున్నప్పుడే శ్రీరాముడు రాజైతే ఎంత బాగుంటుంది? నేనెంతగా సంతోషిస్తానో?' అని ఉవ్విళ్ళూరుచున్నాడు దశరథుడు. మంత్రులతో ఆలోచించి శ్రీరాముని యువరాజును చేయడానికి నిశ్చయించుకున్నాడు. రాజ్యంలోని ప్రముఖులను, జానపదులను, సామంతరాజులను, ప్రజలను పిలిపించాడు. శ్రీరాముని యువరాజ పట్టాభిషేక విషయాన్ని వెల్లడించాడు. ఇది అందరకు నచ్చినట్లేతేనే అనుమతినివ్వమన్నాడు. దీనికన్నా ప్రజలకు మేలుకలిగించేది ఏదైనా ఉన్నా ఆలోచించి చెప్పమన్నాడు. ప్రజానురంజకపాలన అంటే ఇదే. సభలోనివారంతా శ్రీరామ పట్టాభిషేకాన్నే సమర్థిస్తూ హర్షధ్వానాలు చేశారు.

రాజాజ్ఞమేరకు వశిష్ఠుడు మంత్రులకు, అధికారులకు పట్టాభిషేకమహోత్సవానికి ఏర్పాట్లను చేయవలసిందని ఆదేశించాడు. దశరథుడు శ్రీరాముని పిలిపించాడు. శ్రీరాముడు వచ్చి తండ్రికి పాదాభివందనం చేశాడు. దశరథుడు శ్రీరాముని అక్కున జేర్చుకున్నాడు. బంగారు సింహాసనంమీద కూర్చోబెట్టాడు. చిరునవ్వులు చిందిస్తూ 'రామా! నీ సుగుణాలతో ప్రజలను మెప్పించావు. కనుక నీవు యువరాజ పట్టాభిషేకం చేసుకోవాలి. నీ బాధ్యత పెరుగుతున్నది. మరింత వినయవంతుడివి కావాలి. జితేంద్రియుడివి కావాలి... అంటూ రాజధర్మాలను నూరిపోశాడు. తండ్రివద్ద సెలవుతీసుకొని తల్లియైన కౌసల్య వద్దకు వచ్చాడు శ్రీరాముడు. ఆమె ఆశీస్సు లందుకున్నాడు. వశిష్ఠుని ఆదేశం మేరకు పట్టాభిషేకానికి అనువుగా సీతతోకూడి ఉపవాస దీక్షను గైకొన్నాడు.

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికై అయోధ్య తననుతాను అలంకరించుకుంది. నగరమంతా ఆనందశోభ తాండవిస్తున్నది. ఇది చూసిన మంథర కంట్లో నిప్పులు పోసుకున్నది. కైకేయి అత్తవారింటికి వచ్చినప్పుడు వెంటవచ్చిన అరణపుదాసి మంథర. పరుగు పరుగున కైకేయి వద్దకు వెళ్ళి పట్టాభిషేక విషయం చెప్పింది. కైకేయి చాలా ఆనందించి, వార్త చెప్పినందుకు మంథరకు విలువైన బహుమానాన్నందించింది. నిశ్చేష్ఠురాలైంది మంథర. దుఃఖించవలసిన సమయంలో ఎందుకు సంతోషిస్తున్నావని

నిలదీసింది కైకేయిని. 'నాకు రాముడు, భరతుడు ఇద్దరూ సమానమే. రాముడు పట్టాభిషిక్తుడు అవుతున్నాడంటే అంతకన్నా నాకు ఆనందమేముంటుందన్న'ది కైకేయి.

కైకేయి మాటలు విని ముక్కున వేలేసుకుంది మంథర. 'రాముడు రాజైతే కౌసల్య రాజమాత అవుతుంది. అప్పుడు మాతోపాటు నీవు కూడా ఆమెకు దాసివవుతావు. రామునికి నీ కొడుకు దాస్యం చేయాల్సివస్తుంది. రాముని సంతానానికే తరువాతి కాలంలో రాజ్యాధికారం వస్తుంది. కాని భరతుని సంతానానికి రావడం శూన్యం. కనుక భరతునికి రాజ్యాధికారం దక్కేటట్లు, రాముడు అడవుల పాలయ్యేటట్లు చూడమ'ని దుర్బోధ చేసింది. కైకేయి మనసుమారింది. చెప్పుడు మాటలు చేటుకు కారణం. తగిన ఉపాయాన్ని చెప్పమని మంథరను కోరింది కైకేయి. గతంలో దశరథుడు ఇచ్చిన రెండు వరాలను ఇప్పుడుపయోగించుకొమ్మని సూచించింది మంథర. ఈ సూచన మేరకు దశరథుని వలన వరాలు పొందడానికి కోపగృహంలోకి ప్రవేశించింది కైకేయి.

దశరథుడు శ్రీరామ పట్టాభిషేక వార్తను తెలపడానికి కైకవద్దకు వచ్చాడు. కటికనేలపై ఉన్నది కైకేయి. తీవ్రమైన అలకతోనున్నది. దశరథుడు ఓదార్చడానికి పూనుకున్నాడు. కాని అతని ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఏం చేయాలో పాలుపోలేదు. విషయమడిగాడు. అదే అదనుగా భావించింది కైకేయి. 'నాకొక కోరికవుంది. దానిని మీరే తీర్చాలి. అలా తీరుస్తానని మాట ఇవ్వాల'న్నది. ప్రాణానికి ప్రాణమైన శ్రీరామునిపై ఒట్టు పెట్టి సరేనన్నాడు దశరథుడు. ఇంకే మనసులోని మాటను చెప్పేసింది. గతంలో మీరిచ్చిన రెండు వరాలను ఇప్పుడు కోరుకుంటున్నాను. శ్రీరాముని కొరకు ఏర్పాటుచేసిన సన్నాహాలతో భరతునికి పట్టాభిషేకం చేయాలి. శ్రీరాముడు నారచీరెలు, జింకచర్మం ధరించి, జటాధారియై దండకారణ్యానికి వెళ్ళి తాపసవృత్తిలో పదునాల్గు సంవత్సరాలు ఉండాలి. శ్రీరాముడు ఇప్పుడే, నేను చూస్తుండగానే బయలుదేరాలి' అని కోరింది.

కైకేయి మాటలకు స్పృహకోల్పోయాడు దశరథుడు. కొంతసేపటికి తేరుకున్నాడు. తన్నుకొని వస్తున్న దుఃఖంతో 'కైకా! రాముడు నీకేం అపకారం చేశాడు. భరతునికన్నా ఎక్కువగా నిన్ను సేవించాడు. అటువంటి వాణ్ణి అడవుల పాల్జేయమని అడగడానికి నీకు నోరెలా వచ్చింది? నా రాముని విడిచి నేను ఒక్క క్షణమైనా బ్రతుకలేను. చేతులు జోడిస్తున్నా. నీ పాదాలు పట్టుకొంటా... రాముని మాత్రం నాకు దూరం చేయవద్ద'ని బ్రతిమాలాడు. కఠినశిల కన్నీటికి కరుగుతుందా? కైకేయి మారలేదు.

శ్రీరాముని తోడ్కొని రావలసిందిగా కైకేయి సుమంత్రుని ఆజ్ఞాపించింది. రాజాజ్ఞకావాలన్నాడు సుమంత్రుడు. 'శ్రీరాముని చూడాలని ఉంది వెంటనే తీసుకురమ్మ'న్నాడు దశరథుడు. రాజాజ్ఞ పాటించబడింది. శ్రీరాముడు వచ్చి, దశరథునికి, కైకేయికి పాదాభివందనం చేశాడు. దశరథునికి మాటరావడం లేదు కన్నీళ్ళు తప్ప. తండ్రి బాధకు కారణమేమిటో తెలియక సతమతమవుతున్నాడు దాశరథి. కైకేయిని అడిగాడు. 'గతంలో నాకిచ్చిన రెండు వరాలను అడిగాను. నిన్ను దృష్టిలో ఉంచుకొని వాటిని ఉల్లంఘించేందుకు చూస్తున్నారు. వాటిని నీవు పాటిస్తానని ప్రమాణంచేస్తే చెపుతాను' అన్నది కైకేయి.

రాముడు క్షణం కూడా ఆలోచించలేదు 'నా తండ్రే నాకు గురువు, పాలకుడు, హితుడు. అతడు ఆదేశించాలేకాని విషాన్ని తాగడానికైనా, సముద్రంలో దూకడానికైనా సిద్ధమే. తండ్రి గారి కోరిక ఏమిటో చెపితే తప్పక పాటిస్తాను. రాముడు ఆడినమాట తప్పడ'ని పలికాడు. శ్రీరాముని పితృభక్తి, సత్యానురక్తి అలాంటిది.

కైకేయి రెండు వరాల గురించి చెప్పింది. రాముని ముఖంలో ఎలాంటి మార్పులేదు. సంతోషాలకు పొంగకపోవడం, బాధలకు కుంగకపోవడం స్థితప్రజ్ఞుని లక్షణం. 'అమ్మా! నీవు చెప్పినట్లే చేస్తా. భరతుడంటే నాకు ప్రాణం. అతని పట్టాభిషేకాన్ని గూర్చి నాన్నగారు నాకు చెపితే కాదంటానా? ఆయన మాటలను పాటించకుండా ఉండగలనా? నాకు రాజ్యకాంక్షలేదు. తండ్రికి సేవచేయడం, ఆయన ఆజ్ఞలను పాటించడంకన్నా మించిన ధర్మాచరణం మానవులకు ఇంకొకటి లేనేలేదు. నాన్నగారు నన్ను స్వయంగా ఆదేశించకున్నా మీరు చెప్పారు కదా! అదిచాలు. నేనిప్పుడే దండకారణ్యానికి బయలుదేరుతాన'న్నాడు శ్రీరాముడు.

శ్రీరాముని మాటలు విన్న దశరథుడు శోకభారంతో స్పృహకోల్పోయాడు. శ్రీరాముడు తండ్రి పాదాలకు ప్రణమిల్లాడు. కైకేయి పాదాలకు నమస్కరించాడు. అంతఃపురం నుండి బయటకు వచ్చాడు. లక్ష్మణునితో కలసి కౌసల్యామాతను దర్శించుకున్నాడు. తన అరణ్యవాస విషయం చెప్పాడు. ఆ మాటలు వింటూనే కౌసల్య గండ్రగొడ్డలిచే నరకబడ్డ మద్దిచెట్టులా నేలపై పడిపోయింది. అంతులేని ఆవేదనకు లోనైంది. వనవాసానికి వెళ్ళవద్దని కౌసల్యా లక్ష్మణులు పరిపరివిధాల శ్రీరామునకు నచ్చజెప్పజూశారు. కాని శ్రీరాముడు తండ్రి మాటకే తలొగ్గాడు. వెళ్ళక తప్పదన్నాడు. కైకేయిపట్ల తనకు ఏమాత్రం అనాదరభావం లేదన్నాడు. తన పట్టాభిషేకం ఆగిపోవడానికి కైకేయి కారణం కాదని, విధి ప్రేరణచే ఆమె అట్లా మాట్లాడిందని సమర్థించాడు. తనకు రాజ్యమైనా వనవాసమైనా సమానమేనని ప్రకటించాడు.

పుత్ర వ్యామోహంతో కౌసల్య శ్రీరాముని వెంట వనవాసానికి సిద్ధపడింది. కాని భర్తను వదలిరావడం ధర్మంకాదన్నాడు శ్రీరాముడు. ఎలాగో మనసును స్థిమితపరచుకొని కౌసల్య శ్రీరాముని దీవించింది. 'రామా! సత్పురుషుల బాటలో నడువు. నీ ధర్మమే నీకురక్ష. నీవు చేసిన తల్లిదండ్రుల సేవ, నీ సత్య బలం నీకు రక్షగా ఉంటాయి. నీకు ఎలాంటి బాధలు కలుగకుండుగాక' అని శుభాశీస్సులందించింది.

అక్కడి నుండి సీతామందిరానికి వెళ్ళాడు శ్రీరాముడు. తన వనవాస విషయం చెప్పాడు. అయోధ్యలో ఎలా మసలుకోవాలో సీతకు తెలిపాడు. కాని సీత రామునివెంటే వనవాసానికి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. ఆ మాటే శ్రీరామునితో చెప్పింది. 'మీరు లేక స్వర్గసుఖాలు లభించినా ఇష్టపడను. పతిని అనుసరించడమే సతికి ధర్మం, సుఖప్రదం, శుభప్రదమ'ని తెలిపింది. శ్రీరాముడు అంగీకరించక తప్పలేదు. తనను కూడా వెంట తీసుకెళ్ళమని లక్ష్మణుడు శ్రీరాముని ప్రాధేయపడ్డాడు. శ్రీరాముని సేవాభాగ్యం ముందు త్రిలోకాధిపత్యం కూడా చిన్నదేనని, సకలోపచారాలు చేసే అవకాశం తనకిమ్మని అభ్యర్థించాడు. సరేనన్నాడు శ్రీరాముడు. తల్లియైన సుమిత్రకు, ఆత్మీయులకు ఈ విషయం తెలిపి వారి ఆమోదాన్ని పొందమన్నాడు.

సీతారామలక్ష్మణులు దశరథుని దర్శించడానికి బయలుదేరారు. కాలినడకతో వస్తున్న శ్రీరాముని చూసి ప్రజలు బావురుమన్నారు. లక్ష్మణునివలె తామందరూ రాముని వెంట వెళ్లాలనుకొన్నారు. రాముడు ఉంటే చాలు అది అడవియైనా తమ పాలిటి అయోధ్యేననుకున్నారు. సీతారామలక్ష్మణులు దశరథుని మందిరానికి చేరుకున్నారు. దశరథుడు రాణులందరినీ రప్పించాడు. అందరూ విలపిస్తున్నారు కైకేయి తప్ప. దశరథుని మందిరం కన్నీటిశాల అయింది.

కైకేయి స్వయంగా తెచ్చి ఇచ్చిన నార చీరలను సీతారామలక్ష్మణులు ధరించారు. తల్లిదండ్రులకు నమస్కరించారు. సుమిత్ర లక్ష్మణునితో 'నాయనా, శ్రీరాముని నీ తండ్రియైన దశరథునిగా, సీతను నన్నుగా భావించు. అడవిని అయోధ్య అనుకో. సుఖంగా వెళ్ళి రమ్మ'ని దీవించింది. సుమంత్రుడు రథాన్ని సిద్ధంచేశాడు. సీతారామలక్ష్మణులు రథాన్ని ఎక్కారు. రథం వేగంగా ముందుకు సాగుతున్నది. శ్రీరాముని విడువలేక కొందరు పౌరులు ఆ రథానికి రెండువైపులా, వెనుక భాగంలో వేలాడారు. మంగళ వాద్యఘోషతో మార్మోగవలసిన అయోధ్య ఆర్తనాదాలతో నిండిపోయింది. దశరథుడు తీవ్రమైన బాధతో కౌసల్యామందిరానికి వచ్చాడు. కౌసల్యాదేవి శోకమూర్తివలే ఉంది. సుమిత్రాదేవి ఆమెను ఓదార్చింది.

శ్రీరాముని రథాన్ని నీడవలే అనుసరిస్తున్నారు ప్రజలు. అయోధ్యకు మరలిపొండని శ్రీరాముడు ఎంతగానో చెపుతున్నాడు. 'మీరే అయోధ్యకు రండి లేదా మేము మీ వెంట రావడానికి అనుమతించండి' అని వేడుకుంటున్నారు ప్రజలు. రథం తమసానదీ తీరానికి చేరింది. ఆ రాత్రి అందరూ అక్కడే విడిది చేశారు. తెల్లవారుతున్నది. అలసటచే పౌరులందరూ గాఢనిద్రలో ఉన్నారు. ఇంకా వాళ్ళను శ్రమపెట్టడం శ్రీరామునకు ఇష్టంలేదు. అందుకే వాళ్ళు నిద్రలేచేలోపే అక్కడి నుండి వెళ్ళాలని లక్ష్మణునితో అన్నాడు. సుమంత్రుని సారథ్యంలో సీతారామలక్ష్మణులు అక్కడి నుండి బయలుదేరారు. నిద్రలేచిన పౌరులు శ్రీరాముడు కనబడకపోవడంతో తికమకపడ్డారు. తమ మొద్దునిద్రను తామే నిందించుకున్నారు. చేసేదిలేక అయోధ్యకు తిరుగుముఖం పట్టారు.

రథం వేదశ్రుతి, గోమతీ, సనందికా నదులను దాటింది. కోసల దేశపు పొలిమేరలకు చేరుకుంది. అక్కడి నుండి అయోధ్యవైపుగా తిరిగి శ్రీరాముడు నమస్కరించాడు. ముందుకు సాగుతూ గంగా తీరానికి చేరుకున్నారు. ఆ తీరంలో శృంగిబేరపురమున్నది. 'గుహుడు' ఆ ప్రదేశానికి రాజు. అతడు శ్రీరామభక్తుడు. శ్రీరాముడు వచ్చాడన్న వార్త విని తన వారితో శ్రీరాముని దగ్గరకు బయల్దేరాడు. గుహుని చూసి రాముడు లక్ష్మణునితోపాటు ఎదురేగి కలుసుకున్నాడు. ఆ రాత్రి గుహుని ఆతిథ్యం తీసుకున్నాడు.

మరునాడు శ్రీరాముని ఆదేశం మేరకు గుహుడు నావను సిద్ధం చేశాడు. 'శ్రీరాముడు మర్రిపాలను తెప్పించాడు. వాటితో తనకు లక్ష్మణునకు జడలను సిద్ధపరచాడు. రామలక్ష్మణులు జటాధారులయ్యారు. సీతారామలక్ష్మణులు పడవ ఎక్కారు. అవతలి తీరానికి తీసుకువెళ్ళాలని నావికులకు సూచించాడు గుహుడు. శ్రీరాముడు సుమంత్రునికి, గుహునికి వెళ్ళడానికి అనుమతినిచ్చాడు. నావను ముందుకు సాగించవలసిందిగా నావికులను ఆదేశించాడు.

నది మధ్యలో నావ సాగుతున్నది. సీత గంగను ప్రార్థించింది. నావ దక్షిణ తీరానికి చేరింది. నావదిగిన శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై వనాలకు బయలుదేరాడు. శ్రీరాముని ఆదేశం మేరకు ముందు లక్ష్మణుడు వెనక సీత, ఆమె వెనక శ్రీరాముడు నడుస్తున్నారు. సాయంకాలానికల్లా భరద్వాజాశ్రమానికి చేరారు. ఇది గంగా యమున సంగమ ప్రదేశంలో ఉంది. ముని వారికి అతిథిసత్కారాలు చేశాడు. వనవాసకాలాన్ని ఆ ప్రాంతంలోనే గడపమని కోరాడు. కాని రాముడు సుతిమెత్తగా తిరస్కరించాడు.

జనులకు అందుబాటులో ఉండని, ఆశ్రమవాసానికి అనువైన ప్రదేశమేదైనా సూచించమని శ్రీరాముడు కోరాడు. పది క్రోసుల దూరంలో 'చిత్రకూటం' అనే పవిత్రమైన పర్వత ప్రదేశం ఉందని, మహర్షుల నివాసస్థానమైన అదే తగిన చోటని భరద్వాజుడన్నాడు. మహర్షి సూచననుసరించి యమునానదిని దాటి చిత్రకూటం చేరుకున్నారు సీతారామలక్ష్మణులు. అన్న ఆదేశం ప్రకారం అక్కడ నేరేడు కర్రలతో కుటీరాన్ని నిర్మించాడు లక్ష్మణుడు. సశాస్త్రీయంగా అందులోకి ప్రవేశించారు.

ఈ విషయాన్నంతా గూఢచారుల ద్వారా గుహుడు తెలుసుకున్నాడు. గుహుని ద్వారా సుమంత్రుడు గ్రహించాడు. సుమంత్రుడు గుహుని వద్ద సెలవు తీసుకొని అయోధ్యకు వెళ్ళాడు. దశరథుడు సుమంత్రుని ద్వారా రాముని విషయాలను తెలుసుకున్నాడు. కౌసల్యా దశరథుల ఆవేదనకు అంతులేదు. దశరథుడు గతంలో తాను మునిబాలకుని పొరబాటుగా చంపిన సంఘటనను, అతని తల్లిదండ్రులిచ్చిన శాపాన్ని గుర్తుచేసుకున్నాడు. అదే పుత్ర వియోగానికి కారణమన్నాడు. శ్రీరాముని ఎడబాటుకు మనసు కకావికలమైంది దశరథునికి. దుఃఖాగ్నికి తట్టుకోలేక గుండె చల్లబడింది. అర్ధరాత్రి తరువాత దశరథుడు అసువులు బాసాడు. అందరూ బావురుమన్నారు.

దశరథుని దేహాన్ని తైల ద్రోణిలో భద్రపరచారు. వసిష్ఠుని ఆజ్ఞమేరకు దూతలు భరత శత్రుఘ్నులను తీసుకురావడానికి వెళ్ళారు. ఏడురోజులు ప్రయాణం చేసి ఎనిమిదవనాడు అయోధ్యకు చేరుకున్నారు భరత శత్రుఘ్నులు. తండ్రి మరణానికి తల్లడిల్లాడు భరతుడు. తండ్రి అంత్య క్రియలను భరతుడు నిర్వర్తించాడు.

శ్రీరామ వనవాస విషయంలో తల్లిని తప్పుబట్టాడు భరతుడు. మంధరను చంపడానికి ఉద్యుక్తుడైన శత్రుఘ్నుడు భరతుని మాట విని విరమించుకున్నాడు. మంత్రులు భరతుని రాజ్యాధికారం చేపట్టమన్నారు. కాని భరతుడు అంగీకరించలేదు. 'పెద్దవాడైన శ్రీరాముడే రాజుకావాలి. ఆయనకు బదులు నేను పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తాను. చతురంగ బలాలను సిద్ధపరచండి. నేను వెళ్ళి శ్రీరాముని అయోధ్యకు తీసుకువస్తాను' అని తెలిపాడు.

భరతుడు అయోధ్యావాసులతో కూడి బయలుదేరాడు. శృంగిబేరపురం చేరాడు. గుహుడు భరతుని ఆంతర్యం తెలియక యుద్ధసన్నద్ధుడయ్యాడు. తీరా విషయం తెలిసి ఎదురేగి భరతుని ఆహ్వానించాడు. గుహుని సహకారంతో భరద్వాజాశ్రమం చేరుకున్నాడు భరతుడు. మహర్షి సత్కారాలంది చిత్రకూటం వైపు ప్రయాణించారందరు.

అడవిలో మృగముల అలజడి మొదలైంది. కారణమేమిటో చూడమన్నాడు లక్ష్మణునితో శ్రీరాముడు. వెంటనే లక్ష్మణుడు ఒక పెద్ద మద్ది చెట్టెక్కాడు. విషయం అర్థమైంది. చెట్టు దిగి శ్రీరాముని వద్దకు వచ్చాడు. 'భరతుడు దుర్బుద్ధితో ససైన్యంగా వస్తున్నాడు. మన ధనుర్బాణాలను సిద్ధంచేసుకుందామ'న్నాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుని ఆలోచనలో పొరపాటు ఉందని చెప్పాడు. భరతుడలాంటివాడు కాదన్నాడు. 'లక్ష్మణా! ఒకవేళ నీకు రాజ్యకాంక్ష ఉంటే చెప్పు భరతునికి చెప్పి ఆ రాజ్యాన్ని నీకే ఇప్పిస్తాన'నన్నాడు. ఇంతలో భరతుడు పర్ణశాలకు చేరుకున్నాడు. శ్రీరాముని చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. శత్రుఘ్నుడు శ్రీరాముని పాదాలపైబడ్డాడు. శ్రీరాముని కళ్ళ నుండి అశ్రుధారలు కురిశాయి. కొంతసేపటికి తేరుకున్నాడు. భరతుని కుశల ప్రశ్నలు వేశాడు. ప్రసంగవశాత్తు రాజనీతి ధర్మాలను బోధించాడు. శ్రీరాముడు తండ్రి మరణవార్త విని విలపించాడు. శ్రీరాముని అయోధ్యకు రమ్మని, రాజువుకమ్మని సవినయంగా ప్రార్థించాడు భరతుడు. కాని తండ్రిమాటే శిరోధార్యమని శ్రీరాముడు అంగీకరించలేదు. శ్రీరాముని నాస్తికవాదంతో ఒప్పింపజూచాడు జాబాలి. ఇతడు దశరథుని పురోహితుడు. కాని జాబాలి వాదాన్ని శ్రీరాముడు ఖండించాడు.

భరతుని అభ్యర్థన మేరకు శ్రీరాముడు పాదుకలను అనుగ్రహించాడు. అప్పుడు భరతుడు 'అన్నా! ఈ పాదుకల మీదనే రాజ్యపాలనాభారాన్ని ఉంచుతాను. ఈ పదునాలుగు సంవత్సరాలు నేనుకూడా జటలను ధరించి, నారచీరలు కట్టి, వనవాస నియమాలతో, నగరం వెలుపల ఉంటాను. పదునాల్గవ సంవత్సరం కాగానే నీ దర్శనం కాకుంటే అగ్ని ప్రవేశం చేస్తాన'న్నాడు. సరేనన్నాడు శ్రీరాముడు. ఆదర్శ సోదరభావమంటే ఇది. భరతుడు నందిగ్రామం చేరుకొని, పాదుకలకు పట్టాభిషేకం చేశాడు.

శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా అత్రిమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అత్రి అనసూయలు వీరికి సముచిత మర్యాదలు చేశారు. మహాపతివ్రతయైన అనసూయాదేవి సీతకు దివ్యవస్త్రాభరణాలనిచ్చింది. మునీశ్వరుల ఆశీస్సులు తీసుకొని సీతా రామ లక్ష్మణులు దండకారణ్యంలోకి ప్రవేశించారు.



అరణ్య కాండం



దండకారణ్యం పవిత్ర ప్రదేశం. ప్రశాంత ప్రదేశం. అక్కడ మునుల ఆశ్రమాలు ఎన్నో ఉన్నాయి. పక్షులు, మృగాలు – సకల ప్రాణులకు సురక్షితమైన ప్రాంతం అది. అక్కడ లోక క్షేమం కోసం యజ్ఞయాగాలు జరుగుతున్నాయి. ఆశ్రమ సముదాయాన్ని చూడగానే అల్లెతాడును ధనుస్సునుండి వేరుచేశాడు శ్రీరాముడు. అక్కడ వినయానికి తప్ప వీరత్వానికి అవకాశం లేదు. ఎక్కడ ఎట్లా ప్రవర్తించాలో తెలుసుకోవడమే ఉచితజ్ఞత. ఇది శ్రీరామునిలో సంపూర్ణంగా ఉంది.

సీతా రామ లక్ష్మణులకు మహర్షులు సాదర స్వాగతం పలికారు. ఆ సముదాయంలోని ఒక పర్ణశాలలో విడిది ఏర్పాటుచేశారు. మరునాడు ఉదయం నిత్యోచిత కర్మలను ముగించుకొని మహర్షులకు వీడ్కోలు పలికి సీతారామలక్ష్మణులు ప్రయాణాన్ని కొనసాగించారు.

వనం మధ్యకు చేరుకున్నారు. ఇంతలో వికృతాకారంలో ఉన్న విరాధుడనే రాక్షసుడు అమాంతంగా సీతారామలక్ష్మణుల పైకి విరుచుకుపడ్డాడు. రామలక్ష్మణులను తన భుజాలపై వేసుకొని తీసుకుపోసాగాడు. సీత గగ్గోలు పెడుతున్నది. రామలక్ష్మణులు విరాధుని రెండు భుజాలను నరికివేశారు. నేలపై కుప్పకూలాడు విరాధుడు. ముష్టిఘాతాలతో, మోకాళ్ళతో దాడిచేశారు రామలక్ష్మణులు. ఎంతకూ చావని విరాధుని గోతిలో పాతిపెట్టడానికి సంసిద్ధులయ్యారు. వెంటనే విరాధుడు తన పూర్వకథను వివరించాడు. తుంబురుడను గంధర్వుడైన తాను కుబేరుని శాపంచే రాక్షసుడిగా మారిన విషయం తెలిపాడు. శ్రీరాముని వల్ల శాపవిముక్తి కలుగుతుందన్న కుబేరుని మాటలను జ్ఞాపకం చేసుకున్నాడు. దగ్గరలోనే ఉన్న శరభంగ మహర్షిని దర్శించుకొమ్మని, శుభం జరుగుతుందని శ్రీరామునికి చెప్పాడు. తనను గోతిలో పూడ్చమన్నాడు. అలాగే చేశారు రామలక్ష్మణులు.

విరాధుని మాట ప్రకారం శరభంగ మహర్షి దర్శనానికి బయల్దేరారు. శరభంగుడు మహాతపస్వి. దైవసాక్షాత్కారం పొందినవాడు. శ్రీరాముని చూసి శ్రీరామ దర్శనం కోసమే తాను వేచివున్నానన్నాడు. తన తపఃఫలాన్నంతా శ్రీరామునికి ధారవోసాడు. భవిష్యత్తులో శ్రీరాముడు చేయవలసిన రావణసంహారానికి ఇది కూడా తోడ్పడుతుంది. ఒక మహాకార్య సాధనలో ఎవరివంతువారు సహకారమందించాల్సిందే. అచటికి చేరువలోనే ఉన్న 'సుతీక్ష్ణ' మహర్షిని దర్శించమని శ్రీరామునకు సూచించాడు శరభంగమహర్షి. సీతారామలక్ష్మణులు చూస్తుండగానే తన దేహాన్ని విడచి అగ్నితేజస్సుతో బ్రహ్మలోకం చేరాడు.

అక్కడి మునులందరూ శ్రీరాముని వద్దకు వచ్చి తమగోడును వెళ్ళబోసుకున్నారు. రాక్షసులు మునులపై చేసే అకృత్యాలను ఏకరువుపెట్టారు. రాక్షసుల చేతిలో బలైన మునుల కళేబరాలను చూపించారు. రాక్షసుల బారి నుండి రక్షించమని ప్రార్థించారు. వారితో శ్రీరాముడు 'మహాత్ములారా! మీరు నన్ను ప్రార్థించడంతగదు. ఆజ్ఞాపించాలి. మీ ఆజ్ఞలను నేను శిరసావహిస్తాన'న్నాడు. అహంకరించకుండా తన బాధ్యతను గుర్తించడంలోనే గొప్పదనముంది.

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం చేరుకున్నారు. శ్రీరామ దర్శనం కోసమే సుతీక్ష్ణ మహర్షి దేహం విడువకుండా ఉన్నాడు. తన తపశ్శక్తినంతా శ్రీరామునకు ధారాదత్తం చేశాడు. మరునాడు మహర్షి అనుమతి తీసుకొని బయలుదేరారు.

దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలను సందర్శిస్తూపోతున్నారు సీతారామలక్ష్మణులు. అక్కడక్కడ కొంతకాలం ఉంటున్నారు. ఇలా పది సంవత్సరాలు గడిచింది. మళ్ళీ సుతీక్ష్ణ మహర్షి వద్దకు వచ్చారు. అతనితో అగస్త్య మహర్షిని దర్శించుకోవాలన్న తమ ఆకాంక్షను వెలిబుచ్చారు. సుతీక్ష్ణ మహర్షి మార్గాన్ని చెప్పాడు. తన ఆశ్రమానికి దక్షిణంగా నాల్గుయోజనాల దూరంలో అగస్త్య సోదరుని ఆశ్రమం, అక్కడికి యోజనదూరంలో అగస్త్యాశ్రమం ఉందని తెలిపాడు. మహర్షివద్ద సెలవు తీసుకొని బయలుదేరారు సీతారామలక్ష్మణులు.

సాయంకాలానికి అగస్త్యసోదరుని ఆశ్రమానికి చేరుకున్నారు. ఇక్కడో విషయం చెప్పుకోవాలి. అగస్త్యసోదరుని పేరేమో చెప్పబడలేదు. ఎక్కడ సందర్భం వచ్చినా అగస్త్యభ్రాత (సోదరుడు) అనే చెప్పబడ్డాడు. అందుకే పేరు తెలియని వారిని 'అగస్త్యభ్రాత' అంటుంటారు. ఈ పదబంధం జాతీయంగా స్థిరపడింది. అగస్త్యసోదరుని ఆతిథ్యంలో ఆరాత్రి గడిపారు సీతారామలక్ష్మణులు. ఉదయాన్నే అగస్త్యాశ్రమం వైపుగా అడుగులు వేశారు.

అగస్త్యుడు తపశ్శక్తి సంపన్నుడు. ఆకాశాన్నితాకిన వింధ్య పర్వత గర్వాన్ని అణచినవాడు. 'అగమ్ స్తంభయతీతి అగస్త్యః' పర్వతాన్ని స్తంభింపజేసినవాడు కనుక అగస్త్యుడయ్యాడు.

శ్రీరాముని రాకను గమనించి అగస్త్యుడు శిష్యసమేతంగా ఎదురేగాడు. అతిథిని గౌరవించే సంప్రదాయమది. శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై మహర్షికి పాదాభివందనం చేశాడు. అగస్త్యుడు శ్రీరామునకు దివ్యధనుస్సు, అక్షయతూణీరాలు, అమోఘమైన ఖడ్గాన్ని బహూకరించాడు. జయం కలుగుతుందని ఆశీర్వదించాడు. కష్టాలతో కూడిన వనవాసానికి సీత కోరిరావడం సాహసమని అభినందించాడు. ఆమెకుగల భర్తృప్రేమను మెచ్చుకున్నాడు.

శ్రీరాముడు తాము నివసించడానికి అనువైన ప్రాంతాన్ని సూచించమని అగస్త్యుని అభ్యర్థించాడు. ఒక్క క్షణం ధ్యానమగ్నుడైనాడు మహర్షి. తరువాత శ్రీరామునితో 'ఇక్కడికి రెండు యోజనాల దూరంలో 'పంచవటి' అనే ప్రదేశం ఉంది. అక్కడ ఫలాలకు, జలానికి కొదువలేదు గోదావరీనదీ తీరమందున్న ఆ ప్రాంతంలో జనసంచారం ఉండదు. ప్రశాంతంగా ఉంటుంద'ని తెలిపాడు. అగస్త్యుని వద్ద వీడ్కోలు పొంది పంచవటికి ప్రయాణమయ్యారు సీతారామలక్ష్మణులు.

దారిలో బలిష్ఠమైన ఒక పెద్ద గ్రద్దను చూశారు. పక్షి రూపంలో ఉండే రాక్షసుడేమోననుకున్నారు. అతణ్ణి అడిగారు. తనపేరు 'జటాయువు' అనీ దశరథునకు మిత్రుడననీ చెప్పుకున్నాడు. తన వంశ చరిత్రనూ శక్తి సామర్థ్యాలను వివరించాడు జటాయువు. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువునకు సీతరక్షణ బాధ్యతను అప్పగించాడు శ్రీరాముడు. శ్రీరాముని ఆజ్ఞమేరకు పంచవటిలో పర్ణశాల నిర్మాణం చేశాడు లక్ష్మణుడు.

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణకథా ప్రసంగంలో ఉన్నాడు. ఇంతలో 'శూర్పణఖ' అనే రాక్షసి అక్కడికి వచ్చింది. ఈమె రావణాసురుని చెల్లెలు. శ్రీరాముని సౌందర్యానికి ముగ్ధురాలైంది. తనను చేపట్టనున్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపితింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళమన్నాడు. లక్ష్మణుడు తాను అన్నకు దాసుడనని తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సివస్తుందని, అందుకే శ్రీరాముని చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరామునివైపు తిరిగింది శూర్పణఖ. సీత ఉండడంవల్లే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడికిపోయింది. సీతాదేవి అడ్డు తొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

క్రూరులైన దుష్టులతో పరిహాసం పనికిరాదు. అది ప్రమాదకరం. ఆలస్యం చేయకుండా శూర్పణఖను విరూపినిచేయమన్నాడు శ్రీరాముడు. అన్న ఆజ్ఞయే ఆలస్యం – శూర్పణఖ ముక్కు చెవులు తెగిపడ్డాయి లక్ష్మణుని కత్తిదెబ్బకు. లబోదిబోమని మొత్తుకొంటూ సోదరుడైన ఖరుని వద్దకు వెళ్ళింది శూర్పణఖ. ఖరుడు పద్నాలుగు మంది యోధులను పంపాడు. వారంతా శ్రీరాముని చేతిలో మట్టిగరచారు. ఇది చూసిన శూర్పణఖ ఖరుని వద్దకు వెళ్ళి చెప్పింది. ఖరదూషణులు పద్నాలుగువేల మంది రాక్షసులతో రామునిమీదకు దండెత్తారు. మూడు గడియల్లో వారినంతా యమపురికి పంపించాడు శ్రీరాముడు.

ఈ వార్త అకంపనుడి ద్వారా వేగంగా లంకకుచేరింది. అకంపనుడు రావణాసురుని గూఢచారుల్లో ఒకడు. విషయం జీర్ణించుకోలేని రావణుడు శ్రీరాముని హతమారుస్తానని ఆవేశపడ్డాడు. అకంపనుడు అసహాయశూరుడైన శ్రీరాముని వధించడం దేవాసురులకు కూడా సాధ్యంకాదని తేల్చేశాడు. కాని అందుకు తగిన ఒక ఉపాయాన్ని చెప్పాడు. 'శ్రీరాముని భార్య సీత అందాల రాశి. శ్రీరాముని ప్రాణం. ఎలాగైనా ఆమెను అపహరిస్తే చాలు – ఆ ఎడబాటును తట్టుకోలేక రాముడు జీవితాన్ని చాలిస్తాడు' అని. ఇది రావణునికి ఎంతగానో నచ్చింది.

మరునాడుదయమే రథంపై ఆకాశంలో ప్రయాణిస్తూ మారీచుని ఆశ్రమానికి చేరుకున్నాడు. సీత అపహరణ విషయం తెలిపాడు. ఈ పనిలో తనకు సహాయపడమన్నాడు. మారీచుడు మండిపడ్డాడు. 'ఓ రాక్షసేంద్రా! ఈ సూచన నీకెవడిచ్చాడు? నిజంగా అతడు నీకు మిత్రుని రూపంలో ఉన్న శత్రువు. శ్రీరాముడు సింహం వంటివాడు. సింహంవద్దకు వెళ్ళడం ఎంత ప్రమాదం? పైగా ఇతరులకు హాని చేయాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా ఉన్న రాముని కవ్వించడం కొరివితో తలగోక్కోవడమే. శాంతించి, ఈ ఆలోచన విరమించి సుఖించ'మని సదుపదేశం చేశాడు. రావణుని ఆవేశం తిరుగు ముఖం పట్టింది. రావణుడూ తిరుగుముఖం పట్టాడు లంకకు.

ఖరదూషణ త్రిశరులు, పద్నాలుగు వేలమంది రాక్షసవీరులు రామునిధాటికి నిలువలేక యముని ఇంట్లో తలదాచుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయింది శూర్పణఖ. లంకకు పరుగుదీసింది. మంత్రులతో కొలువుదీరిన రావణుని సభలోకి వెళ్ళింది. వికృతరూపంతో వచ్చిన చెల్లెలి దీనావస్థను చూచికూడా చలించలేదు రావణుడు. శూర్పణఖ ఆవేశం కట్టలు తెంచుకుంది. రావణుని మూర్ఖత్వాన్ని ఎండగట్టింది. శ్రీరామునివల్ల లంకకు ముప్పువాటిల్లగలదని హెచ్చరించింది. 'సౌందర్యవతియైన సీతకు తగిన భర్తవు నీవేన'ని రావణునిలో కొత్త ఆశలను రేకెత్తించింది.

ఒకవైపు మారీచుని మాటలు, మరొకవైపు శూర్పణఖ పలుకులు లంకేశుని మనసును కుదిపేస్తున్నాయి. అయోమయంలో పడ్డాడు. సీతాపహరణంలోని మంచిచెడులను ఆలోచించాడు. శ్రీరాముని బలంతో తన బలాన్ని పోల్చుకున్నాడు. చివరకు సీతను అపహరించడానికే నిశ్చయించుకున్నాడు.

రావణుడు మళ్లీ మారీచునివద్దకు వెళ్ళాడు. సీతాపహరణకు బంగారులేడిగా మారి సహకరించమన్నాడు. ఆ ఆలోచనను విరమించుకోమని లంకేశునికి పరిపరివిధాల నచ్చజెప్పజూశాడు మారీచుడు. విశ్వామిత్రుని యాగ సంరక్షణ సందర్భంలో రామబాణం యొక్క రుచి ఏమిటో తాను తెలుసుకున్నానన్నాడు. మారీచుని మాటలను పెడచెవిన పెట్టాడు రావణుడు. మూర్ఖులకు హితబోధలు చెవికెక్కవు.

చెప్పినట్లు చేయకుంటే తన చేతిలో చావు తప్పదని తెగించి చెప్పాడు రావణుడు. ఆశ్రమానికి వెళితే శ్రీరాముడు చంపుతాడు. వెళ్ళకుంటే రావణుడు చంపుతాడు. 'ముందునుయ్యి వెనకగొయ్యి'లా ఉంది మారీచుని స్థితి. చివరకొక నిశ్చయానికొచ్చాడు. రావణునితో 'నీ చేతిలో చావడం కన్నా శ్రీరాముని చేతిలో చావడమే నయం. నా జన్మ తరిస్తుందని' తేల్చిచెప్పాడు.

మారీచుడు బంగారులేడిగా మారి శ్రీరాముని ఆశ్రమ ప్రాంతంలో తిరుగుతున్నాడు. పూలుకోయడానికి వచ్చిన సీతాదేవి ఆ జింకను చూసి ఆశ్చర్యపడింది. రామలక్ష్మణులను పిలిచింది. వారు ఆ మృగాన్ని చూశారు. లక్ష్మణుడు అది మాయామృగమేనని నిస్సంశయంగా పలికాడు. మారీచుడే ఈ రూపంలో వచ్చి ఉంటాడన్నాడు. వేటకువచ్చే రాజులను మాయామృగరూపంలో చంపడం మారీచునకు కొత్తదేమీకానదన్నాడు. ఇలాంటి లేడి ప్రపంచంలో ఉండదని అనుమానాన్ని వెలిబుచ్చాడు. సీత మాత్రం పట్టువదలలేదు. తనకు అదెంతో నచ్చిందని, తీసుకురావాలని కోరింది. తెస్తే ఆశ్రమంలో క్రీడా మృగంగా ఉంటుందని, అయోధ్యచేరాక అంతఃపురానికే అలంకారమౌతుందని ఆశించింది.

సీత ఇష్టాన్ని త్రోసిపుచ్చలేక ఆ మాయలేడిని చంపి అయినా సరే తేవడానికి సంసిద్ధుడయ్యాడు శ్రీరాముడు. సీతాదేవి రక్షణ విషయంలో జటాయువు సహాయంతో అప్రమత్తంగా ఉండమని లక్ష్మణుని ఆదేశించాడు. మాయలేడిని పట్టుకోవడానికి బయల్దేరాడు.

మృగాన్ని ప్రాణంతో పట్టుకోవాలని శతవిధాలా ప్రయత్నించాడు శ్రీరాముడు. అందినట్టే అంది అందకుండా పరుగుదీస్తున్నదా మృగం. ఇక లాభం లేదనుకొని బాణాన్ని సంధించాడు, ప్రయోగించాడు శ్రీరాముడు. బాణపు దెబ్బకు తాటి చెట్టంత ఎత్తు ఎగిరి భయంకరంగా అరుస్తూ పడిపోయాడు మారీచుడు నిజ స్వరూపంతో. రాముని కంఠధ్వనిని అనుకరిస్తూ 'అయ్యో సీతా! అయ్యో లక్ష్మణా!' అని బిగ్గరగా అరుస్తూ అసువులు బాసాడు. ఈ మాటలకు సీతాలక్ష్మణులు ఎంత కలవరపడతారోనని భయపడినాడు శ్రీరాముడు.

మారీచుని కంఠధ్వనిని రామునిదిగా భావించి సీత ఆందోళనచెందింది. శ్రీరాముడు ఏదో ఆపదలో చిక్కుకున్నాడని తలచింది. ఆదుకోవడానికి వెంటనే వెళ్ళమని లక్ష్మణుని పురమాయించింది. లక్ష్మణుడు చలించలేదు. ఇది శ్రీరాముని స్వరం కాదన్నాడు. మారీచుని మాయాజాలమన్నాడు. 'అమ్మా! నీ రక్షణ భారం శ్రీరాముడు నాకప్పగించాడు. నిన్ను ఇలా ఒంటరిగా వదలివెళ్ళలేన'ని స్పష్టం చేశాడు. సీత ఆవేశం రెండింతలైంది. మనసులో ఏదో దుష్టాలోచనతో ఇలా ప్రవర్తిస్తున్నావని నిష్ఠూరోక్తులాడింది. చేసేదిలేక లక్ష్మణుడు బయలుదేరడానికి సంసిద్ధుడయ్యాడు. 'అమ్మా! నీకు భద్రమగుగాక. వనదేవతలు నిన్ను రక్షింతురుగాక. నాకు అపశకునాలు తోస్తున్నాయి. మళ్ళీ నీవు మా అన్నతో కలిసి ఉండగా చూసే భాగ్యం కలుగుతుందో? లేదో?' అని వాపోయాడు. సీత మౌనంగా ఉన్నది. అక్కడి నుండి వెళ్ళడానికి ఏమాత్రం మనస్కరించకున్నా సీతకు నమస్కరించి శ్రీరాముడు వెళ్ళిన దిశగా నడచాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు వెళ్ళడాన్ని గమనించాడు రావణుడు. అదే అదనుగా సన్యాసి వేషంలో సీత సమక్షానికి వచ్చాడు. యతి రూపంలో వచ్చిన రావణుని ఆసనంపై కూర్చుండబెట్టి సముచితంగా అతిథి మర్యాదలు చేసింది సీత. మధ్యమధ్యలో రామలక్ష్మణుల కోసం వాకిలివైపు చూస్తున్న సీతకు నిరాశే మిగులుతున్నది. రావణుడు సీత గురించిన వివరాలు అడిగాడు. తెలిపింది. సన్యాసి వివరాలను కోరింది. తాను రాక్షసరాజు లంకేశ్వరుడనని ప్రకటించాడు. తనను పతిగా స్వీకరించమని అడిగాడు. అలాచేస్తే అంతులేని భోగభాగ్యాలతో విలసిల్లుతావని ఆశచూపాడు. ఆ మాటలకు సీత మండిపడింది. రావణుణ్ణి తృణీకరించి మాట్లాడింది. శ్రీరాముని పరాక్రమాన్ని ప్రస్తావించింది. 'నన్ను అపహరించి నీ చావును నీవే కొనితెచ్చుకోకు' అని హెచ్చరించింది.

రావణుని కన్నులు నిప్పులు చెరుగుతున్నాయి. సన్యాసి వేషానికి సన్యాసమిచ్చాడు. పదితలలతో భయంకరమైన తన నిజస్వరూపంతో సీత ఎదుట నిలచాడు. బలవంతంగా సీతను తన రథంలో లంకకు తరలిస్తున్నాడు. సీత 'రామా! రామా!' అంటూ ఆర్తనాదాలను చేస్తున్నది. ఆమె వేదన అరణ్యరోదనయ్యింది.

అప్పుడప్పుడే నిద్రకుపక్రమిస్తున్న జటాయువుకు సీతాదేవి ఆర్తనాదాలు వినబడ్డాయి. చూసే సరికల్లా సీతను అపహరించుకు పోతున్న రావణుడు కంటబడ్డాడు. జటాయువు రావణుణ్ణి ఎదిరించాడు. ఇద్దరి మధ్య పోరు హోరుగా సాగింది. చిరవకు రావణుడు ఖడ్గంతో జటాయువు రెక్కలను, కాళ్ళను నరికివేసాడు. నేలపై కూలాడు జటాయువు. రక్తంతో తడసి ముద్దయిన అతన్ని చూసి సీత ఆత్మబంధువు పోగొట్టుకున్నట్లు ఆక్రందించింది.

రావణుడు సీతాదేవిని తీసుకొని ఆకాశమార్గం పట్టాడు. దీనయైన సీత హీనుడైన రావణుణ్ణి పరి పరి విధాల దూషించింది. ఇంతలో ఒక పర్వత శిఖరంపై ఐదుగురు వానరముఖ్యులను సీత చూసింది. ఉత్తరీయపు కొంగులో తన ఆభరణాలను కొన్నింటిని మూటగట్టి వారి మధ్య పడేటట్లు వదలింది. ఒకవేళ అటువైపుగా శ్రీరాముడువస్తే తన గురించి వానరులు తెలియజేస్తారనే చిన్న ఆశ.

రావణుడు సీతతో లంకకు చేరాడు. తన అంతఃపురంలో సీతనుంచాడు. తన వైభవమంతా చూపించాడు. దానిని తృణప్రాయంగా భావించింది సీత. కనికరించమని కాళ్ళపైబడ్డాడు. నిరాకరించిందా మహాసాధ్వి. భరించలేకపోయాడు దశకంఠుడు. ఆవేశంతో 'మైథిలీ! నీకు పన్నెండు నెలల గడువిస్తున్నాను. ఈలోపు నా దారికి రాకుంటే మరునాడే ప్రాతఃకాల భోజనానికి వంటవాళ్ళు నిన్ను సిద్ధంచేస్తార'ని బెదిరించాడు. అక్కడి రాక్షసులతో 'ఈమెను అశోకవనానికి తీసుకుపొండి. వనం మధ్య ఒక

రహస్య ప్రదేశంలో ఉంచి చుట్టూ కాపలాగా ఉండండి ఎలాగో ఒకలాగ ఈమెను ఒప్పించండి' అని ఆజ్ఞాపించి రుసరుసలాడుతూ వెళ్ళాడు. ఆడపులల మధ్య జింకలాగ రాక్షస స్త్రీల మధ్య సీత బిక్కుబిక్కుమంటూ కాలాన్ని గడుపుతున్నది.

మారీచుని వధించి శ్రీరాముడు వెనుదిరిగాడు. లక్ష్మణుడు ఎదురయ్యే సరికి నిశ్చేష్టుడయ్యాడు. సీతను ఒంటరిగా వదలి ఎందుకు వచ్చావని నిలదీశాడు. జరిగిన విషయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు లక్ష్మణుడు. ఇద్దరూ ఆశ్రమానికి చేరుకున్నారు. సీతాదేవి జాడ కనిపించలేదు. వనమంతా వెతికారు. సీత జాడ కనిపించలేదు. సీత జాడ చెప్పమని ప్రకృతిని ప్రార్థించాడు శ్రీరాముడు. ఆమె ఎడబాటును తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఆవేదన ఆవేశంగా మారింది. లోకాలను ధ్వంసం చేయడానికి శ్రీరాముడు సిద్ధపడ్డాడు. లక్ష్మణుడు ఓదార్పు వాక్యాలతో అన్నను శాంతపరచాడు.

అరణ్యంలో సీతను వెదుకుతూ వెళుతున్న రామలక్ష్మణులకు జటాయువు కనిపించాడు. రక్తంతో తడిసిన అతనిని గుర్తించలేదు శ్రీరాముడు. మీదు మిక్కిలి అతడు గద్దరూపంలో ఉన్న రాక్షసుడని సీతనతడే భక్షించివుంటాడనీ భ్రమపడ్డాడు. బాణంతో చంపడానికి పూనుకున్నాడు. ఇంతలో జటాయువు జరిగిన విషయం చెప్పాడు. రావణుడు సీతను అపహరించాడని, ఎదురించిన తనకీగతి పట్టించాడని వివరించాడు. అపహరణకు గురైన సీత, అవసానదశలో ఆత్మీయుడు – రాముని దుఃఖం రెండింతలైంది. తన తండ్రికి ఆత్మీయుడైన జటాయువు పట్ల పితృభక్తిని ప్రదర్శిస్తూ అతని శరీరాన్ని నిమిరాడు. జటాయువు కన్నుమూశాడు. శ్రీరాముడు జటాయువునకు దహన సంస్కారాలు చేశాడు. అతనికి ఉత్తమగతులు కలగాలని గోదావరిలో జలతర్పణాలు చేశాడు.

రామలక్ష్మణులు దండకారణ్యం నుండి క్రౌంచారణ్యానికి చేరుకున్నారు. అక్కడి వనంలో భయంకరుడైన ఒక రాక్షసుని చూశారు. అతని తల మెడ కనబడడంలేదు. కడుపు భాగంలో ముఖముంది. ఎదపైన ఒకే కన్ను ఉంది. యోజనం పొడవు వ్యాపించిన చేతులు. ఆ చేతులలో పక్షులను, మృగాలను పట్టితింటాడు. అతనిపేరు 'కబంధుడు'. తన సమీపంలోకి వచ్చిన రామలక్ష్మణులను అమాంతంగా రెండు చేతులతో పట్టుకున్నాడు. అతని చేతుల్లో చిక్కితే తప్పించుకోవడం ఎవరితరంకాదు. అందుకే 'కబంధ హస్తాలు' అన్న జాతీయం పుట్టుకువచ్చింది. కబంధుడు రామలక్ష్మణులను భక్షించడానికి నోరుతెరచాడు. అన్నదమ్ములిద్దరూ తమ ఖడ్గాలతో సునాయాసంగా వాడి భుజాలను నరకివేశారు. కబంధుడు కుప్పకూలాడు. రామలక్ష్మణుల గురించి తెలుసుకున్నాడు. తన గురించి చెప్పుకున్నాడు. శాపకారణంగా తనకీ వికృతరూపం ప్రాప్తించిందన్నాడు. శ్రీరాముడు కబంధునితో'. 'మాకు రావణుని పేరు మాత్రమే తెలిసింది. అతని రూపం, ఉండేచోటు, శక్తిసామర్థ్యాలు తెలియవు. వాటిని చెప్పవలసింద'ని అడిగాడు. సమాధానంగా కబంధుడు 'శ్రీరామా! నాకిప్పుడు దివ్యజ్ఞానంలేదు. నా శరీరాన్ని దహిస్తే నా నిజరూపం వస్తుంది. అప్పుడు చెప్పగలన'న్నాడు. కబంధుని శరీరానికి అగ్నిసంస్కారంచేశారు రామలక్ష్మణులు. ఆజ్వాలల నుండి దివ్యదేహంతో బయటికి వచ్చాడు కబంధుడు. సీతాదేవి దొరికే ఉపాయాన్ని శ్రీరామునకు చెప్పాడు. ఇందుకు సుగ్రీవుని మైత్రి బాగా తోడ్పడుతుందన్నాడు. వాలి సుగ్రీవుల కథను వివరించాడు. సుగ్రీవుని చేరే దారిని చెప్పాడు. శ్రీరాముని అనుమతిని తీసుకొని కబంధుడు స్వర్గానికి వెళ్లాడు.

కబంధుడు సూచించిన మార్గంలో ప్రయాణిస్తూ పంపాసరస్సున్న ప్రాంతానికి చేరారు రామలక్ష్మణులు. ఆ తీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి వెళ్ళారు. శబరి తపస్సిద్ధురాలు, జ్ఞానవయోవృద్ధురాలు. శ్రీరామదర్శనంతో ఆమె తనువు పులకించింది. పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది. తన జన్మ ధన్యమైనట్లు భావించింది. శ్రీరాముని అనుమతినిపొంది తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి అగ్నికాంతితో ఊర్ధ్వలోకాలకు వెళ్ళింది.

అక్కడి నుండి ఋష్యమూక పర్వతానికి ప్రయాణమాయ్యారు రామలక్ష్మణులు. దారిలో పంపాసరోవరాన్ని దర్శించారు.



కిష్కింధా కాండం



పంపాసరోవర ప్రాంతం పరమ రమణీయంగా ఉంది. ప్రకృతి తన అందాలను ఆరబోసుకున్నట్లుగా ఉంది. కాని శ్రీరాముని మనసును ఏమాత్రం సంతోషపెట్టలేకపోయింది. పైగా సీత ఎడబాటు ఆవేదన అనే అగ్నికి ఆజ్యం పోసినట్లుగా శ్రీరాముని బాధను మరింతపెంచింది. లక్ష్మణుడు ఊరడించాడు. 'అన్నా ఈ దైన్యాన్ని వదలు. అదే మనకు మేలుచేస్తుంది. చేసిన ప్రయత్నం విఫలమైనప్పుడు, సంపదలను పోగొట్టుకున్నప్పుడు అధైర్యపడకుండా ప్రయత్నంచేస్తే మంచి ఫలితముంటుంది. ఉత్సాహమే బలం. ఉత్సాహమున్నవానికి అసాధ్యమనేదిలేదు. వారు ఎటువంటి కష్టాలొచ్చినా వెనకడుగువేయరు. మన ప్రయత్నాన్ని కొనసాగిద్దాం. వదినెగారు తప్పక లభిస్తార'ని ధైర్యం చెప్పాడు.

ఋష్యమూక పర్వతం నుండి రామలక్ష్మణులను చూశాడు సుగ్రీవుడు. గుండెలో రాయిపడ్డట్టయింది. ఆ ఇద్దరు వీరులు తన అన్నయైన వాలిపంపగా వచ్చారేమోనని భయంతో వణకిపోతున్నాడు. ధనుర్బాణాలు ధరించిన వాళ్ళెవరో మారువేషంలోవెళ్ళి కనుక్కోమని ఆంజనేయుణ్ణి ఆదేశించాడు.

సుగ్రీవుని ఆనతిపై రామలక్ష్మణులున్న చోటికి ఒక్క గంతువేశాడు హనుమంతుడు. సన్యాసి రూపంలో వారి వద్దకు వెళ్ళాడు. వారి రూపాన్ని పొగిడాడు. వారి పరిచయం అడిగాడు. రామలక్ష్మణులు మౌనముద్ర దాల్చారు. హనుమంతుడు వారితో వానరరాజు సుగ్రీవుడు ధర్మాత్ముడు, మహావీరుడు తన అన్నయైన వాలిచే వంచింపబడ్డాడు. రక్షణకై జాగ్రత్తతో తిరుగుతున్నాడు. నేను సుగ్రీవుని మంత్రిని. నన్ను 'హనుమంతుండ'ంటారు. సుగ్రీవుడు మీతో స్నేహాన్ని కోరుతున్నాడు. నేను వాయుపుత్రుడను. ఎక్కడికైనా వెళ్ళిరాగల శక్తి గలవాడను. సుగ్రీవుడు పంపగా ఈ రూపంలో మీవద్దకు వచ్చాను' అని చాకచక్యంగా మాట్లాడాడు. విషయాన్ని చెప్పేపద్ధతిలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు. హనుమంతుని మాటతీరు శ్రీరాముని ఆకట్టుకుంది. లక్ష్మణునితో 'ఇతడు వేదాలను, వ్యాకరణాన్ని క్షుణ్ణంగా చదివాడన్నది నిశ్చయం. లేకుంటే మాటల్లో ఇంత స్పష్టత ఉండదు. తడబాటు, తొందరపాటు లేకుండా, తప్పులు పలకకుండా, సరైన స్వరంతో చెప్పదలచుకున్న విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పాడు. ఈయన మాట్లాడే తీరుచూస్తే చంపడానికి కత్తి ఎత్తిన శత్రువుకు కూడా చేతులురావు' అని మెచ్చుకున్నాడు. మాటకున్న శక్తి అటువంటిది.

హనుమంతునితో లక్ష్మణుడినే మాట్లాడమన్నాడు శ్రీరాముడు. హనుమంతుని అభిప్రాయాలకు సమ్మతి తెలుపుతూ. తమ వృత్తాంతాన్ని వివరించాడు లక్ష్మణుడు. తమకు సుగ్రీవుని సహాయం ఎంతో తగినదన్నాడు. సన్యాసిరూపం వదలి రామలక్ష్మణులను భుజాలపై ఎక్కించుకొని ఋష్యమూక పర్వతానికి చేరుకున్నాడు హనుమ. అంతకు ముందే భయంతో మలయగిరికి చేరిన సుగ్రీవుని రామలక్ష్మణుల వద్దకు తీసుకువచ్చాడు ఆంజనేయుడు.

శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా మిత్రులైనారు. సుగ్రీవుడు 'రామా! ఈనాడు నీవు నాకు ప్రాణమిత్రుడవైనావు. ఇప్పటి నుండి సుఖదుఃఖాలలో మనం ఒక్కటిగానే ఉందాం. వాలి భయం నన్ను వదలడంలేదు. నీ అభయం కావాలి' అని ప్రార్థించాడు.

శ్రీరాముడు మందహాసాన్నిచిందిస్తూ' సుగ్రీవా! ఆపదలో ఆదుకునేవాడే గదా మిత్రుడు. నీ భార్యను అపహరించిన వాలిని తప్పక వధిస్తాన'ని మాటఇచ్చాడు. సుగ్రీవుని మనసుకుదుటపడింది.

శ్రీరామ సుగ్రీవులు స్నేహపూర్వకంగా మాట్లాడుకుంటున్నప్పుడు సీతాదేవి ఎడమకన్ను, వాలి ఎడమకన్ను, రావణాసురుని ఎడమకన్ను ఒక్కసారిగా అదిరాయి. సీతకు ఎడమకన్ను అదరడం శుభసూచనకం. మగవారికి అది అశుభసూచకం. ఇది భావిపరిణామాలకు సూచన.

సుగ్రీవుడు గతంలో తాను నలుగురు మంత్రులతో కొండపై ఉన్నప్పుడు ఒక రాక్షసుడు స్త్రీని బలవంతంగా తీసుకుపోవడం చూశామన్నాడు. ఆమె 'రామా!' 'లక్ష్మణా!' అని బిగ్గరగా అరవడం విన్నామన్నాడు. తమను చూసి నగల మూటను జారవిడచిందని చెప్పి, ఆ ఆభరణాలను తెచ్చి చూపించాడు. శ్రీరాముడు వాటిని చూసి కన్నీటి సంద్రమయ్యాడు. లక్ష్మణుడు 'అన్నా! ఈ కేయూరాలను, కుండలాలను నేను గుర్తుపట్టలేను. కాని కాలి అందెలు మాత్రం మా వదినెగారివే. ఆమెకు నిత్యం పాదాభివందనం చేయడంవల్ల నేను వీటిని గుర్తుపట్టాన'న్నాడు.

శ్రీరాముని శోకాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాడు సుగ్రీవుడు. సీతాదేవిని తీసుకురావడంలో తాను తగిన ప్రయత్నం చేస్తానన్నాడు. సపరివారంగా రావణుణ్ణి హతమార్చేందుకు తన శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తానన్నాడు. దుఃఖం అనర్థదాయకం కనుక ఎప్పుడూ దుఃఖించవద్దన్నాడు. ఎల్లప్పుడూ దుఃఖించేవారికి సుఖముండదు. తేజస్సు క్షీణిస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రాణాలు నిలవడమే కష్టంగా ఉంటుంది. కనుక దుఃఖ స్థితి నుండి బయట పడమని ధైర్యవచనాలను వల్లించాడు.

'ఓ రామా! నిజమైన మిత్రుడు తన స్నేహితుని కోసం సంపదలను, సుఖాలను, చివరకు తన ప్రాణాలను కూడా విడవడానికి సిద్ధపడతాడు. ప్రాణమిత్రులమైన మనం స్నేహధర్మాన్ని చక్కగా పాటిద్దామ'న్నాడు. శ్రీరాముడు అందుకు అంగీకరిస్తూ 'ఉపకారం జరగడమే మిత్రునివల్ల ఫలం – అపకారం చేయడం శత్రువు లక్షణం. నీ భార్యనపహరించిన వాలిని ఈరోజే చంపుతాన'న్నాడు. వాలితో వైరమెందుకు వచ్చిందో తెలుపమన్నాడు సుగ్రీవుని. గతకథను శ్రీరాముని చెవినవేశాడు సుగ్రీవుడు.

'మా అన్న వాలి మహాబలశాలి. పెద్దవాడు కనుక మా తండ్రి తరువాత కిష్కింధకు రాజైనాడు. మాయావి అనే వానికి మా అన్నతో వైరం. ఒకనాటి అర్ధరాత్రి మాయావి కిష్కింధకు వచ్చి వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మేమెంతగా వారించినా వాలి వినకుండా వానితో పోరుకు సిద్ధమయ్యాడు. మమ్ముల చూడగానే మాయావి భయంతో వెనుదిరిగి పిక్కబలంచూపాడు. మేము వెంబడించాం. అతడు ఒక పెద్ద భూగృహంలోకి వెళ్ళాడు. వాలి ఆవేశంతో ఊగిపోతున్నాడు. నన్ను బిల్వద్వారం వద్దే ఉండమన్నాడు. మాయావిని చంపి వస్తానని వెళ్లాడు. సంవత్సరమైంది. అన్నజాడేలేదు. నా ఆశలు అడుగంటాయి. ఆందోళన ఎక్కువైంది. ఇంతలో నురుగుతోకూడిన రక్తం గుహ నుండి బయటకు వస్తున్నది. లోపల రాక్షసునివి, అన్నగారి అరుపులు వినిపిస్తున్నాయి. మాయావిచేతిలో మాయన్న చనిపోయాడనుకున్నాను. రాక్షసుడు బయటకు వస్తాడేమోనని కొండంత బండతో బిలద్వారం మూసేశాను. మౌనంగా కిష్కింధకు వచ్చాను. మంత్రులు నా ద్వారా సమాచారాన్ని రాబట్టారు. బలవంతంగా నన్ను రాజును చేశారు. కొంతకాలానికి వాలి వచ్చాడు. నన్ను రాజుగా చూసి కనులెర్రజేసాడు, నా కుమారులను చెరసాలలో బంధించాడు. ఎంత బ్రతిమాలినా క్షమించలేదు. సరికదా నన్ను రాజ్యభ్రష్టుణ్ణి చేయడమేకాదు. నా భార్య రుమను అపహరించాడు. ప్రాణభీతితో పరుగులుతీసాను. సమస్త భూమండలం తిరిగాను. చివరకు ఈ ఋష్యమూక పర్వతాన్ని చేరుకున్నాను. మతంగముని శాపం కారణంగా వాలి ఇక్కడకు రాలేడు. వాలి దుందుభి అనే రాక్షసుని చంపి విసిరివేసినప్పుడు ఆ రాక్షసుని నోటి నుండి రక్త బిందువులు మతంగాశ్రమంపై పడ్డాయి. అందుకు కోపించిన ముని ఋష్యమూక పర్వతంపై కాలిడితే వాలి మరణిస్తాడని శపించాడు' అంటూ సుగ్రీవుడు తన కథనంతా చెప్పుకొచ్చాడు.

శ్రీరాముని బలమెట్టిదో తెలుసుకోవాలనుకున్నాడు సుగ్రీవుడు. దానికి జవాబుగా శ్రీరాముడు కాలి బొటనవ్రేలితో అక్కడ పడివున్న దుందుభి అస్థిపంజరాన్ని పదియోజనాల దూరం పడేటట్లు చిమ్మివేశాడు. ఒకే బాణంతో ఏడు మద్దిచెట్లను చీల్చాడు. సంతోషించాడు సుగ్రీవుడు.

వాలి వధకు ఇక ఏ మాత్రం ఆలస్యం వద్దని శ్రీరాముని తొందరపెట్టాడు. అందరూ కిష్కింధకు వెళ్ళారు. సుగ్రీవుడు భయంకరంగా గర్జిస్తూ వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మహాబలశాలియైన వాలి క్షణాలలో అక్కడ వాలాడు. ఇద్దరి యుద్ధం అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టించింది. వాలిసుగ్రీవులు ఒకే పోలికతో ఉన్నారు. అందుకే శ్రీరాముడు వాలిని స్పష్టంగా గుర్తించలేకపోయాడు. వాలి విజృంభణకు తట్టుకోలేకపోయాడు సుగ్రీవుడు. శ్రీరాముని కొరకు చూశాడు. కనిపించలేదు. గుండెగుభేలుమంది. ప్రాణభయంతో ఋష్యమూకానికి పరుగులుతీశాడు సుగ్రీవుడు. అక్కడకు వెళ్ళలేని వాలి సుగ్రీవుని 'బతికావుపో' అని మరలిపోయాడు.

లక్ష్మణ హనుమంతులతో కూడి శ్రీరాముడు సుగ్రీవుని వద్దకు వచ్చాడు. సుగ్రీవుడు సిగ్గుతో తలదించుకున్నాడు. 'నీ సూచన పాటించినందుకు ఫలితమిదేనా?' అని ప్రశ్నించాడు. శ్రీరాముడు అసలు విషయం చెప్పాడు. సుగ్రీవుని గుర్తించడానికి వీలుగా 'నాగకేసరపులత'ను మెడలో వేయమని లక్ష్మణునకు చెప్పాడు. అన్న ఆజ్ఞను వెంటనే అమలుచేశాడు లక్ష్మణుడు. పూలతో నిండిన ఆ లతను ధరించి సుగ్రీవుడు తిరిగి యుద్ధానికి సన్నద్ధమయ్యాడు.

కిష్కింధకు ప్రయాణమయ్యారందరూ. సుగ్రీవుడు వాలిని మళ్ళీ యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి అడుగుముందుకు వేశాడు. కాని అతని భార్య తార అడ్డుపడింది. ఒకసారి ఓడిపోయి దెబ్బలు తిన్న సుగ్రీవుడు మళ్లీ ఆహ్వానించడం వెనుక ఏదో ఆంతర్యం ఉందని అభిప్రాయపడింది. సుగ్రీవునికి శ్రీరాముడు అండగా ఉన్నాడన్న విషయాన్ని ప్రస్తావించింది. యుద్ధానికి వెళ్ళడం క్షేమంకాదని వారించింది. తారమాటలను పెడచెవిన పెట్టాడు వాలి. యుద్ధదిశగా అడుగులు వేశాడు.

వాలిసుగ్రీవుల పోరు తీవ్రంగా సాగుతున్నది. రక్తం కారుతున్నా పట్టించుకునే స్థితిలో లేరు వారిద్దరు. మెల్లమెల్లగా సుగ్రీవుని శక్తి సన్నగిల్లుతున్నది. మాటిమాటికి దిక్కులు చూస్తున్నాడు. అతని ఆంతర్యం అర్థమైంది శ్రీరామునికి. విషసర్పంతో సమానమైన బాణాన్ని వదిలాడు వాలి మీదకు. అది క్షణాలలో వాలి వక్షఃస్థలంలో నాటుకున్నది. వాలి నేలపై వాలిపోయాడు. స్పృహకోల్పోయాడు. రక్తపుమడుగులో పడివున్న వాలి కొంతసేపటికి తేరుకున్నాడు. రామలక్ష్మణులను చూశాడు. శ్రీరామునితో 'ఉత్తముడని పేరుపొందిన నీవు ఇంత అధర్మంగా ఎందుకు ప్రవర్తించావు? నీకు నీ దేశానికి నేనెన్నడూ అపకారం చేయతలపెట్టలేదు. అలాంటప్పుడు నన్నెందుకు చంపవలసివచ్చింది. నిన్ను ఎదిరించి యుద్ధమే చేయలేదు. వేరొకరితో పోరుతున్నప్పుడు ఎందుకు దొంగదెబ్బ తీశావ'ని నిలదీశాడు. సీతాదేవి కొరకు సుగ్రీవుని ఆశ్రయించడంకన్నా తనను కోరివుంటే బాగుండేదన్నాడు. ఒక్కరోజులో సీతాదేవిని తెచ్చి అప్పజెప్పే వాడనని పలికాడు. రావణుని యుద్ధంలో బంధించి తెచ్చి ముందుంచే వాడినని తెలిపాడు.

శ్రీరాముడు వాలి అభిప్రాయాలను త్రోసిపుచ్చాడు. తమ్ముని భార్యను చెరబట్టుట వంటి అధర్మాలకు ఒడిగట్టినందున మరణదండన విధించానన్నాడు శ్రీరాముడు. వానరుడివి కనుక చాటుగా ఉండి చంపడంలో తప్పులేదన్నాడు.

శ్రీరాముని మాటలు విన్న వాలి తన తప్పును తెలుసుకున్నాడు. మన్నించమని దోసిలొగ్గాడు. భర్త విషయం తెలుసుకున్న తార పరుగుపరుగున వచ్చింది. మరణశయ్యపై పడివున్న వాలి దీనస్థితిని చూసింది. గుండె చెరువయ్యేటట్లు ఏడ్చింది. ప్రాయోపవేశానికి సిద్ధపడిన తారను హనుమంతుడు ఓదార్చాడు. తార, అంగదుల బాధ్యతను సుగ్రీవునకు అప్పజెప్పాడు వాలి. తనమెడలోని దివ్యమైన సువర్ణమాలను సుగ్రీవునకిచ్చి వెంటనే ధరించమన్నాడు. లేకుంటే వాలి చనిపోయిన మరుక్షణమే ఆ మాల యొక్క శక్తి నశిస్తుంది. కొడుకైన అంగదునికి జీవితంలో ఎలా నడచుకోవాలో ఉపదేశించాడు. బాణం వల్ల కలుగుతున్న బాధ అంతకంతకూ అధికమై ప్రాణాలను వదిలాడు. వాలి జీవితాధ్యాయం ముగిసింది.

సుగ్రీవ హనుమదాదులు శ్రీరాముని వద్దకు వచ్చారు. హనుమంతుడు శ్రీరామునితో సుగ్రీవుని పట్టాభిషేక విషయం ప్రస్తావించాడు. దీనికై కిష్కింధకు రమ్మని ప్రార్థించాడు. తండ్రి ఆజ్ఞమేరకు పద్నాలుగు సంవత్సరాల వరకు ఏ గ్రామమునగాని నగరమున గాని అడుగుపెట్టనని చెప్పి పితృవాక్య పరిపాలనను మరోమారు చాటుకున్నాడు శ్రీరాముడు. సుగ్రీవునకు శుభం పలికాడు. తాను ప్రసవణగిరి యందు ఉంటానన్నాడు. వర్షాకాలం పోయాక సీతాన్వేషణ ప్రయత్నం ప్రారంభించమని సుగ్రీవుని ఆదేశించాడు. సరేనన్నాడు సుగ్రీవుడు.

కిష్కింధకు రాజుగా సుగ్రీవుడు, యువరాజుగా అంగదుడు పట్టాభిషిక్తులయ్యారు. కాలం గడుస్తున్నది. శరత్కాలం వచ్చింది. సీతాన్వేషణ కార్యభారాన్ని సుగ్రీవునకు గుర్తుచేశాడు హనుమంతుడు. తదనుగుణంగా సేనలను సమీకరించమని సేనాపతియైన 'నీలుని' ఆజ్ఞాపించాడు సుగ్రీవుడు. ఇది శ్రీరామునికి తెలియదు. లక్ష్మణుణ్ణి పిలిచి సుగ్రీవుని వద్దకు వెళ్ళమన్నాడు.

లక్ష్మణుడు కిష్కింధకు పయనమయ్యాడు. సుగ్రీవుడు రాజభోగాలలో ఓలలాడుతున్నాడు. సీతాదేవి ఎడబాటులో నిలువునా నీరవుతున్న అన్నగారు, నిలువెత్తు నిర్లక్ష్యంతో సుగ్రీవుడు – ఆగ్రహం కట్టలు తెంచుకుంది లక్ష్మణునికి. బుసలు కొడుతున్నాడు. అతని ముందుకు రావడానికి ఎవరికీ కాళ్ళాడడంలేదు. వానరులూ, మంత్రులేకాదు – సుగ్రీవుని పరిస్థితీ అంతే. మందిర ద్వారం వద్దకు వచ్చిన లక్ష్మణునితో మాట్లాడటానికి తార వెళ్ళింది. స్త్రీలపట్ల కోపం ప్రదర్శించరాదని శాంతించాడు లక్ష్మణుడు. సీతాన్వేషణకు సుగ్రీవుడు శ్రీకారం చుట్టాడని తార లక్ష్మణునికి తెలిపింది. అంతఃపురంలో ఉన్న సుగ్రీవుని కలిశాడు లక్ష్మణుడు. శ్రీరాముని దయవల్లనే తానీ స్థితిలో ఉన్నానని కృతజ్ఞత ప్రకటించాడు సుగ్రీవుడు. మహా పరాక్రమశాలియైన శ్రీరామునకు తన సహాయం నిమిత్తమాత్రమేనన్నాడు. తనవైపునుండి ఏదైనా తప్పు జరిగితే మన్నించమన్నాడు. లక్ష్మణుడు శాంతించాడు. తన అన్నగారి వద్దకు సుగ్రీవుని రమ్మన్నాడు.

సుగ్రీవుడు వివిధ ప్రాంతాలలోగల వానర వీరులను రావలసిందిగా చెప్పమని హనుమంతుని ఆజ్ఞాపించాడు. పదిరోజుల్లోపు రాకుంటే వారికి మరణదండన తప్పదని హెచ్చరించాడు. హనుమంతుడు ఈ వార్తను అన్ని దిక్కులకూ వేగంగా పంపాడు. ఫలితంగా కోట్లమంది వానరయోధులు కిష్కింధకు చేరుకుంటున్నారు. సుగ్రీవుని ఆజ్ఞ అటువంటిది. దానికి తిరుగులేదు. అందుకే 'సుగ్రీవాజ్ఞ' అనేది జాతీయంగా స్థిరపడ్డది.

శ్రీరామునితో సుగ్రీవుడు సమావేశమయ్యాడు. వానరుల రాకను గురించి తెలిపాడు. సీతజాడను తెలుసుకోవడం, రావణుని నివాసాన్ని పసిగట్టడమే ప్రధానకర్తవ్యమన్నాడు శ్రీరాముడు. శ్రీరాముని సూచన మేరకు సీతాన్వేషణకై వానర వీరులను నలుదిక్కులకు పంపాడు తూర్పు దిక్కునకు 'వినతుని' నాయకత్వంలో సేనను పంపాడు. దక్షిణ దిక్కుకు అంగదుని నాయకత్వంలో హనుమంతుడు, జాంబవంతుడు మొదలైన ప్రముఖులతో కూడిన సేనను పంపాడు. మేనమామయైన సుషేణుని నాయకత్వంలో పడమరకు, శతవలి నాయకత్వంలో ఉత్తర దిశకు సేనను పంపాడు. ఒక్కొక్క దిక్కున ఏయే ప్రదేశాలగుండా వెళ్లాలో, అక్కడ ఏమేమి ఉంటాయో వివరంగా చెప్పాడు సుగ్రీవుడు. ఆ ప్రదేశాలకు సంబంధించిన అతని జ్ఞానం చూస్తే ముక్కున వేలేసుకుంటాం. నెలరోజుల్లో సమాచారం తెమ్మని సుగ్రీవాజ్ఞ. సీతాన్వేషణను సఫలం చేయగల సమర్థుడు హనుమంతుడేనని సుగ్రీవుని నమ్మకం. హనుమంతుడూ అంతే విశ్వాసంతో ఉన్నాడు. శ్రీరాముని భావనకూడా అదే. అందుకే తనపేరు చెక్కబడిన ఉంగరాన్ని హనుమంతునకు ఇచ్చాడు శ్రీరాముడు. దీనిని సీత చూస్తే రామదూతగా హనుమను నమ్ముతుందన్నాడు. హనుమంతుడు నమస్కరించి రాముముద్రికను గ్రహించాడు. శ్రీరాముని పాదాలకు ప్రణమిల్లి ప్రమాణమయ్యాడు.

సీతాన్వేషణకు బయలుదేరి నెలరోజులు కావస్తున్నది. తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు వెళ్ళినవాళ్ళు తీవ్రంగా వెదికి వెదికి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. గడువు ముగిసేనాటికి ప్రసవణగిరిలో శ్రీరామునితో ఉన్న సుగ్రీవుని వద్దకు చేరుకున్నారు. సీతజాడకై చేసిన కృషి ఫలించలేదని విన్నవించుకున్నారు. హనుమంతుడు ఈ విషయంలో కృతకృత్యుడౌతాడని ధీమా వ్యక్తంచేశారు. ఎందుకంటే రావణుడు సీతను తీసుకెళ్ళింది దక్షిణంవైపుకే గదా.

అంగదుని నాయకత్వంలో దక్షిణం వైపుకు బయలుదేరిన హనుమంతుడు మొదలగువారు అణువణువునా గాలిస్తున్నారు. సుగ్రీవుడిచ్చిన గడువు పూర్తయింది. ఏం చేయాలో తోచడం లేదు. తమ వారు నిరాశ పడకుండా జాగ్రత్తపడ్డాడు అంగదుడు. విరక్తి పొందకుండా ధైర్యోత్సాహాలతో మందుకు సాగితే విజయం వరిస్తుందని ప్రేరేపించాడు. అందరూ రెట్టించిన ఉత్సాహంతో ముందుకు కదిలారు.

హనుమదాదులు ఒక పెద్ద గుహవద్దకు చేరుకున్నారు. అది 'ఋక్షబిలము'. ఒక రాక్షసుని అధీనంలో ఉంది. బాగా అలసిపోయిన వానరులను ఆకలిదప్పులు పట్టి పీడిస్తున్నాయి. గుహలోకి వెళ్ళారు. అంతా అయోమయంగా ఉంది. చివరకు స్వయంప్రభ అనే యోగిని అనుగ్రహంతో ఆకలిదప్పులను తీర్చుకున్నారు. ఆమెను ప్రార్థించి ఆమె తపః ప్రభావం వల్ల క్షణాలలో ఒక పెద్దసముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. ఆ సముద్రాన్ని 'మహోదధి' అంటారు. ఉవ్వెత్తున లేచే అలల అలజడి భయాన్ని కలిగిస్తున్నది.

సముద్రతీరంలో వానరులంతా సమావేశమయ్యారు. ఏం చెయ్యాలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు. సీత జాడ కనిపెట్టకుండా సుగ్రీవుని చేరరాదనుకున్నారు.

వీరి మాటల్లో 'జటాయువు' ప్రస్తావనను విన్నాడు 'సంపాతి'. ఇతడు పక్షిరాజు, జటాయువునకు అన్న. రెక్కలులేక పడివున్నాడు. సంపాతి తన సోదరుని మరణానికి ఎంతో విలపించాడు. దివ్యదృష్టితో లంకలో సీత ఉన్న పరిస్థితులను కనులకు కట్టినట్లు వివరించాడు. లంకకు ఎలా వెళ్లాలో చెప్పాడు. ఇంతలో ఆశ్చర్యకరంగా సంపాతికి రెక్కలు మొలిచాయి. పరోపకారపుణ్యం ఊరికేపోతుందా? అందరూ ఆనందించారు. తన రెక్కల బలాన్ని తెలుసుకోవడానికి రివ్వున ఆకాశంలోకి ఎగిరాడు సంపాతి.

వానర వీరులు బలపరాక్రమాలను ప్రదర్శించడం ద్వారానే సీతాన్వేషణ సఫలమౌతుందన్న నిశ్చయానికి వచ్చారు. కాని వంద యోజనాలు వెళ్ళిరాగలవారెవ్వరని తర్కించుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్యహాని కలుగకుండా కాపాడగలవాడు హనుమంతుడొక్కడేనని నిగ్గుదేల్చాడు జాంబవంతుడు. ఆ సమయంలో హనుమంతుడు ఒకచోట ఏకాంతంగా కూర్చునివున్నాడు.

హనుమంతుని చేరాడు జాంబవంతుడు. అతని శక్తియుక్తులెంతటివో తెలుపుతూ ప్రేరేపించాడు. దీనికి వానరుల ప్రశంసలు తోడైనాయి. ఇంకేముంది? హనుమంతుడు రెట్టించిన ఉత్సాహంతో బలాన్ని పుంజుకున్నాడు. అద్భుతమైన తేజస్సుతో వెలుగుతున్నాడు. వానరులతో 'నేను మేరుపర్వతాన్ని అనాయాసంగా వేలమార్లు చుట్టగలిగాను భూమండలాన్ని సముద్రంలో ముంచగలను, గ్రహ నక్షత్రాలను అధిగమించగలను, పర్వతాలను నుగ్గు నుగ్గు చేయగలను. మహాసముద్రాలను అవలీలగా దాటగలన'ని ఆత్మశక్తిని ప్రకటించాడు. ప్రతివారిలో ఏదో ఒక శక్తి ఉంటుంది. సరైన ప్రేరణ దొరికితే అది వెలికివస్తుంది.

హనుమంతుని మాటలకు జాంబవంతుడు ఆనందించాడు. 'నాయనా! నీ ధైర్యోత్సాహాలకు తగినట్లు మాట్లాడావు. నీ మాటలు వానరుల మనసులో గూడుకట్టుకున్న దుఃఖాన్ని దూరం చేశాయి. అందరం నీ శుభాన్ని కోరుతున్నాం. ఋషులు, వృద్ధవానరులు, గురువుల అనుగ్రహంతో ఈ సముద్రాన్ని లంఘించు. నీ రాకకై ఎదురుచూస్తుంటాం. మన వానరుల ప్రాణాలన్నీ నీపైనే ఆధారపడివున్నాయని' తెలిపాడు. తాను లంఘించే సమయంలో తన బలాన్ని భూమి భరించలేదని, మహేంద్రపర్వత శిఖరాలు అందుకు తగినవని హనుమంతుడు పలికి మహేంద్రగిరికి చేరాడు.



సుందర కాండం



మహాబలుడైన మారుతి సూర్యునికి, మహేంద్రునికి, వాయువునకు, బ్రహ్మకు, ఇతరదేవతలకు నమస్కరించాడు. తన శరీరాన్ని పెంచాడు. ఒళ్ళువిరిచాడు. ప్రళయకాల మేఘగర్జన వలే మహానాదంచేశాడు. చేతులను నడుముపై ఉంచాడు. పాదాలను దట్టించాడు. చెవులను రిక్కించాడు. తోకను విదల్చాడు. అంగదాది మహావీరులతో, 'వాయువేగంతో సాగిపోయే రామబాణంలాగ లంకకు వెళతాను. అక్కడ సీతామాతను చూడలేకుంటే అదే వేగంతో స్వర్గానికి వెళ్ళటం. అక్కడ కూడా సీతామాత దర్శనం కాకుంటే రావణుని బంధించి తీసుకువస్తా. ఏదిఏమైనా కార్యసఫలతతో తిరిగివస్తా'నని పలికాడు. ఒక్క ఉదుటున అంతరిక్షంలోకి ఎగిరాడు. శ్రీరామకార్యమునకు వెళుతున్న హనుమంతునికి సూర్యుడు తాపాన్ని కలిగించలేదు. వాయువు చల్లగా ప్రసరించాడు. దేవతలు, గంధర్వులు, మహర్షులు కీర్తించారు.

సముద్రముపై సాగిపోతున్న హనుమంతుని చూసి సాగరుడు సహాయపడదలచాడు. తానింతవాడుకావడానికి ఇక్ష్వాకు ప్రభువైన సగరుడేకారణమని సాగరుని అభిప్రాయం. ఆ ఇక్ష్వాకు కులతిలకుడైన శ్రీరాముని కార్యమునకై వెళుతున్న హనుమంతునికి శ్రమ కలగకూడదనుకున్నాడు. సముద్రములో ఉన్న మైనాకుని బయటకు వెడలమన్నాడు. అతని బంగారు గిరిశిఖరాలపై హనుమ ఒకింత విశ్రాంతిని తీసుకోగలడని భావించాడు. మైనాకుడు సరేనన్నాడు. ఒక్కసారిగా సముద్రం మధ్య నుండి పైకి లేచాడు. అకస్మాత్తుగా పైకి లేచిన మైనాకుని ఆటంకముగా తలచాడు మారుతి. తన ఎదతో నెట్టివేశాడు. మైనాకుడు అబ్బురపడ్డాడు. మానవరూపంలో గిరిశిఖరంపై నిలచాడు. సముద్రుని కోరికను తెలిపాడు. హనుమంతుడు మైనాకునితో 'నీ ఆదరపూర్వకమైన మాటలకు తృప్తిపడ్డాను. ఆతిథ్యం అందుకున్నట్లే భావించు. సమయంలేదు. ఆగడానికి వీలులేదని' చెప్పి చేతితో అతణ్ణి తాకాడు. ఆతిథ్యం గ్రహించినట్లుగా తెలిపి ముందుకుసాగాడు.

హనుమంతుని పరీక్షించడానికి వచ్చిన 'సురస' అనే నాగమాత అతని సూక్ష్మ బుద్ధిని, సమయస్ఫూర్తిని చూసి ఆనందించి ఆశీర్వదించింది. 'సింహిక' అనే రాక్షసి హనుమంతుని మింగాలని చూసింది. కాని హనుమయే తన వాడియైన గోళ్ళతో సింహికను చీల్చివేశాడు.

త్రికూట పర్వతముపై ఉన్న లంకకు చేరాడు హనుమంతుడు. నూరు యోజనాలు ప్రయాణించినా అణుమాత్రమైనా అలసిపోలేదు. శత్రుదుర్భేద్యమైన లంకను చూశాడు. అందులో ప్రవేశించడానికి రాత్రి సమయమే అనుకూలమనుకున్నాడు. అంతవరకు వేచి ఉన్నాడు. రాత్రికాగానే పిల్లి ప్రమాణంలో తన శరీరాన్ని కుదించుకుని లంకలోకి ప్రవేశించాడు. ఇంతలో లంకాధిదేవత (లంకిణి) అతన్ని చూసింది. 'నీవెవరు? ఎందుకొచ్చావ'ని నిలదీసింది. యథార్థం చెప్పమని గద్దించింది. తనను కాదని లంకలో ప్రవేశించడం సాధ్యంకాదన్నది. తన చేతిలో చావు తప్పదని హనుమంతుని బెదిరించింది. హనుమంతుడు 'లంకానగరం అందంగా ఉంటుందని తెలుసుకున్నాను. ఒకసారి చూసిపోవాలని వచ్చాను. చూసాక వచ్చిన దారినే వెళతాన'ని చెప్పాడు. లంకిణి భయంకరంగా అరుస్తూ తన అరచేతితో హనుమంతుని బలంగా కొట్టింది. హనుమంతుడు మహానాదం చేస్తూ

ఎడమచేతితో లంకిణిపై ఒక్కదెబ్బవేశాడు. స్త్రీ అని గట్టిగా కొట్టలేదు. కాని ఆమాత్రం దెబ్బకే కూలబడిపోయింది లంకిణి. బ్రహ్మవరం జ్ఞాపకం చేసుకుంది. వానరుడు లంకిణిని జయించినప్పుడు రాక్షసులకు కీడుమూడుతుందని బ్రహ్మ చెప్పాడు. ఆ సమయం ఆసన్నమైందని హనుమంతునితో పలికింది. లంకలోకి వెళ్ళమని చెప్పింది.

హనుమంతుడు ముఖద్వారం గుండా లంకలోకి వెళ్ళలేదు. ప్రాకారంపై నుండి దూకి వెళ్ళాడు. అది కూడా ఎడమ పాదం ముందుబెట్టి. శత్రువుల వద్దకు వెళ్ళే సంప్రదాయం ఇది. లంకలో ప్రవేశించిన మారుతి చిత్రవిచిత్రాలైన ఇండ్లను చూశాడు. సంగీత మాధుర్యాన్ని చవిచూశాడు. వేదఘోషను విన్నాడు. రకరకాల వారిని చూశాడు. సర్వాంగ సుందరమైన రావణుని భవనాన్ని చూశాడు. ఎక్కడా సీత జాడ కనిపించలేదు. మహాపార్శ్వ, కుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వాదుల భవనాలన్నీ వెతికాడు.

రావణాంతఃపురంలోకి వెళ్ళాడు. ఎందరో స్త్రీలు చెల్లా చెదరుగా నిద్రపోవడం చూశాడు. ప్రత్యేక శయ్యపై పవళించిన ఒక స్త్రీని చూశాడు. మహా సౌందర్యంతో వెలిగిపోతున్న ఆమె రావణుని భార్య మండోదరి. కాని హనుమంతుడు సీతయని భ్రమించాడు. సీతను చూశాననుకొని గంతులు వేశాడు. కొద్దిసేపటికే తన ఆలోచన తప్పని గ్రహించాడు. శ్రీరాముని ఎడబాసి సీత ఇలా ఉండగలుగుతుందా? అని అనుకున్నాడు. ఆమె సీతకానేకాదని నిశ్చయించుకున్నాడు.

ఎక్కడా సీత జాడ తెలియకపోయేసరికి సీత మరణించిదేమోనని సందేహించాడు హనుమంతుడు. సీత జాడను కనిపెట్టలేకపోయిన తాను ఏ ముఖం పెట్టుకుని అంగదాదులకు చెప్పాలని ఆవేదన చెందాడు. అయినా నిరుత్సాహపడకూడదని నిర్ణయించుకున్నాడు. ఇంత వరకు వెతకని ప్రాంతాలకు వెళ్ళాలని తీర్మానించుకున్నాడు. ఎక్కడకు వెళ్ళినా నిరాశే పలకరిస్తున్నది. సీత కనబడలేదని చెపితే శ్రీరాముడు జీవించడు. అతడు లేక లక్ష్మణుడుండడు. వీరి మరణ వార్త విని భరత శత్రుఘ్నులుండరు. పుత్రుల మరణానికి తట్టుకోలేక కౌసల్యా సుమిత్ర కైకేయిలు తనువులు చాలిస్తారు. ప్రియమిత్రుని వీడి సుగ్రీవుడు బతుకడు. దానితో రమ, తార, అంగదులు మిగలరు. ఇది చూసి వానరజాతి ఈ లోకాన్ని వీడుతుంది. ఇందరి మరణానికి కారణం కావడంకన్నా ప్రాయోపవేశంతో ప్రాణాలు వదలడమే మంచిదనిపించింది మారుతికి. కాని తర్కించి చూస్తే ఆత్మహత్యకన్నా బతికుండడమే ఎన్నో విధాల ఉత్తమమనిపించింది. చచ్చి సాధించేదేమిటి? బతికితే సుఖాలను, శుభాలను పొందవచ్చు. బతికి ఉన్నవారు ఎన్నడైనా కలుసుకోవచ్చు. అందుకే ప్రాణాలను నిలుపుకోవాలని నిర్ణయించుకున్నాడు.

అప్పటివరకు వెతకని అశోకవనంలోకి వెళ్ళాలనుకున్నాడు. సీతారామలక్ష్మణులకు, రుద్ర, ఇంద్ర, యమ, వాయుదేవులకు సూర్యచంద్ర మరుద్గణాలకు నమస్కరించాడు. అశోకవనంలోకి అడుగుపెట్టాడు. ఇంద్రుని నందనవనం లాగా ఉంది అశోకవనం.

అణువణువు వెదికాడు హనుమంతుడు. ఎత్తైన శింశుపావృక్షాన్ని ఎక్కాడు. మలిన వస్త్రాలను కట్టుకున్న ఒక స్త్రీని చూశాడు. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలున్నారు. ఆమె కృశించివుంది. దీనావస్థలో ఉంది. ఆమె సీతయే అనిపించింది హనుమంతునికి. ఆమె ధరించిన ఆభరణాలను చూశాడు. రాముడు చెప్పిన వాటితో సరిపోతున్నాయి. ఋష్యమూక పర్వతంపై పడిన ఆభరణాలు ఈమె శరీరంపై కనిపించడంలేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ఆమె సీతయేనని దృఢపరచుకున్నాడు. ఆ వృక్షంపైనే ఉండిపోయాడు.

సీతాదేవిని చూడగానే హనుమంతుని కన్నుల నుండి ఆనందాశ్రులు జారాయి. శ్రీరాముని స్మరించుకొని నమస్కరించాడు.

వేకువజామయింది. వేదఘోషలు వినబడుతున్నాయి. నిద్రలేచిన రావణుడు అశోకవనంవైపు అడుగులు వేస్తున్నాడు. సుగంధతైలాలతో తడువబడిన కాగడాలను ధరించిన స్త్రీలు ముందు నడుస్తున్నారు. రావణుని తేజస్సు చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు హనుమ. సీత వద్దకు వచ్చి రావణుడు నయానా భయాన సీత మనసుమార్చే ప్రయత్నం చేశాడు. కాని ఎట్టి ప్రలోభాలకు తాను లొంగనని సీత తేల్చిచెప్పింది. శ్రీరాముని నుండి తప్పించుకోవడం సాధ్యంకాదని హెచ్చరించింది. రావణునిలో ఆవేశం పెల్లుబికింది.

రెండు నెలల గడువు విధించాడు. ఎలాగైనా సీతను తన దారికి తెమ్మని రాక్షస స్త్రీలను ఆదేశించి తన భవనానికి చేరుకున్నాడు.

రాక్షస స్త్రీలు ఎన్నో రకాలుగా సీతకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె నిరాకరించింది. చివరకు సీతను చంపుతామని భయపెట్టారు. ఈ దుఃస్థితికి సీత ఎంతో విలపించింది. శ్రీరామునికి దూరమై బ్రతకడంకన్నా శరీరాన్ని విడవడమే మేలన్నది.

ఈ మాటలను విని కొందరు రాక్షస స్త్రీలు రావణునికీ విషయం చెప్పడానికి వెళ్ళారు. ఇంకొందరు తక్షణమే సీతను బంధించగలమన్నారు. అంతవరకు నిదురించిన త్రిజట అప్పుడే మేల్కొంది. త్రిజట విభీషణుని కూతురు. రాక్షస స్త్రీలను అదలించింది. తనకు వచ్చిన కలను చెప్పింది. 'వేయి హంసలతో కూడిన పల్లకిపై లక్ష్మణునితో శ్రీరాముడు కూర్చునట్లు చూశాను. సముద్రం మధ్య ఒక తెల్లని పర్వతంపై సీత కూర్చోవడం చూశాను. నూనెపూయబడిన శరీరంతో రావణుడు నేలపై బడి ఉండడం చూశాను. నల్లని స్త్రీ శరీరమంతా బురద పూసుకొని ఎర్రని వస్త్రములు కట్టి, రావణుని మెడకు తాడుకట్టి దక్షిణంవైపుగా ఈడ్చుకువెళ్ళడం చూశాను. వరాహంపై రావణుడు, మొసలిపై ఇంద్రజిత్తూ, ఒంటెపై కుంభకర్ణుడు దక్షిణదిశగా వెళ్ళడం చూశాను. లంక ఛిన్నాభిన్నం కావడం చూశాను' అన్నది. స్వప్నంలో విమానదర్శనం కావడాన్ని బట్టి సీత కోరిక సిద్ధిస్తుందని, రావణునికి వినాశం తప్పదని, శ్రీరామునికి జయం కల్గుతుందనీ చెప్పింది.

ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ సీతకు శుభశకునాలు తోచాయి. చెట్టుపై ఉన్న హనుమంతుడు సీతాదేవిని ఎలా కాపాడుకోవాలో అని మథనపడ్డాడు. రామకథాగానమే సరైన మార్గమని ఎంచుకున్నాడు. సీతాదేవికి వినపడేటట్లు రామకథను వర్ణించాడు. సీతాదేవి అన్నివైపులా చూసింది. చెట్టుపై ఉన్న హనుమంతుని చూసి ఆశ్చర్యానికి లోనైంది. హనుమంతుడు చెట్టుదిగి నమస్కరించాడు. 'అమ్మా నీవెవరు? ఒకవేళ సీతాదేవివే అయితే శుభమగుగాక. దయతో విషయములు చెప్పుమ'ని ప్రార్థించాడు. తనను 'సీత' అంటారని తెలిపిందా సాధ్వి – తన వృత్తాంతమంతా వివరించింది.

హనుమంతుడు తాను శ్రీరామ దూతనని చెప్పుకొన్నాడు. దగ్గరగా వస్తున్న మారుతిని చూసి రావణునిగా అనుమానించింది సీత. నిజంగా రామదూతవే అయితే రాముని గురించి వినిపించమంది. సీత కోరికపై హనుమ శ్రీరాముని రూప గుణాలను వివరించాడు. శ్రీరామ ముద్రికను సమర్పించాడు. దానిని చూసి పరమానందభరితురాలైంది సీత. తనదైన్యాన్ని వివరించి శ్రీరాముని త్వరగా లంకకు తీసుకువచ్చి రాక్షస చెరనుండి తనను విడిపించమని మారుతికి చెప్పింది. అంతదాకా ఎందుకు? తన వీపుపై కూర్చుంటే తక్షణమే శ్రీరాముని సన్నిధికి చేరుస్తానన్నాడు హనుమంతుడు. ఇంత చిన్నవాడివి ఎలా తీసుకెళ్ళగలవని ప్రశ్నించింది. హనుమంతుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. సంతోషించింది సీత. అయినా హనుమతో వెళ్ళడానికి నిరాకరించింది. పరపురుషుని తాకనన్నది. శ్రీరాముడు రావణుని సంహరించి తనను తీసుకుపోవడమే ఆయన స్థాయికి తగినదన్నది.

'అమ్మా! నా వెంట రావడం నీకు అంగీకారయోగ్యం కాకుంటే శ్రీరాముడు గుర్తించగల ఏదైనా ఆనవాలు ఇమ్మ'ని అడిగాడు హనుమంతుడు. తమ అనుబంధానికి గుర్తుగా కాకాసురుని కథ చెప్పింది. కొంగుముడి విప్పి అందులోని దివ్యచూడామణిని హనుమంతునికిచ్చింది.

సీతాదేవి దర్శనంతో ప్రధాన కార్యం ముగిసింది హనుమంతునికి. రావణుడు, అతని సైన్యపు శక్తి సామర్థ్యాలను కూడా తెలుసుకోవాలనిపించింది. అందుకు అశోకవనాన్ని ధ్వంసం చేయడమే మార్గంగా భావించాడు. అనుకున్నంతా చేశాడు ఆ కపివీరుడు. రాక్షస స్త్రీలు పరుగుపరుగున వెళ్ళి లంకేశునికివిషయం చెప్పారు. రావణుడు ఎనభైవేల మంది రాక్షసులను పంపాడు. హనుమంతుడు వారిని మట్టుపెట్టాడు. తనపైకి వచ్చిన జంబుమాలిని, మంత్రిపుత్రులేడుగురిని రావణుని సేనాపతులైదుగురిని, అక్షకుమారుణ్ణి అంతమొందించాడు. చివరకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి హనుమంతుని బంధించాడు. బ్రహ్మవరంచే అది హనుమంతునిపై క్షణకాలమే పనిచేస్తుంది. అయినా కట్టుబడివున్నట్లు నటించాడు హనుమ. రావణుని ముందు ప్రవేశపెట్టారతనిని. రావణుడడుగగా తాను రామ దూతనని చెప్పాడు. శ్రీరాముని పరాక్రమమెలాంటిదో సభాముఖంగా చాటాడు.

సహించలేని రావణుడు హనుమంతుని చంపమని ఆజ్ఞ ఇచ్చాడు. దూతను చంపడం భావ్యం కాదన్నాడు విభీషణుడు. ఇతర పద్ధతుల్లో దూతను దండించవచ్చునన్నాడు.

హనుమంతుని తోకకు నిప్పంటించి లంకంతా కలయ దిప్పమన్నాడు రావణుడు. బట్టలతో హనుమంతుని తోకను చుట్టారు. నూనెతో తడిపారు. తోకకు నిప్పుపెట్టి ఊరంతా ఊరేగిస్తున్నారు. హనుమంతుడు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాడు. విభీషణుని భవనం తప్ప లంకకంతా నిప్పుపెట్టాడు. అందుకే '(సీతను) చూసిరమ్మంటే (లంకను) కాల్చివచ్చాడని' సామెత పుట్టింది. లంకంలో హాహాకారాలు మిన్నుముట్టాయి.

లంకను కాల్చాక హనుమంతుడు సముద్రంలో తోకను చల్లార్చుకున్నాడు. తోకతోపాటు ఆయన కోపంకూడా చల్లారింది. తాను తప్పు చేశాననుకున్నాడు. కోపం ఎంతో అనర్థదాయకమనుకున్నాడు. లంకంతా కాలి మాత సీతాదేవి కూడా దహింపబడి ఉంటుందని బాధపడ్డాడు. వచ్చిన పనిని చేజేతులా పాడుచేసుకొన్నందుకు తనను తాను నిందించుకున్నాడు. కాని ఎక్కడో చిన్న ఆశ. తన తోకనే కాల్చని అగ్నిదేవుడు పరమ పూజ్యురాలైన సీతను దహిస్తాడా? అని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇంతలో సీత క్షేమంగా ఉందని చారణుల ద్వారా తెలుసుకొని చాలా సంతోషించాడు. సీతమ్మ వద్దకు చేరి పాదాభివందనం చేశాడు. ఆమె అనుమతితో తిరుగు ప్రయాణమయ్యాడు.

'అరిష్టము' అనే పర్వతమునెక్కాడు. అక్కడి నుండి ఆకాశంలోకి ఎగిరాడు. మధ్యలో ఆత్మీయపూర్వకంగా మైనాకుడిని తాకి వేగంగా ప్రయాణం కొనసాగించాడు. మహేంద్రగిరికి చేరుకోబోతుండగా మహానాదం చేశాడు. జాంబవంతుడు దానిని విని పొంగిపోయాడు. హనుమంతుడు విజయుడై తిరిగివస్తున్నాడని వానరులకు తెలిపాడు.

హనుమంతుడు మహేంద్రగిరి శిఖరంపై అడుగుపెట్టాడు. వానరులంతా చుట్టూచేరారు. పెద్దలకు నమస్కరించాడు హనుమ. 'కనుగొంటి సీతమ్మ'ను అని ప్రకటించాడు. అందరూ ఆనందించారు. లంకా ప్రయాణ విశేషాలను వారికి వివరించాడు మారుతి. అంగదుడు 'ఓ వీరులారా! సీతాదేవి జాడ తెలిసిన తరువాత కూడా ఆమె లేకుండా శ్రీరాముని వద్దకు వెళ్ళడం సబబుకాదు. లంకకు వెళ్ళి రావణుని చంపి సీతను తీసుకొని శ్రీరాముని వద్దకు వెళదా'మని అన్నాడు. జాంబవంతుడు అంగదుని మాటలను ఖండించాడు. శ్రీరామ సుగ్రీవులు సీతను చూచిరమ్మన్నారేకాని తీసుకురమ్మనలేదు. పైగా రావణుని సంహరిస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసియున్నాడు. దానికి భంగం కలుగనీయరాదన్నాడు. అందరూ వెళ్ళి జరిగిన విషయాలను నివేదిద్దామన్నాడు.

దారిలో అందరూ మధువనంలోకి వెళ్ళారు. తేనెలు తాగారు. మధువనాన్ని ధ్వంసంచేశారు. మధువనం సుగ్రీవుని రక్షణలో ఉన్నది. అతని మేనమామ దధిముఖుడు దాన్ని కాపాడుతున్నాడు. వానరుల ధాటికి దధిముఖుడు గాయాల పాలయ్యాడు. వెంటనే వెళ్ళి సుగ్రీవునికీ విషయం చెప్పాడు. ఇదంతా శుభసూచకంగా భావించాడు సుగ్రీవుడు.

అంగద హనుమదాదులు శ్రీరాముడు సుగ్రీవుడున్న చోటుకు చేరారు. హనుమంతుడు శ్రీరామునకు సాష్టాంగ నమస్కారం చేశాడు. 'కనుగొంటి సీతమ్మను' అని చెప్పాడు. రామలక్ష్మణుల ఆనందానికి అంతులేదు. సీత ఇచ్చిన చూడామణిని శ్రీరామునకు సమర్పించాడు హనుమ. శ్రీరాముని కోరిక మేరకు సీతాన్వేషణ వృత్తాంతాన్ని చెప్పాడు.



యుద్ధ కాండం



శ్రీరాముడు హనుమంతుని సాహసాన్ని ప్రశంసించాడు. గరుత్మంతుడు, వాయుదేవుడు, హనుమంతునికి తప్ప ఈ మహాసముద్రాన్ని లంఘించడానికి ఇతరులకు సాధ్యం కాదన్నాడు. ఇచ్చిన పనిని సాధించడమేగాక, దానికి భంగం కలుగకుండా దానికనుబంధమైన ఇతర కార్యాలను సాధించేవాడు ఉత్తముడైన సేవకుడు. కేవలం ఇచ్చిన పనినే నెరవేర్చేవాడు మధ్యముడు. తనకు సామర్థ్యం ఉన్నా ఇచ్చిన పనిని పూర్తిచేయనివాడు అధముడు. సీతాదేవి కుశల వార్త చెప్పి మహోపకారం చేసిన హనుమంతునకు ఏమియ్యగలనంటూ దగ్గరకు తీసుకొని గట్టిగా గుండెకు హత్తుకున్నాడు శ్రీరాముడు. ఇదే తానియ్యగల సర్వస్వమన్నాడు. ఆదరాభిమానాలకు మించిన ఆస్తి ఉండదు కదా!

శ్రీరాముని మనసులో మళ్ళీ దుఃఖం పొంగిపొర్లింది. సుగ్రీవుడు ఊరడించాడు. నిరుత్సాహం ప్రయోజనాలను నాశనం చేస్తుందన్నాడు. దుఃఖం శౌర్య పరాక్రమాలను దిగజారుస్తుందన్నాడు. శత్రువు విషయంలో ఇప్పుడు దుఃఖం కాదు, క్రోధం చూపవలసిన సమయమని సూచించాడు. మహాసముద్రంపై సేతువును కట్టకుండా లంకను జయించడం ఇంద్రాది దేవతలకూ కానిపని అన్నాడు. శ్రీరాముడు అడుగగా హనుమంతుడు లంకానగరంలోని రక్షణ వ్యవస్థను గూర్చి వివరంగా చెప్పాడు.

మధ్యాహ్నమైంది. ఈ విజయ ముహూర్తమే లంకా ప్రయాణానికి తగినదని శ్రీరాముడు సుగ్రీవునితో అన్నాడు. శ్రీరాముడు వానరులతో, 'నీలుడు సైన్యమునకు మార్గం చూపుతూ ముందునడవాలి. లక్షలాది వానరులు అతణ్ణి అనుసరించాలి. బాలురు వృద్ధులు, బలహీనులు కిష్కింధలోనే ఉండాలి. సుగ్రీవా! నేను హనుమంతుని భుజముపై, లక్ష్మణుడు అంగదుని భుజముపై కూర్చొని ముందుకు సాగుతాం. నీవు పల్లకినెక్కి మాతోపాటు రావాలి. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి సైన్యం వెనుకభాగంలో ఉండి రక్షణా బాధ్యతను చూడాలి. వెళ్ళేమార్గంలో నగరాలు, గ్రామాలు ఉంటే వాటిలోకి వెళ్ళరాదు. జల, ఫల, సంద్రమైన మూలం చూడాలి. మార్గం వెంట మనం ప్రయాణించాలి' అని రాముడు సూచించాడు. ఉత్సాహం ఉరకలు వేస్తుంటే అందరూ సముద్రతీరాల్ని చేరుకున్నారు.

లంకలో రావణుడు మంత్రులతో సమావేశమయ్యాడు. వానరులను ఎదుర్కొని లంకను కాపాడుకోవడానికి ఏం చేయాలో నిర్ణయించమన్నాడు. సభలోని వారు రావణ, ఇంద్రజిత్తుల పరాక్రమాన్ని పొగిడారు. నరవానరులను లెక్కచేయాల్సిన అవసరం లేదని పెదవి విరిచారు. 'రాముని హతమార్చగలవ'ని లంకేశునికి ఆత్మస్థైర్యాన్ని కలిగించారు. ప్రహస్తుడు మొదలైనవారు శత్రుసేనలను తామే తుదముట్టించగలమని డంబాలు పలికారు.

ఇవన్నీ విన్నాడు రావణుని సోదరుడు విభీషణుడు. రాక్షసులతో 'శత్రువుల శక్తి సామర్థ్యాలను తెలుసుకోకుండా వారిని చులకనగా భావించకూడదు. శ్రీరాముడు మనకేం అపకారం చేశాడు. మన రాజే సీతను అపహరించుకువచ్చాడు. దీనివల్ల పాపం వస్తుంది. కీర్తి ప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఆయుష్షు తగ్గుతుంది. సంపదలన్నీ నశిస్తాయి. కనుక సీతను శ్రీరామునికి అప్పగించడమే అన్ని విధాలా మంచిది. అనవసరంగా కలహం తెచ్చుకోవడం దేనికి? పైగా శ్రీరాముని వంటి మహావీరునితో

యుద్ధం తగదు! అంటూ రావణునివైపు తిరిగాడు. 'అన్నా! అనవసరంగా కోపించడం మంచిదికాదు. అది ధర్మానికి ఆటంకమౌతుంది. సుఖాలను దూరంచేస్తుంద'ని హితవు పలికాడు. విభీషణుని ఈ హితబోధ 'చెవిటివాని ముందు శంఖమూదినట్ల'యింది. రావణుని భవనానికి వచ్చిన కుంభకర్ణుడు కూడా రావణుణ్ణి తప్పుపట్టాడు. సీతాపహరణ సమయంలో తమను సంప్రదించి ఉంటే బాగుండేదన్నాడు. ఇప్పుడు ఆలోచించి ప్రయోజనం లేదన్నాడు. ఇదంతా 'గతజలసేతుబంధనమే' (నీళ్ళుపోయిన తరువాత అడ్డుకట్టవేయడం)నని కుండ బద్దలుకొట్టినట్టు చెప్పాడు. 'నీవు శత్రువు పట్ల వ్యవహరించిన తీరు సరైనది కాదు, శ్రీరాముడు నిన్ను ఇంకా చంపకుండా ఉండడం నీ అదృష్టం' అన్నాడు. ఇవన్నీ ఎలా ఉన్నా శ్రీరాముని తుదముట్టించే భారం తనదేనని ప్రకటించుకున్నాడు కుంభకర్ణుడు.

రావణుడు విభీషణుని మాటలకు క్రోధావేశాలకు లోనయ్యాడు. తీవ్రస్థాయిలో నిందించాడు. అన్న తండ్రితో సమానుడని అతని నిందలను సహించాడు విభీషణుడు. కాని రావణుని అధర్మమార్గాన్ని మాత్రం సమర్థించలేదు. ధర్మం వీడిన రావణుని వీడడానికే విభీషణుడు నిర్ణయించుకున్నాడు. రెండు గడియల్లో రామలక్ష్మణులున్నచోటికి నలుగురు అనుచరులతో చేరాడు.

ఆకాశంలోనే నిలిచి శ్రీరాముని శరణుకోరాడు విభీషణుడు. అనుగ్రహించాడు దాశరథి. విభీషణుడు శ్రీరాముని పాదాలపై వాలాడు. రావణుని విషయాలన్నీ సంక్షిప్తంగా చెప్పాడు. శ్రీరాముడు విభీషణునితో 'నేను రావణుని బంధుమిత్ర సమేతంగా హతమార్చి నిన్ను రాజును చేస్తాన'ని తమ్ములపై ఒట్టేసి చెప్పాడు. ఈ పనిలో తాను యథాశక్తి సహాయపడగలనని విభీషణుడు మాట ఇచ్చాడు. రాముడు విభీషణుని ఆలింగనం చేసుకున్నాడు. లక్ష్మణునితో వెంటనే సముద్రజలం తెచ్చి లంకారాజుగా విభీషణుని పట్టాభిషిక్తుని చేయమన్నాడు. శ్రీరాముని ఆజ్ఞ వెంటనే ఆచరణ రూపం దాల్చింది. అందరూ ఆనందాన్ని ప్రకటించారు.

సముద్రాన్ని దాటే ఉపాయమేమిటని సుగ్రీవుని ప్రశ్నించాడు శ్రీరాముడు. సముద్రుని ప్రార్థించడంవల్ల ఇది సాధ్యపడుతుందన్నాడు విభీషణుడు. శ్రీరాముడు సముద్రతీరంలో ధర్భాసనంపై కూర్చుని సముద్రుని ఉపాసించాడు. మూడు రాత్రులు గడిచాయి. సముద్రుడు ఎదుట నిలువలేదు. శ్రీరాముని కన్నులు ఎర్రబారాయి. సముద్రుడి అహంకారాన్ని అణగదొక్కాలనుకున్నాడు. నీటినంతా ఇంకిపోయేటట్టు చేయాలనుకున్నాడు. బ్రహ్మాస్త్రాన్ని స్మరించాడు. ప్రకృతంతా అల్లకల్లోలమౌతున్నది. సముద్రుడు భయపడి పారిపోతున్నాడు. పరుగెత్తే వానిపై బాణం ప్రయోగించరాదని ఆగాడు శ్రీరాముడు. సముద్రుడు దారికి వచ్చాడు. లంకకు వెళ్ళడానికి దారినిస్తానన్నాడు. ఎక్కుపెట్టిన బాణం వృథాకారాదు. ఎక్కడ ప్రయోగించాలో చెప్పమన్నాడు శ్రీరాముడు. పాపాత్ములు దోపిడిదారులు ఉండే 'ద్రుమకుల్యము'పై ప్రయోగించమన్నాడు సముద్రుడు. అది జరిగిపోయింది.

విశ్వకర్మ కుమారుడైన 'నలుడు' శిల్పకళానిపుణుడు. ఉత్సాహం, శక్తి ఉన్నవాడు. సేతువు (వంతెన) ను నిర్మించడానికి అతడే యోగ్యుడని సముద్రుడు తెలిపాడు. ఆ సేతువును తాను భరిస్తానని మాటఇచ్చాడు. సేతువు నిర్మాణానికి వానర నాయకులకు ఆజ్ఞ ఇచ్చాడు శ్రీరాముడు. అందరూ మహారణ్యం దారి పట్టారు. పెద్దపెద్ద చెట్లను బండరాళ్ళను మోసుకువస్తున్నారు. సముద్రంలో పడేస్తున్నారు. వాటి దెబ్బకు సముద్రంలోని నీరు ఆకాశానికి రాకపోకలు సాగిస్తున్నది. నలుని సూచనలననుసరించి కొలతల ప్రకారం సేతువు కట్టబడుతున్నది. వందయోజనాల పొడవు, పది యోజనాల వెడల్పుగల సేతువు ఐదు రోజుల్లో నిర్మించబడ్డది.

శ్రీరామలక్ష్మణులు సుగ్రీవునితో కలసి ముందునడుస్తున్నారు. సైన్యం వారిని అనుసరిస్తున్నది. సైన్యంలో కొందరు వెనుక నడుస్తున్నారు. కొందరు సేతువు మధ్యభాగంలో, మరి కొందరు రెండు పక్కలా నడుస్తున్నారు. కొందరు సముద్రంలో దూకి ఈదుతూ వస్తూంటే మరికొందరు ఆకాశంలో ఎగిరి వస్తున్నారు. వారు చేసే కోలాహలానికి సముద్రమే మౌనం దాల్చింది. అందరూ అవతలి తీరం చేరారు.

శ్రీరాముడు యుద్ధనీతిని అనుసరించి సైన్యాన్ని వివిధ విభాగాలుగా విభజించాడు. ఎవరి బాధ్యతలను వాళ్ళకు అప్పగించాడు. రావణుని మంత్రులైన శుకసారణులు శ్రీరాముని బలం తెలుసుకోవాలని వానర రూపాలుదాల్చి వానరులలో చేరారు. విభీషణుడు వారిని గుర్తించి శ్రీరాముని ఎదుట నిలిపాడు. క్షమించాడు శ్రీరాముడు. తమ గురించి ఇంకా ఏమన్నా తెలుసుకోవాలంటే అడ్డులేదని వారికి చెప్పాడు. సీతను వెంటనే అప్పగించకపోతే తన చేతిలో చావు తప్పదని రావణునికి చెప్పవలసిందిగా సూచిస్తూ శుకసారణులను పంపించివేశాడు. వారు వెళ్ళి ఇక్కడి విషయాలన్నీ పొల్లుబోకుండా రావణునికి తెలిపారు.

రావణుడు సీత విషయంలో మరొక ఎత్తుగడ వేశాడు. అశోకవనం వెళ్ళి రాముడు తనచేతిలో హతుడైనాడని సీతతో పలికాడు. ఆమె నమ్మలేదు. మాయావియైన విద్యుజ్జిహ్వుని పిలిచాడు. అతడు శ్రీరామునిదే అనిపించే మాయాశిరస్సును, ధనుర్బాణాలను తీసుకొనివచ్చి చూపించాడు సీతకు. ఇప్పటికైనా తన్నాశ్రయించమని సీతను కోరాడు రావణుడు. సీత కుమిలిపోయింది. రావణుడు తన భవనానికి వెళ్ళిపోయాడు. విభీషణుని భార్య 'సరమ' సీతను ఊరడించింది. ఇదంతా రాక్షస మాయ అని చెప్పింది. శ్రీరాముడు క్షేమమేనని తెలిపింది.

శ్రీరామచంద్రాదులు వానరసైన్యంతో సువేల పర్వతానికి చేరుకున్నారు. ఆరాత్రి అక్కడే గడిపారు. ఎత్తైన ఆ పర్వత శిఖరం నుండి లంకానగర శోభను చూశారు. లంకలో మేడపైభాగంలో ఠీవిగా కూర్చున్న రావణుని శ్రీరాముడు చూశాడు. వానర ప్రముఖులూ చూశారు. సుగ్రీవుడు ఒక్క ఉదుటునలేచి కోపంతో ఊగిపోతున్నాడు. క్షణాలలో సువేల పర్వతం నుండి రావణ భవనంపై వాలాడు. తాను శ్రీరాముని మిత్రుడనని, తన నుండి తప్పించుకోవడం తరంకాదని లంకేశుని హెచ్చరించాడు. రావణునిపైకి దూకి అతని కిరీటాన్ని తీసి నేలకుకొట్టాడు. రెచ్చిపోయాడు రావణుడు. 'సుగ్రీవా! ఇంత వరకు నీవు నా కంటబడలేదు. లేకుంటే ఎప్పుడో హీనగ్రీవుడవు (తల తెగినవాడవు) అయ్యేవాడివి' అంటూ గర్జించాడు. ఇద్దరి మధ్యా బాహాబాహి యుద్ధం జరిగింది. సుగ్రీవుడు రావణుని ముప్పతిప్పలు పెట్టి క్షణాలలో రివ్వున ఎగిరి సువేల పర్వతంపై వాలాడు. శ్రీరాముడు సుగ్రీవుని సున్నితంగా మందలించాడు. తొందరపడి ఇలాంటి సాహసాలు చేయవద్దని సలహా ఇచ్చాడు.

రావణుని వద్దకు అంగదుని రాయబారిగా పంపాడు శ్రీరాముడు. సీతను అప్పగించకుంటే శ్రీరాముని చేతిలో మరణం తథ్యమని, లంకకు విభీషణుడు రాజుకాగలడని శ్రీరాముని వాక్యంగా రావణునికి వినిపించాడు అంగదుడు. సభ అట్టుడికిపోయింది. నలుగురు రాక్షసులు అంగదుడిపై విరుచుకుపడ్డారు. అంగదుడు వారిని తన చంకలో ఇరికించుకొని ప్రాసాదంపైకి ఎగిరాడు. అక్కడి నుండి వారిని బలంగా నేలపైకి విసిరాడు. సింహనాదం చేసి ఆకాశమార్గంలో శ్రీరాముని చేరాడు. రావణుని భావం అర్థంచేసుకున్నాడు శ్రీరాముడు. ధనుస్సుకు పని చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అర్థంచేసుకున్నాడు.

లంకపై దండయాత్ర మొదలైంది. లంకను నాలుగువైపుల నుండీ సైన్యంతో ముట్టడించాడు శ్రీరాముడు. తన భవనం మీద నుండి పరిస్థితిని గమనించాడు లంకేశుడు. దీర్ఘాలోచనలోపడ్డాడు. యుద్ధం మొదలైంది. ఇరు సైన్యాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. ఆంజనేయుని చేతిలో జంబుమాలి, సుషేణుని చేతిలో విద్యున్మాలి మరణించారు. చీకటిలో ఎవరు ఎవరో (రాక్షసుడా? వానరుడా?) అడిగి తెలుసుకుని మరీ కొట్టుకుంటున్నారు.

అంగదుని చేతిలో రావణకుమారుడు ఇంద్రజిత్తు ఓడిపోయాడు. తట్టుకోలేకపోయాడు. కపట యుద్ధానికి దిగాడు. రామలక్ష్మణులను మూర్ఛపోయేట్టుచేసి నాగాస్త్రంతో బంధించాడు. వారు మరణించారని భ్రాంతిపడి రావణునివద్దకు వెళ్ళి విషయాన్ని తెలిపాడు. రావణుడు అభినందించాడు. రావణుని ఆదేశం మేరకు త్రిజట మొదలైనవారు సీతను పుష్పక విమానంపై యుద్ధ భూమికి తీసుకువెళ్ళారు. నేలపై బడిఉన్న రామలక్ష్మణులను సీత చూసింది. మరణించారని భావించి కన్నీరు కాల్వలు గట్టేలా ఏడ్చింది. పక్కనే ఉన్న త్రిజట ఓదార్పుతో కూడిన ధైర్యాన్నిచ్చింది. రామలక్ష్మణుడు బ్రతికే ఉన్నారని ఆధారాలు చూపించింది. వానరసైన్యం ప్రసన్నంగా ఉండడం ఒక కారణం. అన్నింటికీ మించి 'భర్త మరణించిన స్త్రీని పుష్పక విమానం తీసుకొనిరాదు'

అని చెప్పడంతో సీత మనసు కుదుటపడింది. గరుత్మంతుని రాకతో రామలక్ష్మణులు నాగాస్త్ర ప్రభావం నుండి విముక్తులైనారు. వానరులు 'జయజయ' ధ్వానాలు చేశారు. అవి రావణుని గుండెలో 'అప' శబ్దాన్ని జోడించుకొని ప్రతిధ్వనిస్తున్నాయి. హనుమంతుని చేతిలో ధూమ్రాక్షుడు, అకంపనుడు, అంగదుని బారినపడి వజ్రదంష్ట్రుడు, నీలునికి చిక్కి ప్రహస్తుడు యమపురిబాటపట్టారు.

రావణుని బాణశక్తికి సుగ్రీవుడు మూర్ఛపోయాడు. శ్రీరాముడు విల్లందుకున్నాడు. అన్నను వారించి లక్ష్మణుడు రావణుని ఎదిరించడానికి పూనుకున్నాడు. వానరసేనపై శరవర్షధారకురిపిస్తున్నాడు రావణుడు. ఆంజనేయుడు రావణుని ధాటికి అడ్డుకట్టవేశాడు. అరచేతితో హనుమంతుని బలంగా చరచాడు రావణుడు. చలించిపోయాడు మారుతి. క్షణంలో తేరుకున్నాడు. అరచేతితో రావణుని ఒక్క దెబ్బ వేశాడు. కంపించిపోయాడు దశగ్రీవుడు. తేరుకుని 'వానరా! భళా, నాకు శత్రువువే అయినా నీ శక్తిని మెచ్చుకుంటున్నాన'ని యుద్ధ సహృదయతను చాటాడు రావణుడు.

రావణుడు ప్రయోగించిన 'శక్తి' అనే ఆయుధం లక్ష్మణుని ఎదలో నాటుకుంది. స్పృహదప్పినాడు లక్ష్మణుడు. అతణ్ణి ఎత్తుకొని వెళ్ళాలని శతవిధాలా ప్రయత్నించి విఫలుడైనాడు రావణుడు. అంతలో ఆంజనేయుడు రావణునిపై దాడిచేశాడు. వక్షఃస్థలంపై ముష్టిఘాతంతో రావణుని కూలబడేటట్లు చేశాడు. లక్ష్మణుని శ్రీరాముని వద్దకు చేర్చాడు. హనుమ కోరిక మేరకు అతని భుజాలపై కూర్చుని రావణునితో పోరుచేశాడు శ్రీరాముడు. శ్రీరాముని పరాక్రమం ముందు రావణుని ధనుస్సు, కిరీటం దాసోహమయ్యాయి. దయతలచాడు శ్రీరాముడు. రావణునితో' నీవు యుద్ధంలో అలసిపోయావు. సేదతీర్చుకొనిరా. అప్పుడు నా బలమేమిటో తెలుస్తుంద'ని సుతిమెత్తగా చెప్పాడు.

అంతఃపురానికి తిరిగివెళ్ళి నా అవమానభారం రావణుడిని ఒక చోట కూర్చోనీయడం లేదు. కుంభకర్ణుని నిద్రలేపమన్నాడు రావణుడు. అతికష్టం మీద ఆ పని సాధ్యమయింది రాక్షసులకు. కుంభకర్ణునికి ఆరు నెలలు నిద్ర ఒకరోజు భోజనం. అందుకే 'కుంభకర్ణనిద్ర' అనేది ఒక జాతీయంగా భాషలోకి వచ్చింది. కుంభకర్ణుడు రావణుని సమీపించాడు. జరిగిందంతా చెప్పాడు రావణుడు. తెలివిగలవారు జరిగిన దానిని గూర్చి ఆలోచించరన్నాడు కుంభకర్ణుడు. తనకు సహాయపడమని కుంభకర్ణుని కోరాడు రావణుడు. 'ఆపదల పాలైన వానిని ఆదుకొనేవాడే నిజమైన మిత్రుడు. తప్పుదారి పట్టి కష్టాల్లో పడ్డవారికి చేయూతనిచ్చి ఆదుకొనేవాడే ఆప్తుడ'ని రావణుడన్నాడు. కుంభకర్ణుడు యుద్ధసన్నద్ధుడయ్యాడు.

కుంభకర్ణుడు యుద్ధంలో వానరులను చావుదెబ్బ తీస్తున్నాడు. వానరులు తట్టుకోలేక తలోదారి పట్టారు. శ్రీరాముని ఆశ్రయించారు. 'ఐంద్రాస్త్రము'తో కుంభకర్ణుని శిరస్సును ఖండించి శాశ్వత నిద్రలోకి పంపాడు శ్రీరాముడు. శ్రీరాముని బాణధాటికి కుంభకర్ణుని తల లంకలో పడిపోయింది. ఆ తల తగలడం వల్ల రాజవీథులలోని ఇంటికప్పులు, ఎత్తైన ప్రాకారాలు కూలిపోయాయి. కుంభకర్ణుని మరణవార్త రావణుని క్రుంగదీసింది.

రావణ కుమారుడైన అతికాయుడు లక్ష్మణుని బ్రహ్మాస్త్రానికి బలైనాడు. తమ్ముని, కొడుకును పోగొట్టుకొని తల్లడిల్లుతున్న రావణుని ఓదార్చాడు ఇంద్రజిత్తు. భారం తనపై వేసుకొని. యుద్ధరంగానికి వచ్చాడు. రామలక్ష్మణులపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. రాముని సూచనమేరకు రామునితోపాటు లక్ష్మణుడు స్పృహకోల్పోయినట్లు పడివున్నాడు. వారు మరణించారనుకున్నాడు ఇంద్రజిత్తు. తండ్రికీ వార్తను తెలిపాడు.

వానరసైన్య శిబిరంలో అలజడి మొదలైంది. విభీషణుడు ధైర్యం చెప్పాడు. రామలక్ష్మణులకు ఏమీకాలేదన్నాడు. బ్రహ్మయందలి గౌరవంతో అస్త్రబాధను అనుభవించారని తెలిపాడు. బ్రహ్మాస్త్ర ప్రభావంతో అరవైఏడు కోట్ల మంది హతులయ్యారు. చాలామంది దెబ్బతిన్నారు. హనుమంతుడు, విభీషణుడు, జాంబవంతుని కోసం వెతుకుతున్నారు. జాంబవంతుడు కనిపించాడు. సరిగ్గా చూడలేకపోతున్నానన్నాడు. ధ్వనిని బట్టి విభీషణుని గుర్తించానన్నాడు. 'హనుమంతుడు క్షేమమేనా' అని అడిగాడు. ఆంతర్యం అంతుచిక్కలేదు విభీషణునికి. 'హనుమంతుడు జీవిస్తే వానరసైన్యం చచ్చినా బతికినట్లే లేదా హనుమ మరణిస్తే అందరం

బతికిఉన్నా చచ్చిన వారితో సమానమేనన్నాడు' జాంబవంతుడు. జాంబవంతుని ఆదేశంపై హిమాలయాలకు వెళ్ళి అక్కడ ఉన్న సర్వౌషధి మహాపర్వతమును పెల్లగించి తీసుకువచ్చాడు హనుమంతుడు. ఓషధుల వాసనకే రామలక్ష్మణుల గాయాలన్నీ మటుమాయమయ్యాయి. చనిపోయిన వానరులు మళ్ళీ లేచికూర్చున్నారు. సుగ్రీవాజ్ఞతో వానరులు లంకకు నిప్పుపెట్టారు.

శత్రుపక్షాన్ని మానసికంగా దెబ్బతీయదలచాడు ఇంద్రజిత్తు. హనుమదాది వానరవీరులు చూస్తుండగా మాయాసీతను సంహరించాడు. అందరూ నిజమేననుకున్నారు. వార్త తెలిసి శ్రీరాముడు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇదంతా ఇంద్రజిత్తు మాయేనని విభీషణుడు తెలపడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

శత్రుసంహారానికి ఇంద్రజిత్తు నికుంభిలా అభిచారహోమాన్ని తలపెట్టాడు. దానిని భంగంచేయడానికి రామానుజ్ఞతో లక్ష్మణుడు వెళ్ళాడు. ఇంద్రజిత్తు లక్షణుల మధ్య ఘోర యుద్ధం జరిగింది. 'ఐంద్రాస్త్రము'ను ప్రయోగించి ఇంద్రజిత్తు తలను నేలరాల్చాడు లక్ష్మణుడు. శ్రీరాముడు లక్ష్మణుని మెచ్చుకున్నాడు.

రావణుడు యుద్ధభూమిలో ప్రళయకాల రుద్రునిలా విజృంభిస్తున్నాడు. వానర వీరులు తట్టుకోలేక యుద్ధరంగం నుండి కాలికి బుద్ధి చెపుతున్నారు. మరొకవైపు సుగ్రీవుని చేతిలో విరూపాక్షుడు, మహోదరుడు మట్టిగరచారు.

యుద్ధం చివరి అంకానికి చేరుతున్నది. రామలక్ష్మణులతో రావణునిపోరు తీవ్రతరమవుతున్నది. రావణుడు విభీషణుని చంపడానికి బల్లెమునెత్తాడు. అది మహాశక్తివంతమైనది. విభీషణునికి ప్రాణాపాయ స్థితిని గమనించిన లక్ష్మణుడు రావణునిపై బాణాలను కుమ్మరించాడు. ఎటూ తోచక విభీషణుని చంపే ప్రయత్నాన్ని విరమించుకున్న రావణుడు లక్ష్మణునిపై ఆగ్రహించి 'శక్తి' అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. అది గమనించిన శ్రీరాముడు 'శక్తి'ని వేడుకున్నాడు. 'నీలోని చంపేశక్తి నశించుగాక' అని. అంతే – అది ప్రాణశక్తిని కోల్పోయింది. లక్ష్మణుని ఎదపై బలంగా నాటుకుంది. నేలపై పడిపోయాడు లక్ష్మణుడు. వానరులు ఆ ఆయుధాన్ని ఎంత ప్రయత్నించినా లక్ష్మణుని ఎద నుండి తీయలేకపోయారు. రాముడు తన రెండు చేతులతో బయటికి లాగి విరచివేశాడు. ఇక ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు, శ్రీరాముడు వానరులతో, ఈ లోకంలో ఇక రావణుడో? రాముడో? మిగిలి ఉండడం తథ్యం' అన్నాడు. శ్రీరాముని విలువిద్యాపాండిత్యానికి ఎదురునిలువలేక రావణుడు భయంతో పరుగులు తీశాడు.

పడిపోయిన లక్ష్మణుని చూచి విలవిలలాడిపోయాడు శ్రీరాముడు. 'ఏదేశమందైనా భార్య దొరకవచ్చు. బంధువులు దొరకవచ్చు. కాని లక్ష్మణుని వంటి తమ్ముడు దొరకడని' కన్నీరుకార్చాడు. సుషేణుడు లక్ష్మణుని పరీక్షించి చనిపోలేదని నిర్ధారించాడు. సుషేణుని సూచనమేరకు హనుమంతుడు ఓషధులు తేవడానికి వేగంగా వెళ్ళాడు. ఓషధీపర్వతాన్నే తెచ్చాడు. ఓషధీ ప్రభావంతో లక్ష్మణుడు లేచికూర్చున్నాడు. పట్టరాని ఆనందంతో శ్రీరాముడు 'లక్ష్మణా నీవు మరణించి ఉంటే నా విజయానికి అర్థమేలేదు. అప్పుడు సీతతోగాని నా ప్రాణాలతోకాని ఏం ప్రయోజనం' అన్నాడు.

ఇంద్రుడు పంపగా మాతలి దివ్యరథంతో సహా శ్రీరాముని వద్దకు వచ్చాడు. ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించి శ్రీరాముడు రథాన్ని అధిరోహించాడు. యుద్ధభూమికి సాగిందారథం. మిగతా రోజుల కన్నా భిన్నంగా ఉందీనాటి యుద్ధం. కొంతసేపు ఎవరికెవరూ తీసిపోని విధంగా విజృంభించారు. రానురాను రామునిదే పైచేయి అవుతున్నది. రావణుని సారథి గమనించాడు. రథాన్ని పక్కకు మళ్ళించాడు. అలా చేయడం అవమానంగా భావించిన రావణుడు సారథిపై నిప్పులు చెరిగాడు. రథం మళ్ళీ రాముని ముందు నిలిచింది. యుద్ధం చూడడానికి అగస్త్యుడు దేవతలతో కూడి అక్కడకు వచ్చాడు. శ్రీరామునికి 'ఆదిత్య హృదయం' ఉపదేశించాడు. శ్రీరాముని బాణాలతాకిడికి రావణుని తలలు నేలరాలుతున్నాయి. కాని వెంటనే చిత్రంగా మళ్ళీ మొలుస్తున్నాయి.

ఆకాశానికి ఆకాశం, సముద్రునికి సముద్రమే సమానమైనట్లు రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సమానమన్నట్లు సాగుతున్నది. బ్రహ్మాస్త్ర ప్రయోగం చేయవలసిందిగా 'మాతలి' శ్రీరామునకు సూచించాడు. శ్రీరాముడు బ్రహ్మాస్త్ర ప్రయోగంతో రావణాసురుని అంతమొందించాడు.

అన్నయైన రావణుని మరణానికి బాధపడ్డాడు విభీషణుడు. దహన సంస్కారాలకు అనుమతినివ్వమని శ్రీరాముని ప్రార్థించాడు. 'వ్యక్తులు జీవించివున్నంతవరకే వైరముండాలి. తరువాత దానిని వదలివేయాలి. మన కార్యం నెరవేరింది. కావలసిన సంస్కారాలను చేయమని అన్నాడు శ్రీరాముడు. 'ఇప్పుడు రావణుడు నీకెట్లో నాకూ అట్లే గౌరవాస్పదుడు' అని తన విశాల హృదయాన్ని చాటుకున్నాడు శ్రీరాముడు. రావణుని భార్య మండోదరి భర్త మరణానికి పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయింది. విభీషణుడు రావణునికి ఉత్తరక్రియలను నిర్వర్తించాడు.

శ్రీరాముని ఆదేశం మేరకు లక్ష్మణుడు విభీషణుని లంకారాజుగా పట్టాభిషిక్తుని చేశాడు. సీతతో తన విజయవార్తను తెలుపమని హనుమంతుని ఆదేశించాడు శ్రీరాముడు. హనుమ వెంటనే వెళ్ళి ఈ శుభవార్తను సీతమ్మ చెవిలో వేశాడు. ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇంతకాలం చుట్టూచేరి బాధించిన రాక్షస స్త్రీలను చంపడానికి అనుమతినిమ్మన్నాడు హనుమ. తగని పని, వద్దని వారించింది సీత.

విభీషణుడు పల్లకిలో సీతాదేవిని శ్రీరాముని వద్దకు చేర్చాడు. సంతోషంతో భర్తను చేరింది సీత. స్వీకరించడానికి నిరాకరించాడు సీతాపతి. 'నా వంశ ప్రతిష్ఠ నిలుపుకోవడానికై దుష్ట రావణుని చెర నుండి నిన్ను విడిపించాను. ఇంతకాలం పరుని పంచన ఉన్నందున నీ ప్రవర్తన గురించి నాకు సందేహముంది. కనుక నీవు నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళవచ్చు'నని శ్రీరాముడు అన్నాడు. శ్రీరాముని మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి సీతకు. స్థాయికి దగినట్లుగా మాట్లాడలేదని రామునితో అన్నది. శ్రీరామునకు విశ్వాసం కలిగించడానికి 'అగ్ని ప్రవేశం' ఒక్కటే శరణ్యమని భావించింది. శ్రీరాముని మనసెరిగి లక్ష్మణుడు చితిని సిద్ధపరచాడు. సీత అగ్నిలోకి ప్రవేశించింది. అక్కడి వారంతా ఆందోళనచెందారు. అగ్నిదేవుడు స్వయంగా సీతా దేవిని తీసుకువచ్చి ఆమె గొప్పదనాన్ని వెల్లడించాడు. శ్రీరాముని స్వీకరించాల్సిందిగా కోరాడు.

సీత గురించి తనకంతా తెలుసన్నాడు శ్రీరాముడు. ఆమె శీలం యొక్క గొప్పదనాన్ని ముల్లోకాలకు చాటడానికే అగ్నిప్రవేశం చేస్తున్నా ఊరుకున్నానన్నాడు. సీతను దగ్గరకు తీసుకున్నాడు.

పరమశివుడు శ్రీరాముని ప్రశంసించాడు. దుష్టసంహారంచేసిన శ్రీరాముని ప్రజానురంజకంగా పరిపాలన చేయమన్నాడు. శ్రీరాముని కోరిక మేరకు ఇంద్రుడు మృతులైపడివున్న వానరులను మళ్లీ బతికించాడు. విభీషణుడు లంకలో కొంతకాలం ఉండవలసిందని శ్రీరాముని అభ్యర్థించాడు. భరతుని కొరకు తాను త్వరగా ప్రయాణం కావలసిందేనన్నాడు శ్రీరాముడు. వానరులను వారి స్వస్థానాలకు వెళ్ళమనిచెప్పి, విభీషణుని వీడ్కోలు అందుకున్నాడు. పుష్పకవిమానంలో అయోధ్యకు బయలుదేరాడు దారిలో ఆయా ప్రదేశాలన్నీ సీతకు చూపుతున్నాడు. భరద్వాజాశ్రమాన్ని సందర్శించారు. శ్రీరామాజ్ఞతో హనుమంతుడు శ్రీరాముడు వస్తున్న విషయాన్ని భరతునికి, గుహునికి ముందుగా వెళ్ళి తెలియజేశాడు. వారెంతో ఆనందించారు.

పుష్పక విమానంలో నందిగ్రామం చేరుకున్న సీతారామలక్ష్మణులకు భరతుడు, ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. సీతారామలక్ష్మణులు కౌసల్య, సుమిత్ర, కైకేయి, వశిష్ఠుల పాదాలకు ప్రణామాలు అర్పించారు. భరతుడు శ్రీరాముని చరణాలకు పాదుకలను తొడిగాడు. భరతుని ప్రేమతో అక్కున జేర్చుకున్నాడు శ్రీరాముడు.

అంగరంగవైభవంగా శ్రీరామ పట్టాభిషేకమహోత్సవం జరిగింది. యువరాజుగా ఉండాల్సిందిగా శ్రీరాముడు లక్ష్మణుని కోరాడు కాని అతడు ఎంత మాత్రం ఒప్పుకోలేదు. భరతుని యువరాజుగా చేశాడు. యజ్ఞయాగాది క్రతువులను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు శ్రీరాముడు. ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకుంటున్నాడు. ఎలాంటి ఈతి బాధలు లేవు. అందరూ ధర్మబద్ధంగా నడచుకొంటున్నారు. ఇలా పదకొండువేల సంవత్సరాలు ప్రజానురంజకంగా పరిపాలించాడు శ్రీరాముడు. అందుకే 'రామరాజ్యం' అన్న మాట నేటికీ ఆదర్శమై నిలచింది.

ఉపవాచకం

మహాభారతం

(సంక్షిప్తం)



(మహర్షి వేదవ్యాస మహాభారతం ఆధారంగా)

1

భారతీయుల ప్రాచీన ఇతిహాసాలు రామాయణ భారతాలు. ప్రతి భారతీయుడూ ఈ ఇతిహాసాలను తెలుసుకొని ఉండటం అవసరం. మొదట ఇవి అశురూపంలో ఉండటం వలన అనేక రకాలైన మార్పులు చేర్పులూ చెందుతూ వచ్చాయి. ఈ కథలు మొదట సంస్కృతంలో రచింపబడి, లక్షాఇరవైఅయిదువేల శ్లోకాలతో కల్గిన బృహత్కావ్యం మహాభారతం. అందుకే మహాభారత మూలకథను విద్యార్థులు తెలుసుకొని ఉండటం అవసరం. తర్వాత ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువదింపబడ్డాయి.

భారతంలో ఉన్న కథ, సంఘటనలు, పాత్రలు, ధర్మసూక్ష్మాలు ఆ కథను జగద్విఖ్యాతం చేశాయి. అందుకే భారతం ధర్మశాస్త్రంగా, బహుపురాణాల కలయికలా, వేదాంతంగా, నీతిశాస్త్రంగా, మహాకావ్యంగా, సర్వలక్షణ సంగ్రహంగా, గొప్పకథగా పేరెన్నికగన్నది. ఇది ద్వాపర యుగం చివరి రోజుల్లో జరిగినకథ. 'భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడాలేదు. ప్రపంచంలో ఉన్నదంతా భారతంలో ఉన్నది. ధర్మార్థకామమోక్ష సంబంధమైన ఏ సందేహానికైనా మహాభారతంలో సమాధానం దొరుకుతుందని ప్రతీతి.

మహాభారతంలోని ప్రధాన కథ పాండవులు – కౌరవులకు సంబంధించింది. కొన్ని తరాలు ముందుకువెళ్ళి వాళ్ళ వంశక్రమం తెలుసుకుంటూ, కనీసం తాతలనాటి కథాక్రమం చదువుకొందాం.

1. ఆదిపర్వం

అజామీళుడనే రాజుకు గల కుమారుల్లో ముఖ్యుడు సంవరణుడు; అతని కొడుకు కురువు; కురువు తనయుడు విదూరథుడు; విదూరథుని పుత్రుడు అనశ్వుడు; అనశ్వుని సుతుడు పరీక్షిత్తు; పరీక్షిత్తుని కొడుకు భీమసేనుడు; భీమసేనుని కుమారుడు ప్రతిశ్రవుడు; ప్రతిశ్రవుని నందనుడు ప్రతీపుడు; ప్రతీపునికి ముగ్గురు తనయులు. వాళ్ళు దేవాపి, శంతనుడు, బాహ్లికుడు. దేవాపి బాల్యంలోనే తపస్సు చేయడానికి వెళ్ళడంతో రెండవ కుమారుడైన శంతనుడు రాజయ్యాడు.

శంతనుడు ఎంతో గొప్పవాడు. మహాబలపరాక్రమవంతుడు. ప్రజలను కన్నబిడ్డల్లా పాలించేవాడు. ఒక రోజు వేటకోసం అడవికి వెళ్ళిన శంతనుడు వేటాడి అలసిపోయి గంగాతీరం చేరుకున్నాడు. అక్కడొక అపురూపలావణ్యవతి, అతిలోక సుందరి అయిన దివ్యాంగన కనిపించింది. ఆమెను చూసిన శంతనుడు దాహం విషయం కూడా మరచిపోయి, "నేను భరత రాజ్యాన్ని, పాలించే రాజును. హస్తినాపురం మా పట్టణం. నిన్ను అర్ధాంగిగా స్వీకరించాలనుకుంటున్నాను. దయచేసి కాదనకు" అన్నాడు.

అందుకు ఆమె, "మహారాజా! మీకు భార్యను కావడానికి నాకూ ఇష్టమే. నా పేరు గంగ. కాని, నా చర్యలను కాదనకూడదు. అట్లా కాదన్న మరుక్షణం నేను వెళ్ళిపోతాను" అన్నది.

శంతనుడందుకు అంగీకరించి ఆమెను వివాహం చేసుకున్నాడు. వాళ్ళు ఎంతో అన్యోన్యంగా జీవించారు. గంగకు ఒక కుమారుడు జన్మించాడు. కొడుకు పుట్టిన వెంటనే ఆమె ఆ బాలుడ్ని గంగా ప్రవాహంలో పడిలిపెట్టింది. శంతనుడు ఆశ్చర్యపోయాడు, బాధపడ్డాడు. కాని ఇచ్చిన మాట ప్రకారం ఆమె చర్యలను అడ్డుకోలేదు. తర్వాత రెండో సంతానం కలిగింది. ఈ సారీ మగబిడ్డే. గంగ అతడ్ని కూడా ప్రవాహంలో పడిలింది. మూడు, నాలుగు, ఐదు... అట్లా ఏడురుగు కుమారులనూ గంగా నదిలో పడిలింది. ఎనిమిదో సంతానం కూడా మగపిల్లవాడే. అతణ్ణి కూడా పుట్టగానే ప్రవాహంలో పడిలేందుకు ఉద్యుక్తురాలయ్యింది ఆమె.

"ఆగు! అసలు నీవెవరు? ఎందుకు నా జీవితంలోకి ప్రవేశించావు? ఇంత అందమైన నీలో కన్నబిడ్డలను చంపుకునే కఠిన హృదయం ఎందుకున్నది? ఈ ఎనిమిదవ సంతానాన్నైనా చంపకుండా పడిలిపెట్టు. వాణ్ణి నాకిచ్చేసెయ్" అన్నాడు గంగను

అడ్డుకుంటూ శంతనుడు.

"మహారాజా! నేను స్వర్గలోకవాసిని, నా పేరు గంగ. శాపవశాన మానవాకారంలో ఇక్కడ జన్మించాను. నాకు పుట్టిన కుమారులందరు కూడా వశిష్ఠుని శాపం పొందినవాళ్ళే. పుట్టగానే వాళ్ళను నీళ్ళలో వదిలి మోక్షం కలిగించుమని వాళ్ళు కోరడం వల్లనే నేనాపని చేశాను" అన్నది గంగ.

మాటలు రాక నిలబడిపోయిన శంతనుడితో ఇంకా ఇలా అన్నది గంగ – "నీవు ఆడిన మాట తప్పి, నాపనిని అడ్డుకున్నావు కాబట్టి నేనిక్కడ ఉండలేను" అంటూ కుమారునితో సహా అదృశ్యమైపోయింది గంగ.

ఇంద్రియనిగ్రహం, దానం, క్షమ, జ్ఞానం, ధైర్యం, దయ, బుద్ధి, పరాక్రమం కలిగిన మేధావి శంతనుడు. జరిగిన దానికి చింతిస్తూ కాలం వృథా చేయక మనసును పరిపాలనలో నిలిపి, మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా జీవనం సాగించాడు. సుమారు ముప్ఫైయ్యేళ్ళు గడిచింతర్వాత ఒకరోజు గంగా తీరంలో విహరిస్తూ, ఒక అద్భుతమైన దృశ్యం చూశాడు. అక్కడ ఆజానుబాహువు, అత్యంత సుందరుడు ఐన ఒక యువకుడు అస్త్రవిన్యాసం చేస్తూ, తన బాణాలతో గంగా ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాడు. అంతలో అక్కడొక దివ్యస్త్రీ కనిపించి, "రండి మహారాజా! మీకోసమే ఎదురుచూస్తున్నాను" అన్నది శంతనుడ్ని మరింత ఆశ్చర్యచకితుడ్ని చేస్తూ.

శంతనుడికి ఆమె మాటలు అర్థం కాలేదు. ఆమెను ఎక్కడో చూసినట్లు గుర్తొచ్చింది. ఎవరో వెంటనే స్ఫురణకు రాలేదు. అతని అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆమె తన మాటల్ని కొనసాగించింది– "శంతన మహారాజా! నేను గంగను. ముప్ఫై సంవత్సరాల క్రితం ఒక కుమారుడ్ని తీసుకొని వెళ్ళాను కదా! ఆ కుమారుడే ఈ మహావీరుడు. పేరు దేవవ్రతుడు" అన్నది.

"కలిసొచ్చేకాలానికి నడిచొచ్చేకొడుకును చూసి పొంగిపోయాడు శంతనుడు. దేవవ్రతుడు తండ్రికి పాదాభివందనం చేశాడు. కొడుకును అక్కున జేర్చుకొని పులకితగాత్రుడై పుత్రగాత్రపరిష్వంగ సౌఖ్యాన్ని అనుభవిస్తూ ఆనంద బాష్పాలు రాల్చాడు. గంగనూ, దేవవ్రతుణ్ణి తనతోపాటు రాజ్యానికి రమ్మన్నాడు. గంగ అందుకు ఒప్పుకోలేదు. "నా శాపం తీరింది. ఈ కుమారుణ్ణి నీ కప్పగించడంతో బాధ్యత కూడా పూర్తయ్యింది. ఇతణ్ణి తీసుకొని వెళ్ళు" అంటూ శంతనుని జవాబుకోసం ఎదురు చూడకుండా స్వర్గంవైపు సాగిపోయింది.

దేవవ్రతుడు సామాన్యుడు కాదు. వశిష్ఠ మహర్షివద్ద వేదాలను అధ్యయనం చేశాడు; శుక్రాచార్యునివద్ద, బృహస్పతివద్ద ధర్మనీతి శాస్త్రాలు చదువుకున్నాడు; పరశురాముని దగ్గర శస్త్రాస్త్రవిద్యలన్నీ నేర్చుకున్నాడు. శాస్త్ర పారంగతుడు, వీరుడు, యుద్ధ నిపుణుడు, సుందరుడు, ధీరగంభీరుడైన దేవవ్రతుడ్ని చూసి హస్తినాపుర ప్రజలంతా ఆనందపరవశులైనారు. ఒక శుభముహూర్తాన శంతనుడు దేవవ్రతునికి యౌవరాజ్య పట్టాభిషేకం చేశాడు. అయితే కథ అనుకోని మలుపు తిరిగింది ఇక్కడే.

ఉత్తముడైన కొడుకు రాజ్యానికి వచ్చినంతర్వాత శంతనుడికి ఎంతో మనశ్శాంతి కలిగింది. అతడు మళ్ళీ నిండు యవ్వనుడైనట్లు జవసత్వాలతో విహరించసాగాడు. ఈ నేపథ్యంలో ఒక రోజు యమునా తీరానికి వేటకు వెళ్ళాడు. నదీ తీరారణ్యంలో విహరిస్తూండగా దివ్యమైన పరిమళం అతని ముక్కుపుటాలను తాకింది. ఆ పరిమళానికి వశుడై, ఆ దిక్కును వెతుక్కుంటూ వెళ్ళిన శంతనుడు ఒక జనపదాన్ని (పల్లెను) చేరుకున్నాడు. అక్కడొక అసమాన సౌందర్యవతి అతనికి కనిపించింది. ఆమె ఆ ఆటవిక రాజ్యానికి నాయకుడైన దాశరాజు పెంపుడు కూతురు – సత్యవతి. ఆమెను తనకిచ్చి వివాహం జరిపించమని అడిగాడు శంతనుడు.

తన కూతురు అభిప్రాయం తెలుసుకున్నాడు దాశరాజు. "మహారాజా! నా బిడ్డకూడా నిన్ను ఇష్టపడుతున్నది. మీ అంతటి చక్రవర్తికి భార్యగావడం ఆమె అదృష్టం; వియ్యమందడం నా భాగ్యం. కాని, మీరొక్క ప్రతిజ్ఞ చేయాలి. నా కూతురుకు పుట్టిన కొడుకునే మీ తదనంతరం రాజ్యాభిషిక్తుడ్ని చేయాలి" అన్నాడు. దేవవ్రతుణ్ణి కాదని, ఇంకొకరిని హస్తినకు రాజుగా చేయడం శంతనునికి నచ్చలేదు. మనసు చంపుకొని రాజధానికి తిరిగి వెళ్ళిపోయాడు.

రాజ్యానికి చేరుకున్న శంతనుడి మనసు మనసులో లేకుండా పోయింది. వేళకు తినడు; నిద్ర సరిగ్గా లేదు; రాచకార్యాలల్లో పాలుపంచుకోడు; ఇష్టాగోష్ఠులులేవు; కొడుకుతోనూ మునుపటిలా సంతోషంగా మాట్లాడటం లేదు. దేవవ్రతుడు భిషగ్వరులను సంప్రదించాడు. జ్యోతిష్యులనడిగాడు –ఎవరి ప్రయత్నమూ సత్ఫలితాన్నివ్వలేదు. రోగానికైతే మందుంటుందిగానీ, మనోవ్యాధికి మందెక్కడుంది? చివరకు కుశాగ్రబుద్ధి ఐన దేవవ్రతుడు మంత్రి మీద ఒత్తిడి తెచ్చి, అసలు సంగతి తెలుసుకున్నాడు. సామంతరాజుల్లో పెద్దవాళ్ళను కొంతమందిని వెంటబెట్టుకొని దాశరాజు వద్దకు వెళ్ళాడు.

దాశరాజు దేవవ్రతుడ్ని సాదరంగా ఆహ్వానించి, సముచిత రీతిలో సత్కరించాడు. తర్వాత దేవవ్రతుడు తన తండ్రికి సత్యవతితో వివాహం జరిపించమని దాశరాజును అర్థించాడు. "నీ అంతటి బలవంతుడైన పుత్రుడుండగా నా బిడ్డకు కలిగే సంతానానికి రాజ్యం దక్కడం కల్ల. అందుకే నేను ఆమె వివాహానికి అడ్డు చెప్పక తప్పలేదు" అంటూ నర్మగర్భంగా తన మనసులోని మాటను చెప్పాడు దాశరాజు.

అందుకు దేవవ్రతుడు "మీకా అనుమానం అవసరంలేదు. నేను రాజ్యాభిషేకం చేసుకోను. సత్యవతీమాత కుమారులకే రాజ్యాధికారం దక్కుతుందని ఇంతమంది పెద్దలముందు మాట ఇస్తున్నాను" అన్నాడు. దాశరాజు తృప్తిపడలేదు. "నీవంటే ఉత్తముడవు. కాని, నీ కుమారులు నిన్ననుసరిస్తారన్న నమ్మకం లేదు కదా!" అన్నాడు.

ఒక్కక్షణం ఆలోచించిన దేవవ్రతుడు – అందరూ వినేటట్లు ఒక భీషణమైన ప్రతిజ్ఞ చేశాడు. "ఎంతటి తప్పని పరిస్థితులేర్పడినా నేను రాజ్యపరిపాలన చేయను. వివాహం చేసుకోను. ఆజన్మ బ్రహ్మచారిగానే ఉండిపోతాను" అని.

తండ్రి కోసం, తండ్రి సుఖం కోసం ఆవిధంగా తన సమస్తాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడిన దేవవ్రతుని నిర్ణయానికి పెద్దలందరూ ఆశ్చర్యపోయారు. దేవతలు 'ఇంతటి త్యాగబుద్ధి కల్గిన ఈ మహనీయుడు మానవోత్తముడు" అంటూ పూలవాన కురిపించారు. అప్పుడు లోకాలన్నీ అతని భీషణమైన నిర్ణయాన్ని చూసి 'భీష్ముడు' అని గౌరవించాయి. అప్పటి నుండీ దేవవ్రతుడు భీష్ముడు అయ్యాడు. శంతనుడు కొడుకు త్యాగబుద్ధికి చలించిపోయాడు. 'స్వచ్ఛంద మరణ శక్తి'ని అతనికి అనుగ్రహించాడు. అంటే భీష్ముడు తాను కోరుకున్నంత కాలం జీవిస్తాడు. తనంత తాను కోరుకుంటేనేగానీ మరణం అతని దరిజేరదు.

2

శంతనునికి సత్యవతి వల్ల ఇద్దరు కుమారులు కలిగారు. వాళ్ళు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు. చిత్రాంగదుడు తనను మించిన బలవంతుడు లేడన్న గర్వంతో విర్రవీగేవాడు. తండ్రి తర్వాత అతనికే పట్టాభిషేకం చేశాడు భీష్ముడు. కాని బల గర్వితుడైన చిత్రాంగుడు గంధర్వులతో యుద్ధం చేసి చనిపోయాడు. భీష్ముడు విచిత్రవీర్యుడిని రాజును చేశాడు. కాశీరాజు కుమార్తెలు ముగ్గురూ అతిలోక సౌందర్యవతులని తెలిసి, స్వయంవరానికివెళ్ళి, అంబ, అంబిక, అంబాలిక అనే ఆ ముగ్గురిని తెచ్చి విచిత్రవీర్యునికి వివాహం చేయబోయాడు. అప్పుడు అంబ తాను అంతకు ముందే సాళ్వరాజును వరించానని, స్వయంవరంలో అతణ్ణే పతిగా పొందాలనుకున్నా'నని చెప్పింది. పెద్దలతో ఆలోచించి, అంబను ఆమె ఇష్టానుసారం వెళ్ళడానికి అనుమతించి, అంబికను, అంబాలికను తమ్ముునికిచ్చి పెళ్ళి చేశాడు భీష్ముడు. కాని కొంతకాలానికే విచిత్రవీర్యుడు క్షయవ్యాధిగ్రస్తుడై పరలోకం చేరుకున్నాడు. పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది.

సత్యవతి ఆలోచనలో పడింది. తాను కోరుకున్నట్లే తన కుమారులకు రాజ్యాధికారం దక్కింది కాని, భాగ్యహీనులైన కొడుకులు అది పూర్తిగా అనుభవించలేకపోగా వారసులు కూడా లేకుండా రాజ్యాన్ని దిక్కుమాలినదాన్ని చేసి జీవితాలను చాలించారు. అందుకే భీష్ముణ్ణి వివాహం చేసుకొమ్మని, రాచరికాన్ని నెరపుమని కోరింది. కాని భీష్ముడు ఎంతమాత్రం ఒప్పుకోలేదు. భరతకులం

సత్యం, ధర్మం, శాంతి, అహింస అనే మార్గాలకు ప్రతీక అని, ఏది ఏమైనా తాను ఆ రెండు పనులూ చేయలేనని అన్నాడు. అప్పుడు పెద్దలతో ఆలోచించి, వ్యాసుడిని పిలిపించి, అతడ్ని అంబిక, అంబాలికలకు సంతానం కలిగేటట్లు వరమీయమని ప్రార్థించారు. (వ్యాసుడు పూర్వం సత్యవతి కుమారుడే) అయితే అంబిక, అంబాలికలు వ్యాసుని రూపం చూసి అసహ్యించుకున్నారు. తప్పనిసరై, వంశాన్ని నిలబెట్టడానికి అతనితో సంతానాన్ని పొందారు. తత్ఫలితంగా అంబికకు గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు. అంబాలికకు పాలిపోయిన దేహంతో పాండురాజూ జన్మించారు. అంబిక ప్రేరణతో ఆమె దాసి ఆ మహనీయుని వలన కుశాగ్రబుద్ధియైన విదురుడ్ని పొందింది.

ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు పెరిగి పెద్దవాళ్ళయ్యారు. ధృతరాష్ట్రునికి రాజ్యపట్టాభిషేకం చేసి, పాండురాజును, విదురుణ్ణి అతనికి సహాయపడేట్లు నియమించాడు భీష్ముడు. మహాబలవంతుడైన పాండురాజు, గొప్ప నీతిశాస్త్రజ్ఞుడైన విదురుడు తమ తమ విధులు సమర్థంగా నిర్వర్తిస్తూ కురువంశకీర్తిని, హస్తినా పురశోభను ఇనుమడింపజేస్తున్నారు. భీష్ముడు ధృతరాష్ట్రునికి గాంధారరాజు సుబలుని కుమార్తె గాంధారితో వివాహం జరిపించాడు. భర్త అంధుడైనందున గాంధారి కూడా జీవితాంతం కళ్ళకు గుడ్డకట్టుకొని గడపటానికి నిర్ణయించుకున్నది. గాంధారి వెంట అతని తమ్ముడు శకుని కూడా తోడుగా వచ్చాడు హస్తినకు – పాండురాజుకు కుంతీభోజుని దత్తపుత్రిక (వసుదేవుని సోదరి) యైన పృథతో వివాహం చేశాడు. పృథకే 'కుంతి' అనే పేరు కూడా ఉన్నది. అట్లే మద్రరాజ్యాధిపతి శల్యుడు తన సోదరి మాద్రిని పాండురాజుకిచ్చి పెళ్ళి చేశాడు. తర్వాత పాండురాజు రాజ్యవిస్తరణ కోసం జైత్రయాత్ర చేశాడు. మగధ, విదేహ, కాశీ, శుంభ, పుండ్ర తదితర రాజ్యాలను గెలిచి రాజ్యాన్ని సువిశాలం, సుదృఢం చేశాడు. విదేహరాజ్యం నుంచి దేవకమహారాజు దాసి కూతురును తెచ్చి, తమ్ముడు విదురునికీ వివాహం జరిపించాడు.

వ్యాసమహర్షి హస్తినకు వచ్చినప్పుడు గాంధారి తన భర్తవంటి బలవంతులైన వందమంది కుమారులు కావాలని కోరింది. 'నీ కోరిక నెరవేరుతుంద'ని ఆశీర్వదించాడు వ్యాసుడు. పాండురాజుకు యుద్ధం, వేట ఇష్టమైన వ్యాపకాలు. ఒకరోజు తన భార్యలిద్దరితో వేటకు బయలుదేరాడు. అడవిలో కిందముడనే ముని, తన భార్యతో మృగరూపంలో సంచరిస్తూండగా ఆ రెండు లేళ్ళనూ తన బాణాలతో సంహరించాడు పాండురాజు. కిందముడు చనిపోతూ నిజరూపం పొంది, "భార్యను తాకితే నీవు కూడా చనిపోతా"వని శపించాడు.

ఈ శాపం కారణంగా పాండురాజులో వైరాగ్యం చోటు చేసుకున్నది. కిందమ దంపతులను చంపినందుకు ఎంతగానో పశ్చాత్తాపం చెందాడు. తాను సన్యాసం తీసుకొని ఇటునుంచి ఇటే వెళ్ళిపోతానని, భార్యలను రాజధానికి వెళ్ళమన్నాడు. కాని భార్యలందుకు ఒప్పుకోలేదు. 'మీలాగే మేమూ సన్యాస నియమాలు పాటిస్తాం. ముగ్గురమూ ఆ విధంగా వానప్రస్థాశ్రమ జీవనం గడుపుదాం' అన్నారు. (వాన ప్రస్థాశ్రమం అంటే వృద్ధాప్యంలో సాంసారిక బంధాలను వదిలి, కందమూలాలు భుజిస్తూ, భగవంతుని గురించి ధ్యానం చేస్తూ భార్యాభర్తలు సాగించే జీవనం) పాండురాజు అందుకు సమ్మతించి, ధన, కనక, వస్తువాహనాలన్నీ పరివారంతో హస్తినకు పంపుతూ, తమ నిర్ణయాన్ని మహారాజు ధృతరాష్ట్రునికి, భీష్మాది పెద్దలకూ తెలియజేయమన్నాడు. ఆ విషయం తెలుసుకొని అంతా దుఃఖించారు.

భార్యలిద్దరితో కలిసి పర్వతాలన్నీ దాటుకుంటూ వెళ్ళి, చివరకు గంధమాదన పర్వతం చేరుకున్నాడు పాండురాజు. అక్కడ కొన్నాళ్ళుండి, ఆ తర్వాత ఋషులకు నిలయమైన శతశృంగ పర్వతానికి చేరుకున్నారు. అక్కడి నుండి చాలా మంది ఋషులు బ్రహ్మలోకం వెళ్తూంటే తానూ వస్తానన్నాడు పాండురాజు. అప్పుడా ఋషులు – పితృ, దేవ, ఋషి, మనుష్య ఋణాలు తీర్చుకున్నవారే బ్రహ్మలోక ప్రవేశానికి అర్హులు. మీకు సంతానయోగం ఉన్నది. మీ భార్యలు తప్పక పుత్రులను కంటారు. ఆ తర్వాతనే ఊర్ధ్వలోక ప్రవేశానికి ప్రయత్నం చేయండి" అని ఆశీర్వదించారు – పాండురాజు ఈ విషయం కుంతీదేవి వద్ద ప్రస్తావించాడు.

కుంతీదేవి, తాను కన్నెగా ఉన్నప్పుడు దుర్వాస మహాముని సేవలతో సంతోషపెట్టగా ఆయన మంత్రాన్ని ఉపదేశించాడని, దానివల్ల కోరకున్న దేవతల ద్వారా సంతానం కలుగుతుందని చెప్పింది. పాండురాజు పరమానంద భరితుడై, దేవతలలో ముందుగా యమధర్మరాజును ఆవాహన చేసుకొమ్మన్నాడు. అతనివల్ల ధర్మవంతుడైన కుమారుడు కల్గుతాడని అన్నాడు. కుంతి యమధర్మరాజును ప్రార్థించింది. అతడు శౌర్యవంతుడు, ధర్మచింతనుడైన కొడుకును ప్రసాదించాడు. అతనికి యుధిష్ఠిరుడనే పేరు పెట్టుకున్నారు. ఈ విషయం హస్తినలో తెలిసింది. అప్పటికే వ్యాసుని వరం పొందిన గాంధారి గర్భం ధరించి రెండేండ్లైంది. సంతానం మాత్రం కలుగలేదు. తనకంటె ముందు తన తోటికోడలు సంతానాన్ని కనడం ఆమెకు దుస్సహమైంది. బాధతో గర్భవిచ్ఛేదనం చేసుకున్నది. ఇనుపగుండు లాంటి పిండం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న వ్యాసుడు ఆమెను ఓదార్చి, "ఈ పిండాన్ని నూటా ఒక్క కుండల్లో భద్రపరచండి! మీ కోరిక నెరవేరుతుంది" అన్నాడు. వ్యాసుడు చెప్పినట్లే చల్లని నీళ్ళు చిలకరించడంతో ఆ పిండం నూటొక్క ముక్కలుగా విడిపోయింది. రెండేళ్ళ తర్వాత వాటిలో నుండి దుర్యోధనుడు, దుశ్శాసనుడు, దుస్సహుడు, దుశ్శలుడు, జలసంధుడు, సముడు, సహుడు, విందుడు, అనువిందుడు, దుర్దర్షుడు, సుబాహుడు మొదలుగాగల నూరుగురు కొడుకులు, 'దుస్సల' అనే కూతురూ జన్మించింది.

అక్కడ శతశృంగ పర్వతం మీద పాండురాజు ప్రోత్సాహంతో కుంతి వాయుదేవుడ్ని ప్రార్థించి మహా బలవంతుడైన భీముడిని కన్నది. భీముడెంతటి బలవంతుడంటే పసివాడుగా ఉన్నప్పుడే తల్లి ఒడి నుండి జారి బండమీద పడితే బండ భళ్ళున బద్దలైపోయిందిగాని, అతడు ఉక్కుగుండులా చెక్కు చెదర లేదు. తర్వాత ఇంద్రుని మంత్రబద్ధుడ్నిచేసి అర్జునుడిని కన్నది. మాద్రి తాను కూడా సంతానవతినవుతానని, మంత్రఫలం తనకూ దక్కేటట్లుగా అనుగ్రహించుమని కుంతిని కోరింది. కుంతి ఇచ్చిన మంత్రశక్తితో అశ్వినీ దేవతలను ప్రార్థించి కవల పిల్లలను కన్నది. వాళ్ళకు నకులుడు, సహదేవుడని నామకరణం చేశారు. తర్వాత ఒకరోజు ఏకాంతంగా ఉన్న మాద్రిని చూసి ఆమెను తాకబోయాడు పాండురాజు. తాకిన మరుక్షణం కిందముని శాపం కారణంగా ప్రాణాలు కోల్పోయాడు. బిడ్డల బాధ్యతను అక్కకు అప్పగించి, భర్తతోపాటు 'సహగమనం' చేసింది మాద్రి.

అక్కడి ఋషులు కుంతిని, పాండునందనులను వెంటతీసుకొని మాద్రి, పాండురాజుల అస్థికలతో హస్తినకు చేరుకొని, జరిగిన సంగతంతా వివరించారు. విషయం తెలుసుకొని ధృతరాష్ట్రాదులు ఎంతగానో దుఃఖించి, తగు రీతి శ్రాద్ధ కర్మలు నిర్వహించారు. సత్యవతి ఎంతగానో రోదించసాగింది. అప్పుడు వ్యాసుడు, 'దుర్యోధనాదులవలన మరిన్ని తీవ్ర పరిణామాలేర్పడతాయి. అప్పుడు నీవింకా తట్టుకోలేవు. కాబట్టి ఇప్పుడే తపస్సుతో జీవనం పావనం గావించుకో' అని సాంత్వన పరిచాడు. సత్యవతి భీష్మాదుల అనుమతితో అంబిక, అంబాలికలతో కలిసి అడవికి వెళ్ళి తపశ్చర్యతో అనతి కాలంలోనే స్వర్గప్రాప్తినొందారు.

3

కౌరవులు, పాండవులు హస్తినాపురంలో కలిసి మెలిసి జీవిస్తున్నారు. అందరిలోకీ బలవంతుడు భీమసేనుడు; అందరిలోకీ దుర్మార్గుడుగా పేరుతెచ్చుకున్నవాడు దుర్యోధనుడు. సహజబలవంతుడైన భీముడు తన అన్నదమ్ములను ఆటపట్టించేవాడు. ఒక్కొక్కసారి పదిమందినీ పిట్టల్ని పట్టినట్లు చంకల్లో ఇరికించుకొని తీసుకొనిపోయేవాడు; నీళ్ళల్లో ముంచేవాడు; జుట్లుపట్టుకొని లాక్కుపోయేవాడు. ఆటలాడేటప్పుడు ఎంతమంది ఆపాలని చూసినా ఆపలేకపోయేవాళ్ళు. ఇవన్నీ భీముడు నవ్వులాటకోసమే చేసేవాడు కాని, అతనికి ఎవ్వరి మీదా ద్వేషం లేదు. అయితే దుర్యోధనుడు మాత్రం ప్రతి చర్యనూ ద్వేషబుద్ధితో, పగతో పరిశీలించేవాడు. భీముని కారణంగా అతడిలో పాండవులందరిమీదా పగ, ప్రతీకారం రగుల్కున్నాయి. ఏ మాత్రం అవకాశం దొరికినా భీముడ్ని చంపివేయ్యాలని, పాండవులను హస్తిన నుండి తరిమివెయ్యాలనీ అనుకుంటూండేవాడు. నిజంగానే ఒకరోజు

అతనికి అటువంటి అవకాశం 'ఉదకక్రీడనం' రూపంలో వచ్చింది.

కౌరవ పాండవులు శకుని మొదలైన వారిని వెంటబెట్టుకొని, గంగాతీరంలోని ప్రమాణకోటి అనే స్థలానికి 'ఉదకక్రీడనం' ఆడడానికి వెళ్ళారు. దుర్యోధనుడు ముందుగానే అక్కడ చేసే భోజ్యపదార్థాల్లో భీమునికోసం తినడానికి వేరే ఏర్పాట్లు చేయించి, అందులో విషం కలిపించాడు. ఉదకక్రీడనం (నీళ్ళలో ఆడటం)లో బాగా అలసిపోయిన వాళ్ళంతా చక్కగా భోజనాలు చేశారు. భీమునికి దుర్యోధనుడే దగ్గరుండి కొసరికొసరి తినిపించాడు. అది చూసి ధర్మరాజు, తమ్ముడు దుర్యోధనునిలో పరివర్తన కల్గిందని సంతోషించాడు కాని అది కపటప్రేమ అని నమ్మలేకపోయాడు. బాగా తిన్న తర్వాత ఎవరికి వాళ్ళు తమకు కేటాయించిన స్థలాల్లో అలసిపోయి దీర్ఘ నిద్రల్లోకి జారుకున్నారు. అదే అదనుగా దుర్యోధనుడు తన తమ్ముళ్ళతో కలిసి, భీముడ్ని పెద్ద పెద్ద తీగలతో బంధించి, ఎత్తైన ఒడ్డు నుంచి గంగలోకి విసిరేశాడు. ఆ తర్వాత ఏమీ ఎరుగనట్లు భీముడు కనిపించడం లేదని బాధపడుతూ అందరితోపాటు వెతికాడు. అతడు ముందే వెళ్ళిపోయుండవచ్చునని అందరూ నిర్ధారణకు వచ్చి హస్తినకు చేరుకున్నారు. భీముడు తప్పిపోయిన సంగతి తెలిసి అందరూ కలత చెందారు – దుర్యోధనాదులు తప్ప.

గంగలో విసిరివేయబడ్డ భీముడు నాగలోకం చేరుకున్నాడు. అక్కడ భయంకరమైన పాములు కాటేయడం వల్ల తిన్న ఆహారంలోని విషమంతా విరుగుడైంది. నాగలోక నాయకుడైన వాసుకి, ఆర్యకుడు భీముని వివరాలు తెలుసుకొని, అతడు తమ చుట్టమేనని గ్రహించి, ఎనిమిది పాత్రల నిండుగా ఉన్న రసం త్రాగించారు. దాని వల్ల అతనికి వెయ్యేనుగుల బలం వచ్చింది. తర్వాత అతడ్ని ప్రమాణకోటివద్ద వదిలేశారు. ఎనిమిదో రోజున దర్జాగా ఇల్లు చేరుకున్న భీముడ్ని చూసి అందరూ ఆశ్చర్యానందమగ్నులయ్యారు. దుర్యోధనుడు మాత్రం 'తానొకటి తలస్తే, దైవమొకటి తలచిందికదా' అంటూ తీవ్ర విచారమగ్నుడయ్యాడు. దుర్యోధనుని కుట్ర గురించి తెలిసినా, ఆ విషయంలో గొడవ పెట్టుకోరాదని, సహనం వహించమని విదురుడు కుంతిని, ధర్మరాజునూ కోరాడు.

భీష్ముడు కౌరవ పాండవులకు ధనుర్విద్య నేర్పించవలసిన సమయమాసన్నమైందని గ్రహించి, కృపాచార్యుని పిలిపించి, వాళ్ళనతనికి అప్పగించాడు. పిల్లలు చాలా ఉత్సాహంగా అస్త్రవిద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ సమయంలో ఒకసారి ఆడుకుంటూండగా బంతి ఒకటి లోతైన బావిలో పడిపోయింది. నూటా అయిదుగురూ అక్కడికి చేరి బంతిని ఎలా తీసుకోవాలో తెలియక తికమకపడుతున్నారు. అప్పుడు ఆ దారిన వెళ్తున్న ద్రోణుడు వాళ్ళను చూశాడు. వెంటనే తన వేలికున్న ఉంగరాన్ని కూడా ఆ నీటిలోకి విసిరేశాడు. పిల్లలు ఆశ్చర్యపోయారు. అర్జునుని చేతిలోని ధనుర్బాణాలు తీసుకొని, అమ్ములను బంతికి సంధించి, ఒకదానివెనుక ఒకటిగా వాటిని అనుసంధానించి వాళ్ళ బంతిని బయటికి తీయడమేగాక, ఆ ప్రక్రియ ద్వారానే ఉంగరాన్ని కూడా తీసి చూపించాడు. ఈ అద్భుతం చూసి ఆశ్చర్యపోయిన బాలురంతా తమ తాతయ్య భీష్మునివద్దకు వెళ్ళి జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పారు. భీష్ముడు ద్రోణుడ్ని కలుసుకొని, తన మనుమలను ధనుర్విద్యాపారంగతులను చేయవలసిందిగా అర్థించాడు. ఆ విధంగా ద్రోణుడు కురుపాండవులకు అస్త్ర విద్యలను నేర్పించసాగాడు.

ద్రోణుని కొడుకు అశ్వత్థామ. ద్రోణుడికి అతడంటే సహజంగానే ప్రత్యేకాభిమానం. అయితే అర్జునుడు ద్రోణుడిపట్ల అమిత భక్తి ప్రపత్తులు చూపేవాడు. విద్య మరియు అధ్యయనం పట్ల కూడా ఎనలేని శ్రద్ధకనబరచేవాడు. వీటితో ద్రోణుడు ప్రసన్నుడై అర్జునుడ్ని తనకు అత్యంత ప్రియ శిష్యునిగా ప్రకటించి, ప్రపంచంలో నిన్ను మించిన ధనుర్ధారుడు లేడన్న రీతిగా తీర్చిదిద్దుతానన్నాడు. కాని కొన్ని రోజుల్లోనే అర్జునుని తలదన్నే విలుకాడున్నాడన్న సంగతి వాళ్ళకు అనుభవంలోకి వచ్చింది.

ద్రోణుని అస్త్ర విద్యా పటిమ గురించి విని, వివిధ దేశాల వాళ్ళు అతని వద్దకు విద్య నేర్చుకోవడానికి వచ్చేవాళ్ళు. అలాంటివాళ్ళలో ఒకరోజు నిషధరాజు హిరణ్యధన్వుని కుమారుడు ఏకలవ్యుడూ ఉన్నాడు. కాని, ఏకలవ్యుడు తక్కువకులానికి చెందినవాడని అతనికి విద్యనేర్పడాన్ని తిరస్కరించాడు ద్రోణుడు. అయినా నిరాశ చెందకుండా, ఏకాగ్రతతో సాధన చేస్తే

ఎంతటి కష్టమైన పనులనైనా సాధించవచ్చని, అందుకు కులభేదాలు అడ్డంకి కానేరవని నిరూపించాడు ఏకలవ్యుడు. ద్రోణుని ప్రతిమ పెట్టుకొని, అతడ్నే గురువుగా భావించి నిరంతర కఠోరసాధనతో తిరుగులేని విలుకాడైనాడు. ఇది తెలిసిన అర్జునుడు తనను మించిన వాడున్నాడని గురువుకు చెప్పాడు. అర్జునునివల్ల లోకానికి ఒక మహోపకారం జరుగవలసి ఉన్నది. ఏకలవ్యుని కారణంగా ఆ లక్ష్యం నెరవేరదేమోనన్న భయంతో గురుదక్షిణగా తనకు కుడిచేతి బొటనవ్రేలిని ఇవ్వమని ఏకలవ్యుడ్ని అడిగాడు. ఏకలవ్యుడు బొటనవేలునిచ్చి తన గురుభక్తిని చాటుకున్నాడు. శిష్య ప్రేమకు ద్రోణుడు, గురుభక్తికి ఏకలవ్యుడు, అర్జునుడూ ప్రతిభావంతుడుగా ప్రసిద్ధిగాంచారు.

కురుపాండవుల అస్త్రవిద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఒకరోజు అస్త్రవిద్యాప్రదర్శనను ఏర్పాటు చేశాడు ద్రోణుడు. అందులో అర్జునుని ప్రతాపం చూసి అందరూ ఆశ్చర్యాద్భుత భయ విహ్వలులైనారు. అర్జునుని మించిన విలుకాడు ఈ ప్రపంచంలో ఎక్కడా లేడండూ జయజయధ్వానాలు చేశారు అంతా. సరిగ్గా అప్పుడే కర్ణుడు ధనుష్ఠంకారం చేస్తూ రంగమధ్యంలోకి వచ్చి, 'అంతకు మించిన అస్త్ర విన్యాసం నేను ప్రదర్శిస్తా' నంటూ సవాలు విసిరాడు. అది చూసి అర్జునుడు కలవరపడ్డాడు. 'తనకొక తోడు దొరికా'డంటూ దుర్యోధనుడు మహదానందపడ్డాడు. అతడు అతిరథుడనే సూతుని (రథాన్ని తోలేవాని) కొడుకు కాబట్టి క్షత్రియులతో పోటీకి అనర్హుడన్నాడు కృపాచార్యుడు. వెంటనే దుర్యోధనుడు, 'అతడ్ని అంగరాజ్యానికి రాజును చేస్తున్నా'నని ప్రకటించి కయ్యానికి కాలుదువ్వేటట్లు చేశాడు. 'ఇది అస్త్ర విద్యా ప్రదర్శన కాని, యుద్ధ ప్రదర్శన కాద'ని పెద్దలందరూ సర్దిచెప్పి, ఆ వాతావరణం సద్దుమణిగేటట్లు చేశారు.

ఈ సంఘటన తర్వాత కురుపాండవుల మధ్య పొరపొచ్చాలు అధికమయ్యాయి. ధృతరాష్ట్రునిలో కూడా తన కొడుకులకంటే పాండవులు ఎక్కువ గౌరవాదరాలు పొందుతున్నారన్న ఈసు ప్రవేశించింది.

'తనను అవమానించిన ద్రుపదుడ్ని పట్టితెచ్చి ఇవ్వడమే తానుకోరుకునే గురుదక్షిణ' అని కురుపాండవులతో అన్నాడు ద్రోణుడు. కౌరవులెవ్వరూ అది సాధించలేకపోయారు. మహావీరుడైన అర్జునుడు కష్టసాధ్యమైన ఆ కార్యాన్ని అలవోకగా సాధించి చూపించాడు. ద్రుపదుడ్ని రథంకొమ్ముకు కట్టుకొని తెచ్చి ద్రోణుని కాళ్ళమీద పడేశాడు. అర్జునుని ఖ్యాతి మరింత అధికమైంది. ఆ తర్వాత పాండవులు మహనీయులైన ఋషులవద్ద, మహాత్ముల వద్ద అన్ని విద్యలూ సాంగోపాంగంగా నేర్చి తమ బుద్ధికుశలతను, శ్రద్ధాసక్తులనూ చాటుకున్నారు. ధృతరాష్ట్రుడు పెద్దవాడైన యుధిష్ఠిరుడికి యౌవరాజ్యాభిషేకం చేశాడు. ఆ తర్వాత అర్జునుడు సోదరులైన భీమనకుల సహదేవులను తోడు తీసుకొని, తండ్రిలాగా జైత్రయాత్ర చేసి మరింత రాజ్యవిస్తరణ గావించాడు. పాండురాజు సైతం జయించలేకపోయిన సౌవీరదేశంతోపాటు తూర్పు పశ్చిమ దిగ్భాగాలను జయించి కురువంశ కీర్తిని ఇనుమడింపజేశాడు.

ధృతరాష్ట్రుని మనోవేదన మరింత అధికమైంది. మరో పక్క దుర్యోధనుడు చెవిలో జోరీగలా తన బాధనంతా వీలు చిక్కినప్పుడల్లా వెళ్ళబోసుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో పాండవులను హస్తిన నుండి దూరంగా పంపించాలని, అదే అదనుగా దుర్యోధనుడు ప్రజలను మచ్చిక చేసుకొని రాజ్యాధికారాన్ని స్వీకరించాలని ధృతరాష్ట్రుడు అంతరంగ సచివుడైన కణికునితో కూడి పన్నాగం పన్నాడు. అందుకు పాండవులను వారణావతం అను నగరానికి పంపడానికి ఏర్పాటు చేశారు. అక్కడ వారికోసం లక్కతో ఇంటిని నిర్మించారు. ఈ కుట్ర తెలిసినా, పెదనాయనకు ఎదురు చెప్పలేక యుధిష్ఠిరుడు తల్లితో, తమ్ముళ్ళతో కలిసి వారణావతానికి చేరుకున్నాడు.

4

వారణావత ప్రజలు పాండవులను చూడటమే తనకు మహాదృష్టంగా భావించారు. పాండవులక్కడ ఒక ఏడాదిపాటున్నారు. దుర్యోధనుని పక్షాన లక్క ఇంటిని తగులబెట్టి, పాండవులను సజీవదహనం చేయడానికి నియమించబడిన పురోచనుడు సమయం

కోసం కాచుకొని ఉన్నాడు. ఈ లోపు విదురుడు ఒక నమ్మకమైన మనిషిని పంపి, లక్క ఇంటి నుండి అడవిలోనికి ఒక సొరంగమార్గం తవ్వించాడు. పురోచనుడితో సహా ఆ ఇంటిని పాండవులే దహించేసి అందులో నుండి సురక్షితంగా బయటపడ్డారు. యాదృచ్ఛికంగా ఆ సమయానికి అక్కడ ఒక భిల్లస్త్రీ తన ఐదుగురు కుమారులతో ఉంది. వాళ్ళు కూడా ఆ మంటలకు ఆహుతి అయినారు. వాళ్ళను చూసి పాండవులే చనిపోయారనుకొని కౌరవులు శ్రాద్ధకర్మలు కూడా నిర్వహించారు.

పాండవులు చీకట్లో అడవిలో సంచరిస్తూండగా హిడింబ అను రాక్షస కాంత చూసింది. భీమసేనుడ్ని తొలి చూపులోనే వలచింది, తనను పెళ్ళి చేసుకొమ్మని కోరింది. అంతలో ఆమె అన్న హిడింబాసురుడు అక్కడికి వచ్చాడు. భీముడు అతణ్ణి సంహరించి తల్లి, అన్న ధర్మజునుని అనుమతితో హిడింబను పెళ్ళాడాడు. ఒక సంవత్సరం తర్వాత వాళ్ళకు ఘటోత్కచుడు అనే కొడుకు కలిగాడు. అతడు మహాబలవంతుడు, సకల విద్యావంతుడు, రాక్షసమాయలన్నీ పుట్టుకతోనే నేర్చుకున్నాడు. భీమసేనుని అనుమతితో ఘతోత్కచుడు తల్లిని తీసుకొని తమ నిజావాసానికి వెళ్ళిపోయాడు.

వ్యాసుడు పాండవులను కలిసి, "ఏకచక్రపురానికి వెళ్ళండి. మీకు మేలు జరుగుతుంది. మీకు రాజ్యం, సకల సుఖాలు సంప్రాప్తిస్తా"యని ఆశీర్వదించాడు. అయితే సరైన సమయంలోనే మీరెవరో తెలియాలి. అంతవరకూ ప్రచ్ఛన్న వేషాల్లోనే ఉండటం మంచిదని సూచించాడు.

ఏక చక్రపురంలో ఒక బ్రాహ్మణుల ఇంట్లో ఉన్నారు పాండవులు. వాళ్ళది చిన్న కుటుంబం. భార్య, భర్త, కూతురు, కొడుకు. పాండవులు యాచక వృత్తితో జీవిస్తున్నారు. ఒకరోజు యుధిష్ఠిరుడు అర్జున నకుల సహదేవులతో కలిసి భిక్షకోసం వెళ్ళారు. బ్రాహ్మణ కుటుంబం పెద్దగా రోదిస్తూంటే కారణం అడిగింది కుంతి. బకాసురడనే రాక్షసుడు నగరంలోని వాళ్ళనుండి రోజుకు ఒక్కో కుటుంబం నుంచి ఒక మనిషిని, బండెడు అన్నం, రెండు ఎద్దులను ఆహారంగా తీసుకుంటాడు. ఇది ఒప్పదం. ఈ రోజు తమ కుటుంబం వంతుగాబట్టి, ఎవర్ని పంపాలో తోచక బాధపడుతున్నాం' అని చెప్పాడు యజమాని. అప్పుడు కుంతీదేవి, "నీకు ఒక్కడే కొడుకు కాబట్టి బాధపడుతున్నావ్. నాకు ఐదుగురున్నారు అందులో ఒకర్ని పంపిస్తా"నన్నది. బ్రాహ్మణుడందుకు ఒప్పుకోలేదు. తన కొడుకు మహావీరుడని, ఆ బకాసురుడ్ని అంతమొందిస్తాడని వాళ్ళకు నచ్చజెప్పి, భీముణ్ణి పంపింది కుంతి. భీముడు ఆ బకాసురుణ్ణి వధించి, ఏకచక్ర పురవాసుల శోకం తీర్చాడు.

పాంచాలాధీశుడైన ద్రుపదుడు ద్రోణాచార్యుని చేత పరాభవింపబడ్డ తర్వాత అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని, ద్రోణుని సంహరించగల మహావీరుని కోసం ఒక విశేషమైన యజ్ఞం చేశాడు. యజ్ఞఫలంగా అతనికి అగ్నికుండం నుండే ఒక దివ్యమైన పుత్రుడు లభించాడు. అతని పేరు దృష్టద్యుమ్నుడు. అతనితోపాటు ఒక కూతురూ లభించింది. ఆమె పేరు కృష్ణ. ద్రుపదుని కూతురు కావడంవల్ల అందరూ ఆమెను ద్రౌపది అని పిలిచారు. ద్రౌపది నల్లగా ఉన్నా ఎంతో అందమైంది. ఆమె శరీరం నుండి ఎల్లప్పుడూ వికసించిన నల్లకలువల సౌరభం వ్యాపిస్తూండేది. గత జన్మలో ఆమె తనకు మంచి భర్తకావాలని శంకరుని గురించి తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షం కాగానే 'భర్తకావాలి! భర్తకావాలి! అని ఐదుసార్లు కోరింది. అందుకు శంకరుడు 'తథాస్తు!' అన్నాడు. 'నీకు ఐదుగురుభర్తలుంటారు. తప్పదు! అయినా నీవు చరితార్థురాలివి అవుతావు' అని ఆశీర్వదించాడు.

బకాసురుని వధానంతరం పాండవులను కలిసిన వ్యాసుడు వాళ్ళను పాంచాలపురం వెళ్ళుమని ఉద్బోధించాడు. అక్కడ నిర్వహిస్తున్న ద్రౌపదీ స్వయంవరానికి వెళ్ళుమని కూడా చెప్పాడు. వ్యాసుని ఆదేశం మేరకు పాండవులు బ్రాహ్మణ వేషాల్లోనే పాంచాలపురం చేరుకున్నారు. స్వయంవర సభలో బ్రాహ్మణ సమూహంలోనే కూర్చున్నారు.

ద్రుపదుడు స్వయంవర సన్నాహంలో భాగంగా మత్స్యయంత్రాన్ని ఏర్పాటుచేశాడు. పైన యంత్రమధ్యంలో గిరగిరా తిరుగుతున్న చేపను కింద నీళ్ళలో ప్రతిబింబాన్ని చూస్తూ కొట్టిన వారికి ద్రౌపదినిచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు. కౌరవుల్లో చాలా మంది ఆపని చేయలేక భంగపడ్డారు. ఇతర క్షత్రియ వీరులూ విఫలమయ్యారు. కర్ణుడు అలవోకగా ధనుస్సునెత్తి ఎక్కుపెట్టినా

'సూతపుత్రుడ్ని నేను వరించ'నన్నది ద్రౌపది. అప్పుడు అన్నల అనుమతి తీసుకొని అర్జునుడు యంత్రభేదనానికి సిద్ధపడ్డాడు. అందరూ ఆశ్చర్యచకితులై చూస్తూండగా అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించాడు. క్షత్రియులకు అది అవమానకరంగా ఉందని వాళ్ళంతా ద్రుపదుని మీదికి కత్తిదూశారు. వాళ్ళందరినీ భీమార్జునులు ఎదిరించారు. శ్రీకృష్ణుడు కల్పించుకొని అందరినీ శాంతపరిచి, యుద్ధం నివారించాడు. ద్రౌపదిని వెంటబెట్టుకొని పాండవులు ఇంటికి వెళ్ళి తల్లితో "అమ్మా! భిక్షతీసుకొని వచ్చాం!" అన్నారు బయటినుంచే. లోపలున్న కుంతీదేవి వివరాలు తెలుసుకోకుండానే "అందరూ పంచుకోండి నాయనా!" అని ఆదేశించింది. బిడ్డలు తెచ్చింది భిక్షకాదని, అమ్మాయి అని తెలిసి ఆశ్చర్యపోయి, పశ్చాత్తాపంతో కుంగిపోయింది కుంతి. అందరూ విచారంతో ఉండగా వ్యాసభగవానుడు వచ్చి 'ద్రౌపది పూర్వజన్మలో పొందిన వరం కారణంగా ఈ పరిస్థితి కల్గింది. భగవంతుని వరానికి తిరుగుండదు. ఐదుగురినీ ఆమె వివాహం చేసుకోవడం ధర్మమే'నని హితబోధ చేశాడు. ద్రుపదుడు తన కూతురును స్వయంవరంలో గెలిచిన వీరుడు అర్జునుడేనని, బ్రాహ్మణ వేషాల్లో ఉన్నవాళ్ళు పాండవులన్న సంగతి తెలిసి ఎంతో సంతోషించాడు. వ్యాసుని సూచన మేరకు ఐదుగురికీ తన కూతురుతో పెళ్ళి జరిపించి, ధన కనక వస్తువాహనాలతో తృప్తులను చేశాడు. శ్రీకృష్ణుడు కూడా అనేక కానుకలు సమర్పించాడు.

పాండవులు ద్రుపదుని పాంచాలరాజ్యంలో ఉన్నారని, మత్స్యయంత్ర భేదన మొనర్చినవాడు అర్జునుడేనని హస్తినాపురంలో ఉన్న కురువంశస్థులకందరికీ తెలిసింది. ధృతరాష్ట్రుడు, దుర్యోధన దుష్టచతుష్టయం (దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని) తప్ప అందరూ ఎంతో ఆనందించారు. వాళ్ళను సగౌరవంగా పిలిపించి, అర్ధరాజ్యం అప్పగించుమని ధృతరాష్ట్రునికి చెప్పారు భీష్మాది పెద్దలు. తప్పనిసరై వాళ్ళను విదురునిచే పిలిపించి, అర్ధరాజ్యాన్ని ఏలుకొమ్మని చెప్పి, ఖాండవప్రస్థానికి పంపించాడు ధృతరాష్ట్రుడు. ఖాండవప్రస్థంలో అద్భుతమైన రాజభవనం నిర్మించారు. అది స్వర్గశోభను సంతరించుకున్నది. అందుకే ఖాండవప్రస్థాన్నే ఇంద్రప్రస్థమన్నాడు ధర్మరాజుగా పేరుగాంచిన యుధిష్ఠిరుడు. ఓ శుభముహూర్తాన ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు పెద్దలు. అందరూ సుఖంగా జీవిస్తున్నారు. ఇంద్రప్రస్థంలో ధర్మరాజు పాలన – కృతయుగాన్ని గుర్తుకు తెచ్చేంత వైభవంగా ఉంది.

ఇట్లా ఉండగా నారదుడు ఇంద్రప్రస్థానికి వచ్చాడు. ద్రౌపదితో పాండవులు కాపురం చేయడానికి ఒక నియమం ఏర్పరచుకోవడం మంచిదని, అది ధర్మసమ్మతము, న్యాయసమ్మతమూ కావాలని ఒక సూచన చేశాడు. ఆ సూచన ప్రకారం ద్రౌపది పాండవులకు ఒక్కొక్క సంవత్సరం ఒకరికి భార్యగా ఉండాలి. ఆ సమయంలో తక్కిన నలువురూ మాతృభావంతో, వాత్సల్యంతో ఆమెపట్ల వ్యవహరించాలి. ఆమె భర్తతో ఉన్న గృహంలోకి ఎవరైనా ప్రవేశిస్తే పన్నెండేళ్ళు వనవాసం చేయాలి. ఆ నియమం అందరికీ నచ్చింది. ఆ ప్రకారమే వాళ్ళు నడుచుకోసాగారు. ఈ నియమం ప్రకారం ద్రౌపది ధర్మరాజుకు భార్యగా ఉన్న సమయంలో ఒక సంఘటన జరిగింది.

ఒక బ్రాహ్మణుడు అర్జునునితో తన గోసంపదను దొంగలు దోచుకొని వెళ్తున్నారు. కాపాడుమంటూ మొరపెట్టుకున్నాడు. అది విన్న అర్జునుడు ఆలస్యం చేయకుండా తన అస్త్రశస్త్రాలు తీసుకున్నాడు. ఆ సమయంలో ధర్మరాజు ద్రౌపదితో అస్త్రాలున్న గదిలోనే ఉన్నాడు. తనకు శిక్షపడ్డాసరే, ధర్మాన్ని రక్షించడమే ప్రధాన కర్తవ్యంగా భావించి, అర్జునుడు దొంగల బారినుండి ఆ భూసురుని గోధనాన్ని కాపాడి, అతనికి అప్పగించాడు. ధర్మరక్షణయితే అయ్యిందికాని, నియమ భంగం చేసిన అర్జునుడు శిక్షార్హుడయ్యాడు. ధర్మరాజు క్షమించానన్నా వినకుండా పన్నెండు సంవత్సరాలు తన కుటుంబానికి దూరంగా వనవాసానికి సిద్ధమయ్యాడు. ఈ యాత్ర మహాభారతకథలో అర్జునుని తీర్థయాత్రగా ప్రసిద్ధమయ్యింది.

ఈ యాత్రలో అర్జునుడు వందలకొద్ది అడవులు, సరోవరాలు, పుణ్యతీర్థాలు, దేశాలు, సముద్రాలు చూశాడు. హరిద్వార్‌లో ఉండగా నాగకన్య ఉలూచిని పరిణయమాడాడు. అక్కడి నుండి మహేంద్ర పర్వత సమీపంలోని మణిపురం చేరి, చిత్రవాహనుని కూతురు చిత్రాంగదను పెళ్ళాడాడు. వాళ్ళకు కలిగిన కొడుకుకు బభ్రువాహనుడనే పేరు పెట్టారు. ఆ తర్వాత సముద్ర తీరాన

గల పంచతీర్థాల్లో (అగస్త్య, సౌభద్ర, పౌలోమ, కారంధ, భారద్వాజ) స్నానమాడి, శాపవశులైన అప్సరస స్త్రీలకు శాపవిమోచనం కల్గించాడు. అక్కడి నుండి గోకర్ణ క్షేత్రం మీదుగా ప్రభాస తీర్థానికి చేరుకున్నాడు. అక్కడ అర్జునుని ఆత్మీయ మిత్రుడైన కృష్ణుడు కలిశాడు. ఇద్దరూ రైవతక పర్వతానికి చేరుకున్నారు. కృష్ణుని అభిమతం మేరకు సేవకులు సకల ఏర్పాట్లూ గావించారు. మిత్రులిద్దరూ చాలాకాలం కలిసి ఉన్నారు అక్కడే. రైవతకాద్రి ఉత్సవంలో బలరామకృష్ణుల సోదరి సుభద్రను చూసిన అర్జునుడు ఆమెను ఇష్టపడ్డాడు. మిత్రుని కోరిక నెరిగిన కృష్ణుడు 'నీ కంటె యోగ్యుడైన భర్త నా చెల్లెలికింకెవరున్నారు? స్వయంవరంలో ఆమె నిన్ను వరించకుంటే నీ ఆశయం నెరవేరదు, కాబట్టి ఎత్తుకొనిపోయి వివాహం చేసుకో' అన్నాడు. అర్జునుడు అందుకోసం యత్నించగా యాదవ వీరులంతా అడ్డుకో జూచారు. కృష్ణుడు వాళ్ళను శాంతపరచి, రాక్షసవిధిని వివాహం చేసుకోవడం దోషం కాదని నచ్చజెప్పి, శాస్త్రోక్తవిధిని పెళ్ళిజరిపించుమని బలరాముడ్ని కోరాడు. వివాహానంతరం సంవత్సరకాలం ద్వారకలో ఉండి, తర్వాత వనవాసకాలాన్ని పూర్తిచేసి, సుభద్రాసమేతుడై ఇంద్రప్రస్థానికి చేరుకున్నాడు అర్జునుడు. పాండవులు, పరివారం, సమస్త ప్రజలూ ఎంతగానో సంతోషించారు. సుభద్రార్జునులకు అభిమన్యుడు జన్మించాడు. అతడు అన్ని విద్యలూ నేర్చుకున్నాడు. తండ్రివద్ద ధనుర్వేదం అభ్యసించాడు.

పాండవులందరూ ద్రౌపదివల్ల సంతానవంతులయ్యారు. యుధిష్ఠిరునికి ప్రతివింధ్యుడు; భీమసేనునికి సుతసోముడు; అర్జునునికి శ్రుతకర్ముడు; నకులునికి శతానీకుడు; సహదేవునికి శ్రుతసేనుడు అనే పుత్రులు కలిగారు. వీళ్ళంతా వేద విద్యలతోపాటు అర్జునుని వద్ద శస్త్రాస్త్ర విద్యల నభ్యసించారు.

కృష్ణార్జునులు జలవిహారానికై ఒకరోజు యమునా తీరానికి వెళ్ళారు. అక్కడ అగ్నిదేవుడు ఒక యాచకుడై వచ్చి, తన ఆకలి తీర్చుమని అడిగాడు. కృష్ణార్జునులు అందుకు ఒప్పుకున్నారు. అప్పుడు అగ్ని తన ఖాండవ వనాన్ని దహించడమే భోజనమని, తాను అగ్నిదేవుడినని, వనంలో ఇంద్రుని స్నేహితుడైన తక్షకుడు కాపురం ఉండటంవల్ల దహించనీయకుండా అడ్డుకుంటున్నాడని అసలు సంగతి చెప్పాడు. అందుకు కృష్ణార్జునులు తమ వద్ద సరియైన ఆయుధాలు లేవన్నారు. అప్పుడు అగ్ని అర్జునునికి గాండీవాన్ని, అక్షయ తూణీరాన్నీ సమకూర్చాడు. కృష్ణునికి సుదర్శనచక్రాన్ని, కౌమోదకి అనే గదను ఇచ్చాడు. వారి సాయంతో ఖాండవ దహనాన్ని యథేచ్ఛగా పూర్తిచేశాడు. అయితే ఆ సమయంలో కురుక్షేత్రానికి వెళ్ళడం వల్ల తక్షకుడు చనిపోలేదు. అతని కొడుకును ఇంద్రుడు కాపాడాడు. జరిత, ఆమె పిల్లలను అగ్ని దేవుడు దహించకుండా వదిలేశాడు. మయుడనే రాక్షసుడు అర్జునుని శరణుజొచ్చి ప్రాణాలు కాపాడుకున్నాడు.

2. సభాపర్వం

తన ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతగా 'మయసభ' అనే ఓ అద్భుతమైన భవనాన్ని పాండవులకు నిర్మించి ఇచ్చాడు మయుడు.

మయుడు అద్భుత మణిమయ భవనం (వేయి హస్తాల పొడవు వెడల్పులతో, చిత్ర విచిత్ర వస్తు, వృక్ష సంపత్తితో) నిర్మించి ఇవ్వడంతోపాటు భీమునికి గదను, అర్జునునికి దేవదత్తమనే శంఖాన్ని, అపారధనరాసులనూ పాండవులకు కానుకలుగా సమర్పించుకున్నాడు. ఒకరోజు నారదుడు స్వర్గం నుంచి వస్తూ, 'రాజసూయ యాగం చేయండి! ఇది మీ తండ్రిగారి కోరిక. దీనివల్ల మీకు యశస్సు, మీతండ్రికి స్వర్గసుఖం అధికమవుతాయి' అని చెప్పాడు. ధర్మరాజు ఈ విషయమై పెద్దలందరి సలహాలు తీసుకున్నాడు. రాజసూయ యాగమంటే ఇతర రాజులందరి మీద ఏకఛత్రాధిపత్యం సాధించడమే. ఈ నేపథ్యంలో వ్యతిరేకతలను అణచివేయడం, యుద్ధాలు చేయడమూ సంభవిస్తుంది. అందరూ యాగం చేయడాన్ని ప్రోత్సహించారు. శ్రీకృష్ణుడు మాత్రం మగధను పాలించే జరాసంధుడు అనేకమంది రాజులను జయించి, బలగర్వితుడై వాళ్ళచేత ఊడిగం చేయించుకుంటున్నాడు. అతడ్ని జయిస్తేనే రాజసూయం విజయవంతమవుతుదని సలహా ఇచ్చాడు. కృష్ణుని సలహా ననుసరించి, అతడ్ని కృష్ణుని

వెంటబెట్టుకొని మగధకు చేరుకున్నారు పాండవులు. ఎవ్వరితో యుద్ధం చేస్తా'వని కృష్ణుడు జరాసంధుడ్ని అడిగాడు. బలవంతుడైన జరాసంధుడు తనతో సమాన బలుడైన భీముడ్ని ఎంచుకున్నాడు. ఇద్దరికీ పదమూడు రోజులు అవిరామంగా మల్లయుద్ధం జరిగింది. పద్నాలుగో రోజు జరాసంధుడ్ని, కృష్ణుని సలహాల ఆధారంగా వధించాడు భీముడు. రాజులందరూ చెరసాల నుండి విముక్తులయ్యారు. పాండవులకు అనేక కానుకలు సమర్పించి, ధర్మరాజు సార్వభౌమత్వాన్ని ఆనందంగా అంగీకరించారు. ధర్మరాజు రాజులందరినీ పిలిపించి, రాజసూయయాగం ప్రారంభించాడు.

అందరికంటె ముందుగా శ్రీకృష్ణుడ్ని పరమదైవంగా భావించి పూజించాడు ధర్మరాజు. ఆ పూజను ఆక్షేపిస్తూ, శిశుపాలుడు అందరినీ దూషించడం మొదలుపెట్టాడు. అతని తల్లికిచ్చిన మాట ప్రకారం వంద తప్పులు పూర్తికావడంతో శిశుపాలుని శిరస్సును ఖండించాడు కృష్ణుడు. రాజసూయ యాగం పూర్తయిన తర్వాత దుర్యోధనుడు మయసభను దర్శించాడు. ధర్మరాజు పొందిన గౌరవాదరాలకు, కీర్తి సత్కారాలకు అతని గుండె మండిపోయింది. మయసభ శత్రువుకు మాయసభలా గోచరిస్తుంది. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు భ్రమింపజేస్తుంది. అసూయాపరుడైన దుర్యోధనునికి అన్నీ అట్లాగే కనిపించాయి. నీళ్ళు లేని చోట ఉన్నట్లు, గుమ్మం ఉన్నచోట లేనట్లూ కనిపించి, విరుద్ధప్రవర్తనలతో అవమానాలపాలయ్యాడు. అవహేళనలను పొందాడు. దాంతో అతనిలో ప్రతీకారేచ్ఛ మేరుపర్వతాన్ని మించిపోయింది. అసూయ, అవమానం, అతనిలో ద్వేషాన్ని పెంచాయి. శకునితో, కర్ణునితో, దుశ్శాసనునితో కలిసి పాండవులను పరాభవించే ఉపాయాలను చర్చించాడు దుర్యోధనుడు. "యుద్ధంలో వాళ్ళను జయించలేం కాబట్టి, జూదంలో ఓడిద్దాం. యుధిష్ఠిరుడు జూదవ్యసనప్రియుడు. అతన్ని రప్పిద్దాం!' అన్నాడు శకుని. ధృతరాష్ట్రుని ద్వారా పాండవులను హస్తినకు పిలిపించారు.

మొదట ధర్మరాజు జూదానికి సుముఖత చూపకున్నా, శకుని రెచ్చగొట్టడంతో ఆటకు సిద్ధపడ్డాడు. కాని జూదంలో సిద్ధహస్తుడైన మాయల అక్షులుగల శకుని ముందు అతని పాచికలేవీ పారలేదు. ప్రతిసారీ శకుని గెలిచాడు. వస్తువాహనాలతో మొదలుపెట్టి, సమస్త రాజ్యాన్నీ జూదంలో పణంగా పెట్టాడు యుధిష్ఠిరుడు. తర్వాత తమ్ముళ్ళ నందరినీ ఓడిపోయాడు. ధర్మబద్ధులైన భీమార్జున నకుల సహదేవులు అన్న మాటకు ఎదురాడక తలవంచుకున్నారు. తర్వాత ధర్మరాజు తనను తాను పణంగా పెట్టాడు. తనుకూడా ఓడిపోయిన తర్వాత చివరకు ద్రౌపదిని ఒడ్డాడు. ఆమెను కూడా ఓడిపోయాడు.

దుర్యోధనాదులు పాండవులను సూటిపోటి మాటలతో బాధపెట్టడమే గాక ద్రౌపదిని సభకీడ్చుకొని వచ్చారు. అందరూ చూస్తూండగా దుశ్శాసనుడు ఆమెను వివస్త్రను జేయడానికి పూనుకున్నాడు. దుర్యోధనుడ్ని ఎదిరించలేక అందరూ తలలు వంచుకున్నారు. ధర్మశృంఖల బద్ధులైన పాండవులూ నోరు మెదపలేకపోయారు. అప్పుడు ద్రౌపది తనను కాపాడమని కృష్ణున్ని ఆర్తితో ప్రార్థించింది. దీనజనోద్ధారకుడైన ఆ వాసుదేవుడు ప్రచ్ఛన్న రూపంలో అక్కడికి వచ్చి, అక్షయవస్త్రాలిచ్చి ఆమె గౌరవాన్ని నిలబెట్టాడు. అప్పుడు ఎన్నో దుశ్శకునాలు తోచాయి. భయపడిన ధృతరాష్ట్రుడు ద్రౌపదిని ఏంకావాలో కోరుకొమ్మన్నాడు. ద్రౌపది మొదట రాజైన యుధిష్ఠిరుడ్ని దాస్య విముక్తుడ్ని చేయమని అడిగింది. రెండో వరంగా భర్తలందరనీ విడుదల చేయమని అడిగింది. మూడోవరం ఆమె కోరుకోనప్పటికీ సమస్త సంపదలనూ, రాజ్యాన్నీ తిరిగి ఇచ్చేస్తున్నానని, ఇంద్రప్రస్థానికి వెళ్ళి సుఖంగా ఉండమని ఔదార్యం ప్రకటించాడు ధృతరాష్ట్రుడు. అంతకు ముందే ద్రౌపదికి జరుగుతున్న అవమానాన్ని భరించలేని భీముడు దుశ్శాసనుని గుండె చీల్చి రక్తం తాగుతానని, దుర్యోధనుని తొడలు విరగ్గొట్టి చంపుతానని భీషణమైన ప్రతిజ్ఞలు చేశాడు. మొత్తం మీద ధృతరాష్ట్రుని అనుగ్రహంతో పాండవులు ఇంద్రప్రస్థానికి పయనమయ్యారు. పెద్దలంతా సంతోషించారు. కాని దుర్యోధనాదులైన దుష్ట చతుష్టయానికి ఇది కంటగింపుగా మారింది. తాము సంపాదించిన సమస్తాన్ని ముసలి గుడ్డి రాజు అప్పనంగా ఇచ్చివేశాడని ఆవేదన చెందారు. ఈసారి పన్నెండేండ్లు వనవాసం, ఒక యేడు అజ్ఞాతవాసం పందెంగాస్తూ, పాండవులను జూద మాడటానికి రమ్మని ఆహ్వానించమన్నారు ధృతరాష్ట్రుణ్ణి. దుర్యోధనుని మాటకాదనలేక నగరం వదిలి వెళ్ళిన వాళ్ళను వెనక్కి పిలిపించాడు ధృతరాష్ట్రుడు.

ఈసారి కూడా గెలుపు శకునిదే. ఒప్పందం ప్రకారం ఓడిన వాళ్ళు పన్నెండేళ్ళు వనవాసం చేయాలి. తర్వాత ఒక సంవత్సరం అజ్ఞాతవాసం అంటే ఎవరికీ తెలియకుండా జీవనం గడపాలి. ఒకవేళ తెలిస్తే మళ్ళీ పన్నెండేండ్లు వనవాసం. ఏడాది అజ్ఞాతవాసం చేయాలి. ఓటమి, అవమానాన్ని మూట గట్టుకొని, భార్య ద్రౌపదితో కూడా అక్కడి నుండే నారచీరలు ధరించి అడవుల్లోకి బయలుదేరారు పాండవులు. తల్లి కుంతీదేవి విదురునింట ఉండిపోయింది. ప్రజలంతా ఈ పరిణామానికి ఎంతగానో బాధపడ్డారు. కురువంశ నాశనం తప్పదన్నారు విజ్ఞులు. ఇంద్రప్రస్థానికి కౌరవుల ప్రతినిధిగా ద్రోణాచార్యుడుని నియమించారు.

3. అరణ్యపర్వం (వనపర్వం)

పాండవులు అడవులకు వెళ్తూ వారించినా వినకుండా చాలా మంది సజ్జనులు వాళ్ళమీద అభిమానం చంపుకోలేక వెంటవచ్చారు. ఏ ఆధారమూలేని తాము వచ్చిన వాళ్ళకు ఏం ఏర్పాట్లు చేయగలమన్న విచారం యుధిష్ఠిరుడ్ని పీడించింది. అప్పుడు సూర్యుడ్ని ప్రార్థిస్తే అతడొక పాత్రనిచ్చాడు. ఆ పాత్రలో కావాలనుకున్న పదార్థాలు కావలసినన్ని సమకూరుతాయి. అదే అక్షయపాత్ర. పాండవులు అడవుల్లో ఒక చోటున ఉండక క్రమంగా ఒక స్థలం నుండి మరొక స్థలానికి మారుతున్నారు. ఇలా మారుతూ వారు కామ్యక వనంలో ఉన్నప్పుడు శ్రీకృష్ణాదులు వచ్చి సాంత్వనపరిచారు. ద్రౌపది తన ఆవేదననంతా చెప్పుకున్నది. యుద్ధం జరుగుతుందని, కష్టాలు తొలగిపోతాయని చెల్లెలిని ఓదార్చాడు కృష్ణుడు. వ్యాసుడు ధర్మరాజును కలిసి, రాబోయే యుద్ధంలో విజయం సాధించేందుకు అవసరమైన శస్త్రాస్త్రాలకోసం అర్జునుణ్ణి తపస్సుకు పంపుమని చెప్పాడు. అర్జునుడు అన్న అనుమతితో శంకరుడ్ని తన తపస్సుతో మెప్పించి పాశుపతాస్త్రం పొందాడు. ఇంద్రుని కోసం తపస్సు చేస్తే, తన అంశతో జన్మించిన అర్జునుడికి ప్రేమతో సమస్తాస్త్రాలనివ్వడమేగాక, తన సింహాసనం సగభాగంలో అతడ్ని కూర్చుండబెట్టుకొని ఆదరించాడు. ఇంద్రునికోరిక మేరకు అర్జునుడు చిత్రసేనుడను గంధర్వుని వద్ద సంగీత నాట్యాలను అభ్యసించాడు.

దేవసభలో ఉండగా అర్జునుడొకసారి ఊర్వశిని తదేక దృష్టితో చూశాడు. ఆమె అర్జునుడు తనను ప్రేమిస్తున్నాడనుకున్నది. అతని గుణగణాలకు ముగ్ధురాలై ఏకాంతంగా ఉన్నప్పుడు, వద్దకు చేరి, తాను అతడ్ని ప్రేమిస్తున్నానని చెప్పింది. అప్పుడు అర్జునుడు – "అమ్మా! నీవు మా వంశీయులకు తల్లివి. నాకు కుంతీదేవి ఎంతో, నీవు కూడా అంతే!" అంటూ పాదాభివందనం చేశాడు. ఆ మాటలు ఊర్వశికి నచ్చలేదు. పైగా కోపం తెప్పించాయి – "నాపట్ల నీవు నపుంసకుడిలా ప్రవర్తించావుగాబట్టి, నపుంసకుడవైపోదువు గాక!" అని శపించింది. చింతాక్రాంతుడైన అర్జునుడు ఇంద్రునితో జరిగింది వివరించాడు. ఇంద్రుడు బాధపడవద్దని, ఈ శాపప్రభావం ఏడాదిపాటు మాత్రమే ఉంటుందని, వనవాసం తర్వాత అజ్ఞాతవాసంలో ఈ శాపమే నీకు వరంగా పరిణమిస్తుందని ఆశీర్వదించాడు.

తర్వాత అర్జునుడు తన సోదరులను కలుసుకున్నాడు. అడవులన్నీ తిరుగుతూ ద్వైతవనానికి చేరుకున్నారు. అక్కడ కృష్ణుడు సత్యభామా సహితుడై పాండవులను కలుసుకున్నాడు. సత్యభామతో మాట్లాడి ద్రౌపది ఎంతో సాంత్వన పొందింది. పాండవులు ద్వైతవనంలో ఉన్న సంగతి కౌరవ దుష్టచతుష్టయానికి తెలిసింది. ఆవనంలో ఉన్న గోవులను కాపాడే నెపం (ఘోషయాత్ర)తో పాండవులకు తమవైభవాన్ని చూపించి నొప్పించాలనుకున్నారు. అన్ని ఏర్పాట్లూ చేసుకొని పాండవులు బసచేసిన ప్రదేశానికి వెళ్ళారు. అప్పుడు ధర్మరాజు రాజర్షియజ్ఞం చేస్తున్నాడు. కావాలని ఆ ప్రదేశాన్ని తన క్రీడాంగణంగా మార్చి పాండవులను క్షోభకు గురిచేయాలని, సరోవరంలోకి సపరివారంగా ప్రవేశించబోయినారు కాని, తానొకటి తలచితే దైవమొకటి తలచిందన్నట్లు, సరోవర ప్రవేశాన్ని చిత్రసేనుడనే గంధర్వరాజు అడ్డుకున్నాడు. ఆ సమయంలో తామూ అక్కడ జలక్రీడలాడతామన్నాడు. దాంతో వివాదం ముదిరింది. రోషంతో దుర్యోధనుడు యుద్ధం చేశాడు. కాని గంధర్వరాజు అందరినీ చిటికెలో ఓడించి కర్ణదుర్యోధనులను తన రథం కొమ్ముకు కట్టుకొని తీసుకొని పోసాగాడు. ఇది తెలిసి భీమార్జునులు సంబరపడ్డారు. కాని యుధిష్ఠిరుడు వాళ్ళను పిలిచి, 'మనం దాయాదులమైనా ఒకే వంశం వాళ్ళం. విడిగా ఉన్నప్పుడు వందమంది వేరు, ఐదుగురు వేరు. కాని ఇతరులు మనపైకి వస్తే మాత్రం మనం నూటా ఐదు మందిమి. దుర్యోధనుడ్ని విడిపించుకొనిరండి!' అని ఆదేశించాడు. అన్నమాటను కాదనలేక గంధర్వుల నుండి వాళ్ళను విడిపించుకొని తెచ్చారు భీమార్జునులు . ధర్మరాజు దుర్యోధనుడికి బుద్ధులు చెప్పి పంపించాడు.

పాండవులను అవమానించడానికి వెళ్ళి, తానే అవమానంపాలైన దుర్యోధనుడు ప్రాయోపవేశానికి (ఆత్మహత్యకు) సిద్ధపడ్డాడు. శకుని, కర్ణుడు, దుశ్శాసనుడు అతడ్ని వారించారు.

6

పాండవులు తిరిగి కామ్యకవనానికి చేరుకున్నారు. అక్కడ ఒక రోజు ద్రౌపది ఒంటరిగా ఉన్న సమయంలో ఆ దారిన వెళ్తున్న జయద్రథుడు (సైంధవుడు) ఆమెను చూసి, మోహించి, తన వెంట తీసుకొని పోసాగాడు. అతని వెంట సింధు, సౌవీర, శిబి, త్రిగర్తాది దేశాల సైన్యం కూడా ఉన్నది. ద్రౌపది తనను కాపాడమని ఎలుగెత్తి అరచింది. విషయం తెలుసుకున్న పాండవులు వాని సైన్యాలనంతా చెల్లా చెదరుచేసి, అతడు తమ సోదరి దుస్సల భర్తగావడంవలన ప్రాణభిక్ష పెట్టారుగానీ, తల గొరిగించి, అవమానపరచి, హింసించి పంపించారు. ఆ అవమాన భారంతో సరాసరి హరిద్వారం చేరుకొని శివుడ్ని గురించి కఠోర తపస్సు చేశాడు. అర్జునుడులేని సమయంలో పాండవులను ఒక్కరోజు జయించగలిగే వరం సంపాదించాడు. కామ్యకవనంలోని అనుభవం తర్వాత పాండవులు మళ్లీ ద్వైతవనానికి వెళ్లారు.

ఇదిలా ఉండగా కర్ణునికి స్వప్నంలో సూర్యుడు సాక్షాత్కరించి, 'ఇంద్రుడు కపట యాచకుని వేషంలో నీవద్దకు వచ్చి కవచకుండలాలు అడుగుతాడు. నీ ప్రాణాలను కాపాడే ఆ రెండింటిని మాత్రం దానంచేయవద్దని హెచ్చరిస్తాడు. కాని కర్ణుడు' దానం చేయడం నా స్వభావం. ప్రాణం పోయినా ఈ నియమాన్ని మానుకో'నంటాడు. అన్నట్లుగానే మరుసటిరోజు యాచకుడై వచ్చిన ఇంద్రునికి సంతోషంగా తన కవచకుండలాలను శరీరం నుండి వేరుచేసి ఇస్తాడు కర్ణుడు. అతని దాన గుణానికి దేవతలు సైతం ముగ్ధులై పూలవాన కురిపిస్తారు. లోకమంతా కీర్తిస్తుంది. దేవేంద్రుడు కూడా శక్తివంతమైన భుజంగాస్త్రాన్ని ఇస్తాడు. అయితే 'అది ఆపత్కాలంలో ప్రయోగించాలని, ఒక్కసారే ఉపయోగపడుతుందని చెపుతాడు.

ఇలా ఉండగా ఒకనాడు ద్వైతవనంలో హఠాత్తుగా ఒక సంఘటన జరిగింది. అగ్నిని తయారుచేసుకునేందుకు మునులు అడవుల్లో 'అరణి' అనే కర్రను ఉపయోగిస్తుంటారు. ఎక్కడి నుంచో ఒక లేడివచ్చి ఒక ముని అరణిని ఎత్తుకుపోయింది. అతడీ సంగతి పాండవులవద్ద మొరపెట్టుకున్నాడు. దాన్ని పట్టుకునేందుకు వాళ్ళు పరుగుతీశారు. అదివాళ్ళకు చిక్కకుండా, అస్త్రాలకూ లొంగకుండా పరుగెత్తసాగింది. వాళ్ళు మరింత పట్టుదలతో దాన్ని వెంబడించారు. అట్లా వెంబడిస్తూ, ఒక కీకారణ్యం చేరుకున్నారు. అలసటతో, దప్పికతో ఒక చెట్టుకింద పడిపోయారు. ధర్మరాజు నకులునితో, పరిసరాల్లో ఎక్కడైనా నీళ్ళుంటే తీసుకొని రమ్మన్నాడు. నకులుడు అక్కడికి కొద్ది దూరంలో ఉన్న ఒక సరస్సులో నీళ్ళు తేవడానికి వెళ్ళి, ఆ నీళ్ళు తాగి అక్కడే విగతజీవుడైపోయాడు. అప్పుడు ధర్మరాజు మిగతా సోదరులను ముగ్గురిని పంపాడు. అందరికీ అదే గతి పట్టింది. చివరకు ధర్మరాజే స్వయంగా వెళ్ళాడు. అక్కడొక యక్షుడు పెద్ద కొంగ రూపంలో కనిపించి 'నా ప్రశ్నలకు జవాబులు చెప్పందే నీళ్ళు తాగవద్దన్నా, మూర్ఖంగా నీ తమ్ములు ప్రాణాలు పోగొట్టుకున్నారు. నీవైనా జవాబులు చెప్ప'మన్నాడు. ధర్మరాజు యక్షుని ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానాలు చెప్పి, అతనితో వరాలు పొంది, తన తమ్ముళ్ళను బతికించుకున్నాడు. ఆ యక్షుడెవరోకాదు, ధర్మరాజు తండ్రి – సాక్షాత్తూ యమధర్మరాజే. 'అజ్ఞాతవాసంలో పాండవులను ఎవరూ గుర్తించలేరను' వరం కూడా ప్రసాదించాడు.

వనవాసం ముగియడంతోనే ద్వైతవనంలోని మునులందరివద్దా సెలవు తీసుకొని అక్కడి నుండి బయలుదేరారు – ద్రౌపదీ సహితంగా పాండవులు.

4. విరాటపర్వం

యుధిష్ఠిరుడు తమ్ములందరితో కలిసి చర్చించి, అజ్ఞాత వాసం మత్స్యదేశ రాజైన విరాటుని వద్ద పూర్తిచేయడం సముచితంగా ఉంటుందని నిర్ణయించాడు. పాండవులంటే ప్రత్యేకాభిమానంగల విరాటుని కొల్వులో తమ ఏడాది జీవితం సజావుగా సాగిపోతుందని

అందరూ అనుకున్నారు. అక్కడ యుధిష్ఠిరుడు కంకుభట్టు పేరుతో పాచికలాడే బ్రాహ్మణుడిగా భీముడు వల్లవుడు (వలలుడు) అనే వంటవాడుగా అర్జునుడు బృహన్నల అనే పేరుతో సంగీత నృత్యాచార్యుడుగా నకులుడు గ్రంథికుడు (దామగ్రంథి) అనే పేరుతో అశ్వపాలకుడుగా సహదేవుడు తంత్రీపాలుడు' అనే పేరుతో గోరక్షకుడుగా ద్రౌపది సైరంధ్రి అనే పేరుతో రాణీ సుధేష్ణాదేవి దాసిగా చేరారు. వాళ్ళకు జయుడు, జయంతుడు, విజయుడు, జయత్సేనుడు, జయద్బలుడనే రహస్యనామాలు ఏర్పాటు చేశాడు యుధిష్ఠిరుడు.

విరాటుని బావమరిదియైన కీచకుడు వారి సైన్యాధ్యక్షుడు మహాబలవంతుడు, స్త్రీలోలుడు. అతడు సైరంధ్రిని చూసి మోహించాడు. తనను పెళ్ళాడమని బలవంతం చేశాడు. ద్రౌపది (సైరంధ్రి) అతణ్ణి తిరస్కరించింది, తన భర్తలు గంధర్వులని, వాళ్ళకు ఈ విషయం తెలిస్తే సహించరని, చావు తప్పదని హెచ్చరించింది. అయినా కీచకుడు వినలేదు. ఆ మహాసాధ్విని రాజు సమక్షంలోనే అవమానించాడు. ఆమె బాధను చూసిన వలలుడు ద్రౌపదిచేత వాణ్ణి నర్తనశాలకు పిలిపించి, భయంకరంగా చంపి, వాని అవయవాలన్నీ పొట్టలో కూరాడు. సైరంధ్రిపట్ల అందరికీ భయభక్తులు పెరిగాయి.

అజ్ఞాతవాసం పూర్తిగావస్తున్నా పాండవుల ఆచూకీ తెలియకపోవడంతో దుర్యోధనునిలో ఆందోళన అధికమైంది. కురు వీరులందరినీ, పెద్దలనూ కలిసి సమాలోచనం చేశాడు. కీచక వధ గురించి తెలిసింది. ధర్మవర్తనులైన పాండవులు ఎక్కడుంటే అక్కడ ఋతువులు సక్రమంగా నడుచుకుంటాయని, రాజ్యం సుభిక్షంగా ఉంటుందని, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారని చెప్పారు పెద్దలు. ఆ లక్షణాలన్నీ మత్స్యరాజ్యంలో పొడసూపటంతో విరాటునిపైకి యుద్ధానికి వెళ్ళాలని, అక్కడ వాళ్ళుంటే తప్పక బయటపడతారని తలంచాడు దుర్యోధనుడు. ముందుగా త్రిగర్త రాజైన సుశర్మను ఒక పక్క నుంచి విరాటరాజ్యంపై దండెత్తి లక్షగోవులను తోలుకొనిపొమ్మని, తర్వాత భీష్మ, ద్రోణ, కర్ణాది మహావీరులతో కలిసి తాను మరోపక్క నుండి దాడిచేసి మిగతా గోవులను అపహరిస్తానని దుర్యోధనుడు వ్యూహరచన చేశాడు.

అనుకున్న ప్రకారం ముందుగా సుశర్మ దక్షిణంవైపు నుండి దండెత్తి గోవులను తోలుకొనిపోసాగాడు. ఆ విషయం తెలిసి విరాటుడు ససైన్యంగా యుద్ధానికి వెళ్ళాడు. అతనితోపాటు వలలుడు, తంత్రీపాలుడు, దామగ్రంథి కూడా యుద్ధంలో పాల్గొన్నారు. సరిగ్గా అదే సమయానికి ఉత్తర గోగ్రహణం విషయం తెలిసింది. అప్పుడు రాజధానిలో విరాటుని కుమారుడు భూమింజయుడు (ఉత్తరుడు), బృహన్నల మాత్రమే ఉన్నారు. 'నాకు సరైన సారథి ఉంటే కౌరవులను చిటికెలో ఓడించేస్తా'నని ఉత్తరుడు ప్రగల్భాలు పలుకసాగాడు. బృహన్నల సారథిగా ఉండటానికి సిద్ధమయ్యాడు. అయిష్టంగానే బృహన్నలను తీసుకొని యుద్ధరంగానికి వెళ్ళిన ఉత్తరుడు దూరం నుంచి కురువీరులను చూసి, భయంతో రథం దిగి పారిపోసాగాడు. బృహన్నల అతణ్ణి ఆపి, భయపడనవసరం లేదని, తాను వాళ్ళను జయిస్తానని, రథం నడిపించుమని ప్రోత్సహించాడు. తాము విరాటుని కొలువులోకి వచ్చేముందు శమీవృక్షం మీద దాచిన ఆయుధాల నుండి గాండీవాన్ని, అక్షయతూణీరాలను తీసుకొని, కౌరవులతో తలపడ్డాడు. అతని వీరత్వాన్ని చూసి అర్జునుడే అనుకున్నారు. దుర్యోధనుడు తాను అర్జునుణ్ణి గుర్తించానని, అజ్ఞాతవాసభంగమయ్యిందని సంబరపడ్డాడు. కానీ, భీష్ముడు అన్నీ లెక్కగట్టి అప్పటికే పాండవుల అజ్ఞాతవాసకాలం ముగిసిపోయిందని ప్రకటించాడు. అర్జునుడు శత్రువులందరినీ మూర్ఛితులను గావించాడు.

మరోపక్క సుశర్మతో జరిగిన యుద్ధంలో భీముడు అసమాన పరాక్రమం చూపి, అనూహ్యవిజయాన్ని విరాటునికి సాధించి పెట్టాడు. నగరానికి సంతోషంగా చేరుకున్న విరాటునికి, కొడుకు ఒక్కడే కౌరవ వీరులతో యుద్ధానికి వెళ్ళాడన్న సంగతి తెలిసింది. 'అతను తిరిగిరావడం కల్ల' అని ఆందోళనతో దుఃఖితుడయ్యాడు. అంతలో ఉత్తరుడు తిరిగివచ్చాడు. తన విజయానికి బృహన్నలే కారణమని, ఆయనే యుద్ధంచేసి కౌరవులనందరినీ ఓడించాడని చెప్పాడు. మరో రెండు రోజుల్లో వాళ్ళు తమ నిజరూపాలతో విరాటునికి దర్శన మిచ్చారు. విరాటరాజు ఆశ్చర్యానంద చకితుడై, తామేమైనా అపచారాలు చేసి ఉంటే క్షమించాల్సిందిగా ప్రార్థించాడు. తన కూతురైన ఉత్తరను వివాహం చేసుకొమ్మని అర్జునుడ్ని కోరాడు.

అర్జునుడు 'ఉత్తర నా శిష్యురాలు. ఆమె నాకు కూతురుతో సమానం. నేనామెను వివాహమాడలేనుకాని, నా కుమారుడైన అభిమన్యునికిచ్చి పెళ్ళి చేయండి, కోడలిని చేసుకుంటానన్నాడు. ఉత్తరాభిమన్యుల వివాహం వైభవంగా జరిగింది. విరాటుడు పాండవులకు ఉపప్లావ్య పట్టణంలో విడిదిని ఏర్పాటుచేశాడు. కృష్ణబలరామాది యదువీరులంతా వాళ్ళను కలుసుకున్నారు. కాశీరాజు, ద్రుపదమహారాజు, వృష్ణి, భోజ, అంధక తదితర రాజులంతా పాండవులను కలుసుకొని, తమ సైన్యధనాది సంపత్తులన్నీ ధర్మరాజు పరంచేసి, ఎల్లవేళలా ధర్మరాజు సేవకు తమ సంసిద్ధతను ప్రకటించారు.

5. ఉద్యోగపర్వం

పాండవపక్ష నేతలంతా విరాటుని కొలువులో సమావేశమయ్యారు. దుర్యోధనుని నుండి తమ అర్ధరాజ్యం తాము ధర్మబద్ధంగా తీసుకోవాలని, అయితే అతనికి ఇచ్చే ఉద్దేశం లేదు గనుక యుద్ధానికి సిద్ధం కావాలని అందరూ నిర్ణయించారు. తమ తమ నిజనివాసాలకు వెళ్ళారు.

యుద్ధం అనివార్యమని, ఇరుపక్షాల వాళ్ళు తమకు సహకరించగలవారి సహాయాన్ని అర్థిస్తూ... సంప్రదింపులు ప్రారంభించారు. అందులో భాగంగా దుర్యోధనుడు ద్వారకకు వెళ్ళి శ్రీకృష్ణుడ్ని కలుసుకున్నాడు. అయితే అతను వెళ్ళేసరికి కృష్ణుడు కపటనిద్ర నటిస్తున్నాడు. అతను కృష్ణుని తలవైపు కూర్చున్నాడు. తర్వాత అర్జునుడు వచ్చాడు. అతడు కృష్ణుని కాళ్ళ చెంత కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు లేచి ముందుగా అర్జునుడ్ని చూసి, ఏం కావాలన్నాడు, తర్వాత దుర్యోధనుడ్ని చూసి 'నీకేం కావాలి?' అని అడిగాడు. అర్జునుడు కృష్ణుడ్ని కోరుకున్నాడు. దుర్యోధనుడు పదివేల సైన్యాన్నికోరుకున్నాడు.

శల్యుడు దుర్యోధనుని పక్షం చేరుతూనే పాండవులకు మాట సహాయం చేస్తానని మాటిచ్చాడు. ఇక తమ అరణ్య, అజ్ఞాతవాసాలు ముగిసాయని, అందువల్ల తమ రాజ్యం తమకీయవలసిందని, లేకుంటే యుద్ధం తప్పదని ధౌమ్యుడను పురోహితునితో ధర్మరాజు ధృతరాష్ట్రుని వద్దకు రాయబారం పంపాడు. అతని విజ్ఞప్తిని హస్తినలో అందరూ సమర్థించారు. దుర్యోధనునికి నచ్చజెప్పజూశారు. ధృతరాష్ట్రుడు కూడా సంజయుడ్ని పాండవుల వద్దకు యుద్ధం వద్దని, సంధిచేసుకొని సఖ్యంగా ఉండటానికి సిద్ధపడమని, అదే తనకూ సమ్మతమని, దుర్యోధనుని తప్పులు క్షమించమనీ రాయబారం పంపించాడు. ధర్మరాజు కూడా యుద్ధం తమకు సమ్మతం కాదని, అర్ధరాజ్యమీయకున్నా ఐదూళ్ళిచ్చినా చాలునని సంజయునితో సందేశం పంపాడు. సంజయుడు ఈ సంగతంతా ధృతరాష్ట్రునికి తెలియజేశాడు. విదురుడు ధృతరాష్ట్రునికి అనేక నీతులు ఉపదేశించాడు. అది 'విదురనీతి'గా ప్రసిద్ధమైంది. ధృతరాష్ట్రుడు దుర్యోధనునికి సంధిచేసుకోవడం మేలని ఉపదేశించాడు. దుర్యోధనుడు అంగీకరించలేదు. సూదిమొన మోపేంత నేల కూడా వాళ్ళకీయబోనని స్పష్టం చేశాడు. తర్వాత చివరి ప్రయత్నంగా శ్రీకృష్ణుడు పాండవుల దూతగా రాయబారం నెరపాడు. పాండవులందరి అభిప్రాయాలూ తెలుసుకొని, కౌరవసభలో నివేదించాడు. సంధికి ఒప్పుకోకపోతే యుద్ధమనే అగ్నిలో కౌరవులు మిడతల్లా కాలిపోతారని హెచ్చరించాడు. దుర్యోధనుడు పంతం విడువలేదు, పైగా తన మిత్రులతో కలిసి శ్రీకృష్ణుడిని బంధించాలని చూశాడు. శ్రీకృష్ణపరమాత్మను ఎవరు బంధించగలరు? వాళ్ళ కుట్రలను తుత్తునియలు జేస్తూ కృష్ణుడు తన విశ్వరూపాన్ని చూపించాడు. ఆ మహాతేజోమూర్తిని భీష్మ, ద్రోణ, విదుర, కృపాచార్యులు, మహర్షులు తప్ప ఎవరూ చూడలేకపోయారు. ధృతరాష్ట్రుడు దేవదేవుని ప్రార్థించి, ఆ దివ్యరూపాన్ని సందర్శించుకున్నాడు. గాంధారి కూడా కుమారుని మనసు మార్చడానికి ఎంతగానో ప్రయత్నించి విఫలమైంది.

తర్వాత కృష్ణుడు కర్ణునికలిసి, 'నీవు కుంతీదేవి కుమారుడవు. పాండవుల్లో శ్రేష్ఠుడవు. నీవు వారి పక్షంలో చేరు, మేలు జరుగుతుం'దని హితబోధ చేశాడు. కర్ణుడు 'స్నేహానికి ప్రాణం ఇచ్చేనేను, దుర్యోధనుని వదిలిరాలేనని, నమ్మకద్రోహం చేయలేనని, పాండవుల సాహచర్యంలో లభించే కోటి సుఖాలకంటే, దుర్యోధనునికోసం ప్రాణాలర్పించడమే కీర్తిదాయకమని కృష్ణుని మాట

తోసిపుచ్చాడు. అటుపిమ్మట కృష్ణుని ప్రేరణతో కుంతి కూడా ఆ ప్రయత్నం చేసింది. 'కన్నతల్లి మీది గౌరవంతో నీ కొడుకుల్లో అర్జునుడ్ని తప్ప, తక్కిన వాళ్ళను వధించ'నని కర్ణుడు ఆమెకు మాటిచ్చాడు.

యుద్ధం నిశ్చయమైంది. కౌరవసైన్యానికి భీష్మపితామహుడు సర్వసైన్యాధ్యక్షుడుగా నియమితుడయ్యాడు. 'తనను పదే పదే అవమానించే భీష్ముడు చనిపోయేదాకా తాను ఆయుధం చేపట్ట'నని కర్ణుడు ప్రతిజ్ఞచేసి, యుద్ధరంగం నుండి తప్పుకున్నాడు. పాండవుల సర్వసైన్యాధ్యక్షుడిగా ద్రౌపది ద్రుష్టద్యుమ్నుడు నియామకమయ్యాడు. దుర్యోధనుడు తమ బలాబలాలను సమీక్షించుకుంటూ భీష్ముడ్ని 'మీ యుద్ధ విశారదత్వం సెలవీయ'మని అడిగాడు. అందుకు భీష్ముడు – "యుద్ధంలో నన్ను మించినవారులేరు. నేను అందరితో అన్ని రకాలుగా యుద్ధం చేస్తాను కాని, శిఖండి నాముందుకు వస్తే నేను అస్త్రాన్ని ప్రయోగించలేను' అని చెప్పాడు. ఎందుకంటే అతడు పూర్వజన్మలో కాశీరాజు పెద్దకుమార్తె అంబ. స్వయంవరంలో భీష్ముడామెను బలవంతంగా ఎత్తుకొనివచ్చినా, 'సాళ్వరాజును ప్రేమించా'నని చెప్పడంతో దయతలచిపొమ్మన్నాడు. సాళ్వుడు కూడా ఆమెను స్వీకరించక పోవడంతో పరమేశ్వరుని గురించి తపస్సుచేసి, భీష్ముడ్ని వధించే వరం పొందింది. ఆ వరప్రభావంతోనే ద్రుపదునికి కూతురుగా పుట్టి, పురుషునిగా జీవిస్తున్నది. ఆమెను చూస్తే భీష్ముడు ధనుస్సెక్కుపెట్టలేదు.

కురుపాండవసైన్యాలు యుద్ధం కోసం కురుక్షేత్రమనే రణక్షేత్రానికి చేరుకున్నాయి.

7

6. భీష్మపర్వం

కురుక్షేత్రం అనే రణస్థలంలో కురుపాండవసైన్యాలు మోహరింపబడ్డాయి. ఎదురుగా కనిపిస్తున్న గురువులు, తాతలు, తండ్రులు, బంధువులతో యుద్ధం చేయాలన్న విషయం అర్జునునికి బాధకల్గించింది. అస్త్రాలువదిలేసి యుద్ధం చేయనన్నాడు. అప్పుడు కృష్ణుడు – ఎవరి విధిని వాళ్ళు తప్పక నిర్వర్తించాలని, చిత్తశుద్ధితో కృషిచేయాలని, ఫలితం భగవంతుడు నిర్ణయిస్తాడని, కర్మఫలాన్ని అనుభవించడం ఎంతటివారికైనా తప్పదని గీతను ఉపదేశిస్తూ (భగవద్గీత 18 అధ్యాయాలు) అర్జునుణ్ణి కర్తవ్యోన్ముఖుడ్ని చేస్తాడు. యుధిష్ఠిరుడు భీష్మాదుల వద్దకు వెళ్ళి యుద్ధానికి అనుమతిని, ఆశీర్వాదాన్నీ తీసుకుంటాడు.

భీష్ముని నేతృత్వంలో కౌరవులు, ద్రుష్టద్యుమ్నుని నాయకత్వంలో పాండవులు భీకరంగా పోరాటం సాగించారు. ఆ యుద్ధం తొమ్మిది రోజులు నిరాఘాటంగా సాగింది. తొమ్మిదవరోజు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో 'భీష్ముడు చనిపోతేగానీ మీకు విజయం లభించదు. ఇప్పటికే తొంభైవేల యోధులను మీరు కోల్పోయారు. అతణ్ణి చంపగలిగే మార్గం ఆయన ద్వారానే తెలుసుకోండి!' అన్నాడు. ధర్మరాజు భీష్ముణ్ణి కలిసి 'యుద్ధంలో మేము జయించే మార్గం చెప్ప'మని అడిగాడు. భీష్ముడు తాను చనిపోతేగాని, కౌరవులను జయించలేరని చెబుతూ, శిఖండిని ముందుంచుకొని యుద్ధం చేయమని సలహాఇచ్చాడు. పదవ రోజు అదే వ్యూహాన్ని అనుసరించి అర్జునుడు భీష్ముడి దేహాన్ని అంగుళంఖాళీ లేకుండా బాణాలతో ఛిద్రంచేశాడు. అయినా తండ్రిగారిచ్చిన 'స్వేచ్ఛామరణ' వరం వల్ల భీష్ముడు చావలేదు. శరీరంలో దిగిన బాణాలే శయ్య (అంపశయ్య)గా పడిపోయాడు.

ఆ స్థితిలో భీష్మునికి దాహంవేస్తే అర్జునుడు తన పర్జన్య బాణంతో పాతాళగంగను పైకి తెప్పించి అతని దాహం తీర్చాడు. ధర్మజ, దుర్యోధనాది పౌత్రులను భీష్ముడు ఓదార్చాడు, కృష్ణుని సాంత్వన వచనాలు శ్రద్ధగా విన్నాడు. కర్ణుడు తనను క్షమించమని వేడుకొనగా ప్రేమతో అతడ్ని దీవించి ఇప్పటికైనా పాండవ పక్షంలో చేరమని హితబోధ చేశాడు. కర్ణుడు 'స్నేహంకోసం నా ప్రాణాలు తృణప్రాయంగా భావిస్తా'నని, దుర్యోధనుని పక్షాన్నే పోరాడుతానని, భీష్ముని సూచనను తోసిపుచ్చాడు.

7. ద్రోణపర్వం

చేసిన ప్రతిజ్ఞననుసరించి కర్ణుడు యుద్ధరంగంలోకి దిగాడు. ద్రోణుడు సర్వసైన్యాధ్యక్షుడయ్యాడు. సకల శస్త్రాస్త్రవేదియైన ద్రోణుడు యుద్ధరంగంలో రౌద్రరూపంతో పాండవసేనపై విరుచుకుపడ్డాడు. గురువును మించిన శిష్యుడుగా కీర్తిగాంచిన అర్జునుడు అతడ్ని సమర్థంగా ఎదుర్కొ న్నాడు. దుర్యోధనుడు ద్రోణునితో 'ధర్మరాజును పట్టి బంధిస్తే మనం విజయం సాధించినట్లే. ఆ పనిచేయండి!' అని మొరపెట్టుకున్నాడు. 'అర్జునుణ్ణి మిగతా పాండవులనుండి దూరంగా తీసుకొనివెళ్తే, ఆపని చేయడం సులభమవుతుంది. కృష్ణార్జునులను జయించడం సృష్టిలో ఎవ్వరి తరమూకా'దన్నాడు ద్రోణుడు. సంశప్తకులు అర్జునుడ్ని రెచ్చగొట్టి యుద్ధరంగంలో దక్షిణం వైపు దూరంగా తీసుకొనిపోయారు. ఆ సమయంలో విచిత్రమూ, అభేద్యమూ అయిన పద్మవ్యూహరచన చేశాడు ద్రోణుడు. అర్జునుడులేని పాండవులు ఆ వ్యూహాన్ని భేదించడానికి అశక్తులు. ఆ రహస్యం తెలిసిన అభిమన్యుడ్ని ముందునడువుమని, తాము వెనుకనే వస్తామని ధర్మరాజు కోరాడు. పెదతండ్రి ఆజ్ఞతో, మహోత్సాహంగా పద్మవ్యూహంలోకి చొరబడ్డాడు అభిమన్యుడు. పరమేశ్వరునితో పొందిన వరబలం చేత జయద్రథుడు (సైంధవుడు) ధర్మరాజాదులను అడ్డుకున్నాడు. అభిమన్యుడు తన తండ్రుల సాయంకోసం ఎదురుచూడకుండానే మహోగ్రంగా యుద్ధం చేశాడు. కర్ణ, ద్రోణ, కృప, అశ్వత్థామ, బృహద్బల, కృతవర్మ అనే ఆరుగురు మహారథులు ఒక్కటై, ఒంటరి బాలుడైన అభిమన్యునిపై ఒక్కసారిగా దాడిచేశారు. రథాన్ని ముక్కలు చేశారు; గుఱ్ఱాలను హతమార్చారు; ధనుస్సు విరిచేశారు; ఖడ్గాన్ని ముక్కలు చేశారు; గదను నుగ్గునుగ్గు చేశారు. రక్తసిక్తమైన దేహంతో, అమ్ముల బాధను తట్టుకుంటూనే, రథ చక్రాన్నే సుదర్శన చక్రమనిపించేలా మహావీరోచితంగా యుద్ధం చేశాడు అభిమన్యుడు. కాని అందరూ మూకుమ్మడిగా దాడి చేయడంతో వీరస్వర్గమలంకరించాడు సుభద్రానందనుడు. 'మరో అర్జునుడు' అని శత్రువుల చేత కొనియాడబడి, పార్థివ దేహాన్ని వీడినా, అందరిచేత గొప్ప సాహసికుడిగా, మహావీరుడిగా కీర్తింపబడ్డాడు అభిమన్యుడు.

అభిమన్యుని మరణంతో అందరూ దుఃఖసాగరంలో మునిగిపోయారు. ధర్మరాజు తీవ్ర నిరాశలో మునిగిపోయాడు. నిర్వేదవశు డైపోయాడు. అర్జునునికి, జరిగిన సంగతంతా వివరించాడు ధర్మరాజు. అభిమన్యుని మరణానికి పరోక్షంగా కారణమైన సైంధవుడ్ని మరుసటిరోజు సూర్యుడస్తమించకముందే సంహరిస్తానని, అట్లా చేయలేకపోతే అగ్నిప్రవేశం చేసి దేహం చాలిస్తానని భీషణ ప్రతిజ్ఞ చేశాడు అర్జునుడు. అర్జునుడి నుండి జయద్రథుణ్ణి (సైంధవుడు) కాపాడటానికి భయంకరమైన వ్యూహరచన చేశాడు ద్రోణుడు. ఏడు అక్షోహిణిల సైన్యం మధ్య అతడ్ని దాచి, తామంతా ముందుండి అర్జునునితో యుద్ధం చేయసాగారు ద్రోణాదులు. సూర్యుడు పశ్చిమదిశకు చేరుకుంటున్నాడు, జయద్రథుడ్ని కనిపెట్టలేకపోయాడు అర్జునుడు. అప్పుడే హఠాత్తుగా చీకటి పడేటట్లు చేశాడు కృష్ణుడు తన మయాశక్తితో. కౌరవసేన ఆనంద తాండవం చేయసాగింది. జయద్రథుడు చావకపోగా, పాండవ మధ్యముడు అర్జునుడు ఆత్మత్యాగం చేసే దుస్థితి దాపురించింది అనుకున్నారు అంతా. సైంధవుడు నిర్భయంగా సైన్యమధ్యం నుండి బయటికొచ్చాడు. అప్పుడు కృష్ణుడు తన మాయను ఉపసంహరించి, సూర్యుడు కనపడేటట్లు చేశాడు. 'అర్జునా! అదిగో సూర్యుడు ఇదిగో జయద్రథుడు. వెంటనే వీని తల నరుకు!' అన్నాడు. అందరూ చూస్తూండగానే వాడిబాణంతో ఆ సైంధవాధముని తల మొండెం నుండి వేరు చేశాడు అర్జునుడు. అప్పుడు కృష్ణుడు మరో మాట చెప్పాడు. 'వీని తండ్రి వృద్ధక్షత్రుడు, తన కొడుకు తలను ఎవడు నేలపై పారేస్తాడో వాని తల వంద ముక్కలవుతుం'దని శపించి ఉన్నాడు. వాడిప్పుడు శమంతపంచకవనంలో తపస్సు చేస్తున్నాడు. ఈ తలను నేలమీద పడనీయక, సరాసరి వాని తండ్రి ఒడిలో పడేట్లు చేయి' అన్నాడు. అర్జునుడు మరో బాణంతో ఆపని పూర్తిచేశాడు. హఠాత్తుగా ఒడిలోపడ్డ తలను నేలమీదికి విసిరిన వృద్ధక్షత్రుడు తల నూరుముక్కలై చచ్చాడు.

తమ్ముడు అభిమన్యుడు కౌరవాధముల చేతిలో వధింపబడి వీరస్వర్గమలంకరించినాడన్న విషయం తెలుసుకున్న ఘటోత్కచుడు ధర్మరాజు అనుమతితో యుద్ధరంగంలోకి దిగాడు. తన మాయాయుద్ధంతో కౌరవుల లక్షలాది సైన్యాలను సంహరించాడు. అలంబసుణ్ణి వధించాడు. అశ్వత్థామను గాయపరిచాడు, కర్ణుణ్ణి ఓడించాడు. అందరినీ నానా యాతనలకు గురిచేయసాగాడు.

అప్పుడు దుర్యోధనుడు 'నీవద్ద నున్న దివ్యాస్త్రాన్ని ప్రయోగించి ఈ ఘటోత్కచుని పీడ విరగడ గావించు'మన్నాడు కర్ణునితో. అర్జునుణ్ణి చంపడం కోసం ప్రయోగించకుండా అట్టేపెట్టుకున్న ఆ అస్త్రాన్ని కర్ణుడు తన మిత్రుడన్న మాట కాదనలేక ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. ఘటోత్కచుడు రణభూమిలో కూలిపోయాడు. ఘటోత్కచుడు చనిపోయాడన్న బాధకంటె, కర్ణుడు దివ్యాస్త్రాన్ని అర్జునుని మీద ప్రయోగించే అవకాశమికలేదన్న ఆనందం ప్రకటించాడు కృష్ణుడు.

యుద్ధం మరింత భీకర రూపం దాల్చింది. ద్రోణుడు ద్రుపదుడ్ని సంహరించాడు. ద్రుష్టద్యుమ్నుడు ఉగ్రుడయ్యాడు. అర్జునుడు 'అధర్మపక్షం చేరినందుకు గురువునైనా నిర్జించక తప్పదన్న ఆగ్రహం పూనాడు. ఎవరెంత ప్రయత్నం చేసినా ద్రోణుణ్ణి మాత్రం జయించలేకపోయారు. ఎనభైయైదేళ్ళ వయస్సులోనూ నవయువకుడిలా పోరాడుతున్న ద్రోణుడ్ని ఎదుర్కొనడానికి వ్యూహం తోచక తికమకపడుతున్న పాండవులకు కృష్ణుడు ఉపాయం చెప్పాడు – 'ద్రోణునికి కొడుకంటే పంచప్రాణాలు. అశ్వత్థామ చనిపోయాడని ధర్మరాజు అబద్ధమాడాలి. దాంతో అతడు అస్త్రసన్యాసం చేస్తాడు. అప్పుడు అనాయాసంగా వధించవచ్చు'. దీనికి సత్యసంధుడైన ధర్మరాజు ఒప్పుకోలేదు. కాని యుద్ధరంగంలో అప్పుడే అశ్వత్థామ అనే పేరుగల ఏనుగు చనిపోయింది. అప్పుడు ధర్మరాజు – 'అశ్వత్థామ చనిపోయాడు కాని అది ఏనుగు' అన్నాడు. అయితే మొదటి భాగం గట్టిగా అరచి, రెండో భాగం వినిపించనట్లు గొణిగాడు. సత్యవాక్కి అయిన ధర్మరాజు మాటలు విన్న ద్రోణుడు నిజంగానే తన కొడుకు చనిపోయాడని అస్త్రసన్యాసం చేశాడు. అదే అదనుగా ద్రుష్టద్యుమ్నుడు ఖడ్గంతో ద్రోణుని తలను మొండెం నుండి వేరుచేశాడు. ఈ విషయం తెలిసిన అశ్వత్థామ మహోగ్రుడై పాండవులను వధిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

8

8. కర్ణపర్వం

ద్రోణుని మరణంతో దుర్యోధనుడు కర్ణుడ్ని సర్వసైన్యాధిపతిని చేశాడు. కర్ణుడి రథసారథిగా శల్యుడ్ని ఎంపిక చేసుకున్నాడు. మద్ర దేశాధిపతి శల్యుడు ధర్మరాజుకు కూడా యుద్ధంలో మాట సాయం చేస్తానని మాటిచ్చి ఉన్నాడు. అందుకే కర్ణునికి సారథ్యం వహిస్తూనే కఠినమైన నిందా వాక్యాలతో, శత్రువీరుల పొగడ్తలతో అతడ్ని నిర్వీర్యుడ్ని చేయడానికి పూనుకున్నాడు. (అందుకే మన వైపు ఉండి కూడా శత్రువులకు సాయంచేసేవారిని చూసి ఇప్పటికీ శల్యసారథ్యం అనే మాట ఉపయోగిస్తున్నాం). కర్ణుడు యుద్ధరంగంలో భయంకరంగా విజృంభించాడు. కౌరవసైన్యం అతని విజృంభణతో ప్రేరేపితులై రెట్టించిన ఉత్సాహంతో యుద్ధం చేయసాగారు. మరోపక్క పాండవుల్లో పట్టుదల ఏమాత్రం తగ్గలేదు. భీముడు మొదటిరోజు నుండీ కౌరవులను వరుసబెట్టి యమపురికి పంపిస్తూనే ఉన్నాడు. అశ్వత్థామ తండ్రిని కోల్పోయినప్పటి నుండి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతూనే ఉన్నాడు. పాండవులు కూడా అభిమన్యుడ్ని, ఘటోత్కచుడ్నీ కోల్పోయి కుపితులై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే భీమునికి దుశ్శాసనుడు ఎదురయ్యాడు రణరంగంలో.

ఒక్కసారి భీమునికి ద్రౌపదికి నిండు సభలో జరిగిన పరాభవం గుర్తుకొచ్చింది. తన ప్రతిజ్ఞ అతనెన్నడూ మరచిపోలేదు. దుశ్శాసనునితో మొదట గదాయుద్ధంచేసి, ఓడించి, ఆపై పారిపోతున్న దుశ్శాసనునిపట్టి, నేలమీదపడేసి, తన వాడి గోళ్ళతో వాని గుండెను భయంకరంగా చీల్చాడు. దోసిళ్ళతో నెత్తురు తాగి, అంతటితో ఆగక వాని పేగులు హారాల్లా మెడలో వేసుకొని భీకరంగా గర్జించాడు. అది చూసిన శత్రువుల గుండెలవిసిపోయాయి. సైనికులు చాలా మంది అది చూస్తూనే పారిపోయారు.

యుద్ధరంగంలో కర్ణార్జునులు ఎదురయ్యారు. కర్ణుడు అంతకు ముందే ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు తన చేతికి చిక్కినా, తల్లికిచ్చిన మాటప్రకారం వాళ్ళను చంపకుండా వదిలిపెట్టాడు. ఒకరినొకరు అధిక్షేపించుకుంటూ అర్జునుడూ, కర్ణుడు పరస్పరం అస్త్రాలు ప్రయోగించుకోసాగారు. కర్ణునివద్ద అర్జునుని మీద ప్రయోగించడానికి శక్తివంతమైన అస్త్రం ఒకటి ఇంకా

మిగిలే ఉంది. అది సర్వముఖాస్త్రం. అది ఎంతో భయంకరమైంది. అగ్నికి వాయువు తోడైనట్లు ఎప్పుడో ఖాండవదహనంలో తన తల్లి చావడానికి కారణమైన అర్జునునిమీద ప్రతీకారం తీర్చుకోవడానికి ఎదురుచూస్తున్న అశ్వసేనుడు (తక్షకుని కొడుకు) అదృశ్యరూపంలో కర్ణుని తూణీరంలో చేరాడు. కర్ణుడు సర్పముఖాస్త్రం ప్రయోగించినప్పుడు దాన్ని ఆవహించి, విషపూరితం గావించి అర్జునుని మీదికి దూసుకొనిపోయాడు. ఇదంతా గమనించిన కృష్ణుడు రథాన్ని బలంగా అదుగుమేర భూమిలోకి తొక్కాడు. అర్జునుని కంఠానికి తగలవలసిన బాణం కిరీటానికి తాకింది. ఇంద్రుడు ప్రసాదించిన ఆ దివ్య కిరీటం కూడా విషాగ్నికీలల్లో పడి కాలి, కాంతివిహీనమై పడిపోయింది. దాంతో రెచ్చిపోయిన అర్జునుడు శరపరంపరగురిపించి, రథాన్ని, సారథిని, కర్ణుణ్ణీ తీవ్రంగా గాయపరిచాడు. అప్పుడే కర్ణుని రథం నేలలోనికి కుంగిపోసాగింది. నేలలో దిగబడిన తన రథాన్ని ఎత్తే ప్రయత్నం చేయసాగాడు కర్ణుడు. కర్ణుడ్ని చంపడానికి అదే తగిన సమయమని, అస్త్రం సంధించుమని అర్జునుణ్ణి ప్రోత్సహించాడు కృష్ణుడు. 'అది అధర్మ' మని అడ్డుకో బోయిన కర్ణుణ్ణి – 'అభిమన్యుణ్ణి చంపడం అధర్మం కాదా?' అని నిలదీశాడు కృష్ణుడు. కొడుకు మరణ సంఘటన గుర్తుకురాగానే అర్జునుడు రెట్టించిన కోపంతో కర్ణుడిపై దివ్యాస్త్రం ప్రయోగించి నిహతుణ్ణి చేశాడు.

స్నేహితుని మరణంతో దుర్భరశోకంలో కూరుకుపోయాడు దుర్యోధనుడు. ప్రముఖులందరూ చనిపోయినా అతనిలో యుద్ధవిముఖతకు బదులు యుద్ధోన్మాదం విజృంభించింది. కర్ణుడు గొప్పదానశీలి. మహాపరాక్రమవంతుడు, అతులిత శస్త్రాస్త్ర విద్యాపారంగతుడు కానీ దుష్టుడైన దుర్యోధనుని సాహచర్యంలో అధర్మం పక్షం వహించి, అర్థరహితంగా దేహయాత్ర చాలించాడు.

9. శల్యపర్వం

కర్ణుడు చనిపోయిన తర్వాత మద్ర రాజైన శల్యుణ్ణి సర్వ సైన్యాధ్యక్షుణ్ణి చేశాడు దుర్యోధనుడు. శల్యుడు యుధిష్ఠిరునితో జరిగిన ఘోర యుద్ధంలో అనుచరులతో సహా హతమయ్యాడు. శకునిని, అతని కొడుకైన ఉలూకుని సహదేవుడు సంహరించాడు. ఆ విధంగా దుర్యోధనుని 11 అక్షోహిణుల సైన్యమంతా చనిపోయింది. కేవలం వందల సంఖ్యలో సైనికులు మిగిలారు. యోధుల్లో అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యుడు మాత్రం దుర్యోధనుని పక్షంలో ఉన్నారు. ఈ పరిస్థితినంతా చూసిన దుర్యోధనుడు క్షతగాత్రుడై, యుద్ధభూమిని వదిలి ఒక సరోవరంలో దాక్కున్నాడు. అతనికి జలస్తంభన విద్యవచ్చు. అందులోనే అడుగున హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాడు.

ఆ విషయం భిల్లులవలన యుధిష్ఠురునికి తెలిసింది. అతడు తమ్ముళ్ళను, కృష్ణుడ్ని వెంటపెట్టుకొని ఆ మడుగు వద్దకు వెళ్ళాడు. దుర్యోధనుణ్ణి బయటికొచ్చి యుద్ధం చేయమని ఆహ్వానించాడు. 'మాలో ఏ ఒక్కరిని సంహరించినా ఓటమిని అంగీకరిస్తా' మన్నాడు. దుర్యోధనుడు – తనకు గదాయుద్ధమంటే ఇష్టమని, భీమునితో పోరాడుతానని ప్రకటించి సరోవరం నుండి వెలుపలికి వచ్చాడు.

భీమ దుర్యోధనులు అతిభీకరంగా తలపడ్డారు. ఆ యుద్ధంలో భీముడు అంతకు మునుపుచేసిన ప్రతిజ్ఞ ప్రకారం తన బలమైన గదతో దుర్యోధనుని తొడలు నుజ్జు నుజ్జుచేశాడు.

శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి, ఘోరయుద్ధంతో కొడుకుల మరణం అత్యంత విషాదంలో మునిగి ఉన్న గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చాడు. అదే సమయంలో అశ్వత్థామ దుర్యోధనుని దుస్థితికి చింతిస్తూ, అతణ్ణి సాంత్వనపరిచే ప్రయత్నం చేశాడు. దుర్యోధనుడు ఆ స్థితిలోనూ అశ్వత్థామను సైన్యాధ్యక్షుణ్ణి చేసి, పాండవులను చంపి, తనకు చిత్తశాంతిని కలిగించమన్నాడు.

10. సౌప్తికపర్వం

అశ్వత్థామ మిగతా ఇద్దరు యోధులతో సంప్రదించి పాండవులను కపటంతో చంపాలని యోచన చేశాడు. కృపాచార్యుడు యుద్ధనీతిని తెలిపి వారింపజూశాడు. కాని ప్రతీకారజ్వాలతో రగిలిపోతున్న అశ్వత్థామ తన ప్రయత్నాన్ని సమర్థించుకున్నాడు.

సైన్యాధ్యక్షుని మాట కాదనలేక కృపాచార్యుడు అతణ్ణి అనుసరించాడు. రాత్రిపూట అందరూ నిద్రిస్తూన్న సమయంలో పాండవ శిబిరం చేరుకున్నారు. బయట కృతవర్మ, కృపాచార్యులు కాపలా కాస్తుండగా అశ్వత్థామ లోపలికి వెళ్ళబోయాడు కాని ద్వారం వద్ద ఒక మహాకాయుడు అనేక హాస్తాలతో, మండుతున్న అగ్ని జ్వాలలా కాపలా కాస్తూ అశ్వత్థామను లోనికి వెళ్లకుండా అడ్డుకున్నాడు. అతనితో పోరాడలేక, మహాదేవుడని గుర్తించి, ఆత్మత్యాగం చేసుకోబోయాడు. శివుడతణ్ణి వారించి, ఖడ్గాన్నిచ్చాడు. ఆ ఖడ్గంతో శిబిరంలోకి ప్రవేశించి, నిద్రిస్తున్న ద్రుష్టద్యుమ్నుణ్ణి, పాండవుల కొడుకులను ఐదుగురినీ హతమార్చాడు. అంతటితో ఆగక శిబిరంలోని గుఱ్ఱాలను, ఏనుగులను, వేలాదిమంది సైనికులనూ కత్తికి ఎరగావించాడు. నిద్రమత్తులో బయటపడి పారిపోజూచిన వాళ్ళనూ పట్టి హతమార్చారు కృతవర్మ కృపాచార్యులు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి దుర్యోధనునికి జరిగిన సంగతి అంతా వివరించారు. ఆ వార్త విన్న తర్వాత తృప్తిగా కన్నుమూశాడు దుర్యోధనుడు.

కొడుకులందరూ అశ్వత్థామ అకృత్యానికి బలికాగా తీవ్రశోకంలో మునిగిపోయింది ద్రౌపది. యుధిష్ఠిరుడూ శోకవ్యాకులుడైనాడు. భీమార్జునులు అశ్వత్థామను సంహరించడానికి సిద్ధమైనారు. అశ్వత్థామార్జునుల మధ్య ఘోర యుద్ధం జరిగింది. పరస్పరం బ్రహ్మాస్త్రాలు ప్రయోగించుకున్నారు. ఎక్కడ రెండు బ్రహ్మాస్త్రాలు తలపడతాయో అక్కడ పన్నెండేళ్ళు వర్షాలు పడవని మహర్షులు హితబోధ చేయడంతో అర్జునుడు తన బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించాడు. ఆ శక్తి లేని అశ్వత్థామ దానిని ఉత్తర గర్భంలోని శిశువుమీదికి మళ్ళించాడు. తన తలమీదున్న విలువైన మణిని పాండవులకిచ్చాడు. నిర్లిప్తమైన మనస్సుతో అక్కడి నుండి అడవుల్లోకి వెళ్ళిపోయాడు.

11. స్త్రీపర్వం

కొడుకులు, బంధువులు, కురుశ్రేష్ఠుల మరణవార్తల వలన ధృతరాష్ట్రుడు, గాంధారి శోక సముద్రంలో మునిగిపోయారు. వాళ్ళను సంజయుడు, విదురుడు ఓదార్చారు. పాండవులు గాంధారీ ధృతరాష్ట్రులను కలుసుకోగా, గాంధారి భీమునిపై కోపించింది. ఇంతటి ఉపద్రవానికి కారణం భీముడేనని, భీముణ్ణి దూషించింది. వ్యాసుడు, భీముడు ఆమెను శాంత పరచారు.

స్త్రీలందరూ తమ భర్తలకు, పుత్రులకు తిలాంజలులు సమర్పించారు. అప్పుడు కుంతి కర్ణుని జన్మ రహస్యం పాండవులకు చెప్పింది. పాండవులెంతగానో దుఃఖించారు.

12. శాంతిపర్వం

తనవాళ్ళనందరినీ చంపుకొని ఈ నెత్తురు కూడు తినలేనని, తనకు రాజ్యం అక్కరలేదని వనవాసానికి వెళ్ళడానికి సిద్ధపడ్డ ధర్మరాజును అర్జునుడు శాంతింపజేశాడు. వ్యాసుడు, శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదార్చి, హస్తినాపుర ప్రవేశానికి ఒప్పించారు. ధర్మరాజు శ్రీకృష్ణుని పూజించి, యుద్ధంలో చనిపోయిన వీరుల కుటుంబాలను ఘనంగా సత్కరించాడు. ఆ తర్వాత కృష్ణుని అనుమతితో భీష్ముని దర్శించుకున్నాడు. భీష్ముడు ధర్మబోధ చేశాడు. సత్యం, ధర్మం, శీలం, శాంతి, ధైర్యం, స్వచ్ఛత కాపాడుకుంటూ క్షత్రియధర్మాన్ని నిర్విర్తించమని, న్యాయపాలన చేసి సత్కీర్తిగడించమని సాధించుకున్న అధికారాన్ని బాధ్యతగా నిర్వహించమని చెప్పాడు. ధర్మపాలకుల కథలను చెప్పాడు.

13. అనుశాసనపర్వం

రాజధర్మానికి, పరిపాలనకు, న్యాయానికి, కర్తవ్యనిర్వహణకు సంబంధించిన అనేక ప్రశ్నలు అడిగాడు ధర్మరాజు. ఓపికగా వాటన్నిటికీ సమాధానాలు చెప్పాడు భీష్ముడు. దానం; స్వర్గనరకాలను కలిగించే కర్మలు; బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు; గంగా మాహాత్మ్యం; పూజ్యపురుషలక్షణాలు; కన్యావివాహ విషయాలు; గో మహాత్మ్యం; శుభకర్మలు – వాటి ఫలితాలు; బ్రాహ్మణ ప్రశంస – ఆరాధన; యజ్ఞదాన విశేషాలు; ఉత్తములను రక్షించడం, భూదాన మహిమ, అన్న, సువర్ణ, జలదానాల మహిమ;

వ్రత, నియమ, దయాది సద్గుణాల ప్రశంసను బోధిస్తాడు. దేవతలు, ఋషులు మొదలైన వారి స్మరణ గొప్పతనాన్ని వివరించాడు. విష్ణుసహస్రనామాన్ని కూడా పాండవులకు చెప్పాడు. చివరగా శ్రీకృష్ణుని అనుమతితో దేహయాత్ర చాలించాడు భీష్ముడు. ధర్మరాజు శాస్త్రయుక్తంగా ఆ మహనీయునికి అంతేష్టి సంస్కారం నిర్వహించాడు.

14. అశ్వమేధపర్వం

శ్రీకృష్ణుడు ధర్మరాజుకు జీవుని మరణం, అతని త్రివిధ గతులను గురించిన (జీవనం, నరకం, స్వర్గం) జ్ఞానబోధ చేసి, దుఃఖాన్ని ఉపశమింపజేశాడు. తర్వాత శ్రీకృష్ణుడు ద్వారకకువెళ్ళి, తనవారి నందరినీ కలిసి, కురుక్షేత్రయుద్ధ విశేషాలను వివరించాడు. ఉత్తర మృతశిశువుకు జన్మనిచ్చింది. అందరూ దుఃఖించారు. శ్రీకృష్ణుని కృపతో ఆ బాలుడు బతికాడు. అతనికి 'పరీక్షిత్తు' అని పేరు పెట్టారు. వ్యాసుడు, శ్రీకృష్ణుల ఆజ్ఞతో ధర్మరాజు అశ్వమేధయాగాన్ని ఆరంభించాడు. యాగాశ్వాన్ని రక్షించడానికి అర్జునుడు వెళ్ళాడు. రాజులందర్నీ జయిస్తూ వెళ్తున్న అర్జునుణ్ణి బభ్రువాహనుడు అడ్డగించి, యుద్ధంలో వధించాడు. ఉలూచి నాగులకు ఆధారభూతమైన సంజీవ మణిని స్మరించి, దాంతో అర్జునుడ్ని పునర్జీవితుడ్ని చేసింది. బభ్రువాహనుడు తన కుమారుడేనని తెలుసుకొని అర్జునుడు సంతోషిస్తాడు. ధర్మరాజు అశ్వమేధయాగం పూర్తిచేస్తాడు.

15. ఆశ్రమవాహికపర్వం

గాంధారితోపాటు ధృతరాష్ట్రుడు ప్రజాపాలన బాధ్యతలను ధర్మరాజుకు అప్పగించి వానప్రస్థానికి బయలుదేరాడు. కుంతి కూడా వారివెంట అడవులకు వెళ్ళింది. అడ్డుకో జూచిన పాండవులను, ద్రౌపదిని ఓదార్చింది. వాళ్ళు గంగా తీరంలో కొంతకాలం విశ్రమించి, తర్వాత కురుక్షేత్రానికి చేరుకొని ఘోరమైన తపస్సుచేశారు. పాండవులు తర్వాత కొంతకాలానికి వాళ్ళను దర్శించుకొని, వారి సందేశాన్ని విన్నారు. వనవాసంలో ఉండగానే స్వర్గారోహణం చేసిన కుంతి, గాంధారి, ధృతరాష్ట్రులకు అంతేష్టిని నిర్వహించారు పాండవులు.

16. మౌసలపర్వం

దైవోపహతులైన యాదవులు ఒకరోజు కృష్ణుని కుమారుడైన సాంబునికి స్త్రీవేషం వేసి, గర్భవతిలా అలంకరించి, మహా తపోధనులైన విశ్వామిత్ర, కణ్వ, నారద మహర్షుల వద్దకు వెళ్ళి, "ఈ స్త్రీ బభ్రుని భార్య. ఈమెకు కలిగే సంతానం గురించి చెప్పండి!" అని అడిగాడు.

వాళ్ళు తమ తపశ్శక్తిని, దివ్యశక్తులనూ అపహసించడం చూసి, ఆగ్రహావేశులై, "ఇతని గర్భంలో ఇనుపముసలం (రోకలి) పుడుతుంది. అది యాదవులైన అంధక, వృష్ణి వంశాలను నాశనం చేస్తుంది. బలరామ కృష్ణులు తప్ప అందరూ మా శాపానికి గురి అవుతారు" అని శపించారు.

ఈ విషయం ఉగ్రసేన మహారాజుకు తెలిసింది. సాంబునికి ముసలం పుట్టింది నిజంగానే. కాని వెంటనే దాన్ని చూర్ణంగా మార్చి సముద్రంలో పారబోయించాడు రాజు.

యాదవులు తీర్థయాత్రలు చేయడానికి సకుటుంబ సపరివారంగా బయలుదేరారు. వాళ్ళు ప్రభాస క్షేత్రంలో సముద్రతీరాన విడిది చేసి సరదాగా మాట్లాడుకుంటూండగానే అభిప్రాయభేదాలు తలెత్తి, ఒకరినొకరు కొట్టుకోవడం మొదలెట్టారు. ఏ ఆయుధాలు లేని ఆ ప్రదేశంలో తీరంలోని గడ్డిపరకలు (తుండముస్తెలు) చేతుల్లోకి తీసుకోగానే అవి క్షణాల్లో ఇనుప రోకళ్ళుగా మారిపోయాయి. వాటితో అందరూ ఒకరినొకరు కొట్టుకొని హతులైపోయారు. బలరాముడు తపస్సు చేసుకోవడానికి వెళ్ళాడు. తపస్సు చేసుకుంటున్న బలరాముణ్ణి దర్శించుకొని, అడవిలో ఒకచోట నేలపై పడుకొని ఉండగా 'జర' అనే వేటగాని బాణం దెబ్బతో ప్రాణాలను త్యజించి, కృష్ణుడు అవతారాన్ని ఉపసంహరించాడు.

17. మహాప్రస్థానికపర్వం

వృష్టివంశ నాశనాన్ని గురించి తెలుసుకున్న ధర్మరాజు, ఆ వంశంలోని కృష్ణుని మనుమడు వజ్రుణ్ణి యాదవరాజ్యానికి రాజునుచేస్తాడు. ఇంద్రప్రస్థం రాజధానిగా వజ్రుణ్ణి పరిపాలన చేయడానికి నిర్ణయిస్తారు. తమ రాజ్యానికి కూడా పరీక్షిత్తును రాజుగా అభిషేకించి, వాళ్ళిద్దరినీ జాగ్రత్తగా చూసుకొమ్మని సుభద్రకు బాధ్యతనప్పగించి, భార్య ద్రౌపది, సోదరులు భీమార్జున నకుల సహదేవులు అనుసరిస్తూండగా ధర్మరాజు వానప్రస్థానికి బయలుదేరాడు. ఇదే మహాప్రస్థానం. బంధాలను తృణప్రాయంగా త్యజించి, బాధ్యతలనన్నీ సక్రమంగా అప్పగించి, దేహంమీద మోహం విడిచి, దైవ చింతనతో ఎక్కడా నిలువకుండా దైవంవైపే పయనించడం మహాప్రస్థానోద్దేశ్యం. అట్లా బయలుదేరిన పాండవులు నదులూ, పర్వతాలూ దాటుకుంటూ హిమాలయాన్ని చేరారు. అక్కడి నుండి సుమేరు పర్వతాన్ని దర్శించుకొని వెళ్తూండగా ద్రౌపది పడిపోయింది.

అది గమనించీ చలించకుండా ముందుకు సాగిపోయారు పాండవులు. తర్వాత కొంతదూరం పోయాక సహదేవుడు, ఆ తర్వాత నకులుడు, తదనంతరం అర్జునుడు, ఆపై భీమసేనుడూ వరుసగా పడిపోయారు. కాని మొదటి నుండీ అనుసరిస్తున్న ఒక నల్లకుక్క ధర్మరాజు వెంట ఇంకా వస్తూనే ఉన్నది. అప్పుడు ఇంద్రుడు దివ్యరథంతో ధర్మరాజు వద్దకు వచ్చి, స్వర్గానికి వెళ్దాం రమ్మన్నాడు.

ధర్మరాజు తనకంటె ముందు పడిపోయిన భార్యనూ, సోదరులనూ ముందు స్వర్గానికి చేర్చమని అడిగాడు. అందుకు దేవేంద్రుడు చిరునవ్వుతో, 'వాళ్ళు నీకంటే ముందే స్వర్గం చేరుకున్నారు' అన్నాడు. తనతో వస్తున్న కుక్కను కూడా స్వర్గానికి అనుమతించమని కోరాడు ధర్మరాజు. 'అది నీ పుణ్యాన్నంతా హరించివేస్తుంది, ఇక్కడే వదిలేయ' మన్నాడు ఇంద్రుడు. కాని భక్తి విశ్వాసాలతో తనననుసరించే శ్వానాన్ని వదలడం మహాపాపం!' అన్నాడు. అప్పుడా శునక రూపంలో ఉన్న ధర్మదేవత నిజరూపంతో సాక్షాత్కరించి ధర్మరాజు సదాచార బుద్ధిని, సర్వభూతదయనూ ప్రశంసించి ఆశీర్వదించింది.

18. స్వర్గారోహణపర్వం

స్వర్గంలో ధర్మరాజు నారదుడ్ని దర్శించాడు. నారదుడు స్వర్గప్రాప్తి పొందిన కౌరవ పాండవాదులందరూ ఇక్కడ ఉన్నారని, మర్త్యలోకంలోని విభేదాలకు, వైషమ్యాలకూ ఇక్కడ తావులేదనీ వివరించాడు. ధర్మరాజు తన వాళ్ళనందరినీ చూడదలచుకుంటున్నా నన్నాడు. దేవేంద్రుడు అందుకు తగిన ఏర్పాట్లు చేశాడు. ఒక దేవదూత ధర్మరాజును తన వెంట తీసుకొని వెళ్ళాడు. ఇరుకైన దారిలో, దుర్గంధపూరితమైన వాతావరణంలో, శవాలు, ప్రేతాత్మల నడుమ, భయంకరమైన చీకటిలో, గుండెలవిసే ఆర్తనాదాల మధ్య కొద్ది దూరం నడిచిన తర్వాత ధర్మరాజు విసుగుచెంది, 'స్వర్గం ఇంత దుర్భరంగా ఉందేం? ఇది భరించలేకపోతున్నాను. ఇంకెంత దూరం వెళ్ళాలి?' అని అడిగాడు దేవదూతను.

"మహారాజా! మీకు ఓపికున్నంతవరకే ఈ దారిలో పయనిస్తాం. ఇక వెనక్కి వెళ్దాం పదండి!" అన్నాడు దేవదూత.

ధర్మరాజు వెనక్కి తిరగగానే, "మహారాజా! దయచేసి మీరు వెనక్కి వెళ్ళకండి. మీరున్నంతసేపు మేము బాధను మరచిపోయాం. కనీసం ఇంకొంచెంసేపు ఇక్కడే ఉండండి!" అని దీనమైన రోదనలు వినిపించాయి. ఆ పరిసరాల నుండి. ఆ ఆర్తనాదాలు తన తమ్ముళ్ళవి, భార్య ద్రౌపదివి, అగ్రజుడు కర్ణునివి, పుత్రులు ఉపపాండవులువి. అవి విన్న ధర్మరాజు దిగ్భ్రాంతికి లోనయ్యాడు.

"నావాళ్ళందరూ ఎందుకింత భయంకరమైన నరకయాతనను అనుభవిస్తున్నారు? వాళ్ళింత దీన స్థితిలో ఉండగా నాకు స్వర్గ సౌఖ్యమవసరం లేదు. ముందువాళ్ళకు స్వర్గసుఖాన్ని కల్పించండి!" అని ప్రార్థించాడు ధర్మరాజు.

అప్పుడు దేవేంద్రునితోపాటు ధర్మదేవత కూడా ప్రత్యక్షమయింది. నిజానికి అతని సోదరులు, భార్య అక్కడలేరని, అదంతా తాము కల్పించిన మాయ అని, ఈ పరీక్షలో ధర్మరాజు కృతకృత్యుడయ్యాడని ప్రకటించారు. స్వర్గంలో కూడా ఆత్మసుఖం కంటె

ధర్మజుని ఆశ్రిత పక్షపాతం వాళ్ళను ముగ్ధులను చేసింది. తన వాళ్ళందరితో పాటు స్వర్గసౌఖ్యాన్ననుభవించమని ఆశీర్వదించారు. సమస్తదేవతలను, వారితోపాటు విహరిస్తున్న తనవాళ్ళ నందరినీ చూసి మహదానందాన్ని అనుభవించాడు ధర్మరాజు.

వ్యాస మహర్షి రచించిన ఈ మహాభారత కథను జనమేజయ మహారాజుకు వైశంపాయన మహర్షి చెప్పాడు.

జనమేజయుడు పరీక్షిన్మహారాజుకొడుకు. పరీక్షిత్తు ఉత్తరాభిమన్యుల సంతానం. (విగత జీవుడుగా పుట్టిన పరీక్షిత్తును కృష్ణ భగవానుడే జీవింపజేసిన సంగతి అశ్వమేధిక పర్వంలో చదువుకున్నారు కదా!)

పరీక్షిన్మహారాజు ఒకరోజు వేటకై అడవికి వెళ్ళి, అలసిపోయి, దాహార్తియై తిరుగుతూండగా ఒక ముని కనిపించాడు. అతడ్ని దాహం తీర్చుమని అడిగితే తపోనిష్ఠలోఉన్న ఆ ముని సమాధానమివ్వలేదు. అందుకు ఆగ్రహించిన పరీక్షిత్తు, ఆ పరిసరాల్లో కనిపించిన చనిపోయిన పాము కళేబరాన్ని అతని మెడలో వేసి వెళ్ళాడు.

ఆ ముని పేరు శమీకుడు. శమీకుని కొడుకు శృంగి. తన తండ్రిని అవమానించినవాడు ఏడుదినముల లోపల తక్షకుడనే సర్పం కరచి చచ్చిపోతా'డని శపించాడు. ఈ విషయం తెలిసిన పరీక్షిన్మహారాజు పశ్చాత్తాపంతో విరక్తుడై మరణం తప్పించుకోలేక, భాగవత కథా శ్రవణం చేస్తూ, తక్షకుని కాటుకు గురి అయి ఏడవ రోజు మరణిస్తాడు. పరీక్షిత్తుకు భాగవత కథ చెప్పినవాడు శుకమహర్షి.

పరీక్షిత్తుని కొడుకు జనమేజయుడు తన తండ్రి చావుకు కారణమైన సర్పజాతి మొత్తం నశించాలని 'సర్పయాగం' చేశాడు. తక్షకుడు ఇంద్రాది దేవతలను ప్రార్థించగా, ఆస్తీకుడు వచ్చి సర్పయాగాన్ని మాన్పించి, పాములన్నీ నశించకుండా కాపాడుతాడు. అప్పుడు వైశంపాయనుడు వ్యాసుని సూచన మేరకు జనమేజయుని కోరికననుసరించి ఈ మహాభారత కథనంతా వినిపిస్తాడు.

'జయం' అనే పేరు గల్గిన ఈ మహాభారతం వినడం, చదవడం, జ్ఞానాన్ని, విజయాన్ని, సత్ఫలితాలను, సద్బుద్ధినీ అందజేస్తుందని, భారత కథను జనమేజయునికి వినిపించిన వైశంపాయనుడు పేర్కొన్నాడు.



పదవిజ్ఞానం

అర్థాలు

అ

అంగలార్చుట = చిందులు వేస్తూ అరవడం
అంబోధి = సముద్రం, కడలి
అఖిలం = అశేషం, నశించనిది
అగ్గించు = అతిశయించు
అచ్చో = ఆసమయాన, అక్కడ
అణా = రూపాయిలో పదహారోవంతు
అతిథి = తిథి, వార, నక్షత్రాలు చూసుకోకుండా ఇంటికి వచ్చేవాడు
అతిథేయులు = ఆతిథ్యం ఇచ్చేవారు
అధిగమించు = తెలియు, పొందు
అనయము = అత్యంతము, అవశ్యము, సతతము, మరిమరి
అనవుడు = అనగా, అన్నప్పుడు
అనృతము = అసత్యము, కృషి
అపభ్రంశము = అపశబ్దము, పడుట, భాషావిశేషము
అపూప = పిండివంట
అభిఘరించు = చల్లు, చిలకరించు
అభిరమ్యము = చాలా అందమైన
అభీప్సిత = కోరిన
అమాంతంగా = అకస్మాత్తుగా
అయుతము = పదివేలు
అతిమతి = సంభ్రమం / కలత
అవసరంబు = సమయం
అవిరళము = విరళముకానిది / దట్టమైన
అహరహం = ప్రతిదినం
అర్ధాంగలక్ష్మి = శరీరంలో సగభాగమైన లక్ష్మీ సమానురాలు (భార్య)
అర్థి = వేడువాడు, వాది, కొలువుకాడు, కోరిన
అర్ఘ్యపాద్యములు = చేతులు, కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళివ్వడం
అల్పము = సూక్ష్మము
అస్తవ్యస్తులై = ఉనికి కోల్పోయినవారై (నర్వం చెదరగొట్టుకొన్నవారై)
అస్మచ్ఛమూధవులు = సైన్యాధిపతులు
అస్థిర = స్థిరముకానిది

ఆ

ఆ కంఠం = గొంతుదాకా
ఆచూకీ = జాడ
ఆయతి = ప్రభావం
ఆయత్తం = సిద్ధం
ఆయువు = ప్రాణం
ఆవరణ = ఆచ్ఛాదనం, మూత
ఆవేశపరులు = తొందరపాటుతో మాట్లాడువారు
ఆగ్రహము = కోపం
ఆప్యాయత = ఆదరణ
ఆస్పందద = అదిరే

ఇ

ఇందుబింబ + అస్య = చంద్రబింబము వంటి ముఖం కలది / చంద్రముఖి
ఇనాం = బహుమతి, మాన్యము

ఈ

ఈప్సితము = కోరిక

ఉ

ఉపస్పర్శ = స్నాన, ఆచమనాదికములు
ఉపార్జితం = సంపాదన
ఉలియు = చలించు
ఉల్లాసకరమైన = సంతోషకరమైన, ప్రకాశము
ఉద్యమం = ప్రయత్నం
ఉద్వృత్తి = ఉద్ధతి

ఎ

ఎలిమి = కొలువుకాదు, కోరిన



ఎల్లి = రేపు

ఏ

ఏమరుపాటు = అజాగ్రత్త

ఓ

ఓర్పు = సహనం

ఓష్ఠం = పెదవి

ఔ

ఔద్ధత్యము = ఉద్ధతత్వం

క

కంకణములు = వర్తులాకారా ఆభరణాలు

కందభోజులు = కందములు తినేవారు

కటకట = అయ్యయ్యో

కటకటపడు = బాధపడు

కఠారము = ఖడ్గము

కన్నుగవ = కన్నులజంట

కడ = చివర

కథాగమనం = కథనడిచే తీరు

కరంబులు = చేతులు

కరవటంబు = భరిణె / గిన్నె

కలభాష = మధురభాష

కలమధాన్యం = వరిపంట

కలహకంఠి = గొడవలు పెట్టుకొనే స్త్రీ, గయ్యాళి

కళవళం = తొట్రుపాటు

కాడు = అడవి

కాణాచి = చిరకాల వాసస్థానం

కుందాడు = బాధపెట్టినట్లు మాట్లాడడం

కుంభి = ఏనుగు

కుడుస్తున్న = త్రాగుతున్న, భుజించుచున్న

కుసుమస్తభకము = పూలగుత్తి, పూలగుచ్ఛం

కూడలి = నాలుగురోడ్లు కలిసే చోటు

కృశించు = బక్కచిక్కు, సన్నగిల్లు

కేసరములు = పూవులోని పుప్పొడిగల భాగాలు

కేళిక = ఒక విధమైన నృత్యం

కైరవషండము = తెల్లకలువల సమూహము

కొండాడి = పొగడి, స్తుతించి

కొనసాగించడం = నడపడం

కొడిగట్టిన దీపాలు = ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న దీపాలు.

కల్పనము = ఊహ

కమ్రకరములు = ఇంపైన చేతులు

ఖ

ఖలుడు =

ఖేదము = శోకము

గ

గరిమ = శ్రేష్ఠమైన

గగుర్పాటు = భయహర్షాదుల చేత మేని వెంట్రుకలు నిక్కబొడుచుట

గాదిలిసుత = ప్రియమైన కూతురు

గురి = లక్ష్యం

గుద్దలి = వేర్లు మొదలగునవి పెళ్ళగించెడి సాధనం

గొండ్లి = కుండలాకార నృత్యము

గొడుగు పొదలు = గొడుగులు గల పావుకోళ్ళు, కర్రచెప్పులు

గోమయము = ఆవుపేడ

గోముఖము = అలుకుట (ఆవుపేడతో అలుకుట)

గోరంతదీపం = చిన్నగా వెలిగేదీపం

ఘ

ఘన వనజాతలోచన = విశాలమైన తామరల వంటి కన్నులు గలది

ఘాతము = దెబ్బ

ఘూర్ణిల్లు = తిరుగుడుపడు, మ్రోగు

ఘోష = ఉరుము, ఆవులమంద, కంచు

చ

చట్టువము = గరిటె

చప్పటలు = చప్పట్లు

చమత్కారము = నేర్పు

చయము = సమూహము

చయ్యన = వెంటనే, త్వరగా

చరణద్వంద్వము = పాదములజంట

చాడ్పు = విధము

చిగురుబోడి = చిగురుటాకు వంటి శరీరం గల స్త్రీ

చిరంతనుడు = శాశ్వతుడు

చీఱు + ఎండ = అధికమైన ఎండ

చెక్కర్లు = అదేపనిగా చుట్టుతిరగడం

చౌకబారు = తక్కువ విలువ గలిగిన



చ

చిన్నాభిన్నం =
ఛాత్రులు = శిష్యులు

జ

జానపదులు = మనుష్యులు
జేవురు = ఎర్రనగు
జోక = యుక్తము, ఉత్సాహము, బాగు
జోటి = దుప్పటి
జ్వలనము = మంట

త

తంత్రం = ఉపాయం
తడవు = ఆలస్యము
తమలపాకు తిమ్మలు =
తాండవం = ఉద్ధతనృత్యం
తాపసులు = తపస్సుచేసుకునేవారు
తారక = చుక్క
తారాడడం = తిరుగులాడడం, జీరాడడం
తిమిరం = చీకటి
తీరుబడి = తీరిక
తుచ్ఛము = దుఃఖము, శూన్యము
తేట = నిర్మలము, స్పష్టము, విశదము
తొంటి = తొల్లి
తొఱగుట = విడుచుట, తప్పించుకొనుట
తోయధి = సముద్రం
తన్మయులు = తత్స్వరూపమైనది
తర్కం = ఊహ, కారణం, కోరిక, ఒకశాస్త్రం
తాల్మి = క్షమ
తుల్యం = సమము, సరి

ద

దమము = దండోపాయము, క్లేశము, ఇంద్రియము
దమ్మిడీ = ఐదుకాసులనాణెం
దికృతి = దిక్పాలుడు
దీధితి = కిరణం, వెలుగు
దుష్ + చరిత + ఆలోచన = చెడుతలపు
దేవుళ్ళాట = వెదుకులాట
ద్వారికవాటము = ద్వారబంధము

న

నగారా = పెద్దఢంకా
నలిరేగి = విజృంభించి
నిక్కము = నిజము
నిఖిల = సమస్త
నిచయము = సమూహము
నిదానము = మూలకారణము, నెమ్మదిగా
నిధాఘము = వేసవి, ఎండాకాలము
నీవార ముష్టింపచుల్ = సహజంగా పండే వడ్లను పిడికెడు ఉంచుకొని కడుపునింపుకొనేవాడు
నెఱపూత = నిండుగా పూసినది
నెఱి = పూర్తి
నెట్టుకొను = పెరుగుతున్న
నొసలు = నుదురు
నొక్కి = అదిమిపట్టి
నిర్జనము = జనములేని
నిష్ఠాతుడు = నేర్పరి

ప

పంచజనుడు = పాంచభౌతిక శరీరం కలవాడు (మనిషి)
పగిది = విధము
పనిచి = నియమించి, పంపి
పరహితార్థం = ఇతరుల మేలుకోరుట
పరామర్శ = చక్కగా విచారించు
పరివ్రాజకుడు = సన్యాసి
పారాశర్యుడు = పరాశరుని కుమారుడు (వ్యాసుడు)
పాత్ర = ఒకవిధమైన కళ
పుట్టుకురుపు = క్యాన్సర్ వ్రణం
పుయలోడు = వెనుదీయు, సంకోచించు
పూరము = జలప్రవాహము
పురంధ్రి = కుటుంబస్త్రీ
పులస్త్యబ్రహ్మ = బ్రహ్మమానస పుత్రుడు
పేరిణి = వీరనాట్యం
పేర్మి = అధికం, గొప్ప
పొదలు = వృద్ధిచెందు, పెరుగు
పొలుపు = ఒప్పు, విధము
పౌరాణికాలు = పురాణ సంబంధమైనవి



ప్రకంపనుడు = మిక్కిలి బలం కలవాడు
ప్రణమిల్లడం = నమస్కరించడం
ప్రవిమల = చాలాస్వచ్ఛమైన
ప్రజ్ఞానం = విశేషప్రతిభతోకూడిన జ్ఞానం
ప్రక్షాళితంబు = కడిగినది

బ

బంతి = వరస, పంక్తి, సామూహిక భోజనానికి వరుసలో కూర్చోవడం
బస్తీజనం = పట్టణవాసులు
బుధులు = పండితులు, విద్వాంసులు
బృహత్తర = గొప్పదైన

భ

భసితము = భస్మము
భక్షణము = తిండి
భక్షింపన్ = తినగా
భాసిల్లు = ప్రకాశించు
భుక్తిశాల = భోజనశాల
భూరుహం = భూమి నుండి పుట్టినది (చెట్టు)
భత్యాలు =

మ

మందకొడి = మెల్లగా నడచువాడు
మందులు = చొరవలేనివారు, అల్పుడు, నిర్భాగ్యుడు, మూర్ఖుడు, మందమతి
మంద్రంగా = గంభీరంగా
మతిహీనులు = మతిలేనివారు
మధుకరభిక్ష = తుమ్మెదలా ఇల్లిల్లు తిరిగి అడుక్కోవడం
మననం = చింతన, గమనం
మనోహరం = ఇంపైనది, బంగారం
మచ్చకంటి = మీనాక్షి, చేపకనులు గల స్త్రీ
మహాప్రస్థానం = దీర్ఘప్రయాణం
ముక్కంటి = మూడు కనులు కలవాడు (శివుడు)
ములుకర్ర = ఎడ్లను పొడిచెడి మునికోల
ములుకు = మొనదేలిన భాగం
ముప్పిరిగొను = మూడుతాళ్ళు పెనవేసుకున్నట్లు
మూర్ధము = నడితల
మెండు = అధికము
మోడు = ఆకురాలిన వృక్షం
మోహము = అజ్ఞానము
మోక్షలక్ష్మి = మోక్షమనెడు లక్ష్మి (ముక్తి)
మౌళి = సిగ

య

యాతన = తీవ్రమైన వేదన

ర

రవళి = ధ్వని
రుగ్మత = జబ్బు
రేగి = ఎగసి, విజృంభించి
రోదసి = అంతరిక్షం

ల

లలామ = శ్రేష్ఠ
లాతి =

వ

వనజనేత్ర = కమలముల వంటి కన్నులు గలది
వర్ధంతి = మరణించిన రోజు
వాసము = ఇల్లు
వాచస్పతి = బృహస్పతి
విభూతివీద్యము =
వీడు = పట్టణం
వెఱపు = భయం
వేదోక్తం = వేదంలో చెప్పబడిన
వక్త్రంబు = నోరు
వర్ణభరితం = రంగులమయం
వార్తాహరి = వృత్తాంతం తెలిసికొనిపోయి చెప్పునది
విప్రభవనవాటికలు = బ్రాహ్మణ గృహాలున్న వీధి
వ్యోమము = ఆకాశం

శ

శతాబ్దం = నూరు సంవత్సరాల కాలం
శాంతుడు = శాంతిగలవాడు
శిలోంఛప్రక్రములు = శిలప్రకములు (పొలాల్లో రాలిన కంకులను ఏరుకొని బ్రతికేవారు)
ఉంఛప్రక్రములు (రోళ్ళవద్ద మిగిలిన బియ్యంతో జీవనం సాగించేవారు)

స

సంకేతాలు = గుర్తులు, పేరు, ఏర్పాటు



సంత్రాసం	=	మిక్కిలి భయం
సంక్షిప్తం	=	కుదింపు
సద్దు	=	శబ్దము
సరభతోత్సాహం	=	అధికమైన ఉత్సాహం
సర్వము	=	మొత్తము
సహస్రాబ్దం	=	వేయి సంవత్సరాల కాలం
సత్త్వము	=	దేహబలం
సత్కృతులు	=	సత్కారాలు
సాంధ్య	=	సంధ్యా సమయం
సాతి	=	దుకూలము, వస్త్రము
సాధ్వి	=	పతివ్రత
సాన్నిధ్యము	=	సామీప్యము, సమీపము
సారము	=	చేప, బలము, శ్రేష్ఠం, ధనము, బలము
సింధూరిత	=	ఎర్రని
సుంత	=	ఇంచుక, ఇసుమంత
సూడిగములు	=	గాజులు
సేసలు	=	తలంబ్రాలు, అక్షతలు
సౌంజ్ఞ	=	సైగ
సౌజన్యం	=	మంచితనం
సౌదామిని	=	మెరుపు
సౌరభం	=	సువాసన
స్మరణ	=	తలపు
స్మితకాంతి	=	చిరునవ్వుల కాంతి
స్నిగ్ధ	=	సుకుమారమైన

హ

హంగులు	=	
హితైషులు	=	మేలుకోరేవారు
హోరు	=	తీవ్రతను సూచించే ధ్వని విశేషం

క్ష

క్షత్పిపాసలు	=	క్షుత్తు (ఆకలి), పిపాస (దప్పిక), ఆకలిదప్పులు

నానార్థములు

అర్ధి	=	వేడువాడు, వాది, కొలువుకాడు
కంకణము	=	తోరము, నీటిబిందువు, స్త్రీలు చేతికి ధరించేది
కదురు	=	కండె, సన్ననికమ్మ, అతిశయించు
కళ	=	చదువు, అవ్యక్తమధురధ్వని, శిల్పం, చంద్రునిలో పదహారోవంతు
కాలము	=	సమయం, నలుపు, చావు
కుండలి	=	పాము, నెమలి, వరుణుడు
కులము	=	వంశము, జాతి, ఇల్లు
గడ	=	స్తంభము, సమూహము
గుణము	=	స్వభావం, వింటినారి
గుడి	=	దేవాలయం, గుండ్రనిగీత, దేరా
గురువు	=	ఉపాధ్యాయుడు, తండ్రి, పురోహితుడు
గ్రహణము	=	బుద్ధి, నేత్రము, ఆదరించుట
ఘూర్ణిల్లు	=	మ్రోగు, తిరుగుడుబడు
నిట్టనొడుచు	=	ఉప్పొంగు, విజృంభించు, రోమాంచితమగు
ఫలము	=	పండు, ప్రయోజనం, సుఖం
ముద్ర	=	గుర్తు, అచ్చువేయడం, నాట్యవిశేషం
వనము	=	తోట, అడవి, జలము
వాసం	=	ఇల్లు, వస్త్రం
వెల్లి	=	ప్రవాహము, పరంపర



పర్యాయపదాలు

అగ్గించు	=	అతిశయించు, అధికమగు, ఎక్కువగు
అనలం	=	అగ్ని, మంట, నిప్పుజ్వలనం
అరణ్యం	=	విపినం, అడవి
అసృతము	=	అసత్యం, అబద్ధం బొంకు
అన్నం	=	బువ్వ, కూడు, బోనం
అర్ధాంగి	=	భార్య, పత్ని, ఇల్లాలు
అహిమకరుడు	=	సూర్యుడు, భానుడు, రవి
ఆగ్రహం	=	కోపము, క్రోధము, అలుక
ఆజ్ఞ	=	ఆదేశము, ఆన, ఉత్తరువు, నిర్దేశము
ఆస్యము	=	ముఖము, ఆననము, మోము
ఎలుక	=	మూషికము, ఖనకము, ఎలికము
కఠారము	=	ఖడ్గము, కత్తి, అసి
కన్ను	=	అక్షి, చక్షువు, నేత్రము, నయనం
కప్ప	=	భీకము, దర్దురం, మండూరం, మండూకం
కొండాడి	=	పొగడి, స్తుతించి, నుతించి
కోరిక	=	వాంఛ, తృష్ణ
కైరవం	=	కలువ, కల్హారం, కుముదం, ఇందీవరం
కౌముది	=	వెన్నెల, చంద్రిక, జ్యోత్స్న
గృహము	=	ఇల్లు, గేహము, నికేతము
చంద్రుడు	=	ఇందుడు, శశాంకుడు, నిశాకరుడు
చాడ్పు	=	విధం, భంగి, రీతి, తీరు
తమస్సు / తమము	=	చీకటి, ఆంధ్యం, అంధకారం, ఇరులు
తాండవం	=	ఉద్ధతనృత్యం, నాట్యవిశేషం
దయ	=	కృప, కనికరము, కరణ
దేహము	=	శరీరం, తనువు, కాయము
నరుడు	=	మానవుడు, మనిషి
నలిరేగు	=	విజృభించు, మసలు
నితతి	=	సమూహం, గుంపు, బృందం
నిక్కము	=	నిజము, సత్యము
పల్లె	=	ఊరు, గ్రామం
పసిడి	=	బంగారం, కాంచనం, పుత్తడి
పారాశర్యుడు	=	వ్యాసుడు, బాదరాయణుడు
పూవు	=	కుసుమం, పుష్పం, విరి
బ్రాహ్మణులు	=	ద్విజులు, విప్రులు, భూసురులు
భాగీరథి	=	గంగానది, జాహ్నవి, పావని
మరణం	=	మృత్యువు, చావు
మిన్ను	=	ఆకాశం, గగనం, నింగి
మైత్రి	=	స్నేహం, నెయ్యం, సాంగత్యం
మౌళి	=	సిగ, శిఖ, కొప్పు
రాత్రి	=	నిశ, రజని, యామిని
రుగ్మత	=	జబ్బు, వ్యాధి, రోగం
వనిత	=	మహిళ, స్త్రీ, పడతి
వస్త్రం	=	వలువ, పుట్టము, చేలం
వివరము	=	రంధ్రం, బిలం, కలుగు
వృక్షము	=	తరువు, చెట్టు, భూరుహం
వెల్లి	=	ప్రవాహము, సరిత, నది, ఏరు
శివుడు	=	శంకరుడు, రుద్రుడు, భవుడు
సంఘం	=	సమూహం, బృందం, గుంపు
సాతి	=	వస్త్రం, దుకూలం, అంబరం
సుంత	=	ఇంచుక, ఇసుమంత, కొంచెం
స్మరణ	=	తలపు, జ్ఞప్తి

వ్యుత్పత్యర్థములు

అమృతము	=	మరణం పొందింపనిది (సుధ)
అతిథి	=	తిద్యాది కాలనియమాలు లేక ఇంటికి భోజనానికి వచ్చేవాడు (అతిథి)
ఈశ్వరుడు	=	స్వభావం చేతనే ఐశ్వర్యం కలవాడు (శివుడు)
గురువు	=	అంధకారమనెడి అజ్ఞానమును పోగొట్టువాడు (ఉపాధ్యాయుడు)
తాపసుడు	=	తపము చేయువాడు (ముని)
దేహుడు	=	దేహమును ధరించినవాడు (మనిషి)



పార్వతి	=	హిమవంతుడను పర్వతరాజు కూతురు (పార్వతి)
పుత్రుడు	=	పున్నామనరకము నుండి రక్షించువాడు (కుమారుడు)
పురంధ్రి	=	గృహమును ధరించునది (ఇల్లాలు)
భవాని	=	భవుని (శివుని) భార్య (పార్వతి)
మిత్రుడు	=	సర్వ భూతములయందు స్నేహయుక్తుడు (సూర్యుడు)
ముని	=	మౌనముదాల్చి యుండువాడు (ఋషి)
మూషకము	=	అన్నాదులను దొంగిలించునది (ఎలుక, పందికొక్కు)
మోక్షము	=	జీవుడిని పాశము నుండి విడిపించునది (ముక్తి)
వనజము	=	వనము (నీరు) నందు పుట్టినది (పద్మము)
విశ్వనాథుడు	=	ప్రపంచానికి నాథుడు (శివుడు)
శివుడు	=	శుభములనిచ్చువాడు (ఈశ్వరుడు)
శ్రియఃపతి	=	లక్ష్మీదేవికి భర్త (విష్ణువు)

ప్రకృతి - వికృతి

అమ్మ	–	అంబ	ధర్మము	–	దమ్మము
ఆజ్ఞ	–	ఆన	నిద్ర	–	నిదుర
ఆర్య	–	అయ్య	పక్షం	–	పక్క
ఆసక్తి	–	ఆసత్తి	పంక్తి	–	బంతి
ఆహారము	–	ఓగిరము	పట్టణము	–	పట్టము
ఈశ్వరుడు	–	ఈసరుడు	పుణ్యం	–	పున్నెం
కష్టము	–	కస్తి	పుత్రుడు	–	బొట్టెడు
కలమ	–	కలము	పుష్పము	–	పూవు
కవి	–	కయి	ప్రాణము	–	పానము
కవిత	–	కైత	బంధువు	–	బందుగు
కాగితం	–	కాయితం	భాష	–	బాస
కావ్యము	–	కబ్బము	భిక్షము	–	బిచ్చము
కుడ్యం	–	గోడ	భక్తి	–	బత్తి
కులము	–	కొలము	భాగ్యం	–	బాగ్గెం
గుణము	–	గొనము	బ్రహ్మ	–	బొమ్మ, బమ్మ
గుహ	–	గొబ	ముక్తము	–	ముత్తెము
గృహము	–	గీము	మత్స్యము	–	మచ్చెము
గౌరవము	–	గారవము	యాత్ర	–	జాతర
చిత్రము	–	చిత్తరువు	లక్ష్మి	–	లచ్చి
ఛాయ	–	చాయ	లేఖ	–	లేక
జ్యోతి	–	జోతి	రత్నము	–	రతనము
దోషం	–	దోసం	రాట్	–	ఱేడు



రాశి	–	రాసి
రాజ్ఞి	–	రాణి
వాటిక	–	వాడ
విజ్ఞానం	–	విణ్ణానం
విద్య	–	విద్దె
శక్తి	–	సత్తి
శృంగారం	–	సింగారం
శ్రీ	–	సిరి
సుఖము	–	సుకము
స్వామి	–	సామి